# హ్యూమరాలజీ

*(వాల్యుమ్ -2)*

*_యర్రంశెట్టి శాయి*

## ట్రాఫిక్ జామ్

మామూలుగానే రాత్రి పదకొండింటివరకూ బోఫర్స్ కుంభకోణాల గురించీ, ఎన్టీఆర్, హెగ్డేల అవినీతి గురించీ సరదాగా కబుర్లు చెప్పుకుని అందరం ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరాం. అప్పటికే ఆడాళ్ళంతా విసుక్కుంటున్నారు మా మీద.

"మీ అందరికీ పనీపాటా లేకుండాపోయింది. అక్కడికి మీరంతా నీతిపరులయినట్లు దేశంలోని కరప్షన్ గురించి ఊరికే హడావుడి పడిపోతున్నారు" అంది మా ఆవిడ.

నాకు వళ్లు మండిపోయింది.

"మేము అవినీతిపరులమా?" కోపంగా అడిగాను.

"అబ్బే- అవినీతంటే మీకేం తెలుసని? సిగ్గులేపోతేసరి" అంది శాయిరామ్ భార్య.

"మొన్నటికి మొన్న మీరు ఏదో ఫైల్ ఎవరికో అనుకూలంగా నోట్ రాసి పుటప్ చేసినందుగ్గాను ఆ పెద్దమనిషి ఓ ఎలక్ట్రానిక్ వాచీ ఇచ్చాడని తీసుకొచ్చారా లేదా?" జనార్ధన్ భార్య నిలదీసింది.

జనార్ధన్ కి వళ్ళు మండిపోయింది. "అది వేరు! దాన్ని లంచం అనరు! గిఫ్ట్ అంటారు."

దాంతో రంగాభార్య విరుచుకుపడింది. "అలాగా! అయితే మరి మొన్న మావారు ఎవరిదో ఫైల్ పుటప్ చేయకుండా ఆలస్యం చేసినందుగ్గాను వాడెవడిదగ్గరో పార్టీ తీసుకోలేదా? దాన్నేమంటారు?" వెటకారంగా అడిగిందామె.

"మా వారు ఏం తక్కువ కాదులెండి! మొన్న ఆ సన్మాన సంఘం వాళ్ళు ఎవరిదగ్గరో డబ్బు తీసుకుని చేసిన సన్మానం తాలూకు న్యూసూ, ఫోటోలు 'ఈక్షణం' పేపర్ లో వేయించినందుకుగాను వాళ్ళిచ్చిన టేబుల్ ఫాన్ తీసుకున్నారా లేదా?"

గోపాల్ రావ్ ముఖంలో కళ తగ్గిపోయింది.

"ఛట్ ఛట్ ఛట్! అది అవినీతెలా అవుతుంది. "పరస్పర సహాయం" అంటారు దానిని."

ఇంక వాగ్వివాదం కొనసాగితే పరువు పోయేట్లుందని యాదగిరి కయ్ మని లేచాడు ఆడాళ్ళమీద.

"మీకేం దమాకున్నదా లేదా? మేమ్ తీసుకున్నాగానీ దాని వాల్యూ ఎంత? వంద లేక రెండొందలు! కాకుంటే నాల్గొందలు- మన నాయకుల్ తీస్కొనెడిది కోట్లు - దానికీ దీనికీ సంబంధమేమున్నది? పదండ్రి- అందు గురించే లేడీస్ దమాక్ దేడ్ దమాక్ అనెడిది"

ఆడాళ్ళంతా అతని మీద నిరసన తెలియజేసినా మొత్తానికి ఎవర్దారిన వాళ్ళు డిస్పర్స్ అయిపోయారు.

రాత్రి పన్నెండయింది. అప్పుడే నిద్రపడుతోంది నాకు.

అంతలోనే తలుపు దబదబ బాదిన చప్పుడు. మళ్ళీ ఎవడికి ఏం ముంచుకొచ్చిందా అనుకుంటూ వెళ్ళి తలుపు తెరచాను.

ఎదురుగ్గా రామచంద్రమూర్తిగారు నిలబడి వున్నారు విచారంగా. ఆయన మా కాలనీ వ్యక్తే కావటం వల్ల "ఏమిటి మాష్టారూ?" అనడిగాను.

దాంతో ఆయన భోరున ఏడ్చేయటం ప్రారంభించాడు. ఆ ఏడుపు వినడంతోనే క్షణాల్లో మా వాళ్ళంతా పరుగుతో వచ్చేశారు.

"ఏమిటి? ఏం జరిగింది? ఎన్ టిఆర్ మళ్ళీ రిటైర్ మెంట్ ఏజ్ తగ్గించాడా?" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి. ఎందుకంటే మా కాలనీలో చాలామంది అదే భయంతో రోజులు గడుపుతున్నారు.

"అది కాదండీ- మా అమ్మాయ్ సంధ్యారాణి..."

మా గుండె ఝుల్లుమంది-

"ఆ! ఏమయిందా అమ్మాయికి?"

"ఉదయం తొమ్మిదిగంటలకు మామూలుగానే ఆఫీస్ కెళ్ళింది. ఇంతవరకూ తిరిగిరాలేదు-" అంటూ మళ్ళీ భోరుమన్నాడతను.

ఈలోగా వాళ్ళావిడ కూడా పెద్దగా ఏడుస్తూ వచ్చేసింది.

"మీరే మా అమ్మాయిని మాకు తెచ్చియ్యండి దేవుడో" అంటూ శాయిరామ్ కాళ్ళమీద పడిపోయింది. వాళ్ళిద్దరినీ ఓదార్చి సంధ్యారాణి ఏమయిపోయివుంటుందా అని డిస్కషన్ మొదలుపెట్టాం.

"మనదేశంలో వయసులో ఉన్న ఓ అమ్మాయి రాత్రి పన్నెండింటివరకూ ఇంటికి తిరిగిరాలేదంటే ఏమిటర్థం?" అడిగాడు రంగారెడ్డి.

"ఇంకేముంటుంది? తప్పకుండా రేప్ కీ, మర్డర్ కీ ఆహుతయిపోయి వుంటుంది" అన్నాడు గోపాల్రావ్.

అందరం వెంటనే గోపాల్రావ్ అభిప్రాయంతో ఏకీభవించక తప్పలేదు.

"అయితే మరిప్పుడేమిటి చేయటం?" అడిగాడు రంగారెడ్డి.

"మనం రెండు పార్టీలుగా విడిపోయి రెండు కార్యక్రమాలు చేపట్టాలి. మొదటి గ్రూప్ వాళ్ళు ఆమె శవం ఎక్కడయినా కనిపించిందేమో పోలీస్ స్టేషన్స్ లో ఎంక్వయిరీ చేయాలి. రెండో గ్రూప్ తెల్లారేసరికి ఆమె దహన సంస్కారానికి ఏర్పాట్లు చేయాలి." అన్నాడు శాయిరామ్.

ఆ మాట వింటూనే ఆమె తల్లిదండ్రులిద్దరూ విరుచుకుపడి పోయారు.

"అనుకున్నంతా అయింది దేవుడో! వద్దంటున్నా వినకుండా ఇవాళ బంగారు ఉంగరం కూడా పెట్టుకెళ్ళి ప్రాణం మీదకు తెచ్చుకుందిరా దేవుడో" అంటూ ఏడ్చేయసాగిందామె.

వాళ్ళిద్దరినీ మా ఆడాళ్ళందరూ కలిసి బలవంతంగా వాళ్ళింటికి తీసుకెళ్ళారు.

శాయిరామ్ గ్రూప్ వాళ్ళందరం ముందు పోలీస్ కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేయాలని నిర్ణయించుకుని మా కాలనీ దగ్గరలోనే ఉన్న హోటల్ ఓనర్ ని నిద్రలేపి లోపలవున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి రింగ్ చేయటం మొదలుపెట్టాము.

ఎనిమిది అర్థరూపాయ బిళ్ళలు మింగాక అప్పుడు అందమయిన ఓ గొంతు ప్రేమగా మాట్లాడింది.

"దయచేసి మీ ధ్యానం ఇటు మళ్ళించండి! ఫోన్ అవుటాఫ్ ఆర్డర్ లో యున్నదని తెలియజేయటానికి చింతిస్తున్నాం. మా టెలిఫోన్స్ డిపార్ట్ మెంట్ సదా మీకు సేవ చేస్తుందని తెలియజేయటానికి సంతోషిస్తూ మీకు మా నూతన సంవత్సరాభినందనలు తెలియజేస్తున్నాము.

ఠక్కున ఫోన్ డిస్కనెక్ట్ చేసేశాను.

"ఏం జరిగింది? ఇంక మన దగ్గర అర్థరూపాయ్ కాయిన్స్ కూడా లేవు" అన్నాడు శాయిరామ్ ఆందోళనగా.

"ఫోన్ అవుటాఫ్ ఆర్డరట."

"ఎవరిది?"

"ఏమో? అది తెలీదు-"

"బహుశా మనదే అయుంటుంది. అందుకే ఎనిమిది అర్థరూపాయలు మింగింది" కోపంగా అన్నాడు జనార్థన్.

"ఇప్పుడేం చేద్దాం మరి?"

"మనమే వెళ్దాం - కంట్రోల్ రూమ్ కి" అన్నాడు యాదగిరి.

అందరం ఆటోలో కంట్రోల్ రూమ్ కి బయలుదేరాం.

టీ.వీ. టవర్ దగ్గర కొచ్చేసరికి హఠాత్తుగా పెద్ద విజిల్స్ తో ఇద్దరు పోలీసులు ఆటోకి అడ్డంగా వచ్చేశారు.

"రోకో- రోకో" అని అరచాడొక కానిస్టేబుల్.

ఆటోవాడు సడన్ బ్రేకులతో ఆటో ఆపేప్పటికి, మా ఆటో వెనుకనే వేగంగా వస్తోన్న జనార్ధన్ వాళ్ళ ఆటో మా ఆటోని డాష్ ఇచ్చేసింది.

జనార్ధన్ మొఖం మీటర్ బోర్డ్ కి కొట్టుకుని అప్పటికప్పుడే మొఖం వాచిపోయింది. అందరం కోపంగా ఆటో దిగాము.

"ఏమిటి? ఎందుకాపారు?" శాయిరామ్ కోపంగా అడిగాడు కానిస్టేబుల్స్ ని.

"హమారే సాబ్ కే పాస్ జావ్" అన్నాడు కానిస్టేబుల్- లాఠీతో దూరంగా రోడ్ ప్రక్కకు లైటు స్తంభం కింద దొంగలారా నక్కి నిలబడ్డ వాళ్ళ ఇన్ స్పెక్టర్ ని చూపుతూ.

అందరం ఇన్ స్పెక్టర్ దగ్గరకు నడిచాము.

"మమ్మల్ని ఎందుకండీ ఆపారు" అడిగాడు శాయిరామ్.

ఇన్ స్పెక్టర్ చిరాగ్గా చూసాడు మావేపు.

"ఎవరు మీరంతా."

"నిర్భయ్ నగర్ కాలనీ వాళ్ళం!"

"ఎక్కడుందా కాలనీ?"

"అభాగ్యనగర్ కాలనీకి ఎదురుగ్గా"

"అభాగ్యనగర్ కాలనీ ఎక్కడుంది?"

"వెంకటేశ్వర స్వామి గుడి ప్రక్కనే"

"వెంకటేశ్వర స్వామి గుడి ఎక్కడుంది?"

"మోహన్ పబ్లిక్ స్కూలు పక్కనేనండి- మోహన్ పబ్లిక్ స్కూల్ మీకు తెలిసే వుంటుంది. చాలామంచి స్టాండర్డ్స్ తో రిజల్ట్స్ తో స్టేట్ ఫస్ట్ వస్తుంటుంది-"

"నేనెప్పుడూ వినలేదా పేరు- ఇంతకూ ఆ స్కూలెక్కడుంది?"

అతనికెలా చెప్పాలో మాకు అర్థం కాలేదు. యాదగిరి ముందుకొచ్చాడు.

"గదేసార్! నర్సింలు గుడంబ దుకాణం పక్కనే ఉన్నది సార్ మా కాలనీ-"

"మారా సంగతి ముందు చెప్పరేం? గుడిపేర్లూ, స్కూలు పేర్లూ చెప్తే ఎవడికి తెలుస్తుంది."

అందరం తప్పయిపోయిందని వప్పుకున్నాం. మనదేశంలో ఎక్కడయినా సరే లాండ్ మార్క్స్ చెప్పాలంటే బార్లు, కల్లు కాంపౌండ్లు, వైన్ షాపుల్ని మించిన లాండ్ మార్క్ లు ఉండవు.

"అయితే ఇప్పుడెక్కడికెళ్తున్నారు?"

"పోలీస్ కంట్రోల్ రూమ్ కండీ"

"ఎందుకు?"

"మా కాలనీ తాలూకూ ఓ అమ్మాయి శవం దొరికిందేమో కనుక్కోటానికండీ-" ఇన్ స్పెక్టర్ ఉలిక్కిపడ్డాడు.

"శవమా?"

"అవునండీ!"

"సూసైడ్ కేసా?"

"కాదండీ! రేప్ అండ్ మర్డర్ అయుంటుందని మా నమ్మకమండీ"

"ఎవరు చంపారు?"

"అది మాకెలా తెలుస్తుందండీ! రాత్రుళ్ళు రోడ్ మీద తిరిగేది పోలీసులూ, దొంగలూ, గూండాలే కదండీ"

"రాత్రుళ్ళూ, శవం, మర్డర్- ఏమిటయ్యా మీరు మాట్లాడేది? ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు?"

"మా కాలనీ అమ్మాయండీ!"

"ఆ అమ్మాయికీ మీకూ ఏమిటి సంబంధం?"

"ఏమీ లేదండీ! జస్ట్ మా కాలనీ అమ్మాయ్ అంతే-"

ఇన్ స్పెక్టర్ ఓ క్షణం ఆలోచించాడు.

"ఏయ్ ఫోర్ నాట్ ఫోర్"

"యస్సార్-"

"వీళ్ళందరినీ వాన్ ఎక్కించు"

మేము అదిరిపడ్డాము.

"ఎందుకండీ-"

"ఆ పిల్లను మీరే మర్డర్ చేసి శవాన్ని ఎక్కడో పడేసి ఉంటారు. మళ్ళీ ఏమీ తెలీనట్లు వెతకటానికి బయల్దేరారు-"

కానిస్టేబుల్స్ - నాలుగురొచ్చి మమ్మల్ని వాన్ వేపు తోయసాగారు.

"మీకేం దమాకున్నాది వయ్యా! నీయవ్వ- మేము ఆ పోరి తల్లిదండ్రులకు మదద్ చేద్దామని పోతూంటే మమ్మల్నే లోపట జేస్తారు?"

యాదగిరి కోపంగా అడిగాడు.

"ఏయ నకరాలు చేయకుబే- ఆవాజ్ బంద్ కర్ కే వాన్ ఛడో!"

అంటూ లాఠీతో యాదగిరిని ఒక్కతోపు తోసాడు కానిస్టేబుల్.

లాఠీ చూసేప్పటికి మా అందరికి కూడా భయం కలిగింది. నిశ్శబ్దంగా వాన్ ఎక్కేశాం అందరం.

పోలీస్ స్టేషన్లో ఇంటరాగేషన్ మొదలయింది.

"ఆ సంధ్యారాణి అనే అమ్మాయిని నువ్ లవ్ చేసినావు! కదూ?" శాయిరామ్ నడిగాడు ఇన్ స్పెక్టర్.

"లవ్వేమిటండీ నా తలకాయ! నాకు పెళ్ళయింది ఇద్దరు పిల్లలు-

"అయినాగానీ ఇంకో అమ్మాయిని - అంటే ఈ సంధ్యారాణిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకున్నావ్! ఆ అమ్మాయితో ఈ విషయం చెప్పావ్! కానీ ఆ అమ్మాయి వప్పుకోలేదు. అందుకని ఆమె మీద కసితో ఏదో సాకుతో ఆమెను ఒంటరి స్థలానికి తీసుకెళ్ళి రేప్ చేసి చంపేసావ్-అవునా?" మొత్తం రహస్యం కనుక్కున్నట్లు విజయగర్వంతో అడిగాడు సబిన్ స్పెక్టర్.

"అబద్ధం! ఇదంతా మీ కట్టుకథ! ఉన్న ఒక్క భార్యను కూడా ఎందుకు చేసుకున్నానా, అని పెళ్ళయిన మర్నాటి నుంచీ పశ్చాత్తాపపడుతూంటే నా మొఖానికి ఇంకో పెళ్ళామా?"

"నిజం చెప్పు! దీనికంతటికీ ఏ సినిమా ఇన్ స్పిరేషన్?"

శాయిరామ్ అయోమయంగా చూసాడు.

"సినిమానా?"

"అవునోయ్! సినిమా! ఏం సినిమా చూశాక రెండో పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన కలిగింది నీకు-"

"నాకేం అర్థం కావటం లేదండీ-"

"ప్రతి నేరానికీ ఈ రోజుల్లో ఏదొక సినిమా ఇన్ స్పిరేషన్ ఉంటుందని మా అసిస్టెంట్ కమీషనర్ గారి నమ్మకం. అందుకే ప్రతి నేరస్తుడినీ ఏదొక సినిమా పేరు చెప్పమంటున్నాం! అది కంపల్సరీ! తప్పించుకోడానికి వీల్లేదు, లేకపోతే మాకు మాటొస్తుంది. త్వరగా చెప్పు-"

"ఏం చెప్పమంటారు?"

"నువ్వీ నేరం చేసేందుకు ఏ సినిమా ప్రోత్సాహం కలిగించింది?"

"అయ్యో - అసలు నేను ఏ నేరమూ చేయలేదు- ఇంకా సినిమా ఇన్ స్పిరేషన్ ఏమిటి సార్? నా తలకాయ"

"ఏయ్! ఏదొక సినిమా పేరు చెప్తావా- లాఠీతో బాదమంటావా?"

శాయిరామ్ కంగారుపడ్డాడు.

"ఏదొక సినిమా పేరు చెప్పేయ్- వీళ్ళతో గొడవెందుకు?" అన్నాన్నేను.

శాయిరామ్ సినిమా పేర్లు ఆలోచించాడు. త్వరత్వరగా.

'చలిచీమలు' అన్నాడు ఠక్కున.

"అదీ సంగతి! అందులో ఓ మగచీమ రెండు ఆడ చీమల్ని ప్రేమించే సీన్ ఉందికదూ?"

"అబ్బే! పేరుకి చలిచీమలు గానీ అందులో మనుషులే యాక్షన్ చేస్తారండీ!"

ఇన్ స్పెక్టర్ చిరాగ్గా చూసాడు.

"అయితే మరి చలిచీమలు అని పేరెందుకు పెట్టారు?"

"తెలీదండీ-"

"అది చీటింగ్ కింద వస్తుంది. వాళ్ళమీద రేపే కేస్ బుక్ చేయిస్తాను- అయితే నువ్ ఆ సినిమాలో లవ్ సీన్ చూసి- ఆ ఇన్స్పిరేషన్ తో మీ కాలనీ యువతిని ప్రేమించి, ఆమె తిరస్కరించే సరికి రేప్ చేసి మర్డర్ చేసి, శవాన్ని ఎక్కడోదాచి మళ్ళా ఏమీ ఎరగనట్లు వెతుకుతున్నావ్ అవునా?"

"అంతా అబద్ధం" అన్నాడు శాయిరామ్.

"ముందీ స్టేట్ మెంట్ మీద సంతకం పెట్టు-"

"నేను ఛస్తే పెట్టను-"

"పెట్టకపోతే బొమికవిరగ్గొడతాను- మిమ్మల్నందర్నీ కూడా శవాలుగా మార్చేస్తాను-" అన్నాడు లాఠీ ఒకటి శాయిరామ్ పొట్టలో గుచ్చుతూ.

శాయిరామ్ భయపడుతూ సంతకం పెట్టాడు. ఆ తర్వాత సంధ్యారాణిని మేమే మర్డర్ చేసినట్లు అందరం స్టేట్ మెంట్ మీద సంతకాలు చేసాము- లాఠీతో చావుదెబ్బలు తిన్నాక.

రెండో అమ్మాయిని కూడా పెళ్ళి చేసుకోవాలన్న ఇన్ స్పిరేషన్ శోభన్ బాబు తాలూకు సినిమాల వల్ల కలిగినట్లు కూడా వప్పుకుని తలోసినిమా పేరూ రాశాము.

"ఇప్పుడు చెప్పండి- శవాన్ని ఎక్కడ దాచారు?"

అందరికీ ఏడుపోచ్చేసింది.

"నిజంగా చెప్తున్నానండీ! మాకేపాపమూ తెలీదు, కావాలంటే ఆ అమ్మాయి తల్లిదండ్రుల నడగండీ! మేమెంత మర్యాదస్తులమో చెప్తారు-"

"అదంతా తర్వాత - ముందు బయటకు నడిచి వాన్ ఎక్కండి. శవాన్ని ఎక్కడ దాచారో చూపిస్తే వదిలేస్తాం-"

"మాకు తెలీదు సార్-"

లాఠీతో వీపులో గుచ్చి బయటకు తోయసాగారు కానిస్టేబుల్స్.

-అందరం వాన్ ఎక్కాం చేసేదిలేక.

వాన్ వేగంగా పరుగెడుతోంది రోడ్ మీద.

లకడీకాపూల్ వచ్చేసరికి వాన్ ఆగిపోయింది.

కార్లు, బస్ లు, లారీలు, స్కూటర్ల హారన్లతో మోతెక్కి పోతోందా ప్రాంతమంతా! ఎక్కడ చూసినా జనం, వాహనాలు- కిటకిటలాడిపోతున్నారు!

హఠాత్తుగా వాళ్ళల్లో నుంచి తోసుకుంటూ రంగారెడ్డి గ్రూప్ వాళ్ళు బయటికొచ్చారు.

వాళ్ళను చూస్తూనే మా ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

"రెడ్డీ" అంటూ గట్టిగా అరిచాము.

వాళ్ళంతా ఆగిపోయి వాన్ లో నుంచి చేతులూపుతోన్న మమల్ని చూసి పరుగుతో వచ్చారు.

"ఇంక మేరు వెతకనఖ్ఖర్లేదు! దిగి వచ్చేయండి! సంధ్యారాణి గంట క్రితం ఇరానీ హోటల్లో 'టీ' తాగుతూ మన కాలనీ వెంకటేశానికి కనిపించిందట-"

"ఏయ్ నువ్వెవరు?" అడిగాడు రంగారెడ్డిని.

"రంగారెడ్డి - కేరాఫ్ నిర్భయ్ నగర్ కాలనీ-"

"అయితే నోరు మూసుకుని నీ దారిని నువ్ వెళ్ళు - వాన్ లో ఉన్న వాళ్ళను దిగమని ఎందుకు చెప్తున్నావ్?"

"వాళ్ళు సంధ్యారాణి కోసం వెతుకుతున్నారు గనుక- ఇంక ఆ అవసరం లేదని చెప్తున్నాము" అన్నాడు గోపాల్రావ్ కల్పించుకుంటూ.

"నువ్వెవరు?" గోపాల్రావ్ వేపు కోపంగా చూస్తూ అడిగాడు.

"గోపాల్రావ్- 'ఈ క్షణం' న్యూస్ పేపర్ జర్నలిస్ట్ ని! కేరాఫ్ నిర్భయ్ నగర్ కాలనీ"

ఇన్ స్పెక్టర్ మొఖంలో రంగులు మారాయ్.

"జర్నలిస్ట్ అయితే పెద్ద పోటుగాడినను కుంటున్నావా? పో, ఇక్కడనుంచి!"

"మాటలు మర్యాదగా రానీయండి!" అన్నాడు గోపాల్రావ్.

ఇన్ స్పెక్టర్ కి కోపం ఆగలేదు.

"రాస్కెల్! నాకే వార్నింగిస్తున్నావ్ రా నువ్వూ" అంటూ వాన్ దూకి వెళ్ళి గోపాల్రావ్ కాలర్ పట్టుకున్నాడు.

దాంతో జనమంతా హడావుడిగా వాళ్ళ చుట్టూ మూగిపోవటం మొదలుపెట్టారు. ఆ జనాన్ని చూచి మరో పోలీస్ జీప్ వచ్చి ఆగిందక్కడ.

"నా చొక్కా పట్టుకుంటావా? రేపే ఈ ఓణంలో ఈ న్యూస్ ఫోటోతో సహా వేసేస్తాను. నీ అంతు తెల్చేస్తాను-" అరవసాగాడు గోపాల్రావ్-

దాంతో ఇన్ స్పెక్టర్ కి భయం మొదలయింది.

ఈలోగా జీప్ దిగి మరో పోలీస్ అధికారి వచ్చాడు.

"వాటీజ్ ది మేటర్?" అడిగాడు ఇన్ స్పెక్టర్ ని.

అదే అదనని మేమంతా వాన్ దూకి వాళ్ళ దగ్గరకు పరుగెత్తాం. జరిగిందంతా విన్నాడతను.

"అయితే ఆ అమ్మాయి గంటక్రితం ఈ ఏరియాలో కనిపించిందంటారు!"

"అవునండీ-"

"ఒకవేళ మీ మాట అబద్దమని తేలితే మళ్ళీ మిమ్మల్నందరినీ మూసేస్తాం-"

"అలాగేసార్-"

"ఇంక పొండి-"

మారు మాట్లాడకుండా అందరం కాలనీ వేపు బయల్దేరాము. సంధ్యారాణి ట్రాఫిక్ జాములో ఇరుక్కుపోయిందన్న విషయం కాలనీ అంతా చెప్పేశాం!

"నేను ముందే అనుకున్నా! ఈ రోజుల్లో మన ట్రాఫిక్ పోలీసుల సమాఖ్య బాగా పెరిగిపోయింది కదా! అంచేత ట్రాఫిక్ జామ్ లు కూడా ఖచ్చితంగా పెరిగిపోతాయని" అంది రాజేశ్వరి.

"పెరిగిపోతాయ్ ఏమిటి నా మొఖం! ఈ ఏడు ప్రపంచ ట్రాఫిక్ జామ్స్ పోటీల్లో హైదరాబాద్ నగరం ప్రథమ బహుమతి గెల్చుకుందని మా అన్నయ్య కొడుకు వారం క్రితం అమీర్ పేట ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కున్నప్పుడు ఓ దినపత్రికలో చదివాడట-" అంది పార్వతీదేవి.

"గెలవక ఛస్తుందా? ట్రాఫిక్ పోలీస్ లెక్కువయిన కొద్దీ అంతేమరి-"

అందరం ట్రాఫిక్ జామ్ కబుర్లలో మునిగిపోయాం.

"మా బాబాయి వాళ్ళిల్లు మీ అందరికీ తెలిసిందే కదా! నారాయణ్ గూడా చౌరస్తా పక్కనే ఉంది. కిందటి సారి ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పుడు ఆ ట్రాఫిక్ లో ఇరుక్కుపోయిన చాలామందికి రెండు రోజులపాటు తన ఇల్లంతా అద్దెకిచ్చాడాయన. ఈ రెండు రోజుల్లోనే అయిదువేలు ఇన్ కమ్ వచ్చింది. ఆ తరువాత ఆ యింటిపేరు ట్రాఫిక్ జామ్ రిలీఫ్ సెంటర్ అని మార్చేశాడు. సంవత్సరం తిరగలేదు- ఒక అంతస్థల్లా ఇప్పుడు దానిమీద పది అంతస్థులేశాడు- దానిమీద వచ్చిన ఇన్ కమ్ తో-" అన్నాడు వెంకట్రావ్.

"అందాకా ఎందుకు? మా శాంతమ్మత్త కూతురిని నెలలు నిండాక డాక్టర్ దగ్గరకు చెకప్ కి తీసుకెళ్తూంటే ట్రాఫిక్ జామ్ లో మూడురోజులు గడపాల్సి వచ్చింది. అక్కడే నొప్పులు రావటం వల్ల ఖాళీగా ఉన్న లారీలో పురుడు పోసేశారు-" చెప్పింది సావిత్రమ్మ.

"మన కాలనీ వెనుక వేపున్న శీనుగాడిలాగేగా లక్షాధికారి అయింది? ట్రాఫిక్ జామ్ లోకి దూసుకెళ్ళిపోయి ఎనిమిది గంటలపాటు వీడియో సినిమాలు వేసి టికెట్ పెట్టాడంట-"

అందరం మాట్లాడుకుంటూండగానే తెల్లారిపోయింది. అయితే ఆ సాయంత్రం వరకూ కూడ సంధ్యారాణి కనిపించకపోయే సరికి మళ్ళీ ఆమె తల్లిదండ్రులు ఏడుపు మొదలెట్టారు-

మేమంతా మళ్ళీ వాళ్ళ దగ్గరకెళ్ళాం.

"ఆమె క్షేమంగా ఉందని తెలిసింది కదా! మళ్ళీ ఎందుకు ఏడుస్తున్నారు? అడిగాడు శాయిరామ్.

"అమ్మాయి నిజంగా ట్రాఫిక్ జామ్ లో ఉందోలేదో-"

"అదేమిటి? ఆ వెంకటేశం గాడు కనిపించిందని చెప్పాడు కదా!"

"వాడసలే తాగుబోతు! తాగిన నిషాలో- ఎవర్ని చూసి ఎవరనుకున్నాడో ఏమో-"

వెంటనే వెంకటేశాన్ని పిలిపించాము.

"ఏంటి గురూ?" కళ్ళు నులుముకుంటూ తూలుతూ వచ్చాడతను.

"నిన్న రాత్రి నువ్ మాకు లకడీకాపూల్ ట్రాఫిక్ జామ్ లో కలిసినప్పుడు నీకు సంధ్యారాణి ఓ హోటల్లో కనిపించిందని చెప్పావ్ కదూ?"

"నిన్న రాత్రా?"

"అవును"

"మీక్కనిపించానా?"

అందరికీ కోపం ముంచుకొచ్చింది.

"అంటే- అప్పుడే మర్చిపోయావా?"

"అరెరె! కోపమెందుకన్నా! కనిపిస్తే కనిపించి ఉండొచ్చు! దానికింత కిరికిరెందుకు?"

"అప్పుడు నీకు సంధ్యారాణి ఓ హోటల్లో కనిపించిందని చెప్పావా లేదా?"

"సంధ్యారాణా?"

"అవునయ్యా! ఇదిగో ఈ రామచంద్రమూర్తిగారమ్మాయ్ సంధ్యారాణి-"

"ఓహో ఆ అమ్మాయా?"

"అవును! ఆ అమ్మాయే!"

"ఆ అమ్మాయికి నేను కనిపించానని చెప్పిందా?"

"కాదు. నువ్వే ఆ అమ్మాయి కనిపించిందని చెప్పావ్"

"ఎక్కడ?"

"హోటల్లో"

"ఏ హోటల్లో"

"ఇరానీ హోటల్లో"

అతను కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"ఎవరా అమ్మాయ్?"

"మాకు ఇంక కోపం ఆగలేదు.

"సంధ్యారాణి-" పళ్ళు బిగపట్టి అరచాడు రంగారెడ్డి.

"నేను చెప్పలేదు- అసలు నేను నిన్నరాత్రి లకడీకపూలే వెళ్ళలేదు-"

"అదేమిటోయ్- నువ్ ఆ ట్రాఫిక్ జామ్ లోనుంచి నీ సైకిల్ నెత్తిన పెట్టుకుని ఆరుగంటల పాటు జనాన్ని ఈదుకుంటూ బయటికొచ్చానని మాతో చెప్పలేదూ?"

"మీతోనా?"

"అవును."

"నిన్న రాత్రా?"

"అవును-"

"అసలు మిమ్మల్ని నేను చూసి నెలరోజులయింది. ఆడెవడో మన కాలనీ రైటర్ నవలొకటి పబ్లిష్ చేస్తున్నాం చందాలివ్వమని అడగటానికి వచ్చినప్పుడు కలుసుకున్నాను-"

యాదగిరి ఇంక సహించలేక అతనిని గట్టిగా ఒక్కతోపు తోశాడు. అతను కింద పడుతూనే గురక పెట్టి నిద్రపోసాగాడు.

"పదండి- మళ్లా వెళ్ళి ఆ ట్రాఫిక్ జామ్ లోనే వెదుకుదాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం మళ్ళీ బయల్దేరాం.

కోలీవరకూ వెళ్ళామో లేదో మొత్తం ట్రాఫిక్ జామ్ అయిపోయి కనిపించింది. ట్రాఫిక్ పోలీసులు సరదాగా అరగంటకోసారి విజిల్స్ ఊదుతూ మళ్ళీ కబుర్లు చెప్పుకుంటూ నిలబడి ఉన్నారు.

మేమంతా ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ దగ్గరకు నడిచాము.

"ఇవాళ కొంచెం ఎక్కువగా జామ్ అయినట్లుంది కదండీ! కానిస్టేబుల్ గారూ?" అడిగాను నేను.

"అవ్" అన్నాడు కానిస్టేబుల్.

"కానీ రోజూ సాయంత్రం అయిదుగంటలకు ఈ ఏరియాలో ట్రాఫిక్ జామ్ అయేది కదా! ఇవాళ మూడింటికే జామయిపోయిందే?" అడిగాడు గోపాల్రావ్.

"ఇది ఈవాళ్టిది కాదుయ్యా! నిన్నటి ట్రాఫిక్ జామే. ఇంకా క్లియర్ కాలేదు. ఇవాళ్టిది ఇంకాసేపట్లో మొదలవుతుంది" వివరంగా చెప్పాడతను.

"అసలు ఈ ట్రాఫిక్ జామ్ ఱు మీరివాళ ఎందుకు ఏర్పాటు చేస్తున్నట్లు?" ఆ పక్కనే ఉన్న ఇన్ స్పెక్టర్ దగ్గరకెళ్ళి అడిగాడు గోపాల్రావ్.

ఇన్ స్పెక్టర్ కి కోపం ముంచుకొచ్చింది.

"ఎవర్నువ్వు? నీ నెత్తిమీద హెల్మెట్ ఏదీ? వందరూపాయలు ఫైన్ కట్టు-"

గోపాల్రావ్ క్కూడా కోపం వచ్చేసింది.

"ప్రెస్" అన్నాడు అయిడెంటిఫికేషన్ చూపిస్తూ!

"ఓ! అలాగా! ట్రాఫిక్ జామ్ లు ఎందుకు ఏర్పాటు చేశారని అడిగింది మీరే కదూ?"

"అవును-"

"ఎందుకేమిటయ్యా! ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గారొస్తున్నది ఎల్లుండేకదా? మీ పేపర్లో చదవలేదా?"

"కానీ ఎల్లుండి వస్తూంటే ఇవాళే ట్రాఫిక్ జామ్ ఎందుకు ఏర్పాటు చేశారు?" అడిగాడు శాయిరామ్.

"మీకేం మతుందా లేదా? అప్పటికప్పుడు సడెన్ గా ట్రాఫిక్ జామ్ ఈ ఏర్పాటు చేసుకోవాలంటే మాటలేమిటి? కనీసం రెండు రోజుల ముందునుంచే ప్రాక్టీస్ చేయాలి. లేకపోతే తీరా ప్రెసిడెంట్ వచ్చినప్పుడు ట్రాఫిక్ అంతా స్మూత్ గా వెళ్ళిపోతే బాధ్యత ఎవరిది? మీదా? మాదా? న్యూస్ పేపర్లన్నీ దుమ్మెత్తిపోస్తాయ్- మా డిపార్ట్ మెంట్ మీద ప్రెసిడెంట్ అంతటివాడు హైదరాబాద్ వస్తే ఒక్కచోట కూడా ట్రాఫిక్ జామ్స్ లేవని! అవునా కాదా?"

"అవునవును" అన్నాడు జనార్ధన్.

"మరో రెండు గంటలు మేము ఆ ట్రాఫిక్ జామ్ లో నుంచి ముందుకెళ్ళటానికి ప్రయత్నించి, చేతకాక చివరకు వెనక్కు తిరిగాము. అయితే అప్పటికే మా వెనుక కూడా ట్రాఫిక్ జామ్ అయిపోవడం వల్ల మరో రెండుగంటలు తన్నుకుని ఎలాగయితేనేం రాత్రికి మళ్ళీ కాలనీకి చేరుకున్నాం. అప్పటికే సంధ్యారాణి తల్లిదండ్రులు ఏడ్చి ఏడ్చి అలసిపోయి ఏడవటం మానేశారు. లకడీకపూల్ వెళ్ళటానికి రింగ్ రోడ్డు ఉప్పల్ మీదుగా మరోదారి ఉందన్న విషయం తెలిసి అప్పటికప్పుడే రెడీ అయ్యాము గానీ తీరా ఆఖరి క్షణంలో శాయిరామ్ అడ్డుపడ్డారు.

"ట్రాఫిక్ జామ్స్ ప్రతి ఏరియాలోనూ ఒకో టైమింగ్స్ ని బట్టి ఏర్పాటు చేస్తుంటారు పోలీసులు. కనుక ఈ దారిలో ట్రాఫిక్ జామ్స్ ఏయే టైమింగ్ లో మెయింటెయిన్ చేస్తూంటారో పోలీస్ స్టేషన్స్ కి ఫోన్ చేసి కనుక్కుని దాని ప్రకారం మనం వెళ్ళటం మంచిది" అన్నాడతను.

"వెంటనే మళ్ళీ అర్ధరూపాయ్ కాయిన్స్ పోగు చేసి వరుసగా అన్ని పోలీస్ స్టేషన్స్ కీ ఫోన్ చేస్తూండగా సంధ్యారాణీ, మరో యువకుడూ మెడలో పూలదండలతో ఆటోదిగారు.

అందరం కాసేపు నిశ్చేష్టులమయిపోయి తరువాత పరుగుతో వెళ్ళి వాళ్ళచుట్టూ మూగాము.

"ఏమయిపోయావే నా తల్లీ" అంటూ భోరున ఏడ్చేసింది వాళ్ళమ్మ కౌగలించుకుని.

"నేనేమయిపోతాను మీ పిచ్చిగానీ- గత సంవత్సరంగా నేను బస్ లో ఆఫీస్ కెళ్ళి వస్తున్నాను కదా. రోజూ లకడీకాపూల్ ట్రాఫిక్ జామ్ లో అయిదారు గంటలపాటు మా బస్ ఇరుక్కుపోవటం మామూలే కదా! రోజూ మా బస్ పక్క బస్ లో - ఇదిగో- ఇతను కూడా అదే ట్రాఫిక్ జామ్ లో ఉంటూండేవాడు. ఇద్దరం పక్కపక్క బస్సుల్లో ఎదురెదురు

కిటికీల దగ్గర సీట్లల్లో కూర్చోవడం వల్ల ఇద్దరం 'హలో' అనుకున్నాము. క్రమేపీ కబుర్లలోకి దిగిపోవటం అలవాటయింది. మొన్నటిది మరీ లాంగెస్ట్ ట్రాఫిక్ జామ్ అవటం వల్ల కబుర్లు చెప్పుకుని చెప్పుకుని ఇంక చెప్పుకునేందుకు ఏమీలేక ప్రేమలో పడ్డాము. ఎంత ప్రేమయినా ఎక్కువసేపు చూసుకుంటూ కూర్చుంటే బావుండదు కదా! అందుకని పెళ్లి చేసుకుంటే బావుంటుందని నిర్ణయించుకున్నాం. పెళ్లి అయితే ట్రాఫిక్ జామ్ లో ఎంతసేపున్నా ప్రాబ్లమ్ వుండదు కదాగ ఇంట్లో చేసే కాపురం- రోడ్ మీదే చేయవచ్చు- మా గొడవంతా చూపి మిగతా పాసింజర్లందరూ జాలిపడి ఆ పక్కనే ఉన్న పూలదుకాణంలో దండలు తెచ్చిచ్చి పెళ్లి జరిపించారు. ఎక్కడో పెళ్ళి పౌరోహిత్యానికి వెళ్ళాల్సిన పురోహితుడొకాయన కూడా అదే బస్ లో ఉండడం చేత బస్ లోనే ఘనంగా పెళ్లి జరిగిపోయింది.

పాసింజర్ అందరూ పాపం కూడబలుక్కుని ఓ బస్ అంతా ఖాళీచేసి మాకిచ్చి మొదటిరాత్రి ఆనందంగా గడపమని ఆశీర్వదించారు. మూడు నిద్రలు అయాక - ఇదిగో- ఇప్పుడే వస్తున్నాం-"

ఆమె తల్లిదండ్రుల మొఖంలో ఆనందం నిండిపోయింది.

"ఆ! కట్నం లేకుండా అల్లుడు దొరికాడా? ఏమండీ! వెంటనే లకడీకాపూల్ కెళ్ళి ఆ ఏరియా ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ఫోటోలన్నీ తీసుకురండి. వాళ్ళు మనపాలిట ఇలవేలుపులండీ! వాళ్ళ ఫోటోలను రోజూ మన దేవుడిగదిలో ఉంచి పూజలు చేయాలి! ఎంతోకాలం నుంచీ కట్నాలబాధ వలన చేయలేకపోయిన అమ్మాయి పెళ్ళి కేవలం వాళ్ళ ట్రాఫిక్ జామ్ల పుణ్యమా అని ఎంత చవకగా అయిపోయిందో చూశారా?"

అంటూ భర్తను కౌగిలించుకుంది హ్యాపీగా.

రామచంద్రమూర్తి అప్పటికప్పుడే ఫోటోలు తేవటానికని "యాషికా కెమెరా అరువు తీసుకుని లకడీకాపూల్ వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం కాలనీలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ కానిస్టేబుల్స్ ఫోటోలకు పూజలు, ప్రార్థనలు జరుగుతూంటే మేమంతా ఆనందంగా ప్రసాదం తినసాగాము.

"నిజంగానే ట్రాఫిక్ జామ్స్ వలన ఎన్నో లాభాలున్నాయేమో అని నాకు అనిపిస్తుంది." అన్నాడు రంగారెడ్డి అనుమానంగా.

అందరం ఆశ్చర్యపోయాం.

"ట్రాఫిక్ జామ్స్ వల్ల లాభాలా?" రంగారెడ్డిని పిచ్చాడిని చూసినట్లు చూస్తూ అడిగాడు జనార్ధన్.

"అవును! అలా ఓవర్ గా ఎక్స్ ప్రెషన్ లు ఇవ్వకుండా మీరూ బ్రెయిన్ ఉపయోగించి ఆలోచించండి! బోలెడు లాభాలు కనబడతాయ్. అసలు నన్నడిగితే మిగతా అన్ని రాష్ట్రాల వాళ్ళూ మన రాష్ట్ర రాజకీయ నాయకుల దగ్గరా, మన రాజధాని పోలీస్ అధికారుల దగ్గరా శిక్షణ తీసుకోవాలి. అప్పుడు దేశమంతా హైదరాబాద్ మోడల్ ట్రాఫిక్ జామ్స్ ఏర్పాటు చేసుకుని అద్భుతమయిన లాభాలు ఎంజాయ్ చేయవచ్చు-" సీరియస్ గా అన్నాడతను.

దాంతో అందరూ నిజంగానే ఆలోచనలో పడ్డారు. ముందు యాదగిరికే ఫ్లాష్ వెలిగింది.

"అవ్! రంగారెడ్డి కరెక్ట్ గా జెప్పిండు! నేను అబ్జర్వ్ జేస్తనే ఉన్నా కదా! ట్రాఫిక్ జామ్స్ ఉండెడిది రోడ్స్ లో అస్కల్కి ఒక్క యాక్సిడెంట్ కూడా అవటం లేదన్నా! ఎందుకో ఎరికనా? మోటార్ సైకిల్ గానీ, కారుగానీ అస్సలు ముంగటికి కదుల్తే గదా యాక్సిడెంట్ అవ్వనికి" అన్నాడు కొత్తగా ఏదో డిస్కవర్ చేసినంత ఉత్తేజంతో-

"దానికంటే పెద్ద లాభం ఇంకోటుంది బ్రదర్" అన్నాడు గోపాల్రావ్.

అందరూ అతని వేపు ఆసక్తితో చూశారు.

"ఏమిటది?" అడిగాన్నేను.

"మత కలహాలకు మనదేశం చాలా ప్రసిద్ధికదా! ప్రపంచమంతా మనదేశం గురించి చెప్పుకుని నవ్వుకుంటూనే ఉంటారు. ఇప్పుడీ ట్రాఫిక్ జామ్స్ ల వల్ల మతకల్లోలాలు, గ్రూప్ ఫైటింగ్ లు, కులపోరాటాలు అస్సలుండవ్! ఎందుకంటే జనమంతా మన ఇరుకు వీధుల్లో ఇంకా ఇరుక్కుని నిలబడటం వల్ల పక్కవాడిని పొడిచేంత స్థలం కూడా దొరకదు. దాంతో పొడుచుకోడాలు, కాల్చుకోడాలు ఏమాత్రం సాధ్యపడదు. దాంతో ఆటోమేటిగ్గా "భాయి భాయి" లెవల్లో కల్సిపోయి ఐకమత్యంతో ఆ ట్రాఫిక్ జామ్ నుంచి ఎలా బయటపడాలా అనే ఆలోచిస్తారు-"

"మూడోది దేశంలో వరకట్నాల సమస్య పూర్తిగా రూపు మాసిపోతుంది" అంది రాజేశ్వరి.

"ఎలా?" లేడీస్ నుంచి ఎవరో అరచారు.

"ఎలాగేముంది? ట్రాఫిక్ జామ్స్ అన్నాక గంటల తరబడీ, ఒకోసారి విదేశీ ప్రముఖులు మన రాష్ట్రానికొచ్చినప్పుడు - రోజుల తరబడీ ట్రాఫిక్ జామ్స్ అవుతాయ్ కదా! అప్పుడు ఆ ట్రాఫిక్ జామ్స్ లో పెళ్ళి కాని యువతీ యువకులు కూడా ఇరుక్కోక తప్పదు కదా! దాంతో గత్యంతరం లేక టైమ్ పాస్ కోసమయినా ఒకరినొకరు పలుకరించుకోవటం,

జీవితం గురించి వేదాంత ధోరణిలో మాట్లాడుకోవటం, ఒకరి గురించి ఒకరు తెలుసుకోవటం- ఆ తరువాత ప్రేమలో పడటం- ట్రాఫిక్ జామ్ క్లియర్ అవగానే పెళ్ళి చేసేసుకోవాలని నిర్ణయించుకోవటం- అలా లవ్ మారేజీలు పెరిగిపోతాయ్. దాంతో వరకట్న సమస్యలు ఆటోమేటిగ్గా పరిష్కారమయిపోతుంది-" ఆవేశంగా చెప్పిందామె.

కొంతమంది లేడీస్ తప్పట్లు కొట్టారు ఆనందంగా.

"ఆ రోజులు త్వరగా రావాలి!" అని కూడా అరచారు వాళ్ళు.

"వీటికన్నింటికంటే కూడా గొప్పలాభం ఇంకోటుంది" అంది పార్వతీదేవి.

"ఏమిటది?"

"ట్రాఫిక్ జామ్స్ ఇలాగే విజయవంతంగా అమలుపరుస్తే మనదేశంలో ఆహారకొరత వెంటనే తగ్గిపోతుంది. ఎందుకంటే కొన్ని లక్షలమంది ట్రాఫిక్ జామ్స్ లో ఇరుక్కుపోయి కనీసం రెండురోజులకో పూటయినా భోజనం మిస్ అవుతారు. ఆ విధంగా కొన్ని లక్షల టన్నుల ఆహారధాన్యాలు మిగిలిపోతాయ్-"

"నన్నడిగితే దానికన్నా కూడా మంచిలాభం ఇంకోటుంది. అదేంటంటే రైళ్ళల్లో, బస్సుల్లో, టాక్సీల్లో రద్దీ డ్రాస్టిక్ గా తగ్గిపోతుంది. ఎంచేతంటే వాటిల్లో వెళ్ళాల్సిన ప్రయాణీకులు కొన్ని లక్షలమంది ట్రాఫిక్ జామ్స్ లో ఇరుక్కుపోయి టైమ్ కి స్టేషన్ గానీ, బస్ డిపోకి గానీ చేరుకోలేరు- దాంతో వాటిని మిస్ అయిపోయి ప్రయాణం రద్దు చేసుకుంటారు-"

ఓ ముసలాయన ఉత్సాహంగా అందరినీ తోసుకుంటూ ముందుకొచ్చాడు.

"అసలు విషయం మర్చిపోయారర్రా! ఈగలు, దోమల కన్నా ఫాస్ట్ గా పెరిగిపోతున్న మన జనాభా పెరుగుదల ఈ ట్రాఫిక్ జామ్స్ ల వల్ల సగానికి సగం పడిపోతుంది-"

అందరూ ఈలలు వేసి తప్పట్లు కొట్టారు.

"సోదరులారా! ఈ ట్రాఫిక్ జామ్స్ వల్ల లాభాలకు అంతు ఉన్నట్లు లేదు. అందుకని ఇంక ఈ టాపిక్ ఆపి ఇళ్ళకు వెళ్తే బాగుంటుంది." అన్నాడు రంగారెడ్డి చిరాకుగా. అందరూ ఇళ్ళకు వెళ్తోంటే రేడియోలో వార్తలు వినబడుతున్నాయ్.

ఆంధ్రప్రదేశ్ పౌరులకు పోలీస్ కమీషనర్ విజ్ఞప్తి!

ఇక నుంచీ వీధుల్లో నడిచిగానీ, వాహనాలలో గానీ వెళ్ళదల్చుకున్న ప్రజలందరూ విధిగా టిఫిన్ కేరియర్ లో భోజనాలు, తాగడానికి నాలుగులీటర్ల మంచినీళ్ళు, ఒక తలగడ, ఒక దుప్పటి తీసుకెళ్ళాల్సిందిగా కోరుతున్నారు! స్టేట్ గవర్న్మెంట్ ఉద్యోగులు తమతో పాటు ఆఫీస్ ఫైల్స్ కూడా తీసుకెళ్ళి ట్రాఫిక్ జామ్స్ లో ఆ ఫైల్స్ తాలూకు పని అంతా పూర్తి చేయాల్సిందిగా చీఫ్ సెక్రటరీ ఆదేశిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కున్న వెంటనే డ్యూటీ దిగిపోయినట్లు సంతకం చేసి, బస్ లోనే నిద్రపోయి తిరిగి ట్రాఫిక్ జామ్ క్లియరయిపోయినప్పుడు మళ్ళీ డ్యూటీలో చేరాల్సిందిగా జనరల్ మేనేజరుగారు కోరుతున్నారు..."

ఆ తరువాత ఇంకేం విజ్ఞప్తులు, ఎవరెవరు చేశారో మాకు తెలీదు. అందరం నిద్రలోకి జారిపోయాం.

* * * * *

# మీ అనారోగ్యమే మా మహాభాగ్యం

మా కాలనీ వాళ్ళు తరచుగా ఏదొక సందర్భంలో మీటింగులు పెట్టడం మామూలే అని మీకీపాటికి తెలిసే వుంటుంది. అందులోనూ శాయిరామ్ మళ్ళీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అయ్యాక పరిస్థితి మరింత విషమించింది. ఇంచుమించుగా ప్రతాదివారం మీటింగులు పెట్టేస్తున్నాడు. ఆ ఆదివారం మీటింగ్ కాలనీ వాసుల ఆరోగ్యం గురించి అని ముందే అందరికీ తెలియజేశాడు.

తొమ్మిదింటికల్లా కాలనీవాళ్ళు చాలా మంది మీటింగుకి హాజరయ్యారు. నేనూ అక్కడికి చేరుకునే సరికి శాయిరామ్ మైక్ దగ్గర నిలబడి స్పీచ్ దంచేస్తున్నాడు.

"... మొన్నటికి మొన్న మా రెండో అబ్బాయికి దగ్గుగా ఉందని డాక్టర్ దగ్గరకు తీసుకెళితే ఏదో టాబ్ లెట్లు, టానిక్ రాసిచ్చి ముప్పై రూపాయలు ఫీజు తీసుకున్నాడు. ఆ మందులు వాడేసరికి వాడికి దగ్గుపోయి వాంతులు మొదలయినాయి. మళ్ళీ అదే డాక్టర్ దగ్గరకు తీసుకెళితే వాంతులు తగ్గటానికి మళ్ళీ టాబ్ లెట్లు రాసిచ్చి ఫీజు ముప్పయ్ రూపాయలు తీసుకున్నాడు. దగ్గుకి వాడిన టాబ్ లెట్స్ తాలూకు ప్రభావం వల్ల వాంతులవడం మామూలేనని డాక్టర్ శెలవిచ్చాడు. వాంతులకు మందులు వాడేసరికి - అవి తగ్గి అజీర్ణం మొదలయింది. అది ఆ వాంతుల తాలూకు మందుల ప్రభావమట! మళ్ళీ కొత్త మందులూ, ముప్పయి రూపాయల ఫీజు!- ఇలా ఎంతకాలం డాక్టర్ కి ముడుపులు చెల్లిస్తుండాలో అర్థంకాక ఆ విషయం అడిగితే "మీ అనారోగ్యమే మాకు మహాభాగ్యం" అన్నారాయన చిరునవ్వుతో! కనుక సోదరులారా! ఇప్పుడు మనందరం కలిసి ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించడానికి ఇక్కడ సమావేశమయ్యాం. ఎందుకంటే ఈ సమస్య నా ఒక్కడిదీ కాదు. మన కాలనీలో అందరూ

వందలకు వందలు ప్రతి నెలా డాక్టర్లకు సమర్పించుకుంటున్నాము. రోగాలతో ఓ బాధ- డాక్టర్ ల ఫీజులతో మరో బాధగా ఉంది మనకు. ఈ విషయం మీద సోదర సోదరీమణులందరూ తమ తమ అభిప్రాయాలు తెలియజేస్తారని ఆశిస్తాను."

వెంటనే రాజేశ్వరమ్మ గారు ఆడాళ్ళ మధ్యలో నుంచి లేచి నిలబడింది.

"మీరు చెప్పింది నిజమే అన్నయ్యగారూ! మొన్నో డాక్టర్ సచ్చినోడు మా చంటిదానికి టి.బి. ఉందని చెప్పి ఇంజక్షన్ లు, టాబ్ లెట్ లు మొదలెట్టేశాడు. పదిహేను రోజుల్తరువాత దాని స్కూలులో డాక్టర్ ఆరోగ్యం శుభ్రంగా వుందని కార్డు పంపించాక అనుమానం వచ్చి వేరే డాక్టర్ తో పరీక్ష చేయిస్తే టి.బి.లేదు, గాడిద గుడ్డూ లేదని చెప్పేశారు. అయితే అనవసరంగా టీ.బి. ఇంజెక్షన్ లూ, టాబ్ లెట్ లూ వాడడం వలన మరేదో రోగం ముంచుకొచ్చిందని చెప్పి అది తగ్గటానికి ఇంకా ఏవో ఇంజెక్షన్ లు రాసిచ్చారు. దీనికంతా కలిసి వెయ్యిరూపాయలు అప్పయింది! ఆ పాడు సచ్చినోడు అలా అబద్ధాలు చెప్పకుండా ఉంటే ఆ వెయ్యిపెట్టి గ్రైండర్ కొనుక్కునేదాన్ని" అందామె ఆవేశంగా.

అందరూ రాజేశ్వరమ్మ గారి చంటిదాని గురించి కొద్దిసేపు సానుభూతితో మాట్టాడుకున్నారు.

ఆ తరువాత కాలనీ కమిటీ మెంబర్ శంకర్రావ్ మైక్ ముందు నిలబడ్డాడు. ఆయన తాలూకు వైద్యనారాయణోహరి అనుభవం ఇలా రసవత్తరంగా సాగింది.

అది 1970వ సంవత్సరం. మా ఆవిడ విపరీతమయిన కడుపునొప్పితో బాధపడుతూంటే అర్ధరాత్రి మా రైల్వే హాస్పిటల్లో లేడీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను.

"ఇది ఎపెండిసైటిస్! వెంటనే ఆపరేషన్ చేసెయ్యాలి-" అంటూ ఏదో కాగితం మీద రాసిచ్చి, అర్ధరాత్రి తన నిద్ర పాడయినందుకు విసుక్కుని అర్జంటుగా మమ్మల్ని బయటకు పంపి తలుపేసుకుంది. మా ఆవిడను మర్నాడు పొద్దునే ప్రైవేట్ నర్సింగ్ హోమ్ కి తీసుకెళ్ళి ఎపెండిసైటిస్ ఆపరేషన్ చేయమంటే వాళ్ళు గంటసేపు ఆపరేషన్ చేసి అది ఎపెండిసైటిస్ కాదనీ, అంచేత ఆపరేషన్ కేన్సిల్ చేసేస్తున్నామనీ తేల్చారు.

ఆ నర్సింగ్ హోమ్ ఇన్ ఛార్జ్ నామీద మండిపడింది.

"ఇది ఎపెండిసైటిస్ అని ఎవరు చెప్పారు మీకు?"

"మా రైల్వే హాస్పిటల్ లో డాక్టరండీ!"

"ఆవిడకేమయినా బుద్ధుందా?"

"ఉందనుకునే మా రైల్వేవాళ్ళు మా రైల్వే హాస్పిటల్లో ఉద్యోగం ఇచ్చారండీ!"

"ఆవిడకు బుద్ధి లేదు అని నేను చెప్తున్నాను" అందావిడ కోపంగా.

"సరేనండీ!"

"అంతేగాదు- మీ రైల్వే డిపార్ట్ మెంట్ కి కూడా బుద్దిలేదు-"

"ఆ సంగతి కూడా ఇప్పుడే తెలిసిందండీ!"

"ఉంటే కడుపునొప్పి అన్నంత మాత్రాన ఎపెండిసైటిస్ అని రాసేయరు."

"మా రైల్వేలో రాసేస్తారండీ" అన్నాను నిజం ఒప్పుకుంటూ.

"టు హెల్ విత్ యువర్ రైల్వే అండ్ టు హెల్ విత్ యువర్ లేడీ డాక్టర్."

"అలాగేనండి"

"అది ఎపెండిసైటిస్ అయితే మరి ఆవిడకి మీ రైల్వే హాస్పిటల్లోనే ఎందుకు ఆపరేషన్ చేయలేదు?"

"చేస్తాననే అందండి ఆవిడ- కానీ నేను ఒప్పుకోలేదు."

"ఎందుకని ఒప్పుకోలేదు?"

"ఆ ఆవిడ నేనూ ప్రేమించి పెళ్ళి చేసుకున్నామండి. పైగా ఇప్పటికీ ఎలాంటి తగవులుకానీ, విభేదాలుగానీ, కక్షలుగానీ మామధ్య లేవండీ! అంచేత ఇంకొంత కాలమయినా సుఖంగా సంసారం చేయాలన్న ఆశతో మా హాస్పిటల్లో ఆపరేషన్ కి నేను అభ్యంతరం చెప్పి మీ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ కి తీసుకొచ్చానండీ."

"మరీ సంగతులన్నీ ముందే చెపితే, నేను మళ్ళీ పరీక్షించి అది అపెండిసైటిస్ అవునా! కాదా! అని తేల్చుకుని అప్పుడు ఆపరేషన్ ప్రారంభించే దానిని కదా!"

"మా లేడీ డాక్టరు..."

"టు హెల్ విత్ యువర్ లేడీ డాక్టర్...."

"ఆవిడక్కూడా ఏ రాష్ట్రందో తెలీదుగానీ ఓ యం.బి.బి.యస్. డిగ్రీ ఉంది. ఆవిడ చాలా రోజుల్నుంచీ రోగులకు మందులిస్తోంది కదా అని ఆలోచించి-"

"ఆ ఆ లు రానివాళ్ళు కూడా మనదేశంలో లక్షల మందికి మందులిస్తున్నారని పేపర్లలో చదవలేదూ?"

"చదివానండీ!"

"మరి మందులివ్వడం పెద్ద ఘనకార్యం అన్నట్లు మాట్లాడతారేమిటి?"

"ఇంతకూ మా ఆవిడకున్న జబ్బేమిటండీ! ఆ కడుపునొప్పి ఎందుకొచ్చిందంటారు?"

"అది అమీబియాసిస్-"

అమీబియాసిస్సాండి!"

"అవును"

"అంటే ఏమిటండీ"

"మీరు ఏ డిపార్టుమెంటులో పని చేస్తున్నారు?"

"రైల్వేలో."

"అందుకే ఇలా మా టైమ్ వేస్ట్ చేస్తున్నారు. అమీబియాసిస్ అంటే ఏమిటో మీకు వివరంగా చెప్పాలంటే నాలుగ్గంటలు పడుతుంది. నాలుగ్గంటలు అంటే రెండు ఆపరేషన్లు. రెండు ఆపరేషన్లంటే రెండువేలరూపాయలు అర్థమయ్యిందా?"

"అయ్యిందండీ!"

"అయితే ఎనిమిదొందలు ఫీజు కట్టి ఈ మందులు కొని వాడండి."

"ఎనిమిదొందలు ఎందుకండీ? ఆపరేషన్ చెయ్యలేదుగా?"

"చెయ్యకపోయినా చేసినంత పనయింది కదా! పేషెంట్ కి కంప్లీట్ రెస్ట్- పంచదార లేకుండా పాలు ఇవ్వండి. వారం రోజులు ఇంజెక్షన్లు- ఫీజివ్వండి. త్వరగా!"

ఫీజిచ్చి బయట పడ్డాను.

మందులన్నీ వాడినా కడుపునొప్పి తగ్గకపోయేసరికి డాక్టర్ని మార్చాక తప్పలేదు. కొత్త డాక్టరు అన్ని రిపోర్ట్స్ చూసి, వివరాలు అడిగి తెలుసుకుని అరగంట సేపు ఆలోచించాడు. అతను ఆలోచిస్తున్న కొద్దీ నాకు భయం ఎక్కువయిపోసాగింది.

"రేపు రండి! చెప్తాను" అన్నాడు సీరియస్ గా.

"అంటే - ఇదేం ప్రమాదకరమయినది కాదు గదా?" అనుమానంగా అడిగాను.

"ఆ విషయం కూడా రేపే తెలుస్తుంది."

"ఇప్పుడు చెప్పడం కుదరదా?"

"కుదరదు."

"ఎందుకని?"

"నిజం చెప్పమంటారా?"

నాకు చెమటలు పట్టేసినయ్. మా ఆవిడ మొఖం పాలిపోయింది. ఇద్దరికీ ఏడుపొక్కటే తక్కువ. తప్పకుండా అది ప్రాణాలు తీసే జబ్బే అయుంటుందనిపించింది.

"చెప్పండి, నిజం చెప్పేయండి. ఫరవాలేదు" అన్నాను వణుకుతూ.

"నేను ఎం.బి.బి.యస్. పరీక్షలన్నీ కేవలం డజను జబ్బులకు సంబంధించిన పాఠాలే చదివి పాసయ్యాను. ఆ జబ్బులే పరీక్షలు అడుగుతారని మా మావయ్య చెప్పాడు. ఆయన ఇదివరకు హెల్త్ మినిష్టర్ లెండి. అందుకని మిగతా జబ్బులన్నీ వదిలేశాను. అంచేత ప్రస్తుతం ఆ డజను జబ్బుల్లో- ఇరుక్కున్న పేషెంట్ వస్తేనే వైద్యం చేయగలను. మిగతా జబ్బులయితే ఇంటికెళ్ళి రాత్రంతా గైడ్ చదివి ప్రొద్దున్న వైద్యం చేస్తాను. కనుక మీరు రేపొద్దున్న రండి. ప్రస్తుతానికి ఇదంతా చెప్పినందుకు పాతిక రూపాయల ఫీజివ్వండి చాలు" అన్నాడు. నేను పాతిక రూపాయలు అతని చేతిలో పెట్టి బ్రతుకుజీవుడా అని బయటపడ్డాను. మరో డాక్టర్ మా ఆవిడను పరీక్షించి, "ఖచ్చితంగా ఇది గాస్టిక్ ట్రబులే" అన్నాడు ధీమాగా.

"అంటే ఏమిటండీ?"

"అంటే సెప్టిక్ అల్సర్!" అంటే ఎసిడిటీ వల్ల అల్సర్ ఫారమ్ అవుతుందన్నమాట. అంటే వీటి వల్లే కడుపు మంటలు వగయిరా వస్తాయన్నమాట. అంటే అంతే. ఇంకేమిలేదు."

"మరి దీనికేం చేయాలంటారు?"

"ముప్పయ్ రూపాయలు నాకు ఫీజు ఇవ్వాలి. ఇస్తే మందులు రాస్తాను."

"ఫీజు ఇస్తాన్లెండి- ఇవ్వకుండా పారిపోను గదా!"

"అలా అని జెప్పి- మీ రైల్వే డ్రైవర్ ఒకతను మందులు రాసేశాక ఫీజివ్వకుండా మందుల కాగితం తీసుకుని ఎక్స్ ప్రెస్ లాగా పారిపోయాడు. అప్పటినుంచీ నేను రైల్వే వాళ్ళకు ఫీజు ముందు తీసుకుని తరువాత ట్రీట్ మెంట్ చేస్తాను- ఏదీ ఫీజివ్వండి"

నేను ఫీజిచ్చాక అతను మందులు రాసిచ్చాడు.

"చూడమ్మా, నువ్వు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు మా ఆవిడతో.

"అలాగేనండీ."

"సాధారణంగా నువ్వేం ఆలోచిస్తుంటావు?"

"అవీ- ఇవీ- ఆలోచిస్తుంటానండీ"

"అవీ- ఇవీ- అంటే ఏమిటి?"

"అంటే, ఇదివరకు ఎక్కువగా కాలనీలో ఇరుగుపొరుగువాళ్ళు ఏమయినా కొత్త వస్తువులు గానీ, చీరెలుగానీ, కొంటే వాటి గురించి ఆలోచించేదాన్నండీ, కాని ప్రస్తుతం ఆ ఆలోచనలు పోయాయండీ."

"మరిప్పుడు ఏ విషయం ఎక్కువగా ఆలోచిస్తుంటారు."

"ఇప్పుడు మా అన్న గురించి ఆలోచిస్తూంటానండీ!"

"ఎందుకు మీ అన్న గురించి ఆలోచించటం?"

"పాపం మా అన్న రాత్రింబవళ్ళు శ్రమపడుతున్నాడు కదండీ! అందుకనీ చాలా ఆవేదనగా ఉంటుందండీ!"

"చూడమ్మా! మగాడన్నాక శ్రమపడక తప్పదు కదా! దాని గురించి ఎవరయినా ఆలోచిస్తుంటారా? ఇంతకీ మీ అన్నయ్య ఏమి పని చేస్తారు?"

"మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కదండీ! మీకు తెలీదూ!"

"అంటే నువ్వు మాట్లాడేది యన్.టి.ఆర్. గురించా?"

"అవునండీ! ఆయనే కదండీ! 'అన్న' అంటే?"

"చూడమ్మా ప్రస్తుతం నువ్వు ఏ ఆలోచనలు లేకుండా ప్రశాంతంగా గడపాలి. అప్పుడే అల్సర్ నయమవుతుంది."

"అన్న మా స్త్రీల మంచికోసం ఇంత పాటుపడుతూంటే ఆలోచించకుండా ఎలా వుండగలనండీ?"

"ఉండాలమ్మా! లేకపోతే అల్సర్ తప్పదు."

మా ఆవిడ అయిష్టంగానే అంగీకరించింది.

అల్సర్ కి కొన్ని రోజులు ట్రీట్ మెంట్ అయాక మరో కొత్త డాక్టర్ ని చూడక తప్పలేదు.

ఆయన అంతవరకూ డాక్టర్లు రాసిన, చేసిన పనులన్నీ చదివాడు. ఎక్స్ రేలు చూశాడు.

"అసలు ముందిది ఎపెండిసైటిస్ అని రాసిన లేడీ డాక్టర్ కి బుద్ధి లేదు" అన్నాడు అన్నీ చదివాక.

"అవునండీ! ఆ విషయం రెండో డాక్టర్ చెప్పారు."

"నన్నడిగితే ఆ రెండో డాక్టర్ కీ బుద్దిలేదు."

"పోనీ మూడో డాక్టర్ కండీ?"

"మూడో డాక్టర్ కి అంతకన్నా లేదు!"

"లేదాండీ?"

"ఏ మాత్రం లేదు- ఇలాంటి బుద్ధి తక్కువ వాళ్ళ దగ్గరకెందుకెళ్ళారు మీరు?"

"బుద్ధిలేదన్న సంగతి వాళ్ళు చెప్పలేదు కదండీ ముందు - అందుకని."

"నన్నడిగితే అసలు మీకు బుద్ధిలేదంటాను"

నాక్కోపం వచ్చింది.

"మీక్కావాలంటే ఇంకో అయిదు రూపాయలు ఎక్కువ ఫీజు తీసుకోండి, అంతేగాని ఇలా తిట్టటానికి వీల్లేదు."

"లేకపోతే ఏమిటయ్యా మీ ఆవిడ ఆ కొత్త ఆవకాయ పచ్చడి పూటకి నాలుగు బద్దల చొప్పున వేసుకుని మింగుతుంటే కడుపు నొప్పి రాకేం చేస్తుంది. ఈ మాత్రానికే ఆపరేషనూ పాతిక రకాల మందులూ, ఇంజక్షన్లూ, అరడజను డాక్టర్లూ- ఏమిటీ నాన్సెన్స్? నా ఫీజిచ్చి ఇంక ఇంటికిపోండి! మీ ఆవిడకు వారం రోజుల వరకు కేవలం మజ్జిగన్నం తినిపించండి. అంతే దెబ్బకు ఎగిరిపోతుంది. కడుపునొప్పి."

చివరకు ఆ విధంగా రెండువేల రూపాయల ఖర్చు తరువాత కేవలం మజ్జిగన్నంతో కడుపునొప్పి మాయమయిపోయింది. కనుక సోదర సోదరీమణులందరూ నా అనుభవాన్ని బట్టి ఆలోచిస్తే "మీ అనారోగ్యమే- మా మహాభాగ్యం" అనేది డాక్టర్ల పాలసీగా కనబడుతుందని ఇట్టే తెలిసిపోతుంది. ఇప్పుడు నా సలహా ఏమిటంటే, మన కాలనీ వాళ్ళందరం కలసి బాగా పేరు, అనుభవం, నైపుణ్యం వగైరాలన్నీ గల డాక్టర్ ని మన కాలనీ కోసం మనమే

ఏర్పాటు చేసుకుంటే అందరకీ బోలెడు ఫీజులు కట్టే పరిస్థితి తప్పడమేకాకుండా, సరయిన వ్యాధి నిర్ణయం, తగిన వైద్యం జరిగే అవకాశం ఉందని మనవి చేస్తున్నాను" అంటూ ముగించాడతను. అందరూ ఆ సలహా అద్భుతంగా ఉందని తప్పట్లు కొట్టారు.

గోపాల్రావు లేచి నిలబడ్డాడు.

"ఎలాగూ యాభయి అయిదేళ్ళ స్కీములో చాలా మంది డాక్టర్లు రిటైర్ అయ్యారు. కనుక వాళ్ళలో ఓ మాంచి డాక్టర్ ని మన కాలనీ కోసం ప్రత్యేకంగా నియమిస్తే బాగుంటుంది."

"అవునవును" అన్నాడు రాజాచారి.

"మరి ఆ డాక్టర్ జీతం ఎవరిస్తారు!" రామచంద్రరావు లేచి పొట్ట నిమురుకుంటూ అడిగాడు.

"ఎవరేమిటి? మనందరం. కాలనీలో ఇంటికి అయిదు రూపాయలు చొప్పున వసూలు చేస్తే డాక్టర్ కి నెలకి పన్నెండొందల జీతం ఇవ్వవచ్చు."

ఆ సూచనకు అంతా హర్షధ్వానాలు చేశారు.

"నిజంగా ఆ గోపాల్రావుది చాలా తెలివిగల బుర్ర" అని ఒకావిడ గట్టిగానే అనడం వినిపించి గోపాల్రావ్ మరింత గర్వంగా అందరివేపూ మెరుస్తున్న కళ్ళతో చూడసాగాడు.

"నన్నడిగితే ఆ డబ్బు డాక్టర్ కిచ్చే బదులు - ఇంకేదయినా ఉపయోగకరమయిన కార్యక్రమానికి ఖర్చు చేయడం మంచిది. అసలు మనదేశంలో డాక్టర్లే ఓ పెద్ద లగ్జరీ. దానికితోడు జీతాలు ఇవ్వడం కూడానా!" అన్నాడు రామచంద్రం.

అంతా రామచంద్రాన్ని అర్జంటుగా కూర్చోమని కేకలు వేశారు.

"నీకేం నాయనా! శనివారం నాకు కూడా వదలకుండా కోడికూర తింటావ్! తాతలు సంపాదించిన ఆస్తి వుంది. ఇక రోగమా, రొస్టా- డాక్టర్లతో పనేముంటుంది నీకు." అంది రాజేశ్వరి సాగదీస్తూ.

"సరే మీ ఇష్టం, తరువాత మీరే భోరున ఏడుస్తారు?" అనేసి పొట్ట నిమురుకుంటూ కూర్చున్నాడు రామచంద్ర.

రెండు రోజులపాటు వెతికి వెతికి చివరకు రిటైరయిన చాకు లాంటి డాక్టర్ ని నెలకి పన్నెండొందల జీతానికి మాట్లాడి తీసుకొచ్చారు జనార్ధనూ, శాయిరామ్ కలిసి. ఆయన కాలనీకి రావడమే అందరి ఆరోగ్యం చెక్ చేశాడు. ఆ తరువాత మీటింగ్ ప్రారంభమయింది.

"కాలనీ అంతా చూశాక నాకు చాలా లోపాలు కనిపించాయి. చదువుకున్నవారై ఉండికూడా ఎవ్వరూ నీళ్ళు కాచి తాగడం లేదు. మనిషికొచ్చే జబ్బులలో నూటికి తొంభయి ఎనిమిది కేవలం నీళ్ళు కాయకుండా తాగడం వల్లే వస్తాయి. కనుక రేపటి నుంచీ అందరూ నీళ్ళు కాచి తాగుతారని ఆశిస్తాను. నేను చిన్నప్పటి నుంచీ కాచిన నీళ్ళే తాగడం అలవాటు చేసుకున్నాను. ఫలితం ఏమిటో తెలుసా? ఈ రోజు వరకూ నాకు జలుబు కూడా చేయలేదు."

అంతా తప్పట్లు కొట్టారు.

మర్నాటి నుంచి నీళ్ళు కాచి తాగే కార్యక్రమం మొదలయింది. అయితే తాగేప్పుడు కొందరు కళ్ళు మూసుకుని తాగితే కొంతమంది వాంతి కాకుండా పచ్చడి పక్కన పెట్టుకుని మరీ తాగుతున్నారు.

ఆ తరువాత వారం అందరికీ మెడికల్ చెకప్ చేసే కార్యక్రమం జరిగింది.

మళ్ళీ సమావేశం ఏర్పాటు చేశాడు శాయిరాం.

డాక్టరు గారు మైక్ దగ్గరకొచ్చి ఉపన్యాసం ప్రారంభించారు.

"అందరినీ చెకప్ చేశాక నేను మీలో కొన్ని ఘోరమయిన లోపాలు కనుక్కున్నాను. మీలో చాలా మందికి ఆరోగ్యానికి సంబంధించిన చిన్న చిన్న విషయాలు కూడా తెలీదు. ఉదాహరణకి ఆహారపుటలవాట్లు. చాలా మంది పాలకూర తింటున్నారు. పాలకూర ఆరోగ్యానికి చాలా హానికరం. కిడ్నీలో రాళ్ళు ఏర్పడతాయి అది తింటే."

ఆ మాటలతో అందరిలోనూ కలకలం బయలుదేరింది.

కొద్ది రోజుల క్రితమే మా కాలనీలో రమణారావు అనే అతని కిడ్నీలో రాళ్లుండడం వల్ల ఆపరేషన్ జరగడం, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు రాళ్ళతోపాటు పొరబాటున కిడ్నీ కూడా తీసేయడం- అతను అర్జంటుగా పైకెళ్ళిపోవటం జరిగింది.

"అదేమిటి డాక్టరుగారూ, ఆకుకూరలు విరివిగా వాడాలని టీవీలో ఆవిడెవరో మరీమరీ చెప్పిందిగా" అంది జయప్రదాదేవి ఆందోళనగా.

"అవును రేడియోలో కూడా చెప్పారు." అంది ప్రభావతి.

"ఆ చెత్త టీవీలు, రేడియోలు ఏమి చెప్పాయన్నది కాదు నాక్కావలసింది. నేను ఒక బాధ్యతాయుతమైన డాక్టర్ గా చెప్పేదేమిటంటే మీరెవరూ పాలకూర తినకూడదు. అది చిన్నప్పటి నుంచి తినకపోబట్టే నేను ఎలాంటి కిడ్నీ రాళ్ళు లేకుండా ఆరోగ్యంగా ఉన్నాను."

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"అంతేకాదు, ప్రతివారూ రోజూ టమాటోలు వాడుతున్నట్లుగా కూడా నాకు తెలిసింది. అది కూడా గాల్ బ్లాడర్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు, కనుక దాని వాడకం కూడా వెంటనే తగ్గించండి."

ఈసారి హాహాకారాలు పెద్దఎత్తున చెలరేగాయి. అందరూ ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

"నేను నమ్మను" అన్నాను గోపాల్రావు.

"ఈ విషయంమరి ఇంతవరకు ఏ డాక్టరూ చెప్పలేదేం?" అరిచాడు శ్రీనివాసరావ్.

"ష్" అరిచాడు డాక్టర్.

"అలా గట్టిగా అరవకండి. గట్టిగా అరవడం- అరుపులు వినడం కూడా మన ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రతిమనిషికి యాభయి డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాలు చేరకూడదు. అంతకంటే ఎక్కువ డెసిబుల్స్ వింటే చెవులు పనిచేయవ్"

అంతా నిశ్శబ్దం.

శబ్దం చేయకుండా అంతా భయం భయంగా ఎవరి ఇళ్ళకు వాళ్ళు బయల్దేరారు. ఆ రోజు నుంచి పాలకూర-టమాటోలు కాలనీ కెదురుగ్గా ఉన్న కూరగాయల షాపుల్లో కనిపించడం మానేసినయ్.

వారం రోజులయినా గడవకముందే డాక్టర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు ఓ సాయంత్రం.

బిక్కుబిక్కుమంటూ వెళ్ళారందరూ.

ఆయన చేతిలో ఏవో సైన్స్ సంబంధించి పుస్తకాలున్నాయ్.

"మీరు నాకు పన్నెండువందల జీతం ఇస్తున్నప్పుడు- ఆ జీతం విలువకు సరిపడేంత సేవ మీకు చేయాలి. తప్పదు. అందుకే అన్ని సైన్స్ పీరియాడికల్స్ ఫాలో అవుతున్నాను. ఈ మధ్యనే వెలికి తీయబడ్డ కొన్ని నిజాలు తెలుసుకోండి.

వంకాయలు ఎక్కువగా తింటే ఆస్తమా వస్తుంది.

నూనెలో వేయించిన పదార్థాలు ఎక్కువగా తింటే కేన్సర్ వస్తుంది.

ఉప్పూ, కారం, పులుపూ ఎక్కువగా తింటే అల్సర్ వస్తుంది. లేదా బి.పి. వస్తుంది.

కనుక ఈ రోజు నుంచీ అందరూ ఈ నియమాలు పాటించి కాన్సర్ నుంచి రక్షణ పొందుతారని ఆశిస్తాను. నేను ఇవన్నీ చిన్నప్పటినుంచి ఫాలో అవబట్టే ఇంతవరకు ఎలాంటి అల్సర్లూ, కేన్సర్లూ లేకుండా సుఖంగా ఉన్నాను-"

సమావేశం ముగిసింది.

అందరూ బరువెక్కిన హృదయాలతో ఇళ్ళు చేరుకున్నారు.

ఆ తరువాత రెండు వారాల పాటు డాక్టర్ గారు అందరిళ్ళకూ లేటెస్టు మెడికల్ బులెటిన్స్ పంపించసాగారు.

1. ఉల్లిపాయలు వాడడం వల్ల గుండె జబ్బులు వచ్చును.

2. బీరకాయలు తినడం వల్ల లో బ్లడ్ ప్రెషర్ వచ్చును.

3. మాంసం తినడం వల్ల పక్షవాతం మరియు గుండెపోటు తప్పదు.

4. కోడిగుడ్లు, గడ్డపెరుగు తినడం వల్ల హార్ట్ ఎటాక్ కేరింతలు కొడుతూ వస్తుంది.

5. దుంపకూరలు లివర్ కి సంబంధించిన వ్యాధుల్ని ప్రోత్సహించును.

ఆ తరువాత రెండు వారాలు కాలనీ అంతా గగ్గోలెత్తిపోయింది. అందర కూరలు పూర్తిగా వాడడం మానేశారు. ఏ కూర వండినా ఎవరొకళ్ళు ఏదొక జబ్బు పేరు చెప్పడంతో కెవ్వున కేకవేసి కూర బయటపడేయటం జరుగుతోంది. కొంతమంది కేవలం పాలు త్రాగి బ్రతుకుతున్నారు. ఇంకొంతమంది. ఉప్పుకారం లేని పప్పు మాత్రమే వాడసాగారు.

పిల్లలందరూ తినుబండారాల కోసం ఏడుపులు, పెడబొబ్బలు, భార్యా భర్తలు ఊరికూరికే దెబ్బలాటలు- నానా రభసగాను తయారయింది.

ఈ ఆరోగ్య నిబంధనలేమీ పట్టించుకోకుండా అన్ని కూరగాయలు - అన్ని రకాల నాన్ వెజిటేరియన్ పదార్థాలు - శుభ్రంగా తిని సుఖంగా తిరుగుతోన్న జీవి ఒక్కడే కనబడ్డాడు నాకు. అతడు బగారా బైగన్ వెంకట్రావ్.

ఈ పరిస్థితి చాలా దారుణంగా కనిపించింది నాకు. గోపాలరావ్, నేనూ కాలనీ, ప్రెసిడెంట్, శాయిరామ్ కలిసి డాక్టరు గారిని కలుసుకుని మా బాధలన్నీ వివరించి ఆయన విధించిన నిబంధనలు పునఃపరిశీలించమని కోరాము.

"నోనోనో- నాటెటాల్! ఆరోగ్య సూత్రాలన్నాక అమలుపరచడం కష్టంగానే ఉంటాయ్! నన్ను చూడండి ఆరోగ్య సూత్రాలు పాటించడం వల్లే యాభై అయిదేళ్ళు ఎలాంటి రోగం, ఆఖరికి జలుబుకూడా లేకుండా గడపగలిగాను. అంతేగాదు, మరో యాభై ఏళ్ళు కూడా ఇలాగే ఆరోగ్యంగా గడిపేయగలను. మీకు నాలాంటి ఉక్కు ఆరోగ్యం కావాలో లేక ఈ రోగాలను కలిగించే ఆహార పదార్థాలు కావాలో - ఎన్నుకోండి" అన్నాడాయన.

చేసేది లేక తిరిగి వచ్చాము.

మర్నాడు ప్రొద్దునే శాయిరామ్ న్యూస్ పేపర్ పట్టుకుని పరుగుతో వచ్చాడు హడావుడిగా.

"చూశారా! పేపర్లో ఏం రాశారో! అమెరికాలో ఈ మధ్య వంద మందికి కోడిగుడ్లు, గడ్డ పెరుగు రోజూ తినిపించారట- మిగతా సగం మందికీ ఆ మూడు నెలలూ అవి అందుబాటులో లేకుండా చేశారట! తరువాత అందరినీ పరీక్షిస్తే ఏం తేలిందో తెలుసా? రోజూ గుడ్లూ, గడ్డ పెరుగు తిన్నవాళ్ళు, వాటిని ఏమాత్రం తినని వాళ్ళకంటే ఎక్కువ ఆరోగ్యంగా ఉన్నారంట! వారి గుండె ఏ బాదరబందీ లేకుండా పెండ్యులమ్ లాగా స్టడీగా కొట్టుకుంటోందంట-"

ఆ వార్త విని కొంతమంది హాపీగా ఫీలయ్యారు.

అందరం డైలమాలో పడి డిస్కస్ చేసుకోవడం మొదలుపెట్టాం-

అందరం ఇంకా తర్జనభర్జనలు పడుతూండగానే డాక్టర్ వచ్చేశాడు.

మా గొడవంతా విని చిరునవ్వుతో ఇంకో జర్నల్ తీసి చూపించాడు.

అందులోని ఒక ఆర్టికల్ తనే చదివి వినిపించాడు.

జర్మనీలో రెండు చుంచు ఎలుకల మీద చేసిన ఎక్స్ పెరిమెంట్ లో గుడ్డూ, పెరుగూ ఇతర కొవ్వుపదార్థాలు తిన్న చుంచుకి హార్ట్ ఎటాక్ వచ్చిందట! తినని ఎలుక హాపీగా కేరింతలు కొడుతూ తిరుగుతోందిట!

అందరూ మళ్ళీ నిరుత్సాహపడిపోయారు. కాలనీలో పెరుగు గుడ్ల వాడకం మూడొంతులు పడిపోయింది- నెయ్యి పేరు వింటేనే పారిపోతున్నారు కొంతమంది.

మరుసటి వారంలో ఇంకో బాంబు పేల్చాడు డాక్టరు.

కాఫీలు, టీలు తక్షణమే మానివేయాల్సిందేనని-

వాటివల్ల గ్యాస్, ఎసిడిటీతోపాటు కొవ్వు కూడా పెరిగి రకరకాల వ్యాధులకు దారి తీస్తుందట-

కాలనీ వాళ్ళందరం కాఫీలు, టీలు మానడానికి పదిరోజులు నానా చావూ ఛావాల్సి వచ్చింది. చివరకు అవి మానేయటం చేతకాక రోజు కొక్కసారే తాగే ఏర్పాటు చేసుకున్నాం. దాంతో అందరినీ నీరసం ఆవహించింది. ఆ తరువాతి వారంలో ఇంకో బాంబు పేల్చాడు- డాక్టర్.

"వెంటనే అందరూ ఆహారంలో కాలరీలను తక్కువగా తీసుకోవటం చాలా అవసరం! దాని వల్ల చెడు కొలస్ట్రాల్, రక్తపోటు తగ్గిపోతాయ్. అలాగే మంచి కొలస్ట్రాల్ పెరుగుతుంది.

ఉదాహరణకు షుమారు అయిదువందలు కాలరీలు తగ్గిస్తే కొలస్ట్రాల్ 120కి తగ్గిపోతుంది. చెక్కెర 65కి పడిపోతుంది. బి.పి. నార్మల్ కి వచ్చేస్తుంది. బాడీ వెయిట్ కూడా తగ్గిపోతుంది. ఇంకా ముఖ్యమయిన విషయం ఏమిటంటే కేన్సర్ పెరిగే వేగాన్ని ఇది తగ్గించేస్తుంది. నన్నడిగితే వారానికి మూడు రోజులు ఉపవాసం ఉండండి! సర్వరోగ నివారిణి అంటే ఉపవాసం ఒక్కటే!

ఈ రోజు నేనింత ఆరోగ్యంగా ఉన్నానూ అంటే కారణం ఏమిటి? ఉపవాసాలు! ఛాన్స్ దొరికితే చాలు! ఉపవాసం చేస్తాను-"

అందరూ నీరసంగా తప్పట్లు కొట్టారు.

ఆరోజు నుంచీ కాలనీలో అందరికీ తిండి పడిపోయింది. మనకిష్టమయిన పదార్థం ఏది తిందామన్నా డాక్టర్ గొంతు ఎక్కడినుంచో ఖంగున వినపిస్తోన్నట్లుంది. కొంతమంది మాత్రం ఉపవాసాలు చేయటం మొదలుపెట్టారు.

దాంతో విపరీతమయిన ఆకలి, నీరసం-

ఆ విషయమే డాక్టర్ తో చెప్పారు నెక్ట్స్ మీటింగ్ లో-

"ఆకలి వేయటం చాలా మంచి విషయం! మీరిప్పుడిప్పుడే పట్టు సాధిస్తున్నారన్నమాట! ఏ మాత్రం వెనుకంజ వేయకండి! ఆకలి తట్టుకోలేని పరిస్థితి వచ్చినప్పుడల్లా రెండు గ్లాసుల మంచి నీళ్ళు తాగండి! నన్ను చూడండి! ఎప్పుడు భుజానికి వాటర్ బాటిల్ తగిలించుకునే వుంటాను."

ఎవరు ఏమీ మాట్లాడలేదు.

డాక్టర్ ఎంత కన్విన్సింగ్ గా చెప్తున్నా ఎందుకో అందరికీ అసంతృప్తిగా ఉంది.

"అంతేకాదు! మీరంతా రోజుకి ఆరు కిలోమీటర్ల దూరం వేగంగా నడవాలి! అప్పుడే ఇంతకాలం మీలో పేరుకుపోయిన ఫాట్స్ కరిగిపోయి అద్భుతమయిన ఆరోగ్యంతో నవనవలాడిపోతారు-"

డాక్టర్ వెళ్ళిపోగానే అందరు గొణుక్కోవటం వినిపిస్తూనే ఉంది. "మావల్ల కాదు వాకింగ్" అన్నారు కొంతమంది-

అయితే ఆ గొడవ అక్కడితో ఆగలేదు. కాలనీలోని ఆడాళ్ళందరూ కూడపలుక్కుని డాక్టరుగారి సలహాలన్నింటికీ తిలోదకాలివ్వాలని నిర్ణయించారు. మళ్ళీ కాలనీ మీటింగ్ ఏర్పాటు చేసి దానికి డాక్టరు గారిని ఆహ్వానించాము.

"డాక్టరు గారొచ్చాక మనందరం ఇంత కఠినమయిన నిబంధనలు పాటించడానికి సిద్ధంగా లేమని తెలియజేద్దాం" అంది రాజేశ్వరి.

"అవును. ఉప్పు, కారం, కాయగూరలు లేని భోజనం తినడం మా వల్లకాదు" అంది పద్మావతి గారు.

"ఎప్పుడో ఏవో జబ్బులొస్తాయని జీవితమంతా ఇలాంటి రుచి పచీలేని ఆహారం తినమంటే ఎలా?" అంది జయప్రదాదేవి.

శాయిరామ్ మైకు ముందుకొచ్చాడు.

"అలా తొందరపడకండి. డాక్టరుగారు ఇవన్నీ చిన్నప్పట్నుంచి ఆచరించబట్టే అంత ఆరోగ్యంగా ఉన్నారన్న విషయం మనం ఇప్పుడు గుర్తుంచుకోవాలి. కనుక మనకి కూడా అంత మంచి ఆరోగ్యం కావాలంటే అవన్నీ అవలంబించక తప్పదు మరి."

ఈ లోగా డాక్టరుగారి ప్యూన్ హడావుడిగా సైకిల్ మీద వచ్చాడక్కడికి.

వాడితో జనార్ధన్, శాయిరామ్ కలసి చాలాసేపు ఏదో విషయం మాట్లాడి మైకు దగ్గరకొచ్చాడు. మళ్ళీ.

"సోదర సోదరీమణులారా! మీకో దుర్వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నాను. మన కాలనీ డాక్టరు గారు ఇవాళ మధ్యాహ్నం పౌష్టికాహార లోపంవల్ల, హఠాత్తుగా కొలాప్స్ అయి శాశ్వతంగా మనల్ని వదిలిపోయారట. కనుక మనందరం ఓ నిముషం పాటు లేచి నిలబడి ఆయన ఆత్మకు శాంతి కలగటం కోసం మౌనం పాటిద్దాం-"

అంతా లేచి మౌనం పాటించారు ఎంతో శ్రద్ధతో.

ఆ తరువాత పెద్ద ఎత్తున కోలాహలం చెలరేగింది.

"ఇంకానయం- ఇంకొన్నాళ్ళు ఆయన చెప్పినట్లు చేస్తే మనమూ అలాగే ఎగిరిపోయేవాళ్ళం-"

అంటోందొకావిడ.

* * * * *

## సినిమా రాజ్యంలో ఓ రోజు

సినిమా తారలందరూ రాజకీయాల్లోకి వలసపోతున్నారు. పార్లమెంటులో అసెంబ్లీల్లో సినిమా నటీనటులు నిండిపోయే రోజు ఎంతో దూరంలేదు. అలా జరిగినప్పుడు సినిమా రాజ్యంలో- ఓ రోజు-

ఇక చదవండి :

మా కాలనీలో ప్రభుత్వం ఇటీవలే ఏర్పాటు చేసిన కమ్యూనిటీ టీవీ సెట్ పెద్ద సౌండ్ లో మోగసాగింది.

"తెలుగు వీర లేవరా...."

రోజూ ఆ పాటతో ప్రజలంతా నిద్రలేవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వటం చేత నేను లేచి టైమ్ చూసుకున్నాను. అయిదున్నరవుతోంది. ఇంకా చీకటిగానే ఉంది బయట.

"ఏవండోయ్- బ్రాందీ తెమ్మంటారా. విస్కీ తెమ్మంటారా?" లోపల్నుంచి అరచింది మా ఆవిడ.

"బ్రాందీ!" అన్నాన్నేను.

"బ్రాందీ వద్దు మమ్మీ! విస్కీ కావాలి! విస్కీ-" అరచారు పిల్లలు.

ఈ గొడవ రోజూ ఉండేదే! ఒకోళ్ళకూ ఒకోరుచి.

మా ఆవిడ రెండు సీసాలు తీసుకొచ్చి ఎవరికేది కావాలో వాళ్ళకది గ్లాసునిండా పోసి ఇచ్చింది.

"మరి నువ్వు తాగవేం?" అడిగాన్నేను.

"నేను రమ్ము తాగేశానండీ ఇందాకే! ఈ మూడింట్లోనూ అదే మంచిదన్నాడు డాక్టరు..." అందామె.

సినిమా రాజ్యం వచ్చాక ప్రజలందరూ కూడా సినిమా ఫీల్డులో ఉండే అలవాట్లు చేసేసుకున్నారు. మరి ఆ ఫీల్డులో తెల్లవారుజాము నుంచీ అర్థరాత్రి వరకూ రమారమి అందరూ బాగా అలవాటుపడేది మందుకే గదా! అందుకే ప్రభుత్వం బ్రాందీ, విస్కీ, రమ్ములాంటివి రేషన్ కార్డుమీద కారు చవగ్గా అందజేస్తున్నారు. ఎల్లో కార్డు ఉన్న వాళ్ళకు పెద్ద బ్రాందీ డ్రమ్ పదహార్రూపాయలు! గ్రీన్ కార్డు వాళ్ళకు అదే ముప్పయ్ రూపాయలు.

పిల్లలు విస్కీ తాగటం ముగించి మొఖాలు కూడా దాన్తోనే కడుక్కొని సిగరెట్లు తాగుతూ కమ్యూనిటీ టీవీలో మొదలయిన "విచిత్రహార్" ప్రోగ్రాం చూడసాగారు.

రోజూ ఉదయం ఆ ప్రోగ్రామ్ లో పార్లమెంట్ సభ్యుల తాలూకు విభిన్న చలనచిత్ర పాత్రల్ని- విభిన్న సినిమాల నుంచి కొంచెం కొంచెం చూపిస్తారు.

ఆఖర్లో ఆ సభ్యుడు వచ్చి రెండు ముక్కలు మాట్లాడతారు.

ఆ రోజు "ఫాల్తూ ఆద్మీ" అనే హిందీ సినిమాలోని చలనచిత్ర నటుడు మాట్లాడుతున్నాడు.

"సినిమాల్లోకి రాకముందు నేను జేబులు కొడుతూండే వాడిని! ఓసారి ఓ డైరెక్టర్ జేబు కొడుతూండగా ఆయన నన్ను పట్టుకుని సినిమాల్లో జేబులుకొట్టే పాత్ర ఇచ్చారు. ఆ రోజు నుంచీ అన్నీ అవే పాత్రలు. ఈలోగా ఎలక్షన్లు వచ్చాయ్. ఓ నామినేషన్ పత్రం పడేశాను. అంతే అద్భుతమయిన మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపించారు!"

మరి కాసేపటికి పిల్లలు పంచరంగుల డ్రస్ లు వేసుకుని స్కూల్ కి బయల్దేరారు. ఇప్పుడు ఇదివరకులాగా వాళ్ళు ఒకే రకం యూనిఫారం వేసుకోనక్కర్లేదు. ఎవరిష్టమొచ్చినా కాస్ట్యూమ్స్ వాళ్ళు వేసుకోవచ్చు. ఆ కాస్ట్యూమ్స్ అయిదు రంగులుంటే చాలు.

నేనూ కాస్ట్యూమ్స్ వేసుకుని భోజనం చేసేసరికి రంగారెడ్డి శాయిరామ్, గోపాల్రావ్, జనార్ధన్, యాదగిరి వచ్చేశారు.

"త్వరగా పద మ్యూజిక్ మొదలయిపోయింది" అన్నాడు రంగారెడ్డి.

నగరంలోని అన్ని ఏరియా కమ్యూనిటీ సెంటర్స్ నుంచీ ఆఫీసులకు వెళ్ళే ప్రజల కోసం దేశభక్తిని ప్రేరేపించే పద్ధతిలో మ్యూజిక్ వినిపిస్తారు. నలభై నిముషాల వరకు నగరమంతా ఆ మ్యూజిక్ అలా వినిపిస్తూనే ఉంటుంది. అందరూ మ్యూజిక్ ఆగిపోయే లోపల ఆఫీసులకు చేరుకుంటేనే అటెండెన్స్ రిజిష్టర్ లో సంతకం చేయనిస్తారు. లేకపోతే ఆ రోజుకి ఆబ్సెంటే!

మేము ఆఫీస్ లోకి అడుగు పెడుతూండగా మ్యూజిక్ ఆగిపోయింది. ఎదురుగ్గా ఉన్న 70 ఎం.ఎం తెరమీద టైటిల్స్ వేయడం ప్రారంభమయింది. ఆ రోజు మా ఆఫీస్ మేనేజర్ ఎవరూ, మా డిపార్ట్ మెంట్ కి సెక్రటరీ ఎవరూ, మంత్రి ఎవరూ అనేవి టైటిల్స్ లో వస్తాయి.

ఆ తరువాత ఆ రోజు డీల్ చేయాల్సిన ఫైల్స్ ని చూపిస్తారు. వాటిల్లోనే పెండింగ్ లో ఉండి శతదినోత్సవాలు చేసుకున్న ఫైల్సూ, ఫ్లాప్ ఫైల్సూ, షూటింగ్ లు ఉన్న ఫైల్సూ అన్నీ కనిపిస్తాయ్.

ఆ తరువాత మా శాఖకు చెందిన మంత్రిగారు నటించిన చిత్రాల్లోని కొన్ని భాగాలు మేము విధిగా చూడాలి. మిస్సయితే ఫైన్ వేస్తారు.

మంత్రిగారు చేసిన ఫైట్ ఆఖర్లో చూపిస్తారు.

తన ఆదేశాలను ధిక్కరించే క్లర్క్ లు అలాంటి ఫైట్ కి సిద్ధపడి ఉండాలన్న హెచ్చరిక ఆఖర్లో వస్తుంది.

ఆ సీను చూడ్డం అయాక ఎవరి సీట్స్ లో వాళ్ళు కూర్చున్నాం.

అదే సమయంలో మా చీఫ్ క్లర్క్ మేకప్ రూమ్ నుంచి అందరికీ అభివాదం చేస్తూ బయటికొచ్చాడు.

యాభై అయిదేళ్ళ మనిషల్లా ఇప్పుడు ఆ మేకప్ లో పాతికేళ్ళ కుర్రాడిలా కనబడుతున్నాడు.

మేమంతా కూడా మేకప్ రూమ్ లోకి పరుగెత్తి త్వరత్వరగా మొఖానికి రంగులేసుకుని, తలకు విగ్గులు పెట్టుకుని బయటికొచ్చాము.

డిపార్ట్ మెంట్ టీవీ స్క్రీన్ మీద ముఖ్యమంత్రి దేశభక్తి గీతం ప్రారంభమయింది.

"మనమంతా ప్రజల సేవకులం- కాంట్రాక్టర్లనూ గూండాలనూ ప్రేమతో జయిద్దాం! రాష్ట్రాన్ని నందనవనంగా మారుద్దాం" అంటూ పాట ముగిసింది. ఆ తరువాత ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న (ముఖ్యమంత్రి హీరోగా నటిస్తున్న) చిత్రంలో కొన్ని సీన్లు చూపిస్తున్నారు.

మా ఉద్యోగులంతా ఆ సీన్లు చూడటం చాలా అవసరం.

ఎందుకంటే మాకు ప్రమోషన్స్ వచ్చేందుకు పెట్టే డిపార్ట్ మెంట్ పరీక్షల్లో రాబోయే ముఖ్యమంత్రి చిత్రాల్లోని పాత్రల గురించీ, సీన్స్ గురించీ కొశ్చెన్స్ ఉంటాయ్.

అప్పుడు ఎంటర్ టెయిన్ మెంట్ సాంగ్ మొదలయింది.

ఆఫీస్ సూపర్నెంట్ నిజంగా పాతికేళ్ళ కుర్రాడి లాగానే సీనియర్ లేడీ క్లర్క్ తో పాటు విగురుతూ, మా అందరి టేబుల్స్ మీద నుంచీ పరిగెడుతూ డాన్స్ చేశాడు.

ఆయన ఆదేశాల మేరకు మేమంతా కూడా ఆ పాటకు కోరస్ పాడాం!

పాట అయిపోయింది. అందరం తప్పట్లు కొట్టి విజిల్స్ వేశాం. అప్పుడు ఆఫీస్ పని మొదలయింది. స్పీకర్ తో బాక్ గ్రౌండ్ మ్యూజిక్ స్లోగా మొదలయి, క్రమేపీ వేగం పుంజుకుని ఆఖరికి బాగా స్పీడ్ అయిపోతుంది.

ఎందుకంటే మా ఆఫీస్ వర్క్ కూడా ఆ మ్యూజిక్ తగ్గట్టుగా ఫాస్ట్ గా చేయాలని మా సినిమా ప్రభుత్వం రూల్. అందరం మ్యూజిక్ కి తగ్గట్లుగా, ఫైల్స్ లో నోట్స్ రాసేస్తూ, ఫైల్స్ తీసుకుని ఒక టేబుల్ నుంచి ఇంకో టేబుల్ దగ్గరకు డాన్స్ స్టెప్స్ తో పరుగెడుథూ వర్క్ చేస్తున్నాం! మధ్యాహ్నం ఒంటిగంటకు హఠాత్తుగా మ్యూజిక్ ఆగిపోయింది.

'హమ్మయ్య' అనుకున్నాం- అందరం చెమటలు తుడుచుకుంటూ.

మేము కాంటీన్లో కెళ్ళగానే "ఇడ్లీ వడే మాకు విందు భోజనం- టీ నీళ్ళే అమృతం- వీటితోనే దేశాన్ని సేవిస్తాం! ప్రజలను నెత్తి కెక్కించుకుంటాం" అన్న పాట బాక్ గ్రౌండ్ లో వినబడుతోంది.

సాయంత్రం అయిదయేసరికి రాష్ట్ర గవర్నర్ టీవీ స్క్రీన్ మీద కనిపించారు. అందరం లేచి నిలబడగానే గవర్నర్ విలన్ గా నటించిన ఓ చిత్రంలో గవర్నర్ స్వయంగా పాడిన పాట మొదలయింది.

"మేరే అంగనేమే తుమ్హారా క్యా కామ్ హై" అనే ట్యూన్ లో ఉందా పాటంతా.

పాట పూర్తవగానే గవర్నర్ విలన్స్ తో ఫైటింగ్ చేసిన కొన్ని సినిమాల్లోని దృశ్యాలు చూపించారు.

అవన్నీ పూర్తవగానే అందరం "జై సినిమా! జై హింద్! శుభం" అంటూ నినాదం చేసి మేకప్ రూమ్ లోకి పరుగెత్తి మేకప్పూ, విగ్గులూ అన్నీ తీసేసి ఇళ్ళకు బయల్దేరాం.

బస్ స్టాప్ లో ఎంతసేపు నిలబడ్డా 'నటసార్వభౌమ' అనే బస్ మాత్రం రాలేదు. అన్నట్లు సినిమా రాజ్యంలో బస్ లకు నెంబర్లుండవ్. సినిమా నటీనటుల పేర్లు, వాళ్ళ బిరుదులూ, ఇవే ఉంటాయి. మా కాలనీకి నటప్రపూర్ణ బస్ లో బయల్దేరాం. ఆ బస్ "సంసారసంగమం" బస్ డిపో మీదుగా ప్రతిఘటన కాలనీ, అమెరికా అల్లుడు నగర్, ఎదురింటి మొగుడు, పక్కింటి పెళ్ళాం బ్రిడ్జి మీద నుంచీ మా కాలనీ చేరుకుంది.

కాలనీకి చేరుకునేసరికి మా కాలనీ లేడీస్ అందరూ అడవి కన్యల డ్రస్ వేసుకుని, అడవి జాతి స్త్రీలు చేసే ట్రైబల్ డాన్స్ చేస్తూ మా అందరికీ స్వాగతం పలికారు. ఆ పాట మధ్యలోనే అందరికీ 'టీ' కప్పులు కూడా అందించేశారు.

ప్రభుత్వోద్యోగులందరూ ఇళ్ళు చేరుకునేటప్పటికి వాతావరణం ఆహ్లాదకరంగా కనిపించాలని ఇదంతా ప్రభుత్వ ఆస్థాన కొరియోగ్రాఫర్ చేసిన ఏర్పాటు! ఆ తరువాత కాలనీలో యంగ్ గాళ్స్ అందరూ కలసి లేటెస్ట్ సినిమా బూతుపాటని అంగాంగ అభినయంతో పాడి అందరిని అలరింపజేశారు. ఆ పాట రాసిన లిరిక్ రైటర్ వెంటనే టీవీ స్క్రీన్ మీద కనబడి తను ప్రభుత్వాదేశాల మేరకు ఎంత కష్టపడి ఆ పాట రాసిందీ వివరించాడు.

"ఈ పాటను నేను ఒక ఛాలెంజ్ గా తీసుకున్నాను. ఎందుకంటే ఈ సినిమా రాజ్యానికి నావంతు తోడ్పాటు నేనందించాలి కదా!

అందుకే దేశంలోని రెడ్ లైట్ ఏరియాస్ అన్నీ తిరిగి, బూతుపాటలన్నీ సేకరించి వాటి మీద రీసెర్చ్ చేసి మరీ ఈ పాట రాశాను-"

ఆ కార్యక్రమం ముగుస్తూండగానే మా కాలనీలో కొంతమంది ప్రభుత్వం అఫీషియల్ గా ఏర్పాటు చేసిన సెకండ్ సెటప్ ఇళ్ళకు వెళ్ళిపోయారు. సెకండ్ సెటప్ లను ఎంకరేజ్ చేయటమే కాకుండా సెకండ్ సెటప్ ఉన్న ప్రతి ఉద్యోగికీ జీతం పైన మరో యాభైశాతం జీతం 'ఎక్ స్ట్రా అలవెన్స్' పేరు మీద ఇస్తుంది.

ప్రతి మగాడికీ ఇద్దరు పెళ్ళాలున్న దేశంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయన్నది మా సినిమా రాజ్యం స్లోగన్.

హఠాత్తుగా గోపాల్రావ్ వాళ్ళ చిన్నిగాడు కొంపలు మునిగిపోయినట్టు ఏడుపు మొదలెట్టేసరికి అందరం వాడింటివేపు పరుగెత్తాం.

తీరా చూస్తే గోపాల్రావే వాడిని పట్టుకుని చితగ్గొడుతూ కనిపించాడు.

శాయిరామ్, రంగారెడ్డి వాడిని పట్టుకుని చిన్నిగాడిని రక్షించారు.

"సంగతేమిటి?" అడిగాన్నేను.

"ఈ రాస్కెల్ ని చూడండి! ఫైనల్ ఎగ్జామ్స్ చెడగొట్టేశాడు..." అన్నాడు కోపంగా వాడి కొశ్చెన్ పేపర్ విసిరికొడుతూ.

"లేదంకుల్ అన్నీ బాగానే రాశాను. ఒక్క కొశ్చెన్ రాయలేదు."

శాయిరామ్ ఆ కొశ్చెన్ పేపర్ అందుకున్నాడు.

"సినీ నటబ్రహ్మ- ప్రముఖ సినీనటుడు- నేటి మంత్రివర్యులు- శ్రీరంగ జీవిత చరిత్ర క్లుప్తముగా వ్రాయుము! దీనికేం రాశావ్ రా?"

వాడు అడిగిందే తడవుగా గడగడ చదివేయసాగాడు.

సినీ నటబ్రహ్మ శ్రీ రంగా- 1950లో రైతు-నాగలి చిత్రం ద్వారా సినిమా రంగమునందు ప్రవేశించి పదిహేను సంవత్సరాలపాటు మూడొందల తొంభయ్ చిత్రాల్లో నటించి భారతదేశానికీ, భారత ప్రజలకూ ఎనలేని సేవ చేశారు.

వీరు నటించిన చిత్రంలో "రౌడీ వెధవ" మేనత్త చెల్లెలి మొగుడు-దానమ్మకు యముడు" "దగుల్బాజీ నాయాలు" "పొగరుబోతూ పుండాకోర్" చిత్రాలకు ఎన్నో ప్రభుత్వ అవార్డ్ లు వచ్చాయ్..."

"చూశావా-చూశావా! దొంగబాడుకవ్, కత్తి పట్టిన కిరాతకపు ముండాకొడుకు" సినిమాల సంగతి మర్చిపోయాడు. రెండొందల డెబ్బై రోజులు ఆడిన మొదటి సినిమారా అది అని చిలక్కు చెప్పినట్లు చెప్పాను. దీనికి భారత ప్రభుత్వ అవార్డులు కూడా వచ్చాయ్-" మండిపడుతూ అన్నాడు గోపాల్రావ్.

"నాకా బూతుమాట గుర్తు రాలేదు డాడీ!-"

"ఛట్ వెధవా! ఇప్పుడు చూడు ఎనిమిది మార్కులు గోవిందా-"

శాయిరామ్ ఇంకో ప్రశ్న చదివాడు.

"ప్రఖ్యాత నటి కాంతిశ్రీకి పద్దెనిమిదవ వివాహం ఎప్పుడు ఎవరితో జరిగినది? మిగతా పదిహేడుగురు భర్తల పేర్లేమి? వారిలో ఇంకా ఇప్పటికీ బ్రతికున్నవారెవరు?"

యాదగిరి చప్పున వాళ్ళబ్బాయి రమేష్ గాడిని ఈడ్చుకొచ్చాడు.

"ఒరేయ్ నువ్ చెప్పరా దీనికి సమాధానం! నువ్వేం రాశావో- ఎలా రాశావో తేలుస్తానిప్పుడు" అన్నాడు వాడితో.

రమేష్ కళ్ళు మూసుకుని ఓ క్షణం ఆలోచించి అప్పజెప్పసాగాడు.

"శ్రీమతి కాంతిశ్రీకి పద్దెనిమిదవ వివాహము 'మురుగా మహేశన్'తో 1982వ సంవత్సరంలో వాళ్ళ ఊళ్ళోనే పాడుబడ్డ గుళ్ళో జరిగెను, ఆమె పాత భర్తల పేర్లు సంపత్, కుమార్, శ్రీశైలేశ్వరరావ్........"

శాయిరామ్ వాడి నోరు మూసేసి ఇంకో ప్రశ్న చదివాడు బిగ్గరగా.

ఈ క్రింది ఖాళీలను పూరింపుము.

'అడవిజలగ' చిత్రమునకు సహాయ దర్శకుడిగా పనిచేసిన వారు- డాష్-డాష్-డాష్- ఎవర్రా!"

"నువ్వు చెప్పరా!"

నేను మా కిరణ్ గాడిని అడిగాను ఈసారి.

"సన్యాసిరావ్" అన్నాడు తక్షణం వాడినెత్తిన ఒక్కటిచ్చాడు గోపాల్రావ్.

"సన్యాసిరావ్ కాదురా వెధవా! సింగినాథ్ రావ్! రాత్రేగా మీ అందరకూ ఈ కొశ్చెన్స్ 'ఇంపార్టెంట్ రా' అని చెప్పింది?"

వాడు ఏడ్పు మొఖం పెట్టాడు.

"ఈ క్రింది వాక్యమునకు సందర్భము వ్రాయము-" అంటూ మరో ప్రశ్న చదవసాగాడు యాదగిరి.

"అమ్మమ్మా! తాతయ్యా నువ్వూ మొదటిరాత్రి ఏం చేశారో మేము అదే చేశాం!" ఈ డైలాగు ఏ సినిమాలో ఎవరు, ఎవరితో, ఎప్పుడు, ఎందుకన్నారో వివరింపుము.

"ఛీ ఛీ ఛీ" అంది పార్వతీదేవి సిగ్గుపడిపోయి.

"పిల్లలకు ఇలాంటి డైలాగులా?"

"ఏడ్చినట్లుంది!" విసుక్కున్నాడు రంగారెడ్డి, రోజూ రేడియోలో 'మంగమ్మ గారి మనవడు' సినిమాలో మనవరాలు ఇదే డైలాగ్ పాట రూపంలో అమ్మమ్మతో అనటం వినటం లేదా? పైగా ఆ పాట పదేపదే వినిపించమని శాయిరామ్, జనార్ధన్ వీళ్ళందరూ జనరంజనిలో కోరటం నేను వినలేదనుకుంటున్నారా?"

ఎవరూ మాట్లాడలేదు.

యాదగిరి ఇంకో ప్రశ్న చదివాడు.

"వంగమాక - వంగమాక"

"కొట్టమాక- తిట్టమాక- కొట్టనివ్వు- తిట్టనివ్వు"

"లేత లేత చీకటీ, ముదురుతున్న ఆకలీ-
మత్తుమత్తుగా ఏదో వత్తిడీ-
మెత్త మెత్తగా ఏదో వత్తిడీ"

ఈ పాటలు ఏయే చిత్రములలోనివి? ఈ అద్భుతమయిన సాహిత్యమును సృష్టించిన గీత రచయిత, దర్శక మహాశయులు ఎవరు? వారి పూర్వ చరిత్ర ఏమి?

ఈ ప్రశ్నకు ముగ్గురు గడగడ సమాధానం చెప్పేశారు.

ఆఖరి ప్రశ్న చదివాడు శాయిరామ్.

"భారత దేశమునకు స్వాతంత్ర్యము ఎప్పుడు వచ్చెను? స్వాతంత్ర్యము సంపాదించుటకు పోరాడిన వారిలో ముఖ్యుల పేర్లు తెలుపుము?"

ఈ ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పలేకపోయారు.

"ఏమిట్రా ఇంత ఈజీ ప్రశ్నకు ఆన్సర్ తెలీదా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇది ఈజీ ఏమిటంకుల్? చాలా టఫ్ కొశ్చన్! మా క్లాసులో ఎవ్వరూ రాయలేకపోయారు! తెలుసా?"

శాయిరామ్ విరగబడి నవ్వాడు.

"ఈ మాత్రం ఆన్సర్ క్లాసులో ఎవ్వరికీ తెలీలెదాఁ పిచ్చి వెధవల్లారా? అదేదో తెలుగు సినిమా వచ్చింది చూడూ! పేరు గుర్తులేదు!

అది రిలీజయిన రోజే మనకు స్వాతంత్ర్యం కూడా వచ్చింది!"

అందరం ఒకరి మొఖాలొకరు చూచుకున్నాం!

అందరికీ ఆ సినిమా పేరు నోట్లోనే ఆడుతోంది గానీ- గుర్తు రావటం లేదు.

"మహాత్మాగాంధీ గురించి వ్రాయుము, పోనీ ఇదయినా రాశారుట్రా?" అడిగాడు గోపాల్రావ్.

"ఓ! చాలా ఈజీడాడీ!" అన్నాడు చిన్నిగాడు హుషారుగా, "క్లాసులో అందరం పేజీ ఫుల్ గా రాసేశాం!"

"ఏమని రాశారు?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

మహాత్మాగాంధీ గురించి మేమే అంతా మర్చిపోయాం! వీళ్ళకెలా గుర్తుందో తెలీటం లేదు.

రమేష్ గాడు ఠక్కున చెప్పటం ప్రారంభించాడు.

"మహాత్మాగాంధీ అసలు పేరు బెన్ కింగ్స్ లే! ఇతను భారతీయుడే గాని బ్రిటీష్ పౌరుడు. వీరికి "మహాత్మాగాంధీ" అనే సెంటిమెంట్ పిక్చర్ లో హీరోగా నటించినందుకుగ్గాను ఆస్కార్ అవార్డు లభించింది. వీరితోపాటు హీరోయిన్ గా నటించినామె కూడా భారతీయురాలే! ఆమె పేరు రోహిణి హట్టన్ గడి..."

"మరి డ్రాయింగ్ పరీక్ష కూడా అయింది కదూ?" అడిగింది పార్వతీదేవి.

"అయిందాంటీ!" ఉత్సాహంగా చెప్పారందరూ.

"ఏం బొమ్మ గీయమన్నారు?"

"ఏదయినా మీ కిష్టమొచ్చిన బొమ్మ గీయమన్నారాంటీ! క్లాసులో అందరం సిల్క్ స్మిత' బొమ్మ గీసాం! అదయితే తేలిక కదాంటీ! కాస్ట్యూమ్స్ కూడా ఎక్కువ గీయనక్కర్లేదు."

అందరం ఇళ్ళకు చేరుకున్నాం మళ్ళీ.

రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నరూ- హీరో విలన్స్ లాగా ఫైటింగ్ చేసుకొన్న సినిమా ఒకటి కమ్యూనిటి టీవీలోకి ప్రారంభమయింది.

పిల్లలంతా విజిల్స్ వేసి "కొట్టూ కొడుకుని! కొట్టూ" అని అరుస్తున్నారు. సినిమా అయిపోయింది. కాసేపు మళ్ళీ ప్రధానమంత్రి నటించిన సినిమాలోని ఓ సన్నివేశం! కమ్యూనిటీ టీవీలో ప్రతి పావుగంటకూ ప్రధానమంత్రి నటించిన సినిమా సన్నివేశం ఒకటి చూపటం మామూలే!

ప్రభుత్వ ఆదేశం ప్రకారం రాత్రి ఏడింటికి దేశంలోని భార్యాభర్తలు అందరూ కమ్యూనిటీ గార్డెన్ లో డ్యూయెట్ పాడుతూ పరుగెత్తి డాన్స్ చేయాలి. అంచేత, నేనూ, మా శ్రీమతి బయటకు పరుగెత్తాం- పాట కూడా మొదలయిపోయింది.

పావుగంటసేపు అదే పాట.

"ముక్కు మీద కోపం-"

డ్యూయెట్ అయిపోయాక సినిమాల్లో సెక్స్ డాన్స్ ల కోసమే తన జీవితం ధారపోసిన 'జ్యోతిలక్ష్మి' గుడికివెళ్ళి కొబ్బరికాయ కొట్టి, దణ్ణం పెట్టుకుని ఇంటికి చేరుకున్నాం!

కమ్యూనిటీ టీవీ ప్రత్యేక ప్రోగ్రాం ప్రసారం చేస్తోంది.

"జంట నగరాల్లో ఇవాళ సాయంత్రం వివిధ నటీనటుల "ఫిలిం ఫాన్స్ అసోసియేషన్స్" మధ్య చెలరేగిన దారుణ హింసాకాండలో రెండువందల డెబ్బయ్ మంది వరకూ మరణించారు. పధ్నాలుగు వేల మంది గాయపడ్డారు. ఇంకో లక్ష మంది జాడ తెలీటం లేదు-

అంచేత నగరంలో నిరవధికంగా కర్ఫ్యూ విధిస్తున్నట్లు స్టంట్ మాస్టర్ భీమా ప్రకటిస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అదే వయసు, అదే రూపం గల ఎక్ స్ట్రాస్ ని సప్లయ్ చేసి, ఆ కుటుంబీకుల దుఃఖాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర హోంమంత్రి, సినిమా ఎక్స్ ట్రా సప్లయర్ అయిన పిచ్చేశ్వర్రావ్ తెలియజేస్తున్నారు-"

* * * * *

## తెగులు వాచకము

మా నిర్భయ్ నగర్ కాలనీలో రాజకీయ కల్లోలం పూర్తిగా సద్దుమణిగిపోయింది. కొన్ని రోజులపాటు కాలనీలో మీటింగులూ, హడావుడులూ లేకుండా కాలనీని ప్రశాంతంగా ఉంచమని కాలనీ వాళ్ళు చాలా మంది ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాయిరామ్ ని అభ్యర్థించారు. అలాగేనని శాయిరామ్ వారికి హామీ ఇచ్చాడు గానీ- అలా ఏ కార్యక్రమమూ లేకుండా కాలనీని ప్రశాంతంగా ఉంచటం అతనికేంమాత్రం నచ్చలేదని అతని మొఖ కవళికలు చెప్తూనే ఉన్నాయ్.

కాలనీ రెండు రోజులు నిజంగానే ఎలాంటి గొడవలూ లేకుండా గడచిపోవటం చూసేసరికి నాకే ఆశ్చర్యం కలిగింది. ఆ రెండు రోజులూ శాయిరామ్ చాలా అశాంతిగా కాలనీలో ఒంటరిగా రాత్రి పొద్దుపోయే వరకు తిరగటం కిటికీ సందుల్లోంచి గమనించాను.

ఇంకేం ఫరవాలేదనీ, శాయిరామ్ ఆ ప్రశాంతతకు అలవాటు పడిపోయాడనీ కనుక ఇంకేమి డిస్టర్బెన్స్ ఉండదనీ నమ్మకం కలిగాక- నా కిష్టమయిన మంచి నవలలు లైబ్రరీ నుంచి తెచ్చుకున్నాను రోజూ- చదువుకోడానికని!

ఆ రోజు ఆదివారం.

"అందమయిన నిశ్శబ్దం" అనే నవల నాలుగు పేజీలు  చదివానో లేదో- హఠాత్తుగా బయట కేకలు వినిపించినయ్. కాలనీ వాళ్లందరూ పరుగెడుతున్న చప్పుడు! గుండె ఝల్లుమంది.

కాలనీలో మళ్ళీ ఏదో అవాంతరం ముంచుకొచ్చిందని తేలిపోయింది. అయినా పట్టించుకోకుండా నవల చదవడానికి ప్రయత్నించాను గానీ- మా తలుపు పగలగొట్టినంతగా బాదటం- వినిపించేసరికి వెళ్ళి తలుపు తెరవక తప్పలేదు. గోపాల్రావ్ నిలబడి ఉన్నాడక్కడ.

"త్వరగా పద! యాదగిరి పిలుస్తున్నాడు!" అన్నాడు.

"ఏం జరిగింది?"

"ఏమో తెలీదు? అర్జంటుగా అందరినీ పిలుచుకురమ్మన్నాడు."

ఇంక తప్పదని అతనితో బయల్దేరాను.

అప్పటికే ఆడా మగా, పిల్లా, పీచూ అందరితో కిక్కిరిసిపోయిందా ప్రాంతమంతా!

మధ్యలో శాయిరామ్, రంగారెడ్డి, జనార్ధన్ నిలబడ్డారు. వాళ్ళ రెండో అబ్బాయ్ ఉండుండి ముక్కుతుడుచుకుంటూ, జారిపోతున్న నిక్కరుని ఓ చేత్తో పైకి లాక్కుంటున్నాడు. చాలా భయంగా, ఆందోళనగా కనబడుతున్నాయ్ వాడి చిన్నారి ముఖంలో.

శాయిరామ్ మైక్ ముందుకొచ్చి నిలబడ్డాడు.

"సోదర సోదరీమణులారా! నిజానికి వారం రోజుల పాటు కాలనీని ప్రశాంతంగా ఉంచాలని చాలా మంది నన్ను హెచ్చరించారు! వారి కోరిక నెరవేర్చాలనే నేనూ ప్రయత్నిమ్చానుగ కానీ ఇంతలో ఇదుగో! యాదగిరికో విషమ సమస్య ముంచుకొచ్చింది. మీరంతా నిశ్శబ్దంగా ఉంటే ఆ సమస్యేమిటో చెప్తాను" అన్నాడు ఆనందంగా.

అంతా నిశ్శబ్దం అలుముకుంది. శాయిరామ్ యాదగిరి కొడుకుని ఎత్తుకుని స్టేజి మీద మైకు ముందు నిలబెట్టాడు.

"చెప్పరా రమేష్! నిన్న స్కూల్లో ఏం జరిగింది?" అడిగాడు శాయిరామ్.

"గిలి బక వలె సిల మరి కథ రుబ మనతసావలె!" అన్నాడు వాడు.

అందరూ విభ్రాంతితో ఒకరు మొఖం ఒకరు చూసుకున్నారు.

యాదగిరి భార్య కన్నీళ్ళతో పక్కనున్న డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి మీద వాలిపోయింది.

"ఇదే మాట అక్కా! పరేషాన్జేస్తుండు! అన్నీ గిసంటి మాటలే! మాకేమీ సమజ్ కావటం లేదు! ఉన్నదిద్దరు పోరలు! అందులో ఈడిట్ల పిచ్చి పట్టినెక్క జేస్తుండు!" ఏడుపు అతికష్టం మీద ఆపుకుంటూ అందామె.

"సైలెన్స్" అంటూ అరచాడు శాయిరామ్.

"ఒరే రమేష్- మీ టెక్ట్స్ పుస్తకంలోని తెలుగుపద్యం చదవమ్మా!"

"గిలీ పులీ- గిలీ గిలీ- పులిగిలీ- గిలిపులీ- పులిగిలీ-" అన్నాడు వాడు.

యాదగిరి కూడా కన్నీళ్ళు తుడుచుకున్నాడు వాడిని చూచి.

"ఇగో- రాత్రంతా గిదే ఒరులుడు భాయ్! నిన్న సాయంత్రం స్కూలుకెళ్ళి రాంగానే షురూ జేసిండు గీ మాటలు! నేను నా భార్య పరేషాన్! బరాల్, దిల్లగీల గట్ట యాక్షన్ చేస్తుండొచ్చని ఖ్యాల్ చెయ్యలే! ఇయ్యాళ పొద్దుటేల్ లేస్తనే షురూ జేసిండు మళ్ళీ ఇదే లాంగ్వేజ్- మాకు గుబులు పుట్టి శాయిరామ్ అన్ననూ, రెడ్డన్ననూ తీసుకొచ్చినం" చెప్పాడతను.

అందరూ రమేష్ గాడి వంక విచిత్రంగా, భయంగా, జాలిగా చూడసాగారు.

డిటెక్టివ్ రాజేశ్వరి చురచరా రమేష్ దగ్గరకు నడిచింది. వాడి ముందు కూర్చుని వాడిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది.

"ఒరే రమేషూ! సరిగ్గా మాట్లాడమ్మా! మనం మొన్న టీవీలో తెలుగు డ్రామా చూశాం కదూ! ఎలా వుందిరా అది?" బుజ్జగింపుతో అడిగింది.

"బలగితకమని కత వలె కర చుక తలముచ" అన్నాడు వాడు ఏడుపు మొఖంతో.

"మరా సంగతి చెప్పరేం? మొన్న హైద్రాబాద్ దూరదర్శన్ ప్రోగ్రామ్ చూశాడంటున్నాడు కదా అందుకే పిచ్చెక్కింది వాడికి! అందుకే అలాంటి ప్రోగ్రామ్స్ పిల్లలకు చూపించకూడదు. పెద్దాళ్ళం మనం చూస్తేనే రెండ్రోజుల పాటు పిచ్చి పిచ్చిగా ఉంటుంది" అంది పార్వతమ్మగారు.

రాజేశ్వరి సీరియస్ గా ఆలోచిస్తున్నట్లు ఫోజిచ్చి లేచి నిలబడింది.

"టీవీ ప్రోగ్రాం కూడా కారణమయి ఉండవచ్చు గానీ, నాకింకో అనుమానం వస్తోంది!" అందామె.

"ఏమిటది?" అడిగాడు రంగారెడ్డి అనుమానంగా.

అందరూ ఆమె ఏం చెప్తుందా అని ఊపిరి బిగపట్టారు.

"అదే- చేతబడి!" అందామె.

అందరూ త్రుళ్ళిపడ్డారు. కొంతమంది రెండడుగులు వెనక్కివేశారు. ఇంకొంత మంది తమ పిల్లలను దగ్గరకు తీసుకున్నారు.

"వీడంటేవిపరీతమయిన ద్వేషం, పగ, కసి ఉన్న వారెవరో చేతబడి చేయించి ఉంటారు- నేను ఈ విషయంలో పరిశోధించి హంతకుడిని పట్టుకుంటాను"- అందామె డిటెక్టివ్ ఫోజుపెట్టి.

యాదగిరి భార్య ఆ మాటతో మరింత గాబరా పడిపోయి బిగ్గరగా ఏడ్వటం మొదలు పెట్టింది గానీ యాదగిరి ఒక్క కేక వేసి ఆమె నోరు మూయించేశాడు.

"అంతా ట్రాష్! చేతబడులూ, బాణామతులూ- అంతా బోగస్! నేను నమ్మ!" అన్నాడతను.

"అవును! బుద్ధున్న వాడెవడూ నమ్మడు!" అన్నాడు రంగారెడ్డి. రాజేశ్వరమ్మ అలాంటి ఫాల్తూ స్టేట్ మెంట్లు బంద్ జేస్తే మంచిగుంటది!" అన్నాడు వెనుక నిలబడ్డ స్టూడెంట్స్ లో మార్కిస్ట్ (ఎక్స్ట్రీమ్ లెనినిస్ట్ మీడియం గ్రూప్) వాళ్ళు.

రాజేశ్వరికి కోపం వచ్చి "ఇంకోసారి ఛస్తే ఏ కేసూ పరిశోధించను!" అంటూ చరచరా స్టేజి దిగి వెళ్ళిపోయింది.

హఠాత్తుగా శాయిరామ్ కేదో అయిడియా వచ్చినట్లుంది- వెంటనే మైక్ కోసం వెతికి- దానిముందుకెళ్ళి నిలబడ్డాడు.

"సోదర సోదరీమణులారా? చిరంజీవి రమేష్ ఇలా ఎందుకయిపోయాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. హైద్రాబాద్ టీవీ ప్రోగ్రామ్స్ తరచుగా చూడడం వల్లే అలా అయిపోయాడని చాలామంది అనుకుంటున్నారు గానీ చిరంజీవి రమేష్ కున్నది పిచ్చి కాదు కాబట్టి అలా అనుకోవడం సమంజసం కాదు. ఒక్క భాష విషయంలో తప్ప రమేష్ ప్రవర్తన అంతా సహజంగానే ఉంది! కనుక ఇంకేదో కారణం అయి ఉండాలి-"

"అవును?" అన్నాడు రంగారెడ్డి.

గోపాల్రావ్, జనార్ధన్ కూడా శాయిరామ్ అభిప్రాయంతో ఏకీభవించారు.

తిండిపోతు వెంకట్రావ్ నెమ్మదిగా జనాన్ని తోసుకుంటూ చేతిలోని కారెట్ తింటూ స్టేజి దగ్గరకొచ్చాడు తన భారీకాయంతో.

"ఈ సందర్భంలో మీకో విషయం చెప్దామని వచ్చాను!" అన్నాడతను కారెట్ ఇంకో ముక్క కొరుకుతూ.

"ఇలా మైకు ముందు నిలబడు!" పిలిచాడు రంగారెడ్డి.

మైకుముందు నిలబడి మిగతా కారెట్ అంతా నోట్లో పెట్టేసుకుని నములుథూ మాట్లాడాడు వెంకట్రావ్?

"జరిగిందేమిటంటే నాల్రోజుల కిందట మా అన్నయ్య గారబ్బాయ్ కూడా ఇలాగే వింతగా మాట్లాడటం మొదలుపెట్టాడు! ఆ రోజు మా వదిన వంకాయ మషాలా కూర వండింది. బాగా గుర్తు నాకుగ కూరలో కొంచెం కారం తక్కువయింది కూడాను- నేను బగారా బైగన్ వండమంటే వినకుండా వంకాయ వండినందుకు తగిన శాస్తి జరిగిందని అంటే ఆమెకు కోపం కూడా వచ్చింది."

అతనిని చప్పున ఆపకపోతే ఆ మీటింగ్ ని బగారా బైగన్ సంస్మరణ సభగా మార్చేస్తాడని మాకందరికీ అనుమానం కలిగింది.

"చూడు వెంకట్రావ్- నువ్వు 'కూరలు, మానవుల ఆహారం' అనే టాపిక్ వదిలేసి అసలు విషయమేదో చెప్తే బాగుంటుంది.." అన్నాడు రంగారెడ్డి.

వెంకట్రావ్ ఆ టాపిక్ ఆపేసి జేబులోంచి ఓ గుప్పెడు కార్న్ ఫ్లాక్స్ తీసి నోట్లో నింపాడు.

"జరిగిందేమిటంటే, నాల్రోజుల క్రిందట మా అన్నయ్యగారబ్బాయ్ కూడా ఇలాగే స్కూలునుంచి ఇంటికొచ్చి పిచ్చి మాటలు మాట్లాడాడు.

"బాబాయ్ నా కళ్ళకు రాకుమార్తె కనబడుతోంది. నా మనోవేదన ఎక్కువయి పోయింది. మనోవేదన చల్లారేందుకు చందన గృహానికెళ్ళి చంద్రకాంత శిలావేదికపై కూర్చున్నా గాని మనశ్శాంతి లభించటం లేదు.. తలుచుకుంటే ఒళ్ళు గగుర్పాటు చెందుతోంది. ఆమెతో ప్రణయ విహారం చేస్తూ కుసుమాకరమనే ఉద్యానవనం చేరుకోవాలి" అంటూ మాట్లాడటం మొదలుపెట్టాడు.

"ఏమిటా పిచ్చి వాగుడు? నీ వయసుకలాంటి ప్రేలాపనలు పేలవచ్చా?" అంటూ బెల్టు తీసుకుని వాడిని చావగొట్టాడు మా అన్నయ్య-కానీ వాడు ఏడుస్తూ చెప్పిందేమిటంటే ఆ వర్ణనంతా వాడి ఏడో క్లాసు ప్రభుత్వ తెలుగు వాచకంలో ఉందిట. అంచేత టీచర్ ఆ విరహ వేదనంతా వాళ్ళ మనసు కెక్కేట్లు వివరంగా చెప్పిందట- అప్పటినుంచీ వాళ్ళకందరికీ కూడా వళ్ళంతా గగుర్పాటు చెందటం ఇంకేదో- ఏదోగా అవటం- జరుగుతోందిట-"

అందరూ నిశ్శబ్దం అయిపోయారు.

"కనుక నేను చెప్పేదేమిటంటే- రమేష్ గాడికి కూడా వాడి తెలుగు టెక్ట్స్ పుస్తకం తాలూకు ప్రభావం ఏమయినా సోకిందేమోనని..."

అందరూ ఒకరి మొఖాలొకరు చూచుకున్నారు.

"మీ అన్నయ్య కొడుకు వర్ణించిన వర్ణన ఏ పాఠంలో ఉంది?" కల్చురల్ సెక్రటరీ పార్వతీదేవి అడిగింది. పెన్నూ నోట్ పుస్తకం తీసుకుంటూ.

"జీమూత వాహనుడు అనే పాఠంలో" మరో గుప్పెడు వల్లీ బఠానీలు నోట్లో నింపుకుంటూ చెప్పాడు వెంకట్రావ్.

అందరూ కాసేపు తమలో తాము మాట్లాడుకున్నారు.

హఠాత్తుగా కాలనీ కవి విప్లవజ్యోతి రౌద్రంగా మైక్ దగ్గర కొచ్చాడు.

"అంతేకాదు! అదే వెధవ సెవెన్త్ క్లాస్ తెలుగు టెక్ట్స్ పుస్తకంలో ఇంకో పద్యం ఉంది! దానర్థం ఏమిటంటే మానం కాపాడుకోవటానికి స్త్రీ మంటల్లో దూకుతేనే ఆమెకు కీర్తి లభిస్తుంది" అని! అది చదివి మా అమ్మాయి మంటల్లో దూకుతేనే ఆడదాని జీవితం ధన్యమవుతుందనే అభిప్రాయానికొచ్చేసింది. మన దేశంలో పౌరుల మనస్తత్వాన్ని మన తెలుగు టెక్ట్స్ పుస్తకాలు ఎంత చక్కగా తీర్చిదిద్దుతున్నాయో చెప్పేందుకు మరో ఉదాహరణ ఇది!" ఆవేశంగా అరచాడతను.

పార్వతీదేవి మళ్ళీ పెన్నూ నోట్ పుస్తకం తీసుకుంది.

"ఆ పద్యం ఏ పాఠ్యభాగంలో ఉంది" అడిగిందామె.

"కన్యక" అనే గేయ సంపుటి! పేజి నెంబర్ ఇరవైఏడు-"

అంతా కలకలం చెలరేగింది.

"ఇదెక్కడి అన్యాయం- గవర్నమెంటోళ్ళు ఇలాంటి చెత్తరాతలన్నీ రాయించి అభంశుభం తెలీని చిన్న పిల్లలతో చదివిస్తున్నారా? అయ్యో- అయ్యో వాళ్ళకేం పోయేకాలమొచ్చింది?" గట్టిగా అరచింది విమలాదేవి.

శైలజమ్మ పక్కనున్న ఇద్దరినీ చెరో వేపుకు తోసేసి ఆవేశంగా ముందుకొచ్చింది.

"అయ్యో అదొక్కటే కాదండీ! మా చెల్లెలి వాళ్ళ తెలుగువాచకంలో కూడా ఇంద్రజిత్తు భార్య సతీసులోచన సతీసహగమనం చేయటం చాలా గొప్ప కీర్తివంతమయిన పని అని రాశారు. పైగా ఆ సహగమనాన్ని అందరూ వేనోళ్ళ స్తుతించారట! సతీసహగమనాన్ని ఈ విధంగా మన ప్రభుత్వమే ఎంకరేజ్ చేస్తోందన్న మాట!"

అంతా హాహాకారాలు చెలరేగాయ్.

విప్లవజ్యోతి మళ్ళీ ఆవేశంగా స్పీచ్ మొదలు పెట్టేశాడు.

"ఇదండీ- మన తెలుగుదేశ ప్రభుత్వం చేసిన ఘనకార్యం! మన ముఖ్యమంత్రిగారు అర్థరాత్రి నిద్రలేపి, "తెలుగు సంస్కృతి, తెలుగు ప్రజల ఆత్మగౌరవం- తెలుగుభాష" అంటూ కలవరింతలు కిలోల్లెక్కన ఇస్తారు! ఆ తెలుగు సంస్కృతీ, తెలుగు ప్రజల ఆత్మగౌరవం, తెలుగు భాషలను మన ప్రభుత్వమే మన ప్రభుత్వ టెక్ట్సు పుస్తకాల ద్వారా నడిబజార్లో వేలం వేస్తోంది! మనల్ని కించపరుస్తోంది"- అన్నాడాయన.

అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న జనంలో కలకలం చెలరేగింది.

"అదేమిటి? ఈ విప్లవ జ్యోతి మన 'ఎన్.టి.ఆర్.' అన్న మీద విరుచుకుపడతాడేం మధ్యలో అన్నగారికేం తెలుసని?" అంది పార్వతీదేవి.

"అహ్హాహ్హాహ్హా-" వికటంగా నవ్వాడు విప్లవజ్యోతి." తెలుగు వాచకాలు ఎవరు అచ్చు వేయిస్తున్నారు? ప్రభుత్వం! ప్రభుత్వమంటే ఎవరు! అన్నగారు! అహ్హాహ్హాహ్హా- మరి ఈ తప్పు ఇంకెవరిది?"

"ఒరేయ్-'అన్న' నేమయినా అన్నావంటే మంచిగుండదు." జనంలోంచి కుర్రాళ్ళు అరచారు.

"మంచిగుండదా? నేనంటా! ఏం జేస్తావ్?" అంటూ ఆ విప్లవజ్యోతి ఆ కుర్రాళ్ళవేపు దూసుకెళ్ళబోయాడు.

శాయిరామ్, రంగారెడ్డి పరుగుతో వెళ్ళి ఆకస్మిక యుద్ధాన్ని నివారించేశారు.

"సోదరులారా- మనం మన తెలుగు వాచకాల తీరుతెన్నుల గురించి మాట్లాడుతున్నాం గానీ- రాజకీయాల గురించి కాదు! ఇప్పుడు నేను మా రాజిగాడి రెండో తరగతి తెలుగువాచకంలో కొన్ని జోకులు లేక కొన్ని బూతులు చదువుతాను! అందరూ నిశ్శబ్దంగా విని నన్నానందింప జేయవలసిందిగా కోరుతున్నాను-"

అందరూ నిశ్శబ్దమయిపోయారు.

రెండోతరగతి వాచకం-

ఐదోపాఠం- నాకథ-

పేజీ ఇరవై ఎనిమిది!

"బ్రిటీష్ వారు మనల్ని బానిసలుగా చూస్తున్నారు. మరో దేశం వారు మనకి అన్యాయం చేయడమేమిటి? నాకు బాధ కలిగింది! అందుకే బ్రిటీష్ వారితో పోరాడదలిచాను..."

ఇక్కడ ఒక క్షణం ఆపాడు రంగారెడ్డి.

"మరో దేశం వారు మనకి అన్యాయం చేస్తున్నారట. అందుకని గాంధీ గారికి బాధకలిగి బ్రిటీష్ వారితో పోరాడారట! ఇంతకంటే పెద్ద జోక్ ఇంకేమయినా వుంటుందా? బ్రిటీష్ వారు మనకి అన్యాయం చేయకపోతే వారిని అలాగే పరిపాలన చేయనిస్తారా? అదలా ఉండనీయండి మరో దేశంవారు మనకి అన్యాయం చేస్తున్నారు కాబట్టి గాంధీగారికి బాధ కలిగిందట! అంటే మన దేశంవారే మనకి అన్యాయం చేస్తే ఫరవాలేదనేగా దాని అర్థం?"

అంతా నవ్వులూ తప్పట్లూ మార్మోగి పోయినయ్.

"ఇంకో జోక్ చదవండి" అరచారు స్టూడెంట్స్.

అదే పాఠం - 29వ పేజీలో.

"నేను ప్రజలకు సత్యాగ్రహం గురించి చెప్పినాను. ఒకరు మనల్ని కష్టపెడుతున్నారనుకోండి! మనం ఓర్చుకుంటూ వారి మనస్సు మారేటట్లు చేయవలె? అదే సత్యాగ్రహంటే!"

"చూశారా? సత్యాగ్రహం అంటే మనస్సు మార్చటమట!"

అందరూ ఘోల్లున నవ్వారు.

"ఇంకో జోక్- ఇంకో జోక్-" అరచారు కొంతమంది ఉత్సాహంగా. రంగారెడ్డి మళ్ళీ ఉత్సాహంగా అందుకున్నాడు.

"తెలుగు భాష గురించిన పాట- 32వ పేజీలో-

"అమ్మను పిలిచే భాష
తమ్ములు పలికే భాష
చెల్లెలి అల్లరి భాష
పిల్లల చల్లని భాష-"

అంటే తెలుగు భాష కేవలం పిల్లలే మాట్లాడేది అన్నమాట! లేదా తమ తల్లిని పిలవటానికి కూడా తెలుగు భాషను ఉపయోగిస్తారు-"

ఈసారి తప్పట్లు కూడా మార్మోగినయ్.

విప్లవజ్యోతి మళ్ళీ రౌద్రంగా మైక్ దగ్గరకొచ్చి నన్నూ, శాయిరామ్ ని ఒక్కతోపుతోసి మైక్ అందుకున్నాడు.

"ఇప్పుడేమంటారు? తెలుగుభాష తెలుగు ప్రజలు అంటూ శోష వచ్చేవరకూ చైతన్య రథంలో ఉపన్యాసం ఇస్తారుగా మీ అన్నగారు? ఇదేనా ఆయన మన తెలుగుతల్లి పిల్లలకు నేర్పే తెలుగుభాష" వెటకారంగా అన్నాడతను.

మళ్ళీ అందరం కలసి విప్లవజ్యోతిని వెనక్కు లాగేశాము.

రంగారెడ్డి మళ్ళీ అందుకున్నాడు.

"కొబ్బరిచెట్టు" పాఠం 36వ పేజీ...

మనకు ఈ పాఠంలో చాలా కొత్త విషయాలు తెలుస్తాయ్-

"కొబ్బరి నూనె రాస్తే తల వెంట్రుకలు నిగనిగలాడి జుత్తు ఒత్తుగా పెరుగుతుందట-"

అందరూ ఘోల్లున నవ్వారు.

"నేను రోజూ కొబ్బరి నూనె రాస్తాను"

అన్నారు అవధాన్లు గార్లు ముప్పయ్ రెండో ఏట తనకు సంక్రమించిన బట్టతలను చూపిస్తూ.

మళ్లీ నవ్వులూ కేకలూ-

"అంతేకాదు. పెళ్ళి పందిరిని కొబ్బరి మట్టలతోనే వేస్తారట."

"మళ్ళా నవ్వులు-"

"బాలచంద్రుడు పాఠం-73వ పేజీ"

బాలచంద్రుడు తన బొంగరాన్ని అరచేతిలో నిలబెట్టి, తాడు చుట్టి, గిర్రున తిప్పి 'హుమ్ హుమ్' అంటూ నేలకేసి విసిరాడట!

ఆ తరవాత-77వ పేజీలో-

"బాలచంద్రుడు 'హుమ్' అన్నాడట సైనికుల పారిపోయానారట" అంటే దీనిని బట్టి తెలుగు సినిమాల్లో హాస్యగాడికి ఓ ఊతపదం వున్నట్లే ఆనాడు బాలచంద్రుడికి కూడా 'హుమ్' అనే ఊతపదం ఉండేదన్నమాట? అంటే ఈ పాఠాన్ని తెలుగు సినిమాల్లో హాస్యగాడి పాత్రను సృష్టించిన రచయితే రాశాడన్నమాట."

మళ్ళా నవ్వులు!

కొంతమంది "హుమ్" అని అరచారు వెనకనుంచీ.

విమానం పాఠం - 83వ పేజీ.

"విమానం అంటే ఇనుప పక్షి ఆట. అంటే ఈ పాఠం తయారుచేసిన వాళ్ళకి విమానాన్ని ఏ లోహంతో తయారుచేస్తారో కూడా తెలీదన్నమాట."

మళ్ళీ హాహాకారాలు చెలరేగాయ్.

రంగారెడ్డి అందరికీ వినయంగా నమస్కరించి వెనక్కు వెళ్ళిపోయాడు.

వెంటనే శాయిరామ్ మైక్ దగ్గరకొచ్చాడు.

"ఇంకెవరయినా తమ పిల్లల ప్రభుత్వ టెక్స్ట్ బుక్స్ లోని జోకులు కానీ బూతులు కానీ చదివి వినిపించదల్చుకుంటే ఇక్కడికి రావచ్చు" అన్నాడు ఉత్సాహంగా.

సదాశివరావ్ వాళ్ళ అబ్బాయిని కూడా తీసుకొచ్చాడు మైక్ దగ్గరకు. "సోదరులారా! మా అబ్బాయిని ఓ నిముషం మీ అందరి ఎదురుగ్గా మాట్లాడిస్తాను. దయచేసి వినండి!" అన్నాడు.

"ఏరా బాబీ! నువ్వు స్కూలుకెలా వెళ్తావ్ చెప్పమ్మా!" అడిగారాయన గారాబంగా.

"బస్ ని కరుచుకునెళ్తా" అన్నాడు వాడు.

అంతా ఘొల్లున నవ్వారు.

"అమ్మ భోజనం వడ్డించిందనుకో! ఏం చేస్తావ్"

"కరుచుకుంటూ"

మళ్లీ నవ్వులు

"స్కూల్లో ఏం చేస్తావ్ నువ్వు?"

"కరచుకుంట"

సదాశివరావ్ మళ్ళా అందరికీ నమస్కరించాడు.

"అయ్యా ఇదండీ మా వాడికి వచ్చిన తెలుగు! సంగతేమిటని టీచర్ని అడిగితే."

మేమేం కరుచుకోమండీ? మూడో క్లాస్ తెలుగు వాచకంలో అలా కరుచుకోటం గురించి కరచారు" అంది.

ఆయన వెళ్లిపోగానే రామచంద్రరావ్ గారు వాళ్ళమ్మాయిని తీసుకొచ్చారు. మైక్ దగ్గరకు.

"అయ్యా, తెలుగువాచకమే కాదు! హిందీ టెక్ట్స్ పుస్తకం కూడా మన పిల్లల్ని మరింత అధోగతికి దిగజారుస్తోంది. మా అమ్మాయి ఏడో క్లాస్ చదువుతోంది. ఆమె చెప్పే సమాధానాలు విని తరించండి..."

అంతా చెవులు రిక్కించారు.

"చెప్పమ్మా! స్వర్ణా! తెలుగులో చక్కని సాహిత్య సృష్టి చేసి తెలుగు భాషకు గొప్ప సేవ జేసిన రచయిత ఎవరు?"

"మాదిరెడ్డి సులోచనరాణి..."

అందరూ ఘోల్లున నవ్వారు.

"అయ్యా! నవ్వకండి! ఇది మన పదోతరగతి హిందీ పుస్తకం. తయారుచేసిన వారి అభిప్రాయం! మన తెలుగు ప్రభుత్వం వారు చెప్తోన్న నగ్నసత్యం! శ్రీమతి మాదిరెడ్డి సులోచన మన తెలుగు భాషలో ఉన్న కొన్ని వందలమంది రచయిత(తు)లలో ఒకరు. వ్యాపార సరళిలో రచనలు చేయటం తప్ప తెలుగు సాహిత్యానికి గానీ, సంస్కృతికి గానీ చేసిన మేలేమీ లేదు. పైపెచ్చు అంతకంటె ఎన్నో విధాలుగా గొప్ప రచనలు చేసిన వారెంతో మంది ఉన్నారు. అయినా మన సిలబస్ కమిటీకి, ప్రభుత్వానికీ ఆ పుస్తకం ఎడిటరు గారికీ ఆవిడ రచనలే ఉత్తమ సాహిత్యం అనిపించింది. ఆమె పేరు కందుకూరి వీరేశలింగం గురజాడ అప్పారావ్ ల స్థాయికి తీసుకెళ్ళారు"

"షేమ్ షేమ్-" అరచారెవరో.

హఠాత్తుగా విప్లవజ్యోతి మళ్ళీ అందరినీ పక్కకు తోసి మైక్ దగ్గరకు చేరుకున్నాడు.

"అమ్మలారా, అయ్యలారా! ఇప్పుడయినా అన్నగారి అవకతవకల భాగోతం తెలుసుకున్నారా? తెలుగు సంస్కృతీ, తెలుగుభాష, తెలుగు ఆత్మగౌరవం- అహ్హ్హాహ్హా- మాదిరెడ్డి సులోచనరాణి అన్నట్లు మర్చిపోయాను- ఆవిడ పేరు కూడా ప్రభుత్వానికి, పాఠ్యపుస్తకం ఎడిటర్స్ కి తెలీదు- 'సులోచన' అని ఉండాల్సింది- సులోచనరాణి అయిపోయింది. పేరు కూడా ఎవరికీ సరిగ్గా తెలీని రచయిత్రి జీవిత చరిత్ర గురించి మన తెలుగు బాలబాలికలందరూ నేర్చుకుని తరించాలిట! కేవలం నాలుగు డబ్బులు సంపాదించటం కోసమే వ్యాపారం చేస్తున్న పబ్లిషర్లు కొంతమందికి ఆమె సేవ జేసి ఉండవచ్చు - అంతమాత్రాన ఆ సాహిత్యాన్నంతా గొప్ప సాహిత్యంగా భావించి- మన చిన్నారి బాలల మనసులను కలుషితం చేయటం అక్రమం- దారుణం! ఇది మీ ఎన్ టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరగటం ఇంకా ఘోరం- మనందరికీ అవమానం-"

ఈసారి ఎవ్వరూ అతనిని హేళన చేయలేదు.

"హా! తెలుగుజాతి- తెలుగుభాష తెలుగు- ఆత్మగౌరవం- ధూ! నీయవ్వ" అనేసి మైక్ దగ్గర్నుంచి హడావుడిగా వెళ్ళిపోయాడు.

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

శాయిరామ్ నెమ్మదిగా మైక్ ముందుకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! ఈ తెలుగు వాచకాలు మన పిల్లలందరినీ ఎంతగా హింసిస్తున్నాయో ఇప్పుడు అర్థమయింది. మనకాలనీవాసి యాదగిరి వాళ్ళబ్బాయ్ పిచ్చి మాటలు కూడా కేవలం తెలుగువాచకాల వల్లనే జరిగిందని నా అనుమానం-"

"అనుమానం కాదాసర్- నిజమే అది" ఓ ముసలాయన జనంలోంచి మైక్ దగ్గరకొచ్చాడు.

"నాపేరు దశరథరామయ్యండీ! నేను యాదగిరి వాళ్ళ అబ్బాయి చదివే స్కూల్లో తెలుగు టీచర్ని. యాదగిరి వాళ్ళబ్బాయి పిచ్చి మాటలు మాట్లాడడం కేవలం నా పొరపాటు వల్ల జరిగిందని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. జరిగిందేమిటంటే యాదగిరి వాళ్ళ ఇద్దరు అబ్బాయిలూ యించుమించుగా ఒకే పోలికలతో ఉంటారు. అంచేత పొరబాటున యాదగిరి రెండో కొడుకుని వాళ్ళ పెద్దబ్బాయి అనుకుని వేరే క్లాస్ కి బలవంతంగా లాక్కెళ్ళి ఆ క్లాసు తెలుగువాచకం చదివించాను, మరి ఇంత లేత పిల్లలు అలా రెండు తెగులు వాచకాలు చూసేసరికి కొంచెం మతిచలించడం సహజమే! ఇందుకు ప్రాయశ్చిత్తంగా నేనే నా ఖర్చు మీద ఆ కుర్రాడిని మంచి సైకాలజిస్ట్ కి చూపించి నయం చేయగలనని మనవి చేస్తున్నాను."

అతను యాదగిరి కుర్రాడిని రిక్షాలో తీసుకువెళ్ళిపోయాడు.

శాయిరామ్ ఉత్సాహంగా మళ్ళీ మైక్ దగ్గరకు వచ్చాడు.

"సోదర సోదరీమణులారా! మన పిల్లలందరి క్షేమం కోసమని మన కాలనీ సభ్యులు కొంతమందితో ఓ కమిటీ ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాము. ఈ కమిటీవారు తెలుగు వాచకాల్లోని తప్పులను గురించి, ప్రభుత్వానికి తెలుగులో తమ రిపోర్ట్ ను సమర్పిస్తారు" అంతా తప్పట్లుకొట్టారు.

* * * * *

## పెగ్ నెంబర్ త్రీ

ముందు హైద్రాబాద్ తరువాత- విజయవాడ- పోలీసులతో పేచీపడ్డాక కాలనీ వాళ్ళందరం కలిసి ఒక మీటింగ్ ఏర్పాటు చేసి ఇక నుంచీ ఎవ్వరం రాజకీయాల జోలికీ, పోలీస్ లతో పేచీ వచ్చే వ్యవహారాల జోలికీ పోకూడదని నిర్ణయించుకున్నాం.

"నేనొప్పుకోను!" ఎదురు తిరిగాడు శాయిరామ్ "మనం వాటి జోలికి వెళ్ళకపోయినా అవే మన కాలనీ లైఫ్ లోకి జొరబడుతూంటే మనమేం చేస్తాం? గాజులు తొడుక్కుని కూర్చుంటామా?" అన్నాడు ఆవేశంగా.

"కూర్చోకపోతే జైలుకు పోతారు! లేదా మనవాళ్ళందరినీ శ్రీకాకుళం ప్రాంతానికి బదిలీ చేసి పారేస్తారు. అదీ కాకపోతే రోడ్లు విశాలం చేసే స్కీమ్స్ లో మన కాలనీ కూల్చి పారేస్తారు" అంటూ బెదిరించాడు గోపాల్రావ్.

ఇళ్ళు కూల్చడం అనగానే శాయిరామ్ భయపడిపోయాడు. హైద్రాబాద్ లో ఇళ్ళు దొరకటం ఎంత కష్టమో, ఇళ్ళ అద్దెలు ఎంత భయంకరంగా ఉన్నాయో- ఆ మధ్య వాళ్ళ బంధువుల కోసం ఇల్లు వెదికినప్పుడు అనుభవమయింది మా అందరికీ.

"సరే! మీరు చెప్పిందే కరెక్ట్" అన్నాడు రాజీకొస్తూ.

అదే అవకాశమని నేను మరో క్లాజ్ కూడా అప్పుడే ప్రవేశపెట్టాను.

"కొన్ని వారాల వరకూ కాలనీ మీటింగ్ లు కూడా ఉండటానికి వీల్లేదు" అన్నాను శాయిరామ్ వంక చూస్తూ.

శాయిరామ్ బాధతో విలవిలలాడిపోయాడు.

"అదేమిటి? మీటింగ్ లు ఎందుకు పెట్టకూడదు?" అన్నాడు ఉక్రోషంగా.

"నువ్వు పెట్టే మీటింగ్ ల వల్లే గొడవలు జరుగుతున్నయ్-" అని సపోర్ట్ కోసం మిగతావారివేపు చూశాను.

"అవ్! నో మీటింగ్స్" అన్నాడు వివిన్ పాల్.

"అవును మీటింగ్ లొద్దు!" అన్నారు రాజేశ్వరి, పార్వతీదేవిలు.

దాంతో శాయిరామ్ ఇంక మాట్లాడలేకపోయాడు.

ఆ రోజు రాత్రి చాలా హాయిగా, ప్రశాంతంగా నిద్రపోయారు కాలనీలో వాళ్ళందరూ. ఉదయం ఎనిమిదిగంటలయినా చాలామంది నిద్రపోతూనే వున్నారు. నిజంగా ఆ ఒక్కరోజు కాలనీ చరిత్రలో "స్వర్ణయుగం" అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నా మటుకు నేను అంత ఎక్కువ ఆనందం కాలనీలోకొచ్చాక ఏనాడూ అనుభవించలేదు.

రెండోరోజు కూడా ఆ తీయని నిద్రలో మునిగితేలుతూంటే- తలుపు కొట్టిన చప్పుడయింది.

భయంగా లేచి కూర్చుని టైమ్ పీస్ వైపు చూశాను. రాత్రి పన్నెండవుతోందప్పుడే!

ఇంత రాత్రివేళ ఎవరు పిలుస్తున్నారో అర్థం కాలేదు.

లేచి తలుపు తీయబోయేసరికి మా శ్రీమతి కూడా లేచి కూర్చుని "వద్దు! తీయకండి!" అంది గాబరాగా.

"ఎందుకని?"

"వచ్చింది దొంగలేమో- తలుపు తీశాక తీరా మీకేమయినా అయితే- నా సంగతేమిటి? అందుకే మీ ఇన్సూరెన్స్ మొత్తం కొంచెం పెంచమని మొత్తుకుంటుంటే వినిపించుకోరు-" అంది గొణుగుతూ.

దానికి నామీదకంటె నా ఇన్సూరెన్స్ పాలసీ మీద ప్రేమ ఎక్కువవటం చూసి నాకు వళ్ళు మండిపోయింది గానీ అది దానొక్కదాని తప్పుకాదు. కాలనీలో ఆడాళ్ళందరూ ఈ మధ్య మగాళ్ళను ఇన్సూరెన్స్ మొత్తం పెంచమని గొడవ చేస్తూనే ఉన్నారు. ఆ రోజుల్లో దొంగలు మా కాలనీకి బయట ఉన్న ఓ డాబా ఇంటతనని చంపిన దగ్గర్నుంచీ వాళ్ళకా ఆలోచన కలిగింది. అతని ఇన్సూరెన్స్ పాలసీ చాలా చిన్న మొత్తం అవటం వల్ల అతని కుటుంబం చాలా అవస్తలు పడటం గమనించారుట!

"ఎవరు?" అంటూ అరచాను తలుపు దగ్గర చెవిపెట్టి.

"ఎవరా? ఎవరేమిటి గురూ! నేనే జనార్ధన్ ని..." అంటూ జనార్ధన్ గొంతు వినిపించాక ధైర్యంగా తలుపు తెరచాను.

బ్రాందీ వాసన గుప్పుమంటూ జొరబడింది లోపలకు.

"ఏమిటింత రాత్రప్పుడు వచ్చావ్?" అడిగాను ఆశ్చర్యంగా.

జనార్ధన్ కంటి వెంబడి కన్నీళ్ళు రాలిపోయినయ్ "గురూ! నన్ను ష...ష...మించుగురూ" అంటూ నా చేతులు పట్టుకున్నాడు.

నా కతనిమాటలు అర్ధం కాలేదు "ఏమిటి? నేనేం చేయాలి?"

"నన్ను షమించాలి గురూ! ముందు 'ష' అను?" అన్నాడు కన్నీళ్ళు తుడిచేసుకుని.

'ష' అన్నాన్నేను.

"మిం-"

"మిం-"

"చు-"

"చు-"

"ష..మిం..చు"

"ష..మిం...చు"

"అది- అదే గురూ! నన్ను షమించానని చెప్పు!"

"ఎందుకు? నువ్వేం చేశావని?"

జనార్ధన్ గుండెలు కొట్టుకోసాగాడు. అ"అమ్మో- అమ్మో- ఏం చేశానేమిషి గురూ- దోహం షేశాను-"

"షారీ! దోహం కాదు దో...దో- ద్రోహం- ద్రోహం షేషాను గురూ! నీకు తీరని ద్రోహం షేశాను-"

"ఏం చేశావ్?"

"ముందు షమించానను-ష...మిం...చా అను గురూ"

మా ఆవిడకు జనార్ధన్ గొడవ అర్ధం అయినట్లు లేదు. "ఏమిటిలా ఏడుస్తున్నాడు?" వాళ్ళ వాళ్ళెవరికయినా సీరియస్ గా ఉందేమో?"

"ష్" అన్నాన్నేను "అదేం కాదులే మందు కొట్టేసి వచ్చాడు."

మా ఆవిడ అదిరిపడింది "అమ్మో మందే-"

తాగి ఉన్నాడితో వాదన అనవసరం అన్న విషయం మాకు పోలీస్ డిపార్ట్ మెంట్ ద్వారా బాగా అనుభవమయింది. అంచేత రాజీకొచ్చేయడానికి ప్రయత్నించాను.

"సరే బ్రదరూ! క్షమించాన్లే- ఇంక ఇంటికెళ్ళిపో-" అన్నాను, నా నిద్రప పాడయిపోతున్న విషయం గుర్తుకొచ్చి.

"నో-" గట్టిగా అరచాడు జనార్ధన్ "నేనొప్పుకోను!"

"ఆ అరుపుకి మా పిల్లలూ, పక్కింటివాళ్ళూ లేచివచ్చి నిలబడ్డారక్కడ.

"ఎందుకని వప్పుకోవు? ఆశ్చర్యంగా అడిగాను.

"నేనేం దో-దో- ద్రోహం షేషానో తెలీకుండా నన్నెలా షమిస్తావ్! అలా ఊరికే షమించేయటం నాకిష్టం లేదు- షమించే వాడెవడయినా సరే రీజన్ తెల్సుకోవాలి!"

"సరే- నాకేం ద్రోహం చేశావో చెప్పు త్వరగా!"

"నైన్ టీన్ ఎయిషీటూలో సిగరెట్ ఫామిన్ వచ్చింది గుర్తుందా!"

"సిగరెట్ ఫామినా?"

"అవును- సిగరెట్ ఫామిస్! అంటే సిగిరెష్ కరువు- అప్పుఅప్పుడూ మనదేశంలో సిగిరెష్ కరువు రాదూ?"

"అదా- వస్తుంది- వస్తుంది!"

"ఆ సిగరెష్ ఫామిన్ నైన్షీన్ ఎయిషీ షూలో వచ్చినప్పుడు- నువ్ నన్ను కోఠీ బష్ ష్టాప్ లో సిగిరెష్ అడిగావు గుర్తుందా?"

"అడిగానేమో- నాకు గుర్తులేదు-"

"గుర్తు లేకపోతే గుర్తు తెచ్చుకోవాలి!"

"సరే అడిగాను!"

"అప్పుడు నేనేం షెప్పాను?"

"ఏమో గుర్తులే.."

"నో! గుర్తు తెచ్చుకోవాలి!"

"సిగిరెట్ ఇచ్చావ్."

"అబద్ధం! నేనివ్వలేదు-"

"ఆ గుర్తుకొచ్చింది- ఇవ్వలేదు!" అన్నాను అబద్ధమాడేస్తూ.

"ఇవ్వకుండా ఏం షెప్పాను?"

"సిగిరెట్లు లేవని చెప్పి ఉంటావ్-"

"షెప్పి ఉంటావ్ కాదహ! అదే షెప్పాను!"

"అవును! అదే చెప్పావ్-"

హఠాత్తుగా జనార్ధన్ కిందకూర్చుని నెత్తిన రెండు చేతులూ పెట్టుకుని ఏడ్చేశాడు.

"అక్కడే నీకు దో-దో ద్రోహం అయిపోయింది గురువా. నా జేబులో అప్పుడు రెండు సిగిరెష్ లు ఉన్నాయ్- అయినా లేవని అబద్ధం షెప్పాను-"

"అదా- ఏం ఫర్లేదులే! అందులో పెద్ద ఇదేముంది?" నవ్వేస్తూ అన్నాను పైకి కానీ లోలోపల వాడు అలా అబద్ధం చెప్పినందుకు వళ్ళు మండిపోయింది.

జనార్ధన్ కోపంగా లేచి నిలబడ్డాడు.

"అలా మాట్లాడకు గురువా! ఏం ఫర్లేదులే అంషావేంషి? అది ద్రోహం కదూ!"

"అవును ద్రోహమే-"

"అయితే షెప్పు- ఆ రోజు నేను షేషినో దో-దో- ద్రోహానికి షమించానని షెప్పు-"

"సరే క్షమించాను!"

జనార్ధన్ మొఖంలో సంతృప్తి. హఠాత్తుగా అతని చూపు మా మిసెస్ మీద పడింది.

"నువ్ షమిస్తే షరిపోయిందేమిషి? మా వదినమ్మ షమించొద్దూ?"

మా ఆవిడ ఉలిక్కిపడింది. "నేనా? నేనెందుకు క్షమించటం?"

నువ్ కూడా క్షమించానని చెప్పెయ్యవే! గొడవెందుకు?" అన్నాను మా ఆవిడతో రహస్యంగా.

"నేనూ క్షమించాన్లెండి!" అందామె. అబ్బ! ఈ మగసన్యాసులు తాగితే ఇంత సాధు జంతువులుగా కూడా మారే అవకాశం ఉందన్నమాట" అంది నాతో రహస్యంగా.

"ఇంక వెళ్ళిరా! మా మిసెస్ కూడా క్షమించింది కదా!" అన్నాను చిరాకు కనిపించకుండా!

జనార్ధన్ వెళ్ళబోయి- ఆగి- మా వెనుక నిలబడ్డ పిల్లల వేపు చూశాడు.

"మరి ఆళ్ళు షమించొద్దూ?"

"వాళ్ళు కూడా క్షమించార్లే!" అన్నాన్నేను.

"ఏదీ వాళ్ళు మాట్లాడందే?"

"రాత్రిళ్ళు వాళ్ళు మాట్లాడరు."

జనార్ధన్ వాళ్ళదగ్గరకెళ్ళి కింద కూర్చున్నాడు.

"పీపీ" అన్నాడు వాళ్ళ బుగ్గల మీద చిటికె వేస్తూ.

వాళ్ళు భయంగా మావేపు చూశారు "లీలీ"...వాళ్ళు రెండడుగులు వెనక్కు వేశారు.

"కీకీ" అన్నాడు మళ్ళీ- నేను కల్పించుకోకపోతే ఆ కార్యక్రమం తెల్లారేవరకూ సాగేట్లు కనిపించింది.

"ఇంక ఇంటికెళ్ళు- టైమ్ ఒంటిగంటవుతోంది" అన్నాను విసుగ్గా.

జనార్ధన్ లేచి నిలబడ్డాడు. వెనక్కు తిరిగి రెండడుగులు వేసి మళ్ళీ తిరిగి వచ్చాడు.

"మరి రంగారెడ్డి మాటేమిటి? ఆడు షమించొద్దూ?" అదిరిపడ్డాను.

"అదేమిటి? రంగారెడ్డెందుకు క్షమించటం?"

"ఆడిక్కూడా దో- ద్రోహం చేషాను. ఆడు కూడా షమిస్తే గానీ వెళ్ళను- అన్నాడు మళ్ళీ కూర్చుంటూ. చేసేది లేక నేనే వెళ్ళి రంగారెడ్డిని నిద్రలేపుకొచ్చాను.

రంగారెడ్డిని చూస్తూనే దభేల్ మని అతని కాళ్ళమీద పడిపోయాడు జనార్ధన్.

"నీకు ద్రోహం షేషాను గురూ- దో- దో- హం దోదోహం- ద్రోహం!"

"నాకేం చేయలేదులే- పద- మీ ఇంటికెళ్దాం!" అన్నాడు రంగారెడ్డి.

హఠాత్తుగా గట్టిగా ఏడవటం మొదలుపెట్టాడతను. దాంతో అందరిళ్ళల్లో టపటప లైట్లు వెలిగిపోయినయ్. ఆ తరువాత ఒక్కరొక్కరేవచ్చి మూగిపోయారక్కడ. మరి కాసేపట్లో పెద్దలూ, పిల్లలూ అంతా కిటకిటలాడిపోయారు.

"నేను నీకు ద్రోహం షేషాను గురూ! నీకు తెలీదది-"

"ఏమిటది?"

"నాలుగేళ్ళక్రితం రేడియోలో జనరంజనిలో శ్రోతలు కోరిన రికార్డుల్లో- ఒక బూతుపాట కోరి- అది కోరినవారు రంగారెడ్డి నిర్భయ్ నగర్ కాలనీ అని నేనే రాశాను."

"ఆ.. నువ్వా ఆ పని చేసింది?" కోపంగా అన్నాడు రెడ్డి.

"అవును గురూ! నేనే- నేను టీవీలో వేషం కోసం ఆ ప్రొడ్యూసర్ ని బార్ కి తీసుకెళ్ళటానికి రెండొందలు అప్పు అడిగితే లేదన్నావని కోపం వచ్చి ఆ పని షేషాను-"

అందుకని షమించాల్సిందే అని, మళ్ళీ భోరున ఏడ్వటం మొదలుపెట్టాడు.

అందరం రెడ్డిని బ్రతిమాలాము. "ముందు వాడిని క్షమించేసేయ్- లేకపోతే ఎవ్వరికీ నిద్ర ఉండదు- తెల్లార్లు న్యూసెన్స్ చేస్తాడు"

"సరే- క్షమించాన్లే" అన్నాడు రెడ్డి. "ఇంక మీ ఇంటికి వెళ్దువుగాని పద-"

"మరి..రాజేశ్వరి షమించొద్దూ?"

అందరం ఉలిక్కిపడ్డాము "రాజేశ్వరా?"

"అవును- రాజేశ్వరికూడా ద్రోహం షేషాను."

"నాకేం ద్రోహం చేసిన గుర్తులేదే-" అంది రాజేశ్వరి ఆశ్చర్యంగా.

"నైన్టీన్ ఎయిటీ షూలో మీర్రాసిన కథ 'జ్యోతిలో' పడింది గుర్తుందా?"

"అదెందుకు గుర్తుండదు?" ఉత్సాహంగా అందామె "అందులోనే హీరో శివశంకర్ వాళ్ళ పిన్ని కూతుర్ని మర్డర్ చేస్తారెవరో! ఎవరో ఎవరికి తెలీదన్నమాట! ఆఖరికి ఆ అమ్మాయికి కూడా తెలీదు- శివశంకర్ కి ఎనిమిదిమంది మీద అనుమానం ఉంటుందన్నమాట! మొదటి అనుమానితుడు భీమ్ రాజ్! క్లూ కోసం అర్ధరాత్రి రెండింటికి భీమ్ రాజ్ ఇంటికెల్తాడతను. లోపలకు జొరబడి గోడ పక్కన నిలబడతాడు.

"షాప్-" అంటూ ఓ కత్తి అతని పక్కనుంచీ దూసుకుపోతుంది.

"షాప్ షాప్ షాప్" అన్నీ కత్తులే!... ... పిల్లలూ- ఆడాళ్ళు శ్రద్ధగా ఆ కథ వినటం చూసేసరికి మా అందరికి వళ్ళు మండిపోయింది.

"స్టాపిట్!" అరచాడు రంగారెడ్డి.

రాజేశ్వరి భయపడిపోయిందా కేకకు.

"మీ కథ రేపు చెప్దురు గాని- ముందితనిని డిస్పోజ్ చేయనీండి!"

"ఆ కథ పరమషెత్త కథ అనీ అలాంటి షెత్తజ్యోతిలో ప్రచురించవద్దనీ ఆ తరువాత నెలలో ఒక ఉత్తరం ఉత్తరాల శీర్షికలో పడింది గుర్తుందా?" అడిగాడు జనార్ధన్.

"అవును- పోకిరీ వెధవ! ఇడియట్! డాగ్- వాడెవడో- కె.కిషన్ రావు, న్యూనల్లకుంట అని రాశాడు-"

జనార్ధన్ తలవంచుకున్నాడు.

"అది రాషింది నేనే రాజేశ్వరిగారూ. ఆ కే.కిషన్ రావ్ పేరుతో రాసింది నేనే!"

జనమంతా ఉలిక్కిపడ్డారు.

"మీరా?" అంది రాజేశ్వరి.

"అవును- అదే మీకు చేసిన దో- ద్రోహం! షమించానానండి"

"నా కథలను విమర్శించే వాళ్ళను ఛస్తే క్షమించను-" బిగుసుకుపోయిందామె.

ఆ మాటతో జనార్ధన్ భోరున ఏడవటం మొదలుపెట్టాడు. "నాకు నిష్కృతి లేదు. నిష్కృతి లేదు!"

అందరం కలసి ఆమెను పక్కకు తీసుకెళ్ళి బ్రతిమాలాము.

"చూడండి! మీ కథలన్నీ క్లాస్ పాఠకులు మెచ్చుకుంటారు. జనార్ధన్ లాంటి మాస్- మషాలా గాళ్ళు చెత్త అంటే మీకెందుకు! మీవన్నీ 'క్లాసిక్స్' అని మేమంతా ఎప్పట్నుంచో చెప్తున్నాం కదా!" అన్నాడు శాయిరామ్.

"సరే క్షమించాను" అందామె.

వెంటనే అందరం కలసి జనార్ధన్ ని తీసుకెళ్లి వాళ్ళింట్లో మంచం మీద పడేశాము.

"ఏమిటో అన్నయ్యగారూ! ఆ పాడు సినిమాల్లో వేషం కోసం మద్రాస్ వెళ్ళిన దగ్గర్నుంచీ ఈ పాడు మందు అలవాటయింది. రోజూ రాత్రుళ్ళు తాగి ఇంటికొచ్చి నానా గొడవా చేస్తున్నారు-" అంది వాళ్ళావిడ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అవునన్నా! ఈ మనిషి కూడా గిట్లనే తయారయ్యిండు! సినిమా ఏషాల్దిక్కు కెళ్ళి ఈ చెడ్డ అలవాటు జేస్కొని పైసలన్నీ ఖర్చుచేసి మమ్మల్ని చానా కష్టపెడుతుండు" అంది యాదగిరి భార్య గద్గద స్వరంతో.

"అంతేకాదు! వీళ్ళిద్దరూ కలసి మా ఆయన్తో కూడా బలవంతంగా తాగించారు మొన్న అలా తాగుతే గానీ సినిమా రచయితలవలేరు అని ఎవరో చెప్పారట!" అంది చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ భార్య అతనివంక కోపంగా చూస్తూ.

"ఆ మాట నిజమేలేవే! చాలామంది రచయితలు ఇంతకుముందే చెప్పారు నాకు" చిరాగ్గా అన్నాడు చంద్రకాంత్.

"అవును గురూ! వీళ్ళిద్దరూ మద్రాస్ లో ఆ వెధవ సినిమాల్లో ఒక్క వేషం వేశారో లేదో తెగఫోజు కొడుతూ రోజూ బార్ కెళ్తున్నారు" అన్నాడు రంగారెడ్డి.

"వీళ్ళ సంగతి రేపు ఆలోచిద్దాంలెండి" అన్నాన్నేను నిద్రను ఇంకా సర్వనాశనం చేసుకోవటం ఇష్టం లేక.

"కాదు- ఇప్పుడే తేలాలి!" అంది పార్వతీదేవి ఖండితంగా. "మొన్న వంటింట్లో మావారు వంటలో నాకు సాయం చేస్తూ అన్నం వారుస్తూంటే కిటికీలోనుంచి చూసి పాటపాడారు ఇద్దరూ!" అందామె కసిగా.

"పాటేమిటి? ఏమని పాడారు? అడిగాడు శాయిరామ్ కుతూహలంగా.

అందమయిన జీవితమూ- అద్దాల సౌధమూ

వంటచేస్తూ బ్రతికితే వడలిపోవును

మందుకొట్టి తిరుగుతే ధన్యమైపోవును అని పాడారు. ఆ పాట విన్న తరువాతే మా ఆయన మందు కొట్టటం నేర్చుకున్నాడు-"

ఆ పాటలోని సాహిత్యం వినగానే ఆడాళ్ళందరికీ వళ్ళు మండిపోయింది.

"అయితే ఇప్పుడే తేల్చాల్సిందే" అంది సావిత్రమ్మ కూడా! పరిస్థితి చేయిదాటి పోతుందని గ్రహించి రంగారెడ్డి కల్పించుకున్నాడు.

"ఆ విషయం నిజమేగానీ- వాళ్ళిద్దరూ మందు ప్రభావంలో ఉన్నప్పుడు మన మాటేం వింటారు? వచ్చే ఆదివారం మీటింగ్ పెట్టుకుందాం!"

శాయిరామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"సోదరీసోదరీ మణులారా! అనుకోకుండా తలెత్తిన ఈ తాగుడు సమస్య గురించి వచ్చే ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేస్తున్నాము. కనుక.." అంటూ జనం ఇళ్ళల్లోకి వడివడిగా వెళ్ళిపోవటం గమనించి ఉపన్యాసం ఆపేశాడు.

మర్నాడు పొద్దున్నే అందరం కలసి జనార్ధన్ నీ యాదగిరినీ పిలిచి రాత్రి గొడవ గురించి కదిపాము.

సినిమా ఆర్టిస్టులం కదా! మాకు మందు చాలా అవసరం బ్రదర్! రాత్రింబవళ్ళు షూటింగుల కెళ్ళటం, విశ్రాంతి ఉండక పోవటం, లైట్స్ వేడిలో నిలబడటం- మా లైఫ్ ఎవరికి తెలుస్తుంది? ఎందుకు మందుకొడుతున్నామో ఎవరర్థం చేసుకుంటారు? అన్నాడు జనార్ధన్ శూన్యంలోకి చూస్తూ.

"అవును గురూ! మందుకొడితే గానీ కెమెరా ముందు నిలబడడానికి కాదు" అన్నాడు యాదగిరి.

"రెండు నిమిషాల వేషం వేశారో లేదో బోడి ఫోజులు! ఆ ఒక్క సినిమా కూడా విజయవాడలో ఊరిబయట హాల్లో ఒకే ఒక్క షో ఆడింది-" అన్నాడు గోపాల్రావ్.

జనార్ధన్ ఉక్రోషంగా లేచి నిలబడ్డాడు. "అలా అబద్ధాలు మాట్లాడకండి! రెండో రోజు కూడా మార్నింగ్ షో వేశారట."

"అయినా రాత్రి పెగ్ నెంబర్ త్రీ కొట్టాం కాబట్టి కొంచెం సరదాగా కాలనీ అంతా తిరిగాము గానీ- పెగ్ నెంబర్ టూ వరకూ అయితే ఏమీ గొడవుండదు-" అన్నాడు యాదగిరి.

"మేము రోజూ తాగేది కూడా లేదు- మనసు బాగోనప్పుడే" అన్నాడు జనార్ధన్.

ఆ రాత్రి సరిగ్గా పన్నెండికి మళ్ళా కేకలు వినిపించినయ్. కాలనీ వాళ్ళంతా కిటికీలోనుంచే టార్చ్ లైట్లు ఫోకస్ చేసి చోద్యం చూడసాగారు.

"నా కొడుకులు! ఒకేఒక్క మార్నింగ్ షో ఆడిందంట! థూ దొంగ నాయాళ్ళు" అరిచాడు జనార్ధన్.

"సాలేగాళ్ళన్నా ఆళ్ళందరూ! రెండోరోజు మార్నింగ్ షోలో మన యాక్షన్ కి ఇద్దరు తప్పట్లు కొట్టిన్రట! ఆ సంగతెవళ్ళన్న చెప్తరేమో చూడు-"

ఆ తరువాత ఇద్దరూ పాట మొదలుపెట్టారు "జయంబు నిశ్చయంబురా భయంబు లేదురా! సినిమా ఫీల్డు కెళ్ళినోడికి ఎదురులేదురా- ఎదురు లేదురా"

మర్నాడు పొద్దున్నే మళ్ళీ వాళ్ళిద్దరినీ బయటకు పిల్చాము. "ఎప్పుడో మనసు బాగోనప్పుడే తాగుతామన్నారు కదా నిన్న" అడిగాడు రంగారెడ్డి కోపంగా.

"నిన్న మళ్ళీ మనసు పాడయిపోయిందన్నా" అన్నాడు జనార్ధన్ విచారంగా.

"ఎందుకని?"

"మా ప్రొడ్యూసర్ సెకండ్ పిక్చర్ లో మళ్ళీ మమ్మల్ని బుక్ చేసుకుంటానన్జెప్పి- మోసం చేశాడు"

"అంటే ఇంకెవరినయినా వేసుకున్నాడా?"

"కాదు గురూ! అసలు సెకండ్ పిక్చరే తీయకుండా ఎగ్గొట్టాడు!"

"బాస్టర్డ్! బ్రీచ్ ఆఫ్ ప్రామిస్" అన్నాడు యాదగిరి కోపంగా

"అంటే ఇవాళ మీ వల్ల ఏ గొడవా ఉండదని గ్యారంటీ ఇస్తారు! అంతేనా?"

"సెంట్ పర్సెంట్" అన్నాడు జనార్ధన్.

ఆ రోజు రాత్రి హఠాత్తుగా మళ్ళీ బయట కేకలు వినిపించినయ్. అది యాదగిరి గొంతని తెలుస్తూనే ఉంది. వెంటనే బయటకు పరుగెత్తారందరూ! అప్పటికే మిగతా చాలా మంది ఇళ్ళల్లోనుంచి బయటికొస్తూ కనిపించారు ఆ గొడవకి.

అందరం కాలనీ మధ్యలో ఆగిన ఆటోరిక్షా దగ్గరకు చేరుకున్నాం. ఆటోలో జనార్ధన్, యాదగిరి ఇద్దరూ కూర్చుని ఉన్నారు.

"ఏయ్! మేమేం ఊరోళ్ళం అనుకున్నావా? ఏయ్- మంచిగా జెప్తున్నా- మా కాలనీకి తీస్కపో! లేకుంటే నువ్వూ ఈడనే ఉంటావ్- నీ ఆటో భీ ఇక్కడనే ఉంటది!" అన్నాడు యాదగిరి.

ఆటోడ్రైవర్ మావేపు దీనంగా చూశాడు.

"ఇగో చూడండి సార్! అర్ధగంట కెల్కి కిరికిరి చేస్తున్రు ఈళ్ళు- నిర్భయ్ నగర్ కాలనీ ఇదేనంటే ఇనటం లేదు-"

"వీళ్ళెక్కడ ఎక్కారు ఆటో అసలు?" అడిగాడు శాయిరామ్.

"అదేసార్-కాలనీ బయటే బార్ లో నుంచి వచ్చి ఆటోలో కూర్చున్నారు. నిర్భయ్ నగర్ కాలనీ వెళ్ళాలన్నారు. ఆ కాలనీ ఇదే గద్సార్. ఆటో ఎందుకు అని ఎంత మొత్తుకున్నా విన్లేదు-"

"ఏమిటి యాదగిరీ గొడవ?" అడిగాం.

"చూడు బాస్! ఆటో ఎక్కికూచున్నామో లేదో ఇదే నిర్భయ్ నగర్ కాలనీ దిగమంటున్నాడు. తాగితే మాకు హోష్ ఉండదనుకున్నాడు!"

"అవును మరి! మన నిర్భయ్ నగర్ కాలనీ ఇదేగదా?" అన్నాడు రంగారెడ్డి.

"ఇదిగో- మనాళ్ళయుండి ఆ ఆటో వాడిని సపోర్ట్ చేస్తారా! మీకు సిగ్గులేదూ? దమ్ముంటే మమ్మల్ని సపోర్టు చేయాలి!" అన్నాడు జనార్ధన్ కళ్ళు కొంచెంగా తెరచి.

"అంటే ఇది మన కాలనీ కాదంటావా?" అడిగాడు శాయిరామ్.

"ఛస్తే కాదుగ మన కాలనీకి ఇంకా చాలా దూరం పోవాలి!" అన్నాడు యాదగిరి.

"ఇదేం కిరికిరి షార్! అర్ధగంట కెళ్ళి! జర మదద్ జేయండి సార్- వాళ్ళను బయటకు లాగుదాం!" అన్నాడు ఆటో అతను.

"జనార్ధన్! ఏమిటోయ్ ఇది? ఆటో దిగండి!" అన్నాడు గోపాల్రావ్.

"మేము దిగం!" అన్నాడు యాదగిరి.

"ఎందుకని?" అడిగాడు శాయిరామ్.

"ఇది మన కాలనీ కాదు-"

"కాకపోవటమేమిటి? మీ ఇల్లు కనబడటంలే?"

"నా కసలు ఇల్లేలేదు-"

యాదగిరి భార్య ఆ మాట వినడంతోనే కోపంగా ముందుకొచ్చి నిలబడింది.

"ఏందీ నీ కసలు ఇల్లే లేదా?"

"లేదు-"

"ఇప్పుడు ఇల్లు లేదంటున్నావ్, ఇంకాసేపాగితే భార్య లేదంటావ్-"

"అవ్- నాకు భార్య గూడా లేదు-"

"ఓర్నాయనో- భార్య లేదంటున్నాడు" అంటూ గట్టిగా ఏడుపు మొదలు పెట్టిందామె.

అందరం అడ్డుపడి ఆమె ఏడుపు ఆపేశాం.

"ఇదిగో చూడవోయ్- ఇలారా ఓ సారి" ఆటోడ్రైవర్ ని పక్కకు పిలిచాన్నేను.

"ఏమిటి సార్?"

"నువ్వో పనిచెయ్- ఆటోని కాలనీ చుట్టూ ఓ రౌండ్ కొట్టించి తీసుకురా! అప్పుడు దిగుతారేమో చూద్దాం" సలహా ఇచ్చాడు రంగారెడ్డి.

ఆటో రివ్వున కాలనీ వెనుకవేపు నుంచీ రౌండ్ కొట్టి తిరిగివచ్చి మధ్యలో ఆగింది.

"ఇదే సార్ నిర్భయ్ నగర్ కాలనీ-" అన్నాడు అతను.

"గట్ల దారికిరా! ఎంత తాగినా గానీ మా కాలనీ ఏదో తెలుసుకోలేని బేవకూఫ్ లు గాదు మేము.." అన్నాడు యాదగిరి ఆటో దిగుతూ.

జనార్ధన్ కూడా దిగి నిలబడ్డాడు.

ఆటోవాడు హఠాత్తుగా నా కాళ్ళమీదా రంగారెడ్డి కాళ్ళమీదా పడిపోయాడు.

"ఇయాళ నా ఆటోనీ, నా ఫ్యామిలీని బ్రతికించిన్రుసార్ - లేకుంటే ఈడనే తెల్లారిపోతుండె."

వాళ్ళిద్దరినీ బలవంతంగా ఇళ్ళల్లోకి ఈడ్చుకెళ్ళాము. ఆ మర్నాటి నుంచీ మా కాలనీ పేరు చెప్తే ఆటోవాళ్ళు

రావడానికి తిరస్కరించటం మొదలుపెట్టారు. ఆటోలు, సైకిల్ రిక్షాలు అంతవరకూ నెమ్మదిగా వచ్చి అక్కడి నుంచీ మా కాలనీ దాటేవరకూ మాంచి స్పీడులో వెళ్ళిపోతున్నాయ్.

రోజూ రాత్రి పన్నెండు వరకూ వాళ్ళిద్దరూ కాలనీ అంతా తిరుగుతూ అందరినీ నిద్రలేపుతూ, పాటలు పాడుతూ నానాగొడవా చేసేయటం మామూలయిపోయింది.

శనివారం రాత్రి వాళ్ళతోపాటు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ కూడా చేరి గట్టిగా పాటలు పాడడం ప్రారంభించేసరికి కాలనీలో ఆడాళ్ళందరికీ భయం పెరిగిపోయింది.

రోజుకో మగాడు చొప్పున వెళ్ళి ఆ గ్యాంగ్ లో చేరిపోతాడేమో అన్న అనుమానం వచ్చేసింది. అందుకే మర్నాడు శాయిరామ్ ఏర్పాటు చేసిన మీటింగ్ కు మగాళ్ళ కంటే ఆడాళ్ళే ఎక్కువమంది వచ్చారు.

"ఇదంతా పెగ్ నెంబర్ త్రీ వల్లే వస్తోంది!" అంది రాజేశ్వరి మైక్ ముందు నిలబడి. "వీళ్ళ మందుకి సంబంధించిన విషయాలన్నీ నేను సేకరించాను- చాలా బార్స్ లో! వీళ్ళ కెపాసిటీ ఏమిటంటే రెండు పెగ్గుల వరకూ ఎలాంటి సమస్యా ఉండదు. కానీ పెగ్ నెంబర్-త్రీ కొట్టగానే అమాయకులయిన మనలాంటి ప్రజలమీద పడి చిత్రవధ చేసేస్తున్నారు. కనుక పెగ్ నెంబర్ త్రీ కొట్టకుండా వాళ్ళకు అడ్డుపడదాం మనం!" అందామె. అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

"అయితే వాళ్ళకు మూడోపెగ్ మాత్రం ఇవ్వకుండా నాలుగూ అయిదూ ఎన్నయినా ఇవ్వమని బార్ వాళ్లకు చెప్తేసరి!" అంది పార్వతీదేవి.

మేమందరం నవ్వాం ఆ సలహాకు! ఎందుకు నవ్వారని పార్వతీదేవి తరిచి తరిచి అడిగింది గానీ మేము చెప్పలేదు.

"వీళ్ళను మందు జోలికి పోకుండా చేయాలంటే ఒక అయిడియా ఉంది!" అంది రాజేశ్వరి.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగారు జనార్ధన్ భార్య, యాదగిరి భార్య.

"హిప్నటైజ్ చేయటం! తాగుడంటే అలర్జీ కలిగేటట్లు హిప్నటైజ్ చేయిస్తే చాలు! ఇంక జన్మలో తాగరు."

"అద్భుతం - అద్భుతం!" అంటూ తప్పట్లు కొట్టింది చంద్రకాంత్ భార్య.

"ఇంకోమందు కూడా ఉంది" అన్నాడు రంగారెడ్డి.

"ఇసూల్ ఫిరామ్ అంటే (యాంటాబ్యూష్) టాబ్ లెట్లు వాడితే వాళ్ళకు ఆ తాగుడు సీసాలు చూస్తే చాలు భయం పట్టుకుంటుంది."

అందరూ తప్పట్లు కొట్టారు మళ్ళీ.

మా కాలనీలోనే ఉన్న వివిన్ పాల్ ఆ మధ్య ఆరుగంటల్లో హిప్నాటిజం క్రాష్ కోర్స్ నేర్చుకున్న విషయం మాకు గుర్తుకొచ్చింది. ఆ పనికి అతనినే నియోగించాము.

మర్నాడు రంగారెడ్డి డిసూల్ ఫిరామ్ టాబ్ లెట్లు రెండొందలు తెచ్చి జనార్ధన్ భార్యకూ, యాదగిరి భార్యకూ ఇచ్చాడు.

"రోజుకి రెండుచొప్పున- వాళ్ళకు తెలీకుండా మంచినీళ్ళల్లో వేసి తాగించండి" అంటూ సలహా ఇచ్చాడు.

ఆరోజు సాయంత్రమే వివిన్ పాల్ హిప్నాటిజం ప్రారంభించాడు.

యాదగిరి ఇంట్లోనే అందరం గుమి కూడాము.

"మీరిద్దరూ నావంకే చూస్తున్నారు" అన్నాడు వివిన్ పాల్.

"అవును చూస్తున్నాం" అన్నారు వాళ్ళిద్దరూ.

"నా కళ్ళల్లోకే చూస్తున్నారు-"

"అవును చూస్తున్నాం-"

"మీరిప్పుడు నిద్రావస్థలోకి వెళ్లిపోతున్నారు. మీ కళ్ళు మూతలుపడి పోతున్నాయ్. మీ మనస్సు ప్రశాంతంగా ఉంది. మీరు రెక్కలొచ్చిన పక్షుల్లా ఎక్కడికో, ఏ లోకాల్లోకో ఎగిరిపోతున్నారు. నా గొంతు తప్పితే ఇంక మీకు ప్రపంచంలో ఏమీ వినిపించడంలేదు..."

"అన్నీ వినబడుతున్నాయ్" అన్నాడు జనార్ధన్.

"వినబడుతున్నా ఆ సంగతి బయటకు చెప్పకూడదు" కోపంగా అరిచాడు పాల్.

"మీరిప్పుడు ప్రగాఢమయిన, ప్రశాంతమయిన, పవిత్రమయిన, ప్రక్షాళనమయిన స్థితిలో కెళ్ళిపోయారు- ఛస్తే బయటకు రాలేరు! వస్తే చచ్చారే! ఇప్పుడు మీకు నేనేది ఇచ్చినా మజ్జిగలాగానే కనబడుతుంది! మీరేం తాగినా మజ్జిగలాగానే కనబడుతుంది. ఇల్లంతా మజ్జిగమయంం బార్ అంతా మజ్జిగ మయం! ప్రపంచమంతా మజ్జిగ మయం!" అంటూ ఆపి యాదగిరి భార్యకు సైగ చేశాడు పాల్.

ఆమె వెంటనే రెండు గ్లాసుల్నిండా బ్రాందీ పోసుకొచ్చి వాళ్ళిద్దరి ముందూ చెరో గ్లాసూ పెట్టింది.

"ఇప్పుడు మీరు మీ ముందు గ్లాసుల్లో ఉన్న మజ్జిగ తాగుతారు!" అన్నాడు పాల్.

"మజ్జిగా?"

"అవును తాగండి-"

"వద్దు! మజ్జిగంటే మాకు అలర్జీ!" గ్లాసులు విసిరికొడుతూ అన్నారు వాళ్ళు అందరం పాల్ ని కౌగిలించుకున్నాం. "ఇంక నీ హిప్నాటిజంకి తిరుగులేదు" అంటూ అభినందించాం.

"అంతే! వీళ్ళిక ఎప్పుడు బ్రాందీ తాగినా మజ్జిగలా అనిపిస్తుంది. కనుక ఎప్పటికీ వీళ్ళిక మందు కొట్టరు" అన్నాడతను విజయగర్వంతో.

"ఫెంటాస్టిక్! ఈ వార్త మా పేపర్లో వేసేస్తాను" అన్నాడు గోపాల్రావ్.

"ఇంక మీరిప్పుడు నార్మల్ ప్రపంచంలో కొచ్చేస్తారు. అయితే బ్రాందీ విస్కీల్లాంటివి ఏం తాగినా మీకు పుల్లని మజ్జిగ తాగినట్లే అనిపిస్తుంది-" అన్నాడు పాల్.

వాళ్ళిద్దరూ మామూలు ప్రపంచంలో కొచ్చేశారు.

వెంటనే టాబ్ లెట్లు కలిపిన మంచినీళ్ళు ఇద్దరికీ ఇచ్చేసింది జనార్ధన్ భార్య.

అది తాగ్గానే మమ్మల్ని చూసి 'కెవ్వు'మని అరచారిద్దరూ.

"ఏమిటలా అరచారు?" అడిగాడు రంగారెడ్డి.

"భయం వేసింది ఎందుకో!" భయంగా చెప్పారు వాళ్ళు.

రంగారెడ్డి గర్వంగా మా అందరివేపూ చూశాడు.

ఆ సాయంత్రం వాళ్ళిద్దరూ మళ్ళీ బార్ కెళ్తోంటే నేను రహస్యంగా వాళ్ళను వెంబడించి వాళ్ళకి తెలీకుండా ఆ పక్క రూమ్ లోనే కూర్చున్నాను.

"పిచ్చి సన్యాసులు- మనం నిజంగానే హిప్నటైజ్ అయిపోయా మనుకున్నారు-" అన్నాడు జనార్ధన్. నేను షాకయ్యాను.

ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు కాసేపు.

"ఆ టాబ్లెట్స్ కలిపిన మంచినీళ్ళు తాగ్గానే మనకు నిజంగానే భయం వేసిందని కూడా భలే బోల్తాపడ్డారు-"

మళ్ళీ నవ్వుకున్నారిద్దరూ.

బేరర్ బాటిల్ తీసుకెళ్ళి వాళ్ళ ముందున్న గ్లాసుల్లో మందు పోయటం నాకు కనబడుతూనే ఉంది.

రెండు నిముషాలే నిశ్శబ్దంగా ఉన్నారిద్దరూ.

"ఇదేదో మజ్జిగ వాసన వేస్తోందేమిటి?" అన్నాడు జనార్ధన్.

"అవునన్నా! నేనూ అదే చెప్దామనుకుంటున్న నీతో-" అన్నాడు యాదగిరి.

జనార్ధన్ బేరర్ ని పిలచాడు.

"యస్సార్"

"బ్రాంది అదోలా ఉందేమిటివాళ?"

"అదే బ్రాండ్ కద్సార్ తెచ్చింది?"

"అఫ్ కోర్స్ బ్రాండ్ అదేననుకో- ఇంకే కష్టమరూ దీన్ని గురించి ఏమీ చెప్పలేదా?"

"చివరి కాబిన్లో కూర్చున్నాయన చెప్పారు సార్!"

"ఏమని?"

"ఈసారి స్టాక్ చాలామంచి స్టఫ్ తో వచ్చిందని-"

"ఐసీ- సరే- నువ్వెళ్ళు"

మళ్ళీ అయిదు నిమిషాల నిశ్శబ్దం.

"నేను తాగలేనుగురూ! నా కింకా మజ్జిగవాసనే కొడుతోంది" అన్నాడు జనార్ధన్?

"నాకూ అంతే!"

"వదిలేసి వెళ్లిపోదామా?"

"వాంతులు చేసుకోవటం కన్నా అదే మంచిది గదా!"

"ఒకవేళ- బై ఛాన్స్- జస్ట్ ఫర్ అవర్ సేక్- ఆ పాల్ గాడి హిప్నాటిజం ఏమయినా వర్క్ చేసిందంటావా?"

"ఏమోగురూ! నాకేం సమజ్ కావటం లేదు-"

"సరే-పద! రేపు చూద్దాం!"

వారం రోజులు గడిచిపోయింది. ఇప్పుడు జనార్ధన్, యాదగిరి నిజంగానే భయం భయంగా చూస్తున్నారు మా అందరివంకా! జనార్ధన్ రాత్రుళ్ళు తన నీడనే చూచుకుని కెవ్వున అరుస్తున్నాడని వాళ్ళావిడ చెప్పింది.

చివరకు వాళ్ళిద్దరూ మందు మానేశారు. కాలనీవాళ్ళందరం కలసి పాల్ కి వెయ్యిరూపాయల పర్స్ బహుకరించాం!

ఆ మర్నాడే పాల్ ఆ వెయ్యి రూపాయలూ బార్ లో జనార్ధన్ కీ, యాదగిరికీ డ్రింక్స్ సర్వ్ చేసిన బేరర్ కి ఇస్తూంటే నేనూ రంగారెడ్డి, శాయిరామ్ చూడటం తటస్థించింది.

వెనుకనుంచి వెళ్ళి పాల్ భుజం మీద చెయ్యి వేశాము.

గాల్లోకి ఎగిరిపడ్డాడు పాల్.

"మీరా!" అన్నాడు పాలిపోయిన మొఖంతో.

"సంగతేమిటి?" అడిగాడు శాయిరామ్.

ఆ బేరర్ నిజంగానే బ్రాందీలో బటర్ మిల్క్ కలిపి ఇచ్చాడు వాళ్ళకు- అందుగ్గాను నేను వెయ్యి రూపాయలు అతనికివ్వాలని ఒప్పందం!"

"అయితే ఇది నీ హిప్నాటిజం ప్రభావం కాదన్నమాట!"

"ఎందుకో అది పనిచేయలేదు గురూ! నాకు నేర్పించినవాడిని వదలన్లే- ఎప్పుడో పట్టుకుని తుక్కు రేగ్గొట్టేస్తాను-"

అందరం నవ్వేశాము.

"కాని గురూ! దయచేసి ఈ విషయం ఎవరికీ చెప్పకండి నా ప్రిస్టేజ్ పోతుంది."

బ్రతిమాలసాగాడు పాల్.

"సరే!" అన్నాం అయిష్టంగానే.

చాలా రోజుల తర్వాత మళ్ళీ ఆరోజు అందరం ఉదయం పదిగంటల వరకూ సుఖంగా నిద్రపోవాలని నిర్ణయించుకున్నాము.

కానీ ఉదయం ఆరయేసరికి బయట పెద్ద కోలాహలం వినిపించేసరికి కాలనీని తిట్టుకుంటూ బయటకు వెళ్ళక తప్పలేదు నాకు.

అక్కడి దృశ్యం చూస్తూనే నిద్రమత్తంతా వదిలిపోయింది.

పాల్ ఇంటిముందు కొన్ని వేలమంది స్త్రీలు క్యూ కట్టి నిలబడి ఉన్నారు.

* * * * *

# అపూర్వ ప్రేమాశ్రమం అను పాపపు కథ

ఆదివారం నాడు మా నిర్భయ్ నగర్ కాలనీ వాళ్ళందరం నిశ్చింతగా ఉదయం తొమ్మిదింటివరకూ నిద్రపోవాలని కలలు కనటం - మా కలల్ని మా కాలనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ శాయిరామ్ ఏదోవిధంగా భగ్నం చేయడం మీ అందరికీ తెలిసిన సంగతే కదా!

అంచేత ఆ శనివారం రాత్రి కాలనీ చాలామందిమి కలసి ఊరేగింపుగా శాయిరామ్ ఇంటికి వెళ్ళాం.

"బాబ్బాబు! మేమంతా రేపు ఉదయం తొమ్మిదింటి వరకూ హాయిగా నిద్రపోవాలని, రోజంతా హాయిగా భార్యాబిడ్డలతో గడపాలనీ నిశ్చయించుకున్నాం. గనుక రేపొక్కరోజు మమ్మల్ని మీటింగులూ, గొడవలూ లేకుండా వదిలేస్తే చచ్చి నీకడుపున పుడతాము" అన్నాడు గోపాల్రావ్.

"భలేవారే దాన్దేముంది! అంతగా కావాలంటే మీరు నిద్రలేచాకే మీటింగ్ పెట్టుకుందాం!" అన్నాడు శాయిరామ్ చిరునవ్వుతో.

"బాబోయ్! అంతమాటనకు. అసలు రేపు నువ్వు మా ఇంటికి రావద్దు" బ్రతిమలాడాడు రంగారెడ్డి.

శాయిరామ్ అయిష్టంగానే అంగీకరించాడు.

ప్రోగ్రాం ప్రకారం కాలనీ వాళ్ళందరం నిద్రలో కరిగిపోతున్నాం. అంతలోనే హఠాత్తుగా లాంగ్ విజిల్స్ వినిపించేసరికి నాకు నిద్ర కాస్తా చెడిపోయింది. ఆ విజిల్స్ వెనుకే పిల్లల కోలాహలం, కేకలు, అరుపులూ వినిపించేసరికి కళ్ళు తెరవక తప్పలేదు.

టైము ఏడే అయిందప్పటికి.

శాయిరామ్ మీద కోపంతో లేచి ఇంట్లో నుంచి బయటికొచ్చి చూశాను.

అప్పుడే మిగతా కాలనీ వాళ్ళందరూ కూడా ఇళ్ళల్లో నుంచి బయటికొస్తున్నారు నిద్రకళ్ళతో.

కాలనీ మధ్యలో కొంతమంది చిన్న పిల్లలు చినిగిన బట్టలతో లైనుగా నిలబడి ఉన్నారు.

శ్యామల్రావ్ మధ్యలో నిలబడి పుస్తకంలో ఏదో రాసుకుంటున్నాడు.

శ్యామల్రావ్ కొడుకు పిల్లలందరినీ లైన్లో నుంచోబెడుతున్నాడు.

ఆ గొడవ శాయిరామ్ తాలూకూ మీటింగ్ ది- కాదని తెలిశాక మాక్కోపం తగ్గిపోయింది.

కుతూహలం కొద్దీ వాళ్ళ దగ్గరకు చేరుకున్నామందరం.

ఆ పిల్లలను చూడగానే గుర్తుపట్టాము.

ఆ మధ్య మతకల్లోలాలు జరిగినప్పుడు తల్లిదండ్రులిరువురినీ పోగొట్టుకుని, ఆదరించేవారు లేక తిండికోసం కర్ఫ్యూ ఏరియాదాటి మా కాలనీలో కొచ్చి అడుక్కోవటం పెట్టారు. వారిలో పూటకు గడవని కుటుంబాల పిల్లలూ, మధ్యతరగతి కుటుంబాల పిల్లలూ, ముస్లిమ్ ల పిల్లలూ, హిందువుల పిల్లలూ అందరూ ఉన్నారు. వాళ్ళు మా కాలనీలో కొచ్చి ఇంగ్లీష్ లోనూ, ఉర్దూలోనూ, తెలుగులోనూ "ఆకలేస్తుంది! అన్నం కావాలి" అని కళ్ళల్లో నీళ్లు నింపుకుని అడుగుతూంటే మా కాలనీ వాళ్ళందరం జాలిపడి, వారి కథంతా తెలుసుకుని అందరికీ ఎంతో కొంత భోజనం ఏర్పాట్లు చేశాము. వాళ్ళు కాలనీలో తలో ఇంట్లో భోజనం చేసి మేమిచ్చిన పాత దుప్పట్లూ, దుస్తులూ వాడుతూ కాలనీ వరండాల్లోనే గడుపుతున్నారు.

ఇప్పుడు శ్యామల్రావ్ వాళ్ళనే కాలనీ మధ్యకు చేర్చి అందరి పేర్లూ రాసుకుంటున్నాడు.

ఆ తరువాత ఫోటోగ్రాఫర్ వచ్చి వాళ్ళందరి గ్రూప్ ఫోటోలూ వివిధ కోణాల్లో తీసుకుంటున్నాడు. ఆఖర్లో మరీ చిక్కి శల్యమైపోయిన ఓ ఏడేళ్ళ పాపను ప్రత్యేకంగా ఫోటోలు తీశాడు.

"ఏమిటిదంతా?" రంగారెడ్డి ఆశ్చర్యంగా అడిగాడు శ్యామల్రావ్ ని.

"ఏమిటా? కనబడ్డంలేదూ? దరిద్రం! కటికదరిద్రం. మనందరం రెండుపూటలా కడుపునిండా భోజనం చేస్తూ ఉదయం తొమ్మిదింటి వరకూ నిద్రపోతూంటే- మన పక్కనే ఉన్న ఈ చిన్నారి పాపలు ఒక్క పూటయినా తిండిలేక ఆకలితో అలమటిస్తున్నారు. ఎంతకాలం వీరినీ దారుణమైన పరిస్థితిలో చూడటం? అందుకే వీరి బాధలు నాచేతనయినంత వరకూ రూపుమాప దలచుకున్నాను- వీరికోసం ఓ ఆశ్రమం పెట్టి నేనే పోషించదల్చుకున్నాను- భావి భారత పౌరులు వీళ్ళు. వీళ్ళను నా దేశం నిర్లక్ష్యం చేసినా నేను చేయను-" ఆవేశంగా అన్నాడతను.

ఆ స్పీచ్ కి మేమంతా ఎంత చలించి పోయామంటే- అలా మాట్లాడింది శ్యామల్రావ్ కాక ఇంకెవరయినా అయివుంటే అయిదు నిమిషాల పాటు కరతాళ ధ్వనులు చేసేవాళ్ళం.

శ్యామల్రావ్ స్వార్థం గురించీ "గెట్ రిచ్ క్విక్" మెంటాలిటీ గురించీ మాకు క్షుణ్ణంగా తెలుసు కాబట్టి అందరం అనుమానంగా మొఖాలు చూసుకున్నాం.

"నిజంగా మీరు చేయబోయేది అద్భుతమయిన సేవ సార్. రేపే మీ గురించి మా పేపర్లో హెడ్ లైన్స్ లాగించేస్తాను. "అనాథ పాపాలకు తాత- శ్యామల్రావ్ దాత" ఎలా వుంది?" అన్నాడు గోపాల్రావ్ శ్యామల్రావ్ స్పీచ్ కి కదిలిపోయి.

శ్యామల్రావ్ చిరునవ్వు నవ్వాడు.

"పరమ శివుడి అనుజ్ఞ మేరకు నిర్వహిస్తున్న ఈ మహోన్నత కార్యక్రమానికి ప్రచారం వద్దు నాయనా. అంతా ఈశ్వరేచ్ఛ!"

అంటూ ఆ పిల్లలందరినీ వరుసగా లైన్లో తీసుకెళ్ళిపోయాడు.

మేము మరి కాసేపటికి తర్వాత మా ఇంట్లో సమావేశమయ్యేసరికే జనార్ధన్ ఓ న్యూస్ తీసుకొచ్చాడు.

శ్యామల్రావ్ ఇంటికి అపూర్వ ప్రేమాశ్రమం అన్న బోర్డు పెట్టారుట.

"తమాషాగా ఉందే. ఒకవేళ శ్యామల్రావ్ నిజంగానే నిస్వార్థపరుడిగా మారలేదు కదా?" అడిగాను నేను.

"అది మాత్రం నేను నమ్మను" అన్నాడు శాయిరామ్.

"అవును. మేమూ నమ్మం." అన్నారు మిగతావాళ్ళు.

"మారకపోతే మరి అంతమంది పిల్లలకు భోజనం ఎలా పెడతాడు?" అడిగాడు రంగారెడ్డి.

ఎవ్వరం మాట్లాడలేదు. వారం రోజులు గడిచిపోయినయ్. అందరం రోజూ ఏదొక వంక పెట్టుకుని శ్యామల్రావ్ ఇంటి మీదుగా రౌండ్స్ కొడుతూ లోపలేం జరుగుతుందో తెలుసుకోడానికి ప్రయత్నాలు చేయసాగాము గానీ ఏమీ తెలీటం లేదు.

హఠాత్తుగా ఓ రోజు మధ్యాహ్నం ఓ చిన్న లారీలో నాలుగయిదు పెద్ద పెద్ద పాకేజీలు శ్యామల్రావ్ ఇంటికి చేరడం మా కాలనీలో ఆడాళ్ళందరూ చూశారు.

ఇది జరిగిన రెండో రోజున ఆశ్రమం పిల్లలందరూ రంగు రంగుల బట్టలతో ముచ్చటగా కాలనీ మధ్య కాసేపు డ్రిల్ చేయటం నేర్చుకున్నారు.

ఆ రాత్రి మళ్ళీ సమావేశం జరిగింది మా ఇంట్లో.

"శ్యామల్రావ్ సంగతి ఏమాత్రం అంతుబట్టటం లేదు. ఆ పిల్లలందరికీ అంత ఖరీదయిన బట్టలెలా కుట్టించాడో-" అన్నాడు జనార్ధన్.

"అదే నాకు అర్థం కావటం లేదు. ఏదో కొంపలు ముంచే కార్యక్రమం చేపట్టాడనటం మాత్రం ఖాయం!" అన్నాడు రంగారెడ్డి.

"ఇప్పుడే మనందరం ఏదొక విధంగా వాడి కార్యక్రమాలు కూపీ లాగకపోతే మన కాలనీని మనకు తెలీకుండా ఎవరికో అమ్మేస్తాడు" అన్నాడు శాయిరామ్.

"మరి ఆ డిటెక్టివ్ పని ఎవరు చేస్తారు?" అడిగాను నేను.

"ఇంకెవరు? మన డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరే ఇలాంటి విన్యాసాలు అద్భుతంగా చేయగలదు-" అంది పార్వతీదేవి.

రాజేశ్వరి మొఖం సంతోషంతో విప్పారింది.

"ఓ! ఆ విషయం నాకొదిలేయండి. వారం రోజుల్లో మొత్తం వివరాలు సేకరిస్తాను-" అందామె ఉత్సాహంగా.

మర్నాడు మేమంతా కేవలం ఆశ్రమం ఎలా నడుస్తోందో చూడటానికన్నట్లు బయల్దేరాము.

శ్యామల్రావ్ మమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానించాడు. లోపల గదుల్లో పిల్లలందరి పక్కబట్టలు నీట్ గా సర్ది ఉన్నాయ్. పిల్లలు పెరట్లో చెమటలు కక్కుతూ తోటపని చేస్తున్నారు.

"కమాన్ చిల్డ్రన్! మిమ్మల్ని చూడ్డానికి అంకుల్స్ వచ్చారు." అన్నాడు శ్యామల్రావ్ వాళ్ళతో. మరుక్షణంలో అందరూ వచ్చి మా ముందు రెండు లైన్లు కట్టి నిలబడ్డారు.

"మీ కందరికీ ఇక్కడ ఆనందంగా ఉందా?" అడిగాడు రంగారెడ్డి ఆత్రుతగా.

"ఓ! చాలా హాపీగా ఉన్నాము!" అందరూ చిరునవ్వుతో చెప్పారు.

"కడుపునిండా భోజనం పెడుతున్నారా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

"ఓ! మాణింగ్ బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం డిన్నరు, సాయంత్రం బిస్కెట్, టీ, రాత్రి సప్పర్-"

అందరం మొఖాలు చూచుకున్నాం.

అలాంటి ఆహారం మేము కూడా భరించలేని పరిస్థితిలో ఉన్నాము. మరి శ్యామల్రావ్ అంత ఖరీదయిన మెనూ వాళ్ళకెలా సమకూరుస్తున్నాడో అర్థం కావటం లేదు.

ఆ తరువాత పదిహేను రోజులకు మళ్ళీ పెద్ద పార్శిల్స్ లారీలో శ్యామల్రావ్ ఇంటికొచ్చాయి.

ఆ తరువాత మరో వారానికి శ్యామల్రావ్ కలర్ టీవీ సెట్ కొనుక్కొని రావటం అందరం చూశాము.

మరో వారానికి శ్యామల్రావ్ మా కాలనీలోనే తన కుటుంబం కొడుకు కుటుంబం కోసం త్రీ బెడ్ రూమ్ ఇల్లొకటి అద్దెకు తీసుకున్నాడు.

శ్యామల్రావ్ ఏదో మాయ చేస్తున్నాడని అందరికీ నమ్మకమయితే కుదిరింది గానీ ఏం చేస్తున్నాడో మాత్రం ఎవరికీ అంతుబట్టటం లేదు.

డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి ఇంకా తన 'పరిశోధన' పూర్తికాలేదని చెప్పేసింది.

"ఒకవేళ అనాథాశ్రమం అన్జెప్పి డొనేషన్లు పోగుజేసి తినేస్తున్నాడేమో!" తన అనుమానం వెలిబుచ్చాడు రంగారెడ్డి.

"అవునవును! ఆ విషయం వెంటనే ఆరా తీయాలి!" అన్నాడు శాయిరామ్. అప్పటికప్పుడే జర్నలిస్టు గోపాల్రావ్ కి శ్యామల్రావ్ కార్యకలాపాలన్నీ కనిపెట్టి వివరాలు సేకరించే కార్యక్రమం అప్పజెప్పాం.

వారం రోజుల తరువాత గోపాల్రావ్ వివరాలతో వచ్చాడు.

శ్యామల్రావ్ ఎక్కడా డొనేషన్లు కోసం తిరగటం లేదు. కానీ రోజూ పోస్టల్ కరస్పాండెన్స్ మాత్రం చాలా విపరీతంగా జరుగుతోంది. ఉదయం సాయంత్రం పోస్టాఫీస్ కెళ్ళటమే అతని కార్యక్రమం-

మేమంతా మాట్లాడుతూండగానే రాజేశ్వరి తన పరిశోధన రిపోర్టుతో సహా వచ్చేసింది.

"పూర్తి వివరాలు దొరకటం లేదుగానీ- నాకు తెలిసిందేమిటంటే- శ్యామల్రావు ఆ పిల్లలందరికీ గంజినీళ్ళు రెండు సార్లు తాగించటం తప్పితే ఇంకేమీ తిండి పెట్టడం లేదు. తరచుగా వాళ్ళని బెల్టు తీసుకుని వాతలు తేలేట్లు కొడుతున్నట్లు పనిమనిషి చెప్తోంది..."

అందరికీ ఆ పిల్లల మీద జాలి కలిగింది.

"వాళ్ళనెలాగయినా ఆ దుర్మార్గుడి బారినుంచి రక్షించాలి. వాడు తిండి పెట్టకుండా, అలా చావకొడుతూంటే మనం ఎందుకు చూస్తూ ఊరుకోవాలి?" అన్నాడు జనార్ధన్.

"మనం చేయాల్సిన పనేంటంటే ముందు ఆ పార్శిల్స్ ఎక్కడి నుంచి ఎందుకొస్తున్నాయో, ఆ కరస్పాండెన్స్ ఎవరితో జరుపుతున్నాడో తెలుసుకోవాలి." అన్నాడు రంగారెడ్డి.

అందరూ రంగారెడ్డిని బలపరచారు.

ఆ మర్నాడు అందరం ఆఫీస్ కి శెలవుపెట్టి పోస్టుమెన్ కోసం ఎదురు చూడసాగాము.

మా ఇంటికి లెటరు ఇవ్వటాని కొచ్చి మా అందరినీ చూసి ఆశ్చర్యపోయాడు పోస్టుమన్.

"ఏం గురూజీ ఎమర్జెన్సీ మీటింగా?"

"అబ్బేకాదు. మీ కోసమే ఎదుర్చూస్తున్నాం రండి. ఇలా కూర్చోండి" అన్నాన్నేను. పోస్టుమన్ లోపలికొచ్చి కూర్చున్నాడు.

అతనికి శ్యామల్రావ్ 'అపూర్వ ప్రేమాశ్రమం' గురించి మా అనుమానాలు చెప్పాక అసలు విషయం కదిపాము.

"మరేం లేదు, అతను కరస్పాండెన్స్ ఎవరితో జరుపుతున్నాడు అనే వివరాలు కావాలి."

దాన్దేముంది సార్. నాకు తెలుసు ఆ అడ్రస్. ఆస్ట్రేలియాలో 'లవర్టన్' అనే ఊరు నుంచీ అతనికి పార్సెల్స్ ఉత్తరాలు తరచుగా వస్తుంటాయ్."

"అక్కడినుంచీ ఎవరు పంపుతున్నారు?"

అతను తన సంచీలో నుంచి ఓ ఉత్తరాల కట్టతీసి అందులోనుంచి ఓ పెద్ద కవరు బయటకు లాగాడు.

"ఇదిగో - ఫ్రమ్ అడ్రస్ చూడండి! 'లవర్టన్ లేడీస్ సొసైటీ' అన్న రబ్బరు స్టాంప్ ఉంది!"

అందరం ఆ కవరుని పరీక్షించాము.

"గురూ! వీడు పెద్ద ఎత్తున దేశాన్ని అమ్ముతున్నట్లున్నాడు. అసలే ఈ మధ్య విదేశీ గూఢచారుల గురించి రోజూ పేపర్లలో వార్తలొస్తున్నాయ్" అన్నాడు శాయిరామ్.

"ఒక్కసారి! ఈ కవరు ఓపెన్ చేసి చూస్తే బావుంటుంది!" అన్నాడు పోస్టుమన్ వంకచూస్తూ.

"బాబోయ్ నా ఉద్యోగం పోతుంది..." భయంగా అన్నాడతను.

"నువ్ ఫికర్ చేయకన్నా! ఈ సీక్రెట్ ఎవళ్ళతోను చెప్పం మళ్ళా" అన్నాడు యాదగిరి భరోసా ఇస్తూ.

ఎలాగయితేనేం అరగంట సేపు బ్రతిమాలాక పోస్టుమన్ వప్పుకున్నాడు. వెంటనే జాగ్రత్తగా కవరు విప్పి ఉత్తరం బయటకు లాగాము.

ఉత్తరంలో నుంచి జలజలా కార్ట్ సైజ్ ఫోటోలు బోలెడు కిందకు రాలినయ్.

వాటిని చూస్తూనే అందరం ఆశ్చర్యపోయాము.

అవన్నీ 'అపూర్వ ప్రేమాశ్రమం'లోని పిల్లలవి.

అందరూ చిరిగి పీలికల్లా వేలాడుతున్న బట్టలతో ఓ ఫోటో!"

ఓ పిల్ల ఎండిన డొక్కలతో నేలమీద చచ్చిపోయినట్లు పడి ఉన్న ఫోటో! అందరూ ఆకలి బాధకు తాళలేక ఎంగిలి విస్తరాకులు నాకుతున్న ఫోటో-

ఇలా అన్నీ కటిక దరిద్రం చూపించే ఫోటోలే! ఏ ఫోటో చూసినా మనకు ఏడుపు కలగక తప్పదు. ఇంగ్లీష్ లో ఉందా ఉత్తరం. గట్టిగా చదివాడు శాయిరామ్!

బీదల పాలిట జీసస్ క్రైస్ట్, శ్యామల్రావ్,

మీరు ప్రతిరోజూ రాస్తోన్న ఉత్తరాలూ, మీ ఆశ్రమం పిల్లల దారుణ పరిస్థితిని చూసే ఫోటోలూ మా కందుతున్నాయ్. అవి చూస్తుంటే మాకెవ్వరికీ మనశ్శాంతి ఉండటం లేదు. రాత్రుళ్ళు నిద్రపట్టడంలేదు. భారతదేశం మహా దరిద్రగొట్టు దేశమని మాకు తెలుసు గానీ- ఇలా చిన్నచిన్న పాపలు రోడ్ల మీదపడి ఆకలితో చచ్చిపోతుంటారని మాకింతవరకూ తెలీదు.

మీరు పంపిన ఆ ఫోటోలు చూశాక మేము ఛీలీ భూకంపం బాధితుల కోసమని సేకరించిన ఆహారం, బట్టలూ, సామగ్రీ, రగ్గులు- మొదలైనవన్నీ కూడా ముందు మీకు మళ్ళించాము.

మా సొసైటీకున్న ఫండ్స్ అన్నీ కూడా బాంక్ నుంచి విత్ డ్రా చేసి మీ ఆశ్రమం కోసం పంపించాము. ప్రస్తుతం మా దగ్గర ఇంకేమీ డబ్బులేదు. మళ్ళీ ఇప్పట్లో పోగుజేసే శక్తి కూడా లేదు. ఎందుకంటే మావీ మధ్య తరగతి కుటుంబాలే! మీకో విషయం చెప్తే మీరు ఆశ్చర్యపోతారేమో!

భారతదేశంలో రోడ్లమీద ఆకలితో చనిపోయే పిల్లల ఫోటోలు చూశాక మేమంతా గత పదిహేను రోజులుగా ఒక్కపూటే భోజనం చేస్తూ ఆదా అయిన డబ్బు మీకు పంపాము.

దయచేసి మమ్మల్నింకా బాధించకండి! మా దగ్గరున్న సర్వస్వం మీ ఆశ్రమం కోసమే పంపించాము. ప్రస్తుతం మా సొసైటీ మెంబర్లందరం ఇంచుమించుగా కట్టుబట్టలతో ఉన్నామంటే అతిశయోక్తి కాదు. ఫండ్స్ అన్నీ అయిపోయిన కారణంగానూ, అప్పులెక్కువగా చేయాల్సి వచ్చిన కారణంగానూ మేము మా 'లవర్టన్ లేడీస్ సొసైటీ"ని మూసివేస్తున్నాము. మీ భారతదేశం పిల్లల్ని ఆ భగవంతుడే కాపాడాలని మా ఆకాంక్ష!"

కొద్ది క్షణాల వరకూ మాకెవరికీ నోటమాట రాలేదు.

"అమ్మ రాస్కెలగ చూశారా- పాపం ఆ ఆడాళ్ళ క్లబ్ ని పట్టుకుని ఎంత మోసం చేస్తున్నాడో! ఆ పెద్ద ఇంటికి అద్దె, ఆ స్కూటరూ, ఫ్రిజ్, కలర్ టీవీ అన్నీ వాళ్ళను ముంచే సమకూర్చుకున్నాడు" అన్నాడు శాయిరామ్.

ఉత్తరం మళ్ళీ అంటించి పోస్ట్ మెన్ కిచ్చి పంపించివేశాం.

ఏదేమయినా సాయంత్రం శ్యామల్రావ్ ఆటకట్టేయాలని నిర్ణయించుకున్నాం.

అందరం కలసి ఆశ్రమానికి వెళ్ళేసరికి శ్యామల్రావ్ ఖంగారు పడ్డాడు.

పిల్లలంతా గదుల్లో కూర్చుని అగ్గిపుల్లలు లెక్కబెట్టి అగ్గి పెట్టెలో ఉంచుతున్నారు.

"చూశారా ఈ పిల్లల వల్ల రెండు లాభాలు-" అన్నాడు రంగారెడ్డి.

"ఆస్ట్రేలియా సొమ్ములు మంచిగా అందుతున్నాయా సార్?" అడిగాడు యాదగిరి. శ్యామల్రావ్ ఉలిక్కిపడ్డాడు గానీ వెంటనే సర్దుకున్నాడు.

"ఎంతోమంది సహాయాలు చేస్తే గానీ ఈ యజ్ఞం సజావుగా సాగదు" అన్నాడు చిరునవ్వుతో.

"పాపం. ఈ పిల్లల ముఖాలు చూస్తుంటే కేవలం గంజి తాగి బ్రతుకుతున్నట్లుంది." అన్నాడు జనార్ధన్.

"భలేవారే! నా చిన్నారి పాపలను నేను పస్తుంచుతానా? నా కంఠంలో ప్రాణం ఉండగా ఆ పని జరగదు-"

అందరం అదో పెద్ద 'జోక్' అన్నట్లు గట్టిగా నవ్వాం.

"అబ్బ హబ్బ. ఏం జోకేశారు సార్." అన్నాడు రంగారెడ్డి కింద కూలబడిపోయి నవ్వుతూ.

"మీకు నామాట మీద నమ్మకం లేకపోతే ఈ చిన్నారి బాలలనే అడగండి నాయినా." అన్నాడు తాపీగా శ్యామల్రావ్.

శాయిరామ్ వెంటనే వెళ్ళి ఓ కుర్రాడిని చేయిపట్టుకుని తీసుకువచ్చాడు, వాడు సన్నగా చీపురు పుల్లలా ఉండి- ఏ క్షణాన్నయినా ప్రాణాలు వదిలేటట్లున్నాడు.

"ఒరేయ్. నిజం చెప్పమ్మా. రోజూ మీరు ఏమేం తింటున్నారిక్కడ?" అడిగాడు. జనార్ధన్ వాడిని ఆప్యాయంగా.

వాడు కళ్ళు మూసుకుని బట్టీ పట్టినట్లు గడగడా చదివేశాడు.

బ్రేక్ ఫాస్ట్ రెండు గుడ్లు- నాలుగు బ్రెడ్ స్లైసెస్- బటర్- ఒకగ్లాసు పాలు- మధ్యాహ్నం నాలుగు రొట్టెలు - అన్నం రెండు వెజిటేరియన్ కర్రీస్- పప్పు- పెరుగు- సాయంత్రం - ఎనిమిది బిస్కెట్లూ- పాలు- రాత్రి బ్రెడ్, అన్నం- రెండు కూరలూ- పప్పు- పెరుగూ నాలుగు రకాల పండ్లు-"

ఎవ్వరం మాట్లాడలేకపోయాం.

అవన్నీ తిన్నా వాళ్ళ ఆకారాలు అలా ఉన్నాయంటే- చాలా ఆశ్చర్యంగా వుంది.

"ఇంకా నమ్మకం కలుగలేదా నాయినా?" చిరునవ్వుతో అడిగాడు శ్యామల్రావ్.

"శ్యామల్రావ్! నువ్వు చేస్తున్నదంతా నాకు తెలుసు! పాపం ఈ పసిపిల్లలను అడ్డుపెట్టుకుని ఆ పారినర్స్ ని ఫూల్ చేస్తున్నావ్! వాళ్ళు పంపేవన్నీ అమ్ముకుని- నువ్వు డబ్బు సంపాదిస్తున్నావ్-" అన్నాడు జనార్ధన్.

"రేపే మా పేపర్లో హెడ్ లైన్స్ లాగించేస్తాను. బాలల ఆశ్రమం పేరుతో విదేశీ మహిళల దోపిడీ! నిర్భయ్ నగర్ కాలనీ వాసుల సెన్సేషన్ ఇన్ వెస్టిగేషన్! ఎలా వుంది గురూ కాప్షన్?" అడిగాడు గోపాల్రావ్.

"అమాయకులారా! బాలల సేవే మాధవ సేవయని నమ్మినవాడిని నాయనా." మమ్మల్నందరినీ జాలిగా చూస్తూ అన్నాడు శ్యామల్రావ్.

రంగారెడ్డికి ఛటుక్కున ఓ ఉపాయం తట్టినట్లుంది. నా చెవిలో ఊదాడు.

"ఒండర్ ఫుల్ అయిడియా" అన్నాన్నేను.

రంగారెడ్డి వెంటనే పక్కగదిలో గోడకు వేలాడుతున్న బెల్ట్ తీసుకుని ఓ కుర్రాడిని మా మధ్యకు లాక్కొచ్చాడు.

"ఒరేయ్. నిజం చెప్పకపోతే బెల్టుతో చావగొడతాను. నీకు రోజూ తినడానికేమి పెడుతున్నాడ్రా శ్యామల్రావ్?"

వాడు ఏడుపు మొఖం పెట్టాడు.

"చెప్తే మీరెళ్ళిపోయాక నన్ను కొడతాడు..." అన్నాడు భయంగా.

"మేము నిన్ను మాతో తీసుకెళ్ళి పోతాంలే- చెప్పు త్వరగా-"

వాడు భయంభయంగానే చెప్పసాగాడు.

"మాకేమీ పెట్టడు, మధ్యాహ్నం, రాత్రీ కొంచెం గంజి ఇస్తాడు-"

"మరి ఇందాక గుడ్లు, బ్రెడ్, బటర్ అన్నావు గదురా"

"అవన్నీ చెప్పకపోతే కొడతాడు-"

శ్యామల్రావ్ కి చెమటలు పట్టేసినాయి.

"ఇదంతా మీకు అనవసరం వెళ్ళండి" అన్నాడు బెదిరింపుగా.

"సరే. రేపు జైల్లో కూర్చోవాల్సిన రాత నీకుంటే మేమేం చేస్తాం" అంటూ అందరం బయటకొచ్చేశాం.

మర్నాడు పొద్దున్నే రాజేశ్వరి అందరినీ తీసుకొచ్చింది మా ఇంటికి.

"ఏమిటి?" విషయం తెలీక అడిగాను.

"ఆశ్రమం క్లోజ్ చేసేశాడు దొంగ రాస్కెల్-" అందామె.

"మరి పిల్లలు?"

"మళ్ళా మన కాలనీలోకొచ్చేసి మన వరండాలో కూర్చున్నారు!"

మా అందరికీ సంతృప్తి కలిగింది.

"పోనీలే- ఎక్కడ అడుక్కుతిన్నా- స్వేచ్ఛగా బ్రతుకుతారు!" అన్నాన్నేను.

* * * * *

## సెన్సార్ కత్తెర జిందాబాద్!

సెన్సార్ ఆఫీసుకి వరుసగా నాలుగు టాక్సీలు వచ్చి ఆగాయి.

మొదట టాక్సీలో నుంచి విప్లవ్ దిగాడు. అతని వెనుకే అతని యూనిట్ సభ్యులు. మరుక్షణంలో ఆ ప్రాంతమంతా వారి కేకలతో దద్దరిల్లి పోసాగాయ్.

సెన్సార్ బోర్డ్ డౌన్ డౌన్.

ముర్దాబాద్ ముర్దాబాద్- సెన్సార్ బోర్డ్ ముర్దాబాద్.

సెన్సార్ పాలసీ - ఛీ - ఛీ!

సెన్సార్ బోర్డు సభ్యులు- భో భో!

సెన్సార్ కత్తెర - ఛీ ఛీ!

సెన్సార్ నిబంధనలు- హెల్! హెల్!

"ఏము నిర్మించిన "మారణహోమం' సినిమాకు వెంటనే క్లీన్ సర్టిఫికెట్- ఇవ్వాలి. అర్థం లేని అంట కత్తెరలు- నశించిపోవాలి!"

ఈ హడావుడికి అప్పటికే అక్కడ గారడీ వాడికి పోగయినట్లు జనం పోగయ్యారు.

విప్లవ్ కేకలు కాసేపు వాయిదావేసి తనవెంట వచ్చిన వాళ్ళందరిని పిలిచి ఏదో చెప్పాడు.

వాళ్ళిద్దరూ చెరో స్పీకరూ సంచీల్లోనుంచి తీసిపాట మొదలెట్టారు.

"సూర్యకాంతి నాపడం- నీ యబ్బతరమా?
విప్లవాన్ని ఆపడం- నీ తాత తరమా?
మా సినిమాకు కత్తిరించడం- నీ తలలో జేజెమ్మ తరమా?

అక్కడ చేరిన వారందరూ ఆ పాటకు ఆనందిస్తున్నట్లే కనబడింది వాతావరణం.

ఈ హడావిడికి సెన్సార్ బోర్డు ఆఫీసరు ఖంగారుగా బయటికొచ్చాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అనడిగాడు ఎదురుగ్గా నిలబడ్డ విప్లవ్ ని.

"ఏం జరగటమా. హు? ఏం జరిగిందీ అనడుగుతున్నారా? హు హు! నేను నిర్మించి, దర్శకత్వం వహించిన ప్రప్రథమ చిత్రాన్ని త్రొక్కిపడతారా? అరవై కట్లు సజెస్ట్ చేస్తారా? బాన్ చేస్తారా? హుహుహు చూస్తాను- ఇవాళ నా సినిమాని ఆపగలరు! కానీ రేపు విప్లవాన్ని ఆపగలరా? లేరు, లేరు, లేరు!" ఆవేశంగా అరిచాడు విప్లవ్.

"అయ్యా! మీరనేదేమీ నాకు తెలీటం లేదు" అన్నాడు ఆఫీసరు అయోమయంగా.

"అదే! మీరు నిర్ధాక్షిణ్యంగా, నిరంకుశత్వంగా సర్టిఫికెట్ ఇవ్వకుండా అణచిపెట్టిన నా సినిమా సంగతేమిటి, అని మిమ్మల్ని అడుగుతున్నాను, ప్రశ్నిస్తున్నాను."

"చూడు నాయనా! సర్టిఫికెట్ ఇవ్వని సినిమాలు రెండొందలు పాతిక ఉన్నాయ్! అందులో మీదేది!"

"ఆ! ఏమిటి? మా సినిమాయే తెలీదా? కాదు! తెలుసు! కానీ తెలీనట్లు నాటకం! ఎందుకంటే మీలో ఉన్నది బూర్జువా రక్తం.!"

"నా రక్తం ఎ.బి. గ్రూప్ అని డాక్టరు చెప్పారు బాబూ! బూర్జువా గ్రూపు కాదు."

"అయితే అరవై కట్స్ విధించిన మా సినిమా సంగతేమిటి? అన్ని కట్స్ ఎందుకు విధించారు? ఎందుకు బాన్ చేశారు?"

"అయ్యా! అరవై కట్స్ విధించిన సినిమాలు మా లిస్ట్ లో నూటపాతిక ఉన్నాయ్. బాన్ చేసినవి డెబ్బయ్ ఆరున్నయ్ అందులో మీదేదో చెప్పకపోతే ఎలా తెలుస్తుంది."

"మాది విప్లవాత్మకమైన చిత్రం! పేరు 'మారణహోమం!"

"చూడు నాయనా! ప్రభుతం ఇచ్చిన మార్గదర్శక సూత్రాల ప్రకారమే ఎగ్జామినింగ్ కమిటీ ఆ కట్స్ విధించింది. మీరు ఆ కట్స్ చేయడానికి నిరాకరించడం వల్ల అది రివైజింగ్ కమిటీ కెళ్ళింది. వాళ్ళు మీ సినిమాను బాన్ చేయాలని తీర్మానించారు. దీనికి మేమేం చెయ్యం?" అనేసి ఆఫీసరు లోపలికెళ్ళిపోయాడు.

"అదే కుట్ర! అదే మోసం! అదే దగా! నా సినిమాను బాన్ చేసి నా పరువూ, ప్రతిష్టా, నా భవిష్యత్తూ, నా సినిమా కలెక్షన్లూ, అన్నీ మంట కలపాలని, నా విప్లవ భావాల్ని నాలోనే అంతం చేయాలని మీరాడుతున్న నాటకం ఇది! కానీ నేను మీ కుట్రకు బలయ్యే పక్షిని కాదు. మీ సెన్సార్ విధానాల్ని, మీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ నీ, మీ తెలివితేటల్నీ, మీ కత్తెరనూ- నా కంఠంలో ఆఖరి ప్రాణం బొట్టు ఉన్నంతవరకూ ఎదిరిస్తాను, పోరాడతాను."

అనేసి వెనక్కు తిరిగి "సెన్సార్ బోర్డ్" అని అరిచాడతను.

అందరూ "డౌన్ డౌన్" అంటూ ముక్తకంఠంతో అరిచారు. ఈసారి అక్కడ ఈ గొడవ చూడ్డానికని గుమిగూడిన బఠానీలవాళ్ళూ, ఐస్ క్రీమ్ కుర్రాళ్ళూ సిటీ చూడ్డానికొచ్చిన పల్లెటూరివాళ్ళూ- ఇంకా అనేకరకాల జనం కూడా ఉత్సాహంగా అరవడం ప్రారంభించారు.

సెన్సార్ బోర్డ్ డౌన్ డౌన్!

ముర్దాబాద్ ముర్దాబాద్- సెన్సార్ బోర్డ్ ముర్దాబాద్.

సెన్సార్ పాలసీ - ఛీ ఛీ!

సెన్సార్ బోర్డ్ మెంబర్స్- భో - భో!

సెన్సార్ కత్తెర ఛీ - ఛీ!

సెన్సార్ రూల్స్ హెల్ హెల్!

మారణహోమం - రిలీజ్ చెయ్. అరవై కట్లూ- గో బాక్!

వుడ్ డిమాండ్ - క్లీన్ సర్టిఫికెట్.

మా చిత్రం మీద నిషేధం- తీసేయాలి ఈ క్షణమే ఇప్పుడే!

అరుపులు, కేకలు, ఈలలూ క్రమక్రమంగా పెరిగిపోతూండేసరికి ఆఫీసరు హడావుడిగా బయటికొచ్చాడు.

"అయ్యా- మీరిలా అల్లరి చేస్తుంటే అవతల మా ఆఫీస్ పని ఎలా జరుగుతుంది చెప్పండి! మీరు చెప్పదల్చుకుందేదో నినాదాల రూపంలో కాకుండా మొమొరాండం రూపంలో ఇస్తే పై అధికారులకు పంపుతాను" అన్నాడు వినయంగా.

"అదేం కుదరదు! ఇవాళ సాయంత్రం వరకూ అరుస్తూనే ఉంటాం! రేపట్నుంచీ నేనూ, మా యూనిట్ సభ్యులు- అందరం ఇక్కడే నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాం! ఆ తరువాత పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుంది" అని అరిచాడు.

చేసేది లేక ఆఫీసరు మళ్ళీ లోపలికెళ్ళిపోయాడు.

మర్నాడు అందరూ నిరాహారదీక్ష ప్రారంభించారు.

అన్ని న్యూస్ పేపర్లలోనూ ఈ వార్త మార్మోగిపోయింది.

రెండో రోజున విప్లవ్ కి సెన్సార్ ఆఫీసర్ నుంచి కబురు వచ్చింది.

"మీ సినిమా కేవలం రెండు కట్స్ తో రిలీజ్ చేయడానికి ప్రభుత్వం అనుమతించింది" అన్నాడు ఆఫీసరు.

వెంటనే బయటకు పరుగెత్తి "ఇంక్విలాబ్" అని అరిచాడు విప్లవ్.

అందరూ "జిందాబాద్" అని అరిచారు.

విప్లవం గెలిచిందీ

కుట్ర- ఓడిందీ

సెన్సార్ బోర్డ్ - డౌన్ డౌన్.

మారణహోమం - జిందాబాద్.

అందరూ కేకలు వేసుకుంటూ వెళ్ళిపోయారు. ఆ సినిమా రిలీజయి రెండొందలు రోజులాడి ఇంకా ఆడేయసాగింది. వెంటనే రెండో సినిమా తీసేశాడు విప్లవ్.

ఒక మంచి రోజు చూసుకుని సెన్సార్ ఆఫీస్ కి టాక్సీలో చేరుకున్నాడు.

"హలో హలో హలో- విప్లవ్ గారా! రండి! కూర్చోండి" అన్నాడు సెన్సార్ ఆఫీసర్.

"మా 'అగ్ని కణం' సినిమా ఎగ్జిమినింగ్ కమిటీవాళ్ళు చూశారా?" అడిగాడతను.

"చూశారండి! నేనే మీకా విషయం ఫోన్ చేద్దామనుకుంటున్నాను. ఇంతలో మీరే వచ్చేశారు."

"ఇది కూడా 'బాన్' చేస్తున్నారు కదూ!"

"నో నో నో- లేదండీ! నో బాన్!" చిరునవ్వుతో అన్నాడు ఆఫీసర్.

విప్లవ్ అదిరిపడ్డాడు.

"ఏమన్నారు? బాన్ చేయడం లేదా?"

"లేదండీ! బాన్ చేయాలన్న ఐడియా అసలెవ్వరికీ రాలేదు-"

విప్లవ్ మొఖం పాలిపోయింది.

"ఇది అన్యాయం! అక్రమం" అంటూ టేబుల్ మీద గట్టిగా చరిచాడు.

ఆఫీసర్ అదిరిపోయి లేచి కుర్చీ వెనక్కు వెళ్ళి నిలబడ్డాడు.

విప్లవ్ కళ్ళముందు తన సినిమాను కొనడానికొచ్చిన జిల్లాలవారీ కొనుగోలుదార్లు కనబడుతున్నారు. తన సినిమా చూడ్డానికి తండోపతండాలుగా వచ్చిన జనం కనబడుతున్నారు-

"ఈ సినిమాకు సెన్సారోళ్ళు క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చార్రా! అంటే చెత్త పిక్చరయి ఉంటుంది" అనుకుని జనం వెనక్కు వెళ్ళిపోతున్న సీన్ కళ్ళముందు కనబడుతోంది.

"అయ్యా మా జిల్లాకు రెండొందల అరవై రూపాయలకయితే కొంటాను" అంటున్నాడో కొనుగోలుదారు.

"ఏమిటీ రెండొందల అరవయ్యా! నీకేం మతిపోలేదు కదా!"

"అంతే గురూజీ! ఈ విప్లవాలు, గొడవలూ చాలా సినిమాల్లో ఉన్నాయి. మనక్కావలసింది అదికాదు. అదివరకులాగా "బాన్" చేయడం మీరు నానా గోలవ చేయడం జరిగితే మంచి పబ్లిసిటీ అయి జనం చూడ్డానికొస్తారు" అనేసి వెళ్ళిపోయాడతను.

"ఇది అన్యాయం అంటున్నాను-" మళ్ళీ బల్ల గుద్దాడతను.

"ఏది అన్యాయం?" అయోమయంగా అడిగాడు సెన్సార్ ఆఫీసర్.

"మా సినిమా" అగ్నికణం బాన్ చేయాలని సజెస్ట్ చేయకపోవడం."

అప్పటికి గాని సెన్సార్ ఆఫీసర్ కి విషయం అర్థం కాలేదు. కానీ ఆశ్చర్యం నుంచి మాత్రం ఇంకా తేరుకోలేదు.

"కానీ మీ పిక్చర్ లో అభ్యంతరకరమయిన దృశ్యాలు, డైలాగులు ఏమీలేందే- "బాన్" ఎలా సజెస్ట్ చేస్తారు?"

"అభ్యంతరకరమయిన దృశ్యాలు ఏమీలేవా?" ఇంకా కోపంతో రెచ్చిపోతూ అన్నాడు విప్లవ్.

"లేవు అనే అంటున్నారు-"

"వాళ్ళకు మతిపోయి అంటున్నారు. లేకపోవడమేమిటి? సినిమా మొదట్నుంచీ చివరివరకూ ఉన్న సీన్లలో ముప్పై సీన్లు పరమ అభ్యంతరకరమైనవి. పోలీసులు- ఓ పిల్లల తల్లి రిపోర్టివ్వడానికొస్తే ఆమెను రేప్ చేయడం- ఆమె వాళ్ళ మీద రిపోర్టివ్వడానికి కలెక్టర్ దగ్గరకెళ్ళితే అతనూ రేప్ చేయడం- చివరకు మంత్రి కూడా ఆమెను రేప్ చేయడం- అప్పుడు ఆమె ఆత్మహత్య చేసుకోవడం- అది చూసి ఆమె తమ్ముడు కత్తి తీసుకుని వారందరినీ చంపడం- అక్కడితో ఆగక విప్లవ నాయకుడయి ప్రజల్ని సమీకరించి డబ్బున్న వాళ్ళనూ, ఆఫీసర్లనూ, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులనూ అందరినీ నరుక్కుంటూ వెళ్ళి- ప్రభుత్వాన్ని పడగొట్టి, అడ్డువచ్చిన మిలటరీని చిత్తుగా ఓడించి- కొత్త ప్రభుతం ఏర్పాటు చేయడం- ఇవన్నీ ఏమిటి? అభ్యంతరం కాదా? మాకే తెలుసా విషయం! కాదని మీరెలా అనగలరు?"

సెన్సార్ ఆఫీసరుకి చిరాకు పుట్టుకొచ్చింది.

"చూడండి! మా ఎగ్జామినింగ్ కమిటీ చెప్పాల్సిన విషయాలవి! వాళ్ళు ఎలా చెప్తే అలా చేస్తాం గానీ - మీరు చెప్పినట్లెలా చేస్తాం?"

విప్లవ్ కొద్ది క్షణాలకు ఆవేశం అణచుకుని కుర్చీలో కూలబడిపోయాడు మళ్ళీ. జేబులోనుంచి కర్చీఫ్ తీసి చెమటను తుడుచుకున్నాడు.

"సరే- జరిగిందేదో జరిగింది! కట్స్ ఏమేం సజెస్ట్ చేశారు? అవయినా పదిహేనో, ఇరవయ్యో ఉన్నాయా?" అడిగాడతను.

క్లీన్ సర్టిఫికెట్ ఇస్తున్నామండీ! కట్స్ కూడా ఎవ్వరూ సజెస్ట్ చేయలేదు- సినిమా నీట్ గా, చక్కగా ఉంటుందన్నారు అందరూ! ఇంకా కట్సెందుకు" చిరాగ్గా అన్నారు సెన్సార్ ఆఫీసర్.

దాంతో విప్లవ్ ఉగ్రుడైపోయాడు.

"ఇది అన్యాయం అని ఇందాకన్నాను గుర్తుందా? సెన్సార్ ఆఫీసర్ని అడిగాడతను.

"అవును! గుర్తుంది! ఎందుకు?"

"ఇప్పుడా మాట ఉపసంహరించుకుంటున్నాను. ఇది అన్యాయం కాదు- కుట్ర. నా పరువు ప్రతిష్టలు, నా భవిష్యత్తూ, నా సినిమా కలెక్షన్లు అన్నీ మంట కలపాలని మీరాడుతున్న నాటకం! దగా, మోసం-" బిగ్గరగా అరిచాడతను.

అతని అరుపులకి ఆఫీస్ లోని స్టాఫ్ అంతా పరుగుతో వచ్చారక్కడికి- "ఏమిటలా అరుస్తున్నారు?" అడిగారు వాళ్ళు.

విప్లవ్ వాళ్ళందరినీ చూసి మళ్ళీ స్పృహలో కొచ్చాడు.

"నేను గట్టిగా మాట్లాడానా?" వాళ్ళనడిగాడు అయోమయంగా.

"మాట్లాడడమేమిటి సార్! అరిచారు."

"అయామ్ సారీ!" వాళ్ళు వెళ్ళిపోయారు మళ్ళీ.

"ఇదిగో విప్లవ్ గారూ! ఇందాకటి నుంచీ చూస్తున్నారు మీ డైలాగులు నాకేమాత్రం అర్థం కావటం లేదు. మీ సినిమాకి క్లీన్ సర్టిఫికెట్ దొరుకుతుంటే సంతోషించక- బాన్ ఎందుకు చేయలేదు? కట్స్ ఎందుకు లేవు? ఇదంతా కుట్ర అంటారేమిటి?' విసుగ్గా అడిగాడు సెన్సార్ ఆఫీసర్.

విప్లవ్ శాంతించాడు. తను ఆవేశపడితే ఏమాత్రం లాభం లేదని అర్థమైపోయింది.

"అయ్యా! నేను ఇంతకుముందు తీసిన సినిమాకు మీరు ఓ పట్టాన సర్టిఫికెట్ ఇవ్వకపోవడం మూలాన ఆ సినిమాకు అది పబ్లిసిటీ అయింది. నా సినిమా రిలీజ్ కి అనుమతి ఇవ్వాలంటూ నేను నానా గొడవ చేసి పేపర్ల నిండా స్టేట్ మెంట్లిచ్చి, ఆఖరికి మీరు కొన్ని కట్స్ తో పర్మిషనిచ్చాక "సెన్సార్ వారితో పద్దెనిమిది నెలకు హోరాహరీ పోరాటం తర్వాత రిలీజవతున్న మహోజ్వల చిత్రం" అని వాల్ పోస్టర్ల మీదా, గోడల మీదా రాయించి రిలీజ్ చేసేసరికి మేము నాలుగు వారాలాడుతుందనుకున్న సినిమా ముప్పయ్ వారాలాడింది. మా పార్టనర్స్ కూ, డిస్ట్రిబ్యూటర్స్ కీ, బైయర్స్ కీ

అందరికీ తెగ లాభాలొచ్చాయ్. ఈ సినిమా కూ్కడా అదే పబ్లిసిటీ ఇవ్వవచ్చని ఆశపడ్డాం! అంతేకాదు. ముందే వాల్ పోస్టర్లూ, ఇతర పబ్లిసిటీ మెటీరియల్ అంతటా-" సెన్సార్ వారి కబంధ హస్తాల నుండి- తీవ్ర పోరాటం ద్వారా రిలీజవుతున్న "వీర విప్లవ అగ్నికణం" అని ప్రింట్ చేయించేశాం. ఇప్పుడు మీరు మాతో వివాదం పెట్టుకోకపోతే మా సినిమా ఏమయిపోతుంది? మేమేమయిపోతాం? అంచేత దయచేసి కనీసం కొన్ని కట్స్ అయినా సజెస్ట్ చేయండి- నేను వాటిని తిరస్కరిస్తాను. అప్పుడు అది రివైజింగ్ కమిటీ కెళుతుంది. వాళ్ళూ ఆ కట్స్ ని సజెస్ట్ చేస్తారు. నేను ఒప్పుకోకుండా మొండికేస్తాను. అప్పుడది సెన్సార్ బోర్డ్ ఛైర్మెన్ కెళ్తుంది. నేను వాళ్ళ మాటా వినను- అలా నేనూ మీరూ పేచీలు పడుతూ- కిందామీదా పడుతూ- స్టేట్ మెంట్లిస్తూ- హడావుడి చేస్తుంటే అప్పుడుగాని దానికి పబ్లిసిటీ రాదు సార్! అప్పుడుగాని కనీసం నాలుగు వారాలాడదు. అప్పుడు గాని మాకు నాలుగు డబ్బులు మిగలవు!

సెన్సార్ ఆఫీసర్ నవ్వాడు. "సారీ కుదరదు. మీ పిక్చర్ కి క్లీన్ సర్టిఫికెట్టే ఇస్తాం."

విప్లవ్ కుర్చీలో నుంచి లేచాడు.

"అలా అనకండి సార్! ఇంతకుముందు ఇవే దృశ్యాలు తీసినప్పుడు కట్ చేయమన్నారు, బాన్ చేయమన్నారు. కానీ ఇప్పుడు మళ్ళీ అవే తీస్తే- క్లీన్ సర్టిఫికెట్ ఇస్తామంటున్నారు. చెప్పండి సార్! ఇది కావాలని చేస్తున్న అరాచకం కదూ?"

"సెన్సార్ నిబంధనలు మారాలని మీ నిర్మాతలే అప్పుడు గొడవ చేశారు కదా! అందుకని కొన్ని మార్చారు ఇదిగో మిష్టర్ విప్లవ్! మేము ఎవరికీ కావాలని ఏమీ చేయము. మా ఎగ్జామినంగ్ కమిటీ ఎలా నిర్ణయిస్తే అలా జరుగుతుంది అంతే!"

"మా అగ్నికణం" చూసిన ఎగ్జామినంగ్ కమిటీ సభ్యులెవలెవరు సార్?"

"ఎందుకు?"

"వారినందరినీ పర్సనల్ గా కలుసుకుని ఏదో ఒక కట్ సూచించమని ప్రాధేయపడతాను"

"అదేం కుదరదండీ! ఇంక మీరు వెళ్ళవచ్చు-"

"బాబ్బాబు! అలా కోప్పడకండి! పోనీ ఒక్క కట్ చెప్పండి చాలు"

"కుదరదండీ! మాకు ఎక్కడా తప్పు కనిపించనప్పుడు, నిబంధనలు, అతిక్రమించనప్పుడు మేమెందుకు కట్ చేస్తాం?"

"బాబోయ్- అంత మాటనకండి! పెళ్ళాం బిడ్డలు గలవ్వాడిని. మా సినిమా హీరోకి రివల్యూషనరీ హీరోగా ప్రేక్షకుల్లో మంచి పేరుంది సార్! అతనెప్పుడూ బీదలనాదుకుంటాడనీ, ప్రభుత్వాన్ని చీల్చి చెండాడతాడనీ అందరికీ తెలుసు. అలాంటి హీరో స్నిమాకు క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిస్తే సినిమా ఒక్క వారంలో ఔటయిపోతోంది. అంతేకాదు! ఆ తరువాత అస్సలు మా సినిమాలు చూడరు. హీరో కూడా ఈగలు తోలుకోవలసిందే!"

"అందుకు నేను చేయగలిగిందేమీ లేదు-"

విప్లవ్ ఉక్రోషం, కోపం, ఆవేశం ముంచుకొచ్చాయ్. అక్కడి నుంచి చరచరా వెళ్ళిపోయాడు.

మర్నాడు మళ్ళీ నాలుగు టాక్సీలు సెన్సార్ ఆఫీసుకొచ్చి ఆగాయి.

వాటిల్లో నుంచి విప్లవ్ అతని యూనిట్ సభ్యులు బిలబిల దిగారు.

మరుక్షణంలో వారికేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోసాగింది.

సెన్సార్ బోర్డ్- డౌన్ డౌన్.

"సెన్సార్ నిబంధనలు- ఇంకా కఠినం కావాలి.

ప్రతి సినిమాకు ఒక్క కట్ అయినా - విధించాలి.

బాన్ చేయాలా వద్దా అనే విషయం- నిర్మాతకే వదలాలి!

క్లీన్ సర్టిఫికెట్- ఛీ! ఛీ!

పాత సెన్సార్ నిబంధనలు- జిందాబాద్!

లిబరలైజ్ డ్ సెన్సారింగ్ పాలసీ - మాకొద్దు!

సెన్సార్ కత్తెర - జిందాబాద్!

ఆ చుట్టూపక్కల చేరిన జనం కూడా ఉత్సాహంగా వాళ్ళల్లో చేరి కేకలు వేయడంలో యధాశక్తి సాయం చేయసాగారు.

క్లీన్ సర్టిఫికెట్- ఛీ! ఛీ!

సెన్సార్ కత్తెర - జిందాబాద్.

* * * * *

## సెక్స్ ఎడ్యుకేషన్

పిల్లలకు సెక్స్ ఎడ్యుకేషన్ ఉండాలని కొందరూ, ఉండకూడదని మరికొందరూ గొడవ పడటం మాకాలనీ వాళ్ళందరం న్యూస్ పేపర్స్ లో చూస్తూనే ఉన్నాం. కానీ ఎవ్వరం దానిని గురించి పట్టించుకోలేదు. ఆ టాపిక్ కంటే పిల్లలకు సరయిన తిండీ బత్తా, విద్యా ఉండాలా అక్కర్లేదా అనే టాపిక్ గురించి గొడవ చేస్తే సమంజసంగా ఉంటుందని మా అభిప్రాయం. అయితే అనవసరమయిన టాపిక్ గురించి గొడవ పడటం మనదేశం ప్రత్యేకత కాబట్టి మాకిష్టం లేకపోయినా ఆ టాపిక్ మా నెత్తిమీద కొచ్చి పడింది.

సెక్స్ ఎడ్యుకేషన్ పిల్లల పాఠ్యాంశాలలో చేర్చాలా వద్దా అనే విషయం స్టడీ చేయటానికి ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. మామూలుగా ఏ కమిటీ అయినా ముందు విదేశాలకెళ్ళి పోతుంది. గనుక ఆ కమిటీ కూడా అమెరికా, డెన్మార్క్ దేశాలు పర్యటించి ఆ తర్వాత హైద్రాబాద్ చేరుకుంది. హైద్రాబాద్ లో స్టడీ చేయటం కోసం వాళ్ళు మా కాలనీని కూడా ఎన్నుకున్నారు.

ఆదివారం నాడు ఆ కమిటీ వాళ్ళు మా కాలనీ కొస్తారు కాబట్టి- మేమంతా ఎక్కడికీ వెళ్ళకుండా పిల్లలందరితోనూ సిద్ధంగా ఉండాలని మా కాలనీ సెక్రటరీ రంగారెడ్డి నోటీస్ పంపించాడు.

దొరికిన అవకాశాన్ని ఏమాత్రం వదలని ఆర్గనైజింగ్ సెక్రటరీ శాయిరామ్- మామూలుగానే- తెల్లారకుండానే వచ్చి మమ్మల్నందరినీ నిద్ర లేపేశాడు. ఇంక చేసేదిలేక అందరం ఎనిమిది గంటలకల్లా రడీ అయి పిల్లలందరినీ తీసుకుని కాలనీ మధ్య షామియానాలోకి చేరుకున్నాము.

మరికాసేపట్లో కమిటీ వాళ్ళు వచ్చేశారు కార్లో.

ఆ కమిటీ అధ్యక్షుడు లేచి మైక్ లో మాట్లాడాడు.

"లేడీస్ అండ్ జెంటిల్మన్! మేము ఇక్కడికెందుకొచ్చామో మీ అందరికీ తెలుసు! మానవుని జీవితంలో ఆహారం తర్వాత ముఖ్యమయిన విషయం సెక్స్! అంత ప్రాముఖ్యత ఉన్న సెక్స్ ని మనందరం నిర్లక్ష్యం చేస్తున్నాం. దాన్ని గురించి బేసిక్ గా ఏమీ తెలీని పరిస్థితిలో మనమున్నాం! ఇందువల్ల నష్టం ఎవరికి? మనకీ, మన దేశానికీ! మనకీ, మన దేశానికి! కనీస సెక్స్ విద్య లేకపోవటం మూలాన ఎంతోమంది పిల్లలు పెరిగి పెద్దవారయి ఆరోగ్యానికి హాని తెచ్చుకుంటున్నారు. మేము అమెరికాలోనూ, డెన్మార్క్ లోనూ చేసిన స్టడీ ప్రకారం అక్కడ పెద్ద క్లాసులో ఉన్న పిల్లలందరూ సెక్స్ ఎడ్యుకేషన్ నేర్చుకుంటున్నారు. దానివల్ల వారు డాక్టర్లను సంప్రదించే అవసరం లేకుండానే ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నారు. అదొక గొప్ప రివల్యూషన్. కనుక మనదేశంలో కూడా సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టాలనే అభిప్రాయానికి మేము వచ్చాం. అయితే అసలు ముందు మన తెలుగు బాలబాలికలకు- ఆ విజ్ఞానం ఎంతవరకుందో- ఏ క్లాస్ నుంచీ వారికా పాఠాలు ప్రవేశపెట్టాలో నిర్ణయించడం కోసం స్టడీ చేయడానికి మీ కాలనీ కొచ్చాం."

అందరం తప్పట్లు కొట్టాము.

ఆ తరువాత శాయిరామ్ మాట్లాడాడు.

"సోదర సోదరీమణులారా! ఇది నిజంగా ఒక అపూర్వ అవకాశం! కమిటీ అధ్యక్షులవారు చెప్పినట్లు మన బాలబాలికలందరికీ సెక్స్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమని నా అభిప్రాయం. మన బాలబాలికలు కూడా అమెరికాలోని బాలబాలికల స్థాయి కెదగాలని నా కోరిక-"

మళ్ళీ తప్పట్లు కొట్టామందరం.

ఆ తరువాత గోపాల్రావ్, జనార్ధన్ కూడా మాట్లాడతామన్నారు గానీ బలవంతం చేసి ఆపేశాము. కమిటీ వాళ్ళ స్టడీ మొదలయిపోయింది.

మా కాలనీ పిల్లలు కొంతమందిని స్టేజి మీదకు పిలిచారు వాళ్ళు. పిల్లలంతా హుషారుగా స్టేజ్ ఎక్కి నిలబడ్డారు.

కమిటీ అధ్యక్షుడు మమ్మల్ని ఉద్దేశించి మాట్లాడాడు మళ్ళీ.

"లేడీస్ అండ్ జెంటిల్మన్! ఈ పిల్లల్లో అయిదేళ్ళ వయసుగల వాళ్ళ నుంచీ పదిహేనేళ్ళ వయసున్న వాళ్ళ వరకూ ఉన్నారు. వీరందరికీ పాఠ్య పుస్తకాల్లో హిస్టరీ, సైన్స్ లెఖ్ఖలు లాంటి సబ్జెక్ట్స్ ఉన్నాయి కాబట్టి వాటిల్లో ఏ ప్రశ్నలడిగినా వీళ్లు సమాధానాలు చెప్పగలుగుతారు. అదే సెక్స్ విజ్ఞానానికి సంబంధించిన ప్రశ్నలడగండి. ఒక్క ముక్క కూడా

చెప్పలేరు ఎందుకని? మనం వీరికి సెక్స్ ఎడ్యుకేషన్ ఇవ్వటం లేదు కాబట్టి- ఇది నిజంగా మనందరం సిగ్గుపడాల్సిన విషయం. ఈ 20వ శతాబ్దంలో కూడా- మన పిల్లలకు అన్నీ తెలుసుగానీ తామెలా పుట్టిందీ వారికి తెలీకపోవడం దారుణం!"

అందరికీ ఆమాట నిజమేననిపించి సిగ్గుతో తలలు వంచుకున్నాం.

"ఆయనజ్జెప్పింది నిజమేరా భాయ్! మన పోరగాళ్ళ గురించి మనం సోంచాయించనేలేదు-" అన్నాడు యాదగిరి.

"అవును! పాపం వాళ్ళు పెద్దాళ్ళయ్యాక మనలాగానే సెక్స్ గురించి ఏమీ తెలీని అమాయకులయిపోతారు" అన్నాడు గోపాల్రావ్.

"నిజంగా వాళ్ళను చూస్తే జాలేస్తోంది" అన్నాడు చంద్రకాంత్.

కమిటీ అధ్యక్షుడు పిల్లల వేపు తిరిగాడు.

"చూడండి పిల్లలూ! మనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో చెప్తారా?"

పిల్లలంతా మొఖాలు చూసుకున్నారు.

"ఫిబ్రవరి పదిహేనో తారీఖు-" అన్నాడొకడు కొద్దిక్షణాలయాక.

ఓ ఆడపిల్ల కిసుక్కున నవ్వింది.

"ఛీ తప్పు! జనవరి ఇరవై ఆరు" అంటూ సరిచేసింది వాడిని.

"ఛీ కాదు! ఆగస్ట్ ఇరవై ఆరు" అంది మరోపిల్ల. ఆ తరువాత అందరూ ఎవరికిష్టమొచ్చిన తారీఖు వాళ్ళు చెప్పటం ప్రారంభించారు.

"మార్చి పదకొండు 1978, అక్టోబర్ రెండో తారీఖు, జనవరి ముప్పైరెండు" ఇలా సాగిపోయింది.

మా అందరికీ వాళ్ళమీద కోపం ముంచుకొచ్చింది. ఇంచుమించుగా ప్రతి క్లాసు పుస్తకంలోనూ, ఆ తారీఖు స్పష్టంగా ఉంటుంది. అయినా పదోక్లాసు పిల్లలవరకూ ఎవరికీ తెలీలేదంటే-

యాదగిరి కోపంగా వాళ్ళ కుర్రాడిని చావగొడతానని బయలుదేరాడు గానీ మేమంతా వెనక్కు లాగేశాం.

"లేకుంటే ఏమి? ఆడుదినాము సదువుతాడు ఆ పాఠం! అయినగాని చెప్పనికి రాకున్నది" అన్నాడు మండిపడుతూ.

కమిటీ అధ్యక్షుడు మొఖానికి పట్టిన చెమటలు కర్చీఫ్ తో తుడుచుకున్నాడు.

"మన ప్రధానమంత్రి ఎవరు?" అంటూ అతనడిగాడో లేదో అంతా ముక్తకంఠంతో "ఎన్టీఆర్, ఎన్టీఆర్" అంటూ గావుకేకలేశారు.

అధ్యక్షుడు మళ్ళీ కర్చీఫ్ తో మొఖం తుడుచుకున్నాడు.

"నేనడిగేది మన ప్రధానమంత్రి గురించి! ప్రైమ్ మినిష్టర్-" అన్నాడు వత్తి పలుకుతూ.

"అవును! ఎన్టీఆర్" అన్నారు అందరూ మళ్ళీ.

టెన్త్ క్లాస్ చదువుతున్న వాళ్ళిద్దరు మాత్రం వేరే సమాధానం చెప్పారు "అమితాబ్ బచన్"

"మహాత్మాగాంధీ తల్లి పేరేమిటి?"

"ఇందిరాగాంధీ!" అన్నారు చాలామంది.

"కాదు. మేనకాగాంధీ!" అన్నారు కొందరు.

"ఛీ! అవేమీకాదు! రోహిణిహట్టన్ గడీ"

"సోనియాగాంధీ!"

"దుర్గాభాయ్ దేశ్ ముఖ్"

ఆ లిస్ట్ భరించలేక "ఇంకచాలు" అని అరచాడతను.

"మహాత్మాగాంధీ పూర్తిపేరు ఏమిటో చెప్పండి పోనీ!"

"బెన్ కింగ్స్ లే-"

"ఆటెన్ బరో"

"గాంధీతాత-"

"మగధ సామ్రాజ్యాన్ని పాలించిన వారిలో గొప్ప చక్రవర్తి ఎవరు?"

"శాతవాహనుడు"

"ఔరంగజేబు"

"బాబర్"

"చంద్రగుప్త విక్రమాదిత్య"

"మన జాతీయగీతం ఏదో చెప్పగలరా?"

"జనగణమన" అరచారందరూ.

అధ్యక్షుని మొఖం చాటంతయింది.

అది ఎవరు రచించారు?"

"సి. నారాయణరెడ్డి!" "వేటూరి" "జంధ్యాల"

అధ్యక్షుడు ఇంక భరించలేకపోయాడు.

"మరేం లేదు! కొంచెం కన్ ఫ్యూజన్ వల్ల చెప్పలేక పోతున్నారంతే! కనుక నేను చెప్పొచ్చేదేమిటంటే ఇంతకాలం నుంచి పాఠ్యాంశాలుగా ఉన్న వాటి గురించే వారు సమాధానం చెప్పలేకపోతే ఇక వాళ్ళు ఏనాడూ చదవని సెక్స్ ఎడ్యుకేషన్ గురించి ఏం తెలుసుకోగలరు? కావాలంటే చూడండి! ఒక సింపుల్ కొశ్చెన్ అడుగుతాను! అది కూడా వాళ్ళు చెప్పలేరని ఘంటాపథంగా చెప్పగలను"

అందరం ఆసక్తిగా గమనించసాగాము.

"కొంతమందికి పిల్లలు పుట్టరు. ఎందుకని?"

అతనా ప్రశ్న అడిగాడో లేదో పిల్లలంతా గట్టిగా అరచేశారు.

"కుటుంబ నియంత్రణ"

"ఫామిలీ ప్లానింగ్"

అతను నివ్వెరపోయాడు.

"ఆల్ రైట్! ఆ ప్రశ్న వదిలేయండి! కుటుంబ నియంత్రణ అంటే ఏమిటి?"

"బిడ్డకూ బిడ్డకూ మధ్య ఎడం-" అరిచాడో కుర్రాడు.

"నిరోధ్-" యాదగిరి కొడుకు మైక్ దగ్గరకొచ్చి అరచాడు.

"లూప్-" అందో పాప.

"ఓరల్ టాబ్ లెట్స్-"

లోయర్ కే.జి. చదువుతున్న ఓ చిన్నపాప అంతా మాట్లాడాక నెమ్మదిగా వివరించింది.

"ఓరల్ టాబ్ లెట్సయితే- ప్రతిరోజు రాత్రి ఒకటి వేసుకోవాలి! ఒకవేళ ఒకరోజు ఒకటి మర్చిపోతే రెండోరోజు రెండు వేసుకోవాలి-"

"అవును! నర్స్ చెప్పింది!"

కమిటీ అధ్యక్షుడు మొఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు.

"అవునూ- వీళ్ళకెలా తెలుసివన్నీ?" అడిగాడు అధ్యక్షుడు. శాయిరామ్ అతనిని పిచ్చివాడిని చూసినట్లు చూశాడు.

"ఎలా తెలియటమేమిటి? ప్రతి ఇంట్లోనూ రేడియో గానీ, టీవీగానీ ఉండక తప్పదు గదా! అది ఉన్నప్పుడు ఆ విషయాలు తెలీకుండా ఎలా ఉంటాయ్?"

"అంటే టీవీ రేడియో ద్వారా సెక్స్ ఎడ్యుకేషన్ ఇస్తున్నారా?" అడిగాడతను అయోమయంగా.

"ప్రభుత్వం ఆ ప్రోగ్రామ్స్ కి పేరు ఏం పెట్టిందో తెలీదు గానీ అలాంటి అడ్డమయిన చెత్తా లోయర్ కే.జి. పిల్లలందరికీ కూడా తెలుసు."

"ఇవేనా? ఇంకేమయినా తెలుసా వీళ్ళకు?" కుర్చీలో కూలబడుతూ అన్నాడతను.

యాదగిరి హడావుడిగా స్టేజ్ మీదకు నడిచాడు.

"మావాడు వేసక్టమీ గురించి భలే చక్కగా మిమిక్రీ చేస్తాడు! చూడండి!" అంటూ వాళ్ళ కుర్రాడిని ముందుకు తీసుకొచ్చాడు.

"చెప్పరా! వేసక్టమీ గురించి చెప్పు"

"ఏమి రంగయ్య మామా! ఏమిటిలా దిగులుగా వున్నావు? వేసక్టమీ చేయించుకోలేదా?"

"లేదు వెంకయ్య మామా!"

"అరె! తొంబై ఏళ్ళొచ్చినయ్ ఇంకా చేయించుకోలేదా? ఎందుకని?"

"వేసక్టమీ చేయించుకుంటే మగసిరి పోతుందటగా?"

"నీకు ఆ విషయం చెప్పిన వ్యక్తి వేసక్టమీ చేయించుకున్నాడా?"

"లేదు-"

"ఎందుకని?"

"వాళ్ళావిడ ఈలోగానే విడాకులు తీసుకుందిట-"

"చూశావా మరి! అందుకే పుకార్లు నమ్మకూడదు! వేసక్టమీ చేయించుకున్న వ్యక్తి తెగ ఆరోగ్యంగా ఉంటాడు. సంసార సుఖాలకు ఏ లోపమూ ఉండదు!"

"అయితే ఇవాళే సమీపంలోని కుటుంబ నియంత్రణ కేంద్రానికి వెళ్తాను." టింగ్- టింగ్-"

గోపాల్రావ్ వాళ్ళ పాపను మైక్ దగ్గరకు తీసుకొచ్చాడు.

"చెప్పమ్మా! గర్భం ఎలా వస్తుంది?"

"గర్భము అనేక విధములుగా కలుగును. మొదటి విధము:-

"స్త్రీకి ఎక్కువగా చలి వేసినప్పుడు వెచ్చదానము ఇచ్చుట వల్ల వచ్చును."

అందరూ అదిరిపడ్డారు.

"అదేమిటి? ఆశ్చర్యంగా అడిగాడు అధ్యక్షుడు.

"అవునంకుల్! అదేదో సినిమాలో హీరోయిన్ ఐస్ తుఫాన్ లో ఇరుక్కుపోతే హీరో ఆమె పక్కనే పడుకుని వెచ్చదనం ఇస్తాడంకుల్! అందుకని ఆమెకు గర్భం వస్తుంది.

రెండవ విధము- రేప్ చేయబడుట వలన కూడ గర్భము రావచ్చును. అయితే రావాలని గ్యారంటీ ఏమీలేదు. కొన్ని సినిమాల్లో వచ్చును. కొన్ని సినిమాల్లో రాదు."

"నీకెలా తెలుసదీ?"

"టీవీలో చూపించే సినిమాలన్నింటిలో రేప్ సీన్లుంటాయ్ అంకుల్."

"అంతేకాదు! టెన్త్ చదువుకునే ఆడపిల్లా, మగపిల్లాడు ప్రేమించుకున్నా కూడా గర్భం వస్తుంది- మొన్నేగా ఆ సినిమా కూడా టీవీలో చూపించారు"

"అవునవును- భలే బాగుంటుందా సినిమా! ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ అబ్బాయి ఆ అమ్మాయి ఇంటికొచ్చి సెక్స్ చేసేస్తాడు కదూ?"

"అబ్బ! ఎంత రంజుగా ఉంటుందో ఆ సీను-"

"ఆపండి! ఇంక చాలు!" చెవులు మూసుకుంటూ గావుకేక పెట్టాడు కమిటీ అధ్యక్షుడు. కానీ అతని మాట ఎవరూ వినిపించుకోవటం లేదు. అప్పటికే కాలనీ వాళ్ళందరూ సెక్స్ ట్రాన్స్ లో కెళ్ళిపోయారు.

తమ తమ పిల్లలకు సెక్స్ పరిజ్ఞానం ఎంత ఎక్కువగా ఉందో ఆ కమిటీ వాళ్ళందరకూ చూపించి వాళ్ళ మెప్పు పొందాలనీ, తద్వారా దేశమంతా గుర్తింపు సంపాదించాలనీ, లేదా "అతి పిన్నవయసులో అతిపెద్ద పరిమాణంలో సెక్స్ విజ్ఞానం సంపాదించిన పాప" అనే గిన్నీస్ రికార్డ్ నెలకొల్పాలనీ ఉవ్విళ్ళూరిపోసాగారందరూ.

దాంతో స్టేజి మీద రకరకాల విన్యాసాలు ప్రారంభమయాయ్.

పార్వతమ్మ గారు వాళ్ళ చిన్నపిల్లను బరబరా స్టేజ్ మీదకు ఈడ్చుకొచ్చింది.

"మా పాప అని గొప్పలు చెప్పుకోవటం కాదు గానీ అన్నయ్య గారూ! జ్యోతిలక్ష్మిలు, సిల్కుస్మితమూ కూడా పనికిరారు! అంత చక్కగా డాన్సులు చేయగలదు మా పాప! చూస్తావేమో! అంకుల్స్ చూస్తారుట! బాగా సెక్స్ డాన్స్ చెయ్-" అంటూ పురమాయించింది.

వాళ్ళమ్మ చెప్పటం ఆలస్యం ఆ పిల్ల రెచ్చిపోతూ, ఛాతీని విసురుతూ, నడుము భాగంలో సైక్లోన్ వచ్చినట్లు ఊపేస్తూ, చాలా అసహ్యకరమయిన సైగలు చేస్తూ పాట ప్రారంభించింది.

"అసలే ఇది మొదటి రాత్రి! నాకసలే ఇది మొదటిదే బుల్లి!

"ఏం చేస్తావ్ రో మామో!"

"అసలే నషాగా ఉన్నదే పిల్లో- కసికసిగా నలిపేస్తానో బుల్లో-

నడుము నలుపుతా- ఆహా-

బొద్దు కెలుకుతా- ఓహో-

పెదిమ కొరుకుతా- ఈహే-

చీర ఒలుస్తా- ఏహే-

అంతా తప్పట్లు ఈలలు మార్మోగిపోతున్నయ్. చాలామంది కాలనీ స్టూడెంట్స్ వన్స్ మోర్ అంటూ అరుస్తున్నారు.

కమిటీ మెంబర్లు ఆ దృశ్యాలు చూళ్లేక గావుకేకలు పెట్టి ఆ డాన్స్ ఆపించారు. ఈలోగా ఇంకొకావిడ వాళ్ళ పాపను స్టేజిమీదకు తీసుకొచ్చింది.

"మరండీ! నేనసలు మన తెలుగు సినిమాలు చూసే మా పక్కింటి టైలర్ తో లేచిపోయానన్నమాటండీ! కానీ వాడు మేం లేచిపోకముందు చూపించిన రొమాంటిక్ చేష్టలు- తీరా మేము లేచిపోయాక చూపించటం మానేసి చప్పబడిపోయాడండీ! నా బాడీ లాంగ్వేజేమో తెలుసు సినిమా బాడీ లాంగ్వేజన్నమాటండీ! ఎలా సరిపుచ్చుకోగలనండీ! అందుకే మా ఆయన వాళ్ళ ఫ్రెండ్ ని పెళ్ళి చేసుకున్నానన్నమాటండీ!

ఇప్పుడు వయస్సు ఎనిమిదేళ్ళేగానండీ- మా పాపక్కూడా నాలాగానే సినిమాలంటే ప్రాణమన్నమాటండీ! సెక్స్ సినిమాలన్నీ ఒకోటీ అయిదుసార్లు చూస్తుందండీ!"

"ఏయ్ హలం! మొన్న రిలీజయిన సెక్స్ సినిమా కథ చెప్పమ్మా-" అంది ఆ పిల్లతో.

ఆ పిల్ల చాలా ఉత్సాహంగా కథ చెప్పటం ప్రారంభించింది.

"హీరో హీరోయిన్ ప్రేమించుకుంటారు. కానీ విలన్ కూడా హీరోయిన్ ని ప్రేమిస్తాడు. ఛాన్స్ దొరికితే గడ్డివాములో రేప్ చేయాలని చూస్తుంటాడు. అందుకని హీరోయిన్ ఆ విలన్ ని గడ్డివాము దగ్గర బాగా కవ్విస్తుందన్నమాట! ఎప్పుడా విలన్ గాడు హీరోయిన్ శీలం హరించేస్తాడోనని హీరోయిన్ తండ్రి హీరోతో పెళ్ళి నిర్ణయించేస్తాడు. పెళ్ళి ముహూర్తానికి రెండుగంటల టైముందనగా విలన్ హీరోయిన్ ని కిడ్నాప్ చేసి రేప్ చేసేస్తాడు-"

"అయ్యో! రేప్ చేసేశాడా?" అడిగారెవరో.

"అదే సినిమాలో వెరయిటీ!"

"మరి గర్భం వచ్చిందా?"

"అప్పుడే కాదు. ఇంటర్వల్ తరువాత వస్తుంది- కానీ రాధ హీరోని పెళ్ళి చేసుకోదు. ఇంకొకతన్ని పెళ్ళి చేసుకొంటుంది-"

మరి గర్భంలో ఉన్న సంగతి అతనికి చెప్తుందా?"

"చెప్పదు"

"పాపం చెప్పకుండా వుంటే మోసం చేసినట్లవుతుంది కదా-"

"కానీ చెప్తే అతను పెళ్ళి చేసుకోడు కదా!"

"తరువాతేమవుతుంది?"

"పాపాయి పుడతాడు! ఆ పాపాయికి హీరో పోలికలుంటాయి కదా!"

"అవునవును-"

"అందుకని భర్తకు అనుమానం వస్తుంది-"

"అబ్బ! భలేగా ఉందిలే కథ! తరువాతేమవుతుంది?"

"అతను రాధను వదిలేస్తాడు!"

"ఊరికే వదిలేస్తాడా- విడాకులిస్తాడా?"

"ఊరికే వదిలేస్తాడు- అప్పుడు హీరో వచ్చి ఆమెను పెళ్ళి చేసుకుంటాడు"

"మంచి సీన్లేమయినా ఉన్నాయా?"

"మొదటిరాత్రి సీన్లు మూడున్నాయ్ సినిమాలో! ఒకోటి పది నిముషాలు చూపించాడు."

"అబ్బ! ఎంత బాగుంటుందో కదూ"

"చాలా బాగుంటుంది! చాలా సెక్సీ పాటలు కూడా ఉన్నాయ్."

మేమంతా కూడా ఆ కథలో లీనమయిపోయాం.

"తరువాతేం జరుగుతుంది?" అడిగాడు గోపాల్రావ్ ఆత్రుతగా.

"ఆపండి" గట్టిగా అరచాడు కమిటీ అధ్యక్షుడు.

అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"ఎవరు అరచింది?" గోపాల్రావ్ ఆశ్చర్యంగా అడిగాడు నన్ను.

"కమిటీ ప్రెసిడెంట్ అనుకుంటాను" అన్నాడు శాయిరామ్!

"ఆ పాప- అంత చక్కగా సినిమా కథ చెప్తోంటే మధ్యలో అలా గావుకేక వేస్తాడేమిటి?" అన్నాడు జనార్ధన్ కోపంగా.

"ఇప్పుడు సినిమాల్లో లాగా "ఆపండి" అంటూ గావుకేక పెట్టింది మీరేనా?" స్టేజి దగ్గరకెళ్ళి అడిగాడు రంగారెడ్డి.

"అవును! నేనే ఆ చిన్న పిల్లను అలా ఆ వెధవ సినిమాల్లోని రేప్ సీన్ల గురించీ, శోభనం రాత్రుల గురించీ అడిగి తెలుసుకోడానికి మీకు సిగ్గు వేయటం లేదూ?" కోపంగా అడిగాడతను.

మేమందరం మొఖాలు చూచుకున్నాం. ఇంత చిన్న విషయానికి అతనెందుకలా ఎగ్జయిట్ అయిపోతున్నాడో అర్థం కావటం లేదు.

"సమ్ థింగ్ రాంగ్ విత్ హిమ్-" అన్నాడు రంగారెడ్డి ఓ క్షణం ఆలోచించి.

"ఇందులో సిగ్గుపడాల్సిందేమిటో మాకేం తెలీటం లేదు-" అన్నాడు శాయిరామ్ అతనితో.

అతని మొఖం మరింత కోపంగా మారింది.

"ఎందుకు సిగ్గుపడాలో తెలీటంలేదా! హౌ షేమ్ లెస్! ఇంత చిన్న చిన్న పిల్లలు అసభ్యకరమయిన సైగలు చేస్తూ ఆ బూతు సినిమా పాటలు పాడుతూంటే మీరంతా అది చాలా మామూలు విషయమయినట్లు ఆనందిస్తున్నారా?" ఈసారి అక్కడ చేరిన ఆడా మగా ముసిముసిగా నవ్వుకున్నారు అతనిని చూసి. "వీడెక్కడో అండమాన్ నుంచి వచ్చినట్లున్నాడు" అంటున్నారెవరో.

"సినిమా పాటలన్నాక మరి బూతు ఉండక ఇంకేముంటుంది- ఇదేదో కొత్త విషయం మాట్లాడుతున్నారు మీరు!" అన్నాడు శాయిరామ్ వాదనలోకి దిగిపోతూ.

"అవును! పైగా ప్రతి సంవత్సరం ఓ బూతు సినిమా పాటకూ, ఓ బూతు సినిమాకీ ప్రభుత్వమే బహుమతు లిస్తోంటే మధ్యలో మీ గొడవేంటి?" తనూ రంగంలోకి దిగాడు జనార్ధన్.

"మీకు తెలీదేమో! చిన్న పిల్లల మధ్య ప్రేమ- సెక్స్ ని ప్రోత్సహించే చాలా చిత్రాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే బహుమతులిచ్చింది-" అన్నాడు శాయిరామ్ వ్యంగ్యంగా. "గవర్నమెంటే కాక బూతు సినిమాలకు అవార్డ్ లిచ్చే సినిమా సంఘాలు బోలెడున్నాయ్" అన్నారెవరో.

"అయినాఅవన్నీ మీకేమీ తెలీనట్లు నటిస్తారేమిటి? మీరు ఆంధ్రప్రదేశ్ లో కాదా ఉండేది?" అడిగాడు రంగారెడ్డి.

"నేను గత పదేళ్ళుగా హిమాలయాల ప్రాంతంలో ఉంటున్నాను"- అన్నాడతను మొఖానికి మళ్ళీ పట్టిన చెమటలు తుడుచుకుంటూ.

"అదీ సంగతి! అందుకే మరీ విపరీతంగా మాట్లాడుతున్నారు-"

"మన తెలుగువాళ్ళ టీవీ రేడియో ప్రోగ్రాములు చూసి ఉంటే పాపం- మరీ ఇంక షాక్ తినేవారు కాదు-" అంది పార్వతమ్మ జాలిగా.

అతను అదిరిపడ్డాడు.

"అంటే మీ టీవీలోనూ, రేడియోలోనూ, ఇప్పుడా పిల్లలు మాట్లాడిన అడ్డమయిన చెత్తా వస్తుందా?" తెల్లబోతూ అడిగాడు.

"దాన్ని చెత్త అన్నారంటే బావుండదు!" అన్నాడు జనార్ధన్ జేబులోనుంచి దువ్వెన తీసి క్రాఫ్ సరిచేసుకుంటూ.

"ఏం ఎందుకని"

"అందులో మా కాలనీ వాళ్ళందరం కలసి ఫామిలీ వెల్ఫేర్ ప్రోగ్రాం కింద గర్భనిరోధక చర్యలు సబ్జెక్ట్ తీసుకుని ఓ స్క్రిప్ట్ వేశాము. నేను హీరోగా వేశానందులో-"

"అవును! టీవీ ప్రేక్షకుల నుంచీ ఆ సినిమా స్క్రిప్ట్ అద్భుతంగా ఉందని తెగ ఉత్తరాలు కూడా వచ్చాయ్. నేనే రాశానా స్క్రిప్టు" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ.

"అంకుల్- ఆ రోజే పశువులకు సంబంధించిన సెక్స్ కూడా చూపించారు. టీవీలో! కదూ?" ఉత్సాహంగా మధ్యలోకొచ్చి అరచాడో కుర్రాడు.

"శివ శివా" అన్నాడు కమిటీ అధ్యక్షుడు అక్కడే కూలబడిపోతూ.

ఇంకో ఉత్తరదేశం మెంబరు నెమ్మదిగా లేచి మా దగ్గరకొచ్చాడు.

"మీ టీవికి, రేడియోకి - సెన్సారింగ్ లాంటివేమీ లేవా?" అనడిగాడు హిందీలో. ఆ ప్రశ్న వింటూనే అందరూ పెద్ద జోక్ విన్నట్లు నవ్వారు.

"సెన్సారింగ్ లేదని ఎవరన్నారు? సాగరసంగమం చిత్రంలో ఓ పాటలో బూతు ఎక్కువగా ఉందని ఆ పాట సెన్సార్ చేసి టీవీలో మిగతా సినిమా చూపించారు కదా-"

కమిటీ అధ్యక్షుడు ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు.

"ఏమిటి? సాగర సంగమం లాంటి ఫామిలీ పిక్చర్ లో - కె.విశ్వనాథ్ లాంటి గొప్ప డైరెక్టర్ సినిమాలో బూతుపాట ఉందా? మీకేం మతిపోలేదు- కదా?"

"ఇదిగో గురూజీ! జరిగిందది! అందుకే ఆ పాట కట్ చేశామని టీవీవాళ్ళు జాబులు- జవాబుల్లో చెప్పారు. మధ్యలో మీకు సిగ్గులేదా, మతిలేదా అని మమ్మల్నడక్కండి!" కోపంగా అన్నాడు జనార్ధన్.

"అయినా ఆ సెన్సారింగ్ వాళ్ళదేం తప్పుందనీ! పాపం వాళ్ళకిష్టమయిన 'ఏ' సర్టిఫికెట్ సినిమాల్లో పాట చూపిస్తూనే ఉంటారు అందరి కోసమని! చాలా లిబరల్ పాపం-"

ఈలోగా యాదగిరి వాళ్ళబ్బాయిని ఈడ్చుకొచ్చాడు స్టేజీమీదకు.

"చెప్పరా! నువ్వు వారపత్రికలు గిట్ట సదువుతావు గదా! అందులోకెళ్ళి మంచి సీరియల్స్ గురించి చెప్పు!"

వాడు ఓ క్షణం ఆలోచించాడు.

"ఏది చెప్పను?"

"కథలో ఆ చిన్న పాపకు గర్భం వస్తుందే- ఎందుకొచ్చిందో ఎలా వచ్చిందో రాశారు కదా- అదంతా చెప్పు."

కమిటీ అధ్యక్షుడు అదిరిపడ్డాడు.

"చిన్న పాపకు గర్భం రావటమా?"

"అవున్సార్! చాలా మంచిగుంటందా కథ, మాపోరదే సదివి చెప్పిందు నాకు"

"పోనీ ఇంకో కథ చెప్తాను డాడీ! దానిపేరు - టెస్ట్ ట్యూబ్ బేబీ- స్పెర్మ్ బాంక్-"

"స్టాపిట్!" గట్టిగా అరచాడు అధ్యక్షుడు.

"ఊరికే అలా గావుకేక లేయొద్దని చెప్పానా?" విసుక్కున్నాడు జనార్ధన్.

"లేకపోతే ఏమిటయ్యా ఇది- చిన్న పిల్లలతో అలాంటి పుస్తకాలు చదివిస్తున్నారా మీరు?"

"చిన్న పిల్లలా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి. "ఎవరి గురించి మీరు మాట్లాడేది?"

"ఎవరిగురించేమిటి? వీళ్ళందరూ చిన్న పిల్లలు కాదూ?"

అందరూ ఘోల్లున నవ్వారు మళ్ళీ.

"మీకేమయినా మతిపోయిందేమిటి గురూజీ! వీళ్ళంతా యువకులు, యువతులుగానే లెక్క! చిన్న పిల్లలు అంటూ ప్రస్తుతం మా కాలనీలో గానీ మనదేశంలో గానీ ఎవరూ లేరు. అయిదేళ్ళకే మనదేశంలో అందరూ 'ఎడల్ట్స్' అయిపోతారు- అయిదేళ్ళలోపే చిన్నపిల్లలు-"

ఈలోగా రాజేశ్వరి వాళ్ళబ్బాయిని బలవంతంగా ఎత్తుకొచ్చింది.

"మొన్న వారపత్రికలో నువ్వు చదివావ్ చూడు - ఆ డాక్టర్ ప్రశ్నలు- జవాబులు శీర్షిక. ఆ రెండు ప్రశ్నలూ ఆ అంకుల్ కి చెప్పమ్మా" అంది ఆప్యాయంగా.

"నేన్చెప్పను-" అన్నాడు వాడు మొండికేసి.

"మా బంగారుకొండ కదూ! అంకుల్ నీకు చాక్ లెట్లిస్తారు! చెప్పమ్మా!"

"ఆడు దొంగబాడుకవ్! చాక్ లెట్టియ్యడు!"

"మా తండ్రికదూ! చెప్తే అంకుల్ నీకు 'ఎ' సర్టిఫికెట్ సినిమా చూపిస్తారుట" వాడి మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అక్కయ్యా! ఓవమ్ అంటే ఏమిటి? అది ఎన్ని రోజులకు పెరుగుతుంది?"

"చెల్లేగ ఓవమ్ స్త్రీ నుంచి ఉత్పత్తి అవుతుందమ్మా! రౌండ్ గా రెండు మిల్లీమీటర్ల సైజు ఉంటుంది! క్లీ వేజ్ న్యూక్లియస్ తరువాత అది క్రమేపీ పెరిగి 265 రోజులలో పిల్లలు పుడతారు-"

కమిటీ అధ్యక్షుడు ఛటుక్కున ముందుకు వంగి వాడి నోరు నొక్కేశాడు.

"ఇవన్నీ మన వారపత్రికల్లో రాస్తున్నారా?"

"అవునూ- తప్పేముంది? గర్భస్రావం గురించీ, సెక్స్ సమస్య గురించి, పిరీడ్స్ గురించీ - ఏం కావాలన్నా మన వారపత్రికల్లో దొరుకుతాయ్" చెప్పాడు రంగారెడ్డి.

"అంటే అవి పెద్దల పత్రికలు కదా- పిల్లల కెందుకిస్తున్నారు?"

"సకుటుంబ పత్రికలని రాస్తున్నారు కద్సార్- అయినా పత్రికల్లో ఎడల్ట్స్ ఓన్లీ అనే క్లాసిఫికేషన్ లేనిదే ఎలా తెలుసుకోవటం?" ఎదురు ప్రశ్న వేసాడు జనార్ధన్.

"అదే మన ప్రభుత్వానికీ, మనాళ్ళకీ తేడా గురూజీ! ప్రభుత్వమేమో ఎనిమిదో క్లాస్ నుంచీ సెక్స్ ఎడ్యుకేషన్ ఉండాలా వద్దా ఉంటే ఎంతవరకూ ఉండాలీ అని నానా హైరానా పడుతోంది కానీ మన టీవీ ఛానల్సూ, రేడియో, పత్రికలూ, సినిమాలూ ఎప్పుడో ఎడ్వాన్స్ అయిపోయాయి. లోయరు కే.జి. నుంచే ఆ విజ్ఞానం అంతా అందజేస్తున్నాయి."

అప్పుడె ఒకావిడ వాళ్ళబ్బాయిని నెమ్మదిగా నడిపించుకొచ్చింది.

"ఏమండోయ్- ఇందాక మీరన్నారు చూడండి- పిల్లలకు పాపం పిల్లలెలా పుడతారో తెలీదని! మీ మాట తప్పు, మా వాడికి అన్నీ తెలుసు"

అధ్యక్షుడు నీరసంగా ఆమె వేపు చూశాడు.

"తెలుసా?"

"అవునండీ!"

"ఎలా తెలుసు?"

"వాళ్ళ ఎలిమెంటరీ స్కూల్ పక్కనే రెండు సినిమా హాల్స్ ఉన్నాయి. వాటిల్లో ఎప్పుడూ సెక్స్ ఎడ్యుకేషన్ పేరుతో చాలా చెత్త సినిమాలు ఆడుతుంటాయి. వీళ్ళ స్కూల్ గోడలమీదా, సినిమాహాల్ గోడల మీద పెద్ద పెద్ద వాల్ పోస్టర్స్ లో- స్త్రీ అవయవాలు, పిల్లలు పుట్టే దృశ్యాలు- అన్నీ చాలా వివరంగా కనిపిస్తాయి. వాటిని వీళ్ళు రోజూ చూస్తుంటారు- అదిగో ఆమూల చాక్ పీస్ పట్టుకుని నిలబడ్డాడు చూడండి. కమలమ్మ గారి అబ్బాయి! మీరు చూస్తానంటే ఆ బొమ్మలన్నీ ఇక్కడ బోర్డు మీద వేసి చూపిస్తానంటున్నాడు. చాలా బాగా ప్రాక్టీస్ చేశాడు ఆ డ్రాయింగ్స్ అన్నీ-"

కమిటీ అధ్యక్షుడు జుట్టు పీకేసుకుంటూ "నో! గెటెవే" అంటూ మళ్ళీ గావుకేక పెట్టాడు.

"మళ్ళా ఏమిటి?" చిరాకుగా అడిగాడు జనార్ధన్.

"సోదర సోదరీమణులారా! ప్రస్తుతం లోయర్ కే.జీ. పిల్లల మీద మల్టీమీడియా ద్వారా బలవంతంగా రుద్దబడుతున్న సెక్స్ ఎడ్యుకేషన్ ని ప్రభుత్వం నిషేధించాలి" ఆవేశంగా అరచాడతను మైక్ లో.

మాకెవరికీ నోట మాట రాలేదు.

"అదేమిటి సెక్స్ ఎడ్యుకేషన్ ని ప్రవేశపెట్టాలని ఇందాక మీరేగా అన్నారు?" అడిగాడు రంగారెడ్డి.

"అవును! అన్నాను-"

"ప్రభుత్వం దానికోసమే మీ కమిటీని కూడా వేసిందని చెప్పారు!"

"అవును! వేసింది-"

"మరిప్పుడు సెక్స్ ఎడ్యుకేషన్ నిషేధించాలంటారేమిటి?"

"అవును! ముమ్మాటికీ నిషేధించాలి! నిషేధించాలి" అంటూ స్టేజి దూకి పరిగెత్తాడతను- జుట్టు పీక్కుంటూ- వెనుకే మిగతా మెంబర్లు కూడా పరుగెత్తారు. సంగతేమిటో అర్థంకాక మేము వారిని వెంబడించి వాళ్ళెక్కిన కారు చుట్టూ మూగాము.

"సంగతేమి - గిట్ల ఉరుకుతున్రు?" అడిగాడు యాదగిరి అధ్యక్షుడి దగ్గరకెళ్ళి.

"ఇక్కడ - ఈ పిల్లల మధ్య ఇంకాసేపుంటే మా అందరికీ పిచ్చెక్కిపోతుంది" భయంగా అన్నాడతను.

"పిచ్చెక్కుతుందా?"

"పూర్తిగా! అన్ క్యూరబుల్ మాడ్ నెస్-"

"కాని మరి మేమంతా ఏ పిచ్చీ ఎక్కకుండా- వాళ్ళతోపాటే ఉంటున్నాము కదా-" అడిగాడు రంగారెడ్డి.

"అవును! ఇంతవరకూ ఒక్కరికి కూడా పిచ్చి ఎక్కలేదు! మా కాలనీలో నుంచి ఎవ్వరినీ పిచ్చాసుపత్రిలో చేర్చనేలేదు-" అన్నాడు శాయిరామ్.

సరిగ్గా అప్పుడే యాదగిరి వాళ్ళబ్బాయి ట్రాన్సిస్టర్ ఆన్ చేశాడు. గడ్డియన్నారం నుంచి బేబీ జానకి, మాస్టర్ చింటూ, వాళ్ళ తమ్ముడూ, చెల్లాయ్ ఇంకా వారి మిత్రులూ వీరందరి కోరిక పైనా.

రాత్రి రహస్యం చిత్రంలోని పాట-

"శోభనం- ఇది శోభనం-

ఏయ్- నిన్నే-

ఏమిటండీ?

తెల్లకోక కట్టావా?

ఊ!

మల్లెపూలు పెట్టావా?

ఊఁ!

ఇకరావే సయ్యాటకూ- వళ్ళంతా కైపెక్కిపోతున్నాదే-

నిద్ర వస్తోందండీ-

తొలి రాత్రి కాళరాత్రి కావాలే పిల్లా-

నిద్దరనేది అసలే రాలాదే మళ్ళా- ఊఁ! ఉ హు హ- ఊఁ - ఉహుహ-

(మూలుగుడు వినిపించసాగింది)

కమిటీ అధ్యక్షుడు ఈసారి చెమటలు తుడుచుకోలేదు.

"చూడండి! మీ కాలనీ నుంచి ఇంతవరకూ ఎవరూ పిచ్చాసుపత్రికి పోలేదన్నారు కదూ?"

"అవును!" సగర్వంగా చెప్పాడు రంగారెడ్డి.

"అందుక్కారణం ఏమిటో తెలుసా?"

"ఏమిటి?"

"అసలు మీరున్నదే పిచ్చాసుపత్రిలో!"

అందరం ఉలిక్కిపడ్డాం.

"మేము పిచ్చాసుపత్రిలో ఉన్నామా?"

"అవును! ఆ పిచ్చాసుపత్రి పేరేమిటో తెలుసా?"

ఎవ్వరం మాట్లాడలేదు.

"ఏమిటి?" కొద్ది క్షణాల తర్వాత అడిగాడు శాయిరామ్.

"ఆంధ్రప్రదేశ్" లేదా "భారతదేశం"

కాదు స్టార్టయి వెళ్ళిపోయింది.

అందరం వాళ్ళ మాటలు అర్థంకాక మొఖాలు చూసుకున్నాము మళ్ళీ. ఈలోగా స్టేజీమీద పిల్లలు కొంతమంది రికార్డ్ డాన్స్ చేస్తూండడంతో ఆ విషయం ఆలోచించటం మానేసి స్టేజ్ దగ్గరకు పెరుగేత్తాం- వాళ్ళ డాన్స్ ఎంజాయ్ చేయటానికి!

* * * * *

## ఫారిన్ టూర్

"స్స్ స్స్ స్స్" అన్న శబ్దం వినిపించింది నాకు నిద్రలో. ఆ శబం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం కంటే నేను నిద్రని ఎక్కువగా ప్రేమించటం చేత లెక్క చేయకుండా నిద్ర తాలూకు మరో తెరలోకి జారిపోయాను.

ఆదివారం నాడు మా కాలనీవాళ్ళందరం నిద్రకు ఎంత ప్రాముఖ్యత ఇస్తామో మీకూ తెలుసు. ఎందుకంటే కొంతవరకూ మనుష్యుల్లాగా గడిపేది మేము ఆదివారం నిద్రలోనే! ఈసారి స్పష్టంగా వినిపించింది శాయిరామ్ గొంతు.

"హలో! అర్జంట్! త్వరగా లే!"

"ఛటుక్కున కళ్ళు తెరచి చూశాను.

తెరచివున్న ఒకే ఒక్క కిటికీ రెక్కలో నుంచి చువ్వల బయట ఆనందంతో నవ్వుతూన్న శాయిరామ్ మొఖం కనిపించింది.

కొద్ది క్షణాలు నాకది కలో నిజమో తెలీలేదు. కలో నిజమో తెలుసుకోవాలంటే మా కాలనీ వాళ్ళు ఫాలో అయ్యే పద్ధతి ఒకటి వాడుకలో ఉంది.

సాధారణంగా అందరూ చేయిగిల్లుకుని పరీక్షించుకుంటారు గానీ మేమలా క్కాదు.

"నేను తెలుగువాడిని! నేను తెలుగురాష్ట్ర పౌరుడిని' అని రెండు సార్లనుకుంటే చాలు! ఇంకా ఎందుకు బ్రతికి ఉన్నాను" అన్న ఫీలింగ్స్ వచ్చేస్తాయి.

దాంతో అది నిజమేననీ కలకాదనీ తెలిసిపోతుంది.

ఇప్పుడీ శాయిరామ్ వ్యవహారం కూడా కలో నిజమో తేల్చుకోడానికి అదే పద్ధతి ఉపయోగించాను.

"నేను తెలుగు పౌరుడిని! నేను తెలుగు పౌరుడిని! నేనున్నది ఆంధ్రప్రదేశ్ లో" అని రెండుసార్లు అనుకునేసరికి ఏడుపొచ్చేసింది. వెచ్చగా కన్నీరు ప్రవహించింది. దాంతో అది కలకాదని ఋజువయిపోయింది.

"ఏమిటి?" కొంచెం కోపంగా అడిగాను పక్కమీద నుంచి లేవకుండానే.

"అర్జంట్ గురూ! త్వరగా పద! మనందరం ఫారిన్ టూర్ వెళుతున్నాం"

"ఫారిన్ టూరా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును బ్రదర్! ఫారిన్ టూర్! అద్భుతమయిన అవకాశం! త్వరగా లే" బాగా ఎగ్జయిటయిపోతూ అన్నాడతను.

నాకు అతనిని చూస్తే జాలేసింది.

శాయిరామ్ కి చిన్నప్పట్నుంచీ విదేశాలు చూడాలని చాలా కోరికగా ఉండేదని అతనే చాలాసార్లు మాకు చెప్పాడు. తమాషా ఏమిటంటే మా లాంటి మిడిల్ క్లాస్ పక్షులకు అలాంటి కోరికలు ఉండకూడదని తెలిసినా రోజురోజుకీ అతని కోరిక బలపడింది కానీ తగ్గలేదు.

అతని యింటిలో టేబుల్ సొరుగు లాగి చూశారంటే లోపల బోలెడు పేపర్ కటింగ్స్ కనబడతాయి.

సింగపూర్ యాత్ర! రానూ పోనూ ఆరువేల రూపాయలు మాత్రమె... (హోటల్ సైట్ సీయింగ్ ఖర్చులతో సహా)

అని ఒక కటింగ్ ఉంటే.

"అతి చౌకగా సంపూర్ణ ప్రపంచయాత్ర! కేవలం అరవై వేల రూపాయలకే! లాడ్జింగ్, బోర్డింగ్ ఉచితం. వెంటనే ఈ సదవకాశాన్ని వినియోగించుకోండి!

వెంటనే ఫలానా ట్రావెల్స్ ని సంప్రదించండి.

అని ఇంకో కటింగ్ ఉంటుంది.

"అబ్బ! ఇదే అయిదారు వందల రూపాయలయితే పి.ఎఫ్. అప్లయ్ చేసి దర్జాగా వెళ్ళి వచ్చేవాడిని" అంటూండేవాడు శాయిరామ్.

బహుశా ఇప్పుడు అలాంటి అవకాశం ఏదయినా వచ్చిందేమోననుకున్నాను.

"అంటే నేపాల్ బంగ్లాదేశ్ లాంటి ఫారిన్ దేశాలా?" అనుమానంగా అడిగాను.

"ఛ! ఫారిన్ గురూ! సింగపూర్, మలేషియా, అమెరికా, ఫ్రాన్స్ లాంటి దేశాలు."

హఠాత్తుగా నాకు శాయిరామ్ మీద జాలేసింది.

ఎందుకంటే మా కాలనీలోనే ఈస్ట్ సైడ్ బిల్డింగ్ లో వుండే సత్యన్నారాయన గుర్తుకొచ్చాడు నాకు.

అతనికి ఓ బలమయిన కోరిక ఉండేది.

అదేమిటంటే ఎలాగయినా ఎందుకూ పనికిరాని కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం వదిలేసి ఏదయినా వ్యాపారం చేసుకుని ధనవంతుడవాలని! ఆ కోరిక అందరికీ చెపుతుండేవాడు. మేము 'హహహ' అని నవ్వి వూరుకునేవాళ్ళం.

కానీ అది మరింత బలపడి చివరకు ఓ రోజు మానసిక భ్రమలోకి దించింది. ఆరోజు ఉదయం నుంచే కాలనీ అంతా తిరిగి తను ఉద్యోగం మానేసి వ్యాపారం ప్రారంభించాననీ మొదటి రోజే లక్ష రూపాయలు లాభం వచ్చిందనీ చెప్పటం ప్రారంభించాడు. వాళ్ళావిడ లబోదిబోమని ఏడుస్తూ మాదగ్గరకొచ్చేసరికి మేము అర్జంటుగా సమావేశం జరిపాము.

అతను మళ్ళీ మామూలు స్థితికి రావాలంటే మా కాలనీ వాళ్ళు కనిపెట్టిన "కంబళి పెరేడ్" చేయాలని రంగారెడ్డి సలహా ఇచ్చాడు.

కంబళి పెరేడ్ అంటే సడెన్ గా మానసిక సమస్యలు వచ్చినవారిని గట్టిగా పట్టుకుని వాళ్ళ నెత్తిమీద కంబళి వేసి తర్వాత అందరం తలో టెంకిజెల్లా ఇచ్చి అప్పుడు అకస్మాత్తుగా నాలుగుబిందెల నీళ్ళు కుమ్మరించాలి.

దాంతో స్పృహలోకొచ్చి నార్మల్ అయిపోతాడతను.

అప్పుడు ఎర్రలారీ- తెల్లలారీ అంటూ పదిసార్లనిపిస్తేచాలు. ఇంక గొడవుండదు. ఆ కంబళి పెరేడ్ చేశాక వెంటనే మామూలు మనిషయిపోయాడు సత్యన్నారాయణ! కనుక ఇప్పుడు శాయిరామ్ వ్యవహారం చూస్తూంటే ఇతనిదీ అచ్చం అలాంటి కేసు అని తెలిసిపోయింది నాకు.

వెంటనే మా వాళ్లందరినీ పిలిపించి అప్పటికప్పుడు ప్రథమ చికిత్స ప్రారంభించకపోతే శాయిరామ్ ఆ భ్రమలోంచి బయటపడలేడు.

ఎందుకయినా మంచిదని అతనిని మరోసారి టెస్ట్ చేశాను.

"కాని అలాంటి దూరదేశాలకు వెళ్ళాలంటే మాటలా?"

దాంతో శాయిరామ్ మరింత ఎగ్జైటయిపోయాడు.

"నేను చెపుతున్నాను కదా! నేనొక్కడినే కాదు. మనందరం కూడా వెళ్తున్నాం. వచ్చే నెలలోనే వెళ్తున్నాం. రేపే మనం వెళ్ళి వీసాలు, పాస్ పోర్ట్ ల గొడవలన్నీ చూడాలి. సామాన్లు ఎంత తక్కువ వీలయితే అంత తక్కువ తీసుకెళ్ళాలట! పద గురూ త్వరగా."

నాకు అతని పరిస్థితి నిర్ధారణ అయిపోయింది.

"ఇప్పుడే వస్తా" అంటూ లోపలకు వెళ్ళి మా ఆవిడతో చెప్పేశాను.

"త్వరగా వెళ్ళి మా వాళ్ళందరినీ తీసుకురా! శాయిరామ్ కి అర్జంటుగా కంబళి పెరేడ్ చేయాలని చెప్పు! 'ఫారిన్ టూర్' అంటూ పిచ్చిమాటలు మాట్లాడుతున్నాడు."

మా ఆవిడ గాబరాగా పరుగెత్తింది.

నేను బయటకొచ్చి శాయిరామ్ తో సంభాషణ ప్రారంభించాను.

"ఉహూ! అయితే మనందరం కలిసి ఫారిన్ టూర్ వెళ్ళవచ్చన్నమాట" అన్నాను చాలా ఆసక్తి కనబరుస్తూ.

"అవును! చాలా ఈజీ అనుకో! ఇంతకాలం మనకీ సంగతి తెలీక ఫారిన్ టూర్ అంటే అబ్బో- చాలా కష్టం అనుకున్నాం! ఏంత పిచ్చివాళ్ళమో చూడు! అహ్హాహ్హాహ్హా"

"అవును భలే పిచ్చివాళ్ళం అహ్హాహ్హాహ్హాహ్హా"

"ఇప్పటికయినా నేను చొరవ తీసుకోబట్టి గానీ లేకపోతే జీవితాంతం మనం ఫారిన్ వెళ్ళకుండానే ఉండిపోయేవాళ్ళం. ఎంత దారుణమో చూడు."

"చాలా దారుణం. ఫారిన్ వెళ్ళని బ్రతుకూ ఓ బ్రతుకేనా? ఇప్పటికయినా ఫారిన్ వెళుతున్నాం కనుక బ్రతికి పోయాంగానీ లేకపోతే ఆ నిరాశ భరించలేక చచ్చేవాళ్ళం"

సరిగ్గా అప్పుడే రంగారెడ్డి, యాదగిరి, గోపాల్రావ్, జనార్ధన్, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ కంబళీ తీసుకొచ్చేశారు వెనుకనుంచీ.

కానీ తీరా కంబళి మీద వేయబోయే సమయానికి గమనించి గట్టిగా అరుస్తూ పక్కకు దూకేశాడు శాయిరామ్.

"ఏమిటిది? నాకేం పిచ్చెక్కిందనుకున్నారా?" అన్నాడు గాబరాగా.

వాళ్ళందరూ నావేపు చూశారు.

"పిచ్చి అంటే మరీ పిచ్చికాదు గానీ, కొంచెం దాని "జలక్" అన్నమాట!" అన్నాన్నేను. అప్పటికే చుట్టుపక్కల ఆడాళ్ళందరూ బిందెలతో నీళ్ళు తీసుకొచ్చేశారు రెడీగా.

శాయిరామ్ మొఖం మాడిపోయింది.

"ఇదన్యాయం గురూ! సత్యన్నారాయణకు మెదడు కొంచెం చెదిరినప్పుడు ఈ కంబళి పెరేడ్ షాక్ ట్రీట్ మెంట్ గురించి చెప్పింది నేనే! ఇప్పుడు దాన్ని నా మీదే ప్రయోగిస్తారా?" కోపంగా అడిగాడు.

"మరి నువ్ కూడా ఫారిన్ టూర్ వెళ్ళిపోతున్నాం" అంటూ పిచ్చి మాటలు మాట్లాడావంట కదా?" అన్నాడు రంగారెడ్డి బెదురుగా.

శాయిరామ్ నావంక చూసి "హు!" అన్నాడు.

"అయితే నేను ఇందాకట్నుంచీ మాట్లాడుతున్నదంతా పిచ్చెక్కి మాట్లాడుతున్నానని అనుకుంటున్నావన్నమాట"

"ఎగ్జాట్ గా పిచ్చి అని కాదు గానీ మెదడు తాత్కాలికంగా చెదరటం లాంటిదని"

"హు!" అన్నాడు శాయిరామ్ మళ్ళీ. మాకు అతని మీద జాలివేసింది.

"అయితే ఇప్పుడు నార్మల్ అయిపోయినట్లే గదా! ఇంక 'ఫారిన్ టూర్' అనవు కదా!" అడిగాడు గోపాల్రావ్.

ఆ మాటతో మళ్ళీ కోపం వచ్చింది శాయిరామ్ కి.

"అరె! నిజంగానే చెప్తున్నా నయ్యా! మనందరం ఫారిన్ టూర్ వెళ్ళేందుకు ఓ మాంచి ఛాన్స్ దొరికింది. ఇంకాసేపట్లో అతనొస్తున్నాడు మన కాలనీకి! మనందరం రెడీగా ఉంటే అతనిని వివరాలన్నీ అడిగి ఆ ఏర్పాటు చేసుకోవచ్చు."

అందరం ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం.

"ఎవరతను?" అడిగాడు జనార్ధన్.

"బ్రోకర్"

"ఏం బ్రోకరు?"

"అదే గురూ! విదేశాలు చూడాలనుకునే వారందరికీ అక్కడి తెలుగువారి ఖర్చుమీద ఆ దేశాలు టూర్ చేసే ఏర్పాట్లు చేస్తాడు. ఇప్పటికి పదకొండు వందల మందిని బోలెడు దేశాలకు పంపించాడు."

మాకు శాయిరామ్ మాటలు వివరంగా తెలీటం లేదు.

"ఆ దేశాల్లోని తెలుగువాళ్లు ఎందుకు అంత డబ్బు ఖర్చుపెట్టి మన రాష్ట్రంలో వారందరినీ పిలిపిస్తున్నట్లు?"

శాయిరామ్ బుర్ర గోక్కున్నాడు. అతనికి ఆ పాయింట్ అర్ధమయినట్లులేదు.

"ఇలాంటి దిక్కుమాలిన రాష్ట్రంలో ఉన్న మన తెలుగువాళ్ళందరి మొఖాలు ఓసారి చూడాలనిపించిందేమో" అన్నాడు అనుమానంగా.

మాకూ సరిగ్గా అదే అనుమానం వచ్చింది.

"అవునవును! ఇలాంటి కోరిక ప్రవాసాంధ్రులకు కలగటం చాలా సహజం" అన్నాడు రంగారెడ్డి కూడా వప్పుకుంటూ.

"ఇంతకూ బ్రోకర్ కి డబ్బెవరిచ్చు కుంటారు?" అడిగాడు జనార్ధన్.

"ఇంకెవరిస్తారు? మనమే!"

"మన మెందుకిస్తాం?"

"మనం ఇవ్వకపోతే ఇచ్చేవాళ్ళను పంపిస్తాడు. విదేశాలు చూడాలనుకునే వాళ్ళు తక్కువయితే కదా!"

అందరం అప్పటికి సమావేశం విరమించాం.

బ్రోకర్ వచ్చాక తిరిగి కాలనీ వేదిక దగ్గర సమావేశమవాలని నిర్ణయించుకున్నాం.

సరిగ్గా పదకొండవుతూండగానే బయటనుంచి శాయిరామ్ కేకలు వినిపించేసినయ్. నేను వెళ్ళేసరికే అందరూ ఓ అంబాసిడర్ కారు చుట్టూ మూగి ఉన్నారు. ఓ వ్యక్తి చాలా ఖరీదయిన దుస్తుల్లో కారు దిగి శాయిరామ్ ద్వారా అందరినీ పరిచయం చేసుకుంటున్నాడు.

"ఈయన చక్రధర్ గారు! జనాల్ని పోగుచేసి విదేశాలు పంపించటంలో ఈయనదే రికార్డ్ ఇంతవరకూ మొత్తం పదకొండొందల మందిని పంపారట" పరిచయం చేశాడు శాయిరామ్.

అందరం నమస్కరించాం వినయంగా.

అతనిని వేదిక మధ్యలో కూర్చోబెట్టి అందరం చుట్టూ మూగాం.

"మీలో ఎంతమంది ఫారిన్ వెళ్ళాలనుకుంటున్నారు?" తన చేతిలోని ఫైల్స్ ఓపెన్ చేస్తూ అడిగాడు బ్రోకర్.

"మా కమిటీ మెంబర్స్ అందరం వెళ్ళాలనుకుంటున్నామండీ" అన్నాడు శాయిరామ్ బెరుగ్గా.

"అంటే ఎంతమంది?"

"మొత్తం ఎనిమిదిమందండీ."

ఆ మాటతో మా వెనుకే నిలబడ్డ రాజేశ్వరి, సావిత్రమ్మ గారూ, రజనీదేవి కయ్యిన లేచారు.

"కమిటీ మెంబర్సేనేమిటి? మేమూ ఫారిన్ వెళ్తాం! మేము మాత్రం ఎందుకెళ్ళకూడదు?" కోపంగా అంది రాజేశ్వరి.

బ్రోకర్ చిరునవ్వు నవ్వాడు.

"ఓ ఎవరయినా వెళ్ళవచ్చమ్మా ఎంతమందయినా వెళ్ళవచ్చు! ఏ దేశమయినా వెళ్లవచ్చు! ఏం ప్రాబ్లెమ్ లేదు. కారుచౌకలో ఫారిన్ కంట్రీస్! మీ పేర్లు రాసివ్వండి! పేర్ల కెదురుగ్గా ఏ ఏ దేశాలు వెళ్ళాలనుకుంటోందీ కూడా రాయండి. ఏం ఫరవాలేదు. అందరికీ ఛాన్సిస్తాను. కారుచౌక! బ్రదర్స్ అండ్ సిస్టర్స్! ఏం మొహమాటపడకండి!"

అతని మాటలతో ఎక్సర్సయిజ్ నోట్ బుక్స్ నాలుగు కాలనీ వాళ్ళ పేర్లతో రకీమని నిండిపోయాయి.

బ్రోకర్ ఆ పేర్లన్నీ చూసుకుని ఆనందంగా నవ్వాడు.

"ఆహా! ఇలా ముందుకి రావాలి తెలుగు ప్రజలందరూ! చాలా గొప్ప అండర్ స్టాండింగ్ పవర్ ఉంది మీకు. సెభాష్! బ్రదర్స్ అండ్ సిస్టర్స్! అందర్నీ విదేశాలకు పంపించే పూచీ నాది."

"కానీ ఇన్ని వందలమందిని అంతఖర్చుతో ఫారిన్ కంట్రీస్ ఎలా పంపించగలరు?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

"చాలా మంచి ప్రశ్న బ్రదరగ కొంచెం ఆలస్యంగా అడిగావ్! అయినా ఫరవాలేదు! ఇందులో మన ఖర్చేమీ ఉండదు! అంతా విదేశీ తెలుగువాళ్ళే భరిస్తారు. ప్రవాసాంధ్ర అసోసియేషన్స్ దగ్గర డబ్బు తెగ మూలుగుతోంది బ్రదర్స్ అండ్ సిస్టర్స్! అంచేత ఖర్చులన్నీ వాళ్ళవే! మనం చాలా నామినల్ గా డబ్బు ఖర్చుచేయాలి. ఒకోసారి మనం ఖర్చుపెట్టిన కొద్ది మొత్తానికి కూడా నాలుగింతలు బహుమానాలు ఇస్తారు వాళ్ళు."

అందరికీ ఆశ ఎక్కువయిపోయింది.

"అయితే మేము ఎంత ఖర్చు పెట్టాలంటారు?"

"ఎంతో లేదు బ్రదర్! ముందు అందరూ తలో వందా నాకివ్వాలి. నేను ఆ డబ్బుతో విదేశీయాత్ర కెళ్ళవలసిన ఏర్పాట్లన్నీ చేస్తాను అప్పుడు ఒకవేపు విమానం టికెట్ కి మాత్రం డబ్బు మీరే కట్టుకోవాలి! అదిగాక నాకు తలో వెయ్యి ఇస్తే చాలు. అద్భుత విదేశీయాత్ర!" ఊరిస్తూ చెప్పాడు.

మా గుండెల్లోరాయి పడినట్లయింది.

"మైగాడ్! అంత దబ్బెం అంత డబ్బు మా దగ్గరెక్కడిది?" గాబరాగా అడిగాడు రంగారెడ్డి.

అతను చిరునవ్వు నవ్వాడు.

"అలా కంగారుపడితే ఎలా బ్రదర్స్! ఒకవేళ ఆ మూడువేల రూపాయలు కూడా మీరు పెట్టుకోలేకపోతే స్కీం నెంబర్ త్రీ ఉంది. అది ఫాలో అయిపోండి! నేను గైడ్ చేస్తాను.

"స్కీం నెంబర్ త్రీ అంటే ఏమిటండీ?" వినయంగా అడిగాడు గోపాల్రావ్.

"ఆ మాత్రం తెలీదా. మీ ఏరియాలో శంకర్ దాదా శిష్యుడు గుడుంబా నర్సింహ లేడా? అతనిని స్కీం నెంబర్ త్రీ తోనే పంపించాను. సరే దాని సంగతి తర్వాత చెప్తాను ముందు మీ కమిటీ మెంబర్లందరినీ ఫస్ట్ బాచ్ గా తయారుచేసి సింగపూర్, మలేషియా పంపిస్తాను. ఆ తరువాత ఇతర దేశాలు- అలా జీవితాంతం రెండు మూడు నెలల గాప్ లో ప్రపంచమంతా తిరిగిరావచ్చు. ఎలా వుంది మన స్కీం?" సగర్వంగా అడిగాడు.

అందరూ ఓసారి మొఖాలు చూసుకున్నారు.

"బాగానే వున్నట్లుంది! ఇంతకూ అసలా స్కీం నెంబర్ త్రీ అంటే ఏమిటి?" గొణిగాడు శాయిరామ్.

"వస్తున్నా! మీ ఎనిమిది మందిలో ఎవరికయినా లలితకళలలో ప్రవేశం ఉందా?"

"అలాంటిదేమీ లేదు"

అతని మొఖంలో కోపం కనిపించింది.

"లేకుండా ఎలా ఉంటుందండీ! మనిషన్నాక ఏదొక కళలో అభిరుచి ఉండాలి- ఉంటుంది! కనీసం కాలేజీలో చదువుకునే రోజుల్లోనయినా 'హాబీ' లాంటిదేదయినా ఉండాలిగా"

"ఓ! అదా! అలా అయితే ఉన్నాయండీ! నాకు చిన్నప్పుడు డ్రాయింగ్ అంటే చాలా ఇష్టంగా ఉండేది. తెలుగు వాచకంలో తాబేలు బొమ్మను చూసి అచ్చం అలాగే డ్రాయింగ్ బుక్ లో దించేసరికి మా డ్రాయింగ్ టీచర్ దంగైపోయాడు. నూటికి తొంభయ్ మార్కులు వేసేశాడు!" ఆనందంగా చెప్పాడు శాయిరామ్.

"నేను ఇంటర్ చదివేప్పుడు లలిత సంగీత పోటీలు జరిగాయ్. అందులో "రాయబారం చేయవే తడికో తడికా" అనే పాట పాడాను. బహుమతేమీ రాలేదు గానీ అందరూ భలే మెచ్చుకున్నారు" చెప్పాడు రంగారెడ్డి.

"నేను స్టేజ్ మీద మంచిగ యాక్షన్ జెయ్యాలని జబర్దస్త్ ఖాయిషుండెనన్నా! ఎవ్వళ్ళూ ఛాన్స్ గిట్ల ఇవ్వలేగానీ ఇప్పటి గ్గూడ యాక్షన్ చెయ్యాల్ననే ఉన్నది. జనార్ధన్ అన్నతో- సినిమాలో చిన్న వేషం వేసినా గానీ అది ఎడిటింగ్ లో కట్ జేసేసిన్రు బాడ్ కవ్ లు" చెప్పాడు యాదగిరి.

"నా సంగతి మీకు ఇదివరకే తెలిసి ఉంటుంది" అన్నాడు జనార్ధన్ క్రాఫ్ సర్దుకుంటూ బ్రోకర్ తో.

"నాకేమీ తెలీదే?" ఆశ్చర్యంగా అన్నాడు బ్రోకర్.

"జనార్ధన్ హెయిర్ స్టయిల్ ఇంకోసారి సర్దుకుని "ఇప్పుడు చూడండి! గుర్తుపట్టారా?"

"నాకేం అర్థం కావటం లేదు. సంగతేమిటో త్వరగా చెప్పండి" చిరాగ్గా అన్నాడు బ్రోకర్.

"నేను కొన్ని సినిమాల్లో హీరోగా చేశానండీ"

"అలాగా?"

"మీరు సినిమాలు చూడరా?"

"ఒక్క సినిమా కూడా వదలకుండా చూస్తాను. మీరెందులోనూ కనిపించినట్లు గుర్తులేదే! ఒకే ఒక్క సినిమా మాత్రం మిస్సయ్యాను. ఎందుకంటే ఫస్ట్ డే మాట్నీకి రిజర్వ్ చేసుకున్నాను. ఆ నాకొడుకులేమో మాణింగ్ షోతో సినిమా ఎత్తేశారు" చిరాగ్గా అన్నాడు బ్రోకర్.

"ఆ! అదే! అదే నేను జనార్ధనన్నా యాక్ట్ చేసిన పిక్చరు" సంబరంగా అన్నాడు యాదగిరి.

"మిగతా సినిమాలు ఇంకా రిలీజ్ కాలేదు" అన్నాడు జనార్ధన్.

"మీ సంగతేమిటి గోపాల్రావ్ గారూ? మా హాబీ ఏమిటి?"

"ఏమీలేదే" ఆలోచిస్తూ అన్నాడు గోపాల్రావ్.

"లేకపోవటమేమిటి? ఏదో ఉండే ఉంటుంది! సరిగ్గా గుర్తు తెచ్చుకోండి"

గోపాల్రావ్ రెండు నిముషాలు ఆలోచించాడు.

"ఆ! గుర్తుకొచ్చింది! టెన్త్ చదివేప్పుడు మా ఇంటి వెనుక గడ్డివాము దగ్గర చుట్టుపక్కల పిల్లలందరినీ కూర్చోబెట్టి మాజిక్ షో ఇచ్చాను. మాజిక్ అంటే చాలా ఇష్టం నాకప్పుడు."

అందరం ఆశ్చర్యంగా చూశాం గోపాల్రావ్ వేపు.

"అయితే నీకు మాజిక్ వచ్చా? మాకెవరికీ చెప్పలేదేం మరి?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఏడ్చినట్లుంది. ఆ రోజు నేను చేసిన ఒకే ఒక్క అయిటం కాస్తా ఫెయిలయింది. గుప్పిటలో పావలా కాయిన్ చూపించి కాసేపు చేయి గాలిలో తిప్పితే అర్ధరూపాయి కాయిన్ గా అయిపోవాలది. వాళ్ళందరూ నా చేతివేపు చూస్తూండడంతో కాయిన్ మారుస్తున్నప్పుడు దొరికిపోయాను"

"మరి మీ హాబీ ఏమిటమ్మా?" రాజేశ్వరిని చూస్తూ అడిగాడతను.

"నేను డిటెక్టివ్ రైటర్ని"

"ఒండర్ ఫుల్! ఎన్ని బుక్స్ రాశారు మీరు?"

"పదహారు నవలలు రాశాను గానీ ఒకే ఒక్కటి పబ్లిషయింది."

"ఏం ఫరవాలేదు. అది చాలు దున్నేయటానికి! మీ సంగతేమిటమ్మా?" పార్వతీదేవి నడిగాడతను.

"నాకు ముగ్గులేయటం హాబీ అండీ ఇంకేమీ రాదు."

"సూపర్బ్! అది చాలు!"

"కానీ ఇవన్నీ ఎందుకసలు?" అడిగాడు శాయిరామ్.

"ఎందుకేమిటయ్యా? ప్రవాసాంధ్ర అసోసియేషన్ లు మీకోసం అంతంత డబ్బు ఎందుకు ఇస్తున్నాయనుకున్నారు?" అడిగాడు బ్రోకరు.

"ఖచ్చితమయిన కారణం ఫలానా అని మాకు తెలీదుగానండీ, తెలుగు ప్రజల మీద ప్రేమతో జనాభా అందరినీ బాచ్ ల వారీగా వాళ్ళ దేశాలు పిలిపించుకుని చూద్దామని అలా చేస్తున్నారని అనుమానమండీ"

బ్రోకర్ మతిపోయినట్లు చూశాడు.

"ఇదిగో మీ అనుమానం సంగతేమో గానీ మా మాటలు వింటే నాకు మతిపోయేట్లుంది! అసలు సంగతేమిటో తెలుసా? పాపం ఆ విదేశాల్లో తెలుగు వాళ్ళు తెలుగు ప్రజలకూ, తెలుగు కళలకూ, తెలుగు సంస్కృతికీ దూరంగా ఉంటున్నారు కదా! అందుకని అన్ని రంగాల్లోనూ నిష్ణాతులయిన తెలుగు ప్రముఖులను వాళ్ళ దగ్గరకు పిలిపించుకుని వారి ప్రతిభను స్వయంగా తిలకించి ఆనందించాలని కోరిక! అందుకని అప్పుడప్పుడూ బోలెడు డబ్బు ఖర్చుచేసి ఇలా వివిధ కళల్లో ప్రావీణ్యం గల వారిని పిలిచేస్తుంటారు. ఇప్పుడర్థమయిందా?"

మాకెవరికి కొద్దిసేపటివరకూ నోట మాట రాలేదు.

చివరకు రంగారెడ్డి కోలుకుని మాట్లాడాడు.

"మరి కళల్లో ప్రావీణ్యత గలవారు కావాలంటే మమ్మల్ని సెలక్ట్ చేశారేమిటి మీరు?"

"ఇదిగో మిమ్మల్ని మీరలా కించపరచుకోకండయ్యా! ఒకాయనకు ఆరోక్లాస్ చదువుతున్నప్పుడు డ్రాయింగులో తాబేలు బొమ్మకు తొంభయ్ మార్కులొచ్చాయ్! అలా అలా ఆయన ఇప్పుడు ఆంధ్రదేశంలోని చిత్రకారుల్లో ప్రముఖుడయ్యాడు."

శాయిరామ్ కంగారుపడ్డాడు.

"అదేమిటి? ఆ తర్వాత మళ్ళీ ఇంతవరకూ బొమ్మే వేయలేదు. ఓసారి మళ్ళీ తాబేలు గీయబోయాను గాని అది ఎలుకలాగా కనిపించేసరికి మానుకున్నాను. మరి నేను ఆంధ్రదేశంలో ప్రముఖ చిత్రకారుడినని ఎలా చెప్తాము."

"అబ్బా! నిజంగా నువు ప్రముఖ చిత్రకారుడివి అవ్వక్కర్లేదయ్యా! ఆ పేరుతో వెళ్తావ్ అంతవరకే."

"కానీ తీరా అక్కడికెళ్ళాక నేను కాకిబొమ్మ కూడా గీయలేనని తెలుస్తే."

"చట్! ఊరుకోవయ్యా! వెధవనుమానాలూ నువ్వూనూ! పాపం వాళ్ళసలే ప్రవాసాంధ్రులు! ఇక్కడ ఎవడు గొప్ప చిత్రకారుడో, ఎవతె అద్భుతమయిన నాట్యగత్తో, ఎవడు సంగీత విద్వాంసుడో, ఎవడు ఉత్తమ నటుడో అవేమీ వారికి కొంచెం కూడా తెలీదు.

నేను ఎవడి గురించి ఏం ఇంట్రడక్షన్ ఇస్తే అదే వేదవాక్కు వాళ్ళకు! పాపం అప్పుడప్పుడూ వాళ్ళను చూస్తే నాకు జాలిగా కూడా ఉంటుందనుకో! ఎందుకంటే అమెరికాలాంటి దేశంలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న మన తెలుగు డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపారస్తులు, ఇంకా అనేక ఇతరవృత్తుల వాళ్ళను నేను ఇట్టే బోల్తా కొట్టిస్తున్నానే అని గిల్టీగా కూడా ఉంటుంది. కానీ ఏం చేస్తాం? తప్పదు! బిజినెస్ ఈజె బిజినెస్! వ్యాపారం అన్నాక మోసం తప్పదు కదా? ఏమంటారు?" వేదాంత ధోరణిలో అన్నాడు.

"అవునవును" వప్పుకున్నాడు జనార్ధన్.

"ఆ! ఎందాక వచ్చాం! తాబేలు బొమ్మ వేసినవాడిని ప్రస్తుతం ఆంధ్రదేశంలో ప్రముఖ చిత్రకారుడు అంటాం. ఇకపోతే, కాలేజ్ సంగీత పోటీల్లో "రాయబారం చేయవే తడికో తడికా" అని పాటపాడిన వాడెవడు?"

"నేను" అన్నాడు రంగారెడ్డి.

"ఆ! చూడు బ్రదర్! నువ్వు ప్రస్తుతం రేడియోలోనూ, టీవీలోనూ తెలుగుదేశాన్ని ఊపేస్తోన్న మధుర ఏకైక గాయకుడివి! నీకు తెలుగు ప్రజలంతా కలసి "గాన రాక్షస" అనే బిరుదు ఇచ్చారు."

రంగారెడ్డి భయపడిపోయాడు.

"అయ్యా నా వల్ల కాదాసర్! నన్నక్కడ స్టేజి ఎక్కించి పాడమంటే నా గతేంకాను? అతను చిరాకుపడ్డాడు.

"వినేది ప్రవాసాంధ్రులయితే మధ్యలో నీకు భయమెందుకయ్యా? వాళ్ళ చావు వాళ్ళు ఛస్తారు! నువ్వు నీకిష్టమొచ్చిన పాటలు ఓ అరడజను నేర్చుకుని పాడెయ్! కావాలంటే రేపట్నుంచే ప్రాక్టీస్ ప్రారంభించు. తరువాత జనార్ధన్ గారెలాగూ సినిమా నటుడు. ఆయన నటించిన చిత్రాల్లో కొన్ని దృశ్యాలు ప్రవాసాంధ్రులకు స్టేజిమీద ప్రదర్శిస్తారు.

ఇకపోతే యాదగిరి! ఇద్దరూ కూడా సినిమా నటులే కానీ ఒకే బాచ్ లో వుండటం బాగుండదు. అందుకు మీరు సినిమా డైరెక్టర్ నని చెప్పండి!"

యాదగిరి మొఖంలో ఆనందం కనిపించింది.

"అంటే అక్కడేం చేయాలి నేను?"

"ఏముందీ? స్టేజి ఎక్కిస్తారు వాళ్ళు. అక్కడ మీరు తీసిన సినిమా అనుభవాలు అంటే ఏవో కొన్ని అబద్ధాలు కల్పించి చెప్తారన్న మాట సరేనా?"

"ఓ! అలాంటి మిమిక్రీ మనకు కొట్టినపిండి!" ఉత్సాహంగా అన్నాడతను.

"ఇక గోపాల్రావు సంగతి సరేసరి! మాజిక్ ప్రదర్శన ఓ అరగంట సేపు ఇచ్చేయవచ్చు" గోపాల్రావు అదిరిపడ్డాడు.

"ఏమిటి? నేను మాజిక్ చెయ్యాలా? నా వల్ల కాదండి! నేను అమెరికా వెళ్ళనసలు"

బ్రోకర్ నవ్వాడు.

"అరె! ఇంత పిరికివాళ్లేమిటండీ బాబూ ఈ కాలనీలో! అరగంట సేపు మాజిక్ చేయమంటే పారిపోతాడేమిటాయన?"

"ఎలా చేస్తానండీ! నాకసలేమీ రాదని చెప్పాను కదా?"

"వస్తే నిన్నెందుకు పంపిస్తామయ్యా మేము? భలేగున్నావే! మనమేం ప్రవాసాంధ్రుల కోసమే బ్రతుకుతున్నట్లు మాట్లాడతావేమిటి? వాళ్ళ అమాయకత్వాన్ని నేను కాష్ చేసుకుంటాను. మీరేమో విదేశాలు వాళ్ళ ఖర్చు మీద చూడడం ద్వారా మీ సరదాలు తీర్చుకుంటున్నారు. అంతే! అంచేత వారం రోజుల్లో మాజిక్ నేర్చుకోవటం ఎలా అనే పుస్తకం కొనుక్కో! లేదా మన ఫేమస్ మెజీషియన్ షాడో దగ్గరకెళ్ళి షార్ట్ టరామ్ కోర్స్ నేర్చుకో! అయిందా? ఇంక పార్వతీదేవి గారూ! మీకు ముగ్గువేయటం హాబీ అన్నారు కదూ! మీరో పని చేయండి! ఓ అరగంట భరతనాట్యం చేయండి! మిమ్మల్ని ప్రఖ్యాత భరతనాట్య ప్రవీణురాలు శ్రీమతి పార్వతీదేవి అని వాళ్ళకు పరిచయం చేస్తాం."

పార్వతీదేవి విరగబడి నవ్వేసింది.

"బాగుందండీ జోకు"

బ్రోకర్ తృళ్ళిపడ్డాడు.

"జోకా? జోకేమిటండీ! నాకు జోకులేసుకుంటూ తిరగటమే పననుకున్నారేమిటి?" అన్నాడు కోపంగా.

"అంటే? నిజంగానే నన్ను భరతనాట్య ప్రదర్శన ఇమ్మంటున్నారా?" నమ్మలేనట్లు అడిగిందామె.

"అవునమ్మా! నిజంగానే ఇవ్వాలి!"

"మీకు పిచ్చేమయినా ఎక్కిందా ఏమిటి? నాకసలు సరిగ్గా నడవడం కూడా రాదని మావారు ఆటలు పట్టిస్తుంటారు. మీరేమో..."

"అబ్బా- మీరేం డాన్స్ పోటీలకెళ్తున్నారా? ప్రవాసాంధ్రుల కిచ్చే డాన్స్ ప్రోగ్రాంకి కూడా డాన్స్ చేయటం రావాలా ఏమిటి? మీరలాంటి పిచ్చి పిచ్చి ఆలోచన్లేమీ పెట్టుకోకండి! పోనీ వాళ్ళు తప్పట్లు కొట్టాలని అంతగా కోరికగా వుంటే మూర్ఛ వచ్చినవాడినెవ్వర్నయినా జాగ్రత్తగా అబ్జర్వ్ చేయండి! ఆ రకంగా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటే చాలు! కొంచెం కాలు బెణికిందనీ అంచేత నృత్యం అనుకున్నంత అద్భుతంగా చేయలేకపోయాననీ ఓ మాట చెప్పేస్తే సంతోషపడిపోతారు వాళ్ళు. చాలా అల్ప సంతోషులు పాపం వాళ్ళు."

పార్వతీదేవి నోట మాట రావటం లేదు.

"ఇంక నువ్వమ్మా రాజేశ్వరీ! నువ్వు డిటెక్టివ్ నవలలు రాస్తానన్నావు కదూ! డిటెక్టివ్ అన్న ముక్క వదిలేసి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ని ఉర్రూతలూగిస్తోన్న ప్రఖ్యాత రచయిత్రి రాజేశ్వరి అని పరిచయం చేద్దాం! మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే నువ్వు రాసిన కొన్ని ఇటీవలి నవలలు గురించి ఓ రిపోర్ట్ తయారుచేసి చదవటమే"

"ఓ! బ్రహ్మాండంగా చదివేస్తా" ఉత్సాహంగా అందామె.

"అంతేకాదు! కేవలం రచయిత్రి అయినంత మాత్రాన వాళ్ళకు అంత థ్రిల్ వుండదు కనుక మీరు క్లాసికల్ సింగర్ అని కూడా ప్రచారం చేస్తాం. మీరు ఓ అరగంట క్లాసికల్ మ్యూజిక్ ప్రోగ్రాం ఇస్తే సరిపోతుంది. అది నాకు రాదు కదా అని అడక్కండి! బోలెడు టైముందు మీకు నేర్చుకోటానికి! నెల రోజుల వ్యవధి అంటే మాటలా?"

"అవును! పైగా గొంతు బాగోలేదని చెప్పి ఇష్టం వచ్చినట్టు పాడినా ఎవరూ ఏమీ చేయలేరు! కదూ?" మరింత ఉత్సాహంగా అందామె.

మా అందరి దగ్గరా తలో వందరూపాయలు తీసుకుని లేచి నిలబడ్డాడు బ్రోకరు.

"చూడండి! ఎవరు ఏ ఏ కళల్లో ప్రవీణులో ముందే చెప్పేశాను. తరువాత మళ్ళీ కన్ ఫ్యూజ్ అయి నన్ను కన్ ఫ్యూజ్ చేయకండి! నేను మళ్ళీ ఎల్లుండి మీ కాలనీ కొస్తాను. ఆ రోజు మీ అందరూ తలో మూడువేలూ అర్జెంటుగా ఎలా సంపాదించాలో అయిడియా ఇస్తాను. అంటే స్కీం నెంబర్ త్రీ అన్నమాట! వస్తా"

అతను వెళ్ళిపోయాడు.

లోలోపల కొంచెం భయంగా ఉన్నా ఎంతో ఆనందంగా కూడా ఉంది మా అందరికీ. ఆ రెండు రోజులూ మాకు ఒకటే కలలు - అప్పుడే అమెరికా వెళ్ళిపోయినట్లూ- మాకు ఘనస్వాగతం లభించినట్లూ-

రెండోరోజు రాత్రయితే రంగారెడ్డి గావుకేకలేసుకుంటూ ఇంట్లో నుంచి బయటకు పరుగెత్తుకొచ్చాడు. వాళ్ళ ఆవిడ, పిల్లలు సమయానికి మేలుకుని గట్టిగా అరవబట్టి అందరం లేచి అతన్ని గట్టిగా పట్టుకున్నాం.

"హా! అమెరికా! అదుగో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ- ఇదిగో యు.ఎన్.ఓ. అదిగో వైట్ హౌస్, అదిగో వాటర్ గేట్" అంటూ ఇంకా అరుస్తూనే ఉన్నాడతను. అతని కళ్ళు మాత్రం మూసుకుని ఉన్నందువల్ల ఇంకా నిద్రావస్థలోనే ఉన్నాడని అర్థమయింది మాకు.

ఈలోగా ఎవరో గ్లాసు నిండా చల్లని నీళ్ళు తెచ్చి అతని మొఖం మీద కొట్టారు.

కెవ్వున కేకవేసి కళ్ళు తెరిచాడు. ఆ కేకకు అందరం అదిరిపడ్డాం.

"ఏమిటి? ఎందుకలా అరచావ్?" అడిగాను.

"ఫ్లైట్ క్రాష్! మనాళ్ళందరూ క్షేమమేనా?" అయోమయంగా అందరి మొఖాల్లోకి చూస్తూ అడిగాడు.

అందరూ ఘోల్లుమని నవ్వారు.

దాంతో మరింత స్పృహ తెచ్చుకుని చుట్టూ చూసి "మనం ఎందుకున్నాం ఇక్కడ?" అన్నాడు.

అందరూ మళ్ళీ నవ్వారు.

"పదండి! ఇంట్లోకెళదాం! ఈ మాయదారి అమెరికా టూరేమో గానీ ఈ మనిషి రెండ్రోజుల్లో పిచ్చాడిలా అయిపోయారు!" అంటూ రెడ్డిని లోపలకు తీసుకుపోయిందతని భార్య.

మర్నాడు ఉదయం ఏడుగంటలకే అందరం రెడీ అయిపోయి చక్రధర్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాము.

మరికాసేపట్లో అతని కారు రానే వచ్చింది.

అందరం అతని చుట్టూ మూగిపోయాం నమస్కారాలు పెడుతూ. చిరునవ్వుతో నమస్కారాలందుకుని సిగరెట్ వెలిగించుకుని, కారు దిగి ఆనుకుని నిలబడ్డాడతను.

"మీ లిస్ట్ ఫైనలైజ్ అయిపోయింది. ఇంక మీరు తలో మూడువేలూ సంపాదించటమే ఆలస్యం" అన్నాడు.

"అదేనండీ! అది సంపాదించటానికే స్కీమ్ నెంబర్ త్రీ అని ఏదో సీక్రెట్ చెపుతానన్నారివాళ."

"కూర్చోండి!" అన్నాడతను ఓ క్షణం ఆగి.

అందరం నేలమీదే చతికలబడ్డాం.

"ముందు మీరేం చేయాలంటే ఏదొక సాంస్కృతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలి మీ కాలనీలో. ప్రముఖ పారిశ్రామికవేత్తలనూ, పోలీస్ మరియు ఇతర ఉన్నతాధి కారులనూ కొంతమందిని ఎన్నుకుని వాళ్ళను ఆ కార్యక్రమంలో స్టేజి ఎక్కించాలి. మైక్ దగ్గరకు మీ కాలనీ కల్చరల్ గ్రూప్ వాళ్ళను వరుసగా పిలిపించి వాళ్ళందరినీ పేరుపేరుగా పొడిగించాలి. వాళ్ళను స్తుతిస్తూ పాటలూ, పద్యాలూ పాడించాలి. వాళ్ళు మైక్ ముందు నిలబడిన దగ్గర్నుంచీ ఉపన్యాసం అయ్యేవరకూ తప్పట్లు కొట్టాలి. వాళ్ళు స్టేజ్ మీద కొంచెం కదిలితే చాలు కలర్ ఫోటోలు తీయాలి. వీడియో తీయాలి. ఫోటోలు అన్ని పేపర్లలోనూ, మ్యాగజైన్లోనూ, టీవీలోనూ వేయించాలి. ఎలా వుంది "స్కీమ్ నెంబర్ త్రీ" ఉత్సాహంగా అడిగాడతను.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఇందులో పెద్ద యిదేముందనీ! మేము ఇదివరకు రెండుమూడు సన్మానాలు చేసి ఆర్థికంగా చావుదెబ్బ తిన్నాం" అన్నాడు రంగారెడ్డి నిరుత్సాహంగా.

అతను ఓ క్షణం ఆలోచనలో పడ్డాడు.

"ఆర్థికంగా చావుదెబ్బ తిన్నారా! ఎలాగబ్బా! ఇంతవరకూ వీటిల్లో లాభమే గానీ నష్టం ఎక్కడా లేదే. ఆ! గుర్తుకొచ్చింది అయామ్ సారీ! స్కీమ్ నెంబర్ త్రీలో మీకు అసలయిన విషయం చెప్పలేదు"

"ఏమిటది?"

"అదే సావనీర్? మీ కాలనీ తరపున అమెరికా వెళుతున్న వారిని అభినందిస్తూ అభినందన సంచిక ఒకటి రిలీజ్ చేయాలి"

"ఏడ్చినట్లుంది! ఈ ప్రోగ్రామ్ కే డబ్బుల్లేవని ఛస్తూంటే మధ్యలో ఈ అభినందన సంచికలేమిటి? మా చెవుల్లో పూలు ఏమయినా కనిపిస్తున్నాయా?"

అతను కొంచెం విసుగు కనబరిచాడు.

"ఇదిగో మీకే తెలీపోతే నేను చెప్పినట్లు వినాలి. మిమ్మల్ని టూర్ పంపించేవాడిని నేనా? మీరా?" కోపంగా అడిగాడు.

"మీరే- మీరే- మీరే" గాబరాగా అరిచారందరూ.

"అయితే మరి మీరెందుకు? పెద్ద బిజినెస్ మెన్ లాగా పిచ్చివాగుడు వాగుతారు? నాకు వళ్ళు మండిందంటే అసలు మీ టూర్ కాన్సిల్ చేసి పారేస్తాను-"

అందరం సైలంటయిపోయాం.

"ఆ అభినందన సంచిక నేనే పబ్లిష్ చేస్తాను గనుక మీరు డబ్బు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు."

అతని మాట పూర్తవకుండానే అందరూ తప్పట్ల వర్షం కురిపించేశారు.

"చక్రధర్ జిందాబాద్- లాంగ్ లివ్ చక్రధర్" అన్న కేకలు కూడా వినిపించినయ్.

"ఛఛ! మరీ ఇంత బేవార్స్ జనమేమిటయ్యా మీ కాలనీలో?" అంటూ మావేపు తిరిగాడతను చిరాగ్గా.

అంతవరకూ తప్పట్లు కొడుతున్న మేము ఠక్కున తప్పట్లు ఆపేశాము.

"అవునండీ! వట్టి లేకిజనం! మాకే చాలా సిగ్గుగా ఉంటుంది. వీళ్ళను తల్చుకుంటే! ఎదుటివాడి సొమ్ము అనగానే ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొస్తుంది" అన్నాడు శాయిరామ్.

"అయితే మీ కాలనీవాళ్ళు చేయాల్సిన సహాయం ఒకటుంది. మీ కల్చరల్ ప్రోగ్రామ్ కొచ్చే ప్రముఖుల ఇన్ ఫ్లుయెన్స్ ఉపయోగించి సావనీర్ కి అడ్వర్టయిజ్ మెంట్స్ తేవాలి! అంతే!"

"ఓశ్! ఇంతేనా! నో ప్రాబ్లెమ్" అన్నాడు రెడ్డి ఆనందంగా.

"అయితే ఇక్కడ ఇంకో తిరకాసుంది"

అందరం భయంగా, అనుమానంగా అతనివేపు చూశాము.

"అదేమిటంటే ఆ ప్రకటనలకొచ్చే డబ్బు మన అమెరికా టూర్ కి ఏమాత్రం చాలదు. గనుక మిగతా డబ్బు కోసం స్కీమ్ నెంబర్ ఫోర్- ఫాలో అవ్వాలి."

"స్కీమ్ నెంబర్ ఫోరా? అంటే ఏంటది?" అడిగాను.

"స్కీమ్ నెంబర్ త్రీ పూర్తయ్యాక చెప్తాన్లే"

"అసలిలా ఎన్ని స్కీమ్ లున్నాయ్ ఇంకా?" చిరాకుగా అడిగాడు జనార్ధన్.

"ఎవరా ప్రశ్న అడిగింది? వాళ్ళ అమెరికా టూర్ కాన్సిల్ చేసి పారేస్తాను" అరిచాడతను.

జనార్ధన్ నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అతను కొంచెం శాంతించాడు.

"స్కీమ్ నెంబర్- ఫోర్ సాదారణంగా లాస్ట్ స్కీమ్ అవుతుంది! ఒకవేళ దానివల్ల కూడా రావలసినంత డబ్బు రాలకపోతే అప్పుడు స్కీమ్ నెంబర్ ఫైవ్ అమలుపరచాలి. సరే! మీ అందరికీ వారం రోజులు టైమిస్తున్నాను. ఈలోగా ఆ సాంస్కృతిక కార్యక్రమం తాలూకూ ఏర్పాట్లు, అభినందన సంచికకు కావలసిన వ్యాపార ప్రకటనలూ అన్నీ సిద్ధం చేయండి! సరేనా?" అంటూ టైమ్ చూసుకుని కెవ్వుమంటూ అరచాడు.

"కొంప మునిగింది? చిక్కపల్లిలో సింగపూర్ వెళ్ళే కళాకారులను అరగంట క్రితమే సమావేశమవ్వమని చెప్పి వచ్చాను. వాళ్ళను ప్లేన్ ఎక్కించాలి" అంటూ కారువేపు పరుగెత్తాడు.

అందరూ వెళ్ళిపోయాక మా కమిటీవాళ్ళం మాత్రం మిగిలాము.

"ఇప్పుడు మన కల్చురల్ ప్రోగ్రామ్ కి ఎవరెవర్ని పిలుద్దాం" అడిగాడు శాయిరామ్.

"మన జంటనగరాల్లో అన్ని ఫంక్షన్స్ కి ముఖ్య అతిథిగా మోహన్ రెడ్డి వస్తూంటాడు కదా- ఆయన్నే పిలుద్దాం!" అన్నాడు జనార్ధన్.

"అవును! ఏ సాంస్కృతిక సంస్థ అడిగినా పదివేల రూపాయలు ఠపీమని ఇచ్చేస్తాడట అతను" చెప్పాడు రంగారెడ్డి.

"మరి కాసేపటి తర్వాత డజను ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తుల పేర్ల లిస్ట్ తయారు చేశాము.

ముందు మోహన్ రెడ్డి ఇంటికెళ్ళాలని నిశ్చయించుకున్నాం.

ఉదయం ఏడుగంటలకే అందరం జూబ్లిహిల్స్ బస్ కోసం వెళ్ళి నిలబడ్డాం. వరుసగా నాలుగు జూబ్లిహిల్స్ బస్ లు వెళ్ళాయ్ గానీ, ఒక్కటీ మా స్టేజ్ లో ఆగటం లేదు. పైగా జనం! బస్సులోపలా, ఫుట్ బోర్డ్ మీదా, టాప్ మీదా కూడా నిండిపోయి వేలాడుతున్నారు.

మాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

ఆర్టీసీ బస్ లు ఒక రాజధానిలో చాలా అధ్వాన్నం అన్న సంగతి తెలుసుగానీ ఇలా ఉదయం ఏడుగంటలక్కూడా ఇంత దారుణంగా కిక్కిరిసి పోతాయని తెలీదు.

ఇలా లాభం లేదని చివరకు రెండు ఆటోలను పిలిచాము.

"ఎక్కడికి వెళ్ళాలి సార్?" అడిగాడొక ఆటో అతను.

"జూబ్లిహిల్స్ వెళ్ళాలి" కొంచెం స్టయిల్ గా చెప్పాడు శాయిరామ్.

"మోహన్ రెడ్డి గారింటికా సార్?" అడిగాడతను.

మాకు మతిపోయినట్లయింది.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"సాధారణంగా జూబ్లిహిల్స్ అంటే అక్కడికే అని మాకు తెలుస్సార్"

ఆటోలు బయల్దేరినయ్.

"మీది ఏ కల్చరల్ ఆర్గనైజేషన్ సార్?" అడిగాడు ఆటోవాడు కాస్త దూరం వెళ్ళాక.

శాయిరామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"నన్ను మైక్ ముందెప్పుడయినా చూశావా?"

"లేద్సార్"

"మరి మాది కల్చరల్ ఆర్గనైజేషన్ అని నీకెలా తెలుసు?"

"మోహన్ రెడ్డి గారి దగ్గరకు వెళుతున్నారంటే అనుమానం వచ్చింది సార్! ఆయనే కదండీ ఇలాంటివాటికి తెగ డబ్బిచ్చేది?"

మా మొఖాలు మాడిపోయాయ్.

"సరే సరేలే! త్వరగా పోనీ" అన్నాడు రంగారెడ్డి కోపం అణచుకుంటూ.

ఆటో జూబ్లిహిల్స్ మీద కొంతదూరం ఎక్కేసరికి ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ జామ్ అయిపోయి కనిపించింది.

ఆటోలూ, ఆర్టీసీబస్ లూ, స్కూటర్లూ, సైకిళ్ళూ కిక్కిరిసిపోయి ఉన్నాయ్ రోడ్డంతా. పోలీస్ విజిల్స్ చెవులు పగిలేంత గట్టిగా వినబడుతున్నాయ్.

"ఏమిటింత ట్రాఫికిక్కడ?" రంగారెడ్డి నడిగాను.

"ఆ ఏదో జాతర జరుగుతూండి వుంటుంది. తెలుగు రాజధాని జాతరలకు ఫేమస్ కదా!" అన్నాడు రెడ్డి.

"ఈ ట్రాఫిక్ క్లియర్ అయేసరికి మరో గంటయినా పడుతుంది. అంత వరకూ మీటరు తిరగటం ఎందుకు? దిగి నడిచి వెళ్దాం పదండి! మహా అయితే మరో అరకిలోమీటరు దూరముంటుంది" అన్నాడు శాయిరామ్.

అందరం నడక ప్రారంభించాం.

ఆ జనంలోంచి తప్పించుకు నడవటం ప్రాణం మీద కొస్తోంది. చివరకు మోహన్ రెడ్డి ఇంటికి వందమీటర్ల దూరంలో ఆగిపోక తప్పలేదు.

అక్కడ అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా స్థలం లేదు. పోలీస్ కానిస్టేబుల్స్ లాఠీలు ఊపుతూ జనాన్ని చెదరగొడుతూ విజిల్స్ వేస్తున్నారు.

"ఏం జాతర ఇక్కడ?" అడిగాను ఓ కానిస్టేబుల్ ని.

"జాతరేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"మరి ఈ జనమంతా ఏమిటి?"

అతను పగలబడి నవ్వాడు.

"నీ యవ్వగ మంచిగున్నావ్ భయ్! ఈ రోడ్ మీద రోజూ గిట్లనే జమవుతారు కొడుకులు! ప్రతి ఒక్కరికీ పుక్కట్ పైసలు గావాల! ఈ మోహన్ రెడ్డి సాబ్ ఏమో ఏ కల్చరల్ అసోసియేషనోళ్ళు అడిగినా గానీ లేదనకుండ పైసలిస్తడు. వాని సొమ్మేం బోయే గవర్నమెంట్ ని ముంచి పైసల్ మస్త్ కమాయించుడు. స్టేజ్ మీదా, న్యూస్ పేపర్లల, టీవీల్ల కనబడాల్నని ఒకటే దూల! దాన్ని గురించి ప్రతోడూ గిట్లనే కల్చరల్ ఆర్గనైజేషన్ అని బోగస్ దొకటి జమాయించి ఈ సాబ్ కాళ్ళ మీద పడుతున్రు! సస్తే సావనీ గానీ మధ్యల వీండ్ల తోటి ఈ రోడ్డంతా నిండిపోయి ట్రాఫిక్ జామ్ అయి మా డిపార్టుమెంట్ కు పరేషాన్. ఇంతకూ మీరెందు కొచ్చిన్రీడకు! మోహన్ రెడ్డి సాబ్ గురించేనా?"

మళ్ళీ అందరి మొఖాలూ జేవురించినయ్.

"ఛట్! ఆయనతోటి నాకేం పనివయ్యా! మేము ఈ రోడ్ అవతల దిక్కుకు పోవాలి!" అన్నాడు యాదగిరి చప్పున కల్పించుకుంటూ!

"గట్లనా! అయితే ఆగో- ఆ గల్లీ లేదా! అటుకెళ్ళి రౌండ్ ఎబౌట్ రూట్ లో పోండ్రి! ఈ జనంలో కెళ్ళిపోయెడిదయితే చాలా కష్టం"

మేము ఆ కానిస్టేబుల్ దృష్టి నుంచి అతి చాకచక్యంగా తప్పించుకుని వెనక్కు వెళ్లాము.

"ఏయ్! అక్కడ నిలబడతావేమిటి! ఏదొక క్యూలో నిలబడండి గానీ అటూ ఇటూ కాకుండా నిలబడొద్దు" అరచాడు మా పక్కన నిలబడ్డ వ్యక్తి.

అప్పుడర్థమయింది మాకు అది ట్రాఫిక్ జామ్ కాదనీ, మోహన్ రెడ్డి ఇచ్చే డబ్బు కోసం నాలుగు క్యూలు కట్టిన కల్చరల్ అసోసియేషన్ ల నీనూ! పొద్దున్నే జూబ్లిహిల్స్ వెళ్ళే బస్ లన్నీ అంత రష్ గా ఎందుకుంటాయో అప్పుడు తెలిసింది.

మాట్లాడకుండా వెళ్ళి ఓ క్యూలో నిలబడ్డాము.

మోహన్ రెడ్డిని కలుసుకునే అవకాశం దొరికె సరికి మధ్యాహ్నం పన్నెండయి పోయింది.

మమ్మల్ని చూడగానే అతని మొఖంలో చిరాకు కనిపించింది.

"ఏం కావాలి మీకు?"

"మాది నిర్భయ్ నగర్ కాలనీ కల్చరల్ అసోసియేషన్.."

అతను మేము చెప్పేది పూర్తిగా వినిపించుకోలేదు.

"మీకేమయినా చెముడుందా? మీకేం కావాలి అనడిగాను. సమాధానం చెప్పండి అంతే! డోంట్ వేస్ట్ మై టైమ్..."

"సంగతేమిటంటేనండీ మా కల్చరల్ ఫంక్షన్ కి మీరు ముఖ్య అతిధిగా-"

మళ్ళీ మా డైలాగ్ సగంలోనే కట్ చేశాడు.

"ఎంత కావాలి?"

"పదివేలు" అన్నాడు రంగారెడ్డి ఠక్కున.

"కాదు-పదకొండు" అన్నాడు శాయిరామ్ రంగారెడ్డి వేపు కోపంగా చూస్తూ.

"నిజానికి పన్నెండువేలయితే బావుంటుంది అన్నాడు గోపాల్రావ్ అద్భుతంగా చిరునవ్వు చిందిస్తూ.

"సావనీర్ తో కూడా మిలాయాస్తే పదిహేనువెలిస్తే మంచిగుంటది సార్" ఫైనల్ గా చెప్పాడు యాదగిరి.

అతనికి ఆ మాటలు వినిపించుకోలేదు.

"ఇగో! ఈ వందరూపాయలు తీసుకెళ్ళండి- నెక్ట్స్" అంటూ వందకాగితం రంగారెడ్డి చేతిలో పెట్టాడు.

మాతి మతిపోయినట్లయింది.

"అది కాద్సార్"

ఓ లావుపాటి వ్యక్తి వచ్చి మా ముందు నిలబడి "పదండ్రి బయటకు" అన్నాడు తీవ్రంగా చూస్తూ.

చేసేదిలేక బయటికొచ్చేశాము. "పోన్లే! ఆటో ఖర్చులకయినా వస్తుంది! అన్నాడు రంగారెడ్డి.

ఇంక అతనితో లాభం లేదని మా లిస్ట్ లోని రెండోపేరు ఇంటికి చేరుకున్నాం. ఓ పదినిముషాలు వెయిట్ చేశాక ఓ లావుపాటి వ్యక్తి బయటికి వచ్చాడు. అతను హైద్రాబాద్ లోని పెద్ద బిజినెస్ మాగ్నెట్!

"ఏం కావాలి?" చాలా సౌమ్యంగా అడిగాడతను.

సంగతంతా చెప్పాము.

"కనుక మా కార్యక్రమానికి మీరు ముఖ్య అతిథిగా రావాల్సార్" అన్నాడు శాయిరామ్.

"ఓ! అలాగే! కానీ నన్నే ఎందుకు ముఖ్య అతిథిగా ఆహ్వానిస్తున్నారో కొంచెం చెప్తారా" అడిగాడతను.

ఒకరి ముఖాలొకరు చూసుకున్నాం. ఏం చెప్పాలో ఓ పట్టాన అర్థం కాలేదు.

మళ్ళీ యాదగిరే మమ్మల్ని కాపాడాడు.

"గట్లడుగుతే ఏం జెప్పాల్సార్? కళలంటే మీకు చాన ఇదున్నదని మేమందరం అనుకొన్నమన్నట్లు! మీరంటేమాకెంతో అభిమానం! మా కాలనీ వాళ్ళందరూ గూడా మీరే ఉండాలని ఒకటే లొల్లి పెడుతున్రు! దాన్ని గురించి"

"అదీగాక మిగతా వారందరిలా వ్యాపారమే ప్రధానం అనుకోకుండా కళలను ఆదరించాలనుకునే గొప్ప మనసు గలవారు మీరు" అన్నాడు శాయిరామ్ ఇంకొంచెం పొగుడుతూ.

"అసలు మీరే గొప్ప సాహితీకారులని కూడా మాకు తెలుసు. మీర్రాసిన "పురుషోత్తముని ప్రవచనాలు" అనే గేయకవితలు అద్భుతం! మా కాలనీలో చిన్న పిల్లలు కూడా అప్పజెప్పగలరు మొత్తం పుస్తకం" అన్నాడు రంగారెడ్డి.

పురుషోత్తంగారి మొఖంలో ఆనందం కనిపించింది.

"సరే! మీరింతగా అడుగుతున్నారు కాబట్టి వప్పుకుంటున్నాను" అన్నాడు చిరునవ్వుతో.

మా అందరి మొఖాలు విప్పారినయ్. స్కీమ్ నెంబర్ త్రీ తెగ సక్సెస్ అయిపోతుందన్న ఫీలింగ్ అందరికీ వచ్చేసింది.

"థాంక్యూ వెరీమచ్ సార్" అన్నాడు శాయిరామ్.

"అయితే మీతో ఒకమాట ముందే చెప్పాలను కుంటున్నాను" వెంటనే అన్నాడతను.

"ఏమిటండీ అది?"

"నేను ఒక్క పైసా కూడా ఇవ్వను! నన్నేమీ అడక్కండి!"

మా గుండెల్లో రాయిపడింది. అతికష్టం మీద కోలుకున్నాం- ఆ షాక్ నుంచి. అయితే ఎవరి నోరూ పెగలటం లేదు.

"ఏమంటారు మరి? అయినా మీది అలాంటి కల్చరల్ ఆర్గనైజేషన్ కాదనే అనుకుంటున్నాను."

"అహో!" అన్నాడు శాయిరామ్ పొడిగా నవ్వుతూ.

"ఊహోహో" అన్నాడు రంగారెడ్డి వింతగా నవ్వుతూ.

"ఊహిహి" అన్నాడు యాదగిరి.

"అవున్సార్! మాది అలాంటి బేవార్స్ సంస్థకాదు. మేము ఛస్తే ఎవరిదగ్గరా డబ్బు తీసుకోము. అయితే ఇంతకుముందు భారీ ఎత్తున మేమే కండక్ట్ చేసిన కల్చరల్ ప్రోగ్రామ్స్ వల్ల కొంచెం ఇబ్బందిలో ఉండి కేవలం మీ ఒక్కరిదగ్గర మాత్రమే డొనేషన్ తీసుకుంటే తప్పులేదని మా కాలనీ ప్రెసిడెంట్ జనార్ధన్ గారిని మేమంతా బ్రతిమాలుతున్నాం" అన్నాడు గోపాల్రావ్ కన్నుగీటుతూ.

"అవ్ జనార్ధనన్నా? ఇయాళ్టొక్కదినం పైసలు దీసుకో! మనం కాలనీ దిక్కువెళ్ళి జరా నీ ప్రిన్సిపుల్స్ నీ పక్కకుబెట్టి ఖుర్బానీ గిట్టచెయ్" అన్నాడు యాదగిరి.

"వద్దు బ్రదరం మన కాలనీ కల్చరల్ కమిటీ మిగతా వాటిలాగా కాదు. ఎవరిదగ్గరా డొనేషన్స్ తీసుకోమని ప్రతిజ్ఞ చేశాను."

"పోనీలే గురూ! ఈ ఒక్కసారికీ తీసుకో! పురుషోత్తం గారేం పరాయివారు కాదుగా! కళలకు ఆయన పుట్టినిల్లు" అన్నాడు రంగారెడ్డి.

"ఇదిగో... మీరు ఎన్నయినా చెప్పండి! నేను ఒక్క పైసా కూడా ఇవ్వటం లేదు. అందుకు ఇష్టమయితేనే వస్తా" కొంచెం కోపంగా అన్నాడతను.

"అలా అంటే ఎలాగండీ! మీరిస్తారన్న ఆశతోనే కదా ఈ కళామతల్లి జీవిస్తోంది?" అన్నాడు శాయిరామ్.

"నేనివ్వనంటే ఇవ్వను- ఇన్ని రోజులు పిచ్చాడినయి ఇచ్చాను. ఇంక ఛస్తే ఇవ్వను."

"పోనీ పదివేలివ్వండి చాలు."

"పది పైసలు కూడా ఇవ్వను."

మాకేం చెయ్యాలో తెలీటం లేదు. అలా బ్రతిమాలటం అలవాటు లేకపోవటం వల్ల చాలా బాధగానూ, అసహ్యంగానూ అనిపిస్తోంది.

"అంతేనా?" చిరాకుగా అడిగాడు యాదగిరి.

"అంతే!" కటువుగా అన్నాడతను.

"థూ నీయవ్వ! కళంటే సమజ్ గాని బేవకూఫ్ గాని అడిగెడిది మనదే గలత్! ఛల్"- అన్నాడు యాదగిరి!

"ఏయ్! మాటలు తిన్నగా రానీ! మీలాంటి దగుల్బాజీ కల్చురల్ గాళ్ళను చాలామందిని చూశా."

మా అందరికీ తిక్కరేగిపోయిందా మాటతో.

"పోరా బాడుకవ్! పైసలు సంపాదించగానే సరికాదురా! నీయవ్వ! కొంచెం కళాపోషణ చెయ్యాలి" అన్నాడు రంగారెడ్డి.

"లేకపోతే నీకూ జంతువుకీ తేడా ఏముందిబే!" అన్నాడు శాయిరామ్.

"ఇగో- నువ్వు రాసిన 'పురుషోత్తముని ప్రవచనాలు" ఎవడికి పైసలిచ్చి రాయించుకుని నీపేరు బెట్టినావో మా కందరికీ మంచిగ తెల్సురా సాలే-"

మా గొడవ భరించలేక అతడు పిచ్చెక్కినట్లు ఎగురుతూ మమ్మల్ని బయటకు వెళ్ళమని అరవసాగాడు.

మేమందరం బయటికొచ్చేశాము. లిస్టులోని మిగతావాళ్ళ దగ్గరకు వెళ్ళాలా వద్దా అని చాలాసేపు తర్జనభర్జనలు పడ్డాక చివరకు వెళ్ళటానికే నిశ్చయించుకున్నాం.

అయితే మిగతావాళ్ళ దగ్గర మాపని చాలా సులువుగానే జరిగిపోయింది. మేమడిగినంత ఇవ్వకపోయినా ఎంతో కొంత ఇవ్వటానికి వప్పుకున్నారు.

అయితే ఆ మొత్తమంతా కలిసినా పదివేలు దాటకపోవడంతో కథ మళ్ళీ మొదటికొచ్చింది.

అందరం చక్రధర్ ని కలుసుకున్నాం.

"ఈ డబ్బేం సరిపోతుంది? లాభం లేదు! వెంటనే స్కీం నెంబర్ ఫోర్ స్టార్ట్ చేయండి!" అన్నాడు చక్రధర్.

"అంటే ఏం చేయాలి?" అడిగాడు రంగారెడ్డి.

"ఛఛ! ఆ మాత్రం తెలీదా? మీ మొఖాలు చూస్తుంటే అసలు ఫారిన్ టూర్ వెళ్ళిన వాడితో మాట్లాడే అవకాశం కూడా దొరకని గబ్బిలాయిల్లా కనబడుతున్నారు. స్కీమ్ నెంబర్ ఫోర్ అంటే తెలీకపోవటం ఏమిటోయ్? ఫారిన్ టూర్ కి మీకందరికీ ఖర్చులు పెట్టుకోటానికి స్పాన్సర్స్ కావాలి! అంతే మిగతాదంతా వెరీ ఈజీ!"

అందరం మొఖాలు చూసుకున్నాం! ఎవరికీ ఆ 'స్పాన్సరింగ్' అనే పదం గురించి ఏమీ అర్థం అయినట్లు కనిపించలేదు.

"స్పాన్సరర్ అంటే ఏమిటి గురూజీ?" అడిగాడు శాయిరామ్.

చక్రవర్తి మండిపడిపోతూ చూశాడు మావేపు. నిజానికి అలా ముక్కూముఖం తెలీనివాడు ఆవిధంగా మా మీద స్వారీ చేస్తుంటే మేము ఎదురు తిరిగి "పోపోరా! సాలే" అన్న రోజులు చాలా ఉన్నాయి.

అయినా ఇప్పుడు ఫారిన్ టూర్ మీద ఎట్రాక్షన్ తో ఎదురు తిరగలేక "హిహిహి" అంటూ నవ్వేసి మమ్మల్ని కానట్లు మరో వేపుకు చూడసాగాము.

"ఛఛ! స్పాన్సరింగ్ అంటే కూడా తెలీని వాళ్ళీ జంటనగరాల్లో ఉన్నారంటే నాకీ నగరం వదలివెళ్ళిపోబుద్ధి వేస్తోంది. ఏమిటోయ్ ఇది? మీరు న్యూస్ పేపర్లు చదవరా? టీవీ చూడరా?" కోపం అణచుకుంటూ అడిగాడతను.

"చూస్తామండీ! మహాభారత్, హిందీ సీరియల్సు, టీవీలో వచ్చే సినిమాలూ"

"మరవి చూస్తున్నప్పుడు "ఈ కార్యక్రమాన్ని సమర్పిస్తున్న వారు గోద్రెజ్" అన్న వ్యాపార ప్రకటనలు కనిపించలేదూ?'

"కనిపిస్తాయ్"

"అదే స్పాన్సరింగ్ అంటే! మీ ఫారిన్ టూర్ తాలూకు ఖర్చంతా ఎవరితోనయినా స్పాన్సర్ చేయిస్తే- అంటే ఖర్చంతా ఆ స్పాన్సర్సే పెట్టుకుంటారన్నమాట! అంటే మీరు వెళ్ళిన ప్రతిచోటా ఫలానావారి స్పాన్సర్ షిప్ లో మేము ఈ దేశం మీద తిరుగుతున్నాం అని చెప్పుకోవాల్సి వస్తుంది. అంతే"

"కానీ మమ్మల్ని విదేశాలకు పంపించి మా ఖర్చంతా పెట్టుకోడానికి గోద్రెజ్ కంపెనీవాళ్లు వప్పుకుంటారా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

అతను మళ్ళా మమ్మల్ని తినేసేట్లు చూశాడు.

"అబ్బా! మరీ ఇంత అధ్వాన్నపు మనుషులున్నారేమిటయ్యా ఈ కాలనీలో" అన్నాడు, జుట్టు సగం పీకి అవతల పారేస్తూ "గోద్రెజ్ అంటే నిజంగా గోద్రెజ్ వాళ్ళు కాదయ్యా! అలా ఇంకెవరయినా మన జంట నగరాల్లో స్పాన్సర్ చేస్తారేమో ప్రయత్నించాలి! అర్థమయిందా?"

"అయిందయింది?" అన్నాం అందరం ఆనందంగా.

"మరింక ఆ పని ప్రారంభించండి ఇవాళ్టినుంచే- ఎవడి చుట్టూ తిరుగుతారో, ఎవడిని ఎలా వల్లో వేసుకుంటారో తెలీదు. కానీ మీలో ప్రతిఒక్కరూ ఏదోకవ్యాపార సంస్థతో స్పాన్సర్ చేయించుకోవాలి! అంతే!"

అతను వెళ్ళిపోయాక మేమంతా వేదిక దగ్గర గుమికూడాము.

"ఇప్పుడు మనం అసలు స్పాన్సరర్స్ ఎంతమంది మన జంటనగరాల్లో వున్నారో కనుక్కోవాలి! వాళ్ళందరి లిస్టూ తయారుచేసుకుని వాళ్ళను కాకా పట్టాలి!" అన్నాడు జనార్ధన్.

"కానీ ఇలాంటి వాటిని ఎవరు స్పాన్సర్స్ చేస్తారో ఎలా తెలుస్తుంది?"

"ఇన్ ఫర్మేషన్ సంపాదించాలి! మలక్ పేటలో నాకు తెలిసిన ఫ్రెండొకడున్నాడు. శ్రీరామనవమి పండగ టైమ్ లో డ్రామా లేసేవాడు! వాడు ఇలాగే ఎవర్నో పట్టుకుని 'ఈ దశాబ్దపు ఉత్తమ నటుడు' అని బిరుదు తనే తగిలించుకుని అమెరికా వెళ్ళిపోయాడు. పదండి వాడి దగ్గర కెళ్దాం."

అందరం జనార్ధన్ ఫ్రెండ్, దశాబ్దపు ఉత్తమ నటుడూ అయిన "మహేష్ కుమార్" దగ్గరకెళ్ళాం.

అతను ఆఫీస్ రూమ్ లో కూర్చుని ఏదో సీరియస్ గా రాస్తున్నాడు. మమ్మల్ని చూడగానే ఆనందంగా ఆహ్వానించాడు.

"ఏమిటి గురూ రాస్తున్నావ్?" అడిగాడు జనార్ధన్.

"సాంస్కృతిక బృందంతోపాటు, అమెరికా వెళ్ళివచ్చాను కదా! ఆ విశేషాలన్నీ "ఓ అమెరికా! మై తెలుగూ అమెరికా" అనే సీరియల్ రాస్తున్నాను మన వారపత్రికలో" ఆనందంగా అన్నాడతను.

"కానీ రాసింది వేయడానికి మన పత్రికలవాళ్ళు వప్పుకున్నారా?" అడిగాడు జనార్ధన్.

"ఆ పత్రికలో సాంస్కృతిక కరస్పాండెంట్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్! ఇద్దరం చిన్నప్పట్నుంచీ బార్ మేట్స్, అంతేగాకుండా ఇద్దరిది ఒకటే కాంపస్!"

"ఏ యూనివర్శిటీ కాంపస్?" ఆత్రుతగా అడిగాడు శాయిరామ్.

అతను మమ్మల్ని పిచ్చాళ్ళను చూసినట్లు చూశాడు.

"యూనివర్శిటీ కాంపస్ కాదోయ్! కల్లు కాంపౌడ్ కాంపస్! ఒకటి రెండేళ్ళు అందులోనే రోజూ తాగుతూ గడిపాం. వాడికేమీ అక్కర్లేదు. ఫారిన్ విస్కీగానీ బ్రాందీగానీ ఒక బాటిలిస్తే చాలు! వాళ్ళ దినపత్రికలో మన గురించి సంపాదకీయ రాయించేస్తాడు. అందుకని మొత్తం పదహారు బాటిల్స్ కి బేరం కుదిరింది. అందుగ్గాను నేను రాస్తున్న సీరియల్ అంతా అమెరికాలో నేను దిగిన ఫోటోలతో సహా వేసేస్తున్నాడు. ఇవాళ వాడి న్యూస్ పేపర్ చూళ్ళేదా? డిస్నీలాండ్ లో ఎవరూ చూడకుండా నేను యూరినల్స్ కి వెళ్తోన్న ఫోటో వేశాడు" అంటూ లోపలికెళ్ళి దినపత్రిక తెచ్చి మాకిచ్చాడు.

"చాలా బాగుంది" అన్నాం మేము ముక్తకంఠంతో

"మరి మీరేమయినా పనిమీద వచ్చారా?" అడిగాడతను.

"అవును! గురూ!" అంటూ సంగతంతా చెప్పాడు జనార్ధన్.

అతను విరగబడి నవ్వాడు.

"నీయవ్వ! భలే పాగల్ గాళ్ళున్నారు మీరు! ఫలానా స్పాన్సరర్ అంటూ ఎవరూ ఉండరు. వరుసగా అన్ని కంపెనీలకూ వెళ్ళి అందరి కాళ్ళూ పట్టుకోవటమే! వెరీ ఈజీ!"

"ఆ! అంత తేలికా?"

"అవునుగ ఈ సారి మొత్తం ఫామిలీతో నేను అమెరికా వెళ్తున్నాను. మగాళ్ళ అండర్ వేర్స్ కంపెనీవాడు నా భార్యను స్పాన్సర్ చేస్తున్నాడు. బ్రాసియర్స్ కంపెనీవాడు నన్ను స్పాన్సర్ చేస్తున్నాడు. ఫామిలీ ప్లానింగ్ మెటీరియల్ తయారు చేసేవాడు మొత్తం మా ఎనిమిదిమంది పిల్లలనూ స్పాన్సర్ చేస్తున్నాడు. మీరు కూడా వెళ్ళి ఎవడి కాళ్ళయినా సరే పట్టుకోండి. వెరీ ఈజీ! అయిదు నిమిషాల్లో పనయిపోతోంది."

అందరూ లేచి బయటికొచ్చాం.

"ముందు ఎవడి దగ్గర కెళ్దాం?" చౌరస్తా కొచ్చాక అడిగాడు రంగారెడ్డి.

"ఆ! అబిడ్స్ లో జిప్స్ తయారుచేసే కంపెనీ ఒకటుంది. ఆ కంపెనీ ప్రొప్రయిటర్ ఇంటికెళ్దాం పదండి" అన్నాడు గోపాల్రావ్.

అందరం అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళేసరికి చీకటి పడిపోయింది. నౌకరు మమ్మల్ని హాల్లో కూర్చోపెట్టి లోపలికెళ్ళాడు. హాలంతా కలియ చూసేసరికి మా గుండెలు ఝల్లుమన్నాయ్. గోడల మీద వరుసగా తగిలించిన ఫోటోల్లో ఆ ప్రొప్రయిటర్ కాళ్ళమీద వాలిపోయిన జనం, మరికొన్ని ఫోటోల్లో ప్రొప్రైటర్ తాలూకు వట్టి కాళ్ళే కనబడుతున్నయ్. ఆ కాళ్ళ చుట్టూ మూగిన జనం-

"ఆ! ఎవరయ్యా మీరు?" అన్నాడో లావుపాటి ఆకారం బయటికొస్తూ.

"మేము నిర్భయ్ నగర్ కాలనీ వాళ్ళం సార్! అమెరికాలో సాంస్కృతిక ప్రదర్శన లివ్వటానికి వెళుతున్నాం! అందుకని"

"ఓహో అలాగా! సరే" అంటూ ఎత్తుగా ఉన్న ఓ సింహాసనం లాంటి కుర్చీలో కూర్చుని కాళ్ళు మా ముందు పెట్టాడు.

"త్వరగా కానీండి" అన్నాడు చిరునవ్వుతో.

ఆయన మాటలు మాకేమీ అర్థం కాలేదు.

"ఏమిటి సార్ త్వరగా కానించేది?"

"అద్గదీ! అలా చెప్పండి? అందుకే అట్లా దేబి ముఖాల్లాగా కూర్చున్నారు! త్వరగా కాళ్ళ మీద పడండి! అవతల మా నౌకరు ఫోటో తీయటానికి రెడీగా ఉన్నాడు"

మేము మళ్ళీ మొఖాలు చూసుకున్నాం.

"మాకు కాళ్ళమీద పడటాల్లాంటివి అలవాటు లేదండీ! అదీగాక ఆ కాళ్ళమీద పడే కల్చరు అంటే కొంచెం అసహ్యం కూడానూ!"

అతను ఆశ్చర్యపోయాడు.

"ఓర్నీ- భలేగున్నారే! ఇలా కాళ్ళమీద పడడం అసహ్యమయితే ఇంకా మీరు రాజకీయాల్లో గానీ, ఇతరత్రా గానీ పైకెలా వస్తారండీ! మన భారతదేశ చరిత్రంతా చూడండోసారి! కాళ్ళ కల్చర్ పురాణ కాలం నుంచే అమల్లో ఉంది. రోజుకి కనీసం పాతిక జతల కాళ్ళమీద పడితేగానీ చాలా మందికి మనశ్శాంతి ఉండదు. పైగా ఈ కల్చర్ మన తెలుగువాళ్ళలో మరీ ఎక్కువ."

జనార్ధన్ కోపంలో ఉడికిపోసాగాడు.

"ఉహు! వీల్లేదుసార్! మా కాలనీలో చాలామందికి తినడానికి తిండి లేకపోయినా కొంచెం అభిమానం ఎక్కువ. కాళ్ళమీద పడటమా? హా! ఇంపాజిబుల్ సారీ- నెవర్! కాళ్ళమీద ఎప్పటికీ పడం సార్! అడుక్కుతినాల్సిన పరిస్థితి వచ్చినా సరెగ కాళ్ళమీద మాత్రం పడం సార్! హు! నా కొడకా! నీ కాళ్ళమీద పడాల్రా? ఆ సీన్ నువ్వు ఫోటో కట్టించి హాల్లో తగలిస్తావా? బాస్టర్డ్."

ఆ తరువాత ఏం జరిగిందో మాకు తెలీదు గానీ ముందే మేము ఏదో ఉపద్రవం జరగబోతోందని ఊహించి అమాంతం జనార్ధన్ మీద పడి కదలకుండా నొక్కి పట్టేసి బయటకు లాక్కెళ్ళిపోయాం.

అక్కడినుంచీ తిన్నగా బ్లేడ్స్ తయారుచేసే కంపెనీకి చేరుకున్నాం. దాని మేనేజింగ్ డైరెక్టర్ వెంటనే మమ్మల్ని లోపలకు ఆహ్వానించాడు. లోపల అప్పటికే ఆరు సోఫాల్లో జనం నిండిపోయి ఉన్నారు. మమ్మల్ని ఏడో సోఫాల్లో కూర్చోబెట్టారు. అప్పటికే ఓ గిరిజాల వ్యక్తితో మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతున్నాడు.

"నన్ను రాధా ఫిలిమ్స్ ప్రకాశరావు గారు స్పాన్సర్ చేస్తున్నారు సార్! నిన్నే నాలుగువేలు కాష్ కూడా ఇచ్చేశారు. కానీ ఇంతవరకూ మా ఆవిడను స్పాన్సర్ చేసేవారెవరూ దొరకలేద్సార్? దయచేసి మీరు స్పాన్సర్ చేస్తే."

"ఎవరూ మీ ఆవిడ? పిలవండి."

గిరిజాలవ్యక్తి పక్కకు తిరిగాడు.

"ఏయ్! ప్రియాంక! ఇట్రావే! అయ్యగారు నన్ను స్పాన్సర్ చేస్తానంటున్నారు" ఉత్సాహంగా చెప్పాడతను.

ఓ మధ్య వయసు స్త్రీ లేచి వయ్యారంగా మేనేజింగ్ డైరెక్టర్ దగ్గరకు నడిచి నమస్కరించింది.

"నమస్తే" అన్నాడతను ఆమెను పై నుంచి కిందవరకూ చూస్తూ.

"ప్లీజ్! మీరే నన్ను స్పాన్సర్ చేయాలి. మిగతా ఏర్పాట్లన్నీ అయిపోయాయండీ" అందామె దిగులుగా.

"మిగతా ఏర్పాట్లంటే?"

"అదేసార్! నాక్కావలసిన చీరలు భవానీ ఎక్స్ పోర్ట్ క్వాలిటీ శారీహౌస్ వాళ్ళు స్పాన్సర్ చేస్తున్నారు. నా కాస్మటిక్స్ మా ఇంటెదురుగా ఉన్న రాజ్ పాన్, కిల్లీ అండ్ సోడా డబ్బా అతను స్పాన్సర్ చేశారు. నాకు అక్కడ కావలసిన పై ఖర్చులకు యాదగిరి చిట్ ఫండ్స్ కంపెనీ వారు స్పాన్సర్ చేశారు. నా చెప్పులు మార్కెట్లో ఉన్న మంజులతా చెప్పుల దుకాణం వాళ్ళు స్పాన్సర్ చేశారు."

ఎమ్.డి. ఆమె చేయి తన చేతుల్లోకి తీసుకుని నిమిరాడు.

"కావాలంటే మీ చేతిగాజులు నేను స్పాన్సర్ చేస్తాను" అన్నాడు జంకుగా.

"అవి మా ఇంటికొచ్చే గాజుల సాయిబు స్పాన్సర్ చేస్తున్నాడు సార్!"

మేనేజింగ్ డైరెక్టర్ కేం చేయాలో తోచలేదు.

"కానీ మేము ఇప్పటికే ఎనిమిదిమంది పెళ్ళాల్ని, పద్నాలుగురు కూతుళ్ళనూ, పదహారుగురు చెల్లెళ్ళనూ స్పాన్సర్ చేశాం. మా ఫండ్స్ అన్నీ ఖర్చయిపోయాయ్ అంచేత......."

ఆమె అతని చేతిని తన రెండు చేతుల్లోకి తీసుకుంది.

"అలా అనకండీ!" అంది దిగులుగా.

అతను చలించిపోయాడు.

"ఆల్ రైట్! నాకు ఎలాగూ వచ్చేవారం అమెరికాలో పనుంది. అప్పుడు నాతో మిమ్మల్ని స్వయంగా, సపరేట్ గా తీసుకెళ్ళి స్పాన్సర్ చేస్తాను" అన్నాడు గత్యంతరం లేక.

"అయ్యో! మా వారు ఎల్లుండే వెళుతున్నారు కదా! ఆయనతో పాటు నేనూ వెళ్ళాలి కదా!"

ఆమె భర్త ఠక్కున ఆమె నోరు మూసేశాడు.

"అహహ! అదేం ప్రాబ్లెమ్ లేదులెండి. మీరు స్వయంగా వెంబడి తీసుకొచ్చి స్పాన్సర్ చేసి ఆ తరువాత మాకు అప్పజెప్తానంటే అంతకంటే మాక్కావలసిందే ముంది? అలాగే కానీండి సార్."

మాకింక అక్కడ ఉండబుద్ధి కాలేదు.

లేచి బయటకు వచ్చేశాము.

"ఏమిటి? ఎందుకు బయటికొచ్చేశారు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతీదేవి.

"ఇక్కడి పద్ధతులు ఏమీ బాగుండలేదు" అన్నాడు రంగారెడ్డి.

"అవును! స్పాన్సరింగ్ అంటే ఇంకేమిటో అనుకున్నాను" అన్నాడు శాయిరామ్.

"అదేమీ కుదరదు! యింతదూరం వచ్చి అడక్కుండా వెళ్ళటం ఏమిటి? పదండి! అడిగి, కాదంటే వెళ్ళిపోదాం" అందామె చిరుకోపంతో.

మళ్ళీ వెనక్కి తిరిగి లోపలికెళ్ళాం.

మరో అరగంట తర్వాత మాటర్న్ వచ్చింది.

"ఏమిటి సంగతి?" అడిగాడతను.

సంగతంతా చెప్పాడు రంగారెడ్డి.

"ఓ సారీ! మగాళ్ళను స్పాన్సర్ చేయడం మానేశాం! ఎందుకంటే 'మగకోటా' అయిపోయింది. మీ ఆవిడను పంపించండి రేపు! ఓ సారి చూసుకుని మాకు సంతృప్తి కలిగితే అప్పుడు స్పాన్సర్ చేస్తాము."

"అయిడియా బానే ఉంది. కానీ మా ఆవిడ్లెవరూ రావటం లేదండీ"

అతను ఆశ్చర్యపోయాడు.

"అలాగా! మరి ఆ నీలం చీరావిడ ఎవరు?"

"ఆమె పార్వతీదేవండీ! మా కాలనీయే!"

"అయితే ఇంకేం! ఆమెను స్పాన్సర్ చేస్తాను కావాలంటే."

మా అందరి ముఖాలూ వాడిపోయినాయి గానీ పార్వతీదేవి మొఖం చేటంత అయిపోయింది.

"ఆ నిజంగా చేస్తారాండీ?" ఆనందంగా అడిగింది.

"అవునండీ!వచ్చే నెలలో నేను హాంకాంగ్ వెళుతున్నాను. కావాలంటే అక్కడికి స్పాన్సర్ చేస్తాను."

"మరి మిగతావాళ్ళు?"

"వన్ పర్సన్ కల్చురల్ ట్రూప్ కింద మీరొక్కరూ చాలండీ! ఇంకెవ్వరూ అక్కరలేదు!"

"అలాగే - అయితే సరే" మా వంక జాలిగా చూస్తూ అంది పార్వతీదేవి.

మేమందరం బయటకు వస్తోంటే పార్వతీదేవి కూడా రాబోయింది గానీ అతను ఆపేశాడు.

"ఉండండి! ఇవాళ సాయంత్రం మా క్లబ్ లో మీకు భోజనం కూడా నేనే స్పాన్సర్ చేయిస్తాను"

పార్వతీదేవి కొంచెం భయపడింది.

"అలాగాండీ! సరే మా వారిని కూడా తీసుకొస్తాను! ఏ క్లబ్ కి రమ్మంటారు?" గాబరాగా అడిగింది.

"మీవారెందుకండీ అనవసరంగా! ఆయనకెవరు స్పాన్సర్ చేస్తారు భోజనం?"

"నేను చేస్తానులెండి!" నవ్వుతూ అని బయటికి వచ్చేసింది.

ఆ రాత్రి మళ్ళీ కాలనీ సమావేశం జరిగింది.

అందరం ఫారిన్ టూర్ గురించి డిస్కషన్స్ చేసుకున్నాం.

"మనకి ఇలాంటి బేవార్స్ స్పాన్సరింగులు పనికిరావు. కనుక మనం ఈ కార్యక్రమం విరమించుకుందాం" అన్నాడు రంగారెడ్డి.

ఎవ్వరూ మాట్లాడలేదు.

ప్రయాణ సన్నాహాలు ఇంతదూరంవచ్చాక కాన్సిల్ చేసుకోవాలంటే అందరికీ చాలా బాధగా ఉంది.

యాదగిరి అందరిలోకీ ఎక్కువ బాధపడటం చూసి మాకు ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి సంగతి? ఇప్పుడు కాకపోతే ఇంకొకసారి వెళ్తాం! ఎందుకంత శాడ్ ఫీలింగ్?" అడిగాడు శాయిరామ్.

"అదికాదు! మనం అమెరికా వెళ్ళి రావటం తప్పదనుకుని ఓ పత్రికలో డబ్బుకట్టి అమెరికా వెళుతున్న యాదగిరికి మా శుభాకాంక్షలు ఇట్లు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంస్థలు అన్న ప్రకటన వేయించే ఏర్పాట్లు చేసేశాను. అన్నాడు దిగాలుగా.

"నేనూ- ఈ టూర్ ని నమ్ముకుని మా బంధువులందరికీ ఉత్తరాలు రాసేశాను" అన్నాడు శాయిరామ్.

"అయినా మనం విచారించాల్సిన పనిలేదు. మనందరికీ విదేశాలకెళ్ళే అవకాశం మరోటి వుంది!" అన్నాడు రంగారెడ్డి.

శాయిరామ్ మొఖంలోకి హటాత్తుగా కళ వచ్చేసింది.

"ఏమిటి గురూ అది?"

"అవే తెలుగు మహాసభలు! ఈ సంవత్సరం విదేశాలలో జరుగబోయే ప్రపంచ తెలుగు మహాసభలకు మనం గవర్నమెంట్ ఖర్చుమీద వెళ్ళొచ్చు. కొంచెం శ్రమపడినట్లయితే"

శాయిరామ్ మొఖంలో పూర్తి ఆనందం వచ్చేసింది.

"అవును గురూ! ఆ సంగతి మర్చేపోయాను. కానీ గవర్నమెంట్ మనల్ని ఎలా పంపిస్తుందంటావ్? 'క్లూ' లేమయినా ఉన్నాయా?"

"కిందటి ప్రపంచ తెలుగు మహాసభలకు వెళ్ళిన ప్రకాశరావ్ నాకు బెస్ట్ ఫ్రెండ్! వాడినడిగి ఇన్ ఫర్మేషన్ తెస్తాను."

అందరూ తప్పట్లు కొట్టారు.

అప్పుడే టాక్సీ ఒకటి రివ్వున వచ్చి మా ముందు ఆగింది.

శ్యామ్ డోర్ తెరచుకుని దిగాడు.

"ఏంటి బ్రదర్స్! ఏదో మీటింగ్ జరుపుతున్నట్లున్నారే" అడిగాడు చిరునవ్వుతో.

అతనికి మా ఫారిన్ టూర్ విఫలయత్నాల గురించి తెలీటం ఇష్టంలేక" ఏం లేదు ఊరికినే ఏదో ఊసుపోక" అన్నాం.

"అలాగా! సరే అయితే నాకు గుడ్ లక్ చెప్పండి! నేను అమెరికా వెళ్తున్నాను"

అందరం నోళ్ళు వెళ్ళబెట్టేశాం.

ఎవరికీ నోట మాట పెగలటంలేదు.

"అ.. అ.. అమెరికా వెళుతున్నారా?"

"అవునోయ్"

"ఎలా వెళుతున్నావ్? అయ్ మీన్ ఎవరు స్పాన్సర్ చేస్తున్నారు?" ఆత్రుతగా అడిగాడు శాయిరామ్.

"ఒకడు స్పాన్సర్ చేయాల్సిన ఖర్మ నాకేంటోయ్. ఇండో-అమెరికన్ కల్చురల్ ఎక్స్ఛేంజ్ కోటాలో నన్ను సెలక్ట్ చేసుకున్నారు అమెరికా ప్రభుత్వం వాళ్ళు."

మాకు మతిపోయినట్లయింది.

"అమెరికా ప్రభుత్వం వాళ్ళు మిమ్మల్ని ఇన్ వైట్ చేశారా?"

"అవును"

"ఇన్ని కోట్లమంది భారతీయులుండగా మిమ్మల్నే ఎలా పిలిచారు?"

"అదంతా బ్రేడ్ సీక్రెట్!"

అందరం అతని చుట్టూ మూగిపోయాం.

"బాబ్బాబు? ఆ ట్రేడ్ సీక్రెట్ ఏమిటో చెప్పవూ?" శాయిరామ్ అడిగాడు.

"ఇంకెవరికీ చెప్పనని మాట ఇస్తే చెప్తాను"

అందరం పట్టు వేసుకున్నాం.

"మరేం లేదు! ఆ అమెరికన్ కల్చురల్ ఎక్సేంజ్ సెంటర్ లో ఓ రచయిత్రి వుంది. ఆవిడ నవల నా పత్రికలో వేసుకుంటే నన్ను అమెరికా పంపిస్తానంది. అంతే!"

"మరి నీకు పత్రిక ఎక్కడుంది?" అదిరిపడుతూ అడిగాడు జనార్ధన్.

"ఈనెల నుంచే ఓ పత్రిక పెట్టాను. ఎన్నిలే! వెయ్యి కాపీలు అచ్చు వేయించాను. రచయిత్రికి పాతిక్కాపీలు పంపించి మిగతాది చెత్తకాగితాల షాపులో అమ్మించేస్తే సరి! ప్రాబ్లెమ్ తీరిపోతుంది. వస్తా ఫ్లైట్ కి టైమయింది" అంటూ వెళ్ళిపోయాడతను. మేము చాలా సేపటివరకూ సామాజిక కోమాలో ఉండిపోయాం.

* * * * *

## తెలుగు టీవీ వచ్చేసింది

సంక్రాంతి నుంచీ తెలుగు టీవీ ప్రసారాలు రాష్ట్రమంతటా రిలే' అన్న వార్త పేపర్లో కనిపించేసరికి మా కాలనీలో ఎక్కడ లేని హడావుడీ మొదలయింది.

అప్పటికప్పుడే- ఆ రోజు సాయంత్రం కాలనీ మీటింగుందని కాలనీ అంతా ప్రకటనలు చేయటం మొదలు పెట్టాడు శాయిరామ్.

"సంగతేమిటి?" అనడిగాను శాయిరామ్ మా ఇంటికొచ్చినపుడు.

"ఏమిటేమిటి? తెలుగు ప్రోగ్రామ్ తెలుగుదేశమంతటా నిస్తరిల్లుతోంటే మనం మనకేమీ పట్టనట్లు కూర్చుంటామా? మనవంతు కళాపోషణ మనం కూడా చేయాలి!" వస్తా! ఇప్పటికే ఆలస్యమయిపోయింది" అని బయటకు పరుగెత్తాడు.

సాయంత్రం ఏడింటికి కాలనీ వేదిక దగ్గర మీటింగ్ మొదలయిపోయింది. ఆడా, మగా, పిల్లా, పీచూ అంతా చాల ఎగ్జయిటింగ్ గా ఉన్నారు.

"సోదర సోదరీమణులారా! ముక్కు పచ్చలారని ముద్దు బిడ్డలారా! కొంచెం పచ్చబడిన విద్యార్థులారా!" అన్నాడు శాయిరామ్. వెనుకనుంచీ ఎవరో "హ్హాహ్హాహ్హా" అని నవ్వటం వినిపించింది.

"నీకదే వద్దని చెప్పాను! డైరక్ట్ గా సబ్జెక్ట్ లో కొచ్చేసెయ్" అన్నాడు రంగారెడ్డి శాయిరామ్ ని తొందరపెడుతూ.

"త్వరలో తెలుగు టీవీ కార్యక్రమాలు మన రాష్ట్రమంతా విస్తరిస్తున్నాయ్. కనుక ఈ సందర్భంలో హిందీలో వస్తోన్న టీవీ సీరియల్స్ లాగానే తెలుగులో కూడా మంచి స్టాండర్డ్ సీరియల్ ఒకటి వస్తే బావుంటుందన్న ఆలోచన నాకు కలిగింది."

"అబద్ధం! ఆ అయిడియా చెప్పింది నేను" అన్నాడు చంద్రకాత్ ఛటోపాధ్యాయ్ ఓ మూలనుంచీ! శాయిరామ్ గతుక్కుమన్నాడు.

"అవును మర్చిపోయాను. ఆ అయిడియా మా ఇద్దరిదీ! మన కాలనీలో ఉన్న టాలెంట్స్ తో మనమే టీవీ సీరియల్ తీసి తెలుగు ప్రజలకు సమర్పించాలని మిగతా చాలామంది సభ్యులు కూడా కోరటం వల్ల- ఈ సమావేశం ఏర్పాటు చేశాము."

"అవునూ? తీద్దాం! తీద్దాం!" అని అరిచారు పిల్లలు చాలామంది ఉత్సాహంగా.

"ఈ విషయంలో పరిజ్ఞానం ఉన్నవాళ్ళు తమ తమ విలువలయిన సలహాలు అందజేస్తారని ఆశిస్తున్నాం" అని అన్నాడో లేదో అందరూ వేదికమీదకు ఎగబడ్డారు. మా కమిటీ సభ్యులు అరడజను మంది తప్ప.

అతి కష్టం మీద వాళ్ళందరినీ కంట్రోల్ చేసి వెనక్కు పంపించి వేశాము.

రంగారెడ్డి మైకు అందుకున్నాడు.

"నన్నడిగితే పెద్దాళ్ళ వినోదం కోసం సినిమాలతో సహా ఎన్నో రకాల అనేక సాధనాలున్నాయ్. పిల్లలకు మాత్రం ఎలాంటి సౌకర్యాలూ మనం సమకూర్చలేక పోతున్నాం. గనుక మనం పిల్లల టీవీ సీరియల్ తీద్దాం".

అతని మాట పూర్తయిందో లేదో పిల్లలంతా పెద్ద ఎత్తున అరుపులు కేకలు వేయసాగారు.

"మాకు పిల్లల సీరియల్ వద్దూ! మాకొద్దూ! పిల్లల ద్రోహి రంగారెడ్డి డౌన్ డౌన్! మాకు పెద్దోళ్ళ సీరియల్సే కావాలి 'ఏ' సర్టిఫికెట్ సీరియల్సే కావాలీ..."

నేనూ, గోపాల్రావ్, యాదగిరీ వెళ్ళి వాళ్ళందరినీ పిల్లల సినిమా గానీ, టీవీ సీరియల్ గానీ ఎట్టి పరిస్థితుల్లోనూ తీయమని ప్రామిసే చేసి సమాధాన పర్చాక గొడవ సద్దుమణిగింది.

"పోనీ మనం డిటెక్టివ్ సీరియల్స్ తీద్దాం! కథ రడీగా ఉంది" అంది రచయిత్రి రాజేశ్వరి.

"మన దేశంలో డిటెక్టివ్ సీరియల్స్ ఏమిటి నా తలకాయ్! మనదేశమంతా వెతికినా ప్రైవేట్ డిటెక్టివ్ లు ఒకరిద్దరు కంటే ఎక్కువమందిలేరు-" అన్నాడు గోపాల్రావ్ అడ్డుచెప్తూ.

"అదే వెరయిటీ అంటే! నేను రాయబోయే డిటెక్టివ్ నవల "చీకట్లో శవం" అయితే టీవీ సీరియల్ కి చాలా బ్రహ్మాండంగా ఉంటుంది. అందులో హీరో అర్ధరాత్రి లైట్ స్విచ్ వేసేసరికి కరెంటు ఉండదు. చీకట్లో తడుముకుంటూ రెండడుగులు వేసేసరికి..."

"కాళ్ళకు చల్లగా తగులుతుంది. శవం! అదే చీకట్లో శవం!" అంటూ ఓ స్టూడెంట్ అరచాడు.

"ఇలా ముందే మీరు కథ చెప్పేస్తే నేను దిగిపోతాను-" అందామె కోపంగా.

"దిగమనేగా మేమూ అడిగేది?"

ఆమె కోపంగా దిగివెళ్ళి పార్వతీదేవి పక్కన కూర్చుంది. చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మైకు దగ్గరకొచ్చాడు.

"నన్నడిగితే ఫామిలీ సెంటిమెంట్ సీరియల్ అయితే బాగుంటుంది. నేను ఒక స్టోరీ ఇప్పటికిప్పుడే ఆలోచించాను. హీరో జమీందారు. అతను ఒకామెను మోసం చేసి వదిలేశాడు. ఆమెకు పుట్టిన అమ్మాయిని తనే లాగేసుకుంటాడు. తరువాత ఆ అమ్మాయికా విషయం తెలిసి తల్లిదగ్గర కెళ్తుంది. అక్కడినుంచీ యమ డ్రామా-"

"హో!" అని అరిచారు స్టూడెంట్స్ "అది ఇప్పుడు వస్తోన్న హిందీ సీరియల్ కథ..."

చంద్రకాంత్ పక్కకు తప్పుకున్నాడు గొణుక్కుంటూ "హిందీ సీరియల్ అయితే వీళ్ళ సొమ్మేంపోయిందో?"

"సోదర సోదరీమణులారా? కామెడీ సీరియల్ మాత్రమే తీయాలని నా కోరిక. మనం కష్టాలను మర్చిపోయి హాయిగా నవ్వుకోవాలంటే హాస్యం సీరియల్స్ ఉంటేనే బావుంటుంది!" అన్నాడు వెంకట్రావ్.

"అవునవును- కామెడీ సీరియల్ కావాలి?" అరచాడు వివిన్ పాల్.

వెంకట్రావ్ కి ఉత్సాహం పుట్టుకొచ్చింది.

"మొన్న అదేదో సినిమాలో కూడా చూశాను. హీరోయిన్ పడుపు వృత్తి చేస్తుందన్నమాట! మంచం క్రింద ఒక ప్రియుడిని దాక్కోబెట్టి ఇంకో ప్రియుడితో సరసాలు చేస్తూంటుంది. ఈలోగా ఇంకో ప్రియుడొస్తాడు. ఈలోగా హీరోయిన్ గుడ్డి తండ్రివస్తాడు. ప్రియులతో ఆమె సరసాలాడుతూ ఉంటుంది గానీ గుడ్డి తండ్రికి తెలీదు. ఏమిటా శబ్దాలు అనడిగితే పిల్లో కుక్కో వచ్చిందని చెప్తుంది. అబ్బ! కడుపుబ్బిపోయింది నవ్వి నవ్వి, కామెడీ అంటే అదీ"

అన్నాడతను నవ్వాపుకుంటూ. ఒక్కరు కూడా నవ్వకపోగా సీరియస్ గా అందరూ తనవంకే చూస్తూండటం గమనించి ఛటుక్కున స్టేజ్ దిగి జనంలో కలసిపోయాడు వెంకట్రావ్.

చివరకు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, రాజేశ్వరి, పార్వతీదేవి, గోపాల్రావ్ లతో ఓ కమిటీని వేయటం జరిగింది. వాళ్లు నలుగురూ కలసి టీవీ సీరియల్ కోసం స్క్రిప్ట్ తయారుచేయాలి.

ఆ స్క్రిప్ట్ ని టీవీ అధికారులకు సబ్మిట్ చేయటం, వాళ్ళ ఆమోదం పొందటం - ఆ కార్యక్రమమంతా నేనూ రంగారెడ్డి, యాదగిరీ, జనార్ధన్ జరిపించాలి!

"ఇంకో సంగతి! ఆ టీవీ సీరియల్ షూటింగంతా మన కాలనీలోనే జరగాలి. మన కాలనీవాళ్ళే అందులో నటించాలి! బయటివాళ్ళకు ఛాన్సివ్వటానికి వీల్లేదు" అన్నాడు జనార్ధన్ కండిషన్ పెడుతూ.

దానర్థం జనార్ధనే హీరో అని మాకు తెలిసిపోయింది. ఆదిలోనే హంసపాదు ఎందుకని అప్పటికా టాపిక్ వదిలేశాం.

వారం రోజుల్లో మేము చాలా పని చేసేశాం. అందరం కలసి టీవీ ఆఫీస్ కెళ్ళి సీరియల్ తీసేందుకు అవసరమయిన గైడ్ లైన్స్ తీసుకుని చూశాము.

దాని ప్రకారం 13 వారాల సీరియల్ వాళ్ళకు ఇవ్వాలి.

ఆ సంగతి తెలుస్తూనే చంద్రకాంత్ చిరాకు పడిపోయాడు.

"కానీ మేము తీసుకున్న సబ్జెక్ట్ ప్రకారం- కథ వారానికి ఇరవై రెండు నిమిషాలు చొప్పున ఎనిమిది వారాల కంటే ఎక్కువ రాదు. ఎలా ఇప్పుడు?" అన్నాడు అయోమయంగా టీవీ అధికారితో.

"ఏమో! ఎలాగోలా 13 వారాలు రావాలి ఆ సీరియల్!"

"అసలీ! 13 వారాలేమిటి? 10 వారాల సీరియల్ గానీ 6 వారాల సీరియల్ గాని మూడు వారాల సీరియల్ గానీ ఎందుకుండకూడదు?" కోపంగా అడిగాడతను.

"అలా ఎందుకు రూల్ పెట్టారో ఆఖరికి గవర్నమెంట్ క్కూడా తెలీదు. అయినా అది మనకనవసరం! కథ ఒక వారంకే సరిపోయినా దానిని మనం 13 వారాలకు సాగదీయాలి, ఒకవేళ ఇది చాలా బాగుంది గనుక ఇంకొంచెం పెంచవచ్చునని మేము అనుమతి ఇస్తే- దానిని మరో పదమూడు వారాలు సాగదీయాలి. ఇంకా బాగుందనిపిస్తే ఇంకో ఇరవై ఆరువారాలు సాగదీయాలి!"

"అలా చిన్న కథలో అడ్డమయిన చెత్తా నింపి సాగదీస్తే ఎవరు చూస్తారండీ?" ఆశ్చర్యంగా అన్నాడు రంగారెడ్డి.

టీవీ అధికారి మమ్మల్నందరినీ చూసి నవ్వుకున్నాడు.

"ఎవరేమిటండీ! జనం ! ఎవడికోసం చూడరు? వాళ్ళు ఫ్రీగా చూస్తోంది కాకుండా వాళ్ళ టేస్ట్ కి తగ్గట్టుకూడా సీరియల్ వుండాలంటే ఎవడిస్తాడు? అయినా జనం సంగతి మీకెందుకయ్యా! మీ పని మీరు చూసుకోండి. ప్రతోడూ జనాన్ని ఉద్ధరిస్తామని బయల్దేరేవాడే!" అంటూ గొణిగాడతను.

అందరం బయటికొచ్చాము. మేము "నిర్భయ్ నగర్ ప్రొడక్షన్స్" అని ఓ బానర్ రిజిస్ట్రేషన్ చేసే లోపల చంద్రకాంత్ వాళ్ళు స్క్రిప్టు రాయటం రడీ చేసేశామన్నారు.

"కానీ అందులో హాస్య సంఘటనలన్నీ ఇంతకు ముందు ఏదో వారపత్రికలో ఎవరో రచయిత రాశాడు గదా!" అడిగాడు రంగారెడ్డి.

చంద్రకాంత్ కి కోపం వచ్చింది.

"ఈ రోజుల్లో ఆ మాత్రం కాపీ కొట్టకుండా ఎలా రాయటం? అర్జంటుగా అన్నీ ఊహించి రాయాలంటే మనమేం వాల్మీకులామా, వ్యాస మహర్షులమా? ఇలా మాట్లాడితే ప్రతోడూ కాపీ అంటే నేనసలు రాయను! ఆ!" అన్నాడు లేచి నిలబడి.

అందరం కలసి బ్రతిమాలి మళ్ళీ కూర్చోబెట్టాము.

"అయినా అది పూర్తి కాపీ కాదులెండి. మధ్యలో డిటెక్టివ్ కథయిపోతుంది. ఒరిజినల్ రచయిత ఛస్తే కనుక్కోలేడు" అంది రాజేశ్వరి.

కథ విని మాకు తోచిన మార్పులు చేసుకుని దానిని టీవీ అధికారుల దగ్గరకు తీసుకెళ్ళాం.

"మా కమిటి వాళ్ళందరం పరిశీలించి మీకు తెలియజేస్తాం లెండి! అన్నాడా అధికారి. అందరం ఆనందంగా ఇంటికొచ్చాం!"

"మరి ఈ సీరియల్ కి టెక్నికల్ టీమ్ ఎవరు?" అడిగాడు శాయిరామ్.

"కెమెరా మాత్రం నేనే" అంటూ ముందుకొచ్చాడు- పెళ్ళిళ్ళు షూటింగ్ చేసే కెమెరామెన్ కుమార్.

"ఓ.కే- నీ ఛార్జీ ఎంత?"

"పదివేల రూపాయలు ఇవ్వాలండీ!" అన్నాడు కుమార్ కాసేపు లెఖ్ఖలు వేసి.

"నూట అరవై రూపాయలిస్తాం!" అన్నాడు రంగారెడ్డి. "వేరే ఒకతను నూట ఎనభైకి వస్తానన్నాడు. నువ్వేదో మనవాడివని నీ దగ్గరకొచ్చాం!" అంటూ గాస్ కొట్టాడు.

కుమార్ అరగంటసేపు బ్రతిమాలాడు. ఇంకో పాతిక రూపాయలు పెంచమని! మేము ససేమిరా వప్పుకోలేదు. మాది అసలే లోబడ్జెట్ సీరియల్ అని చెప్పాము.

చివరకు ఒప్పందం కుదిరింది. టీవీ ఫిలిమ్ లో తనక్కూడా ఓ వేషం ఇవ్వడానికి ఒప్పుకున్నాం! పాతికరూపాయలు అడ్వాన్స్ ఇచ్చి ఇంటికి తిరిగివచ్చాము. అప్పటికే మా వీడియో ఫిలిమ్ డైరెక్షన్ చేయటానికని బోస్ బాబు మద్రాస్ నుంచి వచ్చేశాడు.

"నీకెవరు చెప్పారు- మేము టీవీ సీరియల్ తీస్తున్నట్లు?" ఆశ్చర్యంగా అడిగాన్నేను.

"పేపరులో గోపాల్రావ్ రాసిన న్యూస్ చూసి వచ్చేశాను. నిజానికి నేను మద్రాస్ లో చాలా బిజీగా ఉన్నారు. ఆరు పిక్చర్స్ కి డైరెక్షన్ చేయమని ప్రాణం తీస్తున్నారు. కానీ వప్పుకోలేదు. మనాళ్ళ సీరియల్ చేయటంలో ఉన్న ఆనందం అందులో లేదు కదా! ఇంతకూ కెమెరా యూనిట్ ఎవరిది?" అడిగాడతను.

"కుమార్ ఫోటోగ్రాఫర్స్ లేదూ? వాడే కెమెరామన్! పాపం- మొత్తం సీరియల్ నూట అరవై రూపాయలకు చేయటానికి వప్పుకున్నాడు.

"కుమార్ కెమెరామెన్నా? మీకేం మతిపోలేదు కదా!"

"ఎందుకని? మొన్న పెళ్ళిలో బాగానే చేశాడుగా-"

బోస్ రెండు చేతులతో తలపట్టు క్కూర్చున్నాడు.

ఆ కెమెరా పనికిరాదయ్యా బాబు. టీవీ సీరియల్ కెమెరా వేరు. ఆ కెమెరామెన్ ఇు వేరు! "యుమాటిక్ కెమెరా" అంటారు దాన్ని- అలాగే దాని కాసెట్స్ కూడా వేరు!"

అందరం తెల్లమొఖం వేశాం.

యాదగిరి లివ్వున బయటకు పరుగెత్తి రెండు నిమిషాల్లో రొప్పుకుంటూ తిరిగి వచ్చేశాడు.

"అయిదు రూపాయలు ఖర్చయి పోయిందంటుండు! మిగతా ఇరవై రూపాయలు లాక్కొచ్చేసినా- ఆ కుమార్ దగ్గర్నుంచీ!" అన్నాడు ఆనందంగా.

అందరం కలిసి "యుమాటిక్" కెమెరాల కోసం అర్జంటుగా వేట మొదలుపెట్టాం! హైద్రాబాద్ లో రెండే రెండు యూనిట్లున్నాయని తెలిసేసరికి సగం ఉత్సాహం తగ్గిపోయింది. మిగతా సగం ఆ యూనిట్ కి గాను మేమివ్వాల్సిన మొత్తం సంగతి వినేసరికి పోయింది. ఎలాగయితేనేం అంతా సెటిల్ చేసేసుకున్నాం! ఇంక షూటింగ్ స్టార్టవటమే తరువాయ్. అప్పుడు వచ్చింది టీవీ స్టేషన్ నుంచి ఉత్తరం.

మా స్క్రిప్ట్ ని వాళ్ళు ఉపయోగించుకోవటం సాధ్యం కాదట! అంత మాత్రాన మా స్క్రిప్టు ఏ రకంగానూ బాగోలేదని అనుకోనవసరం లేదని మరో వాక్యం.

మా కాలనీలో దాని అర్థం సరిగ్గా తెలీటం లేదు. అందరం టీవీ స్టేషన్ కెళ్ళాం!

స్క్రిప్ట్ బాగానే ఉందిగాని మేము ఉపయోగించుకోలేకపోతున్నాం" అంటే ఏమిటి? అనడిగాడు రంగారెడ్డి. ఆ అధికారి చిరాగ్గా చూశాడు మా వేపు.

"అందులో మా పాలసీకి సరిపడని కొన్ని అంశాలున్నాయ్ అన్నమాట."

"మీ పాలసీ ఏమిటసలు?"

"ఆ అధికారి కొద్దిక్షణాలు ఆలోచించాడు. తరువాత ఫోనులో ఎవరినో పిలిచి పాలసీ గురించి అడిగాడు. ఆ తరువాత మరికొన్ని ఫోన్లు మోగాయ్.

"ఇప్పుడే చెప్తానుగ ఒక్క నిమిషం!" అంటూ బయటికెళ్ళి అరగంట తర్వాత తిరిగి వచ్చాడు.

"పాలసీ ఏమిటో ఎవరికీ కరెక్టుగా తెలీదండీ! మాకేది నచ్చితే అదే పాలసీ అని మా కాషియర్ అంటున్నాడు. అయినా అది మీకు చెప్పనవసరం లేదని మా ఢిల్లీ అధికారులు అన్నారు."అందరం మొఖాలు చూచుకున్నాం.

"పోనీ మా స్క్రిప్టులో మీ పాలసీకి అడ్డు తగిలిన అంశం ఏమిటో చెప్తారా? ఎందుకంటే భవిష్యత్తులో మీ పాలసీ, మా రచయిత పాలసీ 'క్లాష్' అవకుండా జాగ్రత్త పడతాం!" అన్నాడు రంగారెడ్డి.

"కథలో ఒక మినిస్టర్ పాత్ర ఉందయ్యా! మినిస్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన అవినీతి భాగోతాలే కాకుండా వాళ్ళ ప్రస్తావన కూడా రాకూడదు మా సీరియల్స్ లో!

చంద్రకాంత్ కోపంగా నిలబడ్డాడు.

"డెమొక్రసీలో ఇలాంటివన్నీ ఎలా కుదురుతాయ్?" కోపంగా అన్నాడతను.

"అంటే వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు అందరి గురించీ ఇష్టమొచ్చినట్లు రాసుకోవచ్చు! అంతేనాండీ?"

"ఎగ్జాట్ లీ- మనది డెమొక్రసీ నాయినా! వ్యక్తి స్వాతంత్ర్యం సంపూర్ణంగా వుంది మనకు! రాజకీయ నాయకుల జోలికి పోనంతవరకూ-"

"అంటే ఆ మినిష్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కౌన్సిలర్లూ- వీళ్ళందరూ మనుషులు కారా సార్? వాళ్ళకు నీతి, అవినీతి, లంచాలూ, మోసాలూ, మంచీ, చెడూ ఇవేమీ ఉండవా? వాళ్ళకూ పెళ్ళిళ్ళూ, ప్రియురాళ్ళూ, సెకండ్ సెటప్ లూ, భార్యా బిడ్డలూ, బంధువులూ ఉండరా సార్?" కోపంగా అడిగాడు చంద్రకాంత్.

అందరం అతని నోరు మూసేసి బయటకు లాక్కెళ్ళాం!

"నీకేం పోయేకాలమొచ్చిందిరా అలా ఇష్టమొచ్చినట్లు మాట్లాడతావ్? మనదేశంలో ఉన్నది ఇండియా మార్క్ ప్రజాస్వామ్యమని మర్చిపోతే ఎలా? అన్నీ ఇష్టం వచ్చినట్లు చేస్తే లోపలకు తోసేస్తారు. పోలీస్ స్టేషన్ మన కాలనీలో పెట్టిన కొత్తలో అనుభవించిన అనుభవాలు మర్చిపోయావా?" అంటూ కేకలేసేసరికి వాడు స్పృహలో కొచ్చాడు.

అందరం లోపలకెళ్ళి ఆ అధికారిని క్షమార్పణ కోరాం.

"వాడిని క్షమించండి సార్! మనదేశం మార్కు డెమొక్రసీ అంటే బొత్తిగా తెలిచ్చావదు వాడికి! ఇప్పుడేం చేయమంటారు మరి?"

ఆ అధికారి మళ్ళీ ఓ క్షణం ఆలోచించాడు.

"మార్చేయండి! స్క్రిప్టులో ఎక్కడా మంత్రి అనిగానీ, ఎంపీ అనిగానీ, ఎమ్మెల్యే అనిగానీ అసెంబ్లీ గురించి గానీ, కౌన్సిల్ గురించి గానీ, ఒక్క ముక్క కూడా రాయకూడదు, కనబడగూడదు! ఒకవేళ రాసినా గానీ వాళ్ళంతా దేవతలు, త్యాగమూర్తులు, నీతిపరులు అని మాత్రమే రాయాలి.

"మరి జాతీయ కార్యక్రమాల్లో "నుక్కడ్" సీరియల్లో ఎలక్షన్ల గురించి "ఎపిసోడ్" మొత్తం ఉందికదా్సార్?"

ఆ అధికారికి వళ్ళు మండిపోయింది.

"ఏం ప్రశ్నయ్యా ఇది? చూస్తే ఎడ్యుకేటెడ్ లాగున్నారందరూ మళ్ళీ! ఆ? డెమొక్రసీ అన్నాక రకరకాలుంటుందయ్యా! అమెరికా డెమొక్రసీ వేరు, మనదేశంలో డెమొక్రసీ వేరు! అవునాఅగ అలాగే మన కేంద్రంలో ఉండే డెమొక్రసీ వేరు మన రాష్ట్రాల్లో వుండే డెమొక్రసీ వేరు! ఇదే మనదేశంలో వచ్చిన చావు! ప్రతోడూ పెద్ద తెలిసినట్లు డెమొక్రసీ గురించి మాట్లాడతాడు! అయినా టీవీ ఎవడిదయ్యా? మీ బాబుగాడి సొత్తా? ప్రభుత్వం చెమటోడ్చి కేవలం తమ పబ్లిసిటీ కోసం ఏర్పాటు చేసుకున్న ఆస్తయ్యా! అంచేత ప్రభుత్వం గురించి చెడు కనబడగూడదు, వినబడగూడదు! అర్ధమయిందా?"

"అయిందండీ!"

"అయితే వెళ్ళి కథ మార్చుకురండి! ఫరెగ్జాంపుల్ ఒక మినిష్టరు గారు. పాపం ఆయన జీవితమంతా బలహీన వర్గాల ప్రజల కోసం త్యాగాలు చేసి చేసి చివరకు తనే బలహీనపడి- బలం లేక చనిపోయాడు! అలా రాయ్! అప్పుడు చూద్దాం!"

అందరం బయటకొచ్చి చంద్రకాంత్ ని చీవాట్లు వేశాం!

ఇంకెప్పుడూ అలాంటి చెత్త స్క్రిప్ట్ రాయవద్దని!

వారం రోజుల్లో మనదేశంలో అందులోనూ మన రాష్ట్రంలో ఉన్న డెమొక్రసీని దృష్టిలో ఉంచుకుని ఇంకో సీరియల్ తయారుచేశాడు చంద్రకాంత్.

అది ఇచ్చిన పదిహేను రోజుల్లో ఉత్తరం వచ్చేసింది మళ్ళీ! దానర్థం ఏమిటంటే- అయ్యా! మీ స్క్రిప్టుని మేము ఉపయోగించుకోలేక పోతున్నందుకు చింతిస్తున్నాం! అంతమాత్రాన అందులో మెరిట్ లేదని అనవసరంగా గాభరా పడకండి!"

మాకు కోపం ఆగలేదు.

ఈ స్క్రిప్ట్ లో ఎక్కడ 'రాజకీయం' అని రాయాల్సి వచ్చింది. అందుకని దానిని కొంచెంగా మార్చి 'విదేశాలలో ఎన్నికలు' అని మార్చాము.

అందరం మళ్ళీ స్టూడియో మీదకు దాడిచేశాం.

"ఈ సారి ఏమిటండీ కారణం?" అనడిగాం.

"మా పాలసీకి కొంచెం అడ్డు వస్తోంది మళ్ళీ-" అన్నాడతను.

"ఏమిటి మీ పాలసీ?" అతను కోపంగా చూశాడు.

"ఎన్నిసార్లడుగుతారయ్యా ఈ ప్రశ్న! మాకు తెలీదని చెప్తూంటే జ్ఞానం లేదూ? మా పాలసీ ఏమిటో మాకు తెలిసేదుస్తే గైడ్ లైన్స్ లో స్క్రిప్ట్ లో ఏమేం ఉండాలో, ఏమేం ఉండకూడదో ముందే అఘోరించే వాళ్ళంగా!"

"అయితేమరి-" తగ్గిపోయి బ్రతిమాలే ధోరణికొచ్చేశాము.

అతను మా స్క్రిప్ట్ తెప్పించి చూశాడు.

"ఇదేమిటయ్యా! ఈ పాత్ర మొదటినుంచీ చివరివరకూ 'మతం' గురించి మాట్లాడుతోంది. డెమొక్రసీలో 'మతం' గురించి ఎవరయినా మాట్లాడతారటయ్యా! ఆ  మాత్రం జ్ఞానం లేదూ మీకు? చూస్తే అంతా ఎడ్యుకేటెడ్ లాగున్నారు మళ్ళీ!"

"అదేమిటిసార్! మనది ఎక్యులర్ స్టేట్ కదా! ఎవరి మతం గురించి వాళ్ళు మాట్లాడుకోవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు కదా!"

"అబ్బా! డెమొక్రసీ వేరు- సెక్యులరిజం వేరయ్యా!" అంటూ రెండు చేతుల్తో తల పట్టుకుని కళ్ళు మూసుకున్నాడు కాసేపు కోపంగా.

"కాని మరి మీరే టీవీలో ఎక్కడే మతం వాళ్ళ పండగ జరిగినా ఆ పండగ గురించీ, మతం గురించీ తెగ చూపిస్తున్నారు కదండీ' మన ప్రధానమంత్రి గారూ, ప్రెసిడెంట్ గారూ కూడా మతం వేడుకల్లో పాల్గొంటూ ఉంటారు!

ఆ అధికారికి ఇంక కోపం ఆగలేదు.

"మతం అనేది గవర్నమెంట్ కి సంబంధించిందయ్యా! మీకనవసరం తెల్సిందా? ఛఛఛ! ఇంతమాత్రం కూడా తెలీనివాళ్ళున్నారంటే ఆశ్చర్యంగా ఉంది మన దేశంలో"

"మరిప్పుడేం చేయమంటారండీ మమ్మల్ని?"

"ఈ స్క్రిప్ట్ అవతల పారెయ్యండి! వీలయితే కాల్చేసేయండి. లేకపోతే మత కలహాలు జరిగిపోతాయ్! కొత్త స్క్రిప్ట్ రాయండి! మతం, రాజకీయం అనేవి కనబడకూడదందులో! అర్థమయిందా?"

అందరం కాలనీకి తిరిగి వచ్చాం!

రాగానే మళ్ళీ చంద్రకాంత్ మీద విరుచుకుపడ్డాం.

'ఇదిగో చంద్రకాంత్! ఇది నీకు లాస్ట్ వార్నింగ్! ఈసారి స్క్రిప్ట్ రిజెక్ట్ అయ్యిందంటే చూస్కో మళ్ళీ-" అన్నాడు రంగారెడ్డి మండిపడుతూ.

"లేకపోతే ఏమిటోయ్? మనది డెమొక్రసీ అన్న విషయం తెలిసి కూడా ఏమిటా తలపొగరు నీకు? నీ భావస్వాతంత్ర్యం వెళ్ళగక్కాలంటే అమెరికా వెళ్ళు! అంతేగానీ ఇలా టీవీ స్క్రిప్ట్ మీద అఘోరించకు!" అన్నాడు గోపాల్రావ్.

వారం రోజుల్లో ఇంకో స్క్రిప్ట్ తయారయింది. అది సబ్మిట్ చేసి ఫలితాల కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాం-

సరిగ్గా నెలరోజుల తర్వాత వచ్చింది ఉత్తరం-

ప్రియమయిన అయ్యా!

నెలరోజుల క్రితం మీరిచ్చిన "సమాజానికి మరోముడి" అనే స్క్రిప్ట్ ని పరిశీలించాము.

కానీ అది వాణిజ్య సీరియల్ గా మా అవసరాలకు అనుగుణంగా లేదు. ఏదేమయినా ఇది మీ స్క్రిప్ట్ యొక్క గొప్పతనాన్ని ఏ విధంగానూ కించపరచటం కాదు.

మా సేవలో మీరు ఇంత ఆసక్తి కనబరుస్తున్నందుకు మీకు మా అభినందనలు.

మీ విశ్వాసనీయమయిన
స్టేషన్ డైరెక్టర్

అందరికీ వళ్ళు మండిపోయింది.

"మళ్ళీ ఏ మొచ్చింది వీళ్ళకు? మతం, రాజకీయం, ఎన్నికలు అనేవి ఎక్కడా ఒక్కచోట కూడా రాకుండా స్క్రిప్ట్ తయారుచేశాను కదా?" కోపంగా అన్నాడు చంద్రకాంత్.

అందరం మళ్ళీ టీవీ స్టేషన్ కెళ్ళాం.

"ఈ సారి మీ పాలసీకి ఎక్కడ అడ్డుపడింది సార్ మా స్క్రిప్ట్?" అడిగాడు చంద్రకాంత్.

ఆయన స్క్రిప్ట్ తెప్పించి ఓసారి చూశాడు.

"మీకేమయినా తెలివుందటయ్యా? కనీసం ఒక్కరికయినా తెలివి లేదా? కాలనీలో ఇంతమందున్నారు మళ్ళీ- మొత్తం సీరియల్ అంతా బార్స్ లోనూ, రెస్టారెంట్స్ లోనూ జరిగినట్లు చూపిస్తారా?"

"బార్ లో జరిగినట్లు చూపిస్తే తప్పేమిటండీ? హీరో తాగుబోతు కాబట్టి కథ ఎక్కువగా బార్ లోనే జరుగుతుంది-"

"అందుకే తెలివి లేనివాళ్ళన్నాను మిమ్మల్ని! టీవీలో బార్ లు, కాబరేలు లాంటివి చూపించగూడదన్న ఇంగితం లేపోతే ఎలా? బార్ లనేవి కనిపించకూడదు, వినిపించకూడదు-"

"అదేమిటిసార్? బార్ లనేవి చూపించకుండా తాగుబోతు కథెలా చెప్తాం? అయినా బార్ లు నిజ జీవితంలో ప్రతిరోడ్డుకీ అరడజనుంటున్నాయ్ కదా! అవి చాలక ప్రతి పేటకూ ఓ ప్రభుత్వ కల్లు కాంపౌండ్, సారా దుకాణాల్లాంటివి ప్రభుత్వమే ప్రారంభిస్తోంది కదా! ఈ మధ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాల పాకెట్లలాగా కల్లు, సారా లాంటివి పాలిథిన్ బాగ్స్ లో "వారుణ వాహిని" అనే స్కీమ్ లో సప్లయ్ చేస్తోంటే 'బార్' అనేది టీవీలో కనిపించకూడదా? అంటే దేశంలో జరిగే నిజాలన్నీ దాచేసి పతివ్రతల్లో కలసిపోయిన వ్యభిచారిణి లాంటి సీక్రెట్ ప్రోగ్రాంలు మాత్రమే అంగీకరిస్తారా?" ఆవేశంగా అరిచాడు చంద్రకాంత్.

రంగారెడ్డి, యాదగిరీ, చంద్రకాంత్ ని బలవంతంగా బయటకు లాక్కుపోయారు.

"నన్నొదలండి- నీ యవ్వ- ఈ టీవీ స్టేషన్ పని చెప్తాను- వదలండి-" అంటూ గింజుకుంటున్నాడు చంద్రకాంత్.

గోపాల్రావ్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"అతని సంగతి పట్టించుకోకండి సార్! పైకలా అరుస్తాడు గానీ నిజానికి టీవీ ప్రోగ్రామ్ లంటే చచ్చేంత భయం! ఛస్తే మీమీద ఎటాక్ చేయలేడు. రాసిస్తానలా అని-" అన్నాడు ఆ అధికారికి నచ్చచెప్తూ.

"ఆ సంగతి మాకూ తెలుసులేవయ్యా! అందుకే ఎవరైనా గానీ మా హైద్రాబాద్ టీవీ స్టేషన్ లోనే పని చేయాలని మా డిపార్టుమెంట్ వాళ్ళు మొత్తం ఉవ్విళ్ళూరు తుంటారు- ఇది సేఫెస్ట్ ప్లేస్ అని!"

"అవున్సార్ నాకు తెలీకడుగుతాను- ఆ మధ్య మీ టీవీ వాళ్ళే "చల్ చల్ గుర్రం" అనే నాటకం ఒకటి తెలుగువాళ్ళ గొప్ప పండుగ నాడు టెలికాస్ట్ చేశారు కదా! మరందులో తాగే సీన్ ఉంది కదా!" అన్నాడు శాయిరామ్.

"అంతేకదాస్సర్- మరో నాటకంలో కూడా 'బార్' సీన్ చూపించారు. మన హైద్రాబాద్ టీవీ వాళ్ళు-" అంది రాజేశ్వరి.

"హైదరాబాదేం ఖర్మ? హిందీ సీరియల్స్ లో రెండు మూడుసార్లు క్లబ్ లో తాగే సీన్లు చూపించారు-" అంది పార్వతీదేవి.

"నుక్కడ్ లో కూడా తాగుడు సీన్లు చూపించారు" అరచాడు చంద్రకాంత్ బయటనుంచే- అధికారికి కోపం ముంచుకొచ్చింది.

"నేషనల్ లెవెల్లో తాగొచ్చయ్యా! రీజినల్ లెవల్లో తాగకూడదని మా గైడ్ లైన్స్ లో ఉంది- అయినా అవన్నీ ఎవరు చూడొచ్చారు- ఇదిగో! మమ్మల్ని ప్రశ్నలేసే అధికారం - పత్రికల వాళ్ళకే లేదయ్యా మీరెవరు మమ్మల్ని అడగటానికి? ఇంకోసారిలా మెలిక ప్రశ్న లేశారంటే సెక్యూరిటీ వాళ్ళను పిలిపించి బయటకు గెంటిస్తాం-" తాగుడు అనేది ఎక్కడా లేదు. అంతే! కావాలంటే తాగిన తరువాత ఎఫెక్ట్స్ చూపించుకోవచ్చు- ఇంతేనా, ఇంకేమయినా అడగాల్సినవి ఉన్నాయా?"

"ఇంకేం లేవుసార్-"

"అయితే మీరిక వెళ్ళండి! ఆ! అన్నట్లు ఇంకో విషయం మీ స్క్రిప్ట్ లో ఇంకోచోట "నాకిద్దరూ ఆడపిల్లలే" అన్న డైలాగుంది. అలాంటివి కూడా రాయకూడదు. గుర్తుంచుకోండి!"

అందరం నిర్ఘాంతపోయాం.

"ఏమిటి ఏమన్నారు? ఇద్దరూ ఆడపిల్లలే లని తండ్రి పాత్ర అనకూడదా?" కోపంగా దూరం నుంచి అరచాడు చంద్రకాంత్.

"అనకూడదు-"

"ఎందుకని సార్? ఎవరయినా మీకెంతమంది పిల్లలు అని ఎవర్నయినా అడిగినప్పుడు "ఇద్దరూ ఆడపిల్లలే" అని ఆ తండ్రి జవాబు చెప్పకూడదా?"

"చెప్పకూడదు అనేగా నేను మొత్తుకునేది. అలా చెప్పటం వల్ల మన స్త్రీ జాతిని కించపరిచి నట్లవుతుంది!"

"మరే మనాలి సార్- మీ టివి భాష ప్రకారమయితే?"

"ఇద్దరు అమ్మాయిలు" అనాలి!

"అమ్మాయిలకూ, ఆడపిల్లకూ తేడా?"

అధికారి కోపంగా లేచి నిలబడ్డాడు.

"అలాంటి మెలిక ప్రశ్నలేయకూడదని ఇందాకే ఓసారి చెప్పాను. మేమేది చెప్తే అది మీరు నోర్మూసుకుని చేసేయడానికే మారిక్కడికొచ్చారు. వాదనలూ, ప్రతి వాదనలూ కోసమయితే కోర్టుకెళ్ళండి! డోన్ట్ వేస్ట్ అవర్ టైమా? మొత్తం తెలుగు రాష్ట్రంలోని ప్రజల టైమంతా దిక్కుమాలిన ప్రోగ్రామ్స్ తో వేస్ట్ చేస్తోంది మీరు" మళ్ళీ దూరం నుంచి అరచాడు చంద్రకాంత్. యాదగిరి రంగారెడ్డి అతనింకేదో కూడా మాట్లాడబోతూంటే నోరు మూసేశారు. కొద్దిసేపు అందరం ప్రశ్న లేయకుండా నిశ్శబ్దంగా ఉన్నాక టీవీ అధికారిని నెమ్మదిగా అడిగాం.

"సార్- పోనీమీరే కథ చెపితే రాసుకుని మీకు సబ్మిట్ చేస్తాం- కావాలంటే ఆ కథ చెప్పినందుగ్గాను మీకూ కొంత ఇచ్చుకుంటాం-"

ఆ అధికారి అంత ఎత్తున ఎగిరిపడ్డాడు.

"ఏమిటి? లంచాలా? టీవీలో లంచాల గురించి మాట్లాడుతారా? ఎంత ధైర్యం మీకు? మిమ్మల్ని అరెస్ట్ చేయిస్తాను- జైల్లోకి తోయిస్తాను-" అన్నాడు ఫోన్ తీసుకుని.

అమరం భయపడిపోయాం-

"అది కాద్సార్! ఆ మధ్య ఏదో ఇంగ్లీషు పత్రికలో చదివాం ఢిల్లీ దూరదర్శన్ లో ఇలాంటి సీరియల్ స్క్రిప్ట్ కు మంజూరు చేసినందుగ్గాను రెండులక్షలు లంచం తీసుకుంటున్నారట! ఆ నమ్మకంతోనే మిమ్మల్నిలా అడిగాము!"

"అలాంటి పిచ్చి రాతలన్నీ నమ్మకండి! లంచాలు, అవినీతి అనేవి ప్రస్తుతం మనదేశంలో ఎక్కడాలేవు, రాజీవ్ గాంధీ వచ్చాక అది మొత్తం నిర్మూలించేశారు. మా రేడియో, టీవీ వార్తల్లో రోజూ ఈ విషయం చెపుతూనే ఉన్నాం కదా వినటం లేదా?"

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఆ వార్తలు మేమెవ్వరం వినమండీ!" అన్నాను నసుగుతూ.

అతను షాక్ తిన్నట్లు చూశాడు మావేపు.

"ఏమిటి? మీరు మా వార్తలు వినరా? ఎందుకని?"

"అవి వింటూంటే- ఎంచేతో ఏమో నమ్మబుద్ధి కాదండీ!" భయంగా అన్నాడు శాయిరామ్.

"మరి మీకు మనదేశంలో ఏం జరుగుతోందీ ఎలా తెలుస్తుంది?"

"న్యూస్ పేపర్స్ చదువుతాం కదండీ! వాటి ద్వారా తెలుస్తాయ్-"

అధికారి నుదుటిమీద కొట్టుకున్నాడు.

"మీరే కాలనీలో ఉన్నారో, ఆ కాలనీ ఎక్కడుందో గానీ అందరూ సర్వనాశనమయి పోతున్నారు. బొత్తిగా మా టీవీ వార్తలు నమ్మటం లేదంటే మీకేమాత్రం దేశభక్తి లేదని అర్థమయిపోతోంది. నాకేగానీ పవర్స్ ఉంటే మీ కాలనీ వాళ్ళందరినీ నాసా కింద బుక్ చేయించి జైల్లోకి తోయించేవాడిని-"

"అవున్సార్! వప్పుకున్నాం అందరం.

"వెళ్ళండి! వెరయిటీ స్క్రిప్ట్ లు రాయించుకు రండి! ప్రభుత్వం టీవీని ట్వంటీఫస్ట్ సెంచురీలోకి తీసుకెళ్తోంటే మీ స్క్రిప్ట్ పంతొమ్మిదో శతాబ్దంలో ఉంటే ఎట్లా! మనది డెమొక్రసీ అనేది గుర్తుంచుకోమని ఆ రచయితలకుచెప్పండి! ఎలాంటి అక్రమాల నయినా, ఎవరే అన్యాయాలు చేసినా మీ స్క్రిప్ట్ ల ద్వారా యథేచ్ఛగా విమర్శించవచ్చు! మనదేశంలో ఉన్నంత స్వేచ్ఛ ప్రపంచంలో ఇంకెక్కడా లేదని నిన్నేగా టీవీలో చెప్పాం? అదికూడా వినలేదా మీరు?"

"లేదండీ-"

"యూస్ లెస్ ఫెలోస్! మా స్క్రిప్ట్ లో ఒకే ఒక్క విషయం కనిపించకుండా చూసుకోండయ్యా చాలు!"

"ఏమిటిసార్ అది?" రహస్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అదేనయ్యా! నిజాలు, సహజత్వం ఈ రెండూ టీవీ ఛాయలక్కూడా రాకూడదు-"

"అంతేకదా- అయితే సరే" అందరం ఉత్సాహంగా కాలనీకి తిరిగి వచ్చాము.

ఆ రాత్రంతా చంద్రకాంత్ ని ఊదరగొట్టి, రకరకాల అయిడియాలు మేమే ఇచ్చి తెల్లారే సరికల్లా ఇంకో స్క్రిప్ట్ తయారుచేయించాము.

సబ్మిట్ చేసిన పదిహేను రోజులకే యధాప్రకారం ఉత్తరం వచ్చింది. అయితే ఈసారి మా స్క్రిప్టు ఓ.కే. అయిపోయింది గానీ దానిలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని సూచించారు. దాంతో మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది. అందరం కలసి శెలవుపెట్టి టీవీ స్టేషన్ చేరుకున్నాం.

మమ్మల్ని చూడగానే (ఆ అధికారి) మొఖంలో కోపం ముంచుకొచ్చేసింది.

"ఇదిగో! మీకేమయినా తెలివుందటయ్యా?"

"శుభ్రంగా ఉందండీ! ఎందుకంటే మేము మీ పోగ్రాంలు చూడం కదండీ!" తడబడుతూ అన్నాడు రెడ్డి.

"ఆహా- అబ్బ- అబ్బ- ఏం దెబ్బ కొట్టావ్ గురూ-" పగలబడి నవ్వుతూ అన్నాడు యాదగిరి.

నేనూ శాయిరామ్ కలసి వాళ్ళిద్దరినీ కోప్పడి మళ్ళా ఆ అధికారి దగ్గరకొచ్చాము.

స్క్రిప్ట్ లో ఓ పేజి తీసి మా వేపు గిర్రున తిరిగాడతను.

"ఇదిగో! ఏమిటయ్యా ఇది? ఎవడింట్లోనో దొంగలు పడి సామాన్లెత్తుకుపోతే దానికి బాధ్యత పోలీసులదా? చేతకాని డిపార్టుమెంట్, లంచగొండి డిపార్టుమెంట్ అని రాస్తారా? మీకేమయినా బుద్ధుందా? దొంగతనాలకూ పోలీస్ డిపార్టుమెంట్ కీ ఏమిటయ్యా సంబంధం? అయినా గవర్నమెంట్ డిపార్టుమెంట్స్ ని ఏమాత్రం విమర్శించకూడదని మీకు ఇన్ని సంవత్సరాలయినా ఇంకా తెలీదా?" అంటూ మరో రెండు పేజీలు తిరగేశాడు. ఓ పేజీ చూస్తూనే స్క్రిప్ట్ మా మీదకు విసిరికొట్టాడు.

"అదేమిటయ్యా! రైల్వేలో బెర్తులు కావాలంటే లంచాలు ఇవ్వాలా? రైల్వే నిండా అవినీతి ఉందా?" అడిగాడు కోపంగా.

"అవునండీ! నిజంగానే ఉంది! మొన్నే బాంబేనుండి వచ్చేప్పుడు బెర్తు కోసం పాతిక రూపాయలు లంచమిచ్చాను-" అన్నాడు గోపాల్రావ్.

ఆ అధికారి అసహనంగా లేచి నిలబడ్డాడు. పక్కనే ఉన్న ఫోన్ అందుకని రింగ్ చేశాడు.

"హలో నేను హైద్రాబాద్ టీవీ నుంచి మాట్లాడుతున్నా- మీ రైల్వేలో అవినీతి ఉందని ఇక్కడ ఎవరో అంటున్నారు- నిజమేనా? - ఏమిటి? అంతా అబద్ధమా! నేనూ అదే అనుకున్నాలెండి!" ఫోన్ డిస్కనెక్ట్ చేసి మరికొన్ని ఆఫీసులకు కూడా రింగ్ చేశాడు. ఆ తర్వాత మావేపు తిరిగాడు.

"చూశారా- అదంతా మీ ఇల్యూజన్! అంతే! ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ అవినీతి అనేదే లేదంటున్నారు. అంతగా కావాలంటే వరకట్నాల గురించీ, ఫోలియో వ్యాధుల గురించీ, పరిసరాల పరిశుభ్రత గురించీ, మనుషులను కరిచే పిచ్చి కుక్కల గురించీ, పంటలను నాశనం చేసే కీటకాల గురించీ- యధేచ్ఛగా విమర్శించండి! ఏం ఫరవాలేదు"

"కాని మరి 'రజని' అనే హిందీ టీవీ సీరియల్లో హీరోయిన్ అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్స్ నీ విమర్శించింది కదండీ- వాళ్ళెలా వప్పుకున్నారు. ఆ స్క్రిప్ట్ ని?" అడిగాడు జనార్ధన్.

"ఇదిగో మళ్ళీ మెలిక ప్రశ్నలేస్తున్నారు కదూ?" కోపం తెచ్చుకుంటూ అడిగాడతను.

"అబ్బే- వాడి ప్రశ్నలు పట్టించుకోకండి సార్! వాడి మాటలే అంత- మెలికలు తిప్పి మాట్లాడుతూంటాడు అన్నీను" సర్ది చెప్పాడు రంగారెడ్డి.

"అసలీ గొడవంతా ఎందుకుసార్? కథ మీరే చెప్పండి- రాసుకుంటాం!" అన్నాడు జనార్ధన్ కాగితం కలం తీసుకుని.

ఆ అధికారి కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"ఆల్ రైట్! రాసుకోండి! ఉట్టి అవుట్ లైన్స్ ఇస్తాను. దానినిబట్టి డెవలప్ చేయించుకోండి! సరేనా?"

"అలాగే సార్!"

"అనగనగా ఓ హీరో! వాడు చాలా బీదాడు. అట్టడుగు వర్గానికి చెందినవాడు. చెప్పులు కుడుతూంటాడు. అంచేత చాలా దేశభక్తుడు, టీవీలో వార్తల్ని పూర్తిగా నమ్మినట్లు కనిపించటమే కాకుండా ఆ నిజంగా నమ్ముతాడు కూడా!

ప్రతివారం అతని పాటతో సీరియల్ స్టార్టవుతుంది.

భారతదేశమేరా బంగారుదేశం-
భారతవాసులేరా బంగారు ప్రజలూ-
మనమంతా ఐక్యం రా-
మనదేశం సమైక్యం రా-

ఈ పాట నేనే రాసిస్తాన్లే! ఇలా మొదలయి పన్నెండు వారాలు పన్నెండు సంఘటనలతో కథ జరుగుతుంది. మొదటి వారం వాడి కూతురికి పెళ్ళి చేయాలనుకుంటాడు. కట్నం సమస్యవల్ల పెళ్ళి ఆగిపోతుంది. అతను సమాజాన్ని తిడుతూండగా కథ ముగుస్తుంది. రెండోవారం అతని చిన్న కొడుక్కి జబ్బు చేస్తుంది. ప్రైవేట్ డాక్టర్లు అతనిని పదకొండు వందల రూపాయల ఫీజు అడుగుతారు. ఇవ్వలేక నానాకష్టాలూ పడి ఆఖర్లో కొడుకుని ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకెళ్తాడు. అక్కడ హాస్పిటల్లోని మొత్తం డాక్టర్లందరూ పరుగుతో వచ్చి ఆ కుర్రాడికి ఆపరేషన్ చేసి, ఆ డాక్టర్లే బ్లడ్ ఇచ్చి వాడిని రక్షిస్తాడు. తరువాతి వారంలో అతను అడుక్కు తినే పరిస్థితి వస్తుంది. కొత్తరకాల బూట్లు వచ్చేసరికి పాత చెప్పుల రిపేర్లు తగ్గిపోతాయ్. అప్పుడు బాంకులన్నీ అతనింటికి వచ్చి అతనికి రకరకాల ఋణాలిస్తాయ్. దాంతో అతను పెద్ద చెప్పుల ఫాక్టరీ కట్టించి, దాని గడపలో ప్రభుత్వం తాలూకు ఫొటోలు పెట్టుకుని రోజూ భజనలు చేస్తుంటాడు. ఇలా మనమంతా 'రియాలిటీ' అంటే నగ్నసత్యాలు చూపిస్తామన్నమాట! ప్రతివారం ప్రభుత్వం బీదల కోసం, ప్రజల కోసం చేస్తున్న అద్భుత కార్యక్రమాల గురించి చెప్పి వాటి వల్ల మనదేశం, మన ప్రజలూ ఎంత ప్రగతి సాధించిందీ, ప్రజలంతా ఎంత సుఖంగా ఉందీ- వివిధ పాత్రల ద్వారా నాలుగయిదు నిమిషాలు ఫిలిమ్ నిడివి తగ్గిందను కోండి! అప్పుడు సినిమా నటుడినెవర్నో తీసుకొచ్చి ఆ వారం జరిగిన కథ ఏమిటో అందరికీ చెప్పిస్తే టైమ్ సరిపోతుంది. మీకు షూటింగ్ ఖర్చు కూడ తగ్గిపోతుంది. ఆఖర్లో- అంటే పదమూడో వారంలో మొత్తం ఎపిసోడ్ అంతా సినిమా నటుడే కనబడి కథ ఎండింగ్ చెప్పేస్తాడు; విజువల్ గా ఏమీ చూపించాం! అదొక వెరయిటీ అన్నమాట."

అందరం ఆయనకు ధన్యవాదాలు తెలిపి కాలనీకి చేరుకున్నాం. ఆయన సూచించిన విధంగానే కథ తయారుచేశాము.

స్క్రిప్ట్ సబ్మిట్ చేశాక వెంటనే ఏ పాత్ర ఎవరు చేయాలా అనేది నిర్ణయించడానికి ఆ ఆదివారం నాడు అందరం సమావేశమయ్యాం మళ్ళీ.

"నేనే హీరో" అన్నాడు జనార్ధన్.

"అదేమిటి? హీరో ముసలాడు కదా? అదీగాక చెప్పులు కుట్టే పాత్ర కనుక దానికి గ్లామర్ మొఖం అఖ్ఖర్లేదు-" అన్నాడు బోసు బాబు.

"కథ కొంచెం మార్చేద్దాంలెండి! ముసలాడు కాదు. గ్రాడ్యుయేట్! చాలా అందంగా ఉంటాడు. మార్కెట్లో ఓ పెద్ద చెప్పులషాపు తెరుస్తాడు- కాంపిటీషన్ లో గొడవలు, ఫైట్సు- అన్నా చక్కగా వర్కవుట్ చేసుకోవచ్చు. అదే షాపుకి లేటెస్ట్ మోడల్ చెప్పులు కొనడానికి కోటీశ్వరుడి కూతురు షీలా వస్తుంది. ఇద్దరూ మొదటి చెప్పుల జతలోనే ప్రేమలో పడతారు- కట్ చేస్తే- బృందావన్ గార్డెన్స్ లో డ్యూయెట్-"

అందరం తల పట్టుకుని కూర్చోవటం చూసి ఆపేశాడు జనార్ధన్.

"హీరోకి ఎంత డబ్బిద్దాం?" అడిగాడు యాదగిరి.

"ఒకో ఎపిసోడ్ కి అయిదొందలయినా యివ్వాలి-" అన్నాడు జనార్ధన్.

"ఇదే సినిమాల్లో అయితే నారేటు ఇప్పుడు ఎనభయ్ వేలుంది."

అందరం గట్టిగా నవ్వేశాం.

"మూడొందలు" కాగితం మీద రాస్తూ అన్నాడు యాదగిరి.

కాలనీలో అందరికీ- పాత్రలు- ఎవరికెంత డబ్బివ్వాల్సిందీ రాసేయటం జరిగిపోయింది. రిహార్సల్స్ కోసం స్క్రిప్ట్ కాపీలు కూడా పంచిపెట్టాం.

ఆ సాయంత్రం రిహార్సల్ కోసమని మేమంతా రంగారెడ్డి ఇంటికెళ్ళబోతూంటే శ్యామల్రావ్ ఇంటిముందు కొన్ని వందల మంది గుమికూడి ఉండటం కనిపించింది.

అందరి గుండెలూ ఝల్లుమన్నాయ్-

పోలీసులకూ, ప్రభుత్వానికీ లంచం పెట్టి హెల్మెట్స్ ధరింపజేసే రూప తెప్పించిన దగ్గర్నుంచీ మాకు శ్యామల్రావంటే భయంగానే ఉంది.

అందరం శ్యామల్రావ్ ఇంటికి చేరుకొని ఆ జనాన్ని తోసుకుంటూ ముందుకి వెళ్ళాం.

శ్యామల్రావ్ అతని పెద్దకొడుకూ కూర్చుని ఇంటర్వ్యూ లాంటిది కండక్ట్ చేస్తున్నారు.

"ఏమి ఇంటర్వ్యూ ఇది?" ఒకతనిని అడిగాము.

"శ్యామల్రావ్ గారు ఎనిమిది టీవీ సీరియల్స్ తీస్తున్నారు కదా! అన్నిటికీ నటీనటులను సెలక్ట్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలు జరుగుతున్నాయ్-" అన్నాడతను.

అందరం నిర్ఘాంతపోయాం.

"ఎనిమిది టీవీ సీరియల్సా?" నమ్మశక్యం కాక మళ్ళీ అడిగాడు శాయిరామ్.

"అవున్సార్! అన్నీ నిన్నే- ఎప్రూవ్ చేశారట టీవీవాళ్ళు-" మాకు కొద్ది క్షణాల వరకూ నోటమాట రాలేదు-

శ్యామల్రావ్ లైన్ లో నిలబడ్డ ఓ వ్యక్తిని పిలిచాడు.

"నీ పేరేంట్రా?"

"కొండిగాడండీ-"

"ఎంతవరకు చదివావ్ నువ్వు?"

"సదువెక్కడిదండీ- అ ఆ ఇ ఈ అన్నీ వచ్చండి- అంతొరకే-"

రెండుగంటల్లో ఆర్టిస్ట్ ల సెలక్షన్ పూర్తయిపోయింది.

"ఎంతమందిని సెలక్ట్ చేశావ్?" రమణారావ్ ని అడిగాడు శ్యామల్రావ్.

"నూట అరవైమంది అయ్యారు!"

శ్యామల్రావ్ ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి? మనక్కావలసింది వందమందేగా!"

"ఇంకో అరవై కొత్త పాత్రలు ఇవాళ రాత్రి కూర్చుని రాసేస్తాన్లెండి! వచ్చే డబ్బు ఎందుకు వదులుకోవటం- చాలామంది రెండు వందలకంటే ఎక్కువ ఇవ్వలేమంటున్నారు. అందుకని తప్పదు మరి-"

"అదేమిటి? స్క్రిప్ట్ మీరే రాశారా?" రమణారావ్ నడిగాడు రంగారెడ్డి.

"అవును! ఇంకెవరు రాస్తారు?"

"టీవీ స్క్రిప్ట్ లు రాయటం తెలిసిన రచయితలుండాలి కదా-" అన్నాడు శాయిరాం.

శ్యామల్రావ్, రమణారావ్ ఇద్దరూ పగలబడి నవ్వారు.

"ఇదేం సినిమా అనుకున్నారా! చెత్త స్క్రిప్ట్ అయితే జనం చూడరని భయపడటానికి! ఇక్కడ ఏ చెత్త అయినా చచ్చినట్లు చూడాల్సిందే- మాకేం ఖర్మ- బోలెడు డబ్బుపోసి గొప్ప రచయితల దగ్గర కెళ్ళటానికి-"

ఇంక లాభం లేదని మేము వచ్చేశాం.

ఆ మధ్యాహ్నానికల్లా షూటింగ్ ఏర్పాట్లన్నీ పూర్తి అయిపోయాయ్. మర్నాడు షూటింగ్ చేయాల్సిన స్క్రిప్ట్ గురించి కెమెరామెన్, డైరెక్టర్ బోసుబాబు కాలనీ స్టేజ్ దగ్గర చర్చించుకుంటున్నారు. మిగతా అందరం వాళ్ళ చుట్టూ మూగి ఆసక్తిగా చూస్తున్నాం. తర్వాత బోస్ మా కాలనీ ఆర్టిస్టులందరికీ టీవీకి, స్టేజ్ కి నటనలో చూపాల్సిన తేడా గురించి ఉపన్యాసం ఇవ్వసాగాడు.

"మీ అందరికీ డ్రామా ఎక్స్ పీరియన్స్ ఉందని నాకు తెలుసు- ఇందులో కొంతమంది గవర్నమెంట్ టీవీ నటులున్నారని కూడా నాకు తెలుసు. మీరందరూ కూడా తెలుసుకోవలసిందేమిటంటే, మీరు నటన శరీరమంతటితో చేయటం తగ్గించి ఎక్కువగా మొఖంతో ప్రదర్శించటం నేర్చుకోవాలి-"

అప్పుడే ఓ వ్యక్తి ఆటోదిగి మా దగ్గరకు రావటం కనిపించింది. తాగినవాడిలా తూలుతూ మా దగ్గరకొచ్చాడు.

"మీతో ఒన్ మినిట్ మాట్లాడాలి!" అన్నాడతను.

"మీరెవరు? ఏం మాట్లాడాలి!" అడిగాడు గోపాల్రావ్.

"షాలా అర్జెంట్ విషయం!"

"మాట్లాడండి మరి!" అన్నాడు రంగారెడ్డి వినడానికి రడీ అవుతూ.

అతను నిషాగా నవ్వాడు "ఆహాహాహా ఆ హా హా హా హా ఇక్కడ కాదు- మనం షీక్రెట్ గా మాట్లాడాలి- ఇంతకూ షాయిరామ్ ఎవరు?" అడిగాడతను.

"నేనే- ఏమిటి సంగతి?" అడిగాడు శాయిరామ్ ముందుకొచ్చి.

"నన్ను ఇంకా గుర్తుపట్టలేదా మీరు హాహాహా- ఆ హా హా హా నేను షార్? మీరు అదివరకు టీవీ స్టేషన్లో డ్రామా వేశారు కదా! అప్పుడు నేను కాజువల్ వర్కర్ గా ఉండేవాడిని. దేవుడి దయవల్ల రెండేళ్ళల్లో ప్రొడ్యూసరై పోయాను- ఆ హాహాహా ఆ హాహాహా- మా అంకుల్ ఢిల్లీ దూరదర్శన్ లో ప్యూన్. అందుకని ఆహాహాహా- ఆ హాహాహా-"

"ఇంతకూ ఇప్పుడేమంటారు?" అడిగాడు రంగారెడ్డి.

"ఏమనేదేముంది షార్! మనకి డైరెక్షన్ చేయటమంటే చాలా ఇష్టం! నాకు పదహారు అవార్డులు కూడా వచ్చాయ్! మా బామ్మర్దికి కూడా డైరెక్షన్ అంటే తెగిష్టం! అందుకని వాడిని మీ టీవీ సీరియల్ డైరెక్షన్ ఛాన్స్ ఇమ్మని అడగటానికొచ్చాను- ఆహాహాహా ఆహాహాహా-.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"డైరెక్షన్ చేయడానికి మీ బామ్మర్దికి ఏం క్వాలిఫికేషన్స్ ఉన్నాయ్?" అడిగాడు జనార్ధన్.

అతను నవ్వటం ఆపేశాడు.

"ఏమిషీ? క్వాలిఫికేషనా? టీవీ సీరియల్ డైరెక్షన్ చేయడానికి క్వాలిఫికేషనెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏమీ తెలీకుండా మరెలా తీస్తాడు?"

"భలేవాళ్ళే- నాలుగు షీరియల్స్ తీస్తే ఆడికే అన్నీ తెలుస్తయ్- మీరేం భయపడకండి! అయామ్ హియర్- ఆహాహాహా- ఆహాహాహా-"

"మీ షీరియల్స్ డైరెక్షన్ మాకొద్దుగానీ ఇక దయషేయండి- ఆహాహాహా ఆహాహాహా-" అన్నాడు శాయిరామ్ హేళనగా.

అందరూ ఘొల్లున నవ్వారు.

అతనికి కోపం వచ్చేసింది.

"నన్ను ఇన్సల్ట్ షేస్తారా? ఆ! నన్ను ఇన్సల్ట్ షేస్తారా? టీవీ ప్రొడ్యూసర్ బామ్మరిదిని డైరెక్షన్ ఛాన్స్ ఇయ్యనంటారా? ఎంత ధైర్యం మీకు. మీరింక జన్మలో టీవీ మొఖం షూడకుండా షేస్తాను- మీ కాలనీ వాళ్ళకసలు టీవీ ప్రోగ్రామ్స్ రాకుండా టీవీ టవర్ లో మార్పులు షేషేస్తా!" అంటూ కింద పడిపోయాడు. అందరం కలసి అతనిని ఓ ఆటో పిలిపించి అందులో ఎక్కించాం.

"రేయ్- మా బామ్మర్దికి డైరెక్షన్ ఇవ్వనన్నారు కదూ! మీ షీరియల్ ఎలా బయటికొస్తుందో నేను షూస్తా!" అంటూ వెళ్ళిపోయాడతను.

"పోపోరా రమ్ బాటిల్" అరచాడు గోపాల్రావ్.

మర్నాడు షూటింగ్ అనుకున్నట్లే ప్రారంభమైపోయింది. బోస్ బాబు తన సినిమా టెక్నిక్ అంతా ఉపయోగించి మొదటి ఎపిసోడ్ మూడు రోజుల్లో పూర్తి చేశాడు.

ఎడిటింగ్, మ్యూజిక్ వగైరాలు పూర్తయ్యేసరికి మరో నాలుగు రోజులు పట్టింది. సీరియల్ తాలూకూ మొదటి ఎపిసోడ్ కేసెట్ తీసుకుని అందరం టీవీ స్టేషన్ కి చేరుకున్నాం. అప్పటికే శ్యామల్రావ్, వాళ్ళబ్బాయ్ రమణారావ్ టీవీ స్టేషన్లో నుంచి బయటికొస్తున్నారు.

"ఏమిటి? మీ మొదటి ఎపిసోడ్ ఇప్పుడు తెస్తున్నారా!" ఆశ్చర్యంగా అడిగాడు మమ్మల్ని చూసి.

"అవును- ఏం?"

"ఇంత స్లో అయితే ఎలా? నేను వారం రోజుల్లో అరడజను ఎపిసోడ్స్ కి ఎడిటింగ్, మ్యూజిక్ అన్నీ పూర్తిచేసేశాను-"

అదిరిపడ్డాం అందరం.

"ఏడురోజుల్లో ఆరు ఎపిసోడ్స్ షూటింగ్ చేసేశారా?" నమ్మలేనట్లు అడిగాడు శాయిరామ్.

"మొత్తం పదమూడూ షూటింగు అయిపోయినయ్ అనుకోండి- ఎడిటింగ్ మ్యూజిక్ మాత్రం ఆరింటికి పూర్తి అయింది. వాటన్నిటిని టీవీ వాళ్లు ఓ.కే. చేసేశారు కూడా! రేపే బాంబేవెళ్లి మాంచి స్పాన్సరింగ్ కంపెనీని పట్టుకుని అమ్మేసి వస్తాం-" అంటూ వెళ్ళిపోయారు వాళ్ళు.

మేమంతా బోసుబాబు వేపు చూశాం అనుమానంగా. బోసుబాబు కంగారుపడిపోయాడు.

"అలా చూడకండి గురూ! వాడెలా తీశాడో నాకు తెలీదు గానీ ఎపిసోడ్ కి కనీసం రెండురోజులయినా షూటింగు జరగాలి. లేకపోతే స్టేజ్ డ్రామాలాగా అయిపోతుంది- మన స్క్రిప్ట్ లో కొంచెం లొకేషన్స్ ఎక్కువ కాబట్టి ఇంకో రోజు ఎక్కువ పట్టింది-" అన్నాడు సమర్ధించుకుంటూ.

"మీ కాసెట్ ని మా దూరదర్శన్ కమిటీ వాళ్లు చూసి అందులో లోపాలేమీ లేకపోతే ఓ.కే. చేస్తారులెండి! పదిరోజుల తర్వాత కనిపించండి-"

పదిరోజుల తర్వాత అందరం మళ్ళీ టీవీ స్టేషన్ కెళ్ళాం.

"వచ్చేశారా? వెరీగుడ్! ఇప్పుడే మీకు లెటర్ పోస్ట్ చేద్దామనుకుంటున్నాం! ఇదిగో మీ లెటర్-" అంటూ ఓ లెటర్ మా చేతికిచ్చాడు.

అందరం గుమికూడి చదివాం.

1. ఆర్టిస్ట్ ల నటన బాగుండలేదు.

2. కొన్ని పాత్రలు ఉపయోగించిన కొన్ని పదాలు బాగుండలేదు.

3. మ్యూజిక్ బాగోలేదు.

అందరికీ ఆ కాగితం చదివేసరికి వళ్లు మండిపోయింది.

"ఆర్టిస్ట్ నటన మీకు నచ్చలేదా? ఆ మాటంటానికి మీరెవరు? మీ టీవీలో నటనలో డిప్లమాలు తీసుకున్న వాళ్ళుగానీ, ఆంధ్రప్రదేశ్ అంతటా గొప్ప నటుడుగా గుర్తింపు పొందిన వారు గానీ ఉన్నారా?" అడిగాడు శాయిరాం కోపంగా.

అధికారి మండిపడ్డాడు.

"మీకు లక్షసార్లు చెప్పాను- గవర్నమెంట్ నీ, టీవీ అధికారులనూ ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదని! మళ్లా ఎందుకలా అరుస్తున్నారు?"

అందరం సైలెంటయిపోయాం.

గోపాల్రావ్ నెమ్మదిగా కల్పించుకున్నాడు.

"ఆర్టిస్టుల నటన సంగతి అలా వదిలేయండి సార్! పాత్రలు మాట్లాడిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు-"

"అవును ఉన్నాయ్-"

"స్క్రిప్ట్ మీరే మంజూరు చేశారుకదండీ!"

"చేశాం! కాదని ఎవరన్నారు?"

"మరి మీరు అంగీకరించిన స్క్రిప్ట్ కే మీరు ఎందుకు అభ్యంతరం చెప్తున్నారు?"

"ఆ మాత్రం కామన్ సెన్స్ లేదయ్యా! స్క్రిప్ట్ చదివేవాళ్ళు వేరు- అది వీడియో సినిమాగా తీశాక చూసే కమిటీ మెంబర్లు వేరు- అంచేత ఎవరి టేస్ట్ వాళ్ళది- మధ్యలో ప్రశ్నించడానికి మీరెవరు?

గోపాల్రావ్ కి కోపం వచ్చింది.

"ఆల్ రైట్ ఈ విషయం మేం దూరదర్శన్ డైరెక్టర్ గారితో మాట్లాడదల్చుకున్నాం-"

"అయితే వచ్చేనెల పదహారో తారీఖురండి-"

"అదేమిటి? ఇప్పుడెందుకు మాట్లాడకూడదు?"

"ట్రాన్స్ లేటర్ లేడిప్పుడు! వచ్చే నెల పదహారో తారీఖునే వస్తాడతను-"

అందరం మొఖాలు చూసుకున్నాం మళ్ళీ.

"ట్రాన్స్ లేటరా? ట్రాన్స్ లేటరేమిటి?"

"అదేనయ్యా- స్టేషన్ డైరెక్టర్ మీరెలా మాట్లాడగలరు? ఆయన భాష మీకు తెలీదు, మీ భాష ఆయనకు తెలీదు. అందుకని అనధికార పూర్వకంగా ఓ ట్రాన్స్ లేటర్ ని ఏర్పాటు చేశాం! ఆ ట్రాన్స్ లేటర్ ఒక్కడికే ఖగోడీ భాషవచ్చు-"

"ఖగోడీ భాషెందుకు రావటం!"

"స్టేషన్ డైరెక్టర్ మరి ఖగోడీకి చెందినవాడు గనుక! ఆ మాత్రం కామన్ సెన్స్ లేదా మీకు?"

"బాబ్బాబు- ఇప్పుడు మమ్మల్నేం చేయమంటారో చెప్పండి!"

"అలా దారికి రండి! రూల్సూ, కోర్టులూ అంటే మీ సీరియల్ మొదటి భాగం పట్టుకుని మా స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి రిటైరైపోతారు. మీరు ఈ షూటింగ్ కోసం ఇంతవరకూ చేసిన ఖర్చు కూడా గోవిందా గోవిందా-" మాకు భయం వేసింది.

"అంటే ఇప్పుడు మళ్ళీ షూటింగ్ చేయక తప్పదంటారా?"

"తప్పదయ్యా! తప్పదన్నాక తప్పదు-"

"పోనీ మార్పులు షూటింగ్ చేసుకొచ్చాకయినా ఇంకేట్రబులూ లేకుండా ఓ.కే. చేస్తారా?" అడిగాడు జనార్ధన్.

అధికారి కోపంగా లేచి నిలబడ్డాడు తన సీట్లో నుంచి.

"ఏయ్- ఇక్కడ్నుంచి పోతారా లేదా?"

"ఎందుకండీ అంతకోపం? మా వాడు పొరపాటు మాట్లాడితే చెప్పండి వింటాడు" అన్నాడు రంగారెడ్డి.

"లేకపోతే ఏమిటయ్యా! మా రూల్స్ వారానికోసారి మారిపోతుంటాయ్. మరప్పటి సంగతి ఇప్పుడెలా చెప్పమంటారు? ఇవాళ "ఓర్నాయనో" అన్నపదం మీరు మీ సీరియల్లో ఎక్కువగా వాడారు. అయినా మేమేం అభ్యంతరం చెప్పటం లేదు. రేపు గైడ్ లైన్స్ మారి అదే మాకు చిరాకు కలిగించవచ్చు- అప్పుడు అది తీసేయమని మేము డిమాండ్ చేయవచ్చు-"

మేం ఇంక చేసేదిలేక వెనక్కు తిరిగాం.

బయట గేటు దగ్గరే నిలబడి ఉన్నాడా లావుపాటి వ్యక్తి. మమ్మల్ని చూసి తూలుతూ దగ్గరకొచ్చాడు.

"ఏయ్- మర్యాదగా డైరెక్షన్ మా బామ్మర్దికియండ్రా అంటే ఫోజులు కొడతారా! అదసలు టీవీలో ఎలా వస్తుందో చూస్తా ఆహాహాహా- ఆహాహాహా మాకు అప్పుడు అర్థమయింది. మా ఎపిసోడ్ కి ఏవేవో వంకలు పెట్టి ఎందుకు రిజెక్ట్ చేసిందీనూ.

"బాస్- మనం ఇలా ఊరుకుంటే లాభం లేదు- ముందు వీడ్ని చట్నీ చేసేస్తాను-" అన్నాడు చంద్రకాంత్ ముందుకి దూకుతూ.

"అవ్ అన్నా- సాలేకో- ఖతన్ కర్ దేంగే" అన్నాడు యాదగిరి.

అందరం కాలనీకి తిరిగివచ్చాం.

శ్యామల్రావ్ మా కోసమే ఎదురుచూస్తూ కనిపించాడు.

"ఏమిటి- మీ ఎపిసోడ్ రిజెక్ట్ అయిందటగా?" హేళనగా అడిగాడు.

"అవును- ఎంత బాగా తీసినా రిజెక్ట్ చేశారు."

"పిచ్చివాళ్ళల్లారా! మీరెప్పుడూ ఆలస్యమే! అన్నిట్లోనూ వెనుకబడటమే! నా మాట విని నన్ను మీ ఏజెంటుగా పెట్టుకోండి. మీ ఎపిసోడ్ రెండురోజుల్లో ఓ.కే. చేయిస్తాను- నాకు పాతికవేలు కమిషన్ ఇవ్వండి చాలు-" అన్నాడు శ్యామల్రావ్.

"నీకు పాతికవేలు కమిషన్ ఇవ్వాలా?"

"మీ ఇష్టం! బలవంతమేం లేదు. మీరు ఖర్చు చేసిన ముప్పయ్ వేలూ సద్వినియోగం అవాలంటే తప్పదు మరి!

"అంటే క్వాలిటీతో పనిలేదా?"

"ఇదిగో చూడండి! ఇక్కడ బోడి క్వాలిటీ ఎవరికి అక్ఖర్లేదు. అందరికీ డబ్బు కావాలి! ప్రొడ్యూసర్ గా మీరు, శాంక్షన్ చేసే వాళ్ళుగా టీవీ కమిటీ మెంబర్లు, దానిని స్పాన్సర్ చేసే కంపెనీ వాళ్ళు, దూరదర్శన్ వాళ్ళూ, ఆ ప్రచారాన్ని అమ్మే ప్రభుత్వం, అందరికీ డబ్బే అవసరం! ఇంతమందికి డబ్బు అవసరమయినప్పుడు చూసే వాళ్ళ గొడవ మనకెందుకు? చూస్తాడు. లేకపోతే చస్తాడు-"

అతను చెప్పినట్లుగానే- రెండు రోజుల్లో ఎలాంటి మార్పులు లేకుండానే, కొంచెం డబ్బింగ్ తో- ఎపిసోడ్ ని ఓకే చేశారు.

తరువాతి ఘట్టం బాంబేలోనే జరుగుతుందని మాకు తెలుసు.

అందుకని నేనూ, రంగారెడ్డి, జనార్ధన్, శాయిరాం బాంబే చేరుకున్నాం. ఎడ్వర్టయిజింగ్ ఏజెన్సీల వాళ్ళ చుట్టూ పదిహేను రోజుల పాటు తిరిగాం.

"మీ ఎపిసోడ్ మేం కొంటే మాకెంత కమిషనిస్తారు?" అడిగాడు ఒక కంపెనీలో అధికారి.

"అదేమిటి? మీక్కూడా కమిషన్ ఇవ్వాలా?"

"అవును మరి! తెలుగు టీవీ సీరియల్స్ క్వాలిటీ ఎలా వుంటుందో మాకు తెలుసు. అలాంటి చెత్త టాటా బిర్లా లాంటి పెద్ద పెద్ద కంపెనీలతో కొనిపించాలంటే కొంచెం రిస్క్ కదా మాకు! మీ శ్యామల్రావే మాకు పాతికవేల రూపాయలు బహుమతిగా ఇచ్చాడు. ఇప్పుడు చూడండి ఆయన తీసిన సీరియల్స్ అన్నీ వారానికి యాభైవేల చొప్పున అమ్మేసి పెట్టాను."

వాడికి పాతిక వేలివ్వటానికి కాదుగానీ, ఇలా లంచాల ఊబిలో దిగబడిపోవటం నచ్చలేదు మాకు. మరో నెలరోజులు వివిధ కంపెనీలకు, ఎడ్వర్టయిజింగ్ ఏజెన్సీలకూ తిరిగి ఎక్కడా మా సీరియల్ అమ్ముడుబోక తిరుగు ముఖం పట్టాం.

ఆ తరువాత వారం నుంచే శ్యామల్రావ్ సీరియల్ ప్రారంభమయింది టీవీలో.

మా వాళ్ళందరం దానిని అతి విషాదంగా చూశాం.

ఎందుకంటే అంతవరకూ "పరమచెత్తగా" ఉన్నాయని విమర్శించిన ప్రభుత్వ డ్రామాలే ఎంతో ఉత్తమంగా అనిపించసాగినయ్.

ఆ తరువాత శ్యామల్రావే వచ్చాడు మా దగ్గరకు.

"మీ సీరియల్ మాకు అమ్మేయండి" దాని మిగతా భాగమంతా నేనే షూటింగ్ చేసే రిలీజ్ చేస్తాను- మీకు ఇంతవరకు అయిన ఖర్చు మాత్రం ఇచ్చేస్తాను-" అన్నాడతను.

ఆ రాత్రి అందరం స్టేజ్ దగ్గర సమావేశమయ్యాం.

ఆ సీరియల్ శ్యామల్రావ్ కిచ్చేసి మా డబ్బు మేం సంపాదించుకోవటమా లేక అతని ఆఫర్ తిరస్కరించడమా అనే విషయం మీద తర్జనభర్జనలు జరిగాయ్.

చివరం అందరం ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాం.

సీరియల్ ని శ్యామల్రావ్ కి అమ్మి మరో దారుణమయిన చెత్తను ప్రజలమీద రుద్దటం కంటే ముఫ్ఫయ్ వేలు నష్టం భరించి దానిని తగలబెట్టటం మంచిదని!

అదేరాత్రి చలిమంటలో టీవీ సీరియల్ కాసెట్ మసి అయిపొయింది. అది బొగ్గుగా మారి పోతూంటే మా అందరికీ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. అయినా లోలోపల సంతృప్తి మాత్రం నిండిపోయింది- మేము ఓ మంచి పనిచేశామని.

(తెలుగోళ్ళకు టీవీ ప్రసారాలు మొదలుపెట్టిన కొత్తలో వ్యవహారం ఈ కథ)

* * * * *

# పోలీస్ లాకప్

మాకాలనీ కల్చురల్ సెక్రటరీ పార్వతీదేవి చెల్లెలి పెళ్ళికి మా అందరికీ ఆహ్వానాలు వచ్చాయ్. అంతేకాదు. మా కాలనీ సభ్యుల నందరినీ ఓసారి చూడాలని ఉందని వాళ్ళ బంధువులు కూడా ఉత్తరాల మీద ఉత్తరాలు గుప్పిస్తున్నారు! అంచేత అందరం కలసి ఆ పెళ్ళికి వెళ్ళటం ఉత్తమమయిన మార్గమని పార్వతీదేవి అభిప్రాయపడింది. (ఇటీవల మా కాలనీ వ్యవహారాలూ న్యూస్ పేపర్ల కెక్కటంతో మేము చాలామంది దృష్టిలోకి రావడం జరిగింది)

ఏమైతేనేం- నేనూ, శాయిరామ్, రంగారెడ్డి, జనార్ధన్, యాదగిరి, జర్నలిస్ట్ గోపాల్రావ్ అందరం కలసి భార్యాబిడ్డలతో ప్రయాణం ప్రారంభించాం.

చాలా రోజుల ముందే రిజర్వేషన్ ఏర్పాట్లు చేసేయడం వల్ల హాయిగా స్లీపర్ కోచ్ లో ఎక్కి కూర్చున్నాము.

శాయిరామ్ రైల్వే గురించి కొన్ని జోకులు అందరికీ వినిపిస్తున్నాడు. రైలు ఒకటి రెండు స్టేషన్లు దాటిందో లేదో అమ్తావ్‌అరకూ మా పక్కనే నిలబడ్డ ఓ గిరజాల జుట్టువాడు మెరుపు వేగంతో మా ఆడాళ్ళ మెడలో గొలుసులు తెంపుకుని, అప్పటికే బాగా స్లో అయిపోయిన రైలు నుంచి దూకి చీకట్లో పారిపోయాడు. మరికొద్ది క్షణాల్లో రైలాగిపోయింది.

"దొంగ దొంగ" అంటూ మేమందరం అరచి వాడివెంట పడ్డానికని బోగీ దిగాము.

కానీకింద ఎత్తులూ, పల్లాలూ, రాళ్ళూ రప్పలూ కాళ్ళకు తగిలేసరికి ఎటూ పరుగెత్తలేక అక్కడే నిలబడి పోయాము.

టీటి.ఇ. మా వెనుకే నెమ్మదిగా వచ్చాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాడు తాపీగా.

"వాడెవడో దొంగ వెధవ! ఆడాళ్ళ మెడలో గొలుసు తెంపుకుని బండి దూకి పారిపోయాడు-" ఆత్రుతగా చెప్పాడు శాయిరామ్. జనమంతా మా చుట్టూ మూగారు అప్పటికే.

టీటీఇ చిరాగ్గా చూశాడు మావేపు.

"ఈ మాత్రానికి పెద్ద హడావిడి చేస్తున్నారా? చాల్చాల్లే! ఎక్కండిక బండి!" అన్నాడు అలారం డిస్క్ ఎడ్జస్ట్ చేస్తూ.

"ఏమిటండీ! ఓ పక్క మెడలో నగలు కొట్టేస్తే మీకు చాలా తేలిగ్గా కనబడుతున్నట్లుందే ఇది?" అన్నాడు రంగారెడ్డి.

"మామూలు విషయం కాపోతే- ఇదేం పెద్ద సెన్సేషనల్ వ్యవహారం అనుకున్నారా? మా రైల్వేలో మామూలుగా నగలు రోజూ తెంచుకుని పారిపోతూనే ఉంటారు. మీరు న్యూస్ పేపర్లు చదవరా?" కోపంగా అడిగాడతను.

ఈలోగా రైలు కదిలింది.

రంగారెడ్డి ఛటుక్కున రైలెక్కి అలారం గొలుసు లాగాడు. రైలు మళ్ళీ ఆగిపోయింది.

"ఏమిటయ్యా- మళ్ళీ గొలుసెందుకు లాగారు?"

"మా ఆడాళ్ళ మెడలో నగల సంగతేమిటో తేలేవరకూ బండిని కదలనీమయ్యా!" కోపంగా అన్నాడు శాయిరామ్.

టీటీఇ కొంచెం తగ్గాడు.

"బండిని ఇక్కడ ఆపి లాభమేమిటండీ! పోయిన నగలు తిరిగొస్తాయా? నాకు పధ్నాలుగేళ్ళ సర్వీసుంది గానీ రైల్లో పోయిన నగలు తిరిగి రావటం చూళ్ళేదెప్పుడూ- కావాలంటే పక్క స్టేషన్లో రైల్వే పోలీస్ స్టేషన్ ఉంది! అక్కడ రిపోర్ట్ చేసుకోండి!"

"అంటే రైల్లో ట్రావెలింగ్ కానిస్టేబుల్స్ అంటూ ఎవరూ ఉండరా?"

"ఏమో సార్! అదంతా మాకు సంబంధం లేదు. మా డ్యూటీ మేము చేయడానికే టైము చాలదు - ఇంకా ఇవన్నీ ఎక్కడచూడమంటారు?"

"సరే- అవన్నీ తేలేవరకూ మేము బండి కదలనీమయ్యా! నీకేమీ సంబంధం లేదుగా! నువ్వూరుకో-" అన్నాడు జనార్ధన్ హీరో ఫోజులో! టీటీఇ కేంచేయాలో తోచలేదు.

మిగతా ప్రయాణీకుల వేపు చూశాడు. అందరూ సీరియస్ గా మాగజైన్లు చదువుకుంటున్నారు.

కొంతమంది ఆడాళ్ళు అంతకుముందు తమ నగలు రైలు దొంగలు ఎలా కాజేసిందీ తీరిగ్గా ముచ్చటించుకుంటున్నారు.

సరిగ్గా అప్పుడే ఇద్దరు కానిస్టేబుల్స్ కారేజ్ లో కెక్కారు.

"కోన్ హై- కోన్ చైన్ కీంచే" అధికారం ఉట్టిపడే స్వరంతో అడిగాడు ఓ కానిస్టేబుల్.

"ఎవరయ్యా గొలుసు లాగింది?" ఇంకో అతను మరింత గట్టిగా దబాయించాడు.

"మేమేనయ్యా!" అన్నాడు శాయిరామ్.

"ఎందుకు లాగారు?"

"మా ఆడాళ్ళ మెడలో నగలు తెంపుకు పోయారు దొంగ వెధవలు-"

"అయితే? దానికోసం చైన్ లాగుతారా? పక్క స్టేషన్ కెళ్ళాక రిపోర్టివ్వాలి?"

"అంటే- ఇక్కడ మీరేం చెయ్యరా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"మేమేం చేస్తాం? ఎవడు మాత్రమేం చేస్తాడు ఈ చీకట్లో? అయినా మా డ్యూటీ అదికాదు-"

"ఏమిటి? పోలీసుల డ్యూటీ దొంగల్ని పట్టుకోవడం కాదా?"

"మా డ్యూటీ అలారం చైన్ లాగిన వాళ్ళను పట్టుకోవడం! అడ్డమైనోడూ అలారం చైన్లు లాగటం వల్ల రైళ్ళు లేటవుతున్నాయని అలారం చైన్ స్క్వాడ్ వేసింది రైల్వే!"

"రోజూ ప్రయాణీకుల మెడలో నగలు కొట్టేస్తున్నారని "గోల్డ్ చైన్ తెఫ్ట్ స్క్వాడ్" ఎందుకు వేయదు మీ రైల్వే!"

"అది రైల్వేకు సంబంధం లేదయ్యా! రైల్వే పోలీస్ చూచుకుంటుందవన్నీ-"

"రైల్వే పోలీసా? మరి మీరెవరు?"

"మేము ఆర్.పి.యఫ్-"

ఓ కానిస్టేబుల్ వెళ్ళి అలారం చైన్ డిస్క్ ని మళ్ళీ ఎడ్జస్ట్ చేశాడు.

రైలు కదిలింది మళ్ళీ.

"ఊ చెప్పండి! మీ పేర్లేమిటి?" ఓ కానిస్టేబుల్ దగ్గరకొచ్చి నోట్ బుక్ తీస్తూ అడిగాడు.

"ఎందుకు?"

"అలారం చైన్ లాగినందుకు కేస్ పెట్టాలి!"

"ఏమిటి? అలారం చైన్ లాగినందుకు కేస్ పెడతావా? నీకేమయినా బుద్ధుందా?"

కానిస్టేబుల్ కోపంగా చూశాడు.

"ఏయ్ మిస్టర్! సంబల్ కే బాత్ కరో! లేకుంటే గలత్ మాటలు చెప్పినందుకు ఇంకొక కేస్ అవుతది-"

"లేకపోతే ఏమిటయ్యా! బంగారు నగలు పోయాయని మేము చెప్తుంటే అలారం గొలుసు గొడవేమిటి మధ్యలో?" రంగారెడ్డి మండిపడ్డాడు.

కానిస్టేబుల్ కి రెడ్డి వ్యవహారం చూసి కోపం ముంచుకొచ్చింది.

"అరెస్ట్!" అని అరచాడు గట్టిగా.

బోగీలో అందరూ ఉలిక్కిపడ్డారు ఆ కేకకు. నిద్రపోతున్న చిన్నపిల్లలు కొంతమంది దడుసుకుని కెవ్వుమంటూ ఏడ్వసాగారు.

"ఎవరా సచ్చినోడు అలా అరచాడుగ లేదు లేమ్మా ఊరుకో! ఏడవకు-" అందో తల్లి.

"అరెస్ట్ చేసెయ్ ఇతన్ని-" ఆ కానిస్టేబుల్ ఇంకో కానిస్టేబుల్ తో మళ్ళీ చెప్పాడు.

రెండో కానిస్టేబుల్ రంగారెడ్డి భుజం మీద చేయి వేయబోయాడు గానీ, రంగారెడ్డి ఒక అడుగు వెనక్కు వేస్తూ "మీద చెయ్యిపడిందో జాగ్రత్త!" అంటూ బెదిరించాడు.

ఈ లోగా రైలు స్టేషన్లో ఆగింది.

అందరూ సామాన్లతో సహా దిగిపోయి ప్లాట్ ఫారం మీదున్న రైల్వే పోలీస్ స్టేషన్ లో కెళ్ళాము.

అరెస్ట్ చేస్తామని బెదిరించిన ఆ కానిస్టేబుల్స్ ఏమయ్యారో ఎంత వెతికినా కనిపించలేదు.

పోలీస్ స్టేషన్లో ఇన్ స్పెక్టర్ మమ్మల్ని చూస్తూనే మొఖం చిట్లించాడు.

"ఏం గావాలా?"

"మేము ఇప్పుడు వెళ్ళిన ఎక్స్ ప్రెస్ నుంచి దిగామండీ!" చెప్పాడు శాయిరామ్.

"ఏం గావాల?"

"మధ్యలో ఒక దొంగ మా ఆడాళ్ళ మెడలో నగలు తెంపుకుని రైలు దూకి పారిపోయాడండీ!" రంగారెడ్డి జవాబిచ్చాడు.

"మేమేం చేయాల!" మళ్ళీ అడిగాడతను.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"దొంగను పట్టుకోవాలండీ?" చెప్పాడు శాయిరామ్ శాంతంగా.

"ఎందుకు పట్టుకోవాల?"

రంగారెడ్డికి మళ్ళీ కోపం ముంచుకొచ్చింది.

"సరదాకండీ! పోలీసులు దొంగల్ని ఎలా పట్టుకుంటారో చూడాలని మా ఆవిడకు ఎప్పటి నుంచో చాలా సరదా! అందుకని..." అన్నాడు వ్యంగ్యంగా.

ఇన్ స్పెక్టర్ కి వళ్ళు మండిపోయినట్లుంది.

"ఇన్ కో అందర్ దాల్ దొజీ-" అతనన్నాడు పక్కనే నిలబడ్డ కానిస్టేబుల్ తో.

కానిస్టేబుల్స్ ఇద్దరు వచ్చి రంగారెడ్డిని లాక్కెళ్ళి లాకప్ లో వేసేశారు.

అందరం నిశ్చేష్టులయిపోయాము.

కొద్దిక్షణాల తరువాత నేనూ, జనార్ధన్ కోలుకున్నాము.

"దిసీజ్ టూమచ్! కంప్లెయింట్ ఇవ్వటానికొస్తే అరెస్ట్ చేస్తారా?" అన్నాన్నేను.

"మీకేం కావాలి?" అన్నాడు ఇన్ స్పెక్టర్ మళ్ళీ.

"మావాడినెందుకు అరెస్ట్ చేశారు?" నేను కోపంగా అరచాను.

"ఇన్ కో భీ అందర్ దాల్ దోజీ-" కానిస్టేబుల్స్ తో చెప్పాడతను. కానిస్టేబుల్స్ నన్ను కూడా తీసుకెళ్ళి లాకప్ లో రంగారెడ్డి పక్కకుతోశారు. గోపాల్రావ్ ఇంక ఆలస్యం చేయలేదు.

తన జేబులోనుంచి ప్రెస్ ఎక్రిడిషన్ కార్డు తీసి ఇన్ స్పెక్టర్ కి చూపించాడు.

"నేనే పత్రికా విలేఖరిని! ఇక్కడ జరుగుతుందంతా పేపర్లలో రాయదల్చుకున్నాను-" అన్నాడు చిరునవ్వుతూ.

హఠాత్తుగా ఇన్ స్పెక్టర్ ధోరణిలో మార్పు వచ్చింది.

"ఏం గావాల?" అన్నాడు ఈసారి సౌమ్యంగా!

"మా నగలు రన్నింగ్ ట్రైన్ లో ఎవడో కొట్టేశాడు-"

"ఏడ?"

"రెండు స్టేషన్ల ముంగల-" అన్నాడు యాదగిరి.

"అయితే ఈడకెందుకొచ్చిన్రు?"

"రిపోర్టిచ్చెడిది ఈడగాదు- సికింద్రాబాద్ లో"

"అదేమిటి? ఇక్కడెందుకివ్వకూడదు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇన్ కోభీ అందర్..." అని అనబోయి ఎంచేతో అనకుండా ఆపేశాడు.

"దొంగతనం మా ఏరియాలో జరగలే! సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇలాఖా అది!"

ఇంక మాకక్కడ చేయగలిగిందేమీ లేదనిపించింది.

"ఓ దోనోంకో ఛోడ్ దోజీ-" అన్నాడు ఇన్ స్పెక్టర్.

నన్నూ, రంగారెడ్డినీ లాకప్ నుంచి బయటకు తోలేశారు వాళ్ళు.

అందరం కలసి బస్ లో సికింద్రాబాద్ స్టేషన్ చేరుకుని రైల్వే పోలీస్ స్టేషన్ లో కెళ్ళాం.

అక్కడ సబ్ ఇన్ స్పెక్టర్ సీరియస్ గా పలుకరించాడు.

"ఏం జరిగింది?"

జరిగిందంతా చెప్పాడు శాయిరామ్.

"దొంగ ఎట్లా వుంటాడు?"

అందరం మొఖాలు చూచుకున్నాం.

"గిరజాల జుట్టుందదండీ!"

"మొఖం ఎలా వుంది?"

"సరిగ్గా చూడలేదండి!"

"రైళ్ళలో ప్రయాణం జేసేప్పుడు నగలు ఎవరు పెట్టుకోమన్నారు?"

"పెట్టుకోకూడదాండీ?" అడిగాడు రంగారెడ్డి కోపంగా.

శాయిరామ్ రంగారెడ్డిని వెనక్కు లాగేశాడు.

"పెట్టుకుంటే ఇట్లాగే కొట్టేస్తారు!"

"మరి మీరున్నది ఎందుకండీ?" హీరోలాగా రెండు చేతులూ నడుము మీద పెట్టుకుంటూ అడిగాడు జనార్ధన్.

తనను లాకప్ లో పడేస్తారేమోనని మేము జనార్ధన్ కి అడ్డువెళ్ళాము.

"ఎన్ని తులాలుంటుంది. గొలుసు?"

"మా ఆవిడది రెండు తులాలు- యాదగిరి భార్యది ఒకటిన్నర తులం" అన్నాడు శాయిరామ్.

"కంప్లెయింట్ రాసివ్వండి?"

ఇద్దరూ కంప్లెయింట్ రాసిచ్చారు.

"ఇక పోండ్రి!" అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

"ఎక్కడికి?"

"ఏడకు పోతారో మాకే మెరుక?"

"మరి మా నగలో?"

"దొరికితే కబురు జేస్తాం" అన్నాడు ఇన్ స్పెక్టర్.

నెల- రెండు నెలలు కూడా అయిపోయింది.

నేనూ, శాయిరామ్ చాలాసార్లు ఆ ఇన్ స్పెక్టర్ ని కలుసుకున్నాం. గానీ లాభం లేకపోయింది.

"రోజుకి అరడజను మంది నగలు పోగొట్టుకుంటున్నారయ్యా- ఎంతమందివని దొరుకుతాయ్?" అన్నాడతను.

ఓరోజు గోపాల్రావ్ హడావిడిగా యాదగిరి, శాయిరామ్ లతో పాటు మా ఇంటికొచ్చాడు.

"పదండి గురూ! నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్ లో పోలీస్ కమీషనర్ గారితో పరిచయమయింది. వెంటనే మన నగల దొంగతనం గురించి చెప్తే వివరాలు కావాలన్నారు" అన్నాడతను.

అందరం ఆటోలో ఆయన ఆఫీస్ కి వెళ్ళి జరిగిందంతా వివరించాము.

ఇది జరిగిన వారం రోజులకు ఓ రైల్వే పోలీస్ కానిస్టేబుల్ మా కాలనీకొచ్చాడు. శాయిరామ్, యాదగిరిల అడ్రస్ తీసుకుని.

"ఏమిటి సంగతి?" అడిగాం అతనిని.

"ఇన్ స్పెక్టరు గారు- ఈ సార్ లిద్దర్నీ తీసుకురమ్మన్నారు సార్!"

"ఎందుకు?"

"ఏమో సార్!"

అందరం బయల్దేరి వెళ్ళాము.

ఇన్ స్పెక్టర్ చాలా ఆదరంగా ఆహ్వానించాడు మమ్మల్ని.

"ఏయ్! త్రీ బై సిక్స్ ఛాయ్ తీస్కురమ్మను" అంటూ కానిస్టేబుల్ ని పురమాయించాడు.

మేం ఆశ్చర్యపోయాం పోలీసుల్లో కనీ వినీ ఎరుగని ఆ ఆప్యాయతకు.

అందరం 'టీ' తాగాము.

"కమీషనర్ సాబ్ మీ కేస్ గురించి ఫోన్ చేశారు. మీ నగలేమో ఇంతవరకూ దొరకలేదు. అంచేత మీరు 'సరే' నంటే ఓ పనిచేద్దాం!" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"ఏమిటది?"

"మీ యిద్దరికీ చెరో గొలుసూ యిస్తారు. ఒకటేమో ఒక తులం- ఇంకోటేమో ముప్పావు తులం- అవి తీసేసుకుని మీ నగలు మీకు దొరికాయని రాసిచ్చెయ్యండి"

మేము అదిరిపడ్డాం.

"అదేమిటి? అలా ఇంకొకరి నగలు తీసుకోవటం తప్పు కదూ?" అడిగాడు శాయిరామ్.

"తప్పూ లేదు ఏమీ లేదండీ! మీ నగలు దొరుకుతాయో లేదో నమ్మకం లేదు. ఒకవేళ దొరికితే మీ కంటే ఎక్కువ తులాల బంగారం పోయినవారికి అవిస్తాము- ఇలా అందరికీ కొంతవరకూ 'అడ్జస్ట్' అవుతుంది కదా- మీ ఇష్టమయితేనే- లేపోతే లేదు! కమీషనర్ సాబ్ చెప్పారు కాబట్టి ఈ ఆఫరయినా"

మాలో మేము అరగంట మాట్లాడుకుని చివరకు ఏదో నగ తీసుకోవటమే మంచిదని నిర్ణయించుకున్నాం. లేపోతే మొత్తం నష్టమే కదా!

అతను ఆ రెండు తెగిన గొలుసులూ తీసి మాకు చూపించాడు.

"జాగ్రత్తగా గుర్తు పెట్టుకోండి! రైల్వే మేజిస్ట్రేటు మిమ్మల్ని ఈ రెండూ చూపించి ఇవి మీవేనా అని అడిగానప్పుడు మావే అని చెప్పాలి- సరేనా?"

"సరే-"

వారం రోజుల తరువాత మేజిస్ట్రేట్ కోర్టుకెళ్ళి ఆ నగలు గుర్తించి తీసుకున్నాం.

ఇన్ స్పెక్టర్ బయట కనిపించాడు మళ్ళీ.

"కమీషనర్ సాబ్ తో - ఈ గొడవంతా చెప్పకండి! మీ నగలు మీకు దొరికాయని చెప్పండి! ఏమంటారు?"

"సరే!" అన్నాం చేసేదిలేక.

ఆ రోజు నుంచీ మా కాలనీలో ఎవరూ నగలతో ప్రయాణాలు చేయలేదు మళ్ళీ.

* * * * *

# ఎన్నికల తుఫాన్

మీకు గుర్తుందో, లేదో- మేము అదివరలో మా కాలనీ తరపున సినిమా తీయడానికని ఓ కమిటీ వేశాము. ఆ సినిమా కథను మాంచి మార్క్సిజం మసాలాతో నింపానంటూ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ స్క్రిప్ట్ మాకు సమర్పించాడు.

అందరం కూచుని మొదట పేజీ చదివామో లేదో "మిగతాది ఇప్పుడు కాదు" అన్నారు కమిటీ వాళ్ళందరూ ఖంగారుగా. మొదటి పేజీలోనే హీరో రక్షా తొక్కుతూ తొక్కుతూ నడిరోడ్డు మీద రిక్షా ఆపి రిక్షాలో కూర్చున్న వాడిని "విప్లవం వర్ధిల్లాలి" అంటూ కత్తితో పొడిచేస్తాడు.

"ఇదేమిటి? అది విప్లవం ఎలా అవుతుంది?" అని అడిగాను నేను ఆశ్చర్యంగా.

"మనిష్టం సార్! మనం ఏ రకంగా రాసినా దానిని మార్క్సిజం అనవచ్చు! ఎలాంటి సినిమా తీసినా 'ప్రజలు, రక్తం, విప్లవం' అనే మూడు డైలాగులు చివరల్లో చేర్చేస్తే అది మార్క్సిజం సినిమా అయిపోతుంది. అందాకా ఎందుకూ మీరు ఈ మధ్య టీవీలో వస్తోన్న నగ్జలైట్ల నాటకం చూళ్ళేదా?"

ఆ మాటతో అందరం సైలంటయిపోయాము. ఇంక అతనిని తప్పు పట్టటానికి ఏమాత్రం వీల్లేదనిపించింది. అలా అన్జెప్పి రిక్షావాడు రిక్షాలో కూర్చున్న వాడిని పొడిచెయ్యటం, కాఫీ హోటల్ సర్వర్, తింటున్న వాడిని గొడ్డలితో నరికెయ్యటం, సినిమా స్టూడియోల్లో లైట్ బాయ్ ప్రొడ్యూసర్ని మర్డర్ చేసేయడం- ఇవన్నీ విప్లవమే అంటే ఎలా వప్పుకోగలం? అంచేత అప్పటికి స్క్రిప్ట్ రీడింగ్ నిలిపివేశాము.

ఆ మర్నాడే హఠాత్తుగా బోసుబాబు మద్రాస్ నుంచి వచ్చాడు. అందరం అతని చుట్టూ మూగాము.

"మన కాలనీ సినిమాకి టైటిల్ రిజిష్టర్ చేసేశాను" అన్నాడతను.

"ఏం పేరు పెట్టావ్?" ఆతృతగా అడిగాడు శాయిరామ్.

"గుళ్ళో దేవుడు - ఊళ్ళో యముడు"

అందరం ఆశ్చర్యపోయాం.

"అదేమిటి? కథ తెలీదు కదా నీకు? ఆ టైటిల్ అసలు సరిపోదు దానికి!" అన్నాడు శాయిరామ్. బోసుబాబు ఘోల్లున నవ్వాడు.

"సినిమా ఫీల్డంటే ఏ మాత్రం తెలీని శుంఠలు చేసే కామెంట్ అది!" అన్నాడు మమ్మల్నందరినీ 'ఉసుళ్ళు' అనే పురుగుల్ని చూసినట్లు చూస్తూ.

'శుంఠలు' అన్నందుకు మాకు కోపం వచ్చింది గానీ.. ఆ విషయం బయటపడకుండా నవ్వేశాము. ఎందుకంటే మాకు సినిమా ఫీల్డులో విషయాలు నిజంగానే తెలీదు.

"సినిమా తీయాలంటే కథా, డైరెక్షనూ, యాక్టర్లు ముఖ్యం కాదు. అది ఓల్డ్ టెక్నిక్! ఇప్పుడు మొత్తం పిక్చర్స్ మనం పెట్టే టైటిల్ మీద ఆధారపడి వుంటుంది.

ఫీల్డంటే తెల్సినోళ్ళు ఫలానావాడు సినిమా ఎలా తీస్తున్నాడూ, ఏం తీస్తున్నాడూ అని కొశ్చెన్ చేయరు. ఏం టైటిల్ పెట్టాడని అడుగుతారు. డిస్ట్రిబ్యూటర్లూ, జిల్లా లోళ్ళు అందరూ ముహూర్తం పెట్టగానే ఏకగ్రీవంగా అడిగేదదే కొశ్చెన్! టైటిలేం రిజిష్టర్ చేశారు! అంతే!" అందరం నోళ్ళు వెళ్ళబెట్టి వాడి మాటలు వినసాగాము.

"ఇప్పుడు చూడండి! రేపు షూటింగ్ ముహూర్తం నాడు సినిమా పేరు "గుళ్ళోదేవుడు - ఊళ్ళో యముడు" అని పేపర్లలో వేయించామనుకోండి! అంతే తెల్లారేసరికల్లా మన కాలనీ కమిటీవాళ్ల చుట్టూ డిస్ట్రిబ్యూటర్లూ, జిల్లాల వాళ్ళూ తెగతిరుగుతారు- వాళ్ళ ఏరియాలకు కొనేసుకోడానికి!"

అందరం చాలా గర్వంగా నిజంగా ప్రొడ్యూసర్లలాగా ఫీలయ్యాం! మా చుట్టూ కొన్ని వందలమంది చేతులు చాచి మా గడ్డాలు పట్టుకుని ప్రాధేయపడుతున్న దృశ్యం కళ్ళముందు కనిపించింది.

"నాకు ప్రస్తుతం నాల్రోజులు మాత్రమే ఖాళీ ఉంది! కనుక మనందరం ఇవాళ రాత్రికే 'మచిలీపట్నం' వెళ్ళి లొకేషన్స్ సెలక్షన్ చేసుకురావాలి!" అన్నాడు బోసుబాబు. ప్రొడ్యూసర్ హోదాలో లొకేషన్స్ సెలక్షన్ చేసుకురావాలి!" అన్నాడు బోసుబాబు. ప్రొడ్యూసర్ హోదాలో లొకేషన్స్ సెలక్షన్ కెళ్ళడం చాలా ఆకర్షణీయంగా కనిపించింది మాకు.

ఆ రాత్రికే శాయిరామ్, నేనూ, రంగారెడ్డి జనార్ధన్, గోపాల్రావ్, పార్వతీదేవీ, రాజేశ్వరి, వెంకట్రావ్, యాదగిరి అందరం రైలుకి 'మచిలీపట్నం' బయల్దేరాం! అక్కడ సముద్ర తీరంలో లొకేషన్స్ చూడాలని బోసుబాబు ప్లాన్!

మచిలీపట్నంలో దిగగానే అందరం త్వరత్వరగా హోటల్ కెళ్ళి, స్నానాలో వగైరాలూ కానించి బస్ స్టాండ్ కి చేరుకున్నాం. ముందు మచిలీఫోర్ట్ కెళ్ళాం గానీ అక్కడి సీనరీ బోసుబాబుకి నచ్చలేదు. అక్కడి నుంచీ అందరం 'గోడదేవరపల్లి' కెళ్ళాం. బస్ దిగి ఊరుదాటి సముద్ర తీరం చేరుకునేసరికి మధ్యాహ్నం పన్నెండయిపోయింది.

చాలా బ్రహ్మాండంగా ఉంది సీనరీ అక్కడ. ఆకాశమంతా మబ్బులతో మూసుకుపోవడం వల్ల మరింత ఆహ్లాదంగా ఉంది.

తీరం వెంబడి సరుకు తోటలు సముద్రం వేపు నుంచీ చూస్తోంటే ఎంతో అందంగా కనబడుతున్నాయ్. "ఒండర్ ఫుల్" అన్నాడు బోసుబాబు. "అద్భుతమయిన లొకేషన్! ఇక్కడ హీరో హీరోయిన్స్ మీద సాంగ్స్ షూటింగ్స్ చేయవచ్చు.

జనార్ధన్ పొంగిపోయాడు. తను ఆ క్షణంలోనే హీరో అయిపోయి నట్లనిపించింది అతనికి.

"అవును! నేను ఇటువేపునుంచీ పరుగెత్తుకొస్తాను- హీరోయిన్ అటువేపు నుంచీ పరుగెత్తుకొస్తుంది. ఇద్దరం ఈ పడవ దగ్గర కలుసుకుని- ఎగురుతూ పడవ చుట్టూ తిరిగిపాడతాం!" అన్నాడు ఆనందంగా.

అందరం మరికొంత దూరం నడిచాము.

"ఇక్కడనుంచీ సముద్రంలో టైటిల్స్ వేస్తే ఎలా వుంటుంది?" అడిగాడు శాయిరామ్. బోస్ బాబు కెమేరాలో నుంచి చూస్తున్నట్టు వంగి ఓర కంటితో సముద్రం వేపు చూశాడు.

"సూపర్బ్! టైటిల్స్ ఆకాశం నుంచి కిందకుదిగి సముద్రంలో మునిగిపోతూండేట్లు లాగిస్తే భలే వెరయిటీగా ఉంటుంది!" అన్నాడతను.

పార్వతీదేవి భుజానికున్న ట్రాన్సిస్టర్ లో నుంచి వినిపిస్తోన్న సంగీతం రక్కున ఆగిపోయింది.

"ఒక ముఖ్య ప్రకతన! బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం వల్ల రానున్న 48 గంటలలో గంటకు 150 నుంచీ 180 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయ్. విస్తృతంగా వర్షాలు పడే సూచనలున్నాయ్. ఈ వాయుగుండం మచిలీపట్నం ప్రాంతంలో తీరాన్ని దాటవచ్చు! ఆ సమయంలో సముద్ర కెరటాలు పదినుంచీ పదిహేను మీటర్ల ఎత్తున ఎగసిపడతాయ్-"

పార్వతీదేవి మొఖం పాలిపోయింది. మిగతా అందరూ కూడా భయంగా సముద్రం వేపు చూశారు.

"మనకేం భయంలే! సాయంత్రానికి మచిలీపట్నం చేరుకుని బస్సెక్కామంటే తెల్లారేసరికి ఇళ్ళకు చేరుకోవచ్చు-" అన్నాడు శాయిరామ్ స్వగతంగా.

"అవునవును- కొంచెం త్వరగా మనం వెనక్కు తిరగడం మంచిది" అన్నాడు జనార్ధన్.

"మొత్తం పిక్చరంతా ఈ ఏరియాలోనే లాగించేద్దాం!" అన్నాడు బోసుబాబు తన లొకేషన్స్ కార్యక్రమం ముగిసినట్లు ప్రకటిస్తూ.

అప్పటికే టైము సాయంత్రం నాలుగయింది.

మేము ఊరివేపు నడుస్తూండగానే మబ్బులు మరింత మూసుకుపోయాయ్. వర్షపు చినుకులతో పాటు ఉండుండి గాలికూడా వీయసాగింది.

"ఇలాంటి సైక్లోన్ సమయాల్లో సముద్రపు తీరంలో ఉండడం చాలా డేంజర్-" అంది రాజేశ్వరి.

సాయంత్రం అయిదయిపోయింది. అందరం ఊళ్ళోని బస్ షెల్టర్ చేసుకునేసరికి అప్పటికే చీకటి పడిపోయినట్లుంది. బస్ స్టాప్ లో మేమూ, మాతోపాటు ఓ ముసలాయనా తప్పితే ఇంకెవరూ లేరు.

ఆరయిపోయినా బస్ జాడ లేకపోయేసరికి మాకు ఆందోళన మొదలయింది. మా ఆందోళన ముసలాయన గమనించినట్లున్నాడు.

"నేనూ మచిలీపట్నమే వెళ్ళాలి గానీ- బస్ లు వచ్చే నమ్మకం లేదిక!" అన్నాడు స్వగతంగా. అందరం ఉలిక్కిపడ్డాము.

"ఎందుకంటారు?" అడిగాడు శాయిరామ్ ఖంగారుగా.

"సైక్లోన్ వార్నింగ్ ఇచ్చారు కదా రేడియోలో? అదీ ఆర్టీసీ వాళ్ళు కూడా వింటారు కదా!"

అందరి గుండెల్లోనూ రాయిపడింది.

"ఇప్పుడు మనకేందారి?" అంది పార్వతీదేవి భయంగా.

"అదేదో సినిమాలో ఇలాగే కొంతమంది ఫ్రెండ్స్ ఇలాగే సీషోర్ వెళ్ళి అక్కడ చిక్కడిపోతే ఓ హంతకుడొచ్చి అమరినీ చంపేస్తాడు-" అంది రాజేశ్వరి.

"బస్ రాకపోతే ఏమిటి మన కర్తవ్యం? అడిగాడు జనార్ధన్ తన మేకప్ చెరగిపోయిందేమోనని పాకెట్ అద్దంలో చూచుకుంటూ.

"అంతగా బస్ రాకపోతే- ఇక్కడే ఎవరొకరింట్లో రాత్రి గడిపేద్దాం! పొద్దున్నే బస్ వచ్చేస్తుంది" అన్నాడు శాయిరామ్.

రంగారెడ్డి నవ్వాడు.

"అయిడియా బాగానే ఉంది గానీ ఈలోగా సముద్రం ఒక్క విసురు విసిరిందంటే ఆ ఇంటితో సహా అందరం లోపలికెళ్ళిపోతాం!" అన్నాడు. ఆ మాటతో అందరికీ కాళ్ళూ చేతులు వణకసాగినయ్.

"ఆ మధ్య ఉప్పెనవచ్చి రాత్రికిరాత్రి ఆ చుట్టు పక్కల కొన్ని ఊళ్ళు ఆనవాల్లేకుండా సముద్రంలో కెళ్ళిపోయాయ్" అన్నాడు జనార్ధన్.

"అవును! రేడియోలో సముద్రపు కెరటాలు మరీ పది నుంచి పదిహేను మీటర్ల ఎత్తువరకు వస్తాయని చెప్పారు!" అన్నాడు జనార్ధన్.

దూరంగా బస్ వస్తున్న శబ్దం వినిపించింది సన్నగా.

"అదిగో! బస్సు వెళ్తోంది!" ఆనందం పట్టలేక అంది పార్వతీదేవి. ఆ క్షణంలో ఆమెను చూసిన వారెవరయినా సరే- ఆమెకు ప్రపంచంలో అత్యంత ప్రీతికరమయిన వస్తువు 'బస్సు' అని అర్థం చేసుకుంటారు.

అందరం ఊపిరి బిగపట్టి రోడ్ వేపే చూడసాగాం! దూరంగా రెండు లైట్లు కనిపించాయ్ ముందు.

"బస్సే-బస్సే" ఎగిరి గంతేస్తూ అంది రాజేశ్వరి. తీరా దగ్గర కొచ్చాక చూస్తే అది పోలీస్ జీప్. స్పీకర్ లో తుఫాన్ హెచ్చరికలు చేయడానికొచ్చారు వాళ్ళు.

"తీర ప్రాంతాలలో ఉన్న గ్రామాలన్నీ సముద్ర కెరటాలకు మునిగిపోయే ప్రమాదం ఉంది గనుక వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము-" అంటూ అనౌన్స్ చేస్తున్నారు స్పీకర్ లో.

"ఒకవేళ-మనగోడు చెప్పుకుంటే ఆ జీప్ లో మనల్ని మచిలీపట్నం తీసుకెళ్తారేమో!" అంది పార్వతీదేవి ఆశగా.

ఆ మాట అనడం ఆలస్యం అందరం జీప్ దగ్గరకు పరుగెత్తాం. జీప్ చుట్టూ ఆ ఊరి జనం చేరి వివరాలు వాకబు చేస్తున్నారు.

రంగారెడ్డి చొరవగా ఇన్ స్పెక్టర్ దగ్గరకెళ్ళి మాకో సహాయం చేస్తారా?" అనడిగాడు. కానీ ఆ గాలి హోరులో, జనం గొడవలో అతనికి సరిగ్గా వినిపించినట్లు లేదు.

"అవును! తప్పకుండా మీ అందరికీ ప్రభుత్వం సహాయం చేస్తుంది" అన్నాడతను.

"అది కాదండీ! మమ్మల్ని దయచేసి మీ జీప్ లో మచిలీపట్నంలో వదులుతారా" అడిగాడు శాయిరామ్.

"అవును! మచిలీపట్నంలోనే సైక్లోన్ తీరాన్ని దాటవచ్చని అంటున్నారు" అన్నాడతను.

జీప్ వెళ్ళిపోయింది మరో ఊరికి.

మా గొడవంతా విన్న పెద్దమనిషి మా అందరినీ తమ ఇంటికి రమ్మని ఆహ్వానించాడు. అడిగిందే చాలని అందరం ఇంటికెళ్ళి ఓ గదిలో కూర్చున్నాం. అందరికీ భోజనాలు కూడా అతనే ఏర్పాటు చేశాడు.

"మా సినిమాలో మీకు తప్పక ఓ వేషం ఇస్తాను!" అన్నాడు బోసుబాబు భోజనం చేసి.

"సినిమాలంటే మాకసహ్యం!" అన్నాడా పెద్దమనిషి. అందరం దుప్పట్లు పరచుకొని పడుకున్నామన్న మాటే గానీ సముద్రం మరీ ఇంటిబయటే వున్నట్లు శబ్దాలు వస్తూంటే నిద్ర పట్టలేదు.

ఎలాగోలా నిద్రపడుతూన్న సమయంలో జనార్ధన్ కెవ్వున కేక వేశాడు. దాంతో అందరం అదిరిపోయి లేచి కూర్చున్నాం. జనార్ధన్ వణికి పోతున్నాడు.

"ఏమిటి? ఏం జరిగింది?" అడిగాన్నేను.

"కలొచ్చింది!"

"ఏం కల?"

"అదే మనమందరం ఉప్పెనలో కొట్టుకు పోతున్నామట! అంటే ఈ ఇంటితో సహా! అప్పుడు ఊపిరాడక గిలగిల కొట్టుకుంటూ నీళ్ళు తాగుతూంటే ఎదురుగ్గా టీవీలో హైద్రాబాద్ ప్రోగ్రామ్ కనిపించింది- అంతే ప్రాణాలు పోతున్నట్లనిపించింది. అరచేశాను..."

ఆ తర్వాత ఎవరికీ నిద్రపట్టలేదు. మరో గంట గడిచిందో లేదో పెద్ద శబ్దాలతో నాలుగయిదు బస్ లు వచ్చినట్లు వినిపించింది.

"అదిగో బస్ వచ్చింది?" అంది రాజేశ్వరి చటుక్కున లేచి కూర్చుంటూ.

"ఛట్! మనం బస్ కోసం ఎదుర్చూస్తున్నాం కాబట్టి ఊరికే అలా అనిపిస్తుంది అంతే!" అన్నాడు శాయిరామ్.

మరుక్షణంలో ఎవరో తలుపులు గట్టిగా బాదసాగారు.

"నేను చెప్పలే! అర్ధరాత్రి హంతకులొస్తారని? వచ్చేశారు!" అందామె.

"ష్!" ఆమెవంక చూసి వారించాడు రంగారెడ్డి.

ఇంటాయన తలుపు తెరిచేసరికి ఎదురుగ్గా పోలీసులు నిలబడి వున్నారు.

"త్వరగా తయారయి, మీ విలువయిన వస్తువులు మాత్రం తీసుకుని బయటకు రండి! ఈ ఊళ్ళన్నీ ఖాళీ చేయించమని ప్రభుత్వ తాఖీదు లొచ్చాయ్-" అన్నాడొకాయన.

"అమ్మయ్యా ఇది మొదటిసారి! ఇలా దేవుడు పోలీసుల దూరంలో వచ్చి మనల్ని రక్షించడం!" అంది పార్వతీదేవి.

"వీళ్ళు నిజం పోలీసులేనంటారా?" అనుమానంగా అంది రాజేశ్వరి.

"ఏమిటా పిచ్చి అనుమానం?" కోపడ్డాడు రంగారెడ్డి.

"అదేదో ఇంగ్లీష్ పిక్చర్లో హంతకులు పోలీసుల డ్రస్ లో వచ్చి అందరినీ జీప్ లో తీసుకెళ్లి అడవుల్లో రేప్ లు- మర్డర్లూ చేసేశారు" అందామె.

"ష్" అన్నాడు జనార్ధన్. "అలా మాట్లాడితే మననిక్కడే వదిలేస్తారు-"

ఆ మాట చాల పవర్ ఫుల్ గా పనిచేసింది. ఆ తరువాత ఆమె ఇంకేమీ మాట్లాడలేదు.

అందరం లారీలో ఎక్కి కూర్చున్నాం. గంట ప్రయాణం తర్వాత రిలీఫ్ కాంప్ చేరుకున్నాం. పెద్ద స్కూల్ బిల్డింగ్ అది! చాలా పెట్రోమాక్సు లైట్లు వెలుగుతున్నాయి. మేమంతా ఓ గదిలో కూర్చున్నాము. తెల్లారుజామున మూడయిందప్పటికి. నిద్ర రాకుండా ఉంటానికి ఏదయినా జానపద గీతం పాడతానన్నాడు యాదగిరి. "రోజూ ఆ చెత్తంతా రేడియోలో వినలేక చస్తుంటే ఈ సైక్లోన్ లో కూడా ఏమిటయ్యా ఆ పరాసికాలు?" అంటూ కోప్పడ్డాడో పెద్దమనిషి.

"అయితే సినిమా పాటేదైనా పాడతాను!" అన్నాడతను ఉత్సాహంగా. ఓ లావుపాటాయన ఆ మాట వింటూనే కోపంగా లేచి నిలబడ్డాడు. "ఏంటీ? తెలుగు సినిమా పాట పాడతావా? ఆడాళ్ళు, పిల్లలు ఉన్నచోట ఆ బూతు పాటలు పాడతావా? పళ్ళు రాలగొడతాను?" అన్నాడు, అందుకు సంసిద్ధమవుతూ. దాంతో యాదగిరి సైలెంటయిపోయాడు.

రంగారెడ్డి, జనార్ధనూ ఈలోగా కాంప్ తాలూకు ప్రభుత్వాధికారులతో మాట్లాడి వచ్చారు. అప్పుడిక మమ్మల్ని మచిలీపట్నం తీసికెళ్ళే ప్రసక్తి లేదని చెప్పారట వాళ్ళు. ఎలాగోలా తెల్లారేవరకు గడుపుతే పొద్దున్నే ఏదొక బస్ లో వెళ్ళి పోవచ్చనుకుని ఊరుకున్నాము.

తెల్లారుజామున ఎప్పుడో నిద్రపట్టేసింది. తిరిగి "ఫలహారాలు" అన్న కేకలువిని మెలకువ వచ్చేసింది. అప్పటికే బాగా ఎండెక్కిపోయింది.

బయటికొచ్చి చూసేసరికి ఓ లారీ చుట్టూ రిలీఫ్ కాంప్ లో జనం మూగిపోయి ఉన్నారు. లారీలో ఇడ్లీలు, కాఫీ సప్లయ్ చేస్తున్నారు.

"త్వరగా రడీ అవండి. మనం బస్ స్టాండ్ కెళ్ళి మచిలీపట్నం వెళ్ళిపోదాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం అరగంటలో రడీ అయి బయటకు వెళ్ళబోతూంటే గేటు దగ్గర ఉన్నవాళ్ళు అడ్డగించారు.

"ఎక్కడికి?" అడిగారు.

"మాడి హైద్రాబాదు. మేము హైద్రాబాదు వెళ్ళిపోవాలి!" అన్నాడు శాయిరామ్.

"ఎవరూ ఎక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు!" అన్నారు వాళ్లు.

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎందుకేమిటయ్యా! సైక్లోన్ రిలీఫ్ కాంప్ కి మిమ్మల్ని ఎందుకు తీసుకొచ్చామనుకున్నారు? వెంటనే వదిలేయటానికా?" వెటకారంతో అడిగాడు.

"కానీ సైక్లోన్ రాలేదుగా? ఎండ చూడండి! కాలిపోతోందప్పుడే!"

రాకపోతే మేమేం చెయ్యాలి!"

"మమ్మల్ని వదిలి వెయ్యాలి" అన్నాడు శాయిరామ్.

"అదేంకుదరదండి? అఫీషియల్ గా 'సైక్లోన్ రద్దయిపోయింది' అని మాకు పై నుంచి టెలిగ్రాం గానీ మెసేజ్ గానీ రావాలి! అంతవరకు ఎవ్వరూ కదలడానికి వీల్లేదు" అన్నాడొకతను.

"కానీ వెళ్ళేవాళ్ళను వెళ్ళనిస్తే మీకే ఈ తలనొప్పంతా తగ్గుతుంది కదా?"

అతను నవ్వాడు.

"భలే వారే సార్ మీరు! మా ఉద్యోగాలు తిన్నగా ఉండటం మీకిష్టం లేదా ఏమిటి? ఎలక్షన్ల ముందు సైక్లోన్ లు వస్తే దానిని ఎలక్షన్ కోసం వాడుకోవటం మామూలేగా! అందుకే రిలీఫ్ కాంప్ లో ఉన్నవారిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండమనీ అన్ని సౌకర్యాలు కలుగజేయమనీ పైన్నుంచి ఆర్డర్స్ వచ్చాయ్. మీ అందరినీ ఇప్పుడు వదిలివేస్తే మాకు మాటరాదూ?"

మేమంతా మొఖమొఖాలు చూచుకున్నాం. సరిగ్గా అప్పుడే టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్ లో మళ్ళీ ప్రత్యేక సైక్లోన్ బులెటిన్ వెలువడింది.

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం నేడు ఉత్తరదిశగా ప్రయాణించి క్షీణించి పోయింది. అందువల్ల కొద్దిపాటి వర్షాలు కోస్తాతీరంలో పడే సూచనలున్నాయ్! అంతకుమించి ఎలాంటి ప్రమాదం లేదని మెటీరియోలజీ డిపార్ట్ మెంటువారు తెలియజేస్తున్నారు"

వెంటనే రంగారెడ్డి ముందుకొచ్చాడు.

"ఇంకేం కావాలయ్యా మీకు! సైక్లోన్ లేదంటున్నారుగా?" వాళ్ళు ఏమీ చెప్పలేక "పదండి! మా ఆఫీసర్లతో మాట్లాడుదురు గాని!" అన్నారు.

నేనూ, రంగారెడ్డి, శాయిరామ్, జనార్ధన్ అతనితోపాటు వాళ్ళ ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాము.

అంతావిన్నాక అతను చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడు.

"వీల్లేదండీ! రిలీఫ్ కాంప్ లో నుంచి ఎవ్వరినీ బయటకు పోకుండా చూడమని ఆదేశాలొచ్చాయ్, ఇంతకుముందే."

"కానీ సైక్లోన్ క్షీణించి పోయిందని ఇందాక రేడియోలో చెప్పారు కదా?" అడిగాడు శాయిరామ్.

"అలా చెప్పినందుకు రేడియోస్టేషన్ అధికారుల మీద చర్య తీసుకుంటున్నారు"

"అంటే వాళ్ళు చెప్పింది తప్పా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇన్ ఫర్మేషన్ తప్పుకాదు గానీ...ఓ పక్క సైక్లోన్ బాధితులను మన ప్రధానమంత్రిగారు పరామర్శించటానికి వస్తున్నారని తెలిసినప్పుడు - సైక్లోన్ రాదని చెప్పటం తప్పుకాదూ?"

అందరం ఆశ్చర్యపోయాము.

"ఏమిటి ఇక్కడికి ప్రధానమంత్రి గారొస్తున్నారా?"

"అవును"

"ఎందుకు?"

"చెప్పాను గదయ్యా! సైక్లోన్ బాధితులను పరామర్శించడానికి"

"కానీ సైక్లోన్ రాలేదుగా?"

"జిల్లూరు అనేచోట బాగా వర్షాలు పడ్డాయి కదా!"

"అలాంటప్పుడు అక్కడే పర్యటించక ఇక్కడకు రావడం ఎందుకు?"

"అదంతా వాళ్ళిష్టం బాబూ! మనమెవ్వరం కాదంటానికి!" సమాధానపరుస్తూ అన్నాడాయన.

హఠాత్తుగా పైన రెండు హెలికాప్టర్ లు రావటం కనిపించింది మాకు. రిలీఫ్ కాంప్ లో ఉన్న వారందరూ ఎగబడుతూ బయటికొచ్చి నిలబడ్డారు.

మరుక్షణంలో హెలికాప్టర్స్ నుంచి పెద్ద పెద్ద ఆహార పదార్థాల పాకెట్స్ కింద పడేశారు. అవి సరాసరి కాంపౌండ్ లో కొచ్చి పడ్డాయ్. పాకెట్స్ తగిలి కొంతమంది గాయపడ్డారు.

అందరూ హాహాకారాలు చేస్తూ గాయపడ్డవారిని అంబులెన్స్ లో ఎక్కించారు. వెంటనే అంబులెన్స్ వైద్య చికిత్సా శిబిరానికి బయలుదేరింది.

కొంతమంది కోపంగా మళ్ళీ ఆ అధికారుల దగ్గరకు నడిచారు.

"ఏమిటయ్యా ఇది! అంతపైనుంచి ఆ ఫుడ్ పాకెట్స్ ఎందుకు విసిరేసినట్లు?" అడిగాడు శాయిరామ్ అప్పటికప్పుడే ఆ గుంపుకు నాయకత్వం వహిస్తూ.

"ఆహారం రిలీఫ్ కాంప్ కి ఆ విధంగానే సప్లయి చేయమని ప్రధానమంత్రి ఆదేశమయ్యా!" విసుగ్గా అన్నాడు అధికారి.

"హెలికాప్టర్ ద్వారా ఎందుకు? మేమేమయినా నీళ్ళల్లో మునిగి ఉన్నామా? లేక ఈ ప్రాంతం కటాఫ్ అయిపోయిందా?"

"చూడండి బాబూ! సివియర్ సైక్లోన్ వస్తుందనీ, మొత్తం కోస్తాప్రాంతమమతా మునిగిపోతుందనీ, ఎంతో ఆశతో కేంద్రం ఈ ఏర్పాట్లన్నీ చేసింది! ఈపాడు సైక్లోనేమో ఆశించిన ప్రకారం వచ్చి చావలేదు- ఎవరు మాత్రం ఈ పరిస్థితుల్లో ఏం చేస్తారు? చేసిన ఏర్పాట్లు, కార్యక్రమాలు ఈ బోడిసైక్లోన్ రాలేదన్జెప్పి కాన్సిల్ చేసేసుకోలేరు కదా!"

అప్పుడె రెండు లారీల్లో రిలీఫ్ కాంప్ లకు భోజనాలు వచ్చాయ్.

"ఆ త్వరగా భోజనాలకు రండి అందరూ! 'క్యూ' కట్టండి!" అరచారు లారీలో ఉన్నవాళ్ళు.

"మళ్ళీ ఇదేమిటి? ఇప్పుడేగా పైన్నుంచి ఆహారం విసిరేశారు?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అది కేంద్రప్రభుత్వం సప్లయ్- ఇదేమో రాష్ట్రప్రభుత్వం సప్లయ్- ఆ మాత్రం తెలీదా" అన్నాడతను చిరాగ్గా.

"అదేమిటి- రెండు-రెండు భోజనాలెందుకు?" మరింత విస్తుపోతూ అడిగాడు రెడ్డి.

జనంలోనుంచి ఓ పెద్దమనిషి వచ్చి రంగారెడ్డి భుజం తట్టాడు చిరునవ్వుతో.

"ఆ మాత్రం తెలీదటయ్యా? కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వేరు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వేరు. దగ్గర్లోనేమో ఎలక్షన్లున్నాయ్! అంచేత దేవుడి దయవల్ల వచ్చిన ఈ సైక్లోన్ ని ఎవరికి వాళ్ళే ఉపయోగించుకుని తమతమ ఓటుబాంక్ పెంచుకోవాలను కోవడంలో కొత్తేముంది?"

"ఏడ్చినట్లుంది!" అంది పార్వతీదేవి.

"మేము రెండు భోజనాలెలా చేస్తాం? మావల్ల కాదు".

"కాదంటే పోలీసులు ఊరుకోరు- లాఠీలతో కొట్టి మరీ తినిపిస్తారు" ఎవరో అన్నారు.

"ఓ ప్రక్క మాకు వద్దని చెప్తున్నా ఈ బలవంతం ఏమిటి?"

అందరం చేసేదిలేక రెండు భోజనాలు కానిచ్చి ఎప్పుడు మమ్మల్ని వదుల్తారా అని ఎదుర్చూస్తూ కూర్చున్నాం.

సాయంత్రం అయిపోయింది కానీ పరిస్థితిలో మార్పులేదు. మళ్ళీ అందరం కలిసి అధికారుల దగ్గర కెళ్ళాం.

"ఏమిటండీ అది? అటు సైక్లోనూ లేదు, ఇటు ప్రధానమంత్రీ రారు! ఇంకెంత కాలమిలా? అవతల మాకు ఆఫీస్లున్నాయ్- సంసారాలున్నాయ్" అరిచాడు శాయిరామ్.

"మాకు మాత్రం లేవేంటయ్యా! కొంచెం ఓర్చుకోండి. తొందర పడతారేం? సైక్లోన్ అసలు ఎందుకు ఫెయిలయిందో విచారించడానికి ఓ కమిటీని వేశారు! ఇలా ఏర్పాట్లన్నీ చేసుకున్నాక- అది రాకపోతే ఎవరికయినా ఎంత వళ్ళు మండిపోతుంది? అదీగాక ఎలక్షన్లో విజయావకాశాలన్నీ కేవలం సైక్లోన్ లో కేంద్ర ప్రభుత్వం చేసే రిలీఫ్ ఏర్పాట్ల మీదే ఆధారపడి ఉంటాయ్. అందరికీ తిండీ, బట్ట, ఇళ్ళు కట్టించి ఇవ్వటం - అన్నదానాలు చేయటం ఇవన్నీ చేస్తే మరి ఎలక్షన్లకు ఎంత లాభం?"

గంటసేపు వాదించినా ఉపయోగం కనిపించకపోయేసరికి అందరం వెనక్కు తిరిగి వచ్చేశాం. ఆ రాత్రి కూడా అక్కడే ఉండక తప్పలేదు. మర్నాడు ఉదయం రేడియోలో వచ్చిన ప్రకటన మరింత తమాషాగా కనిపించింది మాకు.

"బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం రాత్రి తీరాన్ని తాకింది. జిల్లూరుర ప్రాంతం జలదిగ్బంధనం అయిపోయింది. అయితే వాయుగుండం అలాగే ఉంది. అంచేత ఏ క్షణాన్నయినా అది విజృంభించి విస్తృతంగా వర్షాలు పడి సముద్రపు తీర ప్రాంతాలన్నీ మునిగిపోయే సూచనలున్నాయ్!"

మాకా ప్రకటన ఏమీ అర్థంకాలేదు. ఒకే సైక్లోన్ ఇలా వాయిదాల పద్ధతిలో తాకటమేమిటా అనేదే ఆశ్చర్యంగా ఉంది.

"ఆ ఈ రోజుల్లో అన్నీ వాయిదాల పద్ధతి వ్యవహారాలేగా? కేంద్రం ప్రభుత్వోద్యోగులకు డి.ఏ. వాయిదాల పద్ధతిలోనే ఇస్తున్నారు- సైక్లోన్ కి కేంద్రం చేసే సహాయం వాయిదాల పద్దతే - అంచేత సైక్లోన్లు కూడా అలాగే ఏడుస్తున్నాయేమో?"

అందరం మళ్ళీ రెండు భోజనాలు చేసి నిద్ర పోతూండగా హఠాత్తుగా హడావుడి మొదలయింది.

స్పీకర్లో ఓ జీప్ జోరుగా అరుస్తూ వచ్చింది.

"సైక్లోన్ బాధితులారా! మిమ్మల్ని స్వయంగా కలుసుకొని మీ స్థితిగతులు తెల్సుకుని మీకు సహాయం చేయడానికి ప్రధానమంత్రి గారొస్తున్నారు. కనుక సహనంతో వేచియుండాల్సిందిగా ప్రార్థిస్తున్నాం"

"అమ్మయ్య! ఇంకా కొద్దిసేపట్లో మనకు చెర వదలి పోతుందన్న మాట" అన్నాడు రంగారెడ్డి ఆనందంగా.

సాయంత్రం అయిదవుతూండగా ప్రధానమంత్రి గారొచ్చారు. అందరికీ నమస్కారం చేస్తూ పరామర్శిస్తూ అన్ని సదుపాయాలు లభిస్తోందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడే ఆయన పార్టీ తాలూకా కార్యకర్తలు ఓ మీటింగ్ కూడా ఏర్పాటు చేశారు. తమ పార్టీ ధ్యేయం కేవలం తెలుగు ప్రజల్ని సైక్లోన్ నుంచి రక్షించటమేనని పేర్కొన్నారు. ప్రధానమంత్రి స్వయంగా మాట్లాడుతూ "తెలుగు ప్రజలకు ఎప్పుడూ వచ్చే ఈ సైక్లోన్ బెడద చూస్తుంటే మా గుండె తరుక్కుపోతోంది. అందుకే ఈసారి ఎలాంటి సహాయం కావాలన్నా ఎంత సహాయం కావాలన్నా చేయడానికి సంసిద్ధంగా ఉన్నాను" అంటూ తన ఆవేదన తెలియపరచారు. మమ్మల్ని చప్పట్లు కొట్టమని పోలీసులు బెదిరించారు.

"నీయవ్వ - అంతా నాటకం! ఇంతకు ముందొచ్చిన సైక్లోన్ కి ఏ ప్రధానమంత్రీ రాలేదు! మరి ఈరాని సైక్లోన్ కి ఏమిటో ఈ హడావిడి?" అన్నాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

"ఎలక్షన్లు బాబో- ఎలక్షన్లు" అన్నాడొకతను. కొంతమంది నవ్వారు గానీ ఇంకొంతమంది రంగారెడ్డి వంక కోపంగా చూసారు.

"అవునవును! ఎలక్షన్ల మహత్యం కాకపోతే అదివరకు సైక్లోన్స్ కేమో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొడవ చేసినా పట్టించుకోకుండా, సైక్లోన్ వచ్చిన ఆరునెలలకు సెంట్రల్ టీమ్ రావటం, వాళ్ళు మరో నెలరోజులు కూర్చుని కాలిక్యులేటర్స్ తో లెక్కలు కట్టి రిపోర్ట్ సబ్మిట్ చేయటం- అప్పుడు ఆర్థిక సహాయం అందజేయటం జరిగింది. ఇప్పుడేమో తెలుగు ప్రజల బాధలు చూసి గుండె తరుక్కుపోవడం, సైక్లోన్ రాకముందే సహాయాలు అందజేయటం, సగం సైక్లోన్స్ కే ప్రాంతాల్ని పర్యటించేయడం ఏడు కోట్లు కాష్ డౌన్ చేసేయడం-" అంటూ శాయిరామ్ అరిచేసరికి అందరూ ఘొల్లున వన్నారు. ఈ హడావుడి చొసి మరికొంతమంది రంగారెడ్డి చుట్టూ చేరారు. వాళ్ళ ప్రోత్సాహం చూచి రంగారెడ్డి మరింత విజృంభించాడు.

"సోదరీ సోదరీమణులారా! చూడండి ఈ నాటకం! గమనించండి ఈ ఘోరం. పిల్లికి చెలగాటం- ఎలుక్కి ప్రాణసంకటం సామెత విన్నారు కదా మీరు! ఇక్కడ అదే జరుగుతోంది..." అంటూ అతను స్పీచ్ మొదలుపెట్టాడు.

అక్కడి అధికారులు, పోలీసులు పరిస్థితిని గమనించారు. ఇంకాసేపుంటే రంగారెడ్డికి పెద్ద ఫాలోయింగ్ రావటం, ఆ తరువాత ప్రజలు రంగారెడ్డి జిందాబాద్ అని అరవటం- ఆ తర్వాత ఎలక్షన్లో రంగారెడ్డి నిలబడి గెలవటం ఖాయమని అనుమానించినట్లున్నారు.

వెంటనే రంగారెడ్డిని పక్కకు పిలిచి "మిమ్మల్ని వదిలేస్తున్నాం- మీరు వెళ్ళిపోవచ్చు-" అన్నారు.

ఆ మాట అన్నదే చాలని అందరం 'బ్రతుకు జీవుడా' అని రిలీఫ్ కాంప్ నుంచి బయల్దేరాము.

కొంతదూరం నడిచామో లేదో హఠాత్తుగా కేకలు వినిపించనియ్. పోలీసులు, ఇతర అధికారులు పరుగుతో వచ్చారు.

"ఎవ్వరూ కాంప్ వదలి వెళ్ళకండి!" అని అరచాడొకతను.

"మళ్లీ ఏమయింది" అడిగాడు రంగారెడ్డి కోపంగా. గవర్నమెంట్ వాళ్ళు రిలీఫ్ కాంప్స్ ని వీడియో ఫిలిమ్ తీస్తున్నారు. ఫిలిమ్ తీసి టీవీన్యూస్ లో చూపిస్తారు! అంతవరకూ అందరూ ఇక్కడే ఉండాలి" అన్నాడు. ఆమాట అనడమే ఆలస్యం అందరూ క్రాఫ్ లు దువ్వు కోవటం, బట్టలు మార్చుకోవడం, ఆడాళ్ళు మేకప్ చేసుకోవటం ప్రారంభమయింది. ఎలాగైతేనేం మరో రెండు గంటలకు వీడియో షూటింగ్ ముగిసింది. "ఏదేమయినాసరే మన సినిమా షూటింగ్ ఈ ఏరియాలో పెట్టటానికి వీల్లేదు!" అన్నాడు జనార్ధన్.

"అవును! వేరే లొకేషన్స్ చూద్దాం" అన్నాడు బోసుబాబు ఉత్సాహంగా.

అందరం బయటకు వస్తుంటే ఓ పోలీస్ జీప్ వేగంగా వచ్చింది.

"సోదర సోదరీమణులారా! ఎవ్వరూ కాంప్ వదలడానికి వీల్లేదు. ఎందుకంటే మన ప్రితమ ముఖ్యమంత్రి గారు సైక్లోన్ బాధితులందరినీ స్వయంగా పరామర్శించడానికి ఇక్కడికొస్తున్నారు. అంతవరకూ దయచేసి వేచియుండవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము"

ఆ మాటతో మాకు వళ్ళు మండిపోయింది.

"ఏమిటయ్యా వేచి వుండేది? ఇక్కడసలు సైక్లోనూ లేదు, గాడిద గుడ్డూ లేదు. ఒక అరగంట గాలీ, గంట వర్షానికి ఇంత హడావుడేమిటి?" అన్నాడు రంగారెడ్డి విరుచుకుపడుతూ. రంగారెడ్డిని చూసి ఆ ఊరి వాళ్ళంతా కూడా ఎదురు తిరిగారు.

"అవును! మా అందరికీ ఇళ్ళూ, పొలాలూ, ఇంకా మిగతా పనులూ ఏమీ లేవనుకున్నారా? మేం ఉండం! ఏం చేస్కుంటారో చేసుకోండి!" అన్నారు.

అధికారులకు ఏం చేయాలో తోచలేదు.

"అలా సడెన్ గా వెళ్ళిపోతామంతే ఎలా కుదుర్తుందయ్యా! మీ కోసం ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా ఆహార పొట్లాలు హెలికాప్టర్ల ద్వారా కింద పడేయడానికి రెండు హెలికాప్టర్లను కాంట్రాక్ట్ తీసుకున్నారు. ఆహారపొట్లాల సప్లయ్ కోసం ఇంకో కాంట్రాక్టర్ ని రెండు కోట్ల రూపాయలకు ఏర్పాటు చేశారు. ఆ కాంట్రాక్ట్ లు సైక్లోన్ రాలేదని చెప్పి కాన్సిల్ చేస్తే వాళ్ళూరుకుంటారా? కొంచెం మన ముఖ్యమంత్రి పరిస్థితి కూడా అర్థం చేసుకోవాలి-"

అందరూ గొడవ పడుతూండగానే మా పైన్నుంచి రెండు హెలికాప్టర్ లు రెండు రౌండ్లు కొట్టి అరడజను పెద్ద సైజు పులిహోర పొట్లాలు పడేసి వెళ్ళిపోయినయ్. అవి నెత్తిమీద పడి పదిమందికి నెత్తి పగిలింది.

జనమంతా వాటి కోసం ఎగబడి కుమ్ముకోవడంతో - త్రొక్కిసలాట జరిగింది. ఆ త్రొక్కిసలాటలో రెండొందల మందికి గాయాలు తగలటం - వారిలో పదిమంది పరిస్థితి విషమంగా తయారవటంతో వాళ్ళందరినీ లారీల్లో తీసుకుని దగ్గరలో వున్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళబోయారు.

తమను ప్రభుత్వాసుపత్రిలో చేరుస్తున్నారన్న విషయం తెలీగానే పరిస్థితి విషమంగా వున్నవారిలో ఎనిమిదిమంది లారీ దూకి చెట్లల్లోకి పారిపోయారు. మిగతా ఇద్దరూ ఆ షాక్ కి తట్టుకోలేక ప్రాణాలు వదిలేశారు.

దాంతో జనమంతా ఎదురుతిరిగారు.

"ఏమిటయ్యా ఇది? పొద్దున్నేమో రెండుసార్లు భోజనం చేయించారు. ఇప్పుడు ఒక్కటి కూడా దిక్కులేదు- మాదార్ని మమ్మల్ని పోనీండి!"

"అరె! పోటానికి వీల్లేదని చెప్తుంటే మీక్కాదూ? ముఖ్యమంత్రి ఎంత రాత్రయినా ఇక్కడికొచ్చి మిమ్మల్ని కలుసుకుని మాట్లాడేదాక ఒక్కరు కూడా కాంప్ వదలడానికి వీల్లేదు."

"మేం ఉండమయ్యా- ఏం చేస్తారో చేస్కోండి" అంటూ రంగారెడ్డి శాయిరామ్ ముందుకి కదిలేసరికి ఇంకొంతమంది వారిని వెంబడించారు.

సడెన్ గా కలెక్టర్ ఎస్పీకి ఏదో చెప్పడంతో పోలీసులు హఠాత్తుగా వెళ్తున్నవాళ్ళ మీద లాఠీ ఛార్జ్ మొదలుపెట్టారు.

"ఓర్నాయనో- కాళ్ళ మీద తగిలిందిరో- దేవుడో" అని అరుస్తూ అందరూ దెబ్బలు తిని కుంటుకుంటూ మళ్ళీ గవర్నమెంట్ కాంప్ లో కొచ్చారు.

రాత్రి పన్నెండింటికి ముఖ్యమంత్రి కారూ దాని వెనుక పాతిక ఏ.సి. కార్లూ వచ్చాయ్.

వెంటనే ముఖ్యమంత్రి కారు టాప్ మీద కెక్కాడు.

"సోదరులారా! సైక్లోన్ బాధితులను కూడా కేంద్ర ప్రభుత్వం 'రాజకీయం' చేయడానికి ప్రయత్నిస్తోంది. మీకు అన్నివిధాలా సాయం అందించే హక్కు కేవలం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. అయినా గానీ కేంద్రం జోక్యం చేసుకుని మాకు ఆటంకాలు కల్పిస్తోంది. మీరంతా మరో నాలుగురోజులు మా రిలీఫ్ కాంప్ లోనే సుఖంగా ఉండటానికి అన్ని ఏర్పాట్లూ చేసేశాం! కనుక ఎవ్వరూ కాంప్ వదలకండి!"

"మాకు రాత్రి తిండి దొరకలేదు" ఎవరో అరచారు వెనుకనుంచి.

ముఖ్యమంత్రి కోపంగా కలెక్టర్ వేపు తిరిగాడు.

"కంట్రాక్టర్ రెండువేలు ఆహార పొట్లాలు హెలికాప్టర్ ద్వారా వదిలినట్లు చెప్పాడు సార్" అన్నాడు కలెక్టర్.

"అవున్సార్- కావాలంటే చూడండి! బిల్లు కూడా నా దగ్గరుంది" అన్నాడు కంట్రాక్టర్.

"మా కలెక్టర్ గారు, కంట్రాక్టర్ గారు రెండువేల పైచిలుకు ఆహారపొట్లాలు వేశారని చెప్తున్నారు.

అయినా ఎవరకీ అవి అందలేదని అంటున్నారంటే - ఇదంతా కేంద్ర ప్రభుత్వ కుట్ర అని మీకు సవినయంగా మనవి చేస్తున్నాను. మా పార్టీ, మా ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజల క్షేమమే ధ్యేయంగా పని చేస్తాయని కూడా మీకు మనవి చేస్తున్నాను- జైహింద్-"

అందరూ వెళ్ళిపోయారు.

"ఇప్పటికయినా మేము మా ఇళ్ళకు వెళ్ళిపోవచ్చా?" కుంటుతూ ముందుకొచ్చి అడిగాడు రంగారెడ్డి.

"ఇప్పుడు వెళ్ళండయ్యా! ఎవరొద్దన్నారు?" అన్నాడు ఓ అధికారి.

"ఇంత రాత్రివేళ ఎలా వెళ్తాం?" అడిగింది పార్వతీదేవి భయంగా.

అప్పుడే ఆమె చేతిలోని ట్రాన్సిష్టర్ లో మ్యూజిక్ ఆగిపోయింది.

"ఆకాశవాణి- ఆంధ్రప్రదేశ్ లో సంభవించిన భయంకరమయిన సైక్లోన్ వల్ల నిరాశ్రయులయిన రెండు లక్షల మందిని భారత ప్రధాని నేడు స్వయంగా కలుసుకున్నారు. ఇప్పటికేవారి పునరావాస కార్యక్రమాల కోసం ఇరవై కోట్ల రూపాయలు ఖర్చు చేయటం జరిగినా, అది చాలని దృష్ట్యా, మరో నలభై కోట్లు తమ సహాయ నిధి నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. సైక్లోన్ బాధితులను ఆదుకోవటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ప్రధాని ఆవేదన వెలిబుచ్చారు. రేపు ఉదయమే ప్రత్యేక కేంద్ర బృందం సైక్లోన్ బాధిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని తాజాగా సమీక్షించాలని ప్రధాని ఆదేశాలిచ్చారు-" అందరం ఉలిక్కిపడ్డాం.

"ఆలస్యం చేస్తే మళ్ళీ ఆ కమిటీ వచ్చేవరకూ మనల్ని కాంప్ లో బంధిస్తారు- త్వరగా పదండి! కాలినడకన ఎంతదూరం వీలయితే అంతదూరం పారిపోదాం-" అన్నాడు జనార్ధన్.

అందరం చీకట్లోనే ముందుకి కదిలాం.

"అవునూ! కేంద్రం ఈ ఒక్క రోజులోనే ఇరవై కోట్లు ఖర్చు పెట్టిందంటున్నారు- రాష్ట్ర ప్రభుత్వమేమో పదికోట్లు ఖర్చుపెట్టిందంటున్నారు- ఆ డబ్బంతా ఎక్కడ ఎలా ఖర్చయి ఉంటుంది?" అడిగాడు శాయిరామ్.

ఆ ప్రశ్నకు ఎవరూ జవాబు ఇవ్వలేదు.

అందరూ ఆ కాంప్ కి వీలయినంత దూరం వెళ్ళిపోవాలన్న తొందర్లో ఉన్నారు.

* * * * *

## మనిషికో మతిమరుపు మహిలో సుమతీ!

.... అని అన్నారెవరో! ఎవరా అని చాలాసేపు ఆలోచించాను గానీ ఎంత ఆలోచించినా గుర్తురాలేదు, మర్చిపోయాను.

ఇంతకూ అసలీటాపిక్ ఎందుకొచ్చిందంటే నాకీ మధ్య మతిమరపు ఎక్కువయిపోతోందని మా భవానీశంకరం వార్నింగిచ్చాడు...

ఏ విషయంలో వాడికా అభిప్రాయం ఏర్పడిందో గాని మొత్తానికి వాడు నా మతిమరుపుకి విక్టిమ్ అయి ఉంటాడని మాత్రం ఊహించాను. ఆ రోజు నుంచి ప్రతి విషయం చాలా జాగ్రత్తగా అబ్జర్వ్ చేయడం ప్రారంభించాను. ఈ అబ్జర్వేషన్ లోనే మతిమరుపనేది ఒక్కోమనిషికి ఒక్కో సబ్జెక్ట్ లోనే ఏర్పడుతుందని అనుమానం కలిగింది. అంటే ఫలానా మనిషి ఫలానా విషయంలో మహా మతిమరుపుగా ఉంటాడు సుమా అనే కామెంట్ చేయాలిగానీ, "ఫలానావాడు వట్టి మతిమరుపు వెధవాయ్" అని ఎప్పుడూ జనరల్ స్టేట్ మెంటియ్యగూడదు.

నేనిలాంటి నిర్ధారణకు రావడానికి పరిశోధించిన మా ఫ్రెండ్స్ లో మొదటివాడు అప్పలాచారి.

పరిశోధన టేకప్ చేశాక ఆ మర్నాడే సికింద్రాబాద్ రైల్వేస్టేషనులో అప్పలాచారి కనిపించాడు. వాడు జనగామలో అసిస్టెంట్ స్టేషన్ మాస్టరుగా చేస్తున్నాడు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడం చేత ఇద్దరం హస్కాలజీలో మునిగిపోయాం.

"ఉద్యోగం ఎలా వుంది" అడిగాను మధ్యలో.

"మొన్న భలే తమాషా జరిగిందిలే" అన్నాడు వాడు ఉత్సాహంగా.

"ఏమిటది?"

"నేను మామూలుగా నైట్ డ్యూటీలో మా స్టేషన్ బయట ప్లాట్ ఫారం మీదున్న సిమెంట్ బెంచీ మీద దుప్పటి ముసుగుపెట్టి నిద్రపోతున్నాను. రాత్రి రెండింటికి సేఫ్టీ ఆఫీసర్ జీప్ లో ఇన్ స్పెక్షన్ కొచ్చి- స్టేషన్ అంతా వెతికి - చివరకు నన్ను నిద్రలేపాడు. ఆయనను చూడగానే నాకు పరిస్థితి అర్ధమయిపోయింది. వెంటనే ఓ ఉపాయం ఆలోచించాను.

"డ్యూటీ స్టేషన్ మాస్టర్ నువ్వేనా?" అనడిగాడు కోపంగా.

"స్టేషన్ మాస్టరా? అర్ధం కానట్లు అడిగాను.

"నువ్వు కాదా?"

"అహ్హహ్హా-" అని నవ్వాను.

"ఏమిటలా నవ్వుతావ్!"

"లేకపోతే ఏమిటయ్యా! నేను పాసెంజర్ ని! సికింద్రాబాద్ బండి కోసం వెయిట్ చేస్తున్నాను" అనేసి మళ్ళీ ముసుగెట్టేశాను. వాళ్ళు మళ్ళీ స్టేషన్ లో కెళ్ళారు. అదే ఛాన్సనుకొని ఛటుక్కున లేచి పక్కబట్టలన్నీ కిందపడేసి, తల దువ్వుకొని, ఇన్ షర్టు సరిజేసుకుని సిగరెట్ వెలిగించాను. అప్పుడు రెండు జేబుల్లో చేతులుంచుకుని "సరిగమలూ-పదనిసలూ" అని పాడుకుంటూ తిన్నగా ఆఫీసులోకొచ్చి వాళ్ళను చూసి ఆశ్చర్యపోయినట్లు ఓవరాక్షన్ చేసి, 'గుడ్ నైట్ సార్" అంటూ విష్ చేశాను. "ఇప్పుడే అలా సిగరెట్ వెలిగించుకుందామని ప్లాట్ ఫారం మీద కెళ్ళాన్సార్" అని చెప్పేసరికి నమ్మేశారు.

నేనూ అప్పలాచారీ ఇద్దరం చాలా సేపు నవ్వుకున్నాం. ఆ సంఘటన తల్చుకుని, నెలరోజుల తర్వాత మళ్ళీ సికింద్రాబాద్ లోనే బస్ స్టాపులో కనిపించాడు. మళ్ళీ కుశల ప్రశ్నలయ్యాయి.

"రేపు రెస్టుకదా - అందుకని వచ్చేశాను" అన్నాడు.

"అలాగా!" అన్నాను.

"అది సరేగాని మొన్నామధ్య భలే తమాషా జరిగింది" అన్నాడు ఉత్సాహంగా.

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేను నైట్ డ్యూటిలో స్టేషన్ ఆఫీసు బయట బెంచిమీద పడుకుని ముసుగుపెట్టి నిద్రపోతూంటే రాత్రి రెండింటికి డి.యస్.వో. ఇన్ స్పెక్షన్ కొచ్చాడు జీపులో. ఎస్.ఎమ్. ఆఫీసులో నేను కనిపించకపోయే సరికి బయటకొచ్చి నన్ను లేపాడు..." అదే కథ మళ్ళీ చెప్తున్నాడని అర్థమయిపోయింది నాకు. అయినా వాడు అంత ఉత్సాహంగా చెపుతోంటే అడ్డుపడడం బావుండదని ఓపిగ్గా అంతా విన్నాను.

ఆ తరువాత వారం రోజులకు వాడు కాచిగూడాలో కనిపించాడు మళ్ళీ.

"సేఫ్టీ కాంప్ కొచ్చాన్లే! ఇంకో రెండు రోజులుంటాయి క్లాసులు" అన్నాడు తనక్కడ ఎందుకున్నదీ వివరిస్తూ.

"అన్నట్టు మొన్న భలే తమాషా జరిగిందిలే డ్యూటీలో" అన్నాడు మళ్ళీ.

నాకు కొంచెం భయం వేసింది మళ్ళీ అదే కథ చెప్తాడేమోనని.

"ఏమిటది?" అడిగాను అనుమానంగా. ఒకవేళ ఇప్పుడు చెప్పబోయేది మరో కొత్త సంఘటనేమో అన్న ఆశ అలా అడిగించింది నన్ను.

"నేను ఒకరోజు నైట్ షిఫ్ట్ లో ఉండగా మా స్టేషన్ ఆఫీసు బయట బెంచీమీద ముసుగుపెట్టి నిద్రపోతున్నాను. సడెన్ గా రాత్రి రెండింటికి జీప్ లో డి.యస్.ఓ, నైట్ ఇన్ స్పెక్షన్ కొచ్చి ఆఫీసులో ఎవరూ లేకపోయేసరికి అనుమానం వచ్చి నన్ను నిద్రలేపాడు. డ్యూటీలో నిద్రపోతే పనిష్మెంట్ ఉంటుంది గదా! అందుకని నేను ట్రిక్ ప్లే చేశా!"

ఆ తరువాత వినడానికి మనస్కరించలేదు నాకు. ఎంత రసవత్తరమయిన కథయినా చదివినకొద్దీ నీరసం పెరిగిపోతుంది కదా! అంచేత వెంటనే వాడి వాక్ ప్రవాహానికి అడ్డుపడిపోయాను.

"ఇదా! ఇది మొన్న కనబడినప్పుడు చెప్పావ్ కదురా" అన్నాను.

వాడు ఆశ్చర్యపోయాడు.

"చెప్పానా?" అన్నాడు నమ్మలేకపోతున్నట్లు.

"అవును!"

"ఎప్పుడు?"

"వారం క్రితం రెస్టులో వచ్చావ్ నువ్వు- అప్పుడు చెప్పావ్."

"ఓహో- చెప్పేశానన్నమాట!"

"అవును!"

"భలే తమాషాగా జరిగింది కదూ?"

"చాలా ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ ఉపయోగించావ్!" అన్నాను మెచ్చుకుంటూ. ఇద్దరం టూరిస్ట్ హోటల్లో 'టీ' తాగాం. వాడు చాలాసేపు రైల్వే యూనియన్ల గురించి మాట్లాడాడు.

"మా యూనియన్లు భలే తమాషా యూనియన్లురా! రైల్వే కార్మికులందరూ జీతాలు పెరగాలని సమ్మె చేస్తూంటే యూనియన్లు అక్కరలేదని సమ్మెను చెడగొట్టేశాయి" నేను ఆశ్చర్యపోయాను.

"అదేమిటి? అసలు జీతాల పెరుగుదల కోసం యూనియన్ లే సమ్మె చేయించాలి కదా?" అడిగాను.

"అదేమరి రైల్వే లో ఫార్స్! ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి వింత ఉంటుందేమో చూడు."

"ఒకవేళ ఇప్పటికే జీతాలు చాలా ఎక్కువగా వున్నాయని మీ యూనియన్లు అలా చేశాయేమో?"

వాడు పగలబడి నవ్వాడు.

"జీతాలు ఎక్కువా? నీకు తెలీదేమో. మా గుమాస్తా బేసిక్ ఎంతో తెలుసా? రెండువందల అరవై- మరి స్టేట్ గవర్నమెంట్ లో ప్యూన్ బేసిక్ రెండువందల తొంబై-"

ఇద్దరం చాలా రోజుల తరువాత మనసారా నవ్వుకున్నాం.

"అది సరేగాని మొన్న భలే ఫార్స్ జరిగింది తెలుసా?" అనడిగాడు వాడు. నాకు భయం ముంచుకొచ్చింది.

"ఏమిటిది?" రిస్క్ తీసుకునే అడిగాను. ఎందుకంటే ఆ పాత కథ నాకు అంతకుముందే చెప్పబోవటం- నేను తెలుసునని వారించటం వాడప్పుడే ఎలా మర్చిపోతాడా అని ఓమూల మిణుకుమిణుకు మనే ఆశ!

"ఓ రోజు నేను నైట్ డ్యూటిలో వుండగా ఏమయిందంటే- బయట ఉన్న సిమెంట్ బెంచీమీద..."

"ఇది చెప్పావ్ కదురా!" అన్నాను హడావుడిగా అడ్డుపడి.

"చెప్పానా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవున్రా!"

"ఎప్పుడు?"

"క్రిందటివారం నువ్ రెస్ట్ లోవచ్చినప్పుడు"

"ఏదీ- మా డి.యస్.ఓ. నైట్ ఇన్ స్పెక్షన్ కి రావడం- నేను పాసింజర్ లాగా నటించడం.

"అవున్రా- ఇదే చెప్పావ్! మీ డి.యస్.వో. నీ మాటలు నమ్మి వెళ్ళిపోవడం - అంతా చెప్పావ్."

అప్పటికి గానీ వాడికి సంతృప్తి కలుగలేదు.

వాడు వెళ్ళిపోయాక గానీ నాకు గుర్తు రాలేదు. అది వాడి తాలూకూ మతిమరుపు సబ్జెక్టు అన్నమాట- మిగతా విషయాలేమీ మర్చిపోవడంలేదు వాడు. మిగతా విషయాలేమీ చెప్పినవే చెప్పడం జరగటం లేదు. కేవలం వాడి డ్యూటీలకు సంబంధించిన సంఘటనలే- చెప్పిందే చెప్పడం జరుగుతోంది.

తరువాత చాలాసార్లు కనిపించాడు అప్పలాచారి. కనిపించినప్పుడల్లా ఆ సంఘటనే చెప్పడాన్కి ప్రయత్నించడం - నేను కెవ్వున కేకవేసి వాడికి అడ్డుపడడం జరగుతూనే వుంది. ఆ తరువాత నేను స్టడీ చేసిన మరో కేస్ మా రాజారామ్.

అతనికి లక్ష వ్యవహారాలు. రైల్వేలో టీటీఇ ఉద్యోగం అవడం చేత రిజర్వేషన్ ల కోసం అనుక్షణం ఇంటిచుట్టూ తిరిగే బంధుమిత్రులూ- అతను స్టేజీ ఆర్టిస్ట్ అవడం చేత తరచుగా కలుసుకోడానికొచ్చే నటీనటులు, డైరెక్టర్లు, సమాజాలు, డ్రామాల రిహార్సల్స్, రేడియో ప్రోగ్రాములు, ఇన్ని వ్యవహారాల్లో ఇరుక్కోవడం చేత, ఓ కొత్తరకం మతిమరపు వచ్చేసింది. ఓరోజు ఏదో పనిమీద అతనింటికి వెళ్ళాను.

"అబ్బబ్బబ్బ! నీ కోసం వారం రోజుల్నుంచి ట్రై చేస్తున్నాను" అన్నాడతను.

"ఏమిటి సంగతి?"

"రేడియోలో మా కల్చరల్ అసోసియేషన్ నాటకం రికార్డింగ్ ఉందివాళ! దాని కోసం అర్జంటుగా పావుగంట స్క్రిప్ట్ కావాలి. మీ కాలనీ రైటర్ తో రాయించి ఇవ్వకూడదూ?"

"రికార్డింగ్ ఇవాళా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును!"

"ఇవాళెలా కుదుర్తుంది? స్క్రిప్టు ఎప్పుడు రాస్తాడు? ప్రాక్టీస్ ఎప్పుడు చేస్తారు?"

"ఏదోకటి- ఎలాగోలా లాగించెయ్. బాబ్బాబు!"

"మరి నేను నాలుగురోజుల క్రితం కనిపించినప్పుడైనా చెప్పలేదే ఈ విషయం?

"నాలుగు రోజుల క్రితం కనిపించావా నువ్వు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును. సంగీత్ థియేటర్ దగ్గర కనిపించలేదూ?"

"సంగీత థియేటర్ దగ్గరా! నేనక్కడికెళ్ళిన గుర్తులేదే?" గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

పావుగంట టైమ్ గడిచిపోయింది గానీ గుర్తుకురాలేదు.

"సరే, ఆ సంగతి వదిలేయ్. ఇప్పుడేం చేయమంటావ్?"

"రేప్పొద్దున్నకల్లా స్క్రిప్టు రాయించు! చాలు. నేను రేడియో స్టేషన్ కి ఫోన్ చేసి మన ప్రోగ్రామ్ రికార్డింగ్ ఎల్లుండి పెట్టమని రిక్వెస్ట్ చేస్తాను."

"సరే" వప్పుకున్నాను.

ఆ రాత్రి చాలాసేపు తంటాలు పడి స్క్రిప్ట్ రాయించి మర్నాడు ఉదయం తీసుకెళ్ళి రాజారామ్ కిచ్చాను.

"ఏమిటిది?" అడిగాడు స్క్రిప్టు తీసుకుని.

"నాటిక."

"నాటికా-"

"అవును,"

"ఎందుకిది!"

నాకు అర్థమయిపోయింది- ముందురోజు చెప్పినదంతా మర్చిపోయాడని.

"అదేనయ్యా! రేడియో రికార్డింగ్ కి కావాలన్నావ్ కదా?"

"మై గాడ్!" అంటూ అదిరిపడి లేచి నుంచున్నాడు.

"ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాను.

"రికార్డింగ్ రేపటికి పోస్టుపోన్ చేయమని రేడియో స్టేషన్ కి ఫోన్ చేయడం మర్చిపోయాను నిన్న."

నేను అదిరిపడ్డాను.

"అయితే నిన్న వాళ్ళు ఎదుర్చూసి ఉంటారు పాపం."

"అవును ఓ పని చేద్దాం! సాయంత్రం నాలుగుసార్లు రిహార్సల్స్ వేసుకుని రేపు ఉదయం రేడియో స్టేషన్ కి డైరెక్ట్ గా వెళ్ళి రిక్వెస్ట్ చేస్తే రికార్డ్ చేసేస్తారు" అన్నాడు.

"ఐడియా బాగానే ఉంది" అన్నాను.

"బాబ్బాబు- ఏమీ అనుకోకుండా సాయంత్రం బోయిగూడా ఇన్ స్టిట్యూట్ కొచ్చేయ్. నువ్వూ ఓ కారెక్టర్ వేద్దుగానీ- ఇప్పటికిప్పుడు ఆరుగురు ఆర్టిస్టులను వెతికి పట్టుకోవాలంటే కష్టం! మిగతా వాళ్ళను ఎలాగోలా ఆటోలో తిరిగి లాక్కొస్తాను" అన్నాడు.

"సరేనని నేను సాయంత్రం అయిదింటికల్లా బోయిగూడా ఇన్ స్టిట్యూట్ దగ్గరకు చేరుకున్నాను.

అక్కడ రెడ్డి దిగాలుగా కూర్చుని కనిపించాడు.

"ఏంటి అప్పుడే వచ్చేశావ్?" అడిగా తనని.

"రెండింటికి రిహార్సల్ అన్నాడు కదా రాజారాం"

"రెండింటికా?"

"అవును గురూ! మధ్యాహ్నం రెండింటికి రిహార్సల్స్ అని చెప్పాడు- అప్పటినుంచీ కూర్చున్నాను."

"నాకు అయిదింటికని చెప్పాడే?" అన్నాన్నేను.

ఇద్దరం కలిసి ఆరున్నరవరకూ చూసి నడుచుకుంటూ రాజారామ్ ఇంటికి చేరుకున్నాం. ఇంట్లోలేడతను. ఎక్కడికో పొద్దున్ననగా వెళ్ళాడట! ఆ తరువాత ఎవరికీ కనిపించలేదు. మేము చాలాసేపు అక్కడే తచ్చట్లాడి ఎనిమిది గంటలకు ఇళ్లకు బయలుదేరాం!

దారిలో స్వామి, కుమార్ ఎదురయ్యారు - "రిహార్సల్ కి రాలేదేమిటి?" అడిగారు వాళ్ళు.

"రిహార్సల్స్ కు రాకపోవడమా?" ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

"అవును మీరూ లేరు- రాజారామ్ లేడు."

"అదేమిటి? మేమిప్పటివరకూ ఇన్ స్టిట్యూట్ లోనే ఎదుర్చూసి ఇంతకుముందే తిరిగివచ్చాం" అన్నాను.

"ఇన్ స్టిట్యూట కెందుకెళ్ళారు? రిహార్సల్స్ ఎకౌంట్స్ ఆఫీస్ కాంటీన్ లో గదా?" అడిగారు వాళ్ళు.

"అంటే మీతో రిహార్సల్స్ ఎకౌంట్సు ఆఫీస్ కాంటీన్ లో అని చెప్పాడా?"

"అవునూ! మీకలా చెప్పలేదా?"

"లేదే-"

అందరం పావుగంట సేపు నిశ్శబ్దంగా నిలబడి ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నాం. మర్నాడు అందరం కలసి రాజారామ్ ఇంటికెళ్ళాం!

"ఇవాళ్ళేదో పెద్ద విశేషం ఉన్నట్లుంది అందరూ కలసివచ్చారు!" అన్నాడు రాజారాం నవ్వుతూ!

"నిన్న రిహార్సల్స్ సంగతేమిటి?" అడిగాను చాలా శాంతంగా.

"రిహార్సల్సా? ఏ రిహార్సలు?" తనూ అంతకంటే శాంతంగా అడిగాడు.

"నిన్న మా ఇద్దరినీ ఇన్ స్టిట్యూట్ కీ, వాళ్ళిద్దరినీ ఎకౌంట్స్ ఆఫీస్ క్యాంటీన్ కీ రమ్మన్నావ్ కదా- ఆ రిహార్సలు..."

"అడెడెడెడెడె...." అంటూ నాలిక్కరుచుకున్నాడతను.

"ఆ ఎక్స్ ప్రెషన్ కి అర్థం ఏమిటి?"

"ఆ సంగతే మర్చిపోయాను- అయామ్ సారీ!"

"మరి నిన్న సాయంత్రం ఎక్కడికెళ్ళావ్?"

"వేరే అసోసియేషన్ వాళ్ళు ఓ నాటకంలో చిన్న కారెక్టర్ వేయమని బ్రతిమాలి తీసుకెళ్ళారు."

"మరి మన రేడియో నాటిక సంగతేమిటి?"

"దాన్దేముంది? అందరం ఇప్పుడే రేడియో స్టేషన్ కెళ్ళి రిక్వెస్ట్ చేస్తే రికార్డింగ్ జరిగిపోతుంది. అంతగా కావాలంటే అక్కడే ఓ రిహార్సల్ వేసుకోవచ్చు."

అందరం రేడియో స్టేషన్ కి చేరుకున్నాం.

ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ దగ్గరకెళ్ళి సారీ చెప్పి జరిగిందంతా వివరించాడు రాజారాం.

అంతా విని ఆయన "కాంట్రాక్ట్ ఏది చూపించండి!" అన్నాడు.

కాంట్రాక్ట్ తీసి చూపించాడు శాయిరామ్.

"ఇది కిందటి నెల తాలూకూ కాంట్రాక్ట్ నాయనా! మీరు అంతులేక పోవడం వల్ల ఇంకెవరిదో ప్రోగ్రాం చేసేశాం."

రాజారాం ఆత్రుతగా కాంట్రాక్ట్ లాక్కుని చూశాడు. నిజమే! రికార్డింగ్, బ్రాడ్ కాస్టింగ్ రెండు తారీఖులూ క్రిందటి నెలవే!

అందరం మరోసారి సారీ చెప్పి ఇంటికి తిరిగి వచ్చాం.

ఇంటిదగ్గర రాజారాం వాళ్ళ తమ్ముడు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు.

"అదేంటన్నయ్యా- ఇంతలేటుగా వచ్చావ్, మద్రాస్ ఎక్స్ ప్రెస్ డ్యూటీకదా నీది-"

రాజారాం అదిరిపడి టైమ్ చూసుకున్నాడు.

"కొంప మునిగింది. ఆ సంగతే మర్చిపోయాను. బండి ఎప్పుడో వెళ్ళిపో యుంటుంది. ఇప్పుడెలా?" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఇంకేముంది. త్వరగా రైల్వే హాస్పిటల్ కు వెళ్ళి శిక్ చేసేయ్?" సలహా ఇచ్చాడు సుబ్బారెడ్డి. అప్పటికప్పుడు హాస్పిటల్ కు బయల్దేరి వెళ్ళాడు రాజారాం. మరో రెండు రోజుల తర్వాత కనిపించినప్పుడు ఎవరితోనో మళ్ళీ ఏదో నాటిక గురించి మాట్లాడుతున్నాడు. "లేదన్నా! నన్ను నువ్వు రిహార్సల్ కి ఎనిమిదింటికే రమ్మన్నావ్! లేకపోతే ఎనిమిదింటి కెందుకొస్తాను?"

"కాదయ్యా బాబూ! నేను ఆరింటికే రమ్మన్నాను- నీ మూలాన రిహార్సల్ కాన్సలయిపోయింది..." అంటున్నాడు రాజారామ్.

ఆ తరువాత నేను స్టడీ చేసిన కేసు ఓ రచయిత ఫ్రెండ్ ది. ఆయనకు సర్వస్వం తారీఖులతో సహా గుర్తుంటాయి గాని, కథా రచయితగా అభిమానులు, నాటక రచయితగా సమాజాల సభ్యులు, ఎక్కువ సంఖ్యలో ఉండటం మూలాన తక్కువ పరిచయం ఉన్న వాళ్ళను ఇట్టే మరిచిపోతుంటాడు.

ఓ సారి నేనూ ఆ రచయితా వెళ్తొంటే ఓ పెద్దమనిషి స్కూటర్ మీద ఎదురయి 'హలో' అంటూ పలకరించి స్కూటర్ ఆపాడు.

"హలో హలో" అన్నాడు రచయిత.

అతను స్కూటర్ రోడ్డు పక్కకు లాగి స్టాండ్ వేస్తూ "ఇతనెవరో ఎంత తన్నుకున్నా గుర్తుకురావటం లేదే!" అన్నాడు నాతో నెమ్మదిగా.

"దాన్దేముంది? అతనినే అడిగేస్తే సరి-"

"అబ్బే, హర్టయిపోతాడు. అలా బాగుండదు."

"మరేం చేస్తావ్?"

"మాటల్లో పెట్టేసి వివరాలు లాగేస్తే దొరికిపోతాడ్లే-" అన్నాడు ధైర్యంగా.

"బాగున్నారా?" అన్నాడతను దగ్గరకొచ్చి.

"ఓ! ఆల్ ఓకే!" అన్నాడు మావాడు.

"ఇంకా అదే ఆఫీస్ లో ఉన్నారా?" అడిగాడతను.

"అవునండీ! అక్కడే! అక్కడే!- ఇంకెక్కడికి పోతాం?"

"మనం కలిసి చాలాకాలం అయిపోయింది" నవ్వుతూ అన్నాడతను.

"అవును! చాలా రోజులయింది! నిజమెగ మీరు అదే ఆఫీసా, లేక మరెక్కడికయినా మారారా?" అడిగాడు ఆచూకీ కోసం ప్రయత్నిస్తూ.

"మా ఆఫీసు ఒక్కటే కదండీ సిటీలో - ఇంకెక్కడికి మార్తాము?"

"హ్హా హ్హా హ్హా! అవునవును! నిజమేననుకోండి- ఒకోసారి ప్రమోషను అవీ రావచ్చు కదా."

"మీకా భయమేమీ అఖ్ఖర్లేదు. నేనీపోస్టులోనే రిటైరయిపోతాను! మీ కథలు పత్రికల్లో కనిపించినప్పుడల్లా - నేనూ మా మిసెస్- మిమ్మల్ని గుర్తుచేసుకుంటూంటాం!" అన్నాడతను.

"ఓ అలాగా - అహహ-"

"ఒకసారి మా ఇంటికి డిన్నర్ కి తీసుకురమ్మని మా తమ్ముడు కూడా గొడవ చేస్తున్నాడు."

"ఓ- తప్పకుండా వస్తాను- తప్పకుండా వద్దాం."

"మా ఇల్లు మీకు గుర్తుండే ఉంటుంది. రెండుమూడు సార్లు వచ్చారు కదా!"

"ఆ ఆ! బాగా గుర్తుంది-" అప్పటికే మావాడి మాటలు తడబడుతున్నాయి- ఇల్లయితే ఈ మధ్యలో మారలేదు కదా?"

"లేదు-"

"అదీ గాకుండా ఇంటిముందు మీ నేమ్ ప్లేట్ ఎలాగూ వుంటుంది కదా? అన్నట్లు ఫుల్ నేమ్ రాసి ఉంటుందా?" ఆఖరుసారి అతనిపేరు తెలుసుకోవడం కోసం ఓ ప్రశ్న వదిలాడు.

"భలేవారే! కొట్టొచ్చినట్టు కనబడుతూంటుంది-"

"మీ అసలుపేరు- అంటే పూర్తి ఇంటిపేరుతో వుంటుందా? లేక షార్ట్ ఫారమ్ వుంటుందా?"

"పూర్తి పేరే వుంటుందిలెండి! ఒక్క నిమిషం!" అంటూ పక్కనే వున్న దుకాణంలో అగ్గిపెట్టి కొని సిగరెట్ వెలిగించుకోసాగాడు.

"ఇతనెవరో ఎంత ప్రయత్నించినా తెలియటం లేదే!" అన్నాడు మావాడు.

"ఇంక అడిగెయ్యటమే మంచిది-" సలహా ఇచ్చాన్నేను.

"ఇంతసేపు మాట్లాడాక ఇప్పుడా అడగడం? ఇంకేమయినా వుందా!" కోప్పడ్డాడు వాడు. అతను మళ్ళీ దగ్గరకొచ్చాడు.

"అయితే ఓ పని చేయండి గురూజీ. ఎల్లుండి ఆదివారం మా ఇంటికి భోజనానికి వచ్చేయండి."

"ఆ! ఎల్లుండా?" గతుక్కుమన్నాడు మావాడు.

"అవును-ఏం?

"ఆ! మరేంలేదు. కానీ ఎల్లుండి కొంచెం పనుంది."

"అలాగా! అయితే సరే మీ ఇష్టం! మీకెప్పుడు వీలుంటే అప్పుడు."

"ఓ యస్! నేనే మీకు ఫోన్ చేసి చేపుతాన్లెండి- మీ ఫోన్ నెంబరేమిటి?"

అతను ఫోన్ నంబర్ ఓ కాగితం మీద రాసి ఇచ్చాడు.

"ఈ నెంబర్ కి ఫోన్ చేసి నా పేరు చెపితే పిలుస్తారు! నో ప్రాబ్లమ్ మరి నేను వెళ్ళిరానా."

"ఆ! అలాగే! థాంక్యూ!"

అతను వెళ్ళిపోయాక మా రచయిత వెధవనవ్వు నవ్వాడు.

"దెబ్బ తినేశాను గురూ! ఫోన్ నంబర్ అడిగినప్పుడయినా పేరు కూడా రాస్తాడనుకున్నాను."

ఇలానటి సంఘటనలు మా రచయితతో పాటు చాలా అనుభవంలో కొచ్చాయి నాకు. ఇక మిగిలింది రెడ్డి.

రెడ్డి ఫార్మాసిస్ట్, డిస్పెన్సరీలో మందులూ వగైరా ఖచ్చితంగా గుర్తు పెట్టుకునే ఇస్తాడు అందరికీ. అందులో ఏ ధోకా లేదు. అక్కడే మతిమరుపూ లేదు. ఎటొచ్చీ ఆయన మతిమరుపేంటంటే ఎవరి దగ్గరయినా తీసుకున్న వస్తువు గురించి మర్చిపోవడం.

ఓ పేషెంట్ దగ్గర తీసుకున్న బాల పెన్ మరో పేషెంట్ కి బలవంతంగా ఇచ్చి పంపించేసిన సంఘటనలు కోకొల్లలు. తనెప్పుడయినా పెన్ గానీ, బాల పెన్ గానీ కొంటే కేవలం కొద్దిగంటలు మాత్రమే అతని దగ్గరుంటాయ్! ఆ తరువాత ఇక వెతకడమే పని! ఒక్కోసారి అతని దగ్గర పది పదిహేను బాల్ పెన్ లు చేరిపోతాయ్. ఏది ఎవరి దగ్గర తీసుకున్నాడో గుర్తుండదు. ఏది ఎవరికి రిటర్న్ చేయాలో తెలీదు.

ఓ సారి నాకో ఖరీదయిన బాల పెన్ తెచ్చిచ్చాడు.

"చాలా బాగుంది." అన్నాను నేను-నాకు చూపించడానికి తెచ్చాడనుకొని.

"అవును. ఎక్కడ కొన్నావ్?" అడిగాడు.

"నేను కొనడమేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"నువ్వు కొనలేదా ఇది?" ఇంకా ఆశ్చర్యంగా అడిగాడు.

"అబ్బే ఇదసలు నాదికాదు-"

"నీది కాదా?"

"నేను నీకెప్పుడూ బాల్ పెన్ ఇవ్వలేదు."

"అదేమిటి నిన్న ఉదయం మీ ఇంటికొచ్చినప్పుడు రాసుకోడానికి ఇచ్చావ్ కదా?" అడిగాడు అయోమయంగా.

"నేనివ్వలేదు. నేను కొత్తగా రికార్డ్ చేసిన పాటల కేసెట్ అడిగి తీసుకెళ్ళావ్. అంతే! ఇంకేం తీసుకోలేదు-"

"ఏమిటి? పాటల కేసెట్ మీది తీసుకెళ్ళానా?" ఇంకా ఆశ్చర్యపోతూ అడిగాడతను.

"నిన్నే కదా తీసుకెళ్ళావ్ అప్పుడే మర్చిపోయావా?"

"కాసెట్ నేను యోగిబాబు నడిగి తీసుకెళ్ళాను కదా!"

"కాదు గురూ! నా దగ్గరే తీసుకెళ్ళావ్!"

"మరి నేనివాళ పొద్దున్న అది యోగిబాబుకిస్తే అబ్బ ఎన్నాళ్ళకు తిరిగి ఇచ్చావురా అని తీసుకున్నాడే?"

"అయ్యో కొంపముంచావ్ గురూ! అది నాది! పద- వెళ్ళి యోగిబాబుని కనుక్కుందాం! లేకపోతే గోవిందా అయిపోతుంది."

ఇద్దరం యోగిబాబు ఇంటికెళ్ళాం.

"ఒరేయ్- ఇవాళ నీకిచ్చిన కాసెట్ ఇతనిదంట్రా! నీదికాదు" అన్నాడు రెడ్డి.

"నాకు కాసెట్ ఇచ్చావా?" ఆశ్చర్యంగా అడిగాడు యోగిబాబు.

"అదేమిట్రా! ప్రొద్దున్న వచ్చినప్పుడు నీకు కాసెట్ ఇవ్వలేదూ? అబ్బ ఎన్ని రోజులకు తిరిగిచ్చావురా అని తీసుకున్నావ్!" రెట్టిస్తూ అడిగాడు రెడ్డి.

"నీ తలకాయ్!"

"అంటే?"

"పొద్దున్న ఇక్కడికొచ్చినప్పుడు నువ్వు నాకిచ్చింది గొడుగు."

"గొడుగేమిటి?"

అదే నాకూ అర్థం కాలేదు. ఒకవేళ నా గొడుగు ఎప్పుడయినా పట్టుకెళ్ళి ఇన్ని రోజులకు తెచ్చి ఇచ్చావేమోనని తీసుకున్నాను. తీరా నువ్వు వెళ్ళాక చూస్తే మా గొడుగు మా ఇంట్లోనే ఉంది. దీనిమీద ఇంకెవరివో ఇనీషియల్స్ ఉన్నాయి చూడు" అంటూ గొడుగు తెచ్చి రెడ్డికిచ్చాడతను. అందరం కలసి ఆ అక్షరాలు చదివాం.

పి.యన్.ఎల్. అనే అక్షరాలున్నాయ్.

"అంటే ఎవరయి ఉంటారు?" అన్నాడు రెడ్డి ఆలోచనలలో పడుతూ.

"ఇంతకూ నా కాసెట్ ఏమయినట్లు?" అన్నాన్నేను భయంగా.

"అదిసరే! క్రికెట్ స్కోర్ విని ఇస్తానన్నావ్ కదా, నా ట్రాన్సిస్టరేమయింది?" అనడిగాడు యోగిబాబు. రంగారెడ్డి షాకయ్యాడు.

"నీ దగ్గర ట్రాన్సిష్టర్ తీసుకున్నానా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నిన్న మధ్యాహ్నం తీసుకున్నావు కదరా?"

"అవును! మళ్ళీ సాయంత్రం ఇచ్చేశాగా?"

"నా కెక్కడిచ్చావురా?" అదిరిపడుతూ అన్నాడు యోగిబాబు.

రెడ్డి కాసేపు ఆలోచించి "ఇదిలా తేలదు గానీ పదండి హాస్పిటల్ కెళ్దాం" అన్నాడు. అందరం కలిసి డిస్పెన్సరీ కెళ్ళాం.

అప్పటికే ఇద్దరు నర్సులు రెడ్డి కోసం ఎదురుచూస్తున్నారక్కడ.

"నా గొడుగు కోసం వచ్చాను" అంది ఒకామె.

"చంపావ్ తల్లీ! ఈ గొడుగు నీదా- ఇదిగో తీసుకో" అంటూ తన చేతిలోని గొడుగు ఆమె కిచ్చాడతను.

ఆమె కెవ్వున అరచింది.

"ఈ గొడుగు నాదికాదు"

అందరం మలేలే ఆశ్చర్యపోయాం.

"మీది కాదా?"

"కాదండీ! నా ఇనీషియల్స్ ఎమ్.ఎన్.డి. అని వుండాలి."

"మరి పి.యాన్.ఎల్. అంటే ఎవరు?" అడిగాడు రెడ్డి అయోమయంగా.

"ఏమో! నాకు తెలీదు."

"చూడమ్మా! ఓ సహాయం చేస్తావా!" నర్స్ నడిగాడు రెడ్డి ప్రాధేయపడుతూ.

"ఏం చేయమంటారు?"

"ప్రస్తుతానికి ఈ గొడుగు తీసుకెళ్ళిపోండి. ఎప్పటికయినా మీ గొడుగు అడ్రస్ దొరికితే మీకు అప్పజెప్తాను."

"సరే-" అయిష్టంగా తీసుకుని వెళ్ళిపోయిందామె.

"మరి నా పెన్ సంగతేమిటి?" అంది రెండో నర్స్.

"మీ పెన్నేమిటి?" మళ్ళీ ఆశ్చర్యంగా అడిగాడు రెడ్డి.

"అదేనండి! నాది నూట అరవై రూపాయల పెన్ను! ఇప్పుడే రాసిస్తానని నిన్న తీసుకుని సాయంత్రం ఈ డొక్కు పెన్ పంపించారు"

"ఆ! ఇది మీది కాదా?"

"కాదు-"

ఈ పరిస్థితిలో మా మధ్యలో ఓ లావుపాటాయన వచ్చి రెడ్డిగారికి ఓ కాసెట్ ఇచ్చాడు.

"ఇది నాది కాదండీ గురూజీ! ఇంకెవరిదో."

నేను ఆత్రుతగా ఆ కాసెట్ తీసుకుని చూశాను.

"అది నీదే గురూ! సందేహం అక్కర్లేదు. తీసుకెళ్ళు" అన్నాడు రెడ్డి నాతో.

"కంపెనీ పేరు కరెక్టే గాని ఇంత మాసిపోయినట్లుందేమిటి?" అడిగాను అనుమానంగా.

"ఆ- మరేం లేదు. ఇక్కడ డస్ట్ అదీ పడి అలా అయిందిలే!"

ఎందుకయినా మంచిదని ఇంటికెళ్ళగానే కాసెట్ టేప్ రికార్డర్ లో వుంచి ప్లే చేశాను.

అంతకుముందెప్పుడూ వినని శబ్దాలు వినిపించడం ప్రారంభించేసరికి మతి పోయింది.

కనుక ఈ స్టడీ వల్ల నేను తేల్చుకున్నదేంటంటే మనిషికొకే ఒక్క విషయంలో మతిమరుపుండు మహిలో సుమతి అన్న నగ్నసత్యం.

* * * * *

## ఇప్పుడు మీరు ప్రత్యేక జనరంజని వింటారు!

చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ మా కాలనీ రచయిత! అతనికి హఠాత్తుగా ప్రత్యేక జనరంజని సమర్పించే అవకాశం ఇచ్చారు రేడియోవాళ్ళు.

ఆ రోజు అతనిని అందరూ తెగ అభినందించేస్తున్నారు.

"ఒరేయ్! అందరిలాగా కాకుండా మంచి రికార్డ్స్ వేయరా! పాత సినిమాల్లో చాలా మంచి పాటలున్నాయిగా! అవన్నీ వేయ్" అన్నాడు గోపాల్రావ్.

"చూస్తావ్ కదురా! బెస్ట్ రికార్డ్స్ సెలెక్ట్ చేసి వేస్తాను" అన్నాడతను గర్వంగా.

"అందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం" పాట మర్చిపోకొరేయ్- హెచ్చరించాడు వెంకట్రావ్.

"ఆ పాట ఎలా మర్చిపోతాను బాబాయ్."

సాయంత్రం వరకూ ఆఫీసులో స్టాఫంతా చంద్రకాంత్ వివిధ భారతి ద్వారా సమర్పించే ప్రత్యేక జనరంజని కార్యక్రమం గురించే ముచ్చటిచ్చుకుంటూ గడిపారు. అతను కథలూ కాకరకాయలు రాస్తుంటాడని ఆఫీసులో అందరికీ తెలుసు. అతను వ్రాసిన ఓ కథ "కాకరపాలెం కుర్రోడు" అనే సినిమాగా కూడా తీశారు. రేడియో స్టేషన్ వాళ్ళకు చంద్రకాంత్ రచయిత అని తెలీదు. అసలు వాళ్ళ దృష్టిలో రచయితలు వేరు. వాళ్ళెవరూ పత్రికల్లో కథలు రాయరు. రచయిత అంటే మేగజైన్ లో రచనలు చేయాలని ఎక్కడైనా రూలుందా అని వాళ్ళ ప్రశ్న- కేవలం రేడియోకి వ్రాసేవాళ్ళే రచయితలు, కేవలం రేడియోలో నటించేవారే నటులు అని వాళ్ళనుకుంటుంటారు. ఎప్పుడయినా అడపాదడపా ఇదిగో ఇలా చంద్రకాంత్ లాగా సినిమాకి కథ వ్రాసిన రచయితలను కూడా రచయితలుగా గుర్తిస్తుంటారు.

చంద్రకాంత్ వారం రోజుల పాటు తన జనరంజని శ్రోతలతో ఏం మాట్లాడాలి, ఎలా మాట్లాడాలీ అన్నది నానా హైరానాపడి నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత తను మాట్లాడే మాటలకు పొంతన కుదిరేలా మాంచి పాటలు ఎన్నుకొని లిస్ట్ తయారుచేసుకున్నాడు.

రికార్డింగ్ రోజున ఓ గంట ముందే బయలుదేరి ప్రతిభాదేవి ఇంటికి చేరుకున్నాడు.

ప్రతిభాదేవి అతని కథలు చదివి, అతనిని తెగ ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్న అమ్మాయి, (ఆ పిల్ల, తెలుగు మీడియం స్టూడెంట్ అని గమనించ ప్రార్ధన)

"ఏమిటి? వారం రోజుల్నుంచి కన్పించటం లేదు. ఊరెళ్ళారా?" అడిగిందావిడ ఆశ్చర్యంగా.

"నేను ప్రత్యేక జనరంజని ప్రోగ్రాం ఇస్తున్నానండీ! అందుకని పాటలు వగైరా రెడీ చేసుకోవడంలో కొంచెం బిజీగా ఉన్నాను..."

"వాట్? మీరు ప్రత్యేక జనరంజని ఇస్తున్నారా?"

"అవును-" గర్వంగా అన్నాడు చంద్రకాంత్.

"మీరా?"

"అవును-"

"ఓ గాడ్! ఎప్పుడు?"

"ఇవాళే"

"వాహ్- అయితే మరి నాకిష్టమయిన పాటలు వేస్తారా?"

"ఓ! అన్నీ మీరు లైక్ చేసేవే"

"అబ్బ! మరి నాకు ముందే చెప్పలేదేం?"

"మిమ్మల్ని సర్ ప్రైజ్ చేద్దామని-"

"చిగురాకులలో చిలకమ్మా- తప్పక వేస్తారు కదూ?"

"ఎలాంటి అనుమానం లేకుండా"

"థాంక్ యూ ప్రియా-"

"ఓ! ఆ రికార్డు కూడా వేస్తున్నానండీ."

ఆమె అతని భుజం మీద కొట్టింది నవ్వుతూ.

"అది నేను మీకు చెప్తున్నానండీ 'థాంక్ యూ ప్రియా' అన్న రికార్డేమీలేదు..."

చంద్రకాంత్ తన తప్పుకి నాలిక్కరుచుకోబోయి, కరుచుకోలేదు.

"సారీ! అది లేటెస్ట్ పాటేమో అనుకున్నాను, చూడండి మీ కిష్టమయిన పాటలన్నీ వేస్తాను. ఎందుకంటే అవి మనిద్దరికీ ఇష్టమైనవేకదా..."

ఆమెకు టాటా చెప్పి రేడియో స్టేషన్ చేరుకున్నాడతను.

వివిధ భారతి ఆఫీసులో ఒకావిడ కూర్చుని టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్లో పాటలు వింటోంది.

"చూడండి! నన్నివాళ రికార్డింగ్ కి రమ్మని చెప్పారు..."

ఆమె విసుగ్గా అతనివంక చూసింది. ట్రాన్సిస్టర్ లో "సోగ్గాడే చిన్నినాయన- ఒక్క పిట్టనైన కొట్టలేదు సోగ్గాడే" అన్న పాట గట్టిగా వినబడుతోంది.

"ఏమంటున్నారు?"

"ఇవాళ నా రికార్డింగ్ ఉంది." "సోగ్గాడే చిన్నినాయన" ఆమె సౌండ్ తగ్గించింది.

"ఇవాళ నా రికార్డింగ్ ఉందండీ!"

"రికార్డింగా?"

"అవునండీ!"

"యువరాణి" ప్రోగ్రామా?" అనుమానంగా అడిగింది.

'కాదండీ! జనరంజని."

"జనరంజనా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవునండీ! నా పేరు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్-"

"కావచ్చు గాని జనరంజని అంటారేమిటి?"

"నేను జనరంజని ప్రోగ్రాం ఇస్తున్నానండీ ఈసారి! స్పెషల్ జనరంజని"

"మీరిస్తున్నారా?"

"అవునండీ"

"ఎవరిమ్మన్నారు మిమ్మల్ని?"

"మీరేనండీ..."

"నేనా?"

"మీరంటే మీరు కాదండీ! మీ వివిధభారతి వాళ్ళన్న మాటండీ."

"మిమ్మల్ని ఇమ్మన్నారా?"

"అవునండీ, నేను రచయితను."

"మీరు రచయితా?" ఇంకా ఆశ్చర్యపోతూ అందామె.

"అవునండీ! కాకరపాలెం కుర్రోడు- సినిమా నా కథే!"

"నిజంగా?"

"నిజమండీ! కావాలంటే ఎవర్నయినా అడగండి!"

"అయితే అలా కూర్చోండి. మీ రికార్డింగ్ వున్నట్లు నాకెవ్వరూ చెప్పలేదు. ఇప్పుడే కనుక్కుంటాను" అంటూ ఎక్కడికో ఫోన్ చేసింది.

"ఎంగేజ్ డ్" అంది అతనివంక చూసి చిరాగ్గా.

"అవునండి. ఈ పోన్లెప్పుడూ ఎంగేజ్ వుంటాయ్" మర్యాద కోసం అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

మళ్ళీ డయల్ చేసి రెండు చేతుల్తో తల పట్టుకుని "ప్చ్" అంది. మధ్యలో ట్రాన్సిష్టర్ సౌండ్ కొంచెం పెంచింది. పాట రక్కున అందుకుంది.

"ఆడ నీవూ ఈడ నేనూ సూసుకుంటూ కూరుసుంటే ఎన్నాళ్ళు తాలగలను చందమామ, ఎన్నాళ్ళు దాచగలను చందమామా"

సౌండ్ మళ్ళీ తగ్గించేసిందామె-

మరోసారి డయల్ చేసింది. "హు" అందీసారి రిసీవర్ పగిలేలా ఫోన్ కేసి కొడుతూ.

"ఒక్క నిమిషం, ఇప్పుడే వస్తాను-" అని లేచి బయటికెళ్ళి పదినిమిషాల తర్వాత తిరిగి వచ్చింది.

"మీరు మాట్లాడదలుచుకున్న మేటర్ తెచ్చారా?" అడిగిందామె.

"ఓ ఇదిగో!" కాగితాలు ఆమె కిచ్చాడు. కుర్చీలో కూర్చుని అంతా చదివేసింది.

"ఇక్కడ, "క" కింద "క" వత్తు ఇవ్వడం మర్చిపోయారు" అంది ఓ చోట అతనికి చూపుతూ.

"థాంక్సండీ! మీరు "క" కింద "క" వత్తు చూపకపోతే చాలా గొడవయిపోయేది. "క" కింద "క" వత్తు ఎంత ఇంపార్టెంటండీ? నేను మామూలుగా వత్తులేకుండా చదివేసేవాడిని. దాంతో అర్థం మారిపోయేది. ఆ తరువాత దానికింద ఏ వత్తు వచ్చినా లాభం ఉండదు కదా! 'క' కింద 'క' వత్తు ఉంటేనే గాని..."

ఆ తరువాత ఏమనాలో తెలీక ఆగిపోయాడు చంద్రకాంత్.

ఆమె చాలా సంతోషించినట్లు మొఖంలో తెలిసిపోతోంది.

"క్రిందటిసారి కూడా ప్రత్యేక జనరంజని స్క్రిప్టులో ఇలాగే 'ర' కింద 'ర' వత్తు ఇవ్వడం మర్చిపోయారండీ ఒకాయన... పేరుకు పెద్ద రచయిత అయినా 'ర' కింద 'ర' వత్తు ఇవ్వలేదు."

"అబ్బ 'ర' కింద 'ర' వత్తే? ఎంత డేంజరస్? మీరు జీనియస్ కాబట్టి కనుక్కోగలిగారు."

ఆమె లేచి నిలబడింది మళ్ళీ.

"స్టూడియో ఖాళీగా ఉందేమో చూసి వస్తాను" అంటూ లోపలికెళ్ళి పావుగంట తర్వాత తిరిగి వచ్చింది.

"అన్నీ ఫుల్ గా ఉన్నాయండీ! అసలు మీకివాళ రికార్డింగు ఉందని ముందే తెలుస్తే స్టూడియో బుక్ చేయటం జరిగేది- కానీ నాకు ఇన్ ఫర్ మేషన్ లేదు."

"మరిప్పుడేం చేద్దామంటారండీ?

ఒక రికార్డింగు మాత్రం ఓ అరగంటలో పూర్తవుతుందండీ! ఆ తర్వాత చేస్తాను పోనీ-"!

"సరే!"

"మీరు సెలక్ట్ చేసిన పాటలలిస్టు ఉందా?"

లిస్టు తీసి ఆమె ముందుంచాడతను.

ఆమె లిస్టువంక చూస్తూనే రక్కున తలెత్తి చంద్రకాంత్ వంకచూసింది.

"మొదటిపాట" 'అందమె ఆనందం' వేస్తున్నారా?" ఆనందంగా అడిగింది.

"అవునండీ. ఆ పాటంటే నాకెంతో ఇష్టం!"

"నాకూ ఎంతో ఇష్టమండీ చాలా మంచిపాట అది."

"అలాగా, ఆ పాట లిరిక్ కూడా చాలా బావుంటుందండీ."

"కానీ ఆ రికార్డ్ మరీ పాతది కదండీ. మా దగ్గర ఉండదు."

"ఉండదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఉండదండీ, మరీ పాత రికార్డులు ఉండవు."

"అదేమిటి? ఇంత పెద్ద రేడియో స్టేషనులో అంత మంచి రికార్డులు ఉండవా?"

"ఉండవు?"

ఆమె మళ్ళీ లిస్టు చూసింది.

"ఇదిగో ఈ రెండో రికార్డ్ కూడా ఉండదు."

"అది శభాష్ రాముడులోందండీ, మరీ అంత పాతదేం కాదుగా?"

"అయినా కూడా కష్టమండీ, దొరకదు."

"అయ్యో ఎలాగండీ మరి?"

"ఎలాగోలా ఎడ్జస్ట్ అవ్వాలండి. చాలా పాత పాటలు మా దగ్గర ఉండవు. ఇదిగో 'చిగురాకులలో చిలకమ్మా' రాశారు చూశారా, ఇదీ ఉండదు."

"అదేంటండీ. ఇది చాలా ఫేమస్ సాంగ్ కదా! దొంగరాముడు లోది."

"అందరూ కోరే పాట కాబట్టే ఇది అసలుండదండీ. ఉన్నది పూర్తిగా అరిగిపోయి ఉంటుంది.. మళ్ళీ కొత్తది కావాలంటే కష్టం!"

అప్పుడె ఒకాయన రెండు టేప్స్ తీసుకుని వచ్చాడక్కడికి.

"ఏమిటి అరిగిపోయింది?" అడిగాడు చిరునవ్వుతో.

"దొంగరాముడులోని పాటండీ. చిగురాకులలో చిలకమ్మా-"

"ఎవరన్నారు అది అరిగిపోయిందనీ?" అడిగాడతను.

"నేను అంటున్నాను- అసలది మన దగ్గరే లేదనుకుంటాను కదా!"

"అలా అనుకోకండి, ఉంది."

"ఉందా?"

"అవును! మొన్నే నేను జనరంజనిలో వేశాను. ఫస్ట్ క్లాస్ గా ఉంది రికార్డ్."

"అరగలేదా" అడిగిందామె.

"కొంచెం కూడా అరగలేదు." అనేసి అతను టేప్స్ అల్మారాలో ఉంచి వెళ్ళిపోయాడు.

"పోనీ ఓ పని చేస్తే బాగుంటుందండీ. మీ దగ్గరున్న పాటల లిస్ట్ నాకిస్తే అందులో వున్నవే సెలక్ట్ చేసుకుంటాను" అన్నాడు చంద్రకాంత్ నిరుత్సాహంగా.

"లిస్టా? లిస్టేమిటి?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"లిస్ట్ అంటే అదేనండీ రికార్డ్స్ లిస్ట్"

"అలాంటివేమీ ఉండవండీ ఇక్కడ" చిరాకుగా అందామె.

"మరి మాకెలా తెలుస్తుందండీ- ఫలానా పాట ఉందో లేదో"

"మీరు రాసిచ్చి వెళ్ళిపోండి. ఉంటే వేస్తాం లేకపోతే లేదు."

చంద్రకాంత్ కి ఓ క్షణం మతిపోయినట్లయింది.

"స్టూడియో ఖాళీ అయిందేమో చూసొస్తానుండండి" అంటూ వెళ్ళి కాసేపటి తర్వాత తిరిగి వచ్చింది.

"రండి స్టూడియో ఖాళీ ఉంది..."

చంద్రకాంత్ లేచివెళ్ళి రూమ్ లో మైకుముందు కూర్చున్నాడు.

"ఓసారి చదవండి సౌండ్ ఎడ్జస్ట్ చేస్తాను" అందామె రికార్డింగ్ రూమ్ లోనుంచి.

రెండులైన్లు చదివాడు.

"ఆగండి! కొంచెం డిస్టర్బెన్స్ వస్తోంది-" అంది అతని గదిలో కొచ్చి.

"ఏం చేస్తారు మరి?"

"టెక్నీషియన్ ని పిలుచుకొస్తాను."

వెళ్ళి పావుగంట తర్వాతోవ్యక్తితో పాటు తిరిగివచ్చిందామె.

అతను వచ్చి మైకును అటూ ఇటూ తిప్పి, దాని నెత్తిమీద రెండుసార్లు లాగి కొట్టాడు.

"ఏదీ ఇప్పుడు మాట్లాడండి చూద్దాం" అన్నాడు, అక్కడే నిలబడి. చంద్రకాంత్ మళ్ళీ రెండు లైన్లు చదివాడు.

ఈ సారి గొంతు అసలు రావడం లేదని రికార్డింగ్ రూమ్ లోనుంచి ఆమె సైగ జేసింది.

అతను మళ్ళా మైక్ ని ఓ తన్ను తన్నాడు.

"ఇప్పుడు మాట్లాడండి చూద్దాం."

చంద్రకాంత్ మళ్ళీ రెండు లైన్లు చదివాడు. ఆమె అద్దంలోనుంచి తల అడ్డంగా తిప్పింది.

అతను తివాచీ కిందున్న ఓ అర తెరచి అందులోని రెండు వైర్లు తారుమారు చేశాడు. తరువాత మైక్ నెత్తిమీద మళ్ళీ రెండు కొట్టి "ఇప్పుడు మాట్లాడండి" అన్నాడు.

చంద్రకాంత్ మళ్ళీ రెండులైన్లు చదివాడు.

ఆమె లాభం లేదన్నట్లుగా అద్దంలో నుంచి చేయి ఊపింది.

అతను వెళ్ళి మరో టెక్నీషియన్ ని తీసుకొచ్చాడు. ఇద్దరూ కలసి అరగంట సేపు పరీక్షలు చేసి చంద్రకాంత్ తో మొదటి రెండులైన్లు మరో పదకొండుసార్లు చదివించి చివరకు ఆ మైకు రికార్డింగ్ కి అనర్హం అని తేల్చారు.

"ఇంకో యూనిట్ ప్రయత్నిద్దాం పదండి" అందామె. అందరూ కలిసి పక్కనే ఉన్న మరో గదిలో కెళ్ళారు.

మళ్ళీ కథంతా మామూలే. మళ్ళా రిపేర్లు, మైకు నెత్తిమీద కొట్టడాలు, వైర్లు మార్చడాలు, చంద్రకాంత్ ఇరవై ఆరుసార్లు చదవడాలు షెడ్యూలు ప్రకారం జరిగిపోయాయి.

ఆ తరువాత ఇంకో గదిలోకి మారారు.

"ఇలా ఎన్ని గదులున్నాయండీ!" బొంగురుపోయిన గొంతుతో కారిపోతున్న చెమటలు తుడుచుకుంటూ అడిగాడు చంద్రకాంత్. రికార్డింగ్ పరికరాలతో పాటు ఎయిర్ కండిషన్ కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తోంది.

"భయపడనక్కరలేదులెండి. ఈ యూనిట్ బాగానే ఉన్నట్లుంది" అందామె.

"వీటిల్లో మరి ఇంతవరకూ జరిగిన రికార్డింగ్ లు ఎలా జరిగాయండీ?" అనుమానంగా అడిగాడు.

"అవన్నీ కాంగ్రెస్- 'బి' గవర్నమెంట్ కి జై కొట్టే చెంచా ప్రోగ్రాములు కదండీ! రికార్డింగ్ క్వాలిటీ ఎలా ఉన్నా ఫర్వాలేదు. ఎందుకంటే వినేవారెవరూ ఉండరు. మరి మీ ప్రోగ్రాం అలా కాదు గదా- సినిమా పాటల కోసం మీ మాటలు వినక తప్పదు. విన్నప్పుడు మరి క్వాలిటీ లేకపోతే శ్రోతలు గొడవ చేస్తారు. అందుకే ఈ తిప్పలు" అందామె.

రికార్డింగ్ ప్రారంభమయింది.

"ఆ, ఇది బాగానే ఉందండీ ఇక ప్రారంభిద్దాం. మీరు మాట్లాడాక సినిమా పాట రావాల్సిన చోట కొంచెం గాప్ ఇవ్వండి. తరువాత ఆ ప్లేస్ లో పాట డబ్ చేస్తారు" అందామె.

ఎలాగయితేనేం, రికార్డింగ్ పూర్తయింది. అప్పటిచే చంద్రకాంత్ రూమ్ వేడికి తడిసి ముద్దయిపోయాడు.

అతను ఈసురోమని లంఖణాలు చేసినవాడిలా బయటికొచ్చి "బ్రతుకు జీవుడా" అని ఇంటికి బయలుదేరాడు.

"ఆకాశవాణి వివిధ భారతి- వాణిజ్య ప్రసార విభాగం! ఈనాటి ప్రత్యేక జనరంజని కార్యక్రమం- ప్రముఖ రచయిత శ్రీ చంద్రకాంత్ గారు సమర్పిస్తున్నారు" అంది రేడియోలో ఎనౌన్సరు.

చంద్రకాంత్ తో పాటు మేమందరం ప్రతిభాదేవి ఇంట్లో సమావేశమయాం, అతని కార్యక్రమం విని ఆనందించడానికి. ప్రతిభాదేవి ఆ కార్యక్రమాన్ని మరో టూ- ఇన్- వన్ లో రికార్డింగ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

మరుక్షణం చంద్రకాంత్ గొంతు నీరసంగా వినబడింది.

శ్రోతలకు నమస్కారం! మీతో గడిపే ఈ అవకాశం దొరకడం నిజంగా నాకెంతో ఆనందంగా వుంది. ఎందుకంటే... టంగ్ టంగ్.. లక్షాధికారులు కూడా- రెండో బిడ్డను కన్నప్పుడు ఆలోచనలో పడుతున్నారు...

మనకూ మాణిక్యాల్లా ముచ్చటగ ముగ్గురున్నారుగా?"

"మన బిడ్డలు మాణిక్యాలే- మట్టిలో మాణిక్యాలు! ఒకడేమో కాళ్ళకు చెప్పులైనా లేకుండా గోళీకాయలాడుతున్నాడు."

"వాడికి చెప్పులు కొంటాన్లేవే."

"రెండోవాడు ఎక్కడెక్కడో తిరిగి ఇప్పుడే ఇంటికి వచ్చాడు."

"వీడికి గోళీకాయలు కొంటానులే."

"ఇక మూడోవాడు ఎండిపోయిన నా శరీరంనుంచి రక్తమాంసాలు పీల్చేస్తున్నాడు."

"అయితే వీడిని ఇన్ కమ్ టాక్స్ డిపార్ట్ మెంట్ లో చేర్పించి- అలానే నేనూ ఇప్పుడే ఆపరేషన్ కూడా చేయించుకొస్తా."

"టంగ్ - టంగ్-"

ప్రతిభాదేవి చిరాగ్గా అతనివేపు చూసింది.

"ఛఛ, ఈ పాడు గొడవంతా రికార్డయిపోయింది. అయినా మాటల మధ్యలో ఎందుకు ఇరికించనిచ్చావు?"

"బాగుంది నాకేం తెలుసు? అసలు గాప్ కూడా వదల్లేదు నేను-" ఠక్కున మళ్ళా చంద్రకాంత్ గొంతు వినిపించేసరికి అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"-డ్రువ్ జుక్ ల ద్వారా మీతో మాట్లాడడం సాధ్యంకాదు. కాబట్టి సినిమా పాటలంటే నాకూ ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచీ నేను ప్రేమించేపాట ఒకటుంది. ఆ పాటలో అర్థం ఎంతో అద్భుతంగా ఉంటుంది. అందం అంటే ఆనందమనీ, ఆనందం అంటే జీవిత మకరందం- అనీ- టాంగ్- టాంగ్-

"కాళ్ళున్న కుర్రోళ్ళారా కాలేజి పిచ్చోళ్ళారా
క్రోకోడిల్ చెప్పులున్నాయ్! కాళ్ళకు క్రోకోడిల్ చెప్పులున్నాయ్
మన్నికధికం- ధరలు స్వల్పం
క్రోకోడిల్ చెప్పులున్నాయ్- కాళ్ళకు క్రోకోడిల్ చెప్పులున్నాయ్

"ఈ పాటేశావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు అతని స్నేహితుడు.

"ఇది పాట కాదురా, వ్యాపార ప్రకటన" విసుగ్గా అన్నాడు చంద్రకాంత్.

"హోప్ లెస్- ఈ వెధవ ప్రకటన కొంచెం రికార్డయింది" అంది ప్రతిభాదేవి రెండు చేతులలో తలపట్టుకుంటూ- మరి రెండు ప్రకటనల తర్వాత పాట మొదలయింది.

"ఆరేసుకోబోయి పారేసుకున్నాను హరీ-హరీ-హరీ- కోకెత్తుకెళ్ళింది కొండగాలీ-"

అందరూ ఉలిక్కిపడ్డారు. వాళ్ళతోపాటు చంద్రకాంత్ కూడా షాకయ్యాడు.

"ఇదేమిట్రా అందమె ఆనందం పాట అని చెప్పి కొండగాలి కోకెత్తుకెళ్ళిందంటా వేమిటి?" వెంకట్రావ్ కోపంగా అన్నాడు.

"అదే నాకూ తెలీటంలే, నేను అందమె ఆనందం పాట వేయాలనే రాసిచ్చాను మరి వాళ్ళు ఇదెందుకు వేశారో" పాలిపోయిన మొఖంతో అన్నాడు చంద్రకాంత్.

ప్రతిభాదేవి టేప్ చేయడం ఆపేసింది. ఆమె మంచి సాహిత్యాన్ని ప్రేమిస్తుందన్న సంగతి అందరికీ తెలిసిందే!

"ఈ వెధవ పాట కూడ కొంచెం రికార్డయిపోయింది" అంది ఉక్రోషంగా.

"అసలు నువ్వే ఈ పాట రాసిచ్చావేమో" అంది అతనివేపు అనుమానంగా చూస్తూ.

అతనికి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయి.

తనను 'బాస్టర్డ్" అని తిట్టినా సహించగలడు గానీ ఇలాంటి పాటను తనే సజెస్ట్ చేశాడనడం మాత్రం సహించలేడు. వెంటనే అక్కడున్న ఫోన్ తీసుకుని వివిధ భారతికి డయల్ చేశాడు.

ఎవరిదో మగ గొంతు వినిపించింది.

తన గురించి చెప్పుకున్నాక నేను "అందమె ఆనందం పాటరాస్తే, మీరు కోకెత్తుకెళ్ళింది కొండగాలి వేశారేమిటి?" అనడిగాడు.

"అదా! ఆ రికార్డ్ దొరకలేదేమో! అందుకని ఇది వేసి ఉంటారు!" అన్నాడతను తేలికగా.

"ఎవరు?"

"డబ్బింగ్ చేసినవాళ్ళు?"

"ఎవరా డబ్బింగ్ చేసిన వ్యక్తి?"

"అదెలా తెలుస్తుందండీ! ఎవరుబడితే వాళ్ళే చేస్తుంటారు."

"ఆ పాట లేనప్పుడు ఊరుకోవాలి గానీ ఈ చెత్తపాట ఎందుకు వేసినట్లు?" కోపంగా అడిగాడు.

"బహుశా ఈ పాట ఆ డబ్బింగ్ చేసినతనికి ఇష్టమైనది అయుంటుంది! అయినా ఈ పాట మంచిదేగా! చాలా హిట్టయిన సాంగ్" అనేసి ఫోన్ పెట్టేశాడతను.

"ఏమన్నారు?" అడిగింది ప్రతిభాదేవి.

"ఏ పాటవేయాలి అనేది పాటలు డబ్ చేసేవాళ్ళ ఇష్టం మీద ఆధారపడి ఉంటుందట" నీరసంగా అన్నాడు చంద్రకాంత్.

"ఆరేసుకోబోయి" పాట అయిపోయింది.

వెంటనే అరడజను వ్యాపార ప్రకటనలు దుమ్ము దులిపేశాయ్.

ఆ తరువాత హఠాత్తుగా తుమ్ము వచ్చినట్లు చంద్రకాంత్ గొంతు వినబడింది.

"ఛీ... చెం మత్తు కలిగించే సాహిత్యం కనిపించేది. ఆ మత్తు కేవలం సాహిత్యానికే కాదు. ఆ పాట బాణీది కూడా! అప్పటికీ, ఎప్పటికీ నిలిచిపోయే పాట ఇది- కబస్సా- తపట," టేప్ పూర్తిగా అరిగిపోయి ఏవేవో శబ్దాలు చేసిన తరువాత మళ్ళీ చంద్రకాంత్ గొంతు వినిపించింది.

"ఇప్పుడు- నాకిష్టమయిన పాట- మా ఫ్రెండ్ ప్రతిభాదేవి కూడా ఎప్పుడూ మెచ్చుకునే పాట- చిగురాకులలో చిలకమ్మా పాట" అన్నాడు చంద్రకాంత్.

అతను ప్రతిభాదేవి వంక గర్వంగా చూశాడు.

ఆమె వెంటనే టేప్ చేయసాగింది. మళ్ళీ చంద్రకాంత్ గొంతు-

"ఈ పాట గురించి చాలా బాగా చెప్పావు!" అన్నాడు గోపాల్రావ్.

ఇంకా చాలా చెప్పను గాని అదంతా ఎందుకనో కట్ చేశారు" అన్నాడు చంద్రకాంత్.

అందరూ నిశ్శబ్దంగా పాట కోసం ఎదురు చూడసాగారు. అరా నిముషం గడిచిపోయినా పాట వినిపించడం లేదు.

"ఏమయింది?" అంది ప్రతిభాదేవి ఆశ్చర్యంగా.

"నాకూ అదే అర్థం కావటం లేదు" అన్నాడు చంద్రకాంత్.

అందరూ మరో అరనిముషం ఎదుర్చూశారు. ఏవేవో శబ్దాలు వినపడుతున్నాయ్. కానీ పాట అంతులేదు.

"ఒకవేళ రేడియో స్టేషన్ లో కరెంటుపోయిందేమో!" అన్నాడు జనార్ధన్.

చంద్రకాంత్ మళ్ళీ వివిధభారతికి ఫోన్ చేశాడు.

"హలో, నేను చంద్రకాంత్ ని మాట్లాడుతున్నానండీ."

"చంద్రకాంత్ రెండు మీటపాన్లు తెమ్మని చెప్పి అరగంటయింది. ఏమైపోయావ్" అడిగిందో లేడీ వాయిస్.

చంద్రకాంత్ కి మండిపోయింది.

"మీటాపాన్ ఏంటండీ! నేను చంద్రకాంత్ రచయితను మాట్లాడుతున్నా!"

"తెలుసండీ. ఇవాళ జనరంజని మీరే సమర్పిస్తున్నారని ముందే ఎనౌన్స్ చేశాంగా."

"నేననేది రేడియోలో సంగతి కాదండీ ఇప్పుడు ఫోన్ లో-"

"మాట్లాడండి."

"ఏదీ రేడియోలో పాట వినబడదేం?"

"వినబడలేదా?"

"లేదండీ సైలెంట్ గా ఉంది రేడియో. ఒకవేళ మీ దగ్గర కరెంటేమయినా పోయిందేమోనని-"

మా దగ్గర వినబడుతోంది కదా! ఓ అర్థమయ్యింది మీ రేడియో వ్యాల్యూమ్ ఫుల్ పెట్టి, మీ చెవి స్పీకర్ దగ్గర ఆనించండి! బ్రహ్మాండంగా వినబడుతుంది.

"అదేమండి, చెవి రేడియో స్పీకరు వద్ద ఎందుకు పెట్టటం?"

"రికార్డింగ్ సరిగ్గా జరగలేదండీ. అందుకని అలా చేస్తే గానీ పాట వినబడదు"

"రికార్డింగ్ సరిగ్గా ఎందుకు జరగలేదు?"

"ఆ విషయం డబ్బింగ్ చేసినవారిని అడగాలండి!"

"ఎవరు డబ్ చేసింది?"

"ఒకరనేమిటండీ ఎవరుపడితే వాళ్ళే చేస్తారు. ఎవరూ లేకపోతే మా నైట్ వాచ్ మెన్ కూడా చేసేస్తాడు."

"ఎంత నైట్ వాచ్ మన్ చేసినా సౌండ్ బాగా పెంచి రికార్డింగ్ చేయవచ్చు కదండీ?"

"మీకో రహస్యం చెప్పమంటారా?"

"చెప్పండి."

"మళ్ళీ ఎవరితోనూ అనరు కదా?"

"అనములెండి."

"అసలు డిఫెక్ట్ ఆ రికార్డింగ్ హెడ్ దండీ."

"రికార్డింగ్ హెడ్డంటే?"

"రికార్డ్ చేసే పరికరం అన్న మాట! అది కొంచెం చెడింది. ఇలా డబ్బింగ్ చేసేప్పుడు సాధారణంగా నేనేం చేస్తుంటానంటే దానిని ఓ చేత్తో గట్టిగా నొక్కి పట్టుకుని కూర్చుంటాను. అప్పుడు మాంచి సౌండ్ వస్తుంది. చాలామందికి ఈ విషయం తెలీదు. అంచేత తెలీనివాళ్ళు డబ్బింగ్ చేసేప్పుడు ఆ హెడ్ 'టచ్' అవకపోవడం వల్ల పాట నూతిలోంచి వస్తున్నట్లుంటుంది."

"అది రిపేర్ చెయ్యొచ్చు కదండీ?"

"ఎందుకు చేయకూడదు? మహారాజులాగా చెయ్యవచ్చు."

"మరెందుకు చేయరు?"

"అదేనండీ, నేనూ ఎప్పుడూ తల్చుకుని తెగ ఆశ్చర్యపోతూంటాను."

చంద్రకాంత్ ఫోన్ పెట్టేసి విషయమంతా ప్రతిభాదేవికి చెప్పాడు. ఆమె వెంటనే ట్రాన్సిస్టర్ వాల్యూమ్ పూర్తిగా పెంచి చెవి స్పీకర్ దగ్గర ఉంచి వినసాగింది. ఓ క్షణం విన్నదో లేదో చటుక్కున తల దూరంగా జరిపి "ఛీ మీ టేస్టు ఇంత హారిబుల్ అనుకోలేదు" అంది చంద్రకాంత్ తో కోపంగా.

"ఏమయింది?" బెదురుగా అడిగాడతను.

"నిజంగా మీకు తెలీదా?"

"ప్రామిస్- తెలీదు ఏ పాట వేశాను?"

"మీరే వినండి."

చంద్రకాంత్ తన చెవి స్పీకర్ కి ఆనించాడు.

ఎక్కడో నూతిలోంచి వినబడుతున్నట్లుంది పాట.

"రాయబారం చేయవే తడికో తడికా-"

"ఇదేమిటి? ఈ పాట ఇక్కడ వేయాల్సింది కాదు" కోపంగా అన్నాడు చంద్రకాంత్.

"మరెక్కడ వేయాలంటే?" లక్ష్మణరావు నవ్వుతూ అడిగాడు.

"నేను మరో సందర్భంలో సినిమా సాహిత్యం ఎంత చెడిపోయిందో ఉదాహరణగా దాని పల్లవి మాత్రం వేయమని కోరాను"

మళ్ళీ వివిధభారతికి ఫోన్ చేశాడతను.

"ఇదేమిటి! ఇక్కడ నేను చెప్పినపాట వేయకుండా మరో సందర్భములో వేయాల్సిన పాట ఇక్కడ వేశారు?"

అతను నవ్వాడు.

"అది డబ్బింగ్ చేసినతనని అడగాలండీ."

"ఎవరు డబ్బింగ్ చేసింది- వద్దులెండి! అది టాప్ సీక్రెట్ కదా? అదీగాక అతని ఇంట్రెస్ట్ అతనిది- కాదనటానికి మనమెవరం?" అనేసి ఫోన్ పెట్టేశాడు.

పాట ఆగిపోగానే ట్రాన్సిస్టర్ కి ప్రాణం వచ్చినట్లు ఇల్లెగిరిపోయే సౌండ్ తో మోగసాగింది.

"టింగ్ - టింగ్"

"ఒరు పాకెట్ మంజీరా చేగోడీ కుడప్పా!"

"గివ్ మీ వన్ పాకెట్ మంజీరా చేగోడీ బ్రదర్"

"ఏక్ పాకెట్ మంజీరా చేగోడీ దేదోభాయ్!"

"ఏమిటి? మంజీరా చేగోడీకి ఇంత డిమాండా?"

"అవును, కోట్లాది ప్రజలు కక్కుర్తిగా తింటారు మంజీరా చేగోడీలు."

"టింగ్ టింగ్-"

"మీ బొచ్చు తెల్లబడిపోయిందా? చింతించకండి, జిగేటా వారి హేర్ డైని వాడండి, నల్లగా నిగనిగలాడే బొచ్చుతో మీ అందాన్ని రక్షించుకోండి."

"టింగ్ టింగ్-"

ప్రతిభాదేవి కోపంగా ట్రాన్సిస్టర్ స్విచాఫ్ చేసింది.

"అయిదు నిమిషాల తర్వాత మళ్ళీ ఆన్ చేసేసరికి చంద్రకాంత్ గొంతు కంచుమోగినట్లు వినబడుతోంది.

"నేను రచన చేసిన సినిమా 'కాకరపాలెం కుర్రోడు' సినిమా షూటింగ్ అవుతున్నప్పుడు ఓ తమాషా జరిగింది. నేనూ, డైరెక్టరుగారూ మా పిక్చర్ హీరోగానూ ఏదో విషయం మాట్లాడుకుంటున్నాం.

"నేను డైరెక్టర్ గారితో మాట్లాడుతూ ఇలా అన్నాను- టింగ్ టింగ్- హలొం మీ వళ్ళు దురదగా ఉందా? గిర్మెక్స్ కంపెనీవారి బర్మెక్స్ వాడండి. దురదలూ, వాపులూ, ప్రేలుడూ, అన్నీ తగ్గిపోయి శరీరం నునుపుగా, అందంగా, పచ్చగా తయారవుతుంది గుర్తుంచుకోండి బర్మెక్స్- బర్మెక్స్- బర్మెక్స్."

"టింగ్ టింగ్."

ప్రతిభాదేవి రెండు చేతుల్తోనూ తల పట్టుకూర్చుంది.

ఠక్కున మళ్లీ చంద్రకాంత్ గొంతు వినిపించిసాగింది.

"వంకాయకూరంటే నిజంగా అంత గొప్పది- ఆ కూర చూసినప్పుడల్లా... ఢబక్.. ఢబక్.."

అందరూ అదిరిపడ్డారు. చంద్రకాంత్ మొఖం పాలిపోయింది. సడెన్ పాట "లగ్గమెప్పుడురా మావా అంటే- మాఘమాసం వెళ్ళేదాకా మంచిరోజు లేదన్నాడు ఆగేదెట్టాగా- అందాక ఏగేదెట్టాగా."

"కాకరపాలెం కుర్రోడు షూటింగ్ అవుతున్నప్పుడు జరిగిన తమాషాకీ, వంకాయకూరకీ, ఈ పాటకూ ఏమిటి సంబంధం?" కోపం అణచుకుంటూ అంది ప్రతిభాదేవి.

వెంకట్రావ్ లక్ష్మణరావ్ విరగబడి నవ్వారు.

"ఒకవేళ ఏ సంబంధమూ లేకపోవడమే జోకేమో."

పాట ఆగిపోగానే చంద్రకాంత్ గొంతు మళ్ళీ తరుముకొచ్చింది.

"మా ఊరి రైల్వేస్టేషన్ లో ఆ బిచ్చగాడు రాత్రి పన్నెండు గంటలకు నిశ్శబ్దంలో ఎలుగెత్తి పాడేపాట వింటూంటే నాకిప్పటికీ కళ్ళ వెంబడి నీళ్ళు తిరుగుతుంటాయ్- ఇదిగో ఆ పాట వినండి. మీ గుండెలు కూడా తప్పక బరువెక్కిపోతాయ్."

"టింగ్ టింగ్-"
విర్మా- వాషింగ్ పౌడర్ విర్మా
... బట్టలు తెల్లగా ఉతుకు మురికిని తెల్లగా జేయు
వాషింగ్ పౌడర్ విర్మా
వాషింగ్ పౌడర్ విర్మా"
"టింగ్- టింగ్"

"ఏం పాట నాయనా అంత గుండెలు బరువెక్కే పాట అన్నావు" అడిగాడు లక్ష్మణరావు.

"ఏటికేతంబట్టి వెయి పుట్లు పండించి- ఎన్నడూ మెతుకెరుగరన్నా"

"నిజంగా చాలా గొప్ప పాటరా! గుండెల్ని పిండేస్తుందది" వప్పుకున్నాడు చంద్రం.

"ఈ ఒక్కపాట సరిగ్గా వేసినా చాలు వాళ్ళు..." అన్నాడు లక్ష్మణరావు.

కానీ పాట రాలేదు మళ్ళా చంద్రకాంత్ గొంతు వినిపించసాగింది.

"టైమయిపోతోందనుకుంటాను ఆఖర్లో కాకరపాలెం కుర్రోడు లోని ఓ పాట వినిపిస్తాను- ఈ పాట సినిమాలో లేదు. సెన్సార్ వాళ్లు ముక్కలు ముక్కలు చేసేశారు ఆ పాటను వినండి."

"టింగ్- టింగ్"

"గర్భ నిరోధక మాత్రలు ఎలా వాడాలి?"

"ఋతుక్రమం అయిన మూడో రోజు నుంచి రాత్రి పడుకోబోయేముందు ఓ మాత్ర మింగాలి. ఒకవేళ ఒకరోజు మర్చిపోతే రెండోరోజు రెండు మింగాలి. అప్పుడూ మర్చిపోతే పాపాయిని అనాధశరణాలయానికి ఇచ్చివేయాలి."

"అవును నర్సు చెప్పింది."

"తనూ పాపాయిని అనాథ శరణాలయానికే ఇచ్చిందట. అయినా నిన్ను కూడా అడుగుదామనుకున్నాను."

"టింగ్- టింగ్"

ప్రతిభాదేవి ట్రాన్సిస్టర్ స్విచాఫ్ చేసి టేప్ రికార్డర్ లోని టేప్ తీసి మేడ మీద నుంచి కింద మురికి గుంటలోకి విసిరిపారేసింది.

"గెటవుట్" అంది అందరినీ- కోపంగా చూస్తూ. ముగ్గురూ రోడ్డు మీద కొచ్చేశారు.

ఆ తరువాత వారం రోజుల వరకూ చంద్రకాంత్ ఆఫీసు కెళ్ళలేదు, గడ్డం పెంచుకుని పిచ్చివాడిలా ఇంట్లోనే గడుపుతున్నాడు.

ఆ రోజు శనివారం. వాళ్ళ తమ్ముడు గదిలోంచి రేడియో గట్టిగా వినబడుతోంది. "అందమె ఆనందం- ఆనందమె జీవిత మకరందం-"

"ఈ పాటలేదన్నారు. ఇప్పుడెలా వినబడుతోంది?" కోపంగా అనుకున్నాడతను. మరుక్షణంలో శ్రోతల ఉత్తరాల కార్యక్రమం ప్రారంభమయింది.

రచయిత చంద్రకాంత్ గారు సమర్పించిన జనరంజనిని మా ఇంటిల్లిపాదీ ఎంతో తిట్టుకున్నాం. వాక్యానికీ వాక్యానికి పొంతన లేకుండా, చెప్పే దానికీ పాటకూ సంబంధం లేకుండా, అర్థం లేని సగం వాక్యాలు చదివీ వెధవ్వాగుడు వాగి శ్రోతలకు పిచ్చి ఎక్కించటానికి ప్రయత్నించారాయన. ఇంకోసారి ఇలాంటి పిచ్చి జనరంజనీలు సమర్పించకండి. ఇలాంటి చిల్లర బూతుపాటలు వేసే రచయితల్ని పిలవకండి."

"వంగపల్లి నుంచి రామకృష్ణరావు గారు కూడా చంద్రకాంత్ గారిని బూతులు తిడుతూ ఉత్తరం రాస్తున్నారు. పాటలు పరమ చెత్తగా ఉన్నాయనీ, అలాంటి చెత్తపాటలు వేయడం వల్ల రచయిత గారి దరిద్రపు అభిరుచి తెలుసుకోడానికి వీలయిందనీ అంటున్నారాయన. అలాగే సికింద్రాబాద్ నుంచి రాజారామ్ గారు చంద్రకాంత్ గారిని దూషిస్తూ రాశారు. ఇంకా సనత్ నగర్ నుంచి అప్పలాచారి గారు, మల్కాజ్ గిరి నుంచి రమణారెడ్డి గారు, ఉప్పల్ నుంచి మనోహర్ గారు, రామ్ నగర్ నుంచి ప్రతిభాదేవి గారు, మలక్ పేట్ నుంచి చంద్రం, లక్ష్మణ్ రావ్ గార్లు...

చంద్రకాంత్ పరుగుతో వెళ్ళి టేబుల్ మీదున్న రేడియో ఎత్తి నేలకేసి కొట్టాడు. అతనికి పగిలిన ముక్కలు చూసేసరికి తెగ నవ్వొచ్చింది.

"హ్వాహ్వాహ్వా జనరంజని- హ్వాహ్వాహ్వాహ్వా ప్రత్యేక జనరంజని- హ్వాహ్వాహ్వాహ్వా".

* * * * *

# ఇల్లు కట్టిచూడు

ప్రపంచ తెలుగు మహాసభలకు ఎలాగయినా వెళ్ళాలని అందరం దానితాలూకూ సీక్రెట్ ఇన్ ఫర్మేషన్ లాగే ప్రయత్నంలో ఉన్నాం.

"కాంగ్రెస్ వాళ్ళను పట్టుకుంటే చాలా తేలిగ్గా వెళ్ళిపోవచ్చు" అన్నాడు జనార్ధన్.

"కానీ వాళ్ళను ఎలాపట్టుకోవటం?" అడిగాను నేను.

ఆ ప్రశ్నకు అందరూ గొల్లున నవ్వారు. నన్నో వెర్రివెంగళాయిని చూసినట్టు కూడా చూశారు.

"రాజకీయ నాయకుల్ని ఎలా పట్టుకోవాలో తెలీదా! భలేవాడివయ్యా నువ్వు! ప్రపంచంలో అతితేలికయిన విషయం అదే"

ఆ విషయం గురించి డిస్కషన్ పూర్తయిపోయాక రంగారెడ్డి అసలు విషయం ప్రస్తావించాడు.

"ఆ మధ్య మా అమ్మమ్మ చనిపోయిన విషయం మీకందరికీ తెలుసుకదా! ఇప్పుడు ఆమెతాలూకూ ఇంటిస్థలం ఒకటి నాకు సంక్రమించింది. అదెక్కడుందో, ఏమిటో ఇంకా వివరాలు తెలీవు. సరే- హైద్రాబాద్ లో స్థలం దొరకటమే మనలాంటి వాళ్ళకు అపురూపమయిన విషయం గనుక అక్కడ ఇల్లు కడదామని మా ఆవిడ గొడవచేస్తోంది."

మాకందరికీ హఠాత్తుగా రంగారెడ్డి మీద ఈర్ష్య కలిగింది.

రాజధానిలో స్థలం దొరకటం, ఇల్లుకట్టడం ఒక్క చీఫ్ మినిష్టర్ కీ మిగతా మంత్రులకీ తప్ప మరెవరికీ సాధ్యంకాదని మా అనుమానం.

ఎందుకంటే వాళ్ళకు ప్రభుత్వ రూల్సేమీ వర్తించవు గనుక.

ఏదేమయినా మా అందరికీ సొంత ఇల్లు లేకుండా వుండటం కంటే మాలో ఒక్కడికయినా ఇల్లు వుండటం మంచిదే అనిపించింది కాసేపయ్యాక.

"ఇంక ఆలోచనెందుకు కట్టిపారెయ్" అన్నాడు శాయిరామ్.

"కానీ అది అంతతేలిక్కాదని విన్నాను. మన ఫ్రెండ్స్ సర్కిల్లో ఇల్లు కట్టిన వాడెవడయినా వుంటే వాడిసలహా అడుగుదాం" అన్నాడు గోపాల్రావ్.

"దాన్దేముందీ? బాబు వున్నాడు కదా! రీసెంట్ గానే ఇల్లు కట్టాడు. పదండి! అతని దగ్గరకెళదాం" అన్నాడు జనార్ధన్.

అందరం బాబు ఇల్లు వెతుకుతూ బయలుదేరాం. అరగంట సేపట్లో మా స్కూటర్లు నగరం బయట కొచ్చేసినాయి. వనస్థలిపురం కూడా దాటిపోయేసరికి మాకు ఓపికపోయింది.

"ఇంకెంత దూరం వెళ్ళాలి?" అడిగాడు గోపాల్రావ్.

"ఆ!- ఎంత? ఇంకో నాలుగు కిలోమీటర్లు! చాలా దగ్గర"

మరోరెండు కిలోమీటర్ల దూరంవెళ్ళాక మెయిన్ రోడ్ నుంచి పక్కకు తిరిగాం. అదో మట్టిరోడ్డు.! అంతాగుట్టలూ, రాళ్ళూ, చెట్లూ తప్పితే ఇంకేమి కనిపించటం లేదక్కడ.

మరో కిలోమీటర్ దూరం తర్వాత మట్టిరోడ్డు కూడా ఆగిపోయింది. ఓ సన్నని కాలి త్రోవ మాత్రం కనబడుతోంది.

"ఇంకెక్కడ?" అడిగాడు యాదగిరి ఆగిపోయి.

"అదిగో! ఆ చెట్టుచాటున సగం కట్టేనిల్లు కనిపించటంలేదూ? అదే మనోడిల్లు"

అందరం అదిరిపడ్డాం.

"ఏమిటి. ఇంత మారుమూల ఇరుగుపొరుగూ లేకుండా ఒక్కడే కాపురముంటున్నాడా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇది మారుమూలేమిటి? బాగా డిమాండ్ వున్న ప్లేస్.అయినా మనాడింటికి కిలోమీటర్ దూరంలో ఇంకొకతనుకూడా ఇల్లు మొదలుపెట్టాడట! ఇంక సందడికేం తక్కువని!"

అందరం బాబు ఇంటికి చేరుకున్నాం.

కాంక్రీట్ పిల్లర్స్ తో కట్టాడది. ఉత్తి స్తంభాలూ, పైన కాంక్రీట్ శ్లాబ్ మాత్రం లేసివుంది. రెండుగదులకు మాత్రం వున్నాయ్. మిగతాగదులన్నీ ఓపెన్ గానే వున్నాయ్. దగ్గరకు వేసివున్న గది తలుపు తట్టాడు జనార్ధన్.

లోపల దభేల్ మన్న చప్పుడూ దానివెనుకే పరుగెడుతున్న అడుగుల చప్పుడూ వినిపించింది. మాకు ఏమీ అర్థంకాలేదు.

"బాబూ!" మళ్ళీ తలుపు తట్టాడు జనార్ధన్.

ఈసారి మళ్ళీ పరుగు చప్పుడు వినిపించింది. ఆ తరువాత రెండునిముషాలకు వాళ్ళావిడ తలుపు కొంచెంగా తీసి అడ్డం నిలబడింది.

"ఆయన ఊళ్ళోలేరండీ. విశాఖపట్నం వెళ్ళారు ఆఫీస్ పనిమీద. ఇంకో వారం రోజులవుతుంది తిరిగిరావటానికి-" అంటూ జనార్ధన్ నీ, మమ్మల్ని చూసి చిరునవ్వుతో తలుపు తెరిచింది.

"మీరా అన్నయ్యా! రండి! ఇంకెవరో అనుకున్నాను" అంది. అందరం బిలబిలమంటూ లోపలకు నడిచాం.

ఆ గదిలో కుర్చీలు, టీపాయ్, టీ.వీ, ఫ్లవర్ వాజ్ అంతా బాగానే వుంది. కాకపోతే గోడలకింకా రంగువేయలేదు.

"వైజాగ్ ఎప్పుడు వెళ్ళాడు? నిన్న సాయంత్రం కూడా కనిపించాడు గానీ నాతో ఏమీ చెప్పలేదే" అన్నాడు జనార్ధన్.

ఆమె జవాబు చెప్పటానికి సిగ్గుపడింది.

"నిజానికి ఆయన వైజాగ్ వెళ్ళలేదన్నయ్యా! ఇంట్లోనే ఉన్నారు కానీ- అంటూ లోపలి గది అటకవేపు చూస్తూ" ఏవండీ! దిగండి! మనకాలనీవాళ్ళే వచ్చారు" అంది.

డబ్బాలూ, అట్టపెట్టెలూ అన్నీ పక్కకుతోసుకుంటూ అటకమీదనుంచి కిందకు దిగాడు బాబు. మొఖం, బట్టలూ అంతా దుమ్ము అంటుకుపోయి భయంకరంగా కనిపించసాగాడు.

మాకు కొద్దిక్షణాలవరకూ నోటమాట రాలేదు.

టవల్ తో మొఖం తుడుచుకుంటూవచ్చి కుర్చీలో కూర్చున్నాడు బాబు.

"మరేం లేదు. అప్పులాళ్ళేమో అనుకుని అటక మీదెక్కాను' చిరునవ్వుతో చెప్పాడతను.

"అప్పులాళ్ళేమిటి?" ఆత్రుతగా అడిగాడు రంగారెడ్డి.

"అదే! ఇల్లుకట్టాను కదా! అంచేత కొద్దిరోజులు కొంచెం యిలా అప్పులవాళ్ళనుంచి తప్పించుకోక తప్పదులే!"

"కొద్దిరోజులంటే ఎన్నాళ్ళు?"

"ఆ! మహా అయితే అయిదారేళ్ళు. అప్పులిచ్చేవాళ్ళు మొదటి అయిదారు సంవత్సరాలే మహా దూకుడుగా వుంటారు. తర్వాత వాళ్ళ పవర్ కొంచెం తగ్గిపోతుంది. అప్పుడు ఎదుటపడినా ఏం ఫర్లేదు. కాసేపు గొణిగిపోతారు. అదే మరో అయిదేళ్ళు బాకీ తీర్చలేదనుకోండి. అప్పుడు ఆ గొణగడం కూడా వుండదట. మనం కనబడితేచాలు భోరునేడుస్తూ కాసేపు మనవెంటపడతారట. మనం అదేం చూడనట్లు, వాడి ఏడుపుతో మనకేమీ సంబంధంలేనట్లూ వెళ్ళిపోవాలట. మనకాలనీలో ఉండే బోస్ చెప్పాడివన్నీ. వాడు ఇల్లుకట్టి చాలా కాలం అయిపోయింది కదా?" రంగారెడ్డి కొంచెం నిరుత్సాహపడినట్లు మాకనిపించింది.

"ఇంతకూ ఏమిటిలా హఠాత్తుగా వచ్చేశారు? కొంచెం ముందే చెప్పివస్తూండండి! సాధారణంగా బయట తలుపు చప్పుడవగానే నేను వెనుక తలుపు తీసుకుని అయిదారు కిలోమీటర్లు పరుగెత్తు కెళ్ళిపోతాను. మళ్ళా అయిదారు గంటల తర్వాతగాని ఇల్లు చేరుకోను!"

"మరిమేము ఇందాక తలుపుకొట్టినప్పుడు వెళ్ళలేదేం?"

"ఇంతకుముందే రెండుసార్లు వెళ్ళి ఇప్పుడే ఇంటికి చేరుకున్నాను. ఇప్పుడు మళ్ళీ పరుగెత్తాలంటే కొంచెం అద్దకం వేసింది. అందుకని రిస్క్ తీసుకుని అటక ఎక్కేశాను. నిజం చెప్తున్నాను. అటక చాలా రిస్క్ తో కూడుకున్న వ్యవహారం. కొంతమంది అప్పులాళ్ళు ఎంత తెలివిమీరి పోయారంటే సరాసరి ఇంట్లో కొచ్చేసి అటక మీదెక్కి వెతుకుతున్నారు. రెండుసార్లు దొరికిపోయానలా! అలా దొరికిపోయినప్పుడు పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుందిలే!"

"సంగతేమిటంటే మన రంగారెడ్డి ఇల్లుకట్టాలని అనుకుంటున్నాడు! నీ అనుభవాలేమిటో చెపితే- దానిని బట్టి-" చెప్పాడు జనార్ధన్.

బాబు రంగారెడ్డి వేపు చూశాడు జాలిగా.

"ఏం గురూజీ! మీరు ఇల్లు కట్టాలనుకుంటున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును! ఏం"

"అహహ- ఏం లేదు! పీస్ ఫుల్ గా ఉండే మీ జీవితం కాస్తా ఊపిరి తిరగానంత పనితో నిండిపోతుంది ఇల్లుకట్టడం మొదలయిందంటే ఇప్పుడున్న సంతోషం ఉండదు. ఆకలి వేయదు. నిద్రరాదు! నేను కంటినిండా నిద్రపోయి పదిహేను రోజులు అయింది."

రంగారెడ్డి మరింత నిరుత్సాహపడిపోయాడు.

"అయినా గానీ మనం బయటపడకూడదు. ఎందుకో తెలుసా?

అందరం ఆత్రంగా అతనివేపు చూశాం.

"ఎందుకంటే- మనసులో ఎంతో సెక్యూరిటీ ఫీలవుతాం! మనదేశంలాంటి దిక్కుమాలిన దేశంలో గవర్నమెంట్ సర్వెంట్స్ కి ఆ ఫీలింగ్ చాలా అవసరం. మీకు తెలీదేమో! మా ఆఫీస్ లో సీనియర్ క్లర్క్ గా పనిచేసిన మూర్తి గారి గతేమయింది? రిటైరవగానే గవర్నమెంట్ క్వార్టర్స్ ఖాళీ చేయించేశారు. దాంతో తక్కువ అద్దెవున్న ఇంటికోసం తిరిగి తిరిగి చివరకు ఆ ఎండకు వడకొట్టి చచ్చిపోయాడు. అదీగాక ఇంకో ముఖ్యమయిన విషయం ఒకటుంది. అదేమిటంటే మనం మన సొంతింట్లో ఉంటున్నాం అనే ఫీలింగ్! ఆహాఁ ఎన్ని బాధలయినా పడనీ! నాకెంత ఆనందంగా ఉంటుందో తెలుసా? ఈ ఇల్లసలు పూర్తవనీ, అవకపోనీ- నేను అటకమీదేకాపురం ఉండనీ! అయినా పర్లేదు! నా ఇల్లు ఆహా! ఎంత అద్భుతమయిన ఫీలింగో మీకు తెలీదు మీరు గవర్నమెంట్ కాలనీలో ఉన్నారు గనుక మీకా ఫీలింగు తెలీదు కానీ నాలాగా అద్దె ఇళ్ళల్లో కొంతకాలం గడిపినోడికి తెలుస్తుంది."

వాళ్ళావిడ అందరికీ మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

"సారీ అన్నయ్యగారూ! మేము కాఫీ, టీ తాగటం మానేశాం- ఇల్లు కట్టిన దగ్గర్నుంచీ! ఏదో మనకు వీలయినంత పొదుపు మనం చేయాలి కదా!" అందామె దిగులుగా.

"అవునవును! తప్పదు మరి!" అన్నాడు శాయిరామ్ భయంగా.

మేమందరం లేచి బయటకు నడవబోతుండగా ఓవ్యక్తి స్కూటర్ మీద వచ్చి ఇంటి ముందు ఆగాడు. మాతోబాటు బయటకు రాబోతున్న బాబు అతనిని చూడగానే చెంగునవెనకకు గెంతి పెరటి తలుపు తీసుకొని మెరుపులా పారిపోయాడు.

"ఉన్నాడా?" ఆ వ్యక్తి మమ్మల్ని అడిగాడు.

"లేడు! అందుకే మేము వెళ్ళిపోతున్నాం" అన్నాడు శాయిరామ్ చప్పున.

"నీ యవ్వ. నాబాకీ సంగతేమోగానీ వసూల్జేయటానికి పెట్రోలుకీ దానికీ డబుల్ అయేట్లుంది థూ" అనుకుంటూ వెళ్ళిపోయాడతను.

మేము రింగ్ రోడ్ దగ్గరకొచ్చేసరికి కనకయ్య పాన్ డబ్బా దగ్గర నిలబడి "నమస్తే సార్" అంటూ గట్టిగా అరిచాడు.

దాంతో స్కూటర్లు ఆపక తప్పలేదు.

ఎందుకంటే కనకయ్య అందరికీ బాగా తెలుసు. అతను రిజిస్ట్రార్ ఆఫీస్ లో ప్యూన్. మా కాలనీలో కొంతకాలం ఉన్న తర్వాత బంజారాహిల్స్ లో ఓ అందమయిన మేడ కట్టుకుని వెళ్ళిపోయాడు.

"ఏమిటి కనకయ్యా! ఇటుపక్క వచ్చావేమిటి?" అడిగాడు రంగారెడ్డి.

ఈ ఏరియాలో ఎనిమిది పోర్షన్ లతో ఇల్లుకట్టానీమధ్యే! అద్దె వసూలు చేసుకోటానికి వచ్చాను- అన్నాడు బెన్సన్ అండ్ హెడ్జస్ సిగరెట్ పాకెట్ తీసి ఓ సిగరెట్ వెలిగించుకుని మాకూ ఒకటి ఆఫర్ చేస్తూ. మా కాలనీ వాళ్ళందరం విల్స్ సిగరెట్ తాగటమే ఓ లగ్జరీగా భావిస్తుంటాం! అలాంటిది అతను ఆ ఫారిన్ సిగరెట్స్ ఆఫర్ చేసేసరికి ఆశగా, హాపీగా తలోసిగరెట్ తీసుకుని కాల్చసాగాం.

"అద్దె ఎంత వస్తుంది- ఎనిమిది పోర్షన్లకూ?" అడిగాడు శాయిరామ్ కుతూహలంగా.

"ఎంత సార్? చాలా తక్కువ! మొత్తం ఎనిమిదివేలారొందలకంటే ఒక్కపైసా కూడా ఎక్కువ రాదు"

మాగుండెలవిశిపోయాయ్. నెలకు ఎనిమిదివేలారొందలు ఇంటి అద్దె కింద వస్తుందా? మేము రిటైరయేప్పుడు కూడా మాకంత జీతం రాదు. మా అందరికీ పాన్ డబ్బాలో నుంచే కూల్ డ్రింక్స్ ఇప్పించాడతను. ఇంత డబ్బు తగలేసి మా అందరికీ కూల్ డ్రింక్స్ తాగించాలని ఎక్కడుంది? కేవలం మా మీద అభిమానంతోనే కదా!

"పాపం మనాడికి లిఫ్ట్ ఇద్దాం- మన స్కూటర్ మీద" అన్నాడు గోపాల్రావ్ జాలిగా.

"అవునవును- పాపం! అంత ఖర్చుపెట్టి కూల్ డ్రింక్స్ కూడా తాగించాడు. ఆ డబ్బుపెడితే బస్ లోనయినా వెళ్లిపోయేవాడు" అన్నాడు జనార్ధన్.

"అవ్ కనకయ్యా! నా స్కూటర్ వెనుక కూర్చో! లిఫ్ట్ ఇస్తాను" అన్నాడు యాదగిరి.

కనకయ్య చిరునవ్వు నవ్వాడు.

వద్దు సార్! మీ దయవల్ల మొన్నే కారు కొన్నాను- వస్తాన్సార్! మళ్ళీ కలుస్తా" అంటూ పక్కనే పార్క్ చేసి ఉన్న మారుతీ కార్లో కూర్చుని డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

కొద్ది క్షణాలవరకూ మాకెవరికీ మాట రాలేదు. నిశ్శబ్దంగా స్కూటర్స్ స్టార్ట్ చేసుకుని కాలనీ చేరుకున్నాం.

"హు! ఆఫ్టరాల్ రిజిస్ట్రారాఫీస్ లో ప్యూన్, ఎనిమిదిపోర్షన్లున్న ఇల్లుకట్టగా లేంది నేనెందుకు కట్టలేను? కట్టేస్తా" అన్నాడు రంగారెడ్డి ఆవేశంగా.

"అవును! కట్టగలవ్" అన్నాడు శాయిరామ్.

"కాకపోతే ఇల్లుకట్టడానికి ఎక్కడయినా లోన్ సంపాదించాలి. హౌసింగ్ లోన్ ఎక్కడ దొరుకుతుంది?"

"స్టేట్ గవర్నమెంట్స్ వాళ్ళు లోన్స్ అనేవి ఇవ్వటం మానేశారట" చెప్పాడు గోపాల్రావ్.

అలాంటి మాట చెప్పినందుకు మాకతనిమీద వళ్ళు మండిపోయింది.

"ఎందుకు ఇవ్వటం లేదు?" ఉక్రోషంగా అడిగాడు రంగారెడ్డి.

"ఎన్.టి.ఆర్. ప్రభుత్వమయ్యా! ఈ ప్రభుత్వంలో ఏ డిపార్ట్ మెంట్ కీ, ఫండ్స్ ఉండవ్!" వెటకారంగా అన్నాడు శాయిరామ్.

"అవ్! నేను గవర్నమెంట్ లైబ్రరీ మెంబర్ గదా! మొన్న యండమూరి లేటెస్ట్ నవల రక్తాభిషేకం గురించి లైబ్రరీ వాళ్ళ నడిగా! అందరూ నన్నో పాగల్ గాన్ని చూసినట్లు చూసి నగిన్రు! సంగతేమంటే ఎన్.టి.ఆర్. కొలువులో కెక్కుతూనే తెలుగోండ్లకు పుస్తకాలు కొనేది బంద్ చేసిండంట! దీని దిక్కుకెళ్ళి అయిదేండ్ల నుంచి లైబ్రరీల ఎక్క పుస్తకం లేదు-" మండిపడుతూ అన్నాడు యాదగిరి.

"నాకూ అదే అర్థంకావటం లేదు. లైబ్రరీల కోసం మనం మున్సిపాలిటీలకు పన్ను కడుతున్నాం! అది ఆపటానికి ఎన్.టి.ఆర్. ఎవరు?" తనూ తిరగబడ్డాడు జనార్ధన్.

"పుస్తకాల్సంగతి అట్లా ఉండనీండి. రిక్రూట్ మెంట్ బాన్ అంట! మా అన్నయ్య కొడుక్కి ఎన్టీఆర్ వచ్చిన దగ్గర్నుంచి ఇంటర్ వ్యూలు కూడా లేవు. కాంగ్రెసోళ్ళ పరిపాలనలో కనీసం ఎగ్జామినేషన్స్, ఇంటర్ వ్యూలయినా వస్తూండేవి!" గోపాల్రావ్ అన్నాడు.

అయినా ఈ గవర్నమెంట్ లోన్ ఎందుగ్గానీ- హెచ్.డి.ఎఫ్.సి.వాళ్ళు లోన్స్ ఇస్తున్నారు గదా! అక్కడి కెళ్తే సరి!" సలహా ఇచ్చాడు చంద్రకాంత్.

రంగారెడ్డి మొఖంలో కల వచ్చేసింది.

"ఆ! ఇస్తారా? ఎక్కడ ఆ ఆఫీసు?"

"బషీర్ బాగ్ లో ఉంది! రేపు వెళ్దాం"

ఆ రాత్రే రెండింటికి రంగారెడ్డి ఇంట్లో నుంచి కేకలు వినబడితే పరుగుతో వెళ్ళాను. వాళ్ళావిడ అప్పటికే నిద్రకళ్ళతో అక్కడ మూగిన కాలనీవాళ్ళకు సంగతి వివరిస్తోంది.

"మరేం లేదు, ఆయనకు కలొచ్చింది! ఇల్లంతా కటాక ఎన్టీఆర్ వచ్చి పడగొడుతున్నాట్ట!"

రంగారెడ్డి ఇల్లు కట్టనీ కట్టకపోనీ గానీ- అతను ముందు ఓ ఇంటిస్థలానికి ఓనరయాడంటే నిజంగా ఓ చిన్నసైజు నవాబు అయినట్లు మా కనిపించసాగింది.

ఆ తరువాత మా అందరికీ నిద్రపట్టడం మానేసింది.

అంటే అది జెలసీ వల్ల కాదు. కాలనీలోని భార్యామణులందరూ మగాళ్ళను నిద్రపోనీయకుండా సాధింపు మొదలు పెట్టారన్నమాట.

"నిద్రకేం లోటు లేదు కదా! మీరేమో రోజూ ఈపాడు కార్పొరేషన్ రోడ్లమీద ఆఫీసులకెళ్ళి వస్తుంటే ఏరోజు కారోజు తిరిగి ఇంటికొస్తారో లేదోనని మేము హడలి ఛస్తున్నాం. సడెన్ గా మీకేమయినా జరిగితే మాకు ఉంటానికో గూడయినా లేకపోతే ఎలా?" అని అంటూండేవారు.

వాళ్ళలా అంటున్న కొద్దీ మాకు సైకొలాజికల్ గా భయం పెరిగిపోసాగింది. ఎందుకంటే ట్రాఫిక్ పోలీసుల చేతగానితనం వల్ల హైద్రాబాద్ లో ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతాయో మేము చూస్తూనే ఉన్నాం. లారీలు బస్ స్టాప్ లో స్కూలుకెళ్ళడానికి నిలబడ్డ స్కూల్ పిల్లల మీద కెక్కేయటం, రోడ్డు పక్కనే ఉన్న రిక్షాల్నీ అందులో ఉన్న మనుష్యుల్నీ దున్నేయటం, ఆటోవాళ్ళకు ఆత్మహత్యలు చేసుకోవాలనిపించి నప్పుడల్లా ప్రయాణీకుల్ని ఎక్కించుకుని శరవేగంతో ఆటో నడిపి పల్టీలు కొట్టించేయడం, హైదరాబాద్ గూండాలకు ప్రభుత్వ సారా ఎక్కువయి నప్పుడల్లా కత్తులు తీసుకుని రోడ్డున పోయేవారి నందరినీ కత్తులతో పొడిచి పారేసి డాన్స్ చేయటం ఇలా ఎన్నో విధాల పౌరులను అంతంచేసే సరికొత్త విధానాలు ప్రభుత్వం రూపొందిస్తోంది కదా!

"ఈ పరిస్థితుల్లో మనం ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటే బావుంటుంది" అన్నాడు శాయిరామ్ ఉత్సాహంగా. ఈ విధంగానయినా మీటింగ్ ఏర్పాటు చేసి మైక్ ముందు విన్యాసాలు జరపాలని అతని ప్లాన్! అయితే ఈ విషయం మాకందరికీ తెలియటం వల్ల మేము అతని మాటలు కొట్టి పారేశాం. అయినా శాయిరామ్ అంత తేలిగ్గా పట్టు సడలించే రకం కాదు.

ఆడాళ్ళందరికీ 'సొంతిళ్ళు- సొంత స్థలం' అంటూ ఏవేవో ఆశలుపెట్టి వాళ్ళ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేయించేశాడు. ఇక గత్యంతరం లేక ఆదివారం నాడు మహాభారత్ టీవీ సీరియల్ అయ్యాక మేము కూడా సమావేశానికి చేరుకోక తప్పలేదు.

శాయిరామ్ అప్పటికే మైక్ ముందు నిలబడి ఆదిమానవుల కాలం నుంచీ మనిషి దశల వారీగా 'ఇల్లు'అనేదానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తోంది వివరిస్తున్నాడు. మధ్యమధ్యలో కాలనీ గేయ రచయిత 'ఇల్లు' అనే శీర్షికతో గేయాలు- ఛాన్స్ దొరికి నప్పుడల్లా వినిపిస్తున్నాడు.

ఆఖర్లో "మీ అందరికీ సొంతింటి స్థలాలు కావాలనే అనుకుంటున్నారా?" అని ప్రశ్నించాడు శాయిరామ్.

"కావాలీ కావాలీ" అని అరిచారందరూ.

"ఆ కార్యక్రమం చూడ్డానికి కమిటీకే అధికారం ఇద్దాం" అన్నాడు బగారా బైగన్ వెంకట్రావ్. మిగతా వాళ్ళంతా అతని సూచనను సపోర్ట్ చేశారు.

"ముందు మన కాలనీవాళ్ళకు ఏ ఏరియాలో స్థలాలు కావాలో నిర్ణయిస్తే బాగుంటుంది" అన్నాడు రంగారెడ్డి.

"అబిడ్స్" అని అరిచారు కొంతమంది. మరికొంతమంది మెహిదీపట్నం అన్నారు. ఇంకొంత మంది 'చిక్కడపల్లి' అంటూ అరిచారు. ఇలా వాళ్ళు చదివిన పేర్లన్నీ విన్నాక రంగారెడ్డి లేచి నిలబడ్డాడు మళ్ళీ.

"సోదర సోదరీ మణులారా, అబిడ్స్ లోనూ గండిపేటల్లోనూ ఉండాలను కోడానికి మనమేం రాష్ట్ర ముఖ్యమంత్రులం కాదు! వ్యాపారస్తులం అంతకన్నా కాదు. కనీసం మనం గూండాలమయినా, గవర్నమెంట్ స్థలాలు ఉచితంగా ఆక్రమించే వాళ్ళం. మనలాంటి మిడిల్ క్లాస్ పక్షులు సిటీలో ఉండటం అసాధ్యం. నగర శివార్లలో అయితేనే మన ఆర్థికస్థోమతకి తగ్గ స్థలాలు దొరుకుతాయి. కనుక మీరిలా గొంతెమ్మ కోర్కెలు కోరటం మానేయాలి!" అన్నాడు హేళనగా.

"అయితే ఆ గొడవంతా కూడా మీరే చూసుకోండి" అంటూ అరిచారు కొంతమంది.

ఆ రోజునుంచీ మేము స్థలాల కోసం వేట ప్రారంభించాం! బాంబే హైవేలో ముప్పయ్ కిలోమీటర్ల దూరంలోనూ, విజయవాడ హైవేలో ముప్పయ్ కిలోమీటర్లల దూరం లోనూ, నాగార్జునసాగర్ రోడ్డుమీద పదిహేను కిలోమీటర్ల దూరంలోనూ, ప్లాట్లు ఉన్నట్లు పేపర్లలో ప్రకటనలు చూశాం.

"ముందు బాంబే హైవే సైడ్ చూడటం మంచిది. ఎందుకంటే ఇండస్ట్రీస్ అన్నీ అటే ఉన్నాయి గనుక మన పిల్లలకు ఉద్యోగాలు అవీ దొరకాలంటే అటే ఉండాలి" అన్నాడు శాయిరామ్. ఆ మాట కరక్టేనని అందరూ ఒప్పుకున్నారు.

దాంతో ఓ ఆదివారం ఆ ప్లాట్లు అమ్మే ఆఫీస్ కి చేరుకున్నాం. ప్లాట్లు చూపించడానికి పదిహేను మంది పట్టే మెటడార్ వాన్ లో ముప్పయ్ మందిని ఇరికించి తీసుకెళ్ళారు వాళ్ళు.

మెయిన్ రోడ్ నుంచి అయిదారు కిలోమీటర్లు కొండ మీదా గుట్టల మీదా నడిచాక ఇళ్ళస్థలాలు ఉన్నాయ్.

చుట్టూ కనుచూపు మేర ఒక్కపిట్ట కూడా కనిపించటం లేదు.

ఈలోగా ఆ ప్లాట్ల డీలర్ ఓ స్పీకర్ తీసుకుని మమ్మల్నందరినీ ఉద్దేశించి మాట్లాడసాగాడు.

"సోదరులారా! ఈ కాలనీ పేరు గోల్డ్ హిల్ కాలనీ! ఈ కాలనీలో ప్లాట్లు తీసుకుంటే మీ భవిష్యత్తు బంగారపు కొండగా మారుతుందన్న నమ్మకంతో ఈ పేరుపెట్టాము. ఈ కాలనీకి నాలుగు వేపులా నాలుగు అద్భుతమయిన ప్రాజెక్ట్ లు రూపుదిద్దు కోబోతున్నాయ్. భవిష్యత్తులో సౌత్ బోర్డర్ లో మన పార్లమెంట్ సమావేశాలు, సౌత్ లో జరపాలనే ఉద్దేశంతో పార్లమెంట్ భవనాలు కట్టే ప్రపోజల్ ఉంది. నార్త్ సైడ్ ఎయిర్ పోర్ట్ రెండువేల ఎకరాల్లో కడుతున్నారు."

మేము ఉలిక్కిపడ్డాం.

"ఎయిర్ పోర్ట్ ఇక్కడ కడుతున్నారా?" అడిగాడు గోపాల్రావ్ ఆశ్చర్యంగా.

"అవును!"

"ఎందుకు? బేగంపేటలో ఉందికదా?"

"అది చాలటం లేదు. ఇంకో వంద బోయింగ్ విమానాలకు మొన్నే ఆర్డర్ చేశారు. అవి వచ్చాయంటే వాటి పార్కింగ్ కి ప్లేస్ వుండదు. మెయిన్ రోడ్ పక్కన పార్క్ చేయడానికి కార్పొరేషన్ వాళ్ళు వప్పుకోవటం లేదట. అందుకని వాటి పార్కింగ్ కోసం ఇక్కడ ఇంకో ఏరోడ్రమ్ కడుతున్నారు."

గోపాల్రావ్ కి అతని మాటల మీద నమ్మకం కలగలేదు.

"అలాంటి ప్రపోజల్ ఏమయినా వుంటే ముందు నాకు తెలుస్తుంది కదా! మా న్యూస్ పేపర్ వాళ్లకు తెలీందేముంటుంది?" అన్నాడు అనుమానంగా.

"ఆ ఇన్ ఫర్మేషన్ మాకు సీక్రెట్ దొరికింది- ఇకపోతే ఈస్ట్ సైడ్ న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ వస్తోంది".

"అదేమిటీ? మౌలాలీ దగ్గర ఒకటుందిగా?"

అతను కలవరపడ్డాడు.

"మౌలానీ దగ్గర ఉందా? ఎక్కడ?" అతను పక్కవాళ్లను కన్సల్ట్ చేశాడు.

"సారీ జెంటిల్మెన్! న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్ మౌలాలీ నాచారం మధ్య వున్నట్లు నాకిప్పుడే వర్తమానం అందింది. అంచేత ఈస్ట్ సైడ్ కర్షక పరిషత్ ఆఫీస్ వందకోట్ల కాపిటల్ తో పెడుతున్నట్లు తెలిసింది."

ఈసారి ఎవరూ ఆశ్చర్యపోలేదు. అందరూ ఘోల్లున నవ్వారు.

దాంతో అతను ఉపన్యాసం మానేసి బిజినెస్ లోకి దిగిపోయాడు.

కొంతమందిని వెంబడి తిప్పుతూ మధ్యమధ్యలో మావేపు చూపిస్తూ ప్లాటు నెంబర్లున్న సర్వాళ్ళ చుట్టూ తిరుగుతున్నాడు. మేమందరం గుమిగూడి మాలో మేము డిస్కస్ చేసుకో సాగాము.

"అంతా బోగస్! ఎయిర్ పోర్టూ లేదు. పార్లమెంటు భవనాలూ లేవు మనల్నందర్నీ టెంప్ట్ చేసి కొనిపించటానికి ప్రయత్నిస్తున్నాడు వాడు" అన్నాడు రంగారెడ్డి.

"అదీగాక మనం ఈ ఏరియాలో ప్లాట్లు కొన్నామంటే ఈ ఏరియాకు చెందిన డెకాయిట్స్ దయమీద ఆధారపడి బ్రతకాల్సిందే" అన్నాడు శాయిరామ్.

ఆ మాట వినడంతోనే అందరి గుండెలూ ఝల్లుమన్నాయ్.

"అవును! ఇక్కడ స్థలాలు కొనటం చాలా రిస్క్! ఖర్మ కాలి ఎవడయినా నా కథలూ, కవితలున్న ఫైల్స్ ఎత్తుకుపోయాడంటే నేను ఘోరమయిన దెబ్బతింటాను. వాడు ఓ రచయితగా వెలిగిపోతాడు" అంది రాజేశ్వరి.

అసలీ ఏరియా ఇంకో పాతికేళ్ళ వరకూ డెవలప్ కావటం అసంభవం" అన్నాడు గోపాల్రావ్. హఠాత్తుగా ఆ ప్లాట్స్ ఏజెంట్ మా దగ్గర కొచ్చాడు.

"మీరే ప్లాట్స్ బుక్ చేసుకుంటున్నారా?" అడిగాడతను పెన్సిల్ పుస్తకం తీసుకుని. మేమెవ్వరం మాట్లాడ లేదు.

"చెప్పండి! మీ కాలనీవాళ్ళకు గజానికి రెండ్రూపాయలు కన్సెషన్ కూడా ఇస్తున్నాను."

"మా కొద్దు" అన్నాడు గోపాల్రావ్.

"వద్దా? ఎందుకని?"

"ఈ ఏరియా ఇప్పట్లో ఛస్తే డెవలప్ కాదు"

"ఎందుకని?"

"మాకు కొంచెం కామన్ సెన్స్ ఉంది గనుక" అతనికి కోపంవచ్చింది.

"సరే! కొంటే కొనండి లేకపోతే లేదు. కానీ తరువాత కే.వీ. భాస్కర్ లాగా పశ్చాత్తాప పడాల్సి వస్తుంది మీరు"

"కే.వీ. భాస్కర్ ఎవరు?" ఆత్రుతగా అడిగాం అందరం.

"అతను కూడా పదేళ్ళ క్రితం అచ్చం మీలాగానే చౌకగా వచ్చిన స్థలం కొనను పొమ్మన్నాడు. ఇప్పుడు రోజూ ఆ స్థలం చుట్టూ తిరిగి భోరున ఏడుస్తూంటాడు."

"ఎక్కడుందా స్థలం?"

"అబిడ్స్ లో"

అందరం కొద్దిక్షణాలపాటు నోరు తెరిచేశాం.

"కమాన్! ఆలోచించండి! తలో అయిదువేలూ అడ్వాన్స్ కట్టండి! అంతే! ఇగాతా మొత్తం ఇన్ స్టాల్ మెంట్స్ లో ఇవ్వవచ్చు."

మేము వప్పుకోలేదు.

"మాకవసరం లేదు. నాగార్జునసాగర్ రోడ్ మీద ఇంతకంటే మంచి ప్లాట్లు వున్నాయని తెలిసింది. అక్కడికెళ్తాం" అన్నాడు గోపాల్రావ్.

"వెళ్ళండి! అవి కొంటేగాని మీకు తగిన శాస్తి జరగదు" అన్నాడతను కసిగా.

మేము అతని మాటలు వినిపించుకోకుండా నాగార్జునసాగర్ రోడ్ లో పన్నెండు కిలోమీటర్ల దూరం వెళ్ళాము. ఆ ప్లాట్లు ఒక్కసారి చూడటంతోనే అందరికీ ఎంతో నచ్చాయి. పైగా ఆ ప్లాట్లలో నాలుగిళ్ళు కూడా కట్టించి వున్నాయ్ అందరం ప్లాట్లు చూసి ఎవరేది కావాల్సిందీ సెలక్టు చేసుకున్నాం.

"ఈ ప్లాట్ల వెనుక వేపు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ఒకటి వెయ్యి ఎకరాల స్థలంలో కడుతున్నారు" చెప్పాడు బ్రోకర్.

అందరం అప్పటికి తెలివి మీరిపోవటం వల్ల ఘొల్లున నవ్వాం.

"ఏమిటి నవ్వుతున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అదే మీరు చెప్పిన పిల్లల కథ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్."

"అంటే నా మాట అబద్ధమంటారా?"

"అహ్హాహ్హాహ్హా" అంటూ నవ్వాం మళ్ళీ.

అతనిమొఖం కందిపోయింది.

"గజం ఎంత?" అడిగాడు జనార్ధన్.

"పాతిక రూపాయలు."

అందరం ఆశ్చర్యంగా మొఖాలు చూసుకున్నాం."

ఎందుకంటే పాతికరూపాయల్లో ఇంటి స్థలాలు దొరుకుతాయన్న విషయం మాకంతవరకూ తెలీదు. కనీసం యాభయ్ రూపాయలు ధరలేందే స్థలం అనేది హైద్రాబాద్ చుట్టుపక్కల అడవిలోనయినా దొరకదు.

"పాతిక రూపాయలా?" అనుమానంగా అడిగాం.

అతను మమ్మల్ని అపార్థం చేసుకున్నాడు.

"సరే మీరంతగా అడుగుతున్నారు కాబట్టి ఇరవై చేసుకోండి." మాకు స్పృహ తప్పినంత పనయింది. నోట మాట పెగలటం లేదు.

వెంటనే తలో అయిదువేలూ అడ్వాన్స్ కట్టాలని నిర్ణయించుకున్నాం.

"ఎందుకయినా మంచిది డబ్బిచ్చే ముందు ఓసారి ఆ నాలుగిళ్ళ వాళ్ళనూ కలుసుకుని వద్దాం పదండి" అన్నాడు రంగారెడ్డి.

అందరం రంగారెడ్డి వెంట ఆ ఇళ్ళ దగ్గరకు నడిచాం.

ఆ ఇళ్ళుముందే కూర్చుని కనిపించారా ఇళ్ళ వాళ్ళు. మమ్మల్ని చూడగానే పరుగుతో వచ్చి చుట్టూ మూగిపోయారు వాళ్ళ పిల్లలు.

వాళ్ళ చిరిగిపోయిన బట్టలూ, చింపిరి తలలూ చూసేసరికి మాకు భయం వేసింది.

"సార్! ఆ వాటర్ బాటిల్లో నీళ్ళివ్వరా? సార్! గుక్కెడు నీళ్ళు కావాల్సార్! 24 గంటలయి పోయింది సార్ నీళ్ళు తాగి" అంటూ బ్రతిమాల సాగాడో కుర్రాడు.

అందరి బాటిల్స్ లో నీళ్ళూ అందరికీ తాగిస్తూంటే పెద్దాళ్ళు కూడా పరుగుతో వచ్చి ఆ నీళ్ళు అందుకుని ఆశగా తాగసాగారు.

"ఏమిటి ఈ ఇళ్ళు మీవేనా?" అడిగాడు రంగారెడ్డి వాళ్ళల్లో ఒకతనిని.

"అవున్సార్" దీనంగా అన్నాడతను.

"మరి నీళ్ళ కోసం ఇలా మొఖం వాచినట్లు గుమికూడుతున్నారేమిటి?"

అతను ఇంక దుఃఖం పట్టలేకపోయాడు. ఛటుక్కున కూలబడి బావురుమని ఏడ్చేయ సాగాడు మాకు భయం పట్టుకుంది ఇదెక్కడి గొడవరా నాయనా అని.

"అరె! అలా ఏడుస్తావేమిటయ్యా! ఏం జరిగింది?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అది 1988వ సంవత్సరం బాబూ" అన్నాడతను.

మాకు గుండెలవిశిపోయినయ్- ఫ్లాష్ బాక్ మొదలెడుతున్నాడేమోనని. ఎందుకయినా మంచిదని రెండడుగులు వాన్ వేపు వేశాం. కానీ అతనా విషయం గ్రహించేశాడు.

"ఫ్లాష్ బాక్ చాలా చిన్నది సార్! అది 1988వ సం|| సెప్టెంబరు నెల. మేమప్పుడు మీలాగానే ఇస్త్రీ బట్టలతోనూ జేబులో అయిదారు పదిరూపాయల నోట్లతోనూ, పిల్లాపాపలతోనూ సుఖంగా వుండే వాళ్ళం. కానీ మా సుఖం చూసి ఓర్వలేని ఓ ఇంటి స్థలాల బ్రోకరు మాదగ్గర కొచ్చాడు. అంతే! వాడి మాయలో పడిపోయాం. నగలు తాకట్టుపెట్టి

స్థలం కొన్నాం. ప్రావిడెంట్ ఫండ్ లూ ఇతర హౌసింగ్ ల్లోనూ తీసుకుని ఇళ్ళు కట్టాం. అప్పుడు బోర్ వెల్ కథ ప్రారంభమయింది సార్" మళ్ళీ భోరున ఏడ్వ సాగాడతను. కథ సగంలో ఆపటం ఇష్టం లేక అతనిని ఓదార్చాం అందరం.

"మొదటి బోర్ వెల్ ఫెయిలయింది సార్! వాటర్ డివైనర్ తో ఇంకోచోట బోర్ వేయించాం! అది నూటడెబ్బై అడుగులలోతు కెళ్ళి రాతిని కొట్టుకుంది. అప్పటికే మేము అడుక్కుతినే స్థితికొచ్చాం. ఆ తరువాత మూడో బోర్ వెల్ మూడొందల యాభై అడుగులు లోతు కెళ్ళింది. కాని ఒక్కచిక్క నీరు కూడా దొరకలేదు. అప్పుడు తెలిసింది సార్! ఈ ఏరియాలో ఎక్కడా ఒక్కచుక్క నీళ్ళు రాదని! కానీ ఏం చేస్తాం? తెగ నీరుందని మమ్మల్ని నమ్మించి ఈ గుంటలో పడిన వర్షపు నీరు చూపించి మమ్మల్ని మోసం చేసేశాడు వాటి ఓనర్. అప్పటి నుంచీ ఈ ఇళ్ళను వదులుకోలేక ఆరు కిలో మీటర్ల దూరం నీళ్ళు తెచ్చుకు తాగలేక జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నాం సార్."

మాకు కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగాయ్.

కోపంగా మాకా స్థలాలు చూపించిన బ్రోకర్ వేపు చూశాం.

అతను తడబడ్డాడు.

"అబ్బే! మన స్థలాల్లో ఏం ప్రాబ్లమ్ లేదు సార్! వందడుగుల్లోపే నీరు పడుతుంది."

"నీకెలా తెలుసా విషయం?"

"వాటర్ డివైనర్ తో టెస్ట్ చేయించాం"

"మరి వాళ్ళూ ఆ టెస్ట్ చేయించారుగా"

"ఇదిగో చూడండి సార్! తీసుకుంటే తీసుకోండి. లేకపోతే లేదు. మీరు గాకపోతే ఇంకోళ్ళ కమ్మేస్తాను" అన్నాడతను కోపంగా.

ఆ తరువాత ఇంకో రెండు స్థలాలు చూశాక చివరికి విజయాద హైవేలో ముప్పయ్ కిలోమీటర్ల దూరంలో ఉన్న స్థలాలు తీసుకున్నాం అందరం. రంగారెడ్డికి ఉచితంగా సంక్రమించిన స్థలం అక్కడే ఉండటం ఒక కారణం. ఆ ఏరియా తాలుకూ డెకాయిట్ గాంగ్ లీడర్ మా గోపాల్రావ్ కి బాగా తెలిసినవాడు. అతని ఇంటర్ వ్యూ ఒకటి

గోపాల్రావ్ ఈ క్షణం డెయిలీ పత్రికలో పబ్లిష్ చేశాడు. నాలుగో కారణం అక్కడ ఇండస్ట్రీస్ లేవు! కనుక చెడుగాలీ, చెడు నీరూ ఉండదు. అయిదో కారణం ఆ ఏరియా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి అయే అవకాశం ఉందని చాలా మంది అంచనా! ముఖ్యమంత్రి అయితే ఇంకా ఈ ఏరియా ఎలా డెవలప్ అయిపోతుందో మాకు బాగా తెలుసు.

చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనింటి కెళ్ళేదారి విశాలంగా చక్కని పూల మొక్కలతో నిండిపోవటం మేం చూశాం. అంజయ్య ముఖ్యమంత్రి అయినప్పుడు ఆయనున్న ఏరియా ఎలా బాగుపడిందో మాకు తెలుసు. అలాగే ఎన్.టి.ఆర్. ముఖ్యమంత్రి అవగానే గండిపేట రోడ్ ఎలా రకీమని మారిపోయిందో కూడా మేము చూస్తూనే ఉన్నాం.

పెళ్ళాల నగలు తాకట్టుపెట్టి పి.ఎఫ్. లోన్లు, సొసైటీ లోన్లు అన్నీ తీసుకుని స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నాం. ఆ తర్వాత హౌసింగ్ లోన్ కోసం అందరం అప్లయ్ చేశాం.

హౌసింగ్ లోన్ అంటే చాలా తేలిగ్గా వస్తుందని మేమనుకున్నాం. కాని దానివల్ల మనిషి ఎంత నరకం అనుభవిస్తాడో మాకు అప్పుడే తెలిసింది. మా డిపార్ట్ మెంట్ వాళ్ళే మమ్మల్నంత హింసలు పెడతారని మేము కలలో కూడా అనుకోలేదు.

ముందు అర్బన్ లాండ్ డెవలప్ మెంట్ అథారిటీ క్లియరెన్స్ సర్టిఫికెట్ తెమ్మన్నారు తర్వాత హుడా క్లియరెన్స్ అన్నారు. అంతే! హుడా ఆఫీస్ చుట్టూ రెండేళ్ళు తిరిగాం తర్వాత నాన్ ఎన్ కంబరెన్స్ అన్నారు. దాని తర్వాత పహాణి పట్టా అన్నారు.

దురదృష్టవశాత్తు మనకి సర్టిఫికెట్స్ ఇచ్చే ఆఫీస్ లన్నీ స్టేట్ గవర్నమెంట్ ఆధీనంలోనే ఉన్నాయ్.

మరి స్టేట్ గవర్నమెంట్ ఆఫీసుల్లో సర్టిఫికెట్లు సంపాదించాలంటే ఎంతటి భయంకరమయిన పరిస్థితిల్లో చిక్కుకు పోతామో మా అందరికీ తెలుసు. ముందు వాళ్ళు మనల్ని ఉసుళ్ళు అనే పురుగుల్ని చూసినట్లు చూస్తారు.

'ఏం కావాలి?" అని అసహ్యించుకుంటూ అడుగుతారు.

"అప్లికేషన్ ఇచ్చిపో" అంటూ బిచ్చగాడిని కసురుకున్నట్లు కసుర్తారు.

పదిరోజుల తరువాత "ఏం అప్లికేషనూ?" అనడుగుతారు.

మనం ఈసారి వందనోట్లు ఒకటో రెండో ఇస్తాం. ఇచ్చినా గాని సరిగ్గా మాట్లాడరు. తర్వాత కనబడు అంటారు చిరాకుగా మొఖంపెట్టి.

"మేము లంచం ఇచ్చాం కదా?" అంటాం మనం- లంచం సంగతి గుర్తుచేస్తూ.

"ఏమిచ్చావ్?" అంటారు వాళ్ళు ఇంకా చికాకుగా.

"అదే" అంటాం మనం అందరిలో చెప్పటం ఇష్టంలేక.

"అదే అంటే?" అడుగుతారు వాళ్ళు.

"మీకు టూ హండ్రడ్ ఇచ్చాను మొన్న" అంటారు మీరు.

"ఇస్తే వీళ్ళందరూ ఇచ్చినోళ్ళు కాదా? నువ్వేం దిగివచ్చావా? బయట కూర్చో" అంటారు. ఈ బాధలన్నీ అనుభవించాక దేనికయినా ఓ హద్దు ఉంటుందన్న విషయం మాకు తెలిసొచ్చింది. మరి ఆ ఆఫీసుల్లో లంచానికి హద్దులు లేవు గనుక, మా సహనానికి హద్దులున్నాయి గనుక మేం డిపార్ట్ మెంట్ లోన్స్ కోసం పెట్టిన అప్లికేషన్ సంగతి మర్చిపోయాం.

మళ్ళీ ఏవో తంటాలుపడి నగలు తాకట్టు పెట్టి బేస్ మెంట్ వేయటం మంచిదని రంగారెడ్డి సలహా ఇచ్చాడు.

అలా చేస్తే తర్వాత ఆ అప్పులు తీరిపోయాక మళ్ళీ అప్పులు చేసి రూఫ్ వరకూ వేయటం, ఆ తర్వాత మళ్ళీ అప్పులు చేసి మిగతాది కంప్లీట్ చేయడం, సరయిన పద్ధతిని ఇంకొంతమంది కూడా అనేసరికి మేమందరం ఆ కార్యక్రమం అమలు పరచాలని నిశ్చయించుకున్నాం.

ఓ మంచిరోజు చూసుకుని భూమి పూజలు చేయడానికి మా కాలనీ తాలుకూ ఆడా, మగా, పిల్లా, పీచూ అందరం మా స్థలాల దగ్గరకు బయలుదేరాం.

మా ఆడాళ్ళందరూ చాలా ఉత్సాహంగా ఉన్నారు.

"మా స్థలంలో భూమిపూజకెళ్తున్నాం పిన్నిగారూ! ఎప్పటికయినా సొంతిల్లనేది కట్టుకుంటే గానీ సుఖం ఉండదు కదాఅగ ఇక్కడ చూడండి! ఈ కాలనీలో అన్నింటికీ నానా చావూ ఛస్తున్నాఅమగ ఒక గాలీ, వెలుతురూ లేదు. నీళ్ళు ఉండవ్. ఛఛ!" అంటూ చాలా హాపీగా చెప్పారు.

అయితే బస్ లో హయత్ నగర్ దాటేసరికి వాళ్లల్లో ఉత్సాహం క్రమేపీ తగ్గిపోసాగింది.

"ఇంకెంత దూరమండీ?" అంటూ ఆత్రుతగా అడగ సాగారు.

హయత్ నగర్ లో దిగాక ఇంకో బస్ కోసం నిలబడేసరికి వాళ్ళ కళ్ళల్లో కాంతి పూర్తిగా పోయింది. మొఖాలు వాడిపోయినయ్.

తీరా మరో బస్ లో కొంతదూరం వెళ్ళి అక్కడ దిగి రెండు కిలోమీటర్లు మట్టి రోడ్ మీద నడవాలనేసరికి వాళ్ళకు నీరసం వచ్చేసింది.

"ఏమిటి? అడవిలోనా మీరు స్థలాలు కొన్నది?" అంటూ విరుచుకుపడ్డారు.

"ఇల్లు కట్టుకుని మీ మగాళ్ళే ఉండండక్కడ! మేము ఛస్తేరాము" అనేశారు. ఎలాగయితేనేం అక్కడ ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్ట్ వస్తోందనీ, ఎనిమిది కాలేజీలూ, రెండు పబ్లిక్ స్కూళ్ళూ ఓ బస్ డిపో, ఓ రింగు రోడ్డూ- ఇలాంటివన్నీ వస్తున్నాయని అబద్ధం చెప్పాక కొంత శాంతించారు.

తీరా స్థలాల దగ్గరకు చేరుకునేసరికి అక్కడి దృశ్యం చూసి మా గుండెలవిసిపోయినయ్.

మా ప్లాట్లల్లో వరుసగా పాతిక గుడిసెలు వేసి వున్నాయ్.

ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ఎక్కడయినా ఓ గుడిసె కనిపించిందీ అంటే దానర్థం జంట నగర వాసులందరికీ క్షుణ్ణంగా తెలుసు.

ఆ గుడిసెలో ఓటు హక్కున్న ఓ పౌరుడుంటాడు. అతని వెనుక ఆ ఏరియాలో పేరుమోసిన ఓ గూండా వుంటాడు. ఆ గూండా వెనుక ఆ నియోజకవర్గం తాలూకూ ఎమ్మెల్యేగానీ, ఎం.పీ.గానీ ఉంటాడు. వాళ్ళిద్దరి వెనుకా ఓ రాజకీయ పార్టీ ఉంటుంది. పార్టీ వెనుక ప్రభుత్వం ఉంటుంది.

అందుకే మా అందరికీ సగం ప్రాణాలు పైనే పోయాయి మా అందరికీ మాటపడిపోయింది. చూపు పవర్ తగ్గిపోయింది. కాళ్ళూ చేతులూ సన్నగా వణుకుతున్నాయి.

"మన ప్లాట్లలో గుడిసెలు ఉన్నాయేమిటి?" భయంగా అడిగాడు రంగారెడ్డి.

"అదే ఆశ్చర్యంగా ఉంది. మనం కొని ఎన్నోరోజులు కూడా అవలేదు" దిగులుగా అన్నాడు శాయిరామ్.

"పదండి! వాళ్ళెవరో ఏమిటో కనుక్కుందాం!" కోపంగా అన్నాడు గోపాలరావ్.

అందరం గుడిసెలకు సమీపంగా వెళ్ళాం.

బాగా దగ్గరకెళ్ళాక మాకు కనిపించినయ్ రెండుబోర్డులు పక్కపక్కనే!

ఎన్టీఆర్ నగర్! రాజీవ్ గాంధీనగర్!

కొంతమంది ఆ గుడిశెల ముందు కూర్చుని ఏదో చర్చించుకుంటున్నారు. వాళ్ళ దగ్గరకు నడిచాం అందరం.

"ఎవరివయ్యా ఈ గుడిశెలు?" అడిగాడు గోపాల్రావ్ ధైర్యం తెచ్చుకుని.

అందరూ మాట్లాడుకోవటం ఆపి మా వేపు విచిత్రంగా చూశారు గానీ ఏమీ మాట్లాడలేదు.

"మిమ్మల్నేనయ్యా అడిగేది?ఎవళ్ళవీ గుడిశెలు?" తనూ గట్టిగా అరిచాడు యాదగిరి.

"మావే! ఏం సంగతి?" ఒకడు మావేపు సీరియస్ గా చూస్తూ అడిగాడు.

"ఏం సంగతేమిటయ్యా! మా వాళ్ళందరం కలసి ఇక్కడ ప్లాట్లు కొనుక్కుంటే మీరందులో గుడిశెలు వేస్తారా? ఎవర్నడిగి వేశారిక్కడ?"

ఈసారి కొంతమంది గుడిశెల్లోని స్త్రీలూ, పిల్లలూ బయటికొచ్చి మూగారు మా చుట్టూ కూర్చున్న వాళ్ళల్లో ఒకతను లేచి మా దగ్గరకొచ్చాడు.

"ఈ ఇండ్ల స్థలాలు మీవా?" వెటకారంగా అడిగాడు.

"అవ్!"

"అయితే ఇండ్లెందుకు కట్టలేదయ్యా?"

"మా ఇష్టమొచ్చినప్పుడు కట్టుకుంటామయ్యా! మీకెందుకా సంగతి?"

"మా కిప్పుడే ఇష్టమయినాది. మేం కట్టినాం! మీకేమాయే మళ్ళా?"

"కట్టుకో కానీ నీ స్థలంలోనే నువ్వు కట్టుకోవాలయ్యా!"

"ఇది మా జాగానే! ఎవళ్ళు కాదంటారు?"

మేము అదిరిపడ్డాము.

"ఆ! ఇవి మీవా?"

"అవ్!"

"ఏవి? డాక్యుమెంట్స్ చూపించండి"

"నువ్వెవళ్ళు అన్నీ సూపనికి? ఇది మా జాగా! మేము కట్టుకున్నాం"

యాదగిరికి వళ్ళు మండిపోయింది.

"ఏయ్! ఈడ కెళ్ళి గుడిశెలు తీస్తారా లేదా?"

"ఏయ్ నీకేం దమాకున్నాది బే? నువ్వెవళ్రా- గుడిశెలు తీయ మననికి?"

"ఏందిరా! దమాకున్నదా అనడుగుతావ్ బే- సాలే! ఈ జాగాలో ఇండ్లు కట్టి ఇంకా మీదికెళ్ళి నకరాలు జేస్తున్రు బే" అంటూ యాదగిరి వాళ్ళ మీదకు వెళ్ళబోయాడు కానీ మేము వెనుకకు లాగేశాం.

ఎందుకంటే అవతల వాళ్ళ మెజారిటీ ఎక్కువ ఉంది.

"మనం మంచిగ జెపితే వినరన్నా! మనమే ఈ గుడిశెలన్నీ పీకిపారేయాలి. అప్పుడుగానీ సుధరాయించరు కొడుకులు-"

యాదగిరి మాటలు పూర్తి కాకుండానే అందరినీ వెనక్కు నెట్టుకుంటూ, తాగిన మైకంలో తూలుతూ లావుగా, పొడుగ్గా ఉన్న ఓ వ్యక్తి మా ముందుకొచ్చి నిలబడ్డాడు.

"ఏమ్ బిడ్డా! గీ ఇండ్లన్నీ పడేస్తావ్? అంత ధైర్యమున్నది బే నీకు?" ఆడిగాడతను కోపంగా.

అతన్ని చూసేసరికి మా గుండెల విసిపోయినయ్.

అతను మరెవరో కాదు. తరచుగా ఆ ఏరియాలో తనసైన్యంతో వీరవిహారం చేసే పాండూ దాదా!

యాదగిరి కూడా అతనిని చూడగానే చల్లబడిపోయాడు.

"అది కాద్సార్! ఇవన్నీ మా ఇండ్ల స్థలాలు! అందులో వీళ్ళు గుడిశెలు వేస్తే ఎలా?"

"ఇది గవర్నమెంట్ లాండ్! మీరెట్లా కొంటారువయ్యా?"

"గవర్నమెంట్ లాండ్ కాదు! భూపాల్ రెడ్డి దగ్గరకొన్నాం! ప్రైవేట్ లాండిది! కావాలంటే మీకు డాక్యుమెంట్స్ తెచ్చి చూపిస్తాం"

అతను ఓ క్షణం ఆలోచించాడు"

"మరి మావోడు గవర్నమెంట్ లాండ్ అని జెప్పిండే! ఇగో! ప్రైవేట్ గానీ, గవర్నమెంట్ గానీ దాన్తోటి మనకేం పనిగానీ ఆళ్ళు గరిబోళ్ళు! గుడిశె లేసుకున్రు! ఆళ్ళ నిప్పుడు పొమ్మంటే ఏడకు బోతారువయ్యా!"

మా గుండెల్లో రాయిపడింది.

"మేము మాత్రం పైసులన్నోళ్ళం కాదు కదండీ! గవర్నమెంట్ సర్వెంట్స్ మి! మా గతేం కావాలి మరి?"

"మీ గవర్నమెంటోళ్ళకు పైసలకేం తక్కువ? కాగితం కదలాలంటే పైసలు- కదలొద్దంటే పైసలు! ఇగో సూడు! మీరింకొక దిక్కేడయిన వేరే జాగాలూ కొనుక్కోండ్రి గాని ఈడకు రావద్దు! సమజైందా?"

"ఇదన్యాయమండీ! మేము చెమటోడ్చి సంపాదించుకున్న డబ్బుతో ప్లాట్లు కొనుక్కుంటే మీరిలా గుడిశెలేయిస్తే ఎలా? మర్యాదగా ఈ గుడిశెలు తీయకపోతే పోలీస్ కంప్లయింటిస్తాం. ఆ!" ధైర్యం చేసి హెచ్చరించాడు శాయిరామ్.

పాండూ దాదా పగలబడి నవ్వాడు.

"నీయవ్వ! ఇంత బేవకూఫ్ గాళ్ళేమయ్యా మీరు! పోలీస్ కంప్లెయింటిస్తారు? వాండ్లేం జేస్తరువయ్యా? వచ్చి గుడిశెలు తీస్తారు?"

మేమంతా రంగారెడ్డిని కోప్పడ్డాం! రౌడీల దగ్గర పోలీసుల పేరెత్తితే వాళ్ళు మరింత రెచ్చిపోతారని మాకు తెలుసు. పోలీసుల మీద కోపంతోనూ, ఇతర గూండాల మీద కోపం తోనూ హైదరాబాద్ లోని చాలామంది గూండాలు ఊరికే దారినిపోయే వారందరినీ పొడిచి పారెయ్యటం మేము ప్రత్యక్షంగా చూశాము. ఎన్నో సందర్భాల్లో వాళ్ళ చేతికి దొరక్కుండా తప్పించుకున్నాం కూడా.

"సారీ సార్! మారంగారెడ్డికేం తెలీదు! అతని మాటలు పట్టించుకోకండి! పోలీసోళ్ళేం జేస్తారండీ? వాళ్ళేం దాదాలా? గుడిశెలు ఏయించటానికి పీకటానికీనూ?" సర్ది చెప్పాడు శాయిరామ్.

"ఇగో! మంచిగ చెప్తున్నా ఇనండ్రి! ఈ గుడిశె లీడకెళ్ళి తియ్యనికయితే గాదు. నేనొక్కసారి గుడిశెలేయించి నానంటే ఇంక చీఫ్ మినిష్టర్ గాదు ప్రైమినిష్టరొచ్చినా గాని తియ్య! సమజయిందా?"

"అయింది సార్!"

"అయితే ఇంక పోండ్రి మరి"

ఇంక లాభం లేదని నేను కల్పించుకున్నాను.

"చూడండి భాయి సాబ్! మేము మీ ఏరియాలో మీ దయమీద ఆధారపడి బ్రతుకుతున్న వాళ్ళం! ఏనాడూ మేము పోలీసుల్నిగానీ, ప్రభుత్వాన్ని గానీ నమ్ముకున్న వాళ్ళం కాదు. కావాలంటే మా ఏరియాలో వుండే శంకర్ దాదా నడగండి! అతనేం జేస్తే అది చేసేటోళ్ళం. కనుక మా పరిస్థితి కూడా మీ రాలోచించాలి మళ్ళీ ఇంకో స్థలం కొనే తాహతు మా దగ్గర లేదు. మీరు నమ్ముతారో నమ్మరో గానీ చాలామంది మా కాలనీవాళ్ళు భార్య మెడలో వున్న గొలుసులు కాస్తా తాకట్టుపెట్టి ఈ స్థలాలు కొనుక్కున్నాం."

ధీనంగా మాట్లాడాను.

మేమాశించిన ఫలితం కనిపించిందతని మొఖంలో.

"అచ్ఛా! మీరు శంకర్ దాదా ఏరియా వాండ్లా?" ఆప్యాయంగా అడిగాడు.

"అవునండీ"

"అయితే ఓపని జేయండ్రి. ఈ గుడిశెలయితే ఏసేసిన్రు మా వాళ్ళు! కనుక మీ ఇండ్ల జాగాలు మళ్ళీమీకే అమ్మేయమని మా వాండ్లతో జెప్తా. వాండ్ల దగ్గర మీజాగాలు మళ్ళీ కొనుక్కోండ్రి అప్పుడు ఈళ్ళకు వేరే జాగాలిస్తా నేను."

మాకు మతిపోయినట్లయింది.

"ఏమన్నారు? వాళ్ళ దగ్గర మా స్థలాలు మేమే మళ్ళీ కొనుక్కోవాలా?"

"అవ్ మళ్ళా!"

"మా స్థలంలో అక్రమంగా వాళ్ళు గుడిశె లేసుకుంటే మళ్ళీ వాళ్ళ దగ్గర మా స్థలాలు మేము కొనుక్కోవట మేమిటి?"

"ఇష్టమయితేనే కొనండ్రి భాయ్! లేకుంటే పోండ్రి! జబర్ధస్తేం లే"

అందరం మొఖామొఖాలు చూసుకున్నాం.

"పోనీలే! తలో రెండు వేలూ పడేస్తే వాళ్ళు వెళ్లిపోతారు కదా! దాంతో గొడవ వదిలిపోతుంది" అన్నాడు శాయిరామ్ రహస్యంగా.

అందరూ శాయిరామ్ ఆలోచనను సమర్ధించాం.

"సరే సార్! అందరం తలో రెండువేలూ కడతాం! వాళ్ళను ఖాళీ చేయించండి" పాండూ దాదా మళ్ళీ పగలబడి నవ్వాడు.

"నీయవ్వ! భలే బఫ్లూన్లున్నారయ్యా మీరు. రెండువేల్రూపాయలకు రెండు గజాల స్థలం వస్తుందేమో! అది సరిపోతదా మీకు?"

"అది కాద్సార్ మా స్థలాలు ఖాళీ చేస్తున్నందుకు రెండువేల రూపాయలు చాలదా?"

"ష్! నేను చెప్పేది వినవయ్యా! ఈ ఏరియాల గిప్పుడు గజం నూటడెబై ధరున్నది. మీరు ఒరిజినల్ ఓనర్స్ కదాని ఇరవై రూపాయలు కన్సెషనిస్తున్నాం! గజం నూట యాభై లెక్కన పైసల్దెచ్చి ఇయ్యండి. ఒక్కదినంల అందర్నీ లేపేసి వేరే జాగాలో గుడిశె లేయిస్తా!"

కొద్ది క్షణాలు మాకు నోటమాట రాలేదు.

"ఇదన్యాయం సార్! అంత డబ్బు పెట్టి మా స్థలాలు మేమే కొనుక్కోవట మేమిటి? అసలు మాదగ్గర అంత డబ్బేలేదు"

పాండూ దాదాకి కోపం వచ్చింది.

"ఏయ్! మంచిగా మాట్లాడ్తుంటే నరకాలు జేస్తున్రు బే! ఎళ్ళండ్రి నీయవ్వ- స్థలం లేదు, గిలం లేదు! ఈ గుడిశెలీడనే వుంటయ్. ఏంజేస్కుంటరో జేస్కోండ్రి" అంటూ వెనక్కు తిరిగి "అరేయ్! మళ్ళీ ఈళ్ళెవరయినా వచ్చి నకరాలు జేసిన్రంటే కాళ్ళూ చేతులూ ఇరగొట్టి, పంపించండి" చెప్పేసి వెళ్ళిపోయాడు వెనక్కి.

మేము నిశ్చేష్టులమయి అలాగే నిలబడిపోయాం.

గుడిశెల వాళ్ళందరూ ఎవర్దారిన వాళ్ళెళ్ళిపోయారు.

"ఏం చేద్దాం?" నీరసంగా అడిగాడు శాయిరామ్ కాసేపటి తర్వాత కోలుకుని.

"ముందు ఇంటికెళ్దాం పదండి. జ్వరం వచ్చినట్లుంది" అన్నాడు గోపాల్రావ్. అందరం నిశ్శబ్దంగా కాలనీకి బయలుదేరాం.

మర్నాడు అందరం పోలీస్ స్టేషన్ కి చేరుకున్నాం. మమ్మల్ని అంతదూరంలో చూస్తూనే ఇన్ స్పెక్టర్ లంచాలు దొరకని టౌన్ ని చూసినట్లు చూశాడు.

"ఉధరీ రోకో- ఓ లోగోం కో! క్యా హోనా పూఛో!" అంటూ గావుకేక పెట్టాడు మండిపడుతూ. కానిస్టేబుల్స్ తుప్పు పట్టిన తుపాకులు తీసుకొచ్చి మాకడ్డం నిలబడ్డారు.

"క్యా హోనా?" హెడ్ కానిస్టేబుల్ బయటికొచ్చి అడిగాడు.

"మీరు ఓ చిన్న సహాయం చేస్తారేమోనని" గొణిగాడు రంగారెడ్డి.

"మదద్ కావాలి? ఏం మదద్ కావాలి? మీ కాలనీ ఓండ్లందరూ తురమ్ ఖాన్లు కదా! జులుస్ లు తీస్తరు, మినిస్టర్ సాబ్ దగ్గర షికాయత్ జేస్తరు! మళ్ళీ మా పోలీసోండ్ల తోటి ఏం పని?"

"మాకు సహాయం వూరికే చేయనక్కర్లేదు హెడ్ గారూ! ఏదో చూసుకుందాం"

హెడ్ మరింత కోపంగా చూశాడు. "ఏంది చూసుకునేది."

"అదేసార్! మీకు తెలీందేముంది? ఎంతోకొంత డబ్బిస్తాం" దూరంగా దభేల్ మన్న చప్పుడు వినిపించింది. అంతవరకూ పక్కగదిలో అసహనంగా, మండిపడుతూ చూస్తోన్న ఇన్ స్పెక్టర్ కి ఆ డైలాగ్ అంత నెమ్మదిగా మాట్లాడినా ఎలా వినబడిందో తెలీదు. మరి! గాబరాగా, ఆనందంగా ఒక్క ఉదుటున లేచి ఆ కంగారులో కుర్చీని వెనక్కు పడేసి ఆత్రుతగా మా దగ్గర కొచ్చాడు.

"బయట నిలబడి ముచ్చట్లేమయ్యా! లోపటరాండ్రి, ఏమైనా తక్ లీఫుంటే నాతో జెప్పాలె! రాండ్రి" అన్నాడు ఆప్యాయంగా ఆహ్వానిస్తూ.

అందరం అతనిలోని సడెన్ మార్పుకి ఆశ్చర్యపోతూ, ఈ మార్పుకి కారణమైన డబ్బుని సృష్టించినవాడికి దణ్ణాలు పెట్టుకుంటూ ఇన్ స్పెక్టర్ గదిలోకి నడిచాం.

"ఏమి సంగతి? ఏం మదద్ కావాలి?" అడిగాడతను.

"మేమందరం కలిసి సిటీ బయట ఇళ్ళస్థలాలు కొనుక్కున్నాం సార్! కొని చాలా రోజులైంది. ఇవాళ మంచిరోజుని భూమిపూజ చేయడానికెళ్తే..."

హ్వాహ్వాహ్వాహ్వా! మాకు తెల్సు ఏం జరిగిందో! ఆడ గుడిశెలు వేసినోళ్ళెవరో గంతనేనా?"

అందరూ ఆశ్చర్యపోయాం.

"అవ్ సార్! మీ కెట్లెరుక? అడిగాడు యాదగిరి.

"మాకెరుక లేవయ్యా! పోలీసోండ్లకు తెలిసిందేముంటది? ఇప్పుడు ఆగుడిశె లోళ్ళను ఆ జాగల్లోకెళ్ళి భగాయించాల్న. గంతేగదా!"

"అవున్సార్!"

"అయితే కాష్ ఇవ్వండి!"

రంగారెడ్డి మమ్మల్ని అందరినీ పక్కకు పిల్చుకెళ్ళాడు.

"అందరూ ఎంతుంటే అంతివ్వండి" అన్నాడు.

ఆడాళ్ళూ, మగాళ్ళూ, పిల్లలూ అందరూ తమ దగ్గరున్న డబ్బంతా ఊడ్చి రంగారెడ్డి చేతిలో పోశారు. రంగారెడ్డి ఆ చిల్లర నోట్లన్నీ లెక్కబెట్టడానికి రెండు గంటలుపట్టింది.

"పదకొండు వందలు" అన్నాడు ఆనందంగా.

"అమ్మో! పోలీసులకు అంతెందుకు? అయిదొందలు చాలు" అన్నాడు శాయిరామ్. కానీ అతని మాటలు ఎవరూ వినిపించుకోలేదు.

వెయ్యి రూపాయలు లెక్కపెట్టి ఇన్ స్పెక్టర్ టేబుల్ మీదుంచాడతను. నలుగురు కానిస్టేబుల్స్ కలిసి అరగంటసేపు లెక్కపెట్టి "వేయిరూపాయలు" అంటూ చెప్పారు ఇన్ స్పెక్టర్ తో.

ఇన్ స్పెక్టర్ మొఖంలో మళ్ళీ కోపం, ద్వేషం, పగ, ప్రతీకారం అన్నీ కనిపించినాయ్.

"ఏయ్! వెయ్యి రూపాయలేం లెక్కవయ్యా! ఫాల్తూ న్యూసెన్స్ కేస్ కే రెండు వేలిస్తారు! టీవీ టవర్ పక్కన అంధేరాలో నిలబడినామంటే ఒక్కో హెల్మెట్ కేస్కి రెండొందలు రాల్తయ్! మాకేం ముష్టిస్తున్రా?"

అందరం ఇన్ స్పెక్టర్ ని బ్రతిమాలాము.

"ఇది కేవలం అడ్వాన్సండీ" అన్నాడు శాయిరాం.

"అంటే మిగతా ఎమౌంట్ ఎంతన్నమాట?"

"ఇంకో నాలుగువేలు ఇస్తామండీ!"

"నాల్గువేలా? నడవదు. అయిదువేలయినా ఇయ్యాలె! సమజయిందా?"

యాదగిరి రాజీ కుదిర్చాడు.

"అచ్ఛా! ఠీక్ హై సాబ్! పాంచ్ హజార్ దేంగే!" అన్నాడతను.

ఇన్ స్పెక్టర్ సంతృప్తి పడ్డాడు.

"పనయినాంక మిగతా పైసలు ఇయ్యకుంటే ఏమౌతదో ఎరుకనా?"

"నాకెరుకే సార్! మళ్ళీ మా జాగాల్లో గుడిసె లేయిస్తారు గంతనే కదా!"

"కరెక్ట్! ఏయ్ కృష్ణా! నలుగురు జవాన్లతోటి వెళ్ళి ఆ గుడిసెలు తీయించు" అసిస్టెంట్ సబిన్ స్పెక్టర్ కి పురమాయించాడు అతను.

లావుగా, జగజ్జెట్టీల్లా నలుగురు పోలీసులు. ఒక అసిస్టెంట్ సబిన్ స్పెక్టర్ తో సహా అందరం ఆనందంగా మా స్థలాలు చేరుకున్నాం! చాలామంది గుడిసెల ముందు కూర్చుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరఫరా చేస్తున్న వారుని వాహిని తాగుతూ, బాటిల్స్ ఖాళీ చేస్తున్నారు.

మమ్మల్ని చూడగానే గుడిసెల వాళ్ళంతా మళ్ళీ గుమికూడారు. ఈసారి మా పక్కన పోలీసుల్ని చూసేసరికి వాళ్ళ మొహాల్లో ఆందోళన కనిపించింది. మేము వాళ్ళ ముందు గర్వంగా, ధీమాగా నిలబడ్డాం. కాసేపట్లో వాళ్ళు మా కాళ్ళమీద పడిపోతారని మాకు తెలుసు!

"వాళ్లు క్షమించమంటూ మనకాళ్ళ మీదపడినా మనం వాళ్ళను చూసి జాలి పడకూడదు" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! ఇలాంటి దురాక్రమణ సన్నాసులకు గట్టిగా బుద్ధి చెప్పాలంటే పోలీసులతో బాగా తోమించాలి" అన్నాడు గోపాల్రావ్.

"చూస్తుండండి ఆళ్ళందరి కాళ్ళూ చేతులూ ఇరగ్గొడతారు" అన్నాడు యాదగిరి.

"వాళ్ళ సంగతెలా ఉన్నా వాళ్ళ లీడర్ ని మాత్రం వదలకూడదు" అన్నాడు శాయిరామ్.

"అవునవును! వాడిని వారం దినాలకు తక్కువ కాకుండా లాకప్ లో ఉంచి దినాము బొక్కలిరగ్గొడితే గానీ సుధరాయించడు"

లావుపాటి పోలీస్ కానిస్టేబుల్ వాళ్ల మధ్యకు వెళ్ళాడు.

"ఏయ్! ఈ జాగాలు ఎవళ్ళవిరా?" అడిగాడు లాఠీ భయంకరంగా తిప్పుతూ.

వాళ్ళు కంగారుపడిపోయారు.

"మావే దొరా!"

"అంటే మీరు కొన్నారు బే?"

"అవ్ దొరా?"

"ఏయి? రిజిష్ట్రేషన్ పేపర్స్ తేండ్రా?"

"లేవు దొరా! అయన్నీ మా లీడర్ దగ్గరున్నాయ్!"

"ఎవళ్ళు రా మీ లీడర్! ఆడిని రమ్మను జల్దీ"

నలుగురు లీడర్ కోసం పరుగెత్తారు.

కానిస్టేబుల్ మళ్ళీ మాదగ్గర కొచ్చాడు.

"చూశారా! మనమంటే ఈ ట్విన్ సిటీ లోనే అందరికీ హడల్. మీకెరుకనో లేదో నలుగురు దాదాలను లాకప్ లో వేసి కాళ్ళూ చేతులూ నా చేతుల్తోటే ఇరిచినా!"

అందరం ఆశ్చర్యపోయాం.

"నలుగురినా?" అనుమానంగా అడిగాడు వెంకట్రావ్.

"అవ్! ఏమనుకున్నావ్ మళ్ళా? నలుగురికీ కాళ్ళూ చేతులూ ఇరిచేసినా! కొడుకులు పరేషానయి పోయిన్రు! ఇప్పుడేం జేస్తున్రో ఎరుకనా వాళ్ళు?"

"ఏం జేస్తన్రు సార్?"

"దెబ్బకు దాదాగిరి బంద్ జేసి మంచిగ ఇజ్జత్ తోటి బ్రతుకుతున్రు!"

"అంటే మంచిగా ఉద్యోగాలు చేసుకుని పెళ్లాం బిడ్డల్ని బాగా చూసుకుంటూ జీవితం గడుపుతున్నారా సార్?"

"ఉద్యోగం గిట్లా కాదు గానీ నాంపల్లి స్టేషన్ లో రైల్వే సీట్లు బ్లాకులో అమ్ముకుంటున్రు! మంచి మనుషులంటే గట్లుండాలి! దాదాగిరి చేస్తే ఏమొస్తది వయా! ఏదొక కొలువు జేసుకోవాలె! బతకాలె!"

అప్పుడె గుడిసెల నాయకుడు వచ్చాడు.

కానిస్టేబుల్ వాడిని వస్తూనే చొక్కా పట్టుకుని నేలమీద పడేసి తనని బయటకు గెంటుతాడని మాకు తెలుసు.

కాని ఎందుకో కానిస్టేబుల్ అలా చేయలేదు.

"ఎవళ్ళురా ఈడ గుడిసెలేయించిన్రు?" అనరిచాడు తీవిగా. వాళ్ళ నాయకుడు తాపీగా నడిచి కానిస్టేబుల్ దగ్గరకు చేరుకున్నాడు.

అతనిని సమీపంగా చూస్తూనే ఉలిక్కిపడ్డాడు కానిస్టేబుల్ అతనితో పాటు మిగతా వారందరూ కూడా నిశ్చేష్టులయిపోయారు.

"నేనే గుడిసె లేయించాన్రా! ఏమ్ సంగతి?" కానిస్టేబుల్ వంక క్రూరంగా చూస్తూ అన్నాడు ఆ లీడర్.

కానిస్టేబుల్ అమాంతం ఎగిరి సెల్యూట్ కొట్టాడు.

"హలో! నువ్వా అన్నా! నేనింకా ఎవళ్ళో అనుకుంటున్నానే!"

"నేనే తంబీ! ఏమిటి సంగతి ఇంతమంది వచ్చిన్రు?"

"అదే! ఈ గుడిసెలన్నీ వీళ్ళ జాగాల్లో వేసిన్రని కంప్లెయింట్ ఇచ్చిన్రు! దాని దిక్కుకెళ్ళి వచ్చినాం! నువ్వని ఎరుకలేదన్నా"

"వీళ్ళంతా మావాండ్లేరా! అంతా గరీబోళ్ళున్నారు. ఒక్కసారి ఆళ్ళను సూడు! తిండీ, బత్తా ఏమున్నదివయ్యా వాండ్లకు?"

పోలీసులు వాళ్ళవేపు చూశారు.

అందరూ మంచి బట్టలతో లావుగా దున్నల్లాగున్నారు. ఒకో గుడిసె ముందూ వాళ్ళు ఖాళీ చేసిన బాటిల్స్ నాలుగయిదు కనిపిస్తున్నాయ్. బయటున్న మంచాల మీద ట్రాన్సిస్టర్లో సినిమా పాటలు వినిపిస్తున్నాయ్. కొన్ని గుడిసెల ముందు మోపెడ్లు, సైకిళ్ళు, స్కూటర్లు ఉన్నాయి.

పోలీసు మొఖంలో జాలి కనిపించింది.

"అవ్ భయ్! ఇస్కీమాకీ- మనకు స్వతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలాయెగానీ గరిబోండ్లు గిట్లనే ఉన్నారు" జలైపడ్డారు వాళ్ళు. మాకు మతిపోయినట్లయింది.

పోలీసులు వాళ్ళందర్నీ చీల్చి చెండాడేస్తారనుకుంటే వాళ్ళు ఆ దాదాకే సలాం కొడుతున్నారు. దాదా మా వంక కోపంగా చూసి పోలీసులతో మాట్లాడ సాగాడు.

"ఇగో సూడండి భయ్యా! వాళ్ళంతా పాగల్ గాళ్ళున్నారు! గరీబోండ్లతో జిద్ చేస్తారు వయ్యా? ఈళ్ళకేమయినా అకల్ ఉన్నదా? మనమందరం కలిసి వాండ్లకు మదద్ చేయాలె! మనమే గుడిసెలు కట్టించి ఇయ్యాలే! అదిపోయి ఉన్నది పీకేస్తానంటే ఏమ్మాటది?"

పోలీసులు మావేపు అసహ్యంగా చూశారు.

మాకు వళ్ళు మండిపోయింది.

"ఏయ్! మీకు పైసలిచ్చింది ఈడకెళ్ళి గుడిసెలు తీయించమనిగ నీతులు చెప్పమని కాదు" అన్నాడు యాదగిరి మండిపడుతూ.

పావుపాటి కానిస్టేబుల్ మావేపు క్రూరంగా చూశాడు.

"ఏయ్! జర సంబాల్ కే బాత్ కరో! పైసలిచ్చినం అంటున్నావేం సంగతి? నీయవ్వ మీరిచ్చిన వెయ్యిరూపాయలు మాకు ఒక్క నిముషం ఖర్చు! సమజయింది? లక్షల ఇచ్చినట్లు లొల్లి పెడుతున్రు! నడవండ్రి ఈడకెళ్ళి! గరీబోళ్ల తోటేందివయ్యా కిరికిరి!" మాకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు. నిశ్శబ్దంగా వెనక్కు తిరిగి మా కాలనీ వేపు బయల్దేరాం.

అందరం మా ఏరియా కౌన్సిలర్ ని కలుసుకున్నాం.

ఆయన్తో సంగతంతా జెప్పాం.

"ఆ గుడిసెలు ఏడున్నాయ్?"

"మా జగాల్లో సార్?"

"మీ జగాలేడున్నయ్ వయా?"

చెప్పాం.

"ఆ పాండూదాదాతోటి కిరికిరి భాయ్. వానికి మస్తు పైసలిస్తేగానీ జగాలు ఖాళీ చేయడు"

"ఎన్ని పైసలవుతయ్ సార్?"

"పాండుదాదాకి పదివేలు! నాకు పాతికవేలు!"

అందరం షాకయ్యాం.

"అదేంటి సార్! అంత డబ్బు ఖర్చయ్యేట్లుంటే ఆ జగాలు వదులుకోవటమే మంచిది కద్సార్"

"వదులుకోండి! ఈడకెందు కొచ్చిన్రు మళ్ళా?"

"మీరు మా కౌన్సిలర్ కద్సార్! మదద్ జేస్తారేమో అని వచ్చినాం."

"ఫుకట్ గా ఏ కౌన్సిలర్ అయినాగానీ మదద్ జేస్తార్ వయా? అయినా ఫుకట్ గా మీకెందుకు సర్వీస్ చేయాలి నేను?"

"ఎందుకేంటి సార్! ఎలక్షన్ టైమ్ లో మీరు మా ఇండ్లకొచ్చి ఓట్ల గురించి రిక్వెస్ట్ జేసిన్రు గదా! మీకే ఓట్లేసినం గనుక మీరే మదద్ జేయాలె"

"ఓట్లకు మస్తు పైసలిచ్చినాన్రా భయ్! రెండు కోట్లు ఖర్చాయె- ఎరుకనా? ఆ పైసలన్ని ఎవడిస్తాడు నాకు. గిట్లనే వసూళ్లు జేసుకోవాలె"

మేం మళ్ళీ షాకయ్యాం.

"ఏంది సార్? మా ఓట్లకు పైసలిచ్చినావ్-" అడిగాడు యాదగిరి.

"నువ్వుగాకపోతే- నీ తమ్ముడింకోడికి ఇచ్చినారా భయ్! ఒక్కొక్క కాలనీకి ఆరు లక్షలిచ్చినా"

"ఆళ్ళెవరికో ఇస్తే మాకేం సంబంధం సార్"

"ఇగో ఈ బేకార్ మాటలొద్దు. పని గావాల్నా? వద్దా?"

మేమంతా చర్చించుకున్నాం. అంత డబ్బు ఇవ్వటం కంటే ఆ స్థలాలు వదులుకోవటం మంచిదని డిసైడ్ జేసుకున్నాం.

"ఎలాగో మన జగాలు వదులుకుంటున్నాం. మరి ఆ పోలీసులకిచ్చిన పైసలు ఎందుకు వదలాలి? వెళ్ళి మన పైసలు మనకిమ్మని అడుగుదాం" అన్నాడు యాదగిరి.

మర్నాడు అందరం పోలీస్ స్టేషన్ కెళ్ళి ఇన్ స్పెక్టర్ ని కలుసుకున్నాం!

"ఏంది? మళ్ళీ వచ్చిన్రు?" చిరాకుగా అడిగాడు ఇన్ స్పెక్టర్.

"మా జగాలు ఖాళీ చేయిస్తానని పైసలు తీసుకున్నారు కద్సార్- మీ వాళ్ళు చేయించలేకపోయిన్రు-"

"అవ్- ఎవరో లావార్సీగాళ్ళుంటే ఖాళీ చేయిపిస్తాం! పాండూదాదా ఎంక్రోచ్ చేస్తే మేమెట్ల ఖాళీ చేయిస్తాం? ఆడు ఎమ్మెల్యే మనిషికదా! ఎమ్మెల్యేతోటి రకరార పెట్టుకుంటారు ఎవళ్ళయినా! ఓల్డ్ సిటీకి ట్రాన్స్ ఫర్ అయిపోతాం! ఎరుకనా?"

"అయితే మా డబ్బు మాకిచ్చేయండి-" అన్నాడు యాదగిరి.

ఇన్ స్పెక్టర్ షాకయ్యాడు.

"ఏందీ! మీ పైసలు మీకియ్యాల్నా? మీకేమయినా దమాకున్నాదా? పోలీసులకిచ్చిన పైసలు ఎన్నడయినాగానీ తిరిగొస్తాయ్?"

"రాకుంటే ఆళ్ళను మా జగాల్లోకెళ్ళి ఖాళీ చేయించండి సార్-" యాదగిరి పట్టుబట్టాడు.

మా కందరికీ కూడా తెలుసు- పోలీసులు ఏమైనా చేయగలరు గానీ ఒకసారి తీసుకున్న పైసలు మాత్రం వాపస్ చేయలేరు. అది వాళ్ళ వీక్నెస్- అందుకే యాదగిరి ఆ వీక్నెస్ మీద దెబ్బకొట్టాడు.

గోపాల్ రావ్ కలుగజేసుకున్నాడు.

"చూడండి సార్- డబ్బు వాపసివ్వకపోతే ఈ మేటరు నా పత్రికలో హెడ్ లైన్స్ లో పబ్లిష్ చేస్తా-"

దాంతో ఇన్ స్పెక్టర్ కొంచెం షేకయ్యాడు.

"అరె! మీరేడ దొరికిన్రురా భయ్! పైసలు రిటర్న్ జేసే ఆదతే మాకు లేదు- ఇగో ఒకపని జేయండ్రి! శంకర్ దాదా ఎరుకే కదా! ఆయన దగ్గరకు పోయి ఆయన మదద్ తీసుకోండి. ఇంకొన్ని పైసలయితే ఖర్చవుతాయ్ గానీ మీ జాగాలన్నీ మీ చేతికొస్తయ్- కావాల్నంటే నేను భీ శంకర్ దాదాకి ఫోన్ చేస్తా-" అంటూ సెల్ ఫోన్లో శంకర్ దాదాకి రింగ్ చేశాడు.

"నమస్తే అన్నాం నేను జగన్ ని! ప్రమోషన్ ఏడొచ్చిందన్నా! నువ్ గట్టిగా తల్చుకుంటేనే గానీ కాదది- అదిసరేగానీ నాతానకో లాండ్ గ్రాబింగ్ కేస్ వచ్చిందన్నా! అందరూ మిడిల్ క్లాసోళ్ళు- పైగా నీ నియోజకవర్గం వాళ్ళు. ఆళ్ళ జాగాలన్నీ ఆ పాండూదాదా మనుషులు కబ్జా జేసిన్రు- ఆళ్ళను నీతానకు పంపుతున్నా! జర మదద్ జేయన్నా- ఆవ్- పైసలిస్తరు- బరాబరిస్తారు- దాన్దిక్కు కెళ్ళి ఫికర్ లేదు- ఓకే అన్నా థాంక్యూ-" ఫోన్ పెట్టేశాడు.

"విన్నారు గదా- ఇంక శంకర్ దాదాను కలుసుకోండ్రి-"

అందరం వెళ్ళి శంకర్ దాదాని కలుసుకున్నాం. మమ్మల్ని చూడగానే గుర్తుపట్టాడతను.

"అరె నీ యవ్వ- మీరా! నేను గుర్తుపట్టనట్లు ఆ ఇన్ స్పెక్టర్ రికమండేషనెందుకూరా భయ్- సంగతేంటో జెప్పండ్రి-"

అంతా వివరించాం- పదివేలకు బేరం కుదిరింది. వారం రోజులు టైమివ్వమన్నాడు శంకర్ దాదా.

వారం తర్వాత మేమూ మా ఇళ్ళస్థలాల దగ్గరకెళ్ళే సరికి ఒక్క గుడిశె కూడా కనిపించలేదక్కడ.

"థూ నీ యవ్వ- ఏ.పి. గవర్నమెంట్- ఏ.పి. పోలీస్ డిపార్ట్ మెంట్- ఆళ్ళు చెయ్యలేని పని శంకర్ దాదా చేశాడు- గూండాలంతా అసెంబ్లీలోకీ పార్లమెంట్ లోకీ వస్తున్రంటే రాకేం జేస్తరు మళ్ళా!

మనలాంటి ఎడ్యుకేటెడ్ గూడా వాండ్లకే ఓట్లేసే పరిస్థితులాయె-" అన్నాడు యాదగిరి కసిగా.

* * * * *

# ఇంటర్ వ్యూ

రేడియో స్టేషన్ ఆవరణంతా చాలా హడావుడిగా ఉంది. ఇంటర్ వ్యూ కొచ్చిన అభ్యర్థులందరూ బయట విజిటర్స్ రూములో కూర్చుని ఇంటర్ వ్యూ గురించి ఏవేవో విషయాలు చర్చించుకుంటున్నారు.

'ఇంటర్ వ్యూ' ప్రారంభమయింది.

మొదటి అభ్యర్థిని లోపలకు పిలిచి చెడామడా ప్రశ్నించి, బెదరగొట్టి ఫెయిల్ చేసిపారేసారు అధికారులు.

సరిగ్గా అప్పుడే ఢిల్లీ నుంచి డైరెక్టు డయలింగ్ చేశారెవరో.

"హలో! డిప్యూటీ మినిస్టర్ అభ్యర్థి ఒకతను ఇంటర్ వ్యూకి వచ్చాడు. ఎలాగయినా సరే, అతనిని సెలక్ట్ చేయాలి! పేరు రాసుకోండి!"

స్టేషన్ డైరెక్టర్ గారు హడావుడిగా కాగితం, పెన్నూ అందుకున్నారు.

"చెప్పండి!"

"కె. శ్రీనివాసన్, సన్ ఆఫ్ కె. రామనాథన్."

"రాసుకున్నానండీ! కానీ కాంపిటీషన్ చాలా స్టిఫ్ గా ఉందండీ! రెండువందలమంది అర్హతలున్న వారు ఇంటర్ వ్యూ కొచ్చారు."

"మరేం ఫరావాలేదు. అందరినీ రేడియోస్టేషన్ ఇంటర్నల్ వర్కింగ్ గురించీ, ప్రొసీజర్స్ గురించీ అడగండి! ఒక్కడూ సమాధానం చెప్పలేదు. ఆ విధంగా మావాడిని ఈజీగా లాగేయవచ్చు."

"అలాగే సార్!"

"అన్నట్లు మీరు ట్రాన్స్ ఫరుకి పెట్టుకున్న అప్లికేషన్ ఇప్పుడే పెద్దసార్ కి పుటప్ చేస్తున్నాను ఒక వారంలో ఓ.కే. చేస్తాము."

"థాంక్యూ సర్!"

"నెక్ట్స్ కాండిడేట్ ని పిలవొచ్చా సార్!" అడిగాడు ప్యూను.

"అప్పుడే వద్దుగ కొంచెం సేపాగు?" అన్నాడు ఎస్.డి.

ప్యూన్ బయటికెళ్ళిపోయాడు.

"ఇదిగో ఈ శ్రీనివాసన్ అనే అభ్యర్థిని మనం ఈ పోస్టుకి ఇంటర్ వ్యూలో సెలక్ట్ చేయాలని ఢిల్లీ ఇన్ స్ట్రక్షన్స్! కనుక మనం చేయాల్సిందేమిటంటే అభ్యర్థుల కెపాసిటీని టెస్టు చేయటం కాదు. ఎలాగోలా వాళ్ళను సెలక్ట్ కాకుండా చూడడం! అందుకోసం మన రేడియో స్టేషన్ లో ఇంటర్నల్ వర్కింగ్ గురించి ప్రశ్నిస్తే మంచిది! సెంట్ పర్సెంట్ కాండిడేట్స్ ని ఎవైడ్ చేసేయవచ్చు. ఏమంటారు?"

మిగతా అందరూ నవ్వారు.

"మీ ఇష్టం! మాదేముంది! మీరెలా చెపితే అలా?"

"నెక్ట్స్ కాండిడేట్" అంటూ బెల్ నొక్కాడు ఎస్.డి. మరో రెండుగంటల్లో అభ్యర్థులంతా విచారంగా ఆ ఆవరణ వదలి వెళ్ళిపోయారు.

"ఇంక ఒకే ఒక్క అభ్యర్థి మిగిలాడు. అతని తరువాత ఇంక ఉండేది ఆ రికమండేషన్ కేండేటే! గనుక ఇప్పుడొచ్చేవాడొక్కడినీ ఫెయిల్ చేసి పారేస్తే- ఇంక ఆ శ్రీనివాసన్ ఆటోమేటిగ్గా సెలక్టయి పోయినట్లే!" అన్నాడు ఎస్.డి.

"ఇంతమందిని తెల్లముఖం వేయించగా లేనిది ఇంక ఈ ఒక్కడేం సమస్య ఉందిలెండి! రానీండి." నవ్వుతూ అన్నాడు ప్రక్కతను. మరుక్షణంలో శ్రోతేస్వర్రావ్ చిరునవ్వుతో లోపలి కడుగుపెట్టాడు.

"గుడ్ మాణింగ్ సర్స్" అన్నాడు చిరునవ్వుతో.

"గుడ్ మాణింగ్! టేక్ యువర్ సీట్!" అన్నాడు ఎస్.డి.

అతను కూచుని అందరివంకా ఓసారి చూశాడు.

"మీ పేరు శ్రోతేశ్వర్రావు కదూ?" అడిగాడు ఒకతను.

"అవునండీ!"

"తమాషాగా ఉందే పేరు?"

"అవునండీ చాలా తమాషా పేరు! పేరు పెట్టటం కూడా చాలా తమాషాగానే జరిగిందండీ! నేను పుట్టిన దగ్గర్నుంచీ రేడియో ప్రోగ్రామ్స్ అంటే చాలు- చెవులు రిక్కించుకుని వినేవాడినటండీ! ఎంత ఏడుస్తున్నా గానీ నా చెవిదగ్గర రేడియో పెడితే చాలు ఠక్కున ఏడుపు మానేసేవాడినంటండీ! అందుకనే మావాళ్ళు శ్రోతేశ్వర్రావు అని పేరు పెట్టారండి!"

"వెరీగుడ్! బావుంది! అయితే మీరు చిన్నప్పటి నుంచి రేడియో తాలూకు ఉత్తమ శ్రోతకదా! అందుకని రేడియోకి సంబంధించిన ప్రశ్నలే అడుగుతాము. జవాబు చెప్పండి."

"ఓగ విత్ ప్లెజర్!"

"మీరు కార్మికుల కార్యక్రమం ప్రోగ్రాం కోసం ఎవరయినా కార్మికుడిని ఇంటర్ వ్యూ చేయడాని కెళ్తారనుకోండి- ఎలా చేస్తారు?"

"రికార్డింగ్ ఎక్విప్ మెంట్ తో ఫ్యాక్టరీ కెళ్ళిపోతానండి. అక్కడ మేనేజర్ తో మాట్లాడి, కార్మికులందరిలోకీ అతి తెలివి తక్కువ వాజమ్మ, మాట్లాడడం రాని దద్దమ్మ ఎవడో తెలుసుకుని అతనితో ఇంటర్వ్యూ ప్రారంభిస్తామన్న మాటండి- వాడు గవర్నమెంట్ కి గానీ, ఫాక్టరీ యాజమాన్యానికి గానీ వ్యతిరేకంగా మాట్లాడడానికి వీల్లేదని ముందే వార్నింగ్ ఇస్తామండీ! ఇంటర్ వ్యూ ఇలా ఉంటుందండీ-

"ఆ! నీ పేరేమిటి బాబూ!"

"యాదగిరండి."

"ఆ- చూడు రాములూ నువ్వీ ఫ్యాక్టరీలో చేరి ఎంతకాలమైంది?"

"ఇరవై సంవత్సరాలయిందదండి."

"చేరినప్పుడు నీ జీతం ఎంత?"

"ఎంతండీ? రెండొందల పాతిక."

"మరిప్పుడు?"

"ఇప్పుడు ఆరొందలండి."

"ఆరొందలే. అబ్బా, అంటే మూడింతలు పెంచారన్నమాట- మీ ఫ్యాక్టరీ యాజమాన్యం వారు. ఎందుకంటే వారికి కార్మికులు శ్రేయస్సే ప్రధానం కాబట్టి పెంచారు - సరే! ఆ! చూడు రాత్తయ్యా నీకెంతమంది పిల్లలు?"

"మొదటి భార్యకి ఇద్దరు- రెండో.."

"ఓహో ఇద్దరే పిల్లలన్నమాట. అంటే దేశ క్షేమం, నీ కుటుంబ సంక్షేమం కోసం నువ్వు ఇద్దరి పిల్లల్ని కన్నాక కుటుంబ నియంత్రణ అమలు పరుస్తున్నావు కదూ?"

"అబ్బే కాదండీ- ఇంకా నా ఇద్దరు పెళ్ళాలూ పిల్లల్ని కంటూనే ఉన్నారండీ! మొదటి పెళ్ళానికి ఆరుగురు- రెండోదానికి ఎనిమిదిమందీ" (ఇది రికార్డు అయిన తరువాత చెరిపేస్తాం)

"బావుంది వెంకయ్యా! మనదేశంలో ప్రతికార్మికుడూ కూడా నీలాగా కుటుంబ నియంత్రణ పాటిస్తే ఎంతోమేలు కలుగుతుంది దేశానికి. మరి మీ పిల్లలు ఏం చదువుతున్నారు?"

"పెద్దది ఆరు సదివి అంట్లు తోముతుంది. రెండోవాడు రెండు చదివి అడుక్కు తింటున్నాడు. మూడోది ఇంట్లో నుంచి పారిపోయింది. నాలుగోవాడు (ఇదంతా ఎడిట్ చేసేస్తాం)

"ఓహో పెద్దమ్మాయి ఆరోక్లాసన్న మాట. అంటే రెండోవాడు అయిదోక్లాస్ అవాలి! కదూ, బావుంది మరి నీకొచ్చే జీతం శుభ్రంగా సరిపోతుంది కదూ."

ఎక్కడండీ నెలకు రెండొందలు మిగులుతుందన్నమాట. బావుంది. ఆ డబ్బు మరి ప్రభుత్వ బాంకుల్లో దాచుకుంటావన్న మాట. అలా ప్రతి నెలా డబ్బు దాచుకుని కూతురి పెళ్ళికో, కొడుకు ఇంజనీరింగ్ చదువుకో ఉపయోగిస్తావ్ అంతేగా.

బావుంది. ఇకపోతే మీ ఫాక్టరీలో ఏదయినా ప్రమాదం జరిగి ఎవరికయినా గాయాలు తగిల్తే యాజమాన్యం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారు?"

"దొంగ బాడుకవ్ ఱు. ఆళ్ళేం సౌకర్యాలిస్తుండ్రు సార్? మొన్నటికి మొన్న రాజయ్య చెయ్యి మిషన్ లో పడి విరుగుతే వాడిని ముప్పయ్ తిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి- చివరకు రెండొందలు ఆడి మొకాన కొట్టిన్రు సార్. అట్లనే రమణయ్య..."

(ఇదంతా రికార్డు చేయమండీ అసలు- చేసినట్లు వాడిన నమ్మిస్తాం)

"మాట్లాడవేం రాములూ ఎవరికయినా గాయాలు తగిల్తే నష్ట పరిహారం ఇవ్వటం, కుటుంబాన్ని ఆదుకోవటం, ఇవికాక ఇంకా చాలా సౌకర్యాలు కలుగజేస్తారన్నమాట! వెంకటయ్యా! చాలా సంతోషంగా ఉంది. నీ దగ్గర ఇన్ని అద్భుతమయిన విషయాలు తెలుసుకున్నందుకు, నమస్కారం."

"దణ్ణం బాబూ."

"ఇదండీ ఇలా చేస్తాను కార్మికుడితో ఇంటర్ వ్యూ" అంటూ ముగించాడు శ్రోతేశ్వర్రావు.

ఇంటర్ వ్యూ చేసే ముగ్గురూ మొహమొహాలు చూసుకున్నారు. అతను చెప్పిన సమాధానం సెంట్ పర్సెంట్ కరెక్ట్. కనుక అందులో అతనిని ఫెయిల్ చేయడం కుదరదు.

"మిస్టర్ శ్రోతేశ్వర్రావ్! బలహీనవర్గం తాలూకు వ్యక్తిని ఇంటర్ వ్యూ చేయాలి. ఎలా చేస్తావ్?"

శ్రోతేశ్వర్రావు చిరునవ్వు నవ్వాడు-

"అబ్బ! చాలా ఈజీ కొశ్చెన్ సార్! నాకు ఇది నిజంగా బై హార్ట్ అయిపోయింది. ఇదిగో ఇలా ఉంటుందండీ నా ఇంటర్ వ్యూ-

"ఆ నీ పేరేంటమ్మా!"

"ఈరమ్మండీ."

"ఆ చూడు ఈరమ్మా, నీకు పెళ్ళయింద?"

"అదేటి బాబూ! నలుగురు పిల్లలు."

"అలాగా నీ భర్త ఏం చేస్తుంటాడు?"

"కళ్ళు గీత్తుంటాడండీ."

"ఓహో! నీరా కార్మికుడన్న మాట. ఆ, చూడు! ఈరమ్మా మీఇంటిముందు కోళ్ళున్నట్టున్నాయి అవెక్కడివి?"

"ఆళ్ళెవళ్ళో బాంకోళ్ళట బాబూ, కోళ్ళ పెంచటానికి రెండొందలు అప్పు..."

"ఓహో గ్రామీణ బాంకీవాళ్ళు మీకు పౌల్ట్రీఫారం ఏర్పాటు చేసుకోడానికి గాను పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేశారన్న మాట. మరి ఈ కోళ్ళఫారం వల్ల మీకెంత ఆదాయం వస్తుంది?"

"ఏడబాబూ! ఆ ఎనిమిది కోళ్ళల్లో ఆరు పుంజులే తగలడ్డాయి. ఇక గుడ్లేడ కెళ్ళి వత్తాయ్?"

"ఓహో కోళ్ళను పెంచి పెద్దచేసి అమ్మే పద్ధతి వల్ల ఇంకా బాగా లాభాలు వస్తున్నాయన్న మాట. మరి మీ పిల్లలేం చదువుతున్నారు ఈరమ్మా?"

"చదువులేటండీ- పెద్దది గొడ్లుకాస్తది. రెండోవాడు ఆయనతో పాటు కల్లు తీస్తనికెళ్తుండె. మూడోది పేడేరుకొచ్చి పిడకలు చేస్తది నాలుగోది.."

(ఇదంతా రికార్డ్ అవదులెండి. అయినా చెరిపేస్తాం)

"అయినా మాకు సదువు లేటండీ-"

"అదే అడుగుతున్నా! అయితే అందరూ ప్రభుత్వ హాస్టల్స్ లో ఉంటూ, పాఠశాలల్లో, ఉచిత విద్య చక్కగా అభ్యసిస్తున్నారన్నమాట. మరి వాళ్ళందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలూ, నోట్ పుస్తకాలూ, స్కాలర్ షిప్ లూ ఇస్తున్నారు కదూ?"

"సదువే లేదంటే అలా అంటారేటి బాబూ" (రికార్డు అవదు)

"మీరుంటున్న ఇల్లు బాగుంది ఈరమ్మా! ఇది బలహీనవర్గాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఆరు నెలలు క్రితం కట్టించిన కాలనీలో ఇల్లే కదూ?"

పెభుత్తం కట్టించింది రెండోరోజే కూలిపోనాది బాబూ! మా డబ్బుతో కష్టం చేసి మేమే కట్టుకున్నాం మళ్ళీ." (ఈ సమాధానం చెరిపేస్తాం)

"అక్కడ మేస్తున్న ఆవులెవరివి? మీవేనా? ప్రభుత్వ బాంక్ లు ఇచ్చిన రుణాలతోనే కొన్నారు కదూ వాటిని!"

"అవి ఆవులు కాదు బాబూ! ఎద్దులు. అవి ఎవరివీ కావు. ఊరెమ్మట తిరిగే ఎద్దులు-" (చెరిపేస్తాం)

"మరి నువ్వు కూడా ఏదయినా పని చేస్తుంటావా ఈరమ్మా?"

"పొద్దుటేళ నుంచీ సాయింతరం వరకూ ఆ కొండల్లో తిరిగి కట్టెలు ఏరుకొత్తానండీ!"

"మరి సాయంత్రం ఏం చేస్తారు?"

"అందరం కలిసి కూకుని తాగుతామండీ." (చెరిపేస్తాం)

"ఓహో! ఓహో సాయంత్రాల్లో ప్రభుత్వం మీకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వయోజన విద్యాకేంద్రానికి వెళ్ళి చదువు నేర్చుకుంటారన్నమాట! చాలా సంతోషం! మరి ఆ తర్వాత"

"ఆ తరువాత కూడు తిని తొంగుంటాం-"

"అంటే ప్రభుత్వం చేసిన ఈ సహాయాల వల్ల మీ కుటుంబం యావత్తూ సుఖంగా జీవితం గడుపుతూ సంఘంలో పైకి రాగలుగుతున్నారన్నమాట. చాలా సంతోషం ఈరమ్మా! ఇంక శెలవు తీసుకుంటాం మేము."

"ఇదండీ బలహీనవర్గాల వారితో ఇంటర్వ్యూ" అంటూ ముగించాడు శ్రోతేశ్వర్రావు.

మళ్ళీ ఇంటర్ వ్యూలో బోర్డు వాళ్ళు ముగ్గురు ముఖముఖాలు చూచుకున్నారు. నిజంగానే ఆ సమాధానం చూస్తే బైహార్ట్ చేసినట్లే ఉంది.

"ఇంకా ఇంటర్వ్యూల గురించి ప్రశ్నించి లాభం లేదు-" అన్నాడు ఎస్.డి. పక్కనున్నతనితో.

"అది సరే! శ్రోతల ఉత్తరాలకు జవాబుల కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తావో చెప్పు చూద్దాం"

"అవును- ఇష్టమొచ్చినట్లు వేరువేరు ప్రోగ్రామ్ లు గురించి అడిగేద్దాం" అన్నాడు పక్కనున్నతను. "అలా అడిగి కన్ ఫ్యూజ్ చేసేయవచ్చు"

"శ్రోతల ఉత్తరాలకు ప్రోగ్రామ్స్ నీ, మననీ తిడుతూ, విమర్శిస్తూ వచ్చే ఉత్తరాలను ముందే వేరుచేసి చింపి అవతల పారేస్తామండీ! మన కార్యక్రమాల నన్నిటినీ పొగిడే ఉత్తరాలను చదువుతూ మధ్యమధ్యలో ఒకటో అరో 'ఫలానా ప్రోగాం బాగోలేదు' అన్న వాక్యాలు చదువుతాం."

"ఒకవేళ ఉత్తరాలన్నీ కూడా తిడుతూ వస్తే?"

"ఎప్పుడూ అవే కదండీ ఎక్కువ వచ్చేది. అలాంటప్పుడు జనరంజని పద్ధతి అవలంభిస్తామండి!"

"జనరంజని పద్ధతేమిటి?"

"అదేనండి! చేతికందిన సినిమా రికార్డు వేసి నారాయణఖేడ్ నుంచి షీల, లీల, సుశీల, అవలీల, సుగోల, ఘనాపురం నుంచి శివరామ్, బాలరామ్. శ్యామ్, ఇమామ్ అన్న బోగస్ పేర్లు చదువుతాం కదా! ఆ పద్ధతన్న మాటండి."

"సరే, న్యూస్ రీడర్ గా ఎలానటి న్యూస్ ప్రజలకు అందజేస్తావ్?"

"న్యూస్ బులెటిన్స్ అన్నీ తీసుకుని ముందు వాటిలో నుంచి ప్రభుత్వాన్ని విమర్శకు గురిచేసే వార్తలన్నీ సెన్సార్ చేసి అవతల పారేస్తానండీ."

మిగిలినవాటిల్లో మొదటివార్త మన ప్రధానమంత్రి గురించి గానీ, ఒకవేళ అలాంటివేమీ దొరక్కపోతే కేంద్ర మంత్రుల గురించి గాని తీసుకుంటాం. లేదా ఇందిరాగాంధీ ఫామిలీ గొప్పతనం గురించి ఇంకో వార్త.

ఆ తర్వాత బలహీన, బడుగు, హరిజన వర్గాల ప్రజలకు ప్రభుత్వం తల పెట్టిన కొత్త సౌకర్యాలు గురించి గానీ, లేదా అదివరకటి విషయాలే పునరుద్ఘాటించడం గాని చేస్తాం.

అప్పుడు దేశంలో ఏవో ఒక మూల జరిగిన కారు ప్రమాదం గురించో, లేక రైలు, బస్సు ప్రమాదాల గురించో చెప్పి మృతులు, గాయపడిన వారి సంఖ్యలు వివరిస్తాం.

ఆ తరువాత ఎలక్షన్లయ్యాక ఓట్ల లెక్కింపు సమయంలో కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ ఓడిపోయినా ఆ విషయం చెప్పకూడదు. ఆ పార్టీ గెలిచినవి ఒకటి రెండు స్థానాలే అయినా- ఆ విషఎమే ఊరికే ఊదరగొట్టేయాలి.

ఆఖరులో ఒక వాక్యం దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీల గురించీ ఉండాలి. లేకపోతే వాళ్ళు పార్లమెంటులో ఊరికే గొడవ చేస్తారండీ!" అంటూ ముగించాడు శ్రోతేశ్వరరావు.

అక్కడున్న వారికి ఏం చేయాలో అర్థం కావటం లేదు. మొత్తం నూట ఎనభయ్ మందినీ రెండు గంటల్లో వదిలించుకోగలిగారు గానీ- ఈ ఒక్క ఘటాన్ని ఫెయిల్ చేసి బయటకు పంపడం చేతగావటం లేదు.

"రేడియోలు ప్రసారం చేసే కథలు, నాటికలు, ఎలాంటివి సెలక్టు చేస్తావు" అడిగాడు రెండో అతను ఆలోచించి మరో అస్త్రం వదుల్తూ.

"అందులో పెద్ద ఇదేముందండీ! కథయినా, నాటికయినా, పాటలయినా, హరికథలయినా, బుర్రకథలయినా- ఏదయినాసరే- ఆరుసూత్రాల పథకంలోని ఏదొక సూత్రం గురించీ, లేదా ఇరవై సూత్రాల గురించి కానీ, (హరిజనుల మీద రాసిన నాటకాలకూ, వెట్టిచాకిరీ నాటకాలకూ ప్రిఫరెన్సిస్తాం) ఉండాలండి- లేకపోతే తీసి అవతలపారేస్తాం."

"మరి ఆ నాటకాలు ఎవరు రాసినవి ప్రసారం చేస్తావ్?"

శ్రోతేశ్వరరావు ఆనందంగా అరిచాడు.

"అబ్బ!అబ్బ! యెంత ఈజీ కొశ్చెన్... చెప్పనాండీ?"

"చెప్పు నాయనా' దిగులుగా అన్నాడు ఎస్.డి.

"ఎక్కువభాగము రచయితలు కానివాళ్ళు, లేదా రచనలు చేయటం నేర్చుకుంటున్న వాళ్ళతో రాయిస్తామండీ, ఎందుకంటే వాళ్ళకిక పాపం మిగిలింది రేడియో ఒక్కటే గదండీ. అంటే వాళ్ళను బలహీనవర్గంగా భావించి అలా సహాయం చేస్తామన్న మాటండీ. అందులో కూడా కిక్ బాక్లిచ్చే వాళ్ళనే ఎంకరేజ్ చేస్తామన్నమాట!"

"దేశనాయకులెవరయినా పరమపదించినప్పుడు ఏం ప్రోగ్రామ్స్ ఇస్తావు?" అడిగాడు మొదటి పెద్దమనిషి కాసేపు ఆలోచించి.

"గోవిందా! గోవిందా-వారం రోజులపాటు ఏడుపు మ్యూజిక్కే కదండీ, ఇంకా ప్రోగ్రామ్స్ ఏముంటాయ్ నా బొంద? ఉదయం డ్యూటీకి రాగానే 'కుయ్యో' మంటూ మొదలెట్టే టేప్ తగిలించి మనం బయటికి వెళ్ళి బోలెడన్ని సొంత పనులన్నీ చూసుకుని సాయంత్రం వచ్చి ఆ టేప్ తీసేస్తామన్న మాటండి."

ఇంకేం ప్రశ్న వేయాలా అని ఎస్.డి. ఆలోచించసాగాడు. ఈలోగా రెండో పెద్దమనిషి రకీమని అతిక్లిష్టమైన ప్రశ్న వదిలాడు.

"ఆ- మిష్టర్ శ్రోతేశ్వరరావు, మనకు అతి ముఖ్యమైన పండుగలకు, జాతీయ సెలవులకు ఏం ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తావు?"

"వాటికి ప్రోగ్రామ్స్ అని పెద్దగా ఏమీ ఉండవండి. గాంధీజీ బర్త్ డే ఉందనుకోండి. ఆ రోజు తెల్లారుజాము నుంచే గాంధీతాత మీద మన బాపూజీ బాలల తాతా బాపూజీ" వేస్తామండి. ఆ తరువాత "గాంధీ పుట్టిన దేశమా ఇది, నెహ్రూ కోరిన రాజ్యమా ఇది" పాటండి. ఆ తరువాత "గాంధీ పుట్టిన దేశం- రఘురాముడు ఏలిన రాజ్యం" పాట లాగిస్తామండి "గాంధీ మహాత్ముడు కలలుగన్న మరో ప్రపంచం" పాట ఆ తరువాత వేసేస్తాం, ఇలా వేసినవే వేస్తూ, మధ్య మధ్యలో "రఘుపతి రాఘవ రాజారాం' తగిలిస్తూ లాగించేస్తామండి.

ఇక కృష్ణ జయంతి రోజున మీకు తెతీదేంముందండీ! తెల్లారుతూనే హే కృష్ణా, ముకుందా, మురారీ పాటతో మొదలుపెట్టి కృష్ణ అన్నపదం పాటలో ఉంటేచాలు ఆ పాటలన్నీ మోతెక్కించేస్తాం.

"ఇక రక్షాబంధన్ పండుగ రోజున "అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి" పాటతో మొదలెట్టి మొత్తం సినిమాల్లోని అన్నా చెల్లెళ్ళ పాటలన్నీ లాగేంచేస్తాం.

"ఇక దీపావళి నాడు చీకటి వెలుగుల రంగేళీ! మన జీవితమే ఒక దీపావళి అనే పాటతో మొదలుపెట్టి అన్ని దీపావళి పాటలూ వేసేస్తాం!"

"ఇక శ్రీరామనవమికి "రామ కథను వినవయ్యా"తో మొదలెట్టి తుప్పు వదిలించేస్తాం, ఇక నాగులచవితినాడు..."

ప్రశ్న అడిగినతని మొఖం పాలిపోయింది.

"చాలు మిష్టర్ శ్రోతేశ్వర్రావ్ చాలు, ప్లీజ్" అని బ్రతిమాలాడు.

శ్రోతేశ్వర్రావు ఆపేశాడు.

"ఆ! ఈ ప్రశ్నను సమాధానం చెప్పు చూద్దాం చాలా టఫ్ కొశ్చెన్! మన ప్రధానమంత్రి రేడియోలో మాట్లాడతానని కబురు చేసారనుకో ఏం చేస్తావ్?"

శ్రోతేశ్వర్రావు విరగబడి నవ్వాడు.

"భలేవారే సార్- ఇంతసేపు ఆలోచించి ఇంత చిన్న ప్రశ్న అడిగారేమిటి? ప్రధానమంత్రి గారుండే చోటికి మొత్తం రేడియో స్టేషన్ ని తీసుకెళ్లి వారు చెప్పే విషయాలన్నీ తుచ తప్పకుండా రికార్డ్ చేస్తామండి."

ఎన్.డి. ఆలోచనల్లోంచి ఠక్కున తేరుకున్నాడు. మొఖానికీ, నుదుటికీ విపరీతంగ పట్టేసిన చెమటలు తుడుచుకున్నాడు.

"అదే రాష్ట్ర ముఖ్యమంత్రి అడిగితే?"

"అది ఆ ముఖ్యమంత్రి ఏ పార్టీకి చెందినవాడా అనే దాన్ని బట్టి వుంటుందండీ. ఉదాహరణకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీరామారావు రేడియోలో మాట్లాడాలనుకోండి! వీల్లేదు పొమ్మంటామండీ."

"ఇదిగో శ్రోతేశ్వర్రావు! మేము ముగ్గురం కలిసి ఆలోచించి ఇంకొక్క ప్రశ్న తయారుచేస్తాం. అంతవరకూ బయట కూర్చుంటే..."

"ఓ ఎన్నిరోజులు కూర్చోమన్నా కూర్చుంటానండీ. నా పేరే శ్రోతేశ్వర్రావు కదండీ, రేడియో స్టేషన్ లో గడపడం కంటే నాకు కావలసిందిందేముందండీ?" అంటూ అతను బయటికి వెళ్ళిపోయాడు. మరుక్షణం ముగ్గురూ ఏ ప్రశ్న అడగాలా అన్న తర్జనభర్జనలో మునిగిపోయారు.

గంటసేపటి తర్వాత గానీ వాళ్ళక్కావలసిన కఠినమైన ప్రశ్న దొరకలేదు. దొరికిందే తడవుగా శ్రోతేశ్వర్రావుని దబ్బున లోపలకి పిలిపించారు.

"మన రేడియో స్టేషన్ కి సాధారణంగా పరమ చెత్త స్క్రిప్టులు వస్తాయి కదా వాటిల్లో చాలవరకు మనం ప్రసారం చేస్తాం. అసలేమాత్రం ప్రసార యోగ్యం కాని చెత్తను మనమేం చేస్తాం? చింపిపారేస్తామా? చెత్త బుట్టలో వేస్తామా?"

"రెండూ చేయమండీ. అలాంటి రచనల కోసమే యువవాణి ప్రసారాలు ప్రారంభించామన్న మాటండీ. అంచేత రేడియో స్టేషన్లో ప్రసారానికి పనికిరాని చెత్త అంటూ ఏమీ మిగలదండీ."

ముగ్గురి మొఖాలూ వాడిపోయినయ్.

ఇంక తాము చేయగలిగిందేమీలేదు. శ్రోతేశ్వర్రావ్ కి ఉద్యోగం ఇవ్వక తప్పదు. ఈ ఉద్యోగానికి అన్నివిధాలా అతనికే అర్హత ఉంది.

"ఓకే మిస్టర్ శ్రోతేశ్వర్రావు, ఈ ఉద్యోగాన్ని సంపాదించుకున్నావ్, కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు స్టేషన్ డైరెక్టర్.

"థాంక్యూ సర్!" వినయంగా అన్నాడు శ్రోతేశ్వర్రావ్.

"సరే ఇవన్నీ బాగానే ఉన్నాయ్. పర్సనల్ గా ఇంకొక్క విషయం తెలుసుకోవాలని ఉందోయ్!" అన్నాడు ఎస్.డి.

"తప్పకుండా తెలుసుకోండి సార్."

"నీ పెరఫారమెన్స్, నీ గ్రోగామ్స్ క్వాలిటీ పరమ ఘోరంగా ఉంటోందని స్టేషన్ డైరెక్టర్ మేమో ఇచ్చాడనుకో! అప్పుడేం చేస్తావ్?"

శ్రోతేశ్వరర్రావ్ పొట్ట చేతితో పట్టుకుని టేబుల్ కింద నేలమీదపడి విరగబడి నవ్వాడు.

"అరె ఏమిటలా నవ్వుతావు?" ఆశ్చర్యంగా అడిగారందరూ కిందకు వంగి చూస్తూ.

"లేకపోతే ఏం ప్రశ్నసార్ అది? అలా జరగటం ఇంపాజిబుల్! నా పెర్ఫామెన్స్ ప్రోగ్రామ్స్ క్వాలిటీ చెత్తగా ఉండటమా? నెవర్!"

"అంటే రేడియోలో అన్నీ అద్భుతమయిన ప్రోగ్రామ్సే వుంటాయని నీ అభిప్రాయం! అంతేనా?"

"అయ్యో అదికాదు సార్! అదెలాగూ చెత్త క్వాలిటీయే, నేననేది అది కాదు. ఆ విషయం స్టేషన్ డైరెక్టర్ తెలుసుకోవడం గురించి! ఆయనకెలా తెలుస్తుంది ఆ విషయం?"

"అదేమిటి? ఎందుకు తెలీదు?"

"తెలుగు ఏరియాలో రేడియో స్టేషన్లకు స్టేషన్ డైరెక్టర్ గా ఎప్పుడూ తెలుగురానివాళ్ళనే వేస్తారు కదా- మరి వాళ్ళకిక ఈ పెరఫార్ మెన్సులు, క్వాలిటీలు ఇంకేం తెలుస్తాయి సార్! శ్రోతలందరూ అరచి గీపెట్టినా అర్థం కాదు. అంచేత ఇక ఆయన నాకు మెమో ఇచ్చే అవకాశమే లేదు."

"సరే ఇంక మీరు వెళ్ళవచ్చు" అన్నాడు స్టేషన్ డైరెక్టర్ ఒరియాలో (పొరపాటున).

శ్రోతేశ్వర్రావు వెళ్ళిపోగానే ఆయన ఫోన్ అందుకున్నాడు.

"హలో ఢిల్లీయేనా? హలో సార్ అయామ రియల్లీ సారీ! యెంత ప్రయత్నించినా మీ కాండిడేట్ శ్రీనివాసన్ ని సెలక్టు చేయడం కుదర్లేదు. మరో అవకాశం వచ్చినప్పుడు తప్పక..."

"అవసరం లేదులెండి ఇక్కడే ఢిల్లీ రేడియో స్టేషనులో తెలుగు న్యూస్ రీడర్ వేకెన్సీ ఒకటి వచ్చింది- దానిని సెలెక్టు చేసేస్తాం అతనిని."

"అదేమిటండి? అతనికి తెలుగు అస్సలు రాదు కదా! మరి అలాంటి వ్యక్తి తెలుగు ఏరియా రేడియోస్టేషన్లలోనే ఉంటే బావుంటుంది."

"ప్రస్తుతం అక్కడికంటే ఇక్కడ ఉంటే ఇంకా మంచిదిలెండి. రోజూ తెలుగున్యూస్ చదివితే- ఓ సంవత్సరంలో తెలుగు నేర్చుకోవచ్చు కదా."

"అఫ్ కోర్స్ తెలుగు నేర్చుకోవాలనుకునే ఇతర భాషల వాళ్ళకి ఢిల్లీ తెలుగు న్యూస్ రీడర్ పోస్ట్ కంటె మరో గొప్ప అవకాశం దొరకదులెండి."

"అన్నట్లు చెప్పడం మరిచిపోయాను, మీ ట్రాన్స్ ఫర్ కి మినిస్టరు గారు వప్పుకోలేదు. 'రిగ్రెట్' అని రాశాడు ఇంతకుముందే- ఉంటా-"

స్టేషన్ డైరెక్టర్ చేతిలోనుంచి రిసీవర్ పడిపోయింది.

ఆయన టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్ లో నుంచి 'అన్నయ్య సన్నిధీ అదే నాకు పెన్నిధీ... అన్న పాట హాయిగా వినబడుతోంది. ఆ రోజు రక్షాబంధన్ పండుగ.

* * * * *

# సతీ 'పురోగమనం'

సునీతాదేవి సతీ సహగమనం చేసుకోబోతుందన్న వార్త అగ్నికన్నా వేగంగా వ్యాపించింది మా కాలనీ అంతా!

శాయిరామ్, గోపాల్రావ్, రంగారెడ్డి, పార్వతీదేవి, రాజేశ్వరి, జనార్ధన్, యాదగిరి, వివిన్ పాల్, నిసార్, అందరూ రాత్రి పదకొండింటికి మా తలుపు కొట్టి ఈ వార్త నాకు చెప్పారు. అంతే ఆ రాత్రి ఇంక ఎవ్వరం నిద్రపోలేదు.

అప్పటికప్పుడే కాలనీ ఆడాళ్ళంతా సావిత్రమ్మగారి ఇంటిదగ్గర చేరి సునీతాదేవి విషయం కథలూ, నవలలుగా మాట్లాడుకోసాగారు.

కొంతమంది మగాళ్లు కూడా ఓ గ్రూపుగా తయారయి- మాకు వినపడకుండా తమలో తాము చెవులు కొరుక్కోసాగారు.

"ఇదేం కిరికిరి భాయ్. ఇంగ్లీషోళ్ళ టైమ్ లోనే 'సతి' బంద్ అయిపోయిందనుకుంటే నలభై ఏండ్ల తరువాత మళ్ళా షురూ అయిందేమి సంగతి?" అడిగాడు యాదగిరి.

"మనదేశంలో ఆడాళ్ళు ఎప్పటికీ మారరు గురూ!"

"మూఢనమ్మకాలతో మసి అయిపోతుంటారు" అన్నాడు జనార్ధన్ సినిమా హీరో ఫోజులో చెట్టుమీద ఓ చేయి వేసి ఓ పక్కకు ఒరిగి నిలబడుతూ.

ఆ తరువాత ఉదయం వరకూ అందరం రాజస్థాన్ లో ఇటీవల సతి జరిపిన యువతీ రూప కన్వర్ గురించీ, ఆరోజు అక్కడివారు ప్రయోగించిన భయంకరమయిన పద్ధతుల గురించీ మాట్లాడుకున్నాము.

తెల్లారుతుండగా కాలనీలో వాళ్ళందరూ సునీతాదేవి ఇంటికి తిరణాల్లా వెళ్ళటం మొదలుపెట్టారు.

"పదండి- మనమూ వెళ్దాం! సంగతి ఎంతవరకూ నిజమో కనుక్కుందాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం సునీతాదేవి వాళ్ళ ఇంటివేపు వెళ్ళాం. కాలనీ చివర్లలో ఉందది.

ఆమె భర్త ధర్మరాజు మా అందరికీ బాగా తెలుసు. అతగాడు, వాళ్ళమ్మతోనూ, వాళ్ళక్కతోనూ కలిసి మామగారు స్కూటర్ కొనివ్వలేదన్న నెపంతో సునీతాదేవిని రోజూ చావగొట్టటం, ఆమె బిగ్గరగా ఏడుస్తూండటం మా కాలనీలో అందరికీ తెలుసు.

ఒకసారి రాజేశ్వరీ, పార్వతీదేవిల ఆధ్వర్యంలో మా కమిటీ వాళ్ళందరం కలసి అతనింటికి వెళ్ళాం.

అప్పుడే ధర్మరాజు, వాళ్ళమ్మ కలసి సునీతాదేవిని చావగొడుతున్నారు.

అందరం అతనిని ఆపటానికి ప్రయత్నించాం గానీ అతను మా మీదే తిరగబడ్డాడు.

"ఏంట్రా! నా పెళ్ళాన్ని నేను కొడతాను, నరుకుతాను మధ్యలో మీరెవరు బే!"

"నేను కాలనీ ప్రెసిడెంట్ ని" అన్నాడు గోపాల్రావ్.

"ప్రెసిడెంట్ అయితే కాలనీ సంక్షేమం చూసోక్క! నా పెళ్లాం సంక్షేమం కాదు" అన్నాడు ధర్మరాజు.

"ఇగో- నీకు మర్యాదగా చెప్తున్నాం ఆమెను ఇంకొక దెబ్బ కొట్టారంటే పోలీస్ రిపోర్టిస్తాం" అన్నాడు శాయిరామ్.

"నీకేం సంబంధంరా ఇయ్యటానికి?"

"నేనే కాలనీ ఆర్గనైజింగ్ సెక్రట్రీ."

"తొక్కలో ఆర్గనైజింగ్ సెక్రట్రీ! నువ్వేంట్రా నాకు చెప్పేది?"

ఆ మాటతో శాయిరామ్ కి ఎక్కడలేని పౌరుషం పొడుచు కొచ్చింది.

"ఏమిట్రా! నేను బోడి ఆర్గనైజింగ్ సెక్రటరీనా? రేయ్, నాకు ఈ అయిదేళ్ళలోనూ నాలుగు షీల్డు లొచ్చాయిరా! దమ్ముంటే నువ్ చెయ్ ఆర్గనైజింగ్ సెక్రట్రీగా."

అంటూ ఇతని చొక్కా పట్టుకున్నాడు.

అందరం కలసి ముందు వాళ్ళిద్దరినీ విడదీశాం.

"చూడమ్మా- వీడు నిన్ను స్కూటర్ కోసం రోజూ చావగొడుతున్నట్లు కాగితం మీద రాసివ్వు. అయిదు నిమిషాల్లో లోపల తోయిస్తాం" అన్నాడు రంగారెడ్డి.

"రేయ్ రంగారెడ్డి- నువ్వు నాకు నీతులు చెప్తున్నావా? మీరందరూ మీ మామల దగ్గర పెళ్ళికి కట్నాలు దొబ్బలేదురా? పండుగకు ఖరీదయిన సామానులు కొట్టుకు రాలేదురా? ఇప్పుడు నాకొచ్చి నీతులు చెప్తున్నారు సాలేగాళ్ళు!"

ఈ మాటతో అందరం గతుక్కుమన్నాం.

జనమంతా మా వేపు చూడసాగారు ఎక్స్ ప్లనేషన్ కోసం.

నిజానికి రంగారెడ్డి రెండేళ్ళ క్రితమే వాళ్ళత్తగారు ఇచ్చిన డబ్బుతో గోద్రెజ్ అల్మారా తీసుకొచ్చాడు. గోపాల్రావ్ వాళ్ళ మామగారిచ్చిన డబ్బుతో స్కూటర్ కొన్నాడు. నేను మామగారు పంపిన డ్రాఫ్ట్ సహాయంతో టి.వి. సెట్ కొన్నాను.

"అసలీ మగజాతే అంత- ఎప్పుడూ అత్తమామలను పీక్కు తినడమే!" అనేసి వెనక్కు తిరిగి బిగ్గరగా స్లోగన్సు ప్రారంభించింది పార్వతీదేవి.

"మగాళ్ళ దురహంకారం-"

"డౌన్ డౌన్" అని అరచారందరూ.

"కట్న పిశాచం"

"నశించాలి."

"మగాడి కట్నకానుకల దాహం! బూడిదయిపోవాలి."

ధర్మరాజు తల్లి విసురుగా వచ్చింది పార్వతీదేవి దగ్గరికి.

"ఏమె నంగనాచిలా కేకలేస్తున్నావ్ గానీ నువ్వు చేసినపని మాకు తెలీదనుకున్నావా? ప్రతి పండగకు వెళ్ళి మీ పుట్టింటి వాళ్ళను దోచుకుని లారీలో సామానులు తేవటం ఎవరికి తెలీదు? మీ అక్కాచెల్లెళ్ళందరూ పీక్కు తినబట్టేగా మీ నాయనా సన్యాసుల్లో కలిసిపోయాడు. పైగా పత్తిత్తులాగా ఊరేగింపులు జరుపుతున్నావా?" అంటూ విరుచుకుపడింది.

"నేనేం మీలాగా పీడించుకు తీసుకు రావడం లేదు! మావాళ్ళే సంతోషంగా ఇస్తున్నారు."

"అలాగా! సిగ్గులేకపోతేసరి! వాళ్ళు సంతోషంగా ఇస్తున్నారో, ఏడుస్తూ ఇస్తున్నారో నీకెలా తెలుసు- ఇప్పుడు మాకూ స్కూటర్ సంతోషంగానే ఇమ్మని అడుగుతున్నాం."

పార్వతీదేవి ఎందుకయినా మంచిదని వెనక్కు తగ్గింది.

ఆ తర్వాత మేము పెద్దగా మాట్లాడేందుకు మొఖం చెల్లక ఎవరి దారినవారు వెనక్కు వచ్చేశాం.

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ వాడి జోలికిపోలేదు.

ఇప్పుడు ఆ ధర్మరాజు చనిపోయాడనేసరికి అందుకే మాకెవరకి విచారం కలగలేదు.

అతని భార్య సునీతాదేవి కూడా సంతోషిస్తోందనే అనుకున్నాం గానీ ఇప్పుడీ సతీ సహగమనం వార్త మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

ఇంట్లో నుంచి ధర్మరాజు తల్లి ఏడుపులు వినబడుతూనే వున్నాయి.

ఇంటిముందు ఆడామగా కిక్కిరిసిపోయి ఉన్నారు.

"రాజస్థాన్ లో లాగానే ఈవిడ కూడా సతీసహగమనం చేస్తుందట" అంటూ అందరూ ఎగ్జయిట్ మెంట్ తో మాట్లాడుతున్నారు. మేము వాళ్ళందరినీ తోసుకుని ముందుకు వెళ్ళాం.

చాలామంది పురోహితులు సతీసహగమనం ఏర్పాట్లు చేయడానికి సమావేశమయి కనిపించారు వరండాలో.

"ఇదన్యాయం, అక్రమం, అసంబద్ధం" అంటూ అరచాడు జనార్ధన్ మధ్యకెళ్ళి సినిమా ఫోజులో నిలబడి.

పురోహితులందరూ ఆశ్చర్యంగా చూశారతనివేపు.

"ఏమిటి నువ్ మాట్లాడేది?" అడిగాడొకతను.

"ఇదే ఈ సతి జరపటం మహా దుర్మార్గం! నా కంఠంలో ప్రాణం ఉండగా ఇలాంటిది జరగటానికి నేనొప్పుకోను" మళ్ళీ అరచాడతను.

"నీ కంఠంలో ప్రాణం ఉంటే మీ ఆవిడెందుకు సతి చేస్తుంది?" అన్నాడొకతను. "నీ ప్రాణం పోయాకే చేస్తుంది."

"నేననేది నా సంగతి కాదు. ధర్మరాజు భార్య సునీతాదేవి సంగతి" కోపంగా అన్నాడు.

"అవును. సునీతాదేవి సతి జరపటానికి వీల్లేదు" అరచాడు రంగారెడ్డి.

"ఇదిగో- దీనికి వ్యతిరేకంగా మా కమిటీ పాస్ చేసిన రిజల్యూషన్ కాపీ" అన్నాడు శాయిరామ్.

"హిందు మత ధర్మానికి వ్యతిరేకంగా మీలాంటివాళ్ళు పాస్ చేసిన రిజల్యూషన్స్ చెల్లవ్ నాయనా!" అన్నాడు శ్యామల్రావ్ మాకు సర్దిచెపుతూ.

"మేమే కాదు! కేంద్రప్రత్భుత్వం కూడా సతికి వ్యతిరేకంగా బిల్ పాస్ చేసింది" అన్నాడు గోపాల్రావ్.

"ప్రభుత్వం చాలా బిల్స్ పాస్ చేస్తుంది నాయనా! కానీ వాటిని ఎవరు అమలు పరుస్తున్నారు? వేటిదారి వాటిదే! ఆ మధ్య ముస్లిమ్ మతం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని వాళ్ళు చెపితే ప్రభుత్వం వాళ్ళు చెప్పినట్లు చేసిందా లేదా? మరిప్పుడీ హిందూమతం జోలికెందుకొస్తున్నట్లు?" తిరిగి అడిగాడతను.

మాకేం మాట్లాడాలో తెలీలేదు.

"అంతా అబద్ధం, హిందూమతంలో ఇలా చేయాలని ఎక్కడా లేదు" అరిచింది పార్వతీదేవి.

"ఉంది! ఉండబట్టే అలనాటి నుంచీ సతి ఆచారం వస్తోంది."

"లేదు."

"ఉంది."

"లేదు-

"అసలు ఆడదానికీ మంటకూ అవినాభావ సంబంధం ఉంది. ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆడది కిర్సనాయిలు పోసుకుని తగలేసుకుని చనిపోవటం మన సంప్రదాయం! ఆనాటి సీతమ్మ వారి అగ్ని ప్రవేశం నుంచీ ఇవాళ్టి వరకట్నాల చావులవరకూ అంతా అగ్నిమయం-"

రాజేశ్వరికి కోపం పొడుచుకొచ్చింది.

"సీతమ్మ అగ్ని ప్రవేశం సీన్ డౌన్ డౌన్! అది రాసిన వాల్మీకీ- డౌన్ డౌన్! అంటూ అరిచింది.

మేమంతా కూడా సీత అగ్నిప్రవేశానికి వ్యతిరేకంగా కాసేపు నినాదాలు చేశాం!

మా అరుపులు విని శ్యామల్రావ్ కీ, ధర్మరాజు తల్లిదండ్రులకు కోపం ముంచుకొచ్చింది.

"సతీసహగమనం జిందాబాద్- లోకసభ బిల్ డౌన్ డౌన్" అంటూ అరచారు వారి తరపున కొందరు.

"ఇదిగో- మీరీ వెధవపని ఆపకపోతే పోలీస్ రిపోర్టిస్తాం!" అన్నాడు శాయిరామ్.

"ఏమిటి? పోలీసులా! వాళ్ళేం చేస్తారు- వాళ్ళ మొఖం! డియెరాలాలో ఏం చేశారు? అంతా అయాక వచ్చి ఎఫ్.ఐ.ఆర్. రాసుకెళ్ళారు" అన్నాడు శ్యామల్రావ్ హేళనగా.

"గట్లనే! నీ పని ఇప్పుడే చెప్తా" అంటూ సైకిల్ మీద పోలీస్ స్టేషన్ కి వెళ్ళాడు యాదగిరి.

సునీతాదేవికి పెళ్లినాటి అలంకరణలు చేయసాగారు లోపల గదిలో. అప్పటికప్పుడే కొంతమంది మగా ఆడ ఆమెకు కిటికీలోంచే దణ్ణాలు పెట్టి చెంపలు వేసుకోసాగారు. మాకు వళ్ళు మండిపోతోంది వాళ్ళను చూస్తుంటే.

"ఏయ్, మీకేమయినా బుద్ధుందా? వాళ్ళను నాలుగు తిట్టాల్సింది పోయి మీరూ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారా?" అన్నాడు రంగారెడ్డి.

"మా ఇష్టమయ్యా! మా నమ్మకాన్ని కాదంటానికి నువ్వెవడివి" అంటూ ఎదురు తిరిగారు వాళ్ళు.

సరిగ్గా అప్పుడే పోలీసులు వచ్చారు వాన్లో.

"చూస్కోండి! ఇప్పుడు పోలీసులు వాళ్ళందరి మూసేస్తారు" అన్నాడు గోపాల్రావ్ హ్యాపీగా.

రాగానే మా గోపాల్రావ్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు ఇన్ స్పెక్టర్.

"పద వానెక్కు" అన్నాడు.

గోపాల్రావ్ నివ్వెరపోయాడు.

"ఎందుకు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఈ స్కూటర్ నీదేనా?"

"నాదే!"

"మరి హెల్మెట్ ఏది?"

"మా ఇల్లు ఇక్కడే! అందుకని హెల్మెట్ తేలేదు"

"ఏయ్ సెవన్ వన్ జీరో- వీడిని వాన్ లో వేసేయ్!"

మరుక్షణం ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి గోపాల్రావ్ ని లాక్కెళ్ళి వాన్ లో వేసేశారు.

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి. ఇన్ స్పెక్టర్ దగ్గరకెళ్ళి రెండు చేతులూ నడుమ్మీద పెట్టుకుని.

"వీడిని కూడా వాన్ లోకి తోసెయ్యండి" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"నన్నా? నన్నెందుకు?"

ఇన్ స్పెక్టర్ కి ఏం చెప్పాలో తోచలేదు. రెండు క్షణాలు టోపీ తీసి బుర్ర గోక్కున్నాక అయిడియా వచ్చింది.

"ఎందుకేమిటి? యాంటీ టెర్రరిస్ట్ యాక్ట్ కింద"

ఇంక లాభంలేదని నేను కల్పించుకున్నాను.

"అదికాదు ఇన్ స్పెక్టర్ గారూ! మిమ్మల్ని పిలిపించింది మేము. అవతల ఆ శ్యామల్రావ్ అనేవాడు ఆ సునీతాదేవి బంధువులను రెచ్చగొట్టి సతీసహగమనం చేయిస్తున్నాడు. వాళ్ళ సంగతి చూస్తారని మేమనుకుంటుంటే మమ్మల్ని మూసేస్తానంటారేమిటి?"

"ఏయ్! నువ్వెవరు?" దబాయింపుగా అడిగాడు ఇన్ స్పెక్టర్.

"ఈ కాలనీ కమిటీకి వైస్ ప్రెసిడెంట్ ని-"

"వీడని కూడా లోపలవేసెయ్యండ్రా"

నేను కంగారుగా యాదగిరివేపు చూశాను.

'ఈయనను లోపల వేశారంటే మీరు లోపటయిపోతారు! ఈయన ఈ కాలనీలోని 'తెలుగుదేశం' పార్టీ శాఖకు సెక్రటరీ" అన్నాడు యాదగిరి అబద్ధమాడేస్తూ.

ఆ మాట వినటంతోనే ఇన్ స్పెక్టర్ ప్రవర్తనలో ఠక్కున మార్పు వచ్చేసింది.

"అలాగా సార్ మరి చెప్పరేం?" ఏయ్ సెవన్ వన్ జీరో! వాన్ లో ఉన్న వాళ్ళిద్దరినీ వదిలేసెయ్" అంటూ నావేపు తిరిగాడు మళ్ళీ.

"ఆ! చెప్పండి సార్! ఏమిటిప్పుడు ప్రాబ్లెమ్?"

జరిగిందంతా చెప్పాను.

"కానీ మతపరమయిన విషయాల్లో జోక్యం కలుగజేసుకుంటే కొంచెం రిస్క్ సార్" అన్నాడు ఇబ్బందిగా.

"ఓర్నీ! ఇందులో మతమేమిటండీ! అవతల మర్డర్ జరుగుతుంటేనూ?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

"నేను అన్నీ ఎంక్వయిరీ చేశానండి! సునీతాదేవి తాత ముత్తాతలు రాజపుట్స్ వంశానికి చెందినవారట. అందుకని వాళ్ళకది పవిత్రమయిన ఆచారం-" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"ఆ ఆచారం ఆంధ్రప్రదేశ్ లో ఎలా పాటిస్తారండీ! ఇక్కడ కేవలం మన ఆచారాలు మాత్రమే పాటించాలి!" అన్నాడు శాయిరామ్.

"మన ఆచారం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"పెళ్ళయిన రెండేళ్ళలోపే భార్యను కట్నంకోసం చంపేయటం మన సాంప్రదాయమగ సతీసహగమనం వరకూ భార్య బ్రతికి వుండకూడదసలు-" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! ఆ మాటా నిజమే!" అన్నాడు ఇన్ స్పెక్టర్ తలగోక్కుంటూ.

"యూ ఆర్ అండర్ అరెస్ట్. ఇక్కడి సంప్రదాయాలను పాటించనందుకు" అన్నాడు శ్యామల్రావ్ తో.

శ్యామల్రావ్ కొంచెం జంకాడు.

"అదేమిటి సార్? ఇలాంటి మహత్తరమయిన సంఘటన మన రాష్ట్రంలో జరుగుతున్నందుకు మనమంతా గర్వించాలి. చూడండి! మన రాష్ట్రంలో సతీ గుడి ఒక్కటి కూడా లేదు. ఇప్పుడీ సతి ఏర్పాటు చేస్తున్నామనేసరికి చూడండి! ఆరులక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు, మన రాష్ట్రంలోని వర్తకులూ, రాజకీయ నాయకులూ! అందులో ఇద్దరు కలెక్టర్లు, పోలీస్ ఆఫీసర్లు కూడా ఉన్నారు-"

మేము తెల్లమొఖం వేశాము.

"పోలీస్ ఆఫీసర్లు కూడా ఉన్నారా సార్?" భయంగా అడిగాడు ఇన్ స్పెక్టర్.

"ఇద్దరు" అన్నాడు శ్యామల్రావ్ ధైర్యం పుంజుకుంటూ.

"అయితే" అంటూ మళ్ళీ బుర్ర గోక్కుని నావేపు తిరిగాడు. "పోనీ ఓ పని చేద్దాం! మనకేం తెలీనట్లు మనం వెళ్ళిపోదాం! సతి జరిగిపోయాక వచ్చి వాళ్ళను అరెస్ట్ చేస్తాం!" అన్నాడు ఆనందంగా.

"అది జరగడానికి వీలులేదనే కదయ్యా మేం మొత్తుకునేది?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి. ఈలోగా జనంలో త్రొక్కిసలాట ప్రారంభమయింది.

"జరగండి! మంత్రిగారొచ్చారు" అంటూన్నారెవరో.

మరుక్షణం మంత్రిగారి అంగరక్షకులు అందరినీ పక్కకు తోసివేస్తూ మంత్రిగారిని సునీతాదేవి ఇంటిదగ్గరకు తీసుకెళ్లారు.

ఆయన సునీతాదేవికి దణ్ణం పెట్టి, కాళ్ళు కళ్లకద్దుకొని చెంపలేసుకుని బయటికొచ్చారు మళ్లీ. దాంతో పార్వతీదేవి, రాజేశ్వరీ, సావిత్రమ్మ గారూ పెద్దగా కేకలేసుకుంటూ మినిష్టరు గారికి ఎదురువెళ్లారు.

"మినిష్టర్- డౌన్ డౌన్- సతీసహగమనం డౌన్ డౌన్-"

మినిష్టర్ చిరునవ్వు నవ్వారు.

"అలా తొందరపడకండి. సతీసహగమనం బాన్ చేస్తూ 'లా' రాబోతోంది త్వరలో. అంతవరకూ ఓపిక పట్టండి. నిజానికి నేనూ సతికి వ్యతిరేకినే-"

"అంతా అబద్ధం!" అరిచాడు శాయిరామ్ ఆవేశంగా "మీరు వ్యతిరేకి అయితే ఇప్పుడు ఇక్కడికొచ్చి సునీతాదేవికి ఎందుకు దణ్ణంపెట్టి పూజలు చేశారు?"

"అది సీక్రెట్! చెప్పటం బావుండదు-"

"వీల్లేదు చెప్పాల్సిందే! లేకపోతే మిమ్మల్ని వెళ్ళనీయం ఇక్కడినుంచి."

ఆయన కొంచెం ఇబ్బందిగా అటూ ఇటూ చూసి చెప్పేశాడు.

"మరేం లేదు! మన జనంలో చాలామంది మూర్ఖులున్నారన్న సంగతి మాకు తెలుసు. వాళ్లందరికీ సతిలాంటి మూఢాచారాల మీద మాంఛి గురి వుంది. ఇప్పుడు మేము 'కాదు' అని గట్టిగా అరిచామంటే వచ్చే ఎలక్షన్లలో మా ఓట్లు గోవిందా? అపోజిషన్ వాళ్ళు ఇదే ఛాన్సనీ నెమ్మదిగా వాళ్ళను 'దువ్వి' మమ్మల్ని గెలిపిస్తే సతీసహగమనానికి 'భారతరత్న' లాంటి అవార్డులు ఇప్పిస్తాం! టీవీలో రోజూ ఓ సతి గుడి గురించి డాక్యుమెంటరీ చూపిస్తాం అనేసి గెలిచి పవర్ లోకొచ్చేస్తారు. అంచేత ఎక్కడో ఒకరిద్దరు సతీసహగమనం చేసినంత మాత్రాన మనకు మునిగిపోయిం దేముందీ? దానికోసమని పదవులు పోగొట్టుకోమంటారా? మమ్మల్నిలా కోరటం మీకు న్యాయమేనా? చెప్పండి' అంటూ కన్నీరు తుడుచుకున్నాడు.

మా కందరికీ ఆయనను చూస్తే జాలి వేసింది.

"మరి మన తెలుగుపాఠం పుస్తకాల్లో కూడా సతి చాలా గొప్పదని స్తుతించే వాక్యాలు కొన్ని ఉన్నాయ్. అవయినా తీసేస్తారా లేదా?" అదమాయించింది రాజేశ్వరి.

"అరె! అలా మన గవర్నమెంట్ టెక్ట్స్ బుక్స్ లో ఉందా? దిసీజ్ టూమచ్ ఇప్పుడే కమిటీ వేయిస్తాను" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

మేము చూస్తుండగానే సునీతాదేవి గాయత్రి మంత్రం జపిస్తూ కాలనీ అంతా నడవ సాగింది. కాలనీ మధ్యలోనే చితి ఏర్పాటు చేసేశారు క్షణాల్లో. అంతవరకూ మాతోపాటు సతికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన స్త్రీలు చాలామంది మమ్మల్ని వదిలేసి వెళ్ళి సునీతాదేవికి భక్తితో మొక్కటం ప్రారంభించారు. మరి కాసేపట్లో సునీతాదేవిని తీసుకొచ్చి

చితిలో కూర్చోబెట్టి ఆమె భర్త శరీరాన్ని ఆమె వళ్ళో పడుకోబెట్టారు. శ్యామల్రావ్ అదంతా వీడియో తీయిస్తున్నాడు, తర్వాత కాసెట్స్ అమ్ముకోటానికి.

మరుక్షణం చితికి నిప్పంటించారు. సునీతాదేవి కెవ్వున కేకవేసింది. భర్త శరీరాన్ని ఒక్కతోపు తోసిలేచి పరుగుతో రాబోయింది. అయితే చుట్టూ ఉన్న కొంతమంది ఆమెను బలంగా కర్రలతో కొట్టేసరికి చితిలోనే పడిపోయింది.

"దిసీజ్ టూ మచ్- ఇది ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా జరుగుతోంది" అంటూ గట్టిగా అరచి ముందుకు ఒక్క దూకు దూకాను.

మా ఆవిడా, పిల్లలూ, పక్కింటివాళ్ళూ అందరూ నాచుట్టూ మూగి ఉన్నారు.

"ఏమిటండీ! ఏం జరిగింది? ఎందుకలా కొంపలు మునిగేటట్లు కేకలు పెట్టి మంచంమీద నుంచి కింద పడ్డారు?" అడిగింది మా ఆవిడ గాబరాగా.

"కలొచ్చింది" అన్నాను కింద నుంచి లేచి కూర్చుంటూ.

"ఏం కల?" పక్కింటావిడ అడిగింది నవ్వాపుకుంటూ.

"సునీతాదేవి లేదూ- వాళ్ళాయన ధర్మరాజు చచ్చిపోతే సతీసహగమనం చేసిందట-"

"సిగ్గులేకపోతేసరి! అలాంటి వెధవ కలలు కనడానికి!" అంది మా ఆవిడ. పపుడే రంగారెడ్డి, శాయిరామ్, జనార్ధన్, గోపాల్రావ్, యాదగిరి హడావుడిగా వచ్చారు లోపలకు.

"త్వరగా పద! ధర్మరాజు ఇంటికెళ్ళాలి మనం" అన్నాడు శాయిరామ్ ఆత్రుతగా.

"ఎందుకు? చచ్చిపోయాడా?" అడిగాను అనుమానంగా.

"లేదింకా! తలమాత్రం పగిలిందిట! వాళ్ళ అమ్మకూ, అక్కకూ మాత్రం గాయాలు బాగా తగిలాయంటున్నారు."

"అదేమిటి? ఏం జరిగింది?" అడిగాను ఆశ్చర్యంగా.

"నీకింకా తెలీదా? సునీతాదేవిని ఎప్పటిలాగానే కట్న కానుకల కోసం చావగొట్టి కిర్సనాయిలు పోసి చంపబోయారట. ఆమె ఎదురుతిరిగి కత్తిపీట తీసుకుని వాళ్ళందరి మీదా ఎటాక్ చేసింది-"

* * * * *

# గంధా కానూన్

కాలనీ మీటింగ్ లు జరిగి చాలారోజులు గాప్ రావడంతో మాకందరికీ చాలా రిలీఫ్ దొరికినట్లయింది. గోపాల్రావ్ అయితే ఈ ప్రశాంతతకు నిజంగా ఆనంద పడిపోయాడు.

"ఆహా! మన చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోకుండా, మన మీదకే సమస్య వచ్చినా 'ఏం చేస్తాం! తప్పదు' అనే ధోరణి అవలంబిస్తే జీవితం ఇంత ఆనందదాయకంగా వుంటుందా?" అనడిగాడు నన్ను.

"అవును! ఉంటుంది" అన్నాన్నేను.

"అయితే మనం ఇకనుంచి కాలనీ కమిటీని రద్దుచేసి పారేసి ఒకడి సంగతి ఒకడు పట్టించుకోకుండా- ఎవరిదారిన వాళ్ళు బ్రతికేయటం మంచిదికదూ?" అడిగాడు రంగారెడ్డి.

"అవును. చాలా మంచిది" అన్నాన్నేను కాషన్ గా.

ఎందుకంటే అదెలాగూ జరిగేదికాదు, పెట్టేదికాదు.

ఎవడికేం ఆపద వచ్చినా దూకుడుగా వాడికి సహాయం చేయడానికెళ్ళటం, సహాయం బదులు చివరకు హానిచేసి రావటం మన తెలుగువాళ్ళ స్పెషాలిటీ అన్న విషయం నాకు తెలుసు.

ఏమయితేనేం కాలేనీలో ఎలాంటి మీటింగ్ లూ గొడవలూ లేకుండా ప్రశాంతంగా మరో వారం రోజులు గడిచింది. ఈ వారం రోజుల్లోనూ చాలా దిగులుగా, నిరుత్సాహంగా, ఏదో పోగొట్టుకున్నట్లు కాలనీ స్టేజ్ దగ్గర ఒక్కడే కూర్చుని మైక్ సెట్ రిపేర్ చేస్తున్నట్లు నటిస్తూ "హలో వన్ టూ- త్రీ- ఫోర్- ఫైవ్- సిక్స్- సెవన్" అంటూ వందవరకూ అంకెలు ఇంగ్లీష్ లో చదివి మైక్ టెస్టింగ్ అంటూ కనిపించిన ఒకే ఒక వ్యక్తి శాయిరామ్.

కానీ అలా ఎంతోకాలం జరగలేదు. మరో వారం రోజుల తర్వాత అకస్మాత్తుగా ఓ సంఘటన జరగడంతో అందరం అందులో ఇరుక్కోక తప్పలేదు. మా కాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ వాళ్ళ ధర్మమా అని ఒక స్కూటర్ ఇన్ స్టాల్ మెంట్స్ లో కొనడానికి సన్నాహాలు ప్రారంభించాడు. ముందు కట్టాల్సిన నాలుగువేల రూపాయలు మేమంతా కలిసి పోగుచేసి అప్పుగా ఇచ్చాం అతనికి. అతను ఆ అప్పుని తను రాసే పుస్తకాలకు ముందుమాటలో మా అందరికీ కృతజ్ఞతలు చెప్పి తీర్చుకుంటానన్నాడు గానీ మేము వప్పుకోలేదు. ఎవరి డబ్బు వాళ్ళకి ఎప్పటికయినా కాష్ రూపంలోనే ఇవ్వాలని వార్నింగిచ్చాం. అయిష్టంగానే వప్పుకున్నాడతను. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ వాళ్ళు ఆ స్కూటర్ షోరూమ్ వారికి లెటర్స్ రాసి ఇచ్చారు. అందరం ఆ లెటర్ తీసుకుని షోరూమ్ కి చేరుకున్నాం!

షోరూమ్ మేనేజర్ మా లెటర్ ఓసారి చదివాడు.

అతని మొఖంలో కనబడాల్సినంత ఆనందం కనిపించటం లేదు ఎందుకనో.

"ఏ కలరు స్కూటర్ కావాలి?" అనడిగాడు అనాసక్తిగా. మేమంతా ముందే ఏ కలర్ అడగాల్సిందీ చంద్రకాంత్ కి నూరిపోశాం. అంచేత చంద్రకాంత్ తడుముకోకుండా 'మెరూన్ దొరకదు" అతనూ మొండికేశాడు.

"ఎందుకు దొరకదు?"

"అవి తక్కువ సప్లయ్ అవుతాయి కాబట్టి"

"ఎందుకు తక్కువ సప్లయ్ అవుతాయ్?" అతనికి చిర్రెత్తు కొచ్చింది.

"ఇదిగో చూడు మిష్టర్, ఇన్ స్టాల్ మెంట్స్ లో కొనేవాళ్ళు అట్లా అరవకూడదు. మీకా కలర్ కావాలంటే ఇంకో నెల రోజులయాక రండి"

అందరం మొఖాలు చూసుకున్నాం.

"నెలరోజులా?"

"అవును!"

మా గొడవ చూసి యాదగిరి మధ్యలో కొచ్చాడు.

"ఏదొక్కలర్ తీస్కొ రాదురా భయ్! ఒకటే లొల్లి పెడ్తున్రు. మెరూన్ అయితే మంచిగా నడస్తదా, వేరేది నడువదా?"

యాదగిరి డైలాగ్ తో ఇక చేసేది లేక పరమ భయంకరంగా కనిపించే కలర్ స్కూటర్ సెలెక్ట్ చేసుకున్నాం. మామూలుగానే మొదటిరోజు అందరం చంద్రకాంత్ ఇంటిముందు గుమికూడాము ప్రారంభోత్సవానికి.

చంద్రకాంత్ భార్య వచ్చి కొబ్బరికాయ కొట్టి స్కూటర్ కి దణ్ణం పెట్టింది.

"ఇలా పూజలు చేస్తే యాక్సిడెంట్స్ ఏమి అవకుండా ఉంటాయట" అందామె మిగతా ఆడాళ్ళతో.

"అవునవును" అన్నారు మిగతా ఆడవాళ్ళు.

"మరి రోడ్ నెంబర్- త్రీలో ఉన్న వరాహాల్రావ్ ముహూర్తం పెట్టి పూజలు చేసి మొదటి రౌండ్ లోనే రెండుకాళ్ళూ విరగ్గొట్టుకుని స్కూటర్ ని పాత ఇనుప సామాన్ల దుకాణంలో అమ్మేశాడు కదా?" అడిగింది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి.

అందరికీ రాజేశ్వరి మీద కోపం వచ్చింది. రాజేశ్వరికి మొదటి నుంచి కొంచెం కమ్యూనిస్ట్ భావాలు ఎక్కువ.

"శుభమా అని మనాడు స్కూటర్ కి ప్రారంభోత్సవం చేస్తూంటే ఈవిడ యాక్సిడెంట్స్ గురించి మాట్లాడుతుందేమిటి?" విసుక్కున్నాడు రంగారెడ్డి.

పూజ కార్యక్రమం అయిపోయింది. అందరికీ తలో చిక్కీ పాకెట్ కానుకగా ఇచ్చాడు చంద్రకాంత్. తను ఇంకా పాపులర్ రచయిత అవలేదు కాబట్టి ప్రస్తుతానికి వాటితోనే సర్దుకోమని బ్రతిమాలాడు. పాపులర్ అయిన రచయిత అయిన మరుక్షణం అందరికీ హాట్ డ్రింక్స్ చికెన్ టిక్కా పబ్లిషర్స్ ఖర్చుమీద ఏర్పాటు చేయిస్తానని కూడా ప్రామిస్ చేశాడు. మేము సరేనని వప్పుకున్నాం.

ముందు వాళ్ళ పిల్లలను ఎక్కించుకుని స్కూటర్ స్టార్ట్ చేశాడు తను. ఫస్ట్ గేర్ వేయగానే మేమంతా తప్పట్లు కొట్టాము.

చంద్రకాంత్ కాలనీ చుట్టూ ఓ రౌండ్ దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చాడు. ఈ సారి వాళ్ళావిడని ఎక్కించుకుని కాలనీ చుట్టూ ఓ రౌండ్ కొట్టమని కోరారు ఆడాళ్ళందరూ.

"ఆ! ఇప్పుడెందుకు లెండి! తర్వాతెలాగూ వెళ్తాంగా" అంది వాళ్ళావిడ సిగ్గుపడిపోతూ.

"ఆహహ? అలా అంటే ఎలా! స్కూటర్ మీద కూర్చోవటం కూడా మీరు నేర్చుకోవాలి కదా!" అంటూ బలవంతం చేసి ఆమెను స్కూటర్ ఎక్కించారు.

మళ్ళీ చంద్రకాంత్ ఫస్ట్ గేర్ వేయగానే అందరం తప్పట్లు కొట్టాము.

స్కూటర్ రివ్వున దూసుకెళ్ళి మళ్ళీ ఇంకో పెద్ద రౌండ్ కొట్టి దిగ్విజయంగా తిరిగి వచ్చింది. చంద్రకాంత్ మొఖం గర్వంతో వెలిగిపోతోంది.

"డ్రైవింగ్ నేర్చుకొని చాలా దినాలైపోయింది గానీ ఆ టచ్ పోలేదు. చాలా ఈజీగా డ్రైవ్ చేసేయగలుగుతున్నా" అన్నాడతను ఆనందంగా. అయితే అతని వెనుక సీట్ ఖాళీగా కనిపించేసరికి అతని భార్య మధ్యలో భయపడి దిగిపోయిందేమోనని అనుకున్నాం అందరం.

"మీ ఆవిడేదీ!" అడిగాడు రంగారెడ్డి.

చంద్రకాంత్ ఛటుక్కున వెనక్కు తిరిగి చూసి కెవ్వున కేకవేశాడు.

"అయ్యో! ఎక్కడో పడిపోయినట్లుంది" అన్నాడు పాలిపోయిన మొఖంతో మా అందరి గుండెలూ ఝల్లుమన్నాయి.

అందరం స్కూటర్ వచ్చిన రూట్ వేపు పరుగులు తీశాం.

మా కాలనీ బయట, కార్పొరేషన్ రోడ్ జాయిన్ అయ్యే చోట కార్పొరేషన్ వాళ్ళు కొత్తగా తవ్విన గోతిలో పడిపోయి కనిపించిందామె. ఆదుర్దాగా ఆమెను లేపి కూర్చోబెట్టాం. కానీ ఆమె అప్పటికే స్పృహ తప్పింది. తలకూ కాళ్ళూ చేతులకూ దెబ్బలు తగిలాయి.

"ముందు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దాం పదండి!" అన్నాడు గోపాల్రావ్.

"ఆటోని పిలవండి" అరిచాడు రంగారెడ్డి.

యాదగిరీ, జనార్ధన్ ఆటో కోసం పరుగెత్తారు. రోడ్ పక్కనే అరడజను ఆటోలు ఖాళీగా కనిపించినయ్.

"ఆటో" పిలిచాడు యాదగిరి. ఒక ఆటోడ్రైవర్ సిగరెట్ కాల్చుకుంటూ వచ్చాడు నెమ్మదిగా.

"ఎక్కడకు పోవాలె?" అడిగాడతను.

"డాక్టర్ దగ్గరకు!"

"ఎవళ్ళను తీసుకుపోవాలె?"

"ఒకామెకు యాక్సిడెంట్ అయింది. అర్జంటుగా ఈ చుట్టుపక్కలున్న ఏదో ఒక డిస్పెన్సరీకి తీసుకుపోవాలి!"

"యాక్సిడెంటా? అయితే నేన్రాను" అనేసి వెళ్ళి ఆటోలో పడుకున్నాడు.

"ఎందుకు రావ్!" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"యాక్సిడెంట్ కేస్ లంటే పోలీసులతో కిరికిరివయ్యా! నేన్రాను"

"అరె! నువ్వేం పాగల్ గానివా? నీయవ్వ- ఆడ పేషెంట్ బేహూష్ ఉన్నదంటే ఫాల్తూ కిరికిరి చేస్తావ్"

ఆటో డ్రైవర్ మా మాటలు తనకుద్దేసించనట్లే "ఏక్ దో తీన్" అంటూ హిందీపాట పాడుకోసాగాడు.

"అరె! నీగ్గాదువయ్యా జెప్పేది?" మరింత కోపంగా అరిచాడు యాదగిరి.

ఆటోడ్రైవర్ అదే పాటను మరింత బిగ్గరగా పాడాడు.

"వీడితో ఏంట్లే- వేరే ఆటోలున్నయ్ గా పద" అన్నాడు జనార్ధన్. ఇద్దరూ ఆ పక్కనే ఉన్న మిగతా ఆటోల దగ్గరకు నడిచారు.

మమ్మల్ని చూడగానే అందరూ అదే పాట పాడటం మొదలుపెట్టారు.

"ఆటో- ఇగో- జర అర్జెంట్! డాక్టర్ దగ్గరకు పోవాలె! నడు" అన్నాడు యాదగిరి.

"యాక్సిడెంట్స్ కేసులు తీసుకుపోము సార్!" ఒకతను పాట ఆపి చెప్పి మళ్ళీ పాటలో కెళ్ళిపోయాడు. యాదగిరికి కోపం ఆగలేదు.

"రాకుంటే ఆటో తీస్కొని ఇంటికి పో! రోడ్ మీదికెందుకు వచ్చినవ్?" అన్నాడు మండిపడుతూ.

"నువ్వెవడివి అడగటానికి?" తనూ లేచి నిలబడుతూ అన్నాడు ఆటోవాడు.

నేనూ జనార్ధన్ యాదగిరిని వెనక్కు లాగాం.

"నేనెవడినా? నీయవ్వ- ఆటోకి లైసెన్స్ ఎందుకిచ్చిన్రు! పబ్లిక్ అడిగితే బరాబర్ పోవాలి! కానూన్ ఎరుకనా నీకు?"

ఆ మాటతో ఆటోడ్రైవర్లందరూ పాట ఆపేసి ఘోల్లున నవ్వారు.

"వీడెవడో పిచ్చాడిలాగున్నాడు భాయ్! హైదరాబాద్ లో ఆటోలకు కానూనంట"

వాళ్ళు పగలబడి నవ్వుతుంటే ఇంక అక్కడ టైమ్ వృథా చేయటం అనవసరమని ఆ ప్రక్కనే ఆగి ఉన్న రిక్షా దగ్గరకు నడిచాం.

అతను ఉలిక్కిపడి రక్కున లేచి నిలబడతాడని మేమనుకున్నాం. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసలతను కళ్ళుకూడా విప్పలేదు.

"ఏం గావాలి?" అన్నాడు కళ్ళు మూసుకునే.

"ఒకామెకి ఆక్సిడెంట్ జరిగి బేహూష్ అయింది. హాస్పిటల్ తీస్కుపోవాలె!" చెప్పాడు యాదగిరి.

"ఏ దవాఖానాకి!

"ఏది దగ్గరుంటే అది"

"అట్లనా! ముప్పయ్ రూపాయిలిస్తావా?"

అందరం ఉలిక్కిపడ్డాం.

"ముప్పై రూపాయలా?"

"అవ్ సార్! యాక్సిడెంట్ కేస్ గదా?"

"అయితే?"

"పోలీసోండ్ల తోటి కిరికిరి. సార్! పరిషాన్జేస్తరు తర్వాత"

"ముప్పై రూపాయలిచ్చినా చేయక మానరు గదా?" అడిగాడు జనార్ధన్.

"ఇరవై రూపాయలిస్తాం. పద" అన్నాన్నేను.

యాదగిరి, జనార్ధన్ నావేపు కోపంగా చూశారు "రెండు మూడు రూపాయలిచ్చే దూరానికి ఇరవై ఇస్తానంటావేమి సంగతి?" అడిగాడు యాదగిరి.

"అవతల ఆమె ప్రమాదంలో ఇరుక్కుని స్పృహ తప్పింది. ఈ సమయంలో బేరాలాడితే ఎలా?"

రిక్షావాడు చప్పున నా సపోర్ట్ కొచ్చాడు.

"అవ్ సార్! ఒక దినం గిట్లనే ఒక పెద్దమనిషి ఇరవై కొస్తవా, పాతిక్కొస్తవా అంటూ లొల్లి పెట్టుకున్నడు. చివరికేమాయె? ఇంటికిపోయే సరికే ఆమె చనిపోయె! నా పైసలు నాకియ్యబట్టె-"

ఆ మాటతో అందరి గుండెలూ ఝల్లుమన్నాయి. "నిజమే! చంద్రకాంత్ భార్య ప్రాణాలు కూడా పోతాయేమో" అన్నాన్నేను.

"సరే పద! ఆలస్యం చేయటం అనవసరం" అన్నాడు జనార్ధన్.

రిక్షా తీసుకుని కాలనీలో కెళ్ళాం.

అందరం కలసి ఆమెను రిక్షాలో కూర్చోబెట్టాం. తల నుంచి ఇంకా రక్తం కారుతూనే ఉంది. అందరం రిక్షా వెనుకే బయల్దేరాం. రాజేశ్వరి ఆమెను పట్టుకుని కూర్చుంది రిక్షాలో.

కొద్దిదూరం నడవగానే "డాక్టర్ ప్రయోగ్', ఎమ్.బి.బి,ఎస్. అన్న బోర్డు కనిపించింది.

"పదండి! ఈ డాక్టర్ కి చూపిద్దాం" అన్నాడు రంగారెడ్డి.

శాయిరామ్ గేటు గీసుకుని లోపలికెళ్ళి డోర్ బెల్ మీట నొక్కాడు.

పరుగుతో వచ్చి కర్టెన్ పక్కక తొలగించి- "హో వెల్ కమ్" అన్నాడో యువకుడు.

"మీ ఫాదర్ ని పిలవండి! అర్జెంట్ కేస్ చూడాలి వెంటనే" అన్నాడు శాయిరామ్.

"మా ఫాదరెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకేమిటి? పేషెంట్ ని చూడాలి! సీరియస్ యాక్సిడెంట్ అయింది." ఆ మాటతో ఆ కుర్రాడు మొఖం పాలిపోయింది. కొంచెంగా కాళ్ళూ చేతులు వణకసాగినాయి.

"నేనే డాక్టర్ని! మా ఫాదర్ కాదు! ఇంతకూ పేషెంట్ ఎక్కడ!"

"బయట రిక్షాలో ఉంది!"

అతను మాతోపాటు బయటికొచ్చాడు.

చంద్రకాంత్ భార్య అపస్మారక స్థితిలో ఉండటం చూసేసరికే అతనికి కళ్ళు తిరిగినట్లు అనిపించి కళ్ళు మూసుకున్నాడు.

"అదేమిటి సార్ పేషెంట్ ని చూడండి" చెప్పాడు రంగారెడ్డి.

అతను అతికష్టం మీద కళ్ళు తెరచి స్టెతస్కోప్ మెడకు తగిలించుకుని ఆమె దగ్గరకు వెళ్ళి స్టెతస్కోప్ మెడకింద పెట్టబోయాడు.

హఠాత్తుగా అతనికి మెడకింద గాయం నుంచి రక్తం కారటం కనిపించింది. అంతే! దభేల్ మని కిందపడ్డాడు.

అతని నోటి నుంచి "రక్తం అమ్మో రక్తం రక్తం" అంటూ నాలుగయిదుసార్లు వినిపించాక అతని మాట పడిపోయింది. ఆ తరువాత చూపులు కూడా తేలేశాడు. లోపల్నుంచి వాళ్ళమ్మ కాబోలు పరుగుతో శోకాలూ పెడుతూ వచ్చింది.

"ఓర్నాయనో! బంగారం లాంటి నా కొడుకుని చంపేశారు దేవుడో ఇంత లేత కుర్రాడికి ఎవరయినా రక్తం చూపిస్తారా? అసలు వీడికి డాక్టర్ కోర్స్ చెప్పించొద్దండీ వాడు తట్టుకోలేడు అంటే వినకుండా డాక్టర్ కోర్సులో చేర్పించిన వీడి తండ్రిననాలి"

"మేమేం చేయలేదమ్మా! మా పేషెంట్ ని చూపించడానికి తీసుకొచ్చాం!"

"మీరింక పొండిరా నాయనా! మావాడికి మొదటి పేషెంట్ నే ఇలాంటి రక్తం కనిపించేట్లు తీసుకొస్తారా? మీకేమయినా బుద్ధుందీ? జ్ఞానం ఉందీ!" అంటూ పరుగుతో లోపలికెళ్ళి మరో డాక్టర్ కి ఫోన్ చేయసాగింది.

ఇంక లాభం లేదని మేము పేషెంట్ తోపాటు ఇంకో డాక్టర్ కోసం బయల్దేరాము.

రిక్షావాడు మావైపు ఆనందంగా చూశాడు.

"ఇంకో డాక్టర్ దగ్గరకా సార్?"

"అవును!"

"ఏం ఫర్లేద్సార్! తోలుకెల్తా! ఇంకో పదహార్రూపాయలివ్వండి సార్ చాలు!"

యాదగిరికి కోపం ఆగలేదు.

"ఏయ్! ఆమె చావు బ్రతుకుల మధ్యనుంటే మధ్యల పైసలకిరికిరేంబే! నకరాల్జేస్తున్నావ్?" అన్నాడు వాడిమీదకెళుతూ.

"ఇగో- గిట్ల రువాజ్ చేసిన్రంటే మంచి గుండద్సార్! నేను వాపస్ బోతా!" అన్నాడు వాడు రిక్షా వెనక్కు తిప్పుతూ.

అందరం అమాంతం వాడి దగ్గరకు వెళ్ళి గడ్డం పట్టుకుని బ్రతిమాలాం.

"ఇదిగో...చూడవోయ్ రిక్షా! మా వాడేదో తొందరపడి..."

"నా పేరు రిక్షా కాదు" కోపంగా అన్నాడు.

మేము నాలిక్కరుచుకున్నాం.

"అబ్బే- నీ పేరు రిక్షా అని కాదు. పేరు తెలీక..."

"తెల్వకపోతే అడగాల్సార్! నేనేం ఆల్తూ ఫాల్తూగాడ్ననుకుంటున్రా ఏం? ఈ రిక్షా నా సొంతం! ఎరికనా!"

నేను రంగారెడ్డికి కన్ను కొట్టాను. ఇలాంటి సందర్భాల్లో రంగారెడ్డి చాలా అద్భుతంగా పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తాడ న్న విషయం నాకు తెలుసు.

"ఇగో- గిది- గిట్ల ఇజ్జత్ తోటి మాట్లాడాలె! ఆయనేమి సార్- గట్ల వరుల్తాడు?"

రిక్షా మళ్ళీ బయల్దేరింది.

ఫర్లాంగ్ దూరంలోనే నర్సింగ్ హోమ్ కనిపించేసరికి మాకు ప్రాణం వచ్చినట్లయింది. అందరం లోపలకు పరుగెత్తుకెళ్ళి స్ట్రెచర్ తీసుకుని ఆమెను లోపలకు చేర్చాం. అప్పటికప్పుడే నలుగురు నర్సులు చుట్టుముట్టారు.

"ఏమయింది?" ఒకామె మావంక చూస్తూ అడిగింది.

"ముందు డాక్టర్ ని పిలవండి! అర్జెంట్! ఆమె అన్ కాంషస్ అయ్యింది" చెప్పాడు రంగారెడ్డి.

వాళ్ళు మొఖాలు చూసుకున్నారు.

"ఎలా అయ్యింది?" ఒకామె అడిగింది.

రంగారెడ్డి పళ్ళు కొరుక్కుని బయటకుమాత్రం చిరునవ్వు నవ్వుతూ మాట్లాడాడు.

"అదంతా డాక్టర్ కి చెపుతాంలేమ్మా! ముందు డాక్టర్ ని పిల్చుకురండి!"

ఆమె తాబేలులా నడుస్తూ లోపలకెళుతుంటే మాకు వళ్ళు మండిపోయింది.

"నీయవ్వ- ప్రాణాలంటే జర్రగూడ ఖదర్ లేదు" అన్నాడు యాదగిరి కోపం అణచుకుంటూ.

మా పక్కనే నిలబడ్డ మరో నర్స్ కోపంగా చూసింది మా యాదగిరివేపు.

"అవ్! ఒక్కసారి సర్కార్ దవఖానాకు వెళితే తెలుస్తది. ఎవళ్ళకు ఖదరుంటదో" అందామె.

మేము సైలెంట్ అయిపోయాం.

ఎందుకంటే నిజంగానే మాకు గవర్నమెంట్ హాస్పిటల్ గుర్తుకొచ్చింది.

మరో అయిదునిమిషాల తర్వాత డాక్టర్ మరో తాబేలు బండిమీద వచ్చినట్లు వచ్చింది. వస్తూనే మా మొఖాలవేపు పేషెంట్ ముఖంవేపు చూసింది.

"వాట్ హాపెన్డ్?" అంది మళయాళీ ఇంగ్లీషులో.

"ఆమెకు దెబ్బలు తగిలాయండీ" చెప్పాడు రంగారెడ్డి.

"ఓవ్" అందామె పేషెంటువేపు అనుమానంగా చూస్తూ.

"ఈజిట్ లారీ యాక్సిడెంట్ ఓర్ స్కూటర్ యాక్సిడెంట్?" అడిగింది నావైపు చూసి. నాకామె మాటలేమాత్రం అర్థం కాలేదు గానీ రంగారెడ్డి ఠక్కున అర్థం చేసుకున్నాడు.

"లారీ యాక్సిడెంట్ కాదు డాక్టర్! స్కూటర్ యాక్సిడెంట్" అన్నాడు తనూ మళయాళ ఇంగ్లీషులోకి దిగిపోతూ.

"ఓవ్!" అందామె ఇంకో అడుగు వెనక్కు వేస్తూ.

"తలక్కూడా పెద్ద దెబ్బలేమీ తగలలేదుగానీ ఎందుకో స్పృహ తప్పిందండి" చెప్పాడు చంద్రకాంత్.

"హు ఈజ్ డ్రైవింగ్ ద స్కూటర్?" తిరిగి అడిగిందామె మా అందరివంక హంతకులను చూసినట్లు చూస్తూ.

"దిస్ బోయ్! దిస్ బోయ్" అన్నాడు రంగారెడ్డి చంద్రకాంత్ వైపు చూపుతూ.

"ఓవ్! దిస్ బోయ్? ఆమెకు ఇతను ఏమి రిలేషన్ ఉంది?"

"ఆమె నా భార్యేనండి" చెప్పాడు చంద్రకాంత్.

"ఓవ్!" అందామె ఇంకో అడుగు వెనక్కు వేస్తూ.

ఈలోగా ఓనర్స్ బాండేజీలు, కాటన్ అన్నీ ఓట్రేలో తీసుకొచ్చారక్కడికి.

"బాండేజ్ వెయ్యమంటారా డాక్టర్!" అడిగిందామె.

"ఓవ్! నోనోనో! డోంట్ టచ్ హర్" అంది భయంగా మావేపు చూస్తూ.

మేము అదిరిపడ్డాం.

"వాట్ హేపెన్డ్ డాక్టర్?" అడిగాడు రంగారెడ్డి ఆతృతగా.

"డేంజర్!" అందామె రహస్యంగా "అది మెడిగో లీగల్ కేస్."

మాకు ఆమె మాటలు ఏమాత్రం అర్థం కాలేదు.

ఆ మాట వింటూనే నర్సులు కూడా ఓ అడుగు వెనక్కేసారు.

"ఏమిటంటున్నారు?" అయోమయంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇఇద్ మెడికో లీగల్ కేస్ అంటోందామె" అన్నాడు గోపాలరావు.

"అంటే ఏమిటి?"

"అంటే ఇది పోలీస్ కేస్ అన్నమాట."

మాకు మరీ అగమ్యగోచరంగా ఉందీ గొడవ.

"ఇంతకూ ఇప్పుడు మీరేమంటారు డాక్టర్?" అడిగాడు జనార్ధన్ మా వెనుకనుంచీ మమ్మల్నందరినీ పక్కకుతోసి సినిమా హీరోలా ముందుకొస్తూ.

"యూ హేవ్ టు టేక్ హర్ టు గవర్నమెంట్ హాస్పిటల్"

అందరం ఉలిక్కిపడ్డాం.

చంద్రకాంత్ ముఖం పాలిపోయింది.

"గవర్నమెంట్ హాస్పిటల్ కా?" వణుకుతున్న గొంతుతో అడిగాడతను.

"ఎస్!"

"అక్కడికి ఎందుకు వెళ్ళటం? మీరు ఎందుకు ట్రీట్ చెయ్యరు?"

"బికాజ్ ఇటీజ్ మెడిగో లీగల్ కేస్"

"మెడికో లీగల్ కేస్ అయితే మాత్రం? ప్రాణాప్రాయంలో ఉన్న పేషెంట్ ను ట్రీట్ చేయనంటారేమిటి?" ఎదురు తిరిగాడు గోపాలరావు.

"ఓవ్! వుయ్ డోంట్ డూ ఇట్" నిర్లక్ష్యంగా అందామె.

"ఎందుకు చేయరని అడుగుతున్నా! ఒక డాక్టరుగా ఏ పేషెంట్ నయినా వెంటనే ట్రీట్ చేయాల్సిన అబ్లిగేషన్ మీకుంది."

"అఫ్ కోర్స్! ఆ ఓబ్లిగేషన్ ఓన్ లీ జనరల్ కేసెస్ కి! నాట్ ఫర్ మెడిగో లీగల్ కేస్"

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి.

"యుకెన్ గో" అందామె లోపలి కెళ్ళిపోతూ.

యాదగిరికి మండిపోయినట్లుంది. పరుగుతో వెళ్ళి ఆమెకు అడ్డం నిలబడ్డాడు.

"ఇగో డాక్టరమ్మా మంచిగ చెపుతున్నా! ముందామెకి వైద్యం గిట్ట జేస్తవా చెయ్యవా?" రెండుచేతులూ హీరోలా నడుము మీద పెట్టి దౌర్జన్యంగా అడిగాడు.

"నో! మెడిగో లీగల్ కేసులు గవర్నమెంట్ హాస్పిటల్ కే తీసుకుపోవాలి!" తనూ మొండిగా అంది డాక్టరు.

గోపాల్రావ్ కల్పించుకున్నాడు మధ్యలో.

"ఇదిగో మనం ఇప్పుడు వాదనలు పెట్టుకుని లాభం లేదు కానీ ఇంకో నర్సింగ్ హోమ్ కోటీలో వుంది పదండి అక్కడికి పోదాం" అన్నాడతను.

ఆ మాట నిజమేననిపించింది మాకు.

ఆ గొడవల్లో తల దూర్చడం కంటే ముందు ఆమెకు వైద్యం జరగటం ముఖ్యం.

వెంటనే అందరం ఆమెను తీసుకుని మళ్ళీ రిక్షాలో వేసుకుని కోటీ వైపు బయలుదేరాం.

ఆ నర్సింగ్ హోమ్ చాలా బిజీగా వుంది.

పావుగంట వెయిట్ చేశాక ఓ డాక్టరు బయటికొచ్చాడు.

"ఏమయింది?" అడిగాడు పేషెంట్ ని పరీక్షిస్తూ.

"నా స్కూటర్ మీద నుంచి స్లిప్ అయి పడిపోయిందండీ!"

స్కూటరు యాక్సిడెంటా?" పరీక్షించడం ఆపేసి అడిగాడు.

"అవును సార్! చాలా మైనరు యాక్సిడెంట్" తేలిగ్గా అన్నాడు రంగారెడ్డి.

"అయితే ఇది మెడికో లీగల్ కేస్"

మేము ఏమీ తెలీనట్లు ఆ పదాలు అంతకు ముందెప్పుడూ విననట్లు నటించాం.

"అంటే ఏమిటి డాక్టర్?"

"అంటే పోలీస్ కేసు అన్నమాట! ఇలాంటివన్నీ గవర్నమెంట్ హాస్పిటల్స్ కెళ్ళాలి!"

"అంటే పేషెంట్ ప్రాణం పోతున్నా గానీ మీరు చూడరా" కోపం అణుచుకుంటూ అడిగాడు జనార్ధన్.

"ఎలా చూస్తాం! మెడికో లీగల్ కేస్ కదా ఇది!"

యాదగిరికి చటుక్కున ఓ అయిడియా వచ్చింది.

"అవ్ సార్! మెడికో లీగల్ కేసేగానీ, జర ఇప్పటికయితే ట్రీట్ మెంటు ఇయ్యండి! ఇంకొకసారి గిట్లా యాక్సిడెంట్ అయితే గవర్నమెంట్ హాస్పిటల్ కెళతాం"

"కుదరదండీ! త్వరగా తీసుకెళ్ళండి. ఆలస్యం చేయకూడ దిలాంటివి"

"పోనీ మీరు ఫస్టు ఎయిర్ లాంటిది చేయండి! ఆ తర్వాత గవర్నమెంట్ హాస్పిటల్ కెళ్తాం"

డాక్టరు చిరాకుపడ్డాడు.

"అరె! మేము చేయగూడదంటే వినరేమయ్యా! ఇదంతా మాకు లేనిపోని కిరికిరి అవుతుంది."

"బాబ్బాబు అలా అనకండి! ఆమె ఇంకెవరయినా అయితే గవర్నమెంటు హాస్పిటల్ కే తీసుకెళ్ళేవాళ్ళమే గానీ ఆమె మావాడి భార్యండి! పైగా వాడికి ఆమె అంటే చాలా ప్రేమ! అందుకని దయచేసి మీరే ట్రీట్ మెంట్ ఇస్తే"

డాక్టర్ కి కోపం వచ్చేసింది.

"ఇక్కడ ట్రీట్ మెంట్ ఇవ్వరని చెప్పాను కదా! గవర్నమెంట్ హాస్పిటల్ కెళ్ళండి" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

"ఛలో భాయ్- గవర్నమెంట్ దవాఖానాకే పోదాం పదండ్రి! ఈ హౌలా గాళ్ళందర్నీ బ్రతిమిలాడేదేందీ?" అన్నాడు యాదగిరి డాక్టర్ వెళ్ళినవేపే చూసి గట్టిగా అరుస్తూ.

అందరం ఆమెను తీసుకుని గవర్నమెంట్ హాస్పిటల్ చేరుకున్నాం. అరగంట నిలబడ్డాక కేస్ షీట్ రాసిచ్చాడు క్లర్క్. అది తీసుకుని డాక్టర్ దగ్గర కెళ్ళేసరికి ఇంకో అరగంట పట్టింది.

"ఈమెకెట్లా తగిలాయి దెబ్బలు" అడిగాడు డాక్టర్.

"స్కూటర్ మీద నుంచి కింద పడిపోయిందండి?"

"ఓ! మెడికో లీగల్ కేసా?"

"అవునండీ!" భయంగా జవాబిచ్చాం! గవర్నమెంట్ హాస్పిటల్లో కూడా మెడికో లీగల్ కేసులు చూడరేమో అన్న అనుమానం పట్టుకుందందరికీ!

"చాలా సీరియస్ కేస్ కదా" అన్నాడు ఆలోచనలో పడుతూ.

"అవునండీ! అందుకే ముందు ట్రీట్ మెంట్ స్టార్ట్ చేస్తే బాగుంటుందని" వినయంగా చెప్పాడు రంగారెడ్డి.

"ఆ! అవును- అన్ కాంషస్ అన్నారు కదా! ఓకే ఓకే" అంటూ ఎడ్మిట్ అని రాశాడు కేస్ షీట్ మీద. మామూలుగానే స్ట్రెచర్ మీద తీసుకెళ్ళే బాయ్ కీ, వార్డు బాయ్స్ కీ, గేటు దగ్గర వాచ్ మెన్ కీ అందరికీ ఎవరి ఫీజు వాళ్ళకు కట్టాక వార్డ్ లోకి అనుమతించారు వాళ్ళు.

గంటసేపటి తర్వాత ఓ డాక్టర్ వచ్చి ఆమెను చూసి కేస్ పేపర్ మీద ఏమేమో రాసి వెళ్ళిపోయాడు.

నర్స్ ఇంజెక్షన్ తెచ్చి మా చేతికిచ్చింది.

"ఇందులో రాసి వున్న ఇంజెక్షన్లు కొడుక్కురండి!" అంది చాలా మామూలుగా.

"మేము కొనుక్కురావటం ఎందుకు? మీ హాస్పిటల్లో వుండవా" కోపంగా అడిగాడు శాయిరామ్.

"వుంటాయ్ గాని మా గాంధీ హాస్పిటల్ మందుల గురించి మొన్ననే పేపర్లో న్యూస్ వచ్చింది చదివారా"

"ఓ! చదివాను" ఉత్సాహంగా చెప్పాడు యాదగిరి. "అవన్నీ డూప్లికేట్ మందులని పేపర్లో రాసిన్రులే!" అన్నాడు మాతో.

"ఇలాంటి పరిస్థితుల్లో మా ఇంజెక్షన్ లు వాడితే ఇంకేమయినా వుందా? కావాలంటే అదే చేసేస్తాను! నాదేం పోయింది!"

అందరం వద్దని ఆవిడని బ్రతిమాలి ఇంజెక్షన్ కొనుక్కొచ్చాం.

ఆ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత కాసేపటికే ఆమె స్పృహలో కొచ్చింది.

వస్తూనే ఓసారి చుట్టూ చూసి, తర్వాత మా అందరి ముఖాలూ చూసి నవ్వింది.

"ఏమిటి? ఈ కాస్త దెబ్బలకే నన్ను హాస్పిటల్లో చేర్చేశారా?" అంది ఆశ్చర్యపోతూ.

"ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లో రెండుమూడుగంటలుంచితే ఇంటికి తీసుకెళ్లి పోవచ్చనుకున్నాం. కానీ వాళ్ళేమో వైద్యం మేము చేయం అంటే మేము చేయం అని బయటకు గెంటేస్తున్నారు. గత్యంతరం లేక గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకురావాల్సి వచ్చింది" చెప్పాడు చంద్రకాంత్.

ఆ మాట వినడంతోనే ఆమె కెవ్వున కేకవేసి లేచి బెడ్ మీద నుంచి కిందకు దూకేసింది.

"బాబోయ్... ఇది గవర్నమెంట్ హాస్పిటలా? అమ్మో- నేనిక్కడుండను? పదండి వెళ్ళిపోదాం" అంది భయంతో వణికిపోతూ.

మేమంతా ఆమెను బలవంతంగా బెడ్ మీద కూర్చోబెట్టాం మళ్ళీ.

"ఏం ఫర్లేదు చెల్లమ్మా! మేమంతా ఉన్నాం కదా! రెండురోజులు ఎలాగోలా కళ్ళు మూసుకుంటే చాలు. ఇంటికెళ్ళిపోవచ్చు" సర్ది చెప్పాడు రంగారెడ్డి.

ఆమె భోరున ఏడ్చేయటం ప్రారంభించింది.

"నేను మీకేం ద్రోహం చేశానని నన్నిలా గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పించారండి... నేను కాపురానికొచ్చిన దగ్గర్నుంచీ నాకోసం ఒక్క చీరైనా కొనిపెట్టమని పేచీపెట్టలేదే! ఆ పాడు నవల అచ్చవాలంటే ఆ ఎడిటర్ కి మందు కొట్టించాలని డబ్బంతా నాశనం చేస్తున్నా పల్లెత్తుమాట అనలేదే? రచయితల కాన్ఫరెన్స్ లని బెంగుళూరు, వైజాగు వెళ్ళివస్తుంటే నేనూ వస్తానని నోరువిప్పి అడగలేదే. ఆ అడ్డమయిన రేషన్ షాపు క్యూల్లోనూ, కిర్సనాయిలు క్యూల్లోనూ, మంచినీళ్ళ క్యూల్లోనూ గంటల తరబడి నిలబడ్డానుగాని మీ గవర్నమెంట్ ని వొక్కసారయినా తిట్టలేదే! ఎందుకండీ! ఎందుకిలా అన్యాయం చేశారు నన్ను!"

ఆమె ఏడుపుకి ఇద్దరు నర్సులు, ఓ అరడజను మంది పేషెంట్లు వచ్చి మూగారు మా చుట్టూ.

"ఏమయింది? ఎడ్మిట్ అయి గంటేగా అయ్యింది! అప్పుడే చంపేశారా?" ఆశ్చర్యంగా అడిగిందో పేషెంట్.

ఆమె పక్కనున్న పేషెంట్ ఆమెను కసురుకున్నాడు.

"ఏమిటా తెలివితక్కువ వాగుడు? ఎడ్మిట్ అయిన గంటకే ఎలా చంపుతారు? డాక్టర్లు వచ్చి చూడ్డానికే వారం రోజులు పడుతుంది. ఆ తరువాత వారం రోజులుగ్గాని ట్రీట్ మెంట్ కోసం ఏర్పాట్లు ప్రారంభించరు. ట్రీట్ మెంట్ మొదలుపెట్టాక కదా ఆమె చనిపోయేది?"

ఆమె భయంగా తలూపింది.

"అందరూ తప్పుకోండి" బొంగురుగొంతు కేక వినపడి మేము ఉలిక్కిపడి పక్కకు జరిగాము.

ఓ లావుపాటి పోలీస్ కానిస్టేబుల్ మమ్మల్ని ఇంకొంచెం పక్కకు నెట్టి బెడ్ దగ్గరకొచ్చి చంద్రకాంత్ భార్య వైపు చూశాడు. వెంటనే ఓ పుస్తకం పెన్నూ తీసుకున్నాడు.

"నీ పేరేంది" అడిగాడామెని.

"శశిరేఖ!"

"నీ భర్త పేరేంటి?"

"చంద్రకాంత్"

"ఏడుంటారు మీరు?"

"నిర్భయ్ నగర్ కాలనీ!"

అతను ఓ క్షణం ఆలోచించాడు.

"నిర్భయ్ నగర్ కాలనీయా? గంటే మీ కాలనీకి పోలీస్ స్టేషన్ కావాలని అర్జీలు పెట్టి తీరా పెట్టినంక పోలీస్ స్టేషన్ తీసేయాల్నని కిరికిరి చేసింది మీ కాలనీవోళ్ళేకదూ?"

"అవును"

అతను మళ్ళీ రాసుకోబోయి ఆమె వైపు చూశాడు.

"నీకు సదవను రాయను వచ్చా!"

"వచ్చు"

"అయితే నువ్వే రాసివ్వు?" అంటూ ఆ పుస్తకంలో కాగితం ఆమెకి ఇచ్చాడతను. శశిరేఖతో పాటు, మేమందరం కూడా ఆశ్చర్యపోయాం.

"ఏం రాసివ్వాలి?" అడిగాడు చంద్రకాంత్ అతనిని.

అతను చంద్రకాంత్ వేపు చిరాకుగా చూశాడు.

"నువ్వెవళు?"

"నా పేరు చంద్రకాంత్!"

"నేను పేషెంట్ తోటి మాట్లాడుతుంటే మధ్యలో నువ్వెందుకు మాట్లాడతావ్?"

"ఆమె నాభార్య"

హఠాత్తుగా కానిస్టేబుల్ మొఖంలోకి కళ వచ్చేసింది.

"గట్లనా? నువ్వేనా ఈమెను స్కూటర్ మీదకెళ్ళి కిందకు దూకింది?"

చంద్రకాంత్ గాబరాపడ్డాడు ఆ ప్రశ్నకు.

"స్కూటర్ మీద నుంచి స్లిప్ అయి పడిపోయింది"

"గప్పుడు స్కూటర్ ఎవరు డ్రైవ్ చేస్తుండె?"

"నేనే"

"నీకు లైసెన్స్ గిట్టా వుందా?"

"వుంది!"

"ఉన్నదా అంటే ఉంది అని సమాధానం ఇయ్యకు- తీసి చూపించాలె!"

చంద్రకాంత్ తన పర్స్ లో నుంచి డ్రయివింగ్ లైసెన్స్ తీసి అతని కిచ్చాడు.

అంతా ఓసారి చెక్ చేసి అది తిరిగి ఇచ్చేశాడతను.

"నీలాంటోళ్ళకు డ్రైవింగ్ లైసెన్స్ గిట్ట ఇచ్చినందుకు ఆర్డీవోని లోపట జేయాలి!" అంటూ శశిరేఖ వేపు చూశారు మళ్ళీ.

"అగో-గట్ల కూసున్నావు? రాయమని జెప్పలే?"

"ఏమి రాయాలి?" అడిగిందామె.

"గవర్నమెంట్ దవాఖానా కొచ్చినోండ్లు ఇంకేం రాస్తరమ్మా! ఇంత కూడా ఎరుకలేదా? డయ్యింగ్ డిక్లరేషన్ రాయలె! సమాజైనాది?"

"ఏమిటి? డయ్యింగ్ డిక్లరేషనా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

కానిస్టేబుల్ కి ఒళ్ళు మండిపోయింది. రంగారెడ్డి వేపు కోపంగా తిరిగాడు.

"నువ్వెవళ్ళు?"

"రంగారెడ్డి!"

"రంగారెడ్డంటే ఎవళ్ళు? హజార్ రంగారెడ్లున్నారు శహర్ ల!"

"ఈయన మా కాలనీ కమిటీ సెక్రట్రీవయా! జర మంచిగ మాట్లాడు" ఎదురుతిరిగాడు యాదగిరి.

"ఏయ్? నువ్వెవళ్ళు?" కాగితం తీసి రాసుకోడానికి సిద్ధపడ్డాడు కానిస్టేబుల్.

"నా పేరు యాదగిరి"

"నీయబ్బ పేర్జెప్పు!"

"ఎందుకు జెప్పాలె? నేనేం దొంగతనం జేసినానా, మర్డర్లు జేసినానా-"

"గట్లనా? గిప్పుడే ఎరుకవుతాది బిడ్డా! గిప్పుడే ఎరుకవుతాది" అంటూ మళ్ళీ శశిరేఖ వేపు తిరిగాడు.

"ఏమాయెనమ్మ! రాసినావా? డైయింగ్ డిక్లరేషన్ అంటే తెలీదా? సచ్చేముందు సావు ఎట్ల మీదికొచ్చిందో రాసెడిదన్నమాట"

"అంటే నేను చచ్చిపోతానా? గాబరాగా అడిగిందామె.

"పాగల్ మనిషిలాగున్నావేమమ్మా! సర్కార్ దవాఖానా కొచ్చినోండ్లు తిరిగ ఇండ్లకు బోతారు?"

"ఇదిగో కానిస్టేబుల్ గారూ! కొంచెం మర్యాదగా మాట్లాడండి! ఆమెకు ఏం పెద్ద దెబ్బ తగిలిందని - డైయింగ్ డిక్లరేషన్ ఇమ్మంటున్నారు? ఇంకోసారలా అడిగారంటే నేనూరుకోను- ఆ?" కోపంగా అన్నాడు చంద్రకాంత్.

కానిస్టేబుల్ మా అందరివేపూ మండిపడుతూ చూశాడు.

"ఇగో- ఈ ఫాల్తూ కిరికిరంతా నాకెందుగ్గాని- నువ్వెట్ట పడినావో, ఎవళ్ళు పడేసిన్రో కాయితం మీద రాసివ్వు! తర్వాత నువ్వు సచ్చినా బతికినా గాని మాక్కిరిక్కిరుండది!"

ఆమె నాలుగులైన్లు రాసి సంతకం చేసి ఇచ్చింది.

వేరే ఇంకో కాగితం మీద కూడా ఆమె సంతకం తీసుకుని వెళ్ళిపోయాడతను.

మర్నాటి సాయంత్రం వరకూ ట్రీట్ మెంటేమీ ప్రారంభించక పోయేసరికి డిశ్చార్జ్ అడిగి తీసుకుని ఇంటికి చేరుకున్నాం.

హాస్పిటల్లో తలకువేసిన బాండేజ్ మార్పించడానికి మర్నాడు ఇంకో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం అందరం కలసి.

గోపాల్రావుకీ ఆ డాక్టర్ కీ స్నేహం ఉండటం వల్ల అతను ట్రీట్ మెంట్ ఇవ్వడానికి అంగీకరించాడు.

"అయితే మీరంతా ఓ ప్రామిస్ చేయాలి" అడిగాడు మా అందరి ముఖాలవైపు చూస్తూ.

"ఏమిటిది?" అడిగాడు గోపాల్రావు.

"ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు అని చెప్పాలందరూ! ఏదీ ఓ రిహార్సల్ వేయండి"

నేను అయోమయంగా శాయిరామ్ వైపూ రంగారెడ్డి వైపూ చూశాను.

"రిహార్సలేమిటి సార్! మాకు వివరంగా చెపితే"

"అదేనండీ! అందరూ గట్టిగా చెప్పండోసారి! ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు"

అందరం గట్టిగా చెప్పాం. "ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు"

"ఆమెను రోడ్ మీద ఒక వీధి ఆవు పొడవటం వల్ల దెబ్బలు తగిలినవి!"

"ఆమెను రోడ్ మీద ఒక వీధి ఆవు పొడవటం వల్ల దెబ్బలు తగిలినవి!" అందరం చెప్పాం.

"వెరీగుడ్! మిమ్మల్ని పోలీసులొచ్చి అడిగినప్పుడు ఇదే చెప్పాలి వారికి. అర్ధమయిందా?"

"అయింది డాక్టర్!"

అతను శశిరేఖకు వైద్యం చేశాక ఇంటికి చేరుకున్నాం.

ఆ సాయంత్రం అందరం కాలనీ వేదిక దగ్గర కూర్చుని ఆ యాక్సిడెంట్ గురించి మాట్లాడుకుంటుంటే పోలీస్ వాన్ ఒకటి వచ్చి మా ఎదురుగ్గా ఆగింది.

అందులో నుంచి బిలబిలమంటూ పోలీసులు దిగి మా దగ్గరకొచ్చి తుపాకులు తీసుకుని మాకు గురిపెట్టారు. ఇన్‌స్పెక్టర్ పిస్టల్ తీసుకుని మా దగ్గరకొచ్చాడు. ఎందుకైనా మంచిదని అందరం చేతులెత్తేశాం.

"ఇక్కడ చంద్రకాంత్ ఎవరు?" అడిగాడతను.

"నేను" అన్నాడు చంద్రకాంత్ తెల్లబోతూ.

"వాన్ ఎక్కు! యూ ఆర్ అండర్ అరెస్ట్."

"ఎందుకూ?"

"నీ భార్యను స్కూటర్ మీద నుండి పడేసినందుకు?"

"పడేయమేంటండీ? అది యాక్సిడెంట్ కదా?"

"ఏదైనా అవనీ. ముందు స్టేషన్ కు పద."

చంద్రకాంత్ కు భయం వేసినట్లుంది. మావైపు చూశాడు సపోర్టు కోసం.

"ఏమిటండీ? ఏం జరిగిందసలు? వాటీజ్ ది ప్రాబ్లమ్" అడిగాడు రంగారెడ్డి కల్పించుకుంటూ.

"వీడ్ని కూడా లోపల వేసేయండి" కానిస్టేబుల్స్ తో చెప్పాడతను.

కానిస్టేబుల్స్ అతన్నీ, చంద్రకాంత్ నీ లాఠీలతో తోసుకుంటూ వాన్ లో ఎక్కించేశారు.

"సంగతేమిటి చెప్పమంటే మరీ ఇంత దౌర్జన్యమా? ఎవరు కల్పించుకుంటే వాళ్ళను వాన్ ఎక్కించేస్తుంటే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా?" కోపంగా అరిచాడు గోపాల్రావ్.

"వాడిని కూడా వేసెయ్యండి"

గోపాల్రావ్ ని కానిస్టేబుల్స్ ఈడ్వబోతుంటే తన ప్రెస్ ఎక్రిడిషన్ కార్డ్ చూపించాడు.

దాంతో షాక్ కొట్టినట్లు అతనిని వదిలేశారు పోలీసులు.

"జర్నలిస్ట్ అని చెప్పరేం?" అని గొణుక్కుంటూ వాన్ ఎక్కేశారు. వాన్ స్టార్టయింది. మేమంతా అరుస్తూ వెనుక పరుగెత్తాం కానీ లాభం లేకపోయింది.

"సంగతేమిటో కనుక్కుందాం పదండి" అన్నాడు గోపాల్రావ్.

వెంటనే శాయిరామ్ విజృంభించి కాలనీ వాళ్ళందరినీ పది నిముషాల్లో పోగు చేసుకొచ్చాడు.

అందరం పోలీస్ స్టేషన్ చేరుకున్నాం.

బయటే కానిస్టేబుల్స్ మాకు తుపాకులు గురిపెట్టారు.

"ఎవడైతే లోపలికొచ్చాడో జాగ్రత్తగ కాల్చిపారేస్తాం" అరిచాడు ఒక కానిస్టేబుల్.

"మేము యుద్ధం చెయ్యడానికి కాదయ్యా వచ్చింది. మావాడిని ఎందుకరెస్ట్ చేశారో మీ ఇన్ స్పెక్టర్ ని కనుక్కోడానికొచ్చాము" చెప్పాడు గోపాల్రావ్.

"అయితే ఎవరైనా ఒకరిద్దరు లోపలకు రండి. మిగతా వాళ్ళంతా అక్కడే దూరంగా నిలబడాలి."

నేనూ, గోపాల్రావ్, చంద్రకాంత్ భార్య శశిరేఖ, యాదగిరి లోపలకు నడిచాం.

ఇన్ స్పెక్టర్ మావంక కోపంగా చూశాడు.

"ఏమిటి, అందరినీ వేనకేసుకుని వచ్చి దాడి చేద్దామనుకుంటున్నారా?" అడిగాడతను.

"అది కాదండి. మా వాళ్ళను అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. కారణం ఏమిటో తెలుసు కుందామని" చెప్పాడు గోపాల్రావ్.

"కారణం ఏమిటేమిటయ్యా! మీకు తెలీదా కారణం?"

"తెలీద్సార్!"

"స్కూటర్ యాక్సిడెంట్ చేసి వాళ్ళావిడను కింద పడేశాడు. అర్థమైందా."

"అయింది గాని అది కేవలం యాక్సిడెంట్ అని తెలిసినా అతన్నెందుకు అరెస్ట్ చేసినట్లు?"

"యాక్సిడెంట్ అని ఎవరంటారు?"

"మేమందరం అంటాం" కోపంగా అన్నాడు యాదగిరి.

"నేనట్లా అనను."

"మీరేమంటారు?"

"కావాలనే యాక్సిడెంట్ చేశాడంటాను"

మేము ఆశ్చర్యపోయాం.

"కావాలనే యాక్సిడెంట్ చేయటమా?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అవును" ఖండితంగా అన్నాడు ఇన్ స్పెక్టర్.

"హౌ రిడిక్యులస్?" అన్నాడు గోపాల్రావ్ నావేపు తిరిగి.

"చాలా రిడిక్యులస్?" అన్నాడు యాదగిరి.

"యూ కెన్ గో నౌ" అన్నాడు ఇన్ స్పెక్టర్ మండిపడుతూ.

"చూడండి ఇన్ స్పెక్టర్ గారూ! కావాలని సొంత భార్యను ఎవడైనా యాక్సిడెంట్ చేసి కిందపడేస్తాడా" అడిగాడు గోపాల్రావ్. అందరం నవ్వాం.

"తప్పకుండా పడేస్తాడు" అన్నాడు ఇన్ స్పెక్టర్.

"ఎందుకు పడేస్తాడండీ? అలా లాజిక్ లేకుండా మాట్లాడతారేం?" నేనడిగాను ఉక్రోషంగా.

"లాజిక్ ఎందుకు లేదు? చాలా వుంది."

"ఏమిటది?"

"వరకట్నాల విషయంలో ఆమెను వేధించి వుంటాడు. అందుకని ఆమెను చంపేయటానికి ఈ కొత్త పద్ధతి ప్రయోగించాడని మా అనుమానం."

ఆ మాట వింటూనే శశిరేఖ ఫక్కున నవ్వింది.

"ఏమిటి? ఆయన వరకట్న అడగటమా? ఏడ్చినట్లుంది. నన్ను కావాలని ఒక్క పైసా కట్నం అడగకుండా మ్యారేజ్ చేసుకున్నారాయన. అక్కడితో ఆగక మా నాన్నగారు పోయేసరికి తనే మా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసి మా తమ్ముళ్ళకు చదువు కూడా చెప్పించారు. ఆయనకున్న పొలం కాస్త అమ్మేసి మా వాళ్ళ కోసమే ఖర్చు చేశారు" అందామె

ఏకధాటిగా.

ఇన్ స్పెక్టర్ ముఖం మాడిపోయింది.

"ఇప్పుడేమంటారు? ఇప్పటికైనా మా వాళ్ళను వదిలేస్తారా?" అడిగాడు గోపాల్రావ్.

ఇన్ స్పెక్టర్ ఓ క్షణం ఆలోచించాడు.

"మాకు మీ వేషాలన్నీ తెలుసు. మీ కాలనీ వాళ్ళందరూ కలిసి ఆమెతో అలా అబద్ధాలు చెప్పిస్తున్నారు. నిజానికి తన భర్త ఎంత దుర్మార్గుడైందీ ఆమెకు బాగా తెలుసు. మీరందరూ ఇంక అక్కడి నుండి వెళ్ళకపోతే మా సాక్ష్యాలను బెదిరింపుల ద్వారా లొంగదీసుకుంటున్నారన్న ఆరోపణ మీద అరెస్టు చేయాల్సి వస్తుంది" అన్నాడు కసిగా.

మాకు మతిపోయినట్లయింది.

"ఆల్ రైట్? నేనిప్పుడే బెయిల్ ఎరేంజ్ చేస్తాను" అన్నాడు గోపాల్రావ్.

ఇన్ స్పెక్టర్ హేళనగా నవ్వాడు.

"డౌరీ హరాస్ మెంట్ కేసులకు బెయిల్ ఇవ్వరు. అదీగాక యిది ఎటెంప్ట్ టు మర్డర్ కేస్ కిందకూడా బుక్ చేస్తున్నాం. ఈ రెండూ గాక రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్ కిందకూడా రిజిష్టర్ చేసుకున్నాం. మీ తాతలు దిగి రావాలి మీ వాడిని విడిపించుకోవాలంటే."

మాకేం చేయడానికీ తోచలేదు.

శశిరేఖ ఏడుపు ప్రారంభించింది.

'అయ్యో! మా ఆయన్ను వీళ్ళు చంపేస్తారేమోనండీ! ఏం చేయాలండీ" అంటూ ఏడవడం మొదలుపెట్టేసరికి ఇన్ స్పెక్టర్ కానిస్టేబుల్స్ ని పిలిచాడు.

"వీళ్ళందరినీ బయటకు గెంటేయండి!"

కానిస్టేబుల్స్ లాఠీలతో మా అందరినీ బయటకు తోసేశారు.

వళ్ళు మండిపోయి అందరం బయట నినాదాలు ప్రారంభించాం.

"పోలీస్ జులుమ్ డౌన్ డౌన్"

"దొంగ కేసులు డౌన్ డౌన్"

"పోలీసు గూండాయిజం డౌన్ డౌన్"

ఇలా ఓ పావుగంట చేశాక నలుగురు కానిస్టేబుల్స్ వచ్చి గాలిలోకి తుపాకులు పేల్చారు. మన పోలీసులు గాలిలోకి తుపాకులు పేలిస్తే జరిగిందేమిటో మనందరికీ తెలుసు. నేలమీద వున్న వారికే బుల్లెట్స్ తగుల్తాయ్.

అంచేత అందరం పరుగెత్తుకుంటూ కాలనీ కొచ్చిపడ్డాం.

అప్పటికప్పుడు ఈ పరిస్థితిని చర్చించడానికి శాయిరామ్ మీటింగ్ పెట్టాడు.

"వెంటనే హోమ్ మినిస్టర్ దగ్గరకు ఊరేగింపు జరుపుదాం" అన్నాడు గోపాల్రావ్.

"హోమ్ మినిస్టర్లు ఇలాంటివి పట్టించుకోరు. పోలీస్ కమిషనర్ దగ్గర కెళ్ళటం మంచిది" అన్నాడు జనార్ధన్.

"లేకుంటే డిజిపిని కల్సుకుందాం" అన్నాడు యాదగిరి.

కొంతమంది మాత్రం బయల్దేరి ఆటోల్లో డిజిపిగారి దగ్గరికెళ్ళాం. అప్పుడె నక్సలైట్స్ ఏదో ఊళ్ళో ఓ పోలీస్ ని అరెస్ట్ చేసినట్లు వార్త అందటం చేత డిజిపిగారు హడావుడిగా ఆఫీస్ వదలి హోమ్ మినిస్టర్ దగ్గరకు వెళ్ళిపోయారు. పోలీస్ కమీషనర్ ఎన్టీఆర్ తో పాటు విశ్వామిత్ర షూటింగ్ ఏర్పాట్లు చూడ్డానికి వెళ్ళారని తెలిసి తిరిగి కాలనీకి చేరుకున్నాం.

అందరం దిగాలుపడి కూర్చున్నాం.

చంద్రకాంత్ భార్య అందరి మధ్య కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఊరుకోమ్మా ఇంకేం చేస్తాం! పిల్లల్ని పెట్టుకుని ఇక ముందు జీవితం ఎలా గడపాలో చూసుకో. లాకప్ లోకి పోయినోడు కాటికి పోయినోడూ యింక తిరిగిరారు" అంటోంది, ఓ ముసలమ్మ.

హఠాత్తుగా మా వాళ్ళలో సంచలనం కనిపించింది.

"పోలీస్ వస్తున్నాడు" అన్నారెవరో.

అందరం లేచి నిలబడ్డాం భయంగా.

పోలీస్ కానిస్టేబుల్ తిన్నగా మా దగ్గరకొచ్చాడు.

"ఏమిటి సంగతి" అడిగాడు శాయిరామ్.

"మీ కాలనీ ప్రెసిడెంటెవళ్ళు?" అడిగాడతను.

"నేను" అన్నాడు గోపాల్రావ్.

"మీతో జర మాట్లాడాలి!"

నేను, గోపాల్రావ్, యాదగిరి కానిస్టేబుల్ తో పాటు స్టేజి వెనక్కి నడిచాం.

"సంగతేమంటే మా ఇన్ స్పెక్టర్ సాబ్ లేడా? షానా దిల్దార్ మడిసి భాయ్. మా పోలీస్ కానూన్ దిక్కుకెళ్ళి మీ కాలనీ వాళ్ళందరూ గిట్ల పరిషానవుతున్రని, నన్ను పంపించిండన్నట్లు!"

"అలాగా! ఏమంటాడాయన?" అడిగాడు శాయిరామ్ ఆశగా. "మావాళ్ళను వదిలేస్తాడా?"

"అవ్! ఆ విషయం గురించే మాట్లానికి మీ దగ్గరకొచ్చినా. చెప్పినగదా మా ఇన్ స్పెక్టర్ సాబ్ బలే దిల్దార్ మనిషి!"

"చాలా సంతోషం" అన్నాడు గోపాల్రావ్. "ఎప్పుడు వదులుతున్నారు వాళ్ళను?"

"గిప్పుడంటే గిప్పుడే."

యాదగిరి ఆనందానికి హద్దులేదు.

"నేన్జెప్పలేదువయ్యా! పోలీసోండ్లలో గూడా మహానుభావులుంటరు" అన్నాడతను.

"ఇంకా ఆలస్యం ఏమిటి మరి? స్టేషన్ కెళ్దామా?" అడిగాడు శాయిరామ్.

"పైసల్దీసుకు రాండ్రి! వెళ్దాం" నెమ్మదిగా అన్నాడు కానిస్టేబుల్.

అందరం ఉలిక్కిపడ్డాం.

"పైసలా? ఏం పైసలు?" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"అదే భాయ్, జెప్పిన గదా! ఇన్ స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి. ఇదే ఇంకోళ్ళుంటే నాలుగువేలు కమాయిస్తుండె గానీ మా ఇన్ స్పెక్టర్ సాబ్ పైసల మనిషి కాదు. ఇజ్జత్ తోటి నౌఖరీ చేయాల్నంటాడు."

మాకు అప్పటికి అర్థమైంది.

"ఎంత ఇవ్వాలి?" అడిగాడు శాయిరామ్ పాలిపోయిన ముఖంతో.

"చాలా తక్కువ భయ్యా ఒక్క వెయ్యి రూపాయల్జాళు! అది గూడా మన కాలనీ వాండ్లని కన్సెషన్ ఇచ్చిండన్నట్లు, లేకుంటే మీకు ఎరుకలేందేమున్నది? ఒక్కసారి ఎఫ్ ఐర్ ల గిట్ట రాసిన్రంటే జాలు! పదివేలు పడాల్సిందే! జెప్పినా కదా! మా ఇన్ స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి!"

"ఒక్క నిమిషం. ఇప్పుడే వస్తాం" అన్నాడు శాయిరామ్.

"ఏం పర్లేదు- పది నిముషాలు టైమ్ తీస్కోండ్రి! జెప్పినా గదా! మా ఇన్ స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి!"

అందరం డిస్కస్ చేసుకుని, పాముల్తోనయినా చెలగాటాలాడొచ్చు గానీ పోలీసులతో వేళాకోళాలాడగూడదని నిర్ణయించుకుని అప్పటికప్పుడే అందరం కలసి వెయ్యి రూపాయలు పోగుచేసి కానిస్టేబుల్ కిచ్చాము.

కానిస్టేబుల్ ప్రేమగా మా భుజం మీద చేతులేశాడు.

"ప్రజలు, పోలీసులు కలిసి గిట్ల పన్జేయాలే! ఇగో- ఒక్క విషయం జెప్తున్నా- ఇను- మన దోస్తాన మంచిగున్నది. నువ్ గానీ మీ కాలనీలనో ఇంకెవళ్ళయినా గానీ మర్డర్లు, కిడ్నాప్ లు, భార్యలను కిర్సనాయిలు పోసి కాల్చుడులు- ఏమైనా జేయండి! మీ మీద ఈగవాలకుండ నేన్జూసుకుంట! ఏమంటున్నా! జరన్ని పైసలు ఖర్చు జేయాల! గంతనే-' మేమేమీ మాట్లాడలేదు. వెంటనే రంగారెడ్డి, చంద్రకాంత్ లు కాలనీ కొచ్చేశారు.

ఆ తరువాత గంటలోపలే చంద్రకాంత్ తో పాటు అందరం ఆటో బ్రోకర్స్ దగ్గరకెళ్ళి అతని స్కూటర్ అమ్మి పారేసి హాపీగా ఇంటికి చేరుకున్నాం.

* * * * *

## ఇది సమ్మెల కాలమనీ....

"మన కోర్కెలు చాలా న్యాయమైనవి! కాదని ఎవ్వరూ అనలేరు. అలాంటప్పుడు ఈ కోర్కెలు ఎందుకు తీర్చరు? మనలో అవినీతి పరులుండవచ్చు. జీతంతో అవసరం లేనంత పై సంపాదన గాళ్ళుండవచ్చు. కాని అలాంటివాళ్ళు అన్నిచోట్లా వుంటారు. రాజకీయాల్లో మరీ ఎక్కువ. ఆ మాటకొస్తే అవినీతి అనేది ప్రపంచమంతటా తెగ ఉందనీ కనుక మనం దాన్ని గురించి ఏమాత్రం పట్టించుకోకూడదనీ మన ప్రధానమంత్రి గారే స్వయంగా శెలవిచ్చారు. కనుక సోదరులారా! మన న్యాయమయిన కోర్కెలు సాధించుకోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె ఒక్కటే మార్గమని నేను మనవి చేస్తున్నాను. ఈ క్షణం నుంచే మన సమ్మె ప్రారంభమవుతోంది- సమ్మె చేస్తే ప్రజలకు ఇబ్బంది- అంటూ ప్రభుత్వం చెప్పే మాటలు నమ్మకండి! మనమూ ప్రజల్లో భాగమే!"

అంతా కోలాహలం, తప్పట్లు, నినాదాలు మార్మోగిపోయినయ్. గోపాల్రావ్ స్టేజి దిగిరాగానే శాయిరామ్ కలుసుకున్నాడు.

"అమ్మయ్య! బ్రతికాం! ప్రభుత్వంతో చర్చలు ఫలప్రదమయి సమ్మె జరగదేమోనని తెగ భయపడ్డాను" అన్నాడు శాయిరామ్.

గోపాల్రావ్ ఆశ్చర్యపోయాడు.

"జరగకపోతే భయమెందుకు?"

"బోలెడు ఇంటి వ్యవహారాలు చూచుకోవాల్సి ఉంది! నెలరోజులు శెలవు ఏకబిగిన కావాలంటే దొరకదు కదా! అందుకని ప్రతి సంవత్సరం ఇంటి వ్యవహారాలన్నీ సమ్మె టైమ్ లోనే పూర్తి చేసుకుంటాను" అన్నాడతను.

"అసలు నన్నడిగితే, ప్రతివాడికీ సమ్మె శెలవు' అని నెలరోజులు ప్రత్యేకంగా ఉండాలంటాను. ఎవడికి వాడు సమ్మె చేసుకుని ఆ లీవ్ వాడుకొనే వీలుండాలి" అన్నాడు రంగారెడ్డి.

మా కాలనీ వాళ్ళంతా ఒకే డిపార్టుమెంటులో పని చేస్తుండడం వల్ల అందరం గుమికూడాము.

అందరూ రంగారెడ్డి అభిప్రాయం పరిశీలించదగ్గదే బలపర్చారు.

మైక్ దగ్గరకు మాజీ కేంద్ర మంత్రివర్యులు వచ్చి ఉపన్యాసం ప్రారంభించారు.

"ఇగో- మీరడిగే కోర్కెలు ఏమైతే ఉన్నవో- అవి పూరా ఇన్సాఫ్ తోటున్నయ్. మరి గీ రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను ఖతం జేయనికి జరంతగూడ కోషిష్ జేస్తలేదు. నేనేగిట్ల గిప్పుడు స్టేట్లో మినిష్టరున్నట్లయితే మీ డిమాండ్లన్ని శాంక్షన్ జేస్తుండె!"

జనంలో నుంచి ఎవరో గట్టిగా అరిచారు.

"అరే బాడుకవ్! మా రైల్వేవోళ్ళం స్ట్రైక్ జేస్తున్నప్పుడు వాళ్ళ ఇండ్లలోకి పోలీసుల్ని పంపి భార్యలను అవమానించి, పిల్లలను పరిషాన్ జేసి, చాలామందిని కొలువుల్లోకెళ్ళి చుట్టీ ఇచ్చినావ్ గుర్తులేదురా! నీ యవ్వా- ఇప్పుడీ స్టేట్ గవర్నమెంటోళ్ళను జూస్తే ఇంత దుఃఖమవుతున్నాది? లే- సాలె! స్టేజి దిగు."

మరి కొంతమంది కూడా ఇంచుమించుగా అలాంటి అర్థం వచ్చే భాషే వాడడంతో మాజీ కేంద్ర మంత్రిగారు స్టేజీ దిగిపోయారు.

మీటింగ్ ముగిసింది.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు శాయిరామ్.

"ఏదయినా సినిమాకి పోదాం పదండి!" అన్నాడు గోపాల్రావ్.

అందరం సైకిళ్ళెక్కి మార్నింగ్ షోకి బయల్దేరాం.

సినిమా మొదలయిన పావుగంటకే కరెంట్ పోయింది. అరగంటయినా కరెంట్ రాలేదు. చివరకు హాల్ గేట్ కీపర్ స్టేజీ మీద కొచ్చాడు.

"దేఖోభాయ్! ఎలక్ట్రిసిటి డిపార్టుమెంటోళ్ళు స్ట్రయిక్ జేస్తున్రని ఫోన్లో జెప్పిన్రు! ఇంక మీరిండ్లకు పోండ్రి" అన్నాడు వినయంగా.

జనంలో నుంచి కలకలం- కేకలు మొదలయ్యాయి.

"కరెంట్ పోతే ఏమాయె జనరేటర్ స్టార్ట్ జెయ్యాలె!" అంటూ ఎవరో అరిచారు.

"జనరేటర్ ఖరాబున్నది."

"ఖరాబుంటే ముంగటే రిపేర్ జేయించాల్రా బాడుకవ్" ఎవరో అరచారు.

"సాలె ఎవళ్ళు జెప్తున్నార్రా ఆ మాట?"

"నేను జెప్తున్నా బే!"

"నువ్వెవడివిరా చెప్పనికి సాలె?"

"మీ మొగుడ్నిరా బాడుకవ్!"

ఇద్దరూ ముందుకి దూకి చొక్కాలు పట్టుకోయేంతలో మేనేజర్ వచ్చి విడిపించాడు.

"ఇగో- అర్ధగంటలో జనరేటర్ రిపేర్ గిట్ట జేయించి సినిమా షురూ చేయకబోతివా- ఫర్నిచరంతా జలాయిస్తాం" అన్నాడు ఇంకొకడు.

"ఎలక్ట్రిసిటీ వాళ్ళకి మరీ అలుసెక్కువయిపోయింది. 'ఆ' అంటే స్ట్రయిక్ 'ఊ' అంటే స్ట్రయిక్" అన్నాడు గోపాల్రావ్ చిరాకుగా.

స్ట్రైక్ మూలాన- పదిహేనురోజులు కరెంట్ లేకపోవడం వల్ల మా పిల్లలిద్దరూ పరీక్ష తప్పారు" అన్నాడు రంగారావ్.

"నన్నడిగితే మిలటరీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ ని తీసుకొచ్చి వీళ్ళసమ్మె విరగ్గొట్టాలి" అన్నాడు శాయిరామ్.

మెకానిక్ అర్జంటుగా వచ్చి జనరేటర్ స్టార్ట్ చేశాడు.

సినిమా మళ్ళీ ప్రారంభమయింది. ఈసారి మళ్ళీ పదినిముషాలకే ఆగిపోయింది.

"మళ్ళీ ఏం రోగమొచ్చింది?" ఎవరో అరిచారు.

"గిప్పుడే ఫోన్లో ఇన్ ఫర్ మేషనొచ్చినాది! మన ఆంధ్రప్రదేశ్ సినిమా హాల్స్ అసోసియేషన్ వాళ్ళు సడెన్ గా సమ్మె షురూజేసిన్రు. కనుక సమ్మె ఖతమయేవరకూ సినిమాలు నడవయ్. మీరు గూడా సమ్మెజేసేటోళ్ళే. మా కష్టాలు మాకున్నాయి. జరంత సమజ్ చేసుకోండి. జరంత మీరు బయటకు పోతే థియేటర్ మూసి సమ్మె చేసుకుంటం."

అందరూ కోపంగా అరుపులూ, కేకలూ, తిట్లూ మొదలెట్టి చేసేది లేక బయటకు నడిచారు.

"ఆట మధ్యలో సమ్మె ఏమిటి? వీళ్ళకేమయినా బుద్ధుందా?" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

"అబ్బే, దేశంలో డిసిప్లిన్ అనేది లేకుండా పోతోంది" అన్నాడు రాందాస్.

అందరం మళ్ళీ సైకిళ్ళు తీసుకుని రోడ్డుమీద కొచ్చాం!

"ఇప్పుడెక్కడికి పోదాం!" అడిగాడు శాయిరామ్.

"ఏదయినా హోటల్ కిపోయి కాసేపు బాతాఖానీ వేద్దాం!" సలహా ఇచ్చాడు రంగారెడ్డి. సైకిళ్ళు బయలుదేరాయి.

పాతిగ్గజాలయినా వెళ్ళకముందే హఠాత్తుగా మలుపు తిరిగిన రోడ్డుకి అడ్డంగా నిలువెత్తు గొయ్యి కనిపించింది. అందరూ సడన్ బ్రేకు వేసుకుని ఆగిపోయారు గానీ- గోపాల్రావ్ సైకిల్ కి బ్రేకులు లేకపోవడంతో సైకిల్ మీద కూర్చున్న యాదగిరితో సహా గోతిలో పడిపోయారు. సైకిల్ వాళ్ళిద్దరిమీదా ఉంది.

అందరం కలిసి వాళ్ళను బయటకు లాగాము అతికష్టం మీద.

ఆ గొయ్యి తవ్విన వాటర్ వర్క్స్ డిపార్టుమెంట్ వాళ్ళు ఆ పక్కనే నిలబడి సిగరెట్టు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏయ్! గొయ్యి తవ్వినవాళ్ళకి పూడ్చడం తెలీదూ?" కోపంగా అరిచాడు రంగారెడ్డి చొక్కా చేతులు మడుస్తూ.

"ఎందుకు తెలీదు? తెలీదని ఎవరన్నారసలు?" ఆశ్చర్యంగా అడిగాడు ఆ గ్రూప్ లో ఒకడు.

"తెలుస్తే నడిరోడ్డు మీద ఇంత పెద్ద గొయ్యి తవ్వి ఎందుకు వదిలేసినట్లు?"

"ఎందుకేమిటి సార్? లైట్నింగ్ స్ట్రయిక్ చేస్తున్నాం. రోడ్లన్నీ గోతులు తవ్వాక హఠాత్తుగా సమ్మె చేయాలని మా యూనియన్ ఆదేశాలిచ్చింది. మొత్తం సిటీలో ట్రాఫిక్కంతా ఈ గోతుల దగ్గర స్తంభించి పోతుంది కదా! దాంతో మా వర్కర్స్ కోర్కెలు అప్పటికప్పుడు తీర్చడానికి ప్రభుత్వం ఒప్పుకోకేం జేస్తుంది?"

"మీకేమయినా బుద్ధుందా? ఇలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో ప్రజలను ఇరికించి సమ్మె జేస్తారా?" బాధతో మూలుగుతూనే అరిచాడు గోపాల్రావ్.

"ఇదిగో- ప్రజల మీద పెద్ద ప్రేమున్నట్లు బోడి ఫోజివ్వకు. వాళ్ళమీద అంత ప్రేముంటే మీరెందుకు సమ్మె జేస్తున్నట్లు?" అడిగాడతను నింపాదిగా.

గోపాల్రావ్ ఉలిక్కిపడ్డాడు.

"మేమా? మేము సమ్మెజేస్తున్నామని ఎవరు చెప్పారు నీకు?"

అతను విరగబడి నవ్వాడు.

"భలేవాడివి దొరికావులే. చొక్కాకున్న బాడి చూస్తే తెలీటం లేదూ?"

అందరం దెబ్బతిన్నట్లు ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం. సైలెంట్ గా అక్కడినుంచి మూవ్ అయిపోయాం.

గోపాల్రావ్ కాలికి ఫ్రాక్చరయినట్లు అందరికీ అనుమానం కలిగింది. కాలు కింద పెట్టలేకపోతున్నాడతను.

"ఆటోలో హాస్పిటల్ కి తీసుకెళ్దాం" అన్నాడు శాయిరామ్.

ఆ పక్కనే వున్న ఆటోరిక్షా దగ్గరకు పరుగెత్తాం నేనూ. శాయిరామ్ ఆటో రిక్షా అతను సీరియస్ గా వెనుక సీట్లో పడుకుని సిగరెట్ తాగుతున్నాడు.

"ఆటో- త్వరగా హాస్పిటల్ కెళ్ళాలి పద" అన్నాడు ఆత్రుతగా. వాడు మావంక 'ఉసుళ్ళు' అనే పురుగుల్ని చూసినట్లు చూశాడు. చూడ్డమే కాకుండా 'ఉఫ్' అని ఊదాడు.

నేనూ- శాయిరామ్ మొఖాలు చూచుకున్నాం.

"ఏయ్ మిస్టర్- నీకే చెప్పేది- త్వరగా హాస్పిటల్ కి వెళ్ళాలి."

"గో- టు- హెల్-" అన్నాడు ఆటోవాడు మరో దమ్ము పీల్చి.

"ఏమిటి?"

"గో- టు- హెల్-"

"ఏమిటి గో-టు- హెల్" కోపంగా అడిగాడు శాయిరామ్.

"ఇంగ్లీషు తెలీదా?"

"తెలుసు."

"తెలుస్తే ఏ బి సి డిలు చివరివరకూ చెప్పు."

"ఇప్పుడిదంతా ఎందుకు? అర్జంటుగా హాస్పిటల్ కి వెళ్ళాలంటేనూ?" భయంగా అన్నాడు శాయిరామ్- ఒకవేళ వాడికేమైనా మెంటలేమోనని.

నాకు శాయిరామ్ వీక్ నెస్ తెలుసు!

"యు.వి. అన్న అక్షరాల్లో ఏది ముందో ఏది వెనకో శాయిరామ్ కి ఇప్పటికి కంఫ్యూజనే!

"అయితే నీకు ఇంగ్లీష్ రాదు" వికటాట్టహాసం చేశాడు ఆటోవాడు.

"వచ్చు" అన్నాడు శాయిరామ్.

"నీకు ఏ బి సి డీలు తెలుస్తే హాస్పిటల్ కి రమ్మని పిలువవు"

"ఎందుకు పిలవను."

"ఎందుకంటే ఇవాళ్టి ఇంగ్లీష్ పేపర్లో మా ఆటో అసోసియేషన్ వాళ్ళు స్ట్రైక్ చేస్తున్నట్లు రాసినా నీకా విషయం తెలీలేదు కాబట్టి."

"మీరెందుకు సమ్మె జేస్తున్నారు?" అనడిగాను అతనిని.

"సవాలక్ష కారణాలుంటాయ్- మీకెందుకు- ఆర్చేవారా తీర్చేవారా" అంటూ మరో సిగరెట్ వెలిగించుకుని మా వంక మళ్ళీ 'ఉసుళ్ళు'ను చూసినట్లు చూసి 'ఉఫ్' అని ఊదాడు.

ఇక లాభం లేదని మేం వెనక్కు వచ్చేశాము.

అందరం కలసి గోపాల్రావ్ కి సహాయం చేస్తూ బస్ స్టాండ్ దగ్గరకు తీసుకెళ్ళాము. అరగంట నుంచున్నా బస్ రాకపోయేసరికి అనుమానం వచ్చింది.

"కొంపదీసి వీళ్ళూ స్ట్రైక్ చేయటం లేదు కదా" అన్నాడు రాందాస్ అనుమానంగా. ఈలోగా ఎదురుగ్గా కేకలు- అరుపులు వినిపించాయ్.

విద్యార్థులు చాలామంది పుస్తకాలు చేత్తోపట్టుకుని నినాదాలు చేస్తున్నారు.

"కాపీలు పట్టుకోవడం నశించాలి.

పరీక్షా విధానం మారాలి.

గ్రేస్ మార్కులు- కావాలి-

"మినిమమ్ పాస్ మార్కులు- ఇంకా సగానికి తగ్గాలి."

ఆ నినాదాలు యిస్తోంది మరెవరో కాదు. మా రాందాస్ కొడుకే! వాడు ఎనిమిదో క్లాస్ చదువుతున్నాడు. వాడితోపాటు కాలనీ కుర్రాళ్ళు చాలామంది ఉన్నారు.

"ఒరేయ్. ఇలారా" పిలిచాడు రాందాస్.

"వాట్ డాడీ?"

"స్కూలు కెళ్ళరా అంటే ఇక్కడ తిరుగుతున్నావా?"

"మేం సమ్మె చేస్తున్నాం డాడీ! తిరగటం లేదు. పొద్దున్నుంచీ ఇప్పటివరకూ ఆరు బస్సులు తగలబెట్టాం- ఎనిమిది బస్సుల మీద రాళ్ళు కొట్టాం- పధ్నాలుగు జతల టైర్లు కోసేశాం" గర్వంగా చెప్పాడు వాడు.

"అయితే బస్సులు తిరక్కపోవడం మీ ప్రభావమే అన్నమాట. పద ఇంటికి"

"సారీ దాదేం మీరూ సమ్మె జేస్తున్నారు కదా. నేను అడ్డు తగిలానా? ఎవరి సమ్మె వారిది- ఇలా జోక్యం కలిగించుకోవడం, ఆలిండియా స్ట్రయికర్స్ అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకం" అనేసి మళ్ళీనినాదాలు చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

చేసేదిలేక ఓ రిక్షా పాతిక తూపాయలకు మాట్లాడి గోపాల్రావ్ ని హాస్పిటల్ కు తీసుకెళ్ళాం. వెంటనే టెస్ట్ చేసేసి ఆపరేషన్ అవసరం అన్నారు.

అప్పటికప్పుడే ఆపరేషన్ ఏర్పాట్లు పూర్తి చేసారు సిబ్బంది.

తీరా ఆపరేషన్ మొదలుపెట్టే ముందు హాస్పిటలంతా పెద్ద కేకలు వినిపించినయ్. నర్సులంతా బయటకు పరుగెత్తి హాస్పిటల్ ముందు నిలబడి నినాదాలు చేయసాగారు.

విషయం ఏమిటని ఓ డాక్టర్ నడిగాము.

"మరేం లేదు, నర్స్ లంతా రెండుగంటల పాటు టోకెన్ స్ట్రైక్ చేస్తున్నారు. వాళ్ళు మళ్ళీ డ్యూటీలో కొచ్చాక ఆపరేషన్ చేస్తాము" అనేసి గోపాల్రావ్ ని ఆపరేషన్ టేబుల్ మీద వదిలేసి ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. రెండు గంటలయ్యాక నర్సులంతా మళ్ళీ డ్యూటీలోకొచ్చారు.

ఆపరేషన్ ప్రారంభమవబోతూండగా మళ్ళీ కేకలు వినిపించాయి.

"మళ్ళీ ఏమిటి?" భయంగా అక్కడున్న నర్సు నడిగాడు శాయిరామ్.

"డాక్టర్స్ లైటెనింగ్ స్ట్రయిక్ చేస్తున్నారు."

"ఎందుకు?"

"అదింకా ఎవ్వరికీ తెలీదు. సమ్మె హఠాత్తుగా ప్రారంభించాలని పైన్నుంచి డాక్టర్స్ అసోసియేషన్ వాళ్ళుఫోన్ జేశారట."

ఆమె చెప్తుండగానే డాక్టర్లందరూ చేతులు తుడుచుకుంటూ బయటికెళ్ళిపోయారు.

"డాక్టరు గారూ- ఆపరేషన్ పూర్తి చేశాక స్ట్రైక్ చేయవచ్చు గదా్సర్" ఆందోళనగా వెంట పరిగెడుతూ అడిగాడు రెడ్డి.

"ఏడ్చినట్లుంది. లైటెనింగ్ స్ట్రయిక్ అంటే ఎక్కడివక్కడే వదిలేయాలి."

"మరి ఇప్పుడు ఆపరేషన్ టేబుల్ మీదున్న పేషెంట్ గతేమిటి?"

"మేం సమ్మె విరమించేవరకూ అలాగే వుండాలి."

"ఒకవేళ మధ్యలో చచ్చిపోతే?"

"అలా పేషెంట్లు చచ్చిపోవడం- మా సమ్మెకెంతో మంచిది. ఎంత ఎక్కువమంది టపా కడుతుంటే ప్రభుత్వం అంత భయపడి మా డిమాండ్స్ అంగీకరిస్తుందన్నమాట- జిందాబాద్ జిందాబాద్- డాక్టర్స్ యూనిటీ జిందాబాద్" అని అరుస్తూ వెళ్ళిపోయాడు.

మేమేం చేసేదిలేక గోపాల్రావ్ నీ- సగం ఆపరేషన్ అయిన అతని కాలినీ జాగ్రత్తగా ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకుపోబోతుంటే ఓ వ్యక్తి మా దగ్గరకొచ్చాడు.

"సార్! ఆపరేషన్ పూర్తిచేస్తాను. రెండు వందలు కాష్ ఇవ్వండి చాలు."

"అదేమిటి? మీరు స్ట్రైక్ చేయటంలేదా?" అడిగాడు గోపాల్రావ్.

"మా వార్డ్ బాయిస్ కి సమ్మె ఏమీలేదుకదండి!"

అందరం అదిరిపడ్డాం.

"నువ్వు వార్డ్ బాయ్ వా?"

"అవునండీ."

"మరి ఆపరేషన్ చేస్తానంటావేమిటి?"

"పధ్నాలుగేళ్ళ నుంచీ ఈ ఆపరేషన్ థియేటర్ లోనే వార్డ్ బాయ్ గా ఉన్నా సార్! ఆ మాత్రం తెలీదేంటి? మా ఇంటి దగ్గర నాకు ఆపరేషన్ థియేటర్ వుంది సారగ పేషెంట్లు ఎక్కువ దొరకడం లేదు గానీ లేకపోతే ఈ వెధవ ఉద్యోగం ఎందుకు చేస్తాను. బాబ్బాబు- పోనీ వందివ్వండి చాలు- ఫస్ట్ క్లాస్ ఆపరేషన్ చేస్తాను. ఇంతవరకూ ఆరొందలు ఆపరేషన్లు చేశాన్సార్"

అతికష్టం మీద వాడిని వదిలించుకుని గోపాల్రావ్ ని ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళ్లి ఎడ్మిట్ చేశాం.

మిగిలిన వాళ్ళందరం ఆకలితో మలమలలాడుతూ మా కాలనీకి నడుచుకుంటూ చేరుకునేసరికి- కాలనీలో పెద్ద మీటింగ్ జరుగుతోంది. కాలనీ ఆడాళ్ళందరూ కూర్చుని ఉన్నారక్కడ.

కనుక సోదరీమణులారా- ప్రతిరోజూ మనకో గండంగా తయారు చేస్తున్నారీ మగాళ్ళు. మిల్క్ వాన్ ఆలస్యమయి కాఫీ ఆలస్యమయితే భార్యల్ని తిడతారు. కూరగాయలు దొరక్కపోతే మనదే బాధ్యత. వంట కుదరకపోతే మనదేతప్పు. చాకలి రాకపోయినా మనమే రేస్పాన్సిబుల్..."

"షేమ్ షేమ్" అని అరిచారు చాలామంది-

"కనుక మనం నిన్న తీసుకున్న రహస్య నిర్ణయం ప్రకారం ఈ రోజు నుంచీ సమ్మె చేస్తున్నాం. అంటే అసలు వంట చేయమని కాదు. కేవలం మనకీ పిల్లలకూ మాత్రమే వండుకుంటామన్నమాట. మనమీద ఈ మగవాళ్ళ గుండాయిజం తగ్గేవరకూ మనం ఈ పద్ధతి అనుసరించక తప్పదు. సమ్మె ఈ రోజునుంచే ఎందుకను కున్నామంటే- ఇవాళ్టి నుంచే మన ఆంధ్రప్రదేశ్ లో అన్ని హోటళ్ళ వాళ్ళు సమ్మె జేస్తున్నారు గనుక- అంటే మగాళ్ళకు ఇంట్లోనూ బయటా కూడా తిండి ఉండదు. దెబ్బకు మన డిమాండ్లకు అంగీకరించి తీరాలి..."

తప్పట్లు కేకలు, కోలాహలం-

మాతోపాటు శాయిరామ్ కూడా అక్కడే కూలబడిపోయాడు నీరసంగా.

* * * * *

# కాస్ట్ ఫీలింగ్

విద్యాధికులు పెరుగుతున్న కొద్దీ మనదేశంలో కులతత్త్వం మతతత్త్వం పెరిగిపోతున్న విషయం ,మనందరికీ తెలుసు. మా కాలనీలో అలాంటి జబ్బు ఎవరికీ లేకపోవటం వల్ల హాపీగా జీవితం గడిపేయగలుగుతున్నాము.

కాని ఆ మధ్య జరిగిన ఓ సంఘటన వల్ల మా అందరి దృష్టి కూడా 'కాస్ట్ ఫీలింగ్' వేపు మళ్ళక తప్పలేదు.

మా కాలనీ కుర్రాడు రాజేష్ ఇంజనీరింగ్ మంచి రాంక్ లో పాసయి ఉద్యోగాల కోసం వేట మొదలుపెట్టాడు.

సనత్ నగర్ లో వున్న ఓ కంపెనీకి మెకానికల్ ఇంజనీర్లు కావాలన్న ప్రకటన చూసి అప్లయ్ చేశాడు. నెల రోజుల్లో ఇంటర్వ్యూ వచ్చిందతనికి. ఇంటర్ వ్యూలో ఇద్దరే మెకానికల్ ఇంజనీర్లు వచ్చారట. మిగతా వారంతా మెకానికల్ డిప్లొమా హోల్డర్లు. కానీ తమాషా ఏమిటంటే వాళ్ళు డిప్లొమా హోల్డర్స్ నే సెలక్ట్ చేసుకున్నారు. అందుకు కారణం తరువాత తెలిసింది.

ఆ సెలక్షన్ కమిటీ చైర్మెన్ వాళ్ళందరిలో కేవలం తన కులానికి చెందిన వారినే సెలక్ట్ చేసుకున్నాడట.

ఆ తరువాత రెండ్రోజులకే ఇంకో సంఘటన జరిగింది. మా ఆఫీస్ లో మా బాస్ గవర్నమెంట్ ని ముంచేసి ప్రైవేట్ కంట్రాక్టర్ కి తొంభై లక్షల లాభం కలిగే విధంగా కాంట్రాక్ట్ ఇచ్చి, అందులో సగం డబ్బు తను తినేశాడు. ఈ విషయం తెలిసి, డిపార్ట్ మెంట్ హెడ్ అతని మీద యాంటీ కరప్షన్ వాళ్ళకు కంప్లెయింట్ ఇచ్చాడు. తీరా చూస్తే ఆ హెడ్ కి తనూ, ఆ కంట్రాక్టర్ ఒకటే కులం వారని తెలిసిందట. అందుకని కంప్లెయింట్ విత్ డ్రా చేసేసుకున్నాడు.

అలాగే ఒక క్రిస్టియన్ ముఖ్యమంత్రి అంతా క్రిస్టియన్స్ కే రాష్ట్రంలోని పెద్ద పోస్ట్ లివ్వటం, ఒక రెడ్డి ముఖ్యమంత్రి అంతా రెడ్డీస్ కే టాప్ పదవులివ్వటం, కోమటి ముఖ్యమంత్రిగారు తమ కులం వాళ్ళందరికీ హోదాలు సమకూర్చటం- ఇలాంటి వన్నీ న్యూస్ పేపర్లలో చదివాం అందరం. ఈ కులమతజాఢ్యాలను ఎలా ఎదుర్కోవాలి అనేది పరిశీలించడానికి మా కాలనీ వాళ్ళంతా ఒక సమావేశం జరపాలని నిర్ణయించుకున్నాం. ఈ కాస్ట్ ఫీలింగ్స్ అనే సమస్యను మా కాలనీ వాళ్ళంతా తమ అడ్వాన్ టేజ్ కి ఎలా వాడుకోవాలో తెలిపేందుకు మీటింగ్ ఏర్పాటు చేశారు. మీటింగ్ కి జనం కిటకిటలాడిపోయారు.

"సోదర సోదరీమణులారాఅ౦ ఈ కులమతతత్త్వాలను సక్సెస్ ఫుల్ గా వాడుకోవడానికి సలహాలివ్వవలసిందిగా కోరుతున్నా" అన్నాడు శాయిరామ్.

మరో అరగంటలో డెబ్బయ్ తొమ్మిది సలహాలు అందించారు అనేకమంది. దేనికీ సభ ఆమోదం లభించకపోయేసరికి పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

హఠాత్తుగా శాయిరామ్ మళ్ళీ మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదరులారా! సోదరీమణులారా- పిల్లలారా౦ యువకులారా" యాదగిరి ఠక్కున అడ్డుపడ్డాడతనికి.

"అది ఒక్కసారంటే చాలుభయ్! పదిసార్లనక్కరలేదు.

శాయిరామ్ అతనివంక కోపంగా చూసి మళ్ళీ సబ్జెక్ట్ లోకొచ్చేశాడు.

"నన్నడిగితే."

"నిన్నెవరూ అడగలే-" వెనుకనుంచి ఎవరో అరచారు.

"అడిగారు" కోపంగా అన్నాడు శాయిరామ్.

"అడగలే-"

రంగారెడ్డి అతనిని శాంతపరచి సలహా త్వరగా చెప్పమని అడిగాడు.

"నన్నడిగితే మన రాష్ట్రమంతా బాగా దట్టంగా అల్లుకుపోయి ఉన్న ఈ కాస్ట్ ఫీలింగ్ ని ఏమీ చేయలేము గనుక మనమంతా కూడా కులమతాభిమానాలు ఏర్పరచుకుంటే ఏ సమస్యా ఉండదు. ఎలావుంది మన అయిడియా?" ఆత్రుతగా అగ్జయిటయిపోతూ అడిగాడతను.

జనంలోనుంచి ఎవరూ మాట్లాడలేదు. అందరూ అలా నిశ్శబ్దంగా తనేమీ మాట్లాడనట్లే తనవంక చూడటం గమనించేసరికి అతని ఉత్సాహమంతా నీరుకారి పోయింది. నెమ్మదిగా మా వెనక్కు వచ్చి నిలబడ్డాడు.

హఠాత్తుగా యాదగిరి ఫిట్స్ వచ్చినవాడిలా గిలగిల కొట్టుకుంటూ మైక్ దగ్గరకు దూకాడు.

"జబర్ దస్త్ అయిడియా భాయ్! గిప్పుడే లైటెనింగ్ లెక్కవచ్చింది! చెప్పాల్నా?" ఉద్రేకంగా అడిగాడు.

"వద్దు, వద్దు" అరిచారు స్టూడెంట్స్.

అయినా యాదగిరి వాళ్ళ మాటలు పట్టించుకోలేదు.

"అదేమంటే! ఈ దునియాల ఇయాళ్రేపు కాస్ట్ ఫీలింగ్ ఎట్లున్నదో గట్ల మన కాలనీల గూడా కాస్ట్ రెలిజియన్ పీలింగ్స్ గిట్ల ఉన్నట్లు కాదు గానీ ఉన్నట్లు యాక్షన్ గిట్లజేస్తే సమజయినాది? నేను జెప్పెడిదేమంటే కాస్ట్ ఫీలింగ్, రెలిజియన్ ఫీలింగ్ గిట్ల దునియాల ఫైలాయించివుండె. కాబట్టి మనం కాలనీవోళ్ళం గూడ కాస్ట్ రెలిజియన్ ఫీలింగ్సుతోటి గంటే కాలనీల కాదు! కాలనీ బయటన్నమాట. గంటే కాలనీలో కాస్ట్ ఫీలింగుని బయట కాస్టు ఫీలింగు లేకుండా యాక్షన్! కాస్ట్ ఫీలింగ్ రెలిజియన్ ఫీలింగ్ నిజంగా కాస్ట్ ఫీలింగ్ లేకున్నగానీ యాక్షన్ తోటి కాస్ట్ ఫీలింగ్' అక్కడితో ఆపి మొఖానికి పట్టిన చెమటలు తుడుచుకోసాగాడతను ఆయాసంగా.

రంగారెడ్డి ఆప్యాయంగా అతని భుజం తట్టాడు.

"చూడు నాయనా! కొంచెం కన్ ఫ్యూజన్ గా ఉన్నట్లుంది. కానీ నువ్ ఏం చెప్పాలనుకుంటున్నావో అది నాకు అర్ధమయింది. నేను నీ తరపున వీళ్ళందరకూ చెపితే త్వరగా పనయిపోతుంది."

"అవ్ అన్నా! నువ్వేజెప్పు మనకు తెలుగుదేశం వచ్చిన దగ్గర కెళ్ళి తెలుగుభాష కొంచెం కిరికిరిగున్నది."

"సోదరులారా! మన యాదగిరి అభిప్రాయం ఏమిటంటే మనందరం కాలనీ బయటకు పనుల మీద- అంటే ఉద్యోగాల కోసం, ఎడ్మిషన్స్ కోసం- కాక ఇంకే పనయినా సరే వెళ్ళినప్పుడు మనందరికీ కూడా కాస్ట్ ఫీలింగ్ ఉన్నట్లు యాక్షన్ చేసి ఏం కులం వాళ్ళ దగ్గరకు మన కాలనీలో ఉన్న వాళ్ళ కులం వాళ్ళనే పంపి మన పనులన్నీ చేసుకోవచ్చు."

జనమంతా ఆ సూచన వినగానే తప్పట్లు మోతిక్కించేశారు. మాక్కూడా ఆ ఆలోచన వచ్చింది.

"యాదగిరికి ఇంతమంచి అయిడియా ఎలా వచ్చింది?" మా కాలనీవాళ్ళు చాలామంది ఒకరినొకరు అడుగుతూండటం వినిపించింది మాకు. దాంతో యాదగిరి ఉప్పొంగిపోయాడు.

"...నేను మీకిట్ల కనబడుతున్నా గానీ నా చిన్నప్పుడే కెళ్ళే ఫెంటాస్టిక్ అయిడియా లోస్తూండె! ఎరుకనా? నైన్త్ క్లాసు చదివేప్పుడు ఏమాయెనంటే మా స్కూల్లో చాక్ పీస్ ఱ ఖతమయిపోయినయ్. మార్కెట్లో గూడ లేకుండె. నేనప్పుడేమయిడియా ఇచ్చినానో ఎరుకనా? స్టూడెంట్స్ అందరిండ్లలో చిన్న చిన్న చాక్ పీస్ ముక్కలుంటయి గదా! గవి తెచ్చి హెడ్ మాస్టర్ కిస్తే పని నడుస్తుందని జెప్పినా. ఇగో ఇక జూడు- రెండో దినానికల్లా నాలుగుబస్తాల చాక్ పీస్ ముక్కలు జమయిపోయినయ్. మా హెడ్మాష్టర్ లేదా, ఖుష్ అయిపోయి నాలో గలీ లగాయించిండు."

"చాలు! పాత సుత్తి వద్దు" అరచారు కొంతమంది.

అప్పటికప్పుడే యాదగిరి సూచనను అమలుపరచటానికి అంతా ఏకగ్రీవంగా వప్పుకున్నారు. దానిప్రకారం ఏమిటంటే కాలనీలో ఎవరికయినా ఏదయినా పనిపడినప్పుడు ఆ ఆఫీసరో, లేక గుమాస్తానో, లేక కమిటీ మెంబరో ఎవరో తెలుసుకుని, అతనే కులమో కనుక్కుని ఆ కులానికి చెందిన మా కాలనీ వ్యక్తిని అతని దగ్గరకు పంపి పని సానుకూలపరచుకోవటం!

ఆ మర్నాడే మొదటి కేస్ వచ్చింది మాకు.

మా కాలనీలోనే ఉంటూన్న భుజంగరాజు తమ్ముడిని ఇంటర్ లో చేర్పించాల్సి వచ్చింది. ఆ జూనియర్ కాలేజ్ క్రిష్టియన్స్ ది. కనుక ఆ ప్రిన్సిపాల్ దగ్గరకు మా కాలనీలో వుంటున్న క్రిష్టియన్ టి.జె.యమ్. బాబుని తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాం. వెంటనే అందరం మధుషీల్ బాబు ఇంటికి చేరుకున్నాం.

"హలో హలో ఏమిటిలా వచ్చారు?" అడిగాడతను.

సంగతంతా చెప్పామతనికి.

"అయిడియా బాగుంది కానీ" అంటూ నసిగాడతను.

అందరం గతుక్కుమన్నాం.

"కానీ!" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి.

"జీసస్ క్రైస్ట్ కి కోపం వస్తుందెమొగ ఎందుకంటే మా బైబుల్లో స్పష్టంగా ఉంది. అబద్ధాలు చెప్పటం మహా పాతకమని"

మాకేం చెప్పాలో తెలీలేదు. అందరం మొఖాలు చూసుకుంటూంటే హఠాత్తుగా శాయిరామ్ కో అయిడియా వచ్చింది.

"ఆ మాట నిజమేననుకో గురూ! కానీ మీ బైబుల్లోనే ఇంకో సూక్తి కూడా వుంది కదా! "ఏసుక్రీస్తు మిమ్ములను పాపముల నుండి రక్షించును" అని! కనుక ఓ చిన్న అబద్ధం చెప్పినా జీసస్ క్రైస్ట్ అర్ధం చేసుకుని క్షమించేస్తాడు"

"అఫ్ కోర్స్- అఫ్ కోర్స్- ఆ మాట నిజమే పదండి" అన్నాడతను. అందరం జూనియర్ కాలేజ్ చేరుకున్నాం. అక్కడ చాలా పెద్ద క్యూ వుంది.

ఓ చిన్న కాగితం మీద 'జాన్ మధుషీల్ బాబు' అని పేరు రాసి లోపలకు పంపించాడతను. వెంటనే మిగతా వాళ్లందరినీ ఆపేసి మధుషీల్ బాబునీ అతనితో పాటు మమ్మల్నీ కూడా లోపలకు పంపించాడు ప్యూన్.

"కమాన్ మిస్టర్ జాన్ మధుషీల్ బాబూ! సిడౌన్ వీళ్ళంతా ఎవరు" అడిగాడు ప్రిన్సిపాల్ ఆనందంగా.

"అంతా మనాళ్ళే సార్!"

"అంతా మనాళ్ళే?"

"అవున్సార్! అంతా క్రిష్టియన్సే"

"వెరీగుడ్ మధుషీల్ బాబూ! వాట్ కెన్ అయ్ డూ ఫర్ యూ?"

"వీళ్ళ తమ్ముడికి మన కాలేజ్ లో సీట్ ఇవ్వాలి సార్. ఇంటర్ ఎంపీసి. గ్రూప్" భుజంగరాజుని చూపుతూ అన్నాడు.

"ఓ! ఎంపీసికి చాలా టఫ్ కాంపిటీషన్ మధుషీల్ బాబూ! ఎనీవే మన క్రిష్టియన్ కాబట్టి ఇచ్చేస్తాను."

"థాంక్యూ సార్"

"ఏదీ అప్లికేషన్ ఫారమ్?"

భుజంగరాజు అప్లికేషన్ ఫారమ్ ఇచ్చాడు.

అప్లికేషన్ చూస్తూనే అదిరిపడ్డాడు. ప్రిన్సిపాల్!

"వాటీజ్ దిస్? ఇక్కడ హిందూమతం అని ఉందేమిటి?"

మధుషీల్ బాబు చిరునవ్వు నవ్వాడు.

"అప్పట్లో వాళ్ళు హిందువులే సార్! ఈ మధ్యనే మన మతంలో చేరిపోయారు. నేనే చేర్చేశాను"

"ఆర్ యూ ష్యూర్!"

"యస్సార్!" ప్రిన్సిపాల్ కొద్దిక్షణాలు ఆలోచించి భుజంగరాజు వేపు తిరిగాడు.

"ఏ చర్చ్ మీది?" భుజంగరాజు తెల్లమొఖం వేశాడు కానీ వెంటనే బాబు అందుకున్నాడు.

"మా ఎల్.బి.నగర్ చర్చే సార్"

"కాథలిక్సా? ప్రొటెస్టెంట్సా?"

"ప్రొటెస్టెంట్సే సార్!" వినయంగా అన్నాడు భుజంగరాజు.

"ఆ చర్చ ఫాదర్ నుంచి సర్టిఫికెట్ కావాలి" అనుమానంగానే అన్నాడు ప్రిన్సిపాల్.

"రేపు తెచ్చిస్తాను సార్"

"అయితే సరే."

అప్లికేషన్ మీద 'ఎడ్మిట్' అని రాసి భుజంగరాజు కిచ్చేశాడు ప్రిన్సిపాల్.

అందరం ఆనందంగా బయటికొచ్చాం.

బయట మా కోసమే చౌదరి ఎదుర్చూస్తున్నాడు.

"గురూ అర్జంటుగా మీ హెల్ప్ కావాలి! మా బామ్మర్దికి లోటస్ కంపెనీలో రేపు ఇంటర్ వ్యూ వచ్చింది. ఇంటర్ వ్యూ బోర్డ్ మెంబర్స్ లో ఒకరు కాపు కులమట. రెండో ఆయన బ్రాహ్మణులు. అందుకని..."

కాపులు ఎవరున్నారా అని ఆలోచనలో పడ్డాము.

"ఆ! మన గోపాల్రావ్ కాపులే పదండి! అతనిని తీసుకెళ్దాం" చెప్పాడు రంగారెడ్డి.

అందరం గోపాల్రావ్ కాపులే పదండి! అతనిని తీసుకెళ్దాం" చెప్పాడు రంగారెడ్డి.

అందరం గోపాల్రావ్ వాళ్ళ పత్రికాఫీసుకెళ్ళి అతనిని తీసుకుని ఆ ఇంటర్ వ్యూ బోర్డ్ చైర్మన్ ఇంటికి వెళ్ళాం.

అప్పుడె ఇంటర్ వ్యూకి బయల్దేర బోతున్నాడతను.

"రేపు రమ్మని చెప్పూ! ఇవాళ చూడను" అంటూ ప్యూన్ తో చెప్పేయటం మాకు వినబడుతూనే వుంది.

ఇక లాభం లేదని గోపాల్రావ్ లోపలకు నడిచాడు ప్యూన్ ని పక్కకి తోసి.

"ఇంతకుముందే ప్యూన్ తో చెప్పాను కదా- రేపు రండి" కోపంగా అన్నాడతను.

"మనమంతా ఒకటే కాస్ట్ సార్" నవ్వుతూ అన్నాడు గోపాల్రావు.

"అలాగెగ మీ ఇంటిపేరేమిటి?"

"ఎండకాలం సార్!"

"ఆ! ఎండాకాలం వాళ్ళా! మీకు తెలుసో తెలీదో మా మదద్ వాళ్ళింటి పేరు కూడా ఎండాకాలం వాళ్ళే"

"తెలుస్సార్ మా అమ్మ ఎప్పుడూ చెపుతూండేవారు. ఫలానా ఎండాకాలం వాళ్ళ కుటుంబం చాలా గొప్ప కుటుంబం అని-"

"అలాగాగ చాలా సంతోషం ఇంతకూ ఏం పనిమీదొచ్చారు?"

"మనవాడొకతనికి ఇవాళ మీ కంపెనీలో ఇంటర్ వ్యూ వుంది"

"మనవాడేనా?"

"సెంట్ పర్సెంట్"

"పేరు రాసివ్వండి"

"గోపాల్రావ్ జేబులోనుంచి కాగితం తీసి అతనికిచ్చేశాడు.

"ఇంటి పేరు 'వి' అని వుంది 'వి' అంటే ఏమిటి?"

" 'వి' అంటే వర్షాకాలం."

"ఆఁ! వర్షాకాలమా! కానీ మన కాస్ట్ లో వర్షాకాలం వాళ్ళెవరూ లేరనుకుంటానే."

"ఇటు సైడ్ లేరు గానీ సూర్యాపేటలో ఉన్నారండీ! అసలు "వర్షాకాలంపల్లి" అనీ ఓ ఊరు ఊరంతా మున్నూరు కాపులదే ఉంది."

"ఓ! అలాగా."

"అవునండీ."

"అయితే సరే."

"థాంక్యూ సార్. వస్తానండి"

"వెల్ కమ్, వెల్ కమ్."

అందరం హాపీగా బయటికొచ్చేశాము.

అక్కడ నుంచి రెండో మెంబర్ శర్మగారి ఇంటికి చేరుకున్నాం. ప్యూన్ తో మా కాలనీకి చెందిన శశిధర్ పేరు రాసి పంపించాము లోపలకు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అంటూ శర్మగారే బయటికొచ్చేశారు.

"మా తాతగారి పేరు మీకు తెలిసే వుంటుంది. సోమేశ్వరశర్మ అనీ-"

"మీ ఇంటిపేరేమిటి?"

"శీతాకాలం సార్."

"అరె! మీరు శీతాకాలం సోమేశ్వరశర్మ గారి మనుమలా!"

"అవున్సార్."

"రండి. కూర్చోంది! మా బావగారింటి పేరు కూడా శీతాకాలం వాళ్ళే-"

"మా తాతగారే ఆ విషయం చెప్పి పంపించారు సార్. మనమంతా ఒకటే. ఏం ఫరవాలేదు వెళ్ళమన్నారు."

"చాలా సంతోషం! చాలా సమ్మోశమగ యింతకూ ఏమిటి పని."

"మనవాడు ఒకతనికి మీ కంపెనీలో ఇంటర్ వ్యూ వచ్చిందట."

"ఓహో అదా సంగతి! ఆ కాండేట్ మనవాడేకదా?"

"పూర్తిగా మనాడేనండీ"

"వైదీకులా? నియోగులా?"

"మనాళ్ళే."

ఏదీ పేరు రాసివ్వండి."

చౌదరి ఠక్కున పేరు రాసిచ్చేశాడు.

"వి అంటే ఏమిటి?"

"అదేసార్! వర్షాకాలం."

"వర్షాకాలం పేరు మన కాస్టులోలేదే"

"రాయలసీమలో ఉందంటండీ."

"అవునండీ "వర్షాకాలం అగ్రహారం" అనీ ఒక ఊరు ఊరంతా మన కాస్ట్ వాళ్ళే- అది మన శాఖ వాళ్ళే ఉన్నారు" చెప్పాడు చౌదరి.

"సరే. తప్పకుండా సెలక్ట్ చేసేస్తాను. సెలక్టయిపోయాడనే అనుకోండి."

"చాలా థాంక్స్ సార్ మన శీతాకాలం వాళ్ళమీద అంత అభిమానం ఉన్నందుకు"

"దాన్దేముందిలే! మనం మనం సహాయం చేసుకోకపోతే ఎలా? మిగతా కులాల వాళ్ళందరూ కలసి మనకులాన్ని ఎలా అణగ ద్రొక్కేస్తున్నారో మీరూ చూస్తున్నారుగా!"

"అవునండీ. చూస్తున్నాం."

అందరం ఆనందంగా వచ్చేశాం అక్కడినుంచి.

"మర్నాడు పొద్దున్నే ఇంకో కేస్ వచ్చింది మా దగ్గరకు. రవిప్రకాష్ వాళ్ళ తమ్ముడికి పోలీస్ డిపార్టుమెంట్ లో సబ్ ఇన్ స్పెక్టర్ పోస్టుకి ఇంటర్వ్యూ వచ్చిందట.

"సంగతేమిటంటే గురూ. మేము కాపులం! ఇంటర్ వ్యూ చేసేవాళ్ళు ఇద్దరిలో ఒకరు కమ్మకులం, ఇంకొకరు రెడ్డి. విజయవాడ రంగా గొడవల వల్ల పోలీస్ డిపార్టుమెంట్ లోకి కాపులను తీసుకోరేమోనని నా అనుమానం కనుక.."

అప్పటికప్పుడే టాక్సీ తెప్పించాడు రంగారెడ్డి. ముందు అందరం శివారెడ్డి గారింటికి చేరుకున్నాం.

రంగారెడ్డి అన్న పేరు చూస్తూనే ఆప్యాయంగా బయటికొచ్చి పలుకరించాడతను.

"ఏ ఊరు మీది?"

"గుంటూరు" అన్నాడు రంగారెడ్డి.

"మీదే ప్రాంతం సార్?"

"కడప."

"ఓ! కడపా! మా తాతగారి స్వస్థలం కూడా కడపే"

"అలాగా! మీ ఇంటిపేరేమిటి?"

"సంధ్యాకాలం-"

"ఓ సంధ్యాకాలం వారా? మా బంధువులు చాలామందున్నారు 'సంధ్యాకాలం' వారు"

"అవున్సార్- సంధ్యాకాలం వాళ్ళంటే మాటలా? మనాళ్ళు ఒకప్పుడు మొత్తం దక్షిణ దేశానంతా పరిపాలించిన చక్రవర్తులని మా తాతగారు చెప్తూండేవారు"

"అవునవును! చాలా గ్రేట్ మనాళ్ళు. ఇంతకూ ఏమిటి పని?"

సంగతంతా చెప్పాడు రంగారెడ్డి.

"ఆ కాండేట్ మన రెడ్లేనా?"

"ప్యూర్ రెడ్డీస్ సార్."

"పేరేంటి."

"శ్రావణమాసం శంకర్రావు"

"శంకర్రావ్ ఏమిటి? 'శంకర్ రెడ్డి' అని ఉండాలిగా!"

"ఒకప్పుడు ఉండేదేనండీ! కానీ వాళ్ళ తాతయ్య కొంచెం చాంధసుడవటం వల్ల పోయింది?"

"అదేంటి?"

"ఆయనకు మరీ ఆధునిక పిచ్చి ఎక్కువ సార్! కులాలూ, మతాలూ ట్రాష్! మానవకులం ఒక్కటే ప్రపంచంలో ఉండాలి అని ఊళ్లన్నీ తిరిగి చాలా న్యూసెన్స్ చేస్తూండేవాడు. అక్కడితో ఆగక పేర్ల వెనుక కులాలు ఉండడం వల్లే కులతత్వాలు ప్రబలి పోతున్నాయని వాళ్ళ కుటుంబంలో అందరి పేర్ల వెనుక రెడ్డి అనేది తీసిపారేశాడు."

"బహుశా పిచ్చి ఎక్కి ఉంటుంది" అనుమానంగా మాట్లాడాడు అతను.

"ఖచ్చితంగా పిచ్చే సార్! లేకపోతే కులాలు లేకుండా చేయుటమేమిటండీ నా మొఖం."

"ఆయన భ్రమ! కులం లేకుండా మనిషెలా ఉంటాడు?"

"నూరుపాళ్ళూ భ్రమేనండీ."

"అయినా కులాలు తెలీపోతే మనాళ్ళకు సహాయం ఎలా చేసుకుంటాం! ఆ మాత్రం కామన్ సెన్స్ కూడా లేకపోయిందాయనకు!"

"అవున్సార్! బొత్తిగా కామన్సెన్స్ లేని పనండీ అది."

"సరే మనాడిని నేను సెలక్ట్ చేసేస్తాన్లే"

"థాంక్యూ సార్."

అక్కడి నుంచి కనకయ్య చౌదరి గారింటికి చేరుకున్నాం పదినిమిషాల తర్వాత బయటికి వచ్చారాయన.

"ఏం కావాలి మీకు" అన్నాడు చిరాకుగా గడపదగ్గరే నిలబడి.

చౌదరి రక్కున లేచి నిలబడ్డాడు.

"నా పేరు చౌదరండీ! వీళ్ళంతా కూడా మనాళ్ళే."

ఆయన మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"మనాళ్ళేనా! రండి మరి. బయటే కూర్చున్నారేం?"

అందరం లోపలికెళ్ళి సోఫాల్లో కూర్చున్నాం.

"మీ ఇంటిపేరేమిటి?" చౌదరినడిగాడతను.

"సాయంకాలం సార్."

"ఓహోహో సాయంకాలం వారా? సరిసరి! ఉయ్యూరు ప్రాంతం కదూ మీది?"

"అవునండీ!"

"అక్కడే వూరు?"

"చిన ఓగిరాలలండీ."

"అలాగా మాది పెద ఓగిరాల."

"అబ్బ- చాలా దగ్గరేనండీ మనం. తెగ దగ్గరండీ- జస్ట్ ఆ వంతెన అడ్డం"

"వీళ్ళంతా కూడా చిన ఓగిరాలేనా?"

"కాదండి రాయలసీమలో పెద్ద రాయలీలండీ."

"చాలా చాలా సంతోషం- యింతకూ ఏం పనిమీద వచ్చారు?"

సంగతంతా చెప్పాడు చౌదరి.

"ఆ కుర్రాడు మనాడేనా?"

"మన సొంతకులం సార్."

"పేరు రాసివ్వండి"

రవిప్రకాష్ ఠక్కున వాళ్ళ తమ్ముడిపేరు రాసిచ్చేశాడు.

"ఇంటిపేరు మాయాకాలం అని ఉందేమిటి?"

"అదా- అదీ మాయాకాలం అనీ రాయలసీమలో మనాళ్ళకు ఆ ఇంటిపేరు చాలా ఫేమస్ అండీ! అసలు ఓ ఊరిపేరే "మాయకాలమూరు" అనీ అంతా మనాళ్ళతో నిండి ఉంది."

"అసలు బేసిగ్గా వాళ్ళంతా హర్యానా నుంచి రెండొందలేళ్ళ క్రితం కాకతీయ సామ్రాజ్యానికి వచ్చారటండీ! ఆ తరువాత అందులో కొంతమంది రాయలసీమకు వలసవెళ్ళారు".

"ఐసీ- సరే- ఎలాగో మూడొంతుల మంది సబిన్ స్పెక్టర్లను మన కాస్టువాళ్ళనే సెలక్టు చేయాలనుకుంటున్నా! మీవాడిని తప్పకుండా చేసేస్తా."

"థాంక్స్ సార్- చాలా థాంక్స్ సార్- చాలా గొప్ప సహాయం చేస్తున్నారు మీరు."

"కులం మీద ఆమాత్రం అభిమానం లేకపోతే ఎలాగోయ్. మీరు కూడా మన కాస్ట్ వాళ్ళందరికీ సహాయం చేయండి. లేకపోతే మన కాస్ట్ వాళ్ళు పైకెలా వస్తారు."

"అలాగే సార్"

అందరం తిరిగివచ్చేశాము.

ఆ తరువాత వారం రోజుల్లో ఇదే పద్ధతిలో అన్ని కులాల వారికి 'కాస్ట్ ఫీలింగ్' పేరుతో ఎన్నో కార్యక్రమాలు జరిపించేశాము.

చివరి రోజున మాత్రం ఓ కేస్ విషయంలో కొంచెం గొడవయింది.

నరసరాజు గారింటికి ఓ పెద్ద రికమండేషన్ కోసం వెళ్ళాం. మా శంకర్రావుకి హైద్రాబాద్ నుంచి వరంగల్ కి బదిలీ చేశారు. ఆ బదిలీ రద్దు చేయించాలి.

రాజుగారు చిరునవ్వుతో ఆదరంగా పలుకరించారు మమ్మల్ని.

"ఎవరండీ మీరు?"

"నా పేరు భీమరాజండీ! మాది కూడా భీమవరమే."

ఆ మాటతో అమాంతంగా నర్సరాజు లేచి భీమరాజుని ఆనందంగా కౌగలించుకుంటాడని ఊహించాం మేం.

"మీదేవూరు అని నేనడగలేదు! తెల్సిందా?" అంటూ రివర్సయ్యాడతను.

భీమరాజు కొంచెం కంగారుపడ్డాడు.

"అఫ్ కోర్స్ అడగలేదండీ."

"అడగనప్పుడు అలాంటివి చెప్పకూడదు- ఇంతకూ పనేంటి?"

"మరేంలేదండీ! వీళ్ళంతా కూడ మన కాస్ట్ వాళ్ళే."

"వీళ్ళదే కాస్ట్ అని నేను అడిగానా?" మళ్ళీ కోపంగా అడిగాడతను.

"లేదండీ"

"మరెందుకా పిచ్చివాగుడు?"

భీమరాజు ఇంకొంచెం బెదిరిపోయాడు.

"సంగతేమిటంటేనండీ మన కాస్టతను శంకర్రావుకి వరంగల్ బదిలీ అయిందండీ. అది కాన్సిల్ చేయిస్తే మన కులానికే సహాయం చేసిన వారవుతారు."

"షటప్! ఇంకోసారి కులం పెరేత్తుతే బయటకు గెంటేస్తాను" ఉద్రేకంగా అన్నారాయన.

అందరం తెల్లబోయాం.

"ఇంతకూ 'మనకాస్ట్' అంటున్నారు! మీరేం కాస్ట్ అసలు?" కోపంగా అడిగాడాయన.

"అదే సార్! రాజులం."

"నేను రాజు కాస్ట్ అని ఎవరు చెప్పారు మీకు?"

"తెలిసిందండి"

"గాడిద గుడ్డు తెల్సింది. మేము రాజులు కాదు."

"మరి మీ పేరు.."

"నర్సారాజు అన్న పేరున్నంత మాత్రాన నేను రాజు కాస్ట్ అవ్వాలని రూలుందా?"

"లేదనుకోండి"

"లేదనుకోండి కాదు- లేదు! అందుకు ఉదాహరణ నేనే."

"పోనీ మీరే కాస్ట్ సార్- మా కాలనీలో అన్ని కులాల వాళ్ళూ ఉన్నారు."

"గెటౌట్! అసలు- నాకు ఈ కులాలంటేనే అసహ్యం! నా దగ్గర ఈ కులాల ప్రసక్తి తెచ్చినందుకు ఈ శంకర్రావుని శ్రీకాకుళం బదిలీ చేస్తున్నాను. రెండు నిమిషాలు టైమిస్తున్నాను. ఈలోగా మీరంతా మా కాంపౌండ్ వదలివెళ్ళాలి! ఇంకా చూస్తారేమిటి? గెటౌట్! లేకపోతే పోలీసుని పిలిచి పట్టిస్తానందరినీ"

అందరం ఒక్క నిమిషంలో కాంపౌండ్ వదిలేశాము.

మర్నాడే శంకర్రావు భోరున ఏడుస్తూ సామాను తీసుకుని శ్రీకాకుళం వెళ్ళిపోతుంటే మాక్కూడా ఏడుపొచ్చేసింది.

"ఇదంతా మనవల్లే జరిగింది" అన్నాడు రంగారెడ్డి.

"అవును! మనం తీసుకున్న పాలసీ అంత బావున్నట్లు లేదు" అన్నాడు శాయిరామ్.

ఇది జరిగిన రెండు రోజులకే అంతవరకూ మేమాడిన నాటకాల ఫలితాలన్నీ వచ్చేశాయి.

జూనియర్ కాలేజీలో మా కాలనీ కుర్రాడికి సీట్ రాలేదు. చౌదరి గారి బామ్మర్ది, రవిప్రకాష్ తమ్ముడూ కూడా ఉద్యోగాలకు సెలక్ట్ కాలేదు.

ఎందుకిలా జరిగిందా అని అమరం తర్జనభర్జనలు పడుతూంటే శ్యామల్రావ్ చిరునవ్వుతో వచ్చాడు మా దగ్గరకు.

"మా చెల్లెలి కొడుక్కి అదే జూనియర్ కాలేజీలో ఎంపీ సీట్ దొరికిందయ్యా! మా పెద్దమ్మ గారబ్బాయికి లోటస్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. మా బామ్మర్ది పోలీస్ డిపార్టుమెంట్ లో సెలక్టయ్యాడు. మన శంకర్రావుని మళ్ళా హైద్రాబాద్ కి ట్రాన్స్ ఫర్ చేయించేశాను" అంటూ చెపుతూంటే మాకు మతిపోయినట్లయింది. ఎందుకంటే అతనిది వీళ్ళందరికీ చెందని వేరే కులం! అయినా అతను అన్నీ సాధించాడంటే నమ్మకం కలగటం లేదు.

"మేము కాస్ట్ ఫీలింగ్ తీసుకెళ్ళినా పనులవలేదు. మీకెలా అయాయ్ మరి?" అడిగాడు రంగారెడ్డి ఆశ్చర్యంగా.

శ్యామలరావ్ ఘోల్లున నవ్వాడు.

"పిచ్చివాళ్ళల్లారా! కాస్టూ, రెలిజియనూ, రక్తసంబంధం వీటన్నింటినీ మించిన ఫీలింగ్ ఒకటుంది! మీకు ఆమాత్రం జనరల్ నాలెడ్జ్ కూడా లేదంటే నాకు ఆశ్చర్యంగా వుంది."

"కాస్ట్ ఫీలింగ్ ని మించిన ఫీలింగ్ ఒకటుందా?"

"అవును...నేను దాన్ని ఉపయోగించే పనులన్నీ సాధించాను"

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాము.

"కాష్ ఫీలింగ్! అంటే మనక్కావలసిన పనులు డబ్బు పడేసి సాధించుకోవటం. ప్రస్తుతం ప్రపంచమంతా కాష్ ఫీలింగ్ మీదే నడుస్తోంటే ఇంకా కాస్ట్ ఫీలింగ్ ని పట్టుకుని వేలాడుతూ పైగా పెద్ద తెలివిగల పని చేస్తున్నట్లు ఫోజులు కొడుతున్నారా?"

మేము మాట్లాడకుండా అక్కడి నుంచి జారుకున్నాం.

"నాకు తెలుసు! యాదగిరి కెప్పుడూ ఇలాంటి ఫాల్తూ అయిడియాలే వస్తుంటాయి" అన్నాడు శాయిరామ్.

యాదగిరి ఆ మాట విననట్లు వాళ్ళింటివేపు వెళ్ళిపోయాడు హడావుడిగా.

* * * * *

# దూరదర్శన్ నీతులు వినుము

ఇటీవలి కాలంలో తెలుగు టీవీ కార్యక్రమాలన్నింటిలోనూ అడ్వర్టయిజ్ మెంట్ ఫిలిమ్స్ చాలా ఆకర్షణీయంగా వుంటున్నాయని మాకాలనీలో చిన్నా, పెద్దా అంతా ఏకగ్రీవంగా తమ అభిప్రాయం వెలిబుచ్చసాగారు.

ముఖ్యంగా ఈమధ్య దూరదర్శన్ ఎవరెవరితోనో డబ్బిచ్చి తయారుచేయించిన సందేశాత్మక షార్ట్ ఫిలిమ్స్ మావాళ్ళను ఎంతగానో ఆకర్షించసాగాయి. అమరం కలుసుకున్నప్పుడల్లా ఆటోమేటిగ్గా చర్చ వాటిమీదకే మళ్ళుతోంది.

"అబ్బ! తూకం రాళ్ళ గురించి దూరదర్శన్ లో ప్రోగ్రాం ఎంత బావుందో చూశారా! ప్రభుత్వం నిర్దేశించిన తూకం రాళ్ళు కాకుండా ఇష్టం వచ్చిన రాళ్ళూరప్పలతో వస్తువులు తూచి ఎంతమంది మనకమ్మడం లేదు? మనం ఎప్పుడయినా ఆ విషయం గురించి పట్టించుకున్నామా? పాపం మన తెలుగు దూరదర్శన్ వాళ్లు ప్రపంచంలోని అన్ని దేశాల దూరదర్శన్ ల కంటే తెలివిగలవాళ్ళు కాబట్టి మనలోని అజ్ఞానాన్ని పారద్రోలడానికి కంకణం కట్టుకున్నారు!" అంది సావిత్రమ్మగారు.

"మీరు చెప్పినమాట నిజమే! వస్తువుల అమ్మకంలో వర్తకులు ఇచ్చే డిస్కౌంట్లు, రిబేట్ ల గురించి కూడా ఎంత అద్భుతమైన ఫిలిమ్ చూపించారు పాపం! వాళ్ళు చెప్పే వరకూ అవన్నీ మోసాలని నాకు తెలీనే తెలీదు-అంతెందుకు ఆడపిల్లకు పద్దెనిమిది సంవత్సరాల వయసొచ్చేవరకూ పెళ్ళి చేయగూడదని వాళ్ళు ఎంత చక్కగా సందేశం ఇచ్చారో తెలుసా? అసలు అలాంటి పెళ్ళిళ్ళు చేయటం నేరమంట! దూరదర్శన్ వాళ్ళు ఆ విషయం చెప్పేంత వరకూ ఎవరికీ తెలీదసలు-" అంది పార్వతీదేవి.

"అదీ గాకుండా మాదకద్రవ్యాలు వాడటం వల్ల కలిగే హాని గురించి ఎంత విశదంగా సందేశాలు ఇస్తున్నారో చూశావా? అసలు మాదక ద్రవ్యాలంటే ఏమిటో, అవి ఎలా వాడాలో అప్పుడే తెలిసింది చాలామందికి" అన్నాడు గోపాల్రావ్.

"నిజంగా అజ్ఞానంలో వున్న మన తెలుగు ప్రజలకు మన తెలుగు టీవీ కనువిప్పు కలిగిస్తోంది" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! మనం రోజూ చూస్తూనే వున్నా పట్టించుకొని అనేక అవకతవకల వల్ల మనకూ మన సమాజానికీ, ఎంత నష్టం జరుగుతోందో ఈ దూరదర్శన్ షార్ట్ ఫిలిమ్స్ వల్ల తెలుసుకోగలుగుతున్నాం" అన్నాడు చంద్రకాంత్.

"కానీ వాళ్ళు మన ప్రజలకిచ్చే సందేశాలన్నీ మనం కేవలం చూసి మర్చిపోతే ఆ కార్యక్రమాల వల్ల వుపయోగమేముంటుంది? కేవలం మన తెలుగు ప్రజల మీద ప్రేమతో లక్షల రూపాయల ఖర్చుచ్చే ఆ కార్యక్రమాలను కోట్లు ఖర్చుచేసి రూపొందించాలంటే మనం ఆ సందేశాలన్నీ అమలుచేయాలి!" అన్నాడు శాయిరామ్ మరి ప్రేప్రేగిపోతూ.

"అవును! మన కాలనీ వాళ్ళందరం రేపటినుంచీ ఆ సందేశాలను అమలు పరచి మొత్తం రాష్ట్రమంతటికి మార్గదర్శకులవుదాం!" అన్నాడు జనార్ధన్, ఆడా మగా పిల్లా పీచూ అందరూ మర్నాటి నుంచి మన దూరదర్శన్ కన్న కలలు నిజం చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

ఆ రాత్రి మాలో చాలామందికి ఎగ్జయిట్ మెంట్ తో నిద్రపట్టలేదు. దూరదర్శన్ చూపిస్తోన్న మార్గదర్శక సూత్రాలను అమలుపరచామంటే మా కాలనీకీ అటు సమాజానికీ ఎంత లాభం కలుగుతుందో!

అలా చేస్తే వెంటనే మా కాలనీ గురించి న్యూస్ పేపర్స్ లో వార్తలు వచ్చేస్తాయి.

"నిర్భయ్ నగర్ కాలనీ వాసులు దూరదర్శన్ విజ్ఞాన బోధక చిత్రాలకు ప్రేరితులై తమ పట్ల జరుగుతున్న అనేక అన్యాయాలను ఎదుర్కొన్న ఉదంతం" అంటూ రాసేస్తారు. ఆ వార్తలు చదివి దూరదర్శన్ అధికారులు మా కాలనీ కొచ్చి మావాళ్ళందరి ముందూ మైక్ పెట్టి ఇంటర్ వ్యూలు చేస్తారు.

"చూడండి రంగారెడ్డి గారు! తూకం రాళ్ళ విషయంలో సామాన్య ప్రజలకు అన్యాయం జరుగుతోందన్న విషయం మీకెలా తెలిసిందో చెప్తారా?"

"కేవలం హైద్రాబాద్ దూరదర్శన్ వారు చూపిస్తోన్న షార్ట్ ఫిలిమ్స్ వల్లే తెలిసిందండీ! అంతకుముందు మేమెలా మోసపోతున్నామనే మాకు తెలీదు"

"చాలా సంతోషం! ఆ! మీరు చెప్పండి శాయిరామ్ గారూ! అనేకమంది వ్యాపారస్తులు ప్రకటిస్తోన్న డిస్కౌంట్ లు, రిబేట్ లు మోసంతో కూడుకున్నవని మీకెలా తెలిసిందో చెప్పగలరా?"

"ఎందుకు చెప్పలేనండీ! ఇదంతా కేవలం దూరదర్శన్ రూపొందించిన షార్టు ఫిలిమ్స్ దయ! ఆ చిత్రాలు చూసే వరకు అందులో మోసం వుంటుందనే తెలీదండీ, అన్నీ నిజమే అనుకుని రిబేట్ లిచ్చే అన్ని దుకాణాల్లోనూ వస్తువులు కొనే వాళ్ళం!"

"చూడండి సావిత్రి గారూ! ఆడపిల్ల వయసు పద్దెనిమిదేళ్ళులేందే పెళ్ళిచేయడం నేరామన్న విషయం మీరు ఎలా తెలుసుకోగలిగారు?"

"దూరదర్శన్ వాళ్ళు చెప్ప బట్టే తెలిసిందండీ! అది తెలీక ఎంతమంది తక్కువ వయసున్న ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేస్తున్నారో మేం చూశాం"

"ఆ షార్ట్ ఫిలిమ్స్ చూడడంవల్ల పద్దెనిమిది సంవత్సరాలలోపు ఆడపిల్లలకు పెళ్ళిచేయకూడదని మీరు నిర్ణయించుకున్నారా?"

"అవునండీ! నిజానికి పదిహేడేళ్ళున్న మా పిన్ని గారమ్మాకి సెటిలయిన సంబంధం నేనే దగ్గరుండి కేన్సిల్ చేశానండీ! ఏమయినా సరే పద్దెనిమిది సంవత్సరాలు వచ్చే వరకూ చేయడానికి వీల్లేదని మా పిన్నికి చెప్పేశాను."

"చాలా సంతోషమండీ! మా దూరదర్శన్ వల్ల మీకెంత విజ్ఞానం కలిగినందుకు చాలా సంతోషం"

ఇలా మేమందరం దూరదర్శన్ లో కనిపించే అవకాశం వస్తుందని ఉవ్విళ్ళూరి పోయాము.

మర్నాడు ఎప్పుడూ లేంది ఉదయం అయిదు గంటలకే నిద్రలేచి పోయాము. అప్పుడే కుర్రాడు పాల పాకెట్ తీసుకొచ్చి ఇచ్చాడు.

మా ఆవిడ పాకెట్ కట్ చేయబోతుంటే "ఆగు!" అని అరచాను నేను.

అలా అరవడం అంటే నాకెంతో ఇష్టం! ఎందుకంటే తెలుగు సినిమాలన్నింటిలోనూ ఎక్కడోచోట అలా హీరోయిన్ తండ్రోలేక విలనో 'ఆగు!' అంటూ అరవడం కొట్టిన పిండి అయిపోయింది.

"ఏమిటలా గావుకేక వేశారు? ఏమయింది" అడిగింది మా ఆవిడ బెదిరిపోతూ!

"ఆ పాలపాకెట్ వెయిట్ కరెక్ట్ గా వుందేమో చూడాలి ఇవాళ్టి నుంచీ మన కాలనీ దూరదర్శన్ సందేశాత్మక చిత్రాల ఎడాప్టెడ్ కాలనీగా మారిపోయిందన్న సంగతి మర్చిపోయావా?" అన్నాను సగర్వంగా.

మా ఆవిడ నవ్వింది.

"బాగుంది! ఆ తూకాలన్నీ ప్రైవేట్ వ్యాపారస్తుల విషయంలో చూడాలి గానీ, గవర్నమెంట్ పాకెట్స్ కెందుకు? అవన్నీ ప్రభుత్వం సరిచూశాకే రిలీజ్ చేస్తుంది" అందామె.

నేను చిరునవ్వు నవ్వాను.

"పిచ్చిదానా! మనం అలా ప్రభుత్వ తూకాలూ, ప్రైవేట్ తూకాలు అంటూ పక్షపాతం చూపకూడదు. మనం ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ పౌరులం! ఎలాంటి నాన్సెన్స్ నీ భరించం!" అంటూ పాకెట్ తీసుకొని రంగారెడ్డి ఇంటికెళ్ళాను. రంగారెడ్డి దగ్గర ఒక చిన్న వెయింగ్ మిషన్ వుంది. దాని మీద ఉంచి పాకెట్ తూశాము. వెయిట్ కొంచెం తక్కువ కనిపించింది.

మా ఇద్దరి మొఖాల్లోనూ విజయగర్వం తొంగి చూసింది కాలనీ వాళ్ళందరినీ పిలిచి అందరికీ ఆ అక్రమం కళ్ళారా చూపించాము.

అందరి మిల్క్ పాకెట్సూ అప్పటికప్పుడే తూకంచూశాం!

అన్నీ కొన్ని గ్రాముల బరువు చొప్పున తక్కువగా కనబడుతున్నాయ్.

ఆడాళ్ళందరూ మా చుట్టూ మూగిపోయారు.

"చూశారా పిన్నిగారు! పాల పాకెట్లలోనే మోసం జరిగిపోతోంది. మనాళ్ళు తెలివి గలవాళ్ళు కాబట్టి పట్టుకున్నారు!" అందొకామె.

అందరం కలిసి పాలబూత్ అతని దగ్గరకు నడిచాం- చేతిలో అతనిచ్చిన పాల పాకెట్స్ పట్టుకుని.

"ఏం సార్! పాకెట్లు వెనక్కు తెస్తున్నారేమిటి సంగతి?" అడిగాడు అతను.

మేమంతా తొందరపడకుండా ముందు చిరునవ్వు నవ్వాం.

"ఏమిటి సంగతి? ఎంతకాలం మోసం చేయగలనను కుంటున్నావ్ మమ్మల్ని!" అన్నాడు రంగారెడ్డి పెద్ద ఫోజిచ్చి.

"ఏమిటి సార్ సంగతి? మోసం ఏమిటి?"

"వెర్రివాడా ఈ పాకెట్ వెయిట్ రెండు గ్రాములు తక్కువుంది! ఇదే కాదు ఇంకా చాలా పాకెట్ల బరువు కూడా ఇలాగే తక్కువుందన్న విషయం మేము కనిపెట్టేశాం!" శాయిరామ్ కూడా డిటెక్టివ్ లా ఫోజిస్తూ మాట్లాడాడు.

అతను చిరునవ్వు నవ్వి మా పాకెట్ చేతిలో పెట్టాడు మళ్ళీ.

"ఇంత ఎడ్యుకేటెడ్ అయుండి కూడా ఏమిటి సార్ మీరు! ఇవన్నీ పాలిథిన్ బాగ్స్. అంచేత ఆకవరుకు ఏమూల కొంచెం లీకేజ్ వున్నా కొంచెం వెయిట్ తగ్గుతుంది. అయినా ఒకటి రెండు గ్రాముల కోసం ఇంతగొడవేమిటి సార్! భలేవారే! చాలామంది పాతిక గ్రాములు తగ్గినా ఏమీ మాట్లాడకుండా తీసుకుంటున్నారు"

"అదేం కుదరదోయ్! మేము టీవీలో తూకాలకు సంబంధించిన సందేశాత్మక చిత్రం చూశాం! ఇలా మోసాలు చేసే వాళ్ళను వెయిట్స్ అండ్ మెజరమెంట్స్ డిపార్ట్ మెంట్ వాళ్ళకు పట్టిస్తాం! అతని మొఖంలో చిరాకు కనిపించింది.

"మీరు ఎడ్యుకేటెడ్ అయుండి కూడా ఏమిటి సార్! మీ ఇష్టం! వెళ్ళి డెయిరీ డెవలప్ మెంట్ వాళ్ళ దగ్గర కంప్లెయింట్ చేసుకోండి! పాక్ చేసేది వాళ్ళు-

ఆ మాట అనగానే గతుక్కుమన్నాం!

ఒక ప్రభుత్వ సంస్థకు గానీ, ప్రభుత్వ కార్పొరేషన్ కు గానీ కంప్లెయింట్ చేయడానికి వెళితే ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయో మాకు బాగా తెలుసు.

మాట్లాడకుండా ఇంటికి తిరిగి వచ్చాం.

ఆ తర్వాత కాఫీ ఫలహారాలు పూర్తిచేసి అందరం కూరగాయల మార్కెట్ కి బయలుదేరాం. కూరగాయల మార్కెట్ లోనే ఘోరమయిన తూకాల అక్రమాలు జరుగుతున్నట్టు టీవీలో చూపించడం మాకు కళ్ళకు కట్టినట్టు గుర్తుండి పోయింది.

ఓ స్త్రీ మా ఎదురుగ్గానే మామూలు కంకర్రాళ్ళతో కూరగాయాలు తూచి అమ్మడం కనిపించే సరికి అందరం ఆమె దగ్గరకు చేరుకున్నాం.

"ఏం గావాలి?" అడిగిందామె.

"ఆలుగడ్డ ఎట్టిచ్చినవ్?" అడిగాడు యాదగిరి.

"కిలో నాల్గు రూపాయలు."

"ఒక కిలో ఇవ్వు!"

ఆమె మామూలు గానే ఓ పెద్ద కంకర్రాయ్ తక్కెడలో వేసి ఆలుగడ్డలు తూయ సాగింది. మేమందరం మాలో మేము మొఖాలు చూసుకుని సైగలు చేసుకుని నవ్వుకున్నాం.

మేము మిగతా అందరిలాంటి పౌరులం అనుకుంటోంది పిచ్చిది. మేము దూరదర్శన్ చూసే వాళ్ళమనీ, ఆ తూకాల గురించి తేల్చుకోడానికే వచ్చామనీ తెలీదు పాపం!

"సంచీ పట్టు" అందామె ఆలుగడ్డలు తక్కెడలోనే పట్టుకుని.

"ఆ కంకర్రాయ్ ఏమిటి. ఎంతమందిని ఆ రాయితో మోసం చేద్దామనుకుంటున్నావ్?" అన్నాడు రంగారెడ్డి.

"నువ్వా కంకర్రాయ్ తో తూస్తావని ముందే తెలుసు మాకు! అందుకే నీ దగ్గర కొచ్చాం" అన్నాడు శాయిరామ్.

"వెంటనే ఆ రాయి తీసి అవతల పారేసి ప్రభుత్వం వారిచే సప్లయ్ చేయబడే తూకం రాళ్ళు తీసుకురా!" అన్నాడు చంద్రకాంత్.

మా తెలివికి ఆమె షాకయిపోతుందని, భయపడి వణికిపోతుందనీ మేం ఎక్స్ పెక్ట్ చేశాం.

ఆమె అంతవరకూ నములుతోన్న పాన్ పక్కనే ఊసి తక్కెడ లోని ఆలుగడ్డలు మళ్ళీ కుప్పలో వేసేసింది.

"ఏమిరా బాడుకవ్! నువ్ కొనే కిలోకి సర్కార్ తూకాల్ కావాలి? నీ మొఖం అద్దంలో సూస్కోరా బాడుకవ్ ఎట్టుందోగ థూ! తేరికీ... సర్కార్ తూకం కావాల్నంటా నంగా గాళ్ళకీ" అంటూ బిగ్గరగా తిట్లు ప్రారంభించింది.

మేమందరం నిశ్శేష్టులమయాం! అలా తిట్లు తినడం అదే మొదటిసారి! అందరి మొఖాలూ అవమానంతో ఎరుపెక్కిపోయినయ్.

"ఏయ్! తూకం సరిగ్గా ఇమ్మంటే తిడుతున్నా వేమిటి? వళ్ళు దగ్గరుంచుకుని మాట్లాడు!" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"ఏమిరా సాలే! నువ్వేం వర్లుతున్నావ్ రా! జిందగీల కూరగాయలు కొన్న మొఖమేరా బాడుకవ్ నీది!" అంటూ రంగారెడ్డిని కూడా తిట్టేసరికి చుట్టుపక్కలున్న జనమంతా పోగయిపోయారు.

"ఏమాయే లచ్చమ్మా!" అంటూ పొడుగాటి కర్ర తీసుకొచ్చాడు గిరజాల జుట్టువాడు.

"ఇగో! పేద్ద సంచులు తీసుకొచ్చిన్రు సూడు బాడుకవ్ లు- కూరలు కొననికి. ఈ కమీనా గాండ్లకు సర్కార్ తూకం రాయ్ కావాల్నంట! గద్దార్ సాలే గాండ్లకు" మాకు ఆ తిట్లు వింటూంటే కోపంతో రక్తం ఉడికి పోసాగింది. కానీ ఎదురుగ్గా తిడుతున్నది ఆడమనిషి! ఏం చేయడానికి తోచడం లేదు.

యాదగిరి మాత్రం ఆ తిట్లు సహించలేకపోయాడు.

"ఏయ్ బుడ్డీ! నీకేమయినా బుద్ధున్నదా! నీయవ్వ తూకం మంచిగా లేదంటే తిడతావ్! పోలీస్ కి జెప్పి లోపటజెయిస్థగ ఫాల్తూ నకరాలు జేసినావంటే! ఏం? మేము ఊరోళ్ళమనుకున్నావా నీ ఇష్ట మొచ్చినలెక్క తిడితే ఊర్కోనికి?" అంటూ ఎదురు తిరిగాడు ధైర్యంగా.

యాదగిరి అద్భుతమయిన ధైర్య సాహసాలతో ఆమెకు ఎదురు తిరిగాడనీ, మా పరువు కాపాడాడనీ ఆ క్షణంలో మాకనిపించింది గానీ, మా అభిప్రాయం తప్పనీ, నిజానికి అతనలా మాట్లాడడం వల్ల మా పరువు మరింత బురదలో కూరుకు పోయిందనీ మాకు ఆ తర్వాత జరిగిన సంఘటనల వల్ల అర్ధమయింది. ఆమె అమాంతం కూర్చున్న చోటు నుంచి లేచి ఆలుగడ్డల కుప్పమీద నుంచీ ముందుకి దూకి అమాంతం యాదగిరి షర్ట్ కాలర్ పట్టుకుంది.

"ఏమిరా బాడుకవ్! పోలీస్ ని పిలుస్తావ్ బే! సాలే! పిల్వరా! గిప్పుడు పిలు దమ్ముంటే! అదేయ్! నీయవ్వ గాడిద ముఖం కొడకల్లారా! పిల్వండిరా పోలీస్ ని" అంది తొడ మీద కొట్టుకుని ఛాలెంజ్ చేస్తూ. మేమందరం అవాక్కయాము.

స్త్రీలు శక్తిస్వరూపిణులని ఆయనెవరో స్వామీజీ ఒకప్పుడు అంటూంటే విన్నాం గానీ, ఆ మాటలు నిజమేనని ఇప్పుడు అర్జంటుగా నమ్మాల్సి వచ్చేసరికి మతిపోయి నట్టయింది.

ఇప్పుడు ఆమె చేతి నుంచీ, ఆమె అమానుషంగా మమ్మల్ని అవమానపరుస్తోన్న దయనీయమైన పరిస్థితి నుంచీ ఎలా బయటపడాలో ఏమాత్రం అర్థం కావడం లేదు.

పరిస్థితి ఇంత రసవత్తరంగా కనిపించేసరికి ఇరవై నాలుగ్గంటలూ సినిమాలను ఆదరించే తెలుగు ప్రజలు మరి కొంతమంది మా చుట్టూ పోగయి పోయి అచ్చం సినిమా చూస్తున్నట్టే మమ్మల్ని చూడసాగారు- మధ్యమధ్యలో విజిల్స్ కూడా వేస్తూ.

యాదగిరి మొఖం పాలిపోయింది.

"ఇగో! ముందు షర్టు వదులు" అన్నాడు డిఫెన్స్ లో కొచ్చేస్తూ.

"అవునమ్మా! ముందు షర్టు వదిలేయ్" అన్నాడు శాయిరామ్ కూడా యాదగిరిని సపోర్టు చేస్తూ.

"పోలీస్ ని పిలుస్తా నన్నావ్ కదురా బాడుకవ్! పిలువ్! ఆ పోలీస్ బాడుకవ్ ఏం జేస్తాడో నేనూ జూస్తా- నీ యవ్వ పిల్వండ్రా!" మరింత రెచ్చిపోతూ అరిచిందామె.

అతి భయంకరమయిన ఇరకాటంలో పడిపోయాము. తప్పు చేశామని క్షమార్పణ చెప్పుకుంటేనే తప్ప ఆమె చేతి నుంచి తప్పించుకునే మార్గం లేదని తెలిసిపోయింది. అయినా అంతహీన స్థితికి దిగజారడానికి మనసొప్పడం లేదు.

"ఆళ్ళు ఆ దూరదర్శన్ లో తూకాల గురించి జెప్తున్రు గదా! అజ్జాసి వచ్చుండొచ్చు లచ్చమ్మా"! అన్నాడు గిరిజాల జుట్టోడు నవ్వుతూ. ఆ డైలాగ్ తో మాకు పై ప్రాణాలు పైనే పోయినయ్.

"ఏరా దొంగ బాడుకవ్! దూరదర్శన్ లోజెప్పిన్రని రువాబ్ జేయనికి వచ్చినార్రా సాలే! నీయవ్వ- ఆ దూరదర్శనోడినీ తూకాలోడినీ, పోలీసోండ్లనీ ఇట్ల తోలు తీస్తాన్రా! సర్కారు తూకం కావాల్నంటే సర్కారోళ్ళ తానే కూరగాయలు కొనండ్రా! ఈడ ఊద్వడాని కొచ్చిన్రురా గద్దార్ సాలే-"

ఆ గిరిజాల వాడు పగలబడి నవ్వి తరువాత జోక్యం చేసుకున్నాడు- మా మీద జాలిపడి.

"పోనీ లచ్చక్కా! ఇడిసెయ్! ఇంకొక్కసారి ఫాల్తూ మాటలు జెప్పకుండా మంచిగ బుద్ధి జెప్పినవ్ గదా" అన్నాడు గిరజాల జుట్టువాడు.

అంతవరకూ వాడే విలన్ అనుకుంటున్న మాకు వాడా డైలాగ్ చెప్పడంతో దేవుడిలా కనిపించ సాగాడు.

"అరేయ్ బాడుకవులూ! ఇనండ్రి! ఇంకొక్కసారి తూకం గురించి మాట్లాడిన్రంటే మీ పెండ్లాలతాడు తెంపుతా! ఏమంటున్న" యాదగిరి చొక్కా వదిలేస్తూ అందామె.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది మాకు.

"పోండ్రి ఈడకెళ్ళి! అకల్ లేదు సాలేగాండ్లకు" నీ యవ్వ మినిష్టర్లు, చీఫ్ మినిష్టర్లు, ప్రైమినిష్టర్లు, లక్షల కోట్లు-కోట్లు తింటున్రు! ఆళ్ళనే మననికి దమ్ము లేదుగానీ, కూరగాయలమ్మేటోళ్ళు తూకంలో తక్కువ జేసిన్రని రువాబ్ జేయనికొస్తారు గలీజ్ బాడుకవ్ లు!" అన్నాడు గిరిజాలవాడు.

మేమందరం అక్కడి నుంచీ ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా బయటకు పారిపోవాలన్న ఆలోచనలో వుండడం చేత అతని మాటలు ఏమాత్రం పట్టించుకోకుండా వెనక్కు తిరగాము.

వెనక్కు తిరగామో లేదో "థూ- పొద్దుటేల్ పొద్దుటేల్ దందా అంతా ఖరాబ్ జేసిన్రు దొంగబాడుకవ్ లు" అంటూ మా వీపుల మీద తుపుక్కున పాన్ నమిలిన ఉమ్మేసిందామె. ఆ పాన్ ఉమ్ము వెచ్చగా వీపుకి తగిలినా వెనక్కు తిరిగి చూడకుండా వేగంగా నడిచాము.

మమ్మల్ని చూసి మిగతా కూరగాయల వాళ్ళందరూ ఆనందంగా నవ్వుకోవడం మాకు కనబడుతూనే వుంది.

"యేయ్! ఇగో అరే బాడుకవ్! ఈడ సర్కారీ తూకం రాళ్ళున్నాయ్! ఈడ కొనుక్కో" అంటూ హేళన చేస్తూ కొంతమంది మమ్మల్ని చూసి అరవసాగారు.

మాతోపాటు నడుస్తున్న పెద్దమనిషి మామీద జాలిపడ్డాడు. అతనే మేము లచ్చమ్మతో పేచీపడే ముందు ఆమె దగ్గర ఆలుగడ్డలు కొంటూన్న వ్యక్తి.

"వీళ్ళతో పేచీపడటం మంచిది గాద్సార్! ఇజ్జత్ తీసేస్తారు" అన్నాడతను సానుభూతితో.

"ఆ లచ్చమ్మకు ఎట్ల బుద్ధి చెప్తానో చూడండి! ఇప్పుడే వెయిట్స్ అండ్ మెజర్ మెంట్స్ ఆఫీస్ కెళ్ళి కంప్లెయింటిస్తాను. కూరగాయలు మార్కెట్లోని రాళ్ళన్నీ ఎట్లా మార్చరో చూస్తాను" అన్నాడు చంద్రకాంత్ కసిగా.

"ఆ డిపార్ట్ మెంట్ ఇన్ స్పెక్టర్ ని ఇప్పుడే వెంబడి పెట్టుకుని తీసుకొద్దాం" అన్నాడు రంగారెడ్డి.

"అంతేకాదు! దానిమీదా, ఆ గిరిజాల జుట్టువాడి మీదా పోలీస్ కంప్లెయింట్ కూడా ఇద్దాం" అన్నాడు శాయిరామ్ కసిగా.

"ఎవరొచ్చినా ఏం చేస్తారండీ! మీరూరికే ఆవేశపడుతున్నారు గానీ అసలిలాంటి విషయాల్లో తలదూర్చ కూడదు. మనం వాళ్ళతో పేచీపడితే మళ్ళీ ఆ ఇన్ స్పెక్టర్ ముందే మీ చొక్కా పట్టుకుంటారు. అప్పుడేం జేస్తారు?"

నాకు అతడి మాట వింటూనే భయం వేసింది.

"అవును రెడ్డీ! మనం అలాంటి వాళ్ళతో గొడవ పడకపోవటం మంచిది" అన్నాడు ఉచితంగా సలహా ఇస్తూ.

"ఉహు! ఇంత అవమానం జరిగాక ఆ లచ్చమ్మను వదల్డానికి వీల్లేదు! పదండి వెయిట్స్ అండ్ మెజర్ మెంట్స్ ఆఫీస్ కెళ్దాం" అన్నాడు గోపాల్రావ్.

"అవ్! బరాబర్ దానికి బేయిజ్జత్ గావాలె" అన్నాడు యాదగిరి.

"మాపక్కతను జేబులో నుంచి తన అయిడెంటిటీ కార్డు తీసి మాకు కనిపించేట్లు చూపించాడు.

అందరం ఆ కార్డుమీద అతని పేరూ, డెజిగ్నేషనూ చూడగానే ఉలిక్కిపడ్డాం.

అతను వెయిట్స్ అండ్ మెజర్ మెంట్స్ డిపార్టుమెంట్ లో ఆఫీసరే.

"అదేమిటి సారు మీరు కూడా ఆ కంకర్రాళ్ళ తూకంతోనే కూరగాయలు కొంటున్నారా?" ఆశ్చర్యం నుంచి కోలుకుంటూ అడిగాన్నేను.

అతను చిరునవ్వునవ్వాడు.

"లేకపోతే మీలాగా తిట్లు తిట్టించు కోమంటారా?"

మేము అతనిని అక్కడే వదలి మరింత వేగంగా కాలనీ వేపు బయల్దేరాం.

ఇంటికి చేరుకునేసరికి మా కాలనీ ఆడాళ్ళందరూ గుంపుగా నిలబడి ఏదో విషయం చర్చించుకుంటూ కనిపించారు. అందరి మొఖాలూ వాడిపోయి వున్నాయ్.

"ఏంటి? ఏం జరిగింది?" అడిగాడు  గోపాల్రావ్.

"ఏముంది? రిబేట్ ఇచ్చే షాపుల్లో మోసం వుందని దూరదర్శన్ లో చూపించారు కదాని అస్సలు రిబేట్ లేని షాప్ కెళ్ళాం. తీరా ఇంటి కొచ్చాక చూస్తే అక్కడ కొన్న బట్టలన్నీ సెకండ్స్! ఒక్క బట్టక్కూడా పోగులు సరిగ్గాలేవు- కొన్ని లోపల రంగులు వెలసిపోయి వున్నాయ్. వెనక్కు తిరిగివెళ్ళి అడిగితే ఒకసారి అమ్మిన బట్టలు వెనక్కు తీసుకోమని అన్నాడు. ఆ రిబేట్ లో బట్టలు కొన్న సరస్వతమ్మ గారి బట్టలన్నీ బ్రహ్మాండంగా వున్నాయ్- తక్కువ ధరలో కూడా దొరికాయట" అందామె విచారంగా.

"ఇంతకూ మీ సంగతేమయింది? కూరగాయలు తేలేదేం?" అడిగింది సావిత్రమ్మగారు మా చేతిలోని ఖాళీ సంచులు చూస్తూ.

మాకేం చెప్పాలో తెలీలేదు. ఏం చెప్పాలన్నా, కోపం, అవమానం మా మీద మాకే జాలీ- అన్నీ కలగాపులగమయి నోట మాటరాకుండా చేస్తున్నాయ్.

"నీ యవ్వ దూరదర్శన్" అంటూ హఠాత్తుగా బూతులు తిట్టడం ప్రారంభించాడు చంద్రకాంత్.

మేమందరం కూడా అతనితోపాటు వంత కలిపాం.

"ఈ గవర్నమెంట్ ని ఎన్నుకున్నదెందుకు మనం! ఏ రంగంలోనూ మోసం, అన్యాయం జరక్కుండా చూడమని. కానీ ఈ నా కొడుకులు మనికి చెప్తారేమిటి- మోసాలకూ, అన్యాయాలకూ గురికావొద్దని! అంతా మనమే చూసుకుంటే ఈ బోడి గవర్నమెంటు ఎందుకింక? థూ! తప్పుడు పార్టీలు, తప్పుడు నా యాళ్ళు!" అంటూ తన దారిన తనూ తిట్ట సాగాడు రంగారెడ్డి.

"ఈపాడు టీవీ నా కొంప కూడా ముంచింది సార్! మా అమ్మాయికి పదిహేడో ఏట మంచి సంబంధం వస్తే పద్దెనిమిదేళ్ళు రాందే పెళ్ళిచేయడం చట్టరీత్యా నేరమని చెప్పి పంపించేశాను. ఇప్పుడు దానికి పెళ్ళి సంబంధాలు రావడం లేదు. ఇప్పుడు దాని పెళ్ళెవడు చేస్తాడు? వయసు తెగపెరిగిపోయింది" అంటూ విలపించసాగాడు మా కాలనీ పెద్దమనిషి ఒకాయన.

* * * * *

# మాక్ పార్లమెంట్

మా కాలనీలో స్టూడెంట్స్ కోసం మా కమిటీ అప్పుడప్పుడు వాళ్ళకి ఉపయోగపడే కార్యక్రమాలు కండక్ట్ చేస్తుందన్న విషయం మీకు గుర్తుండే ఉంటుంది.

అందులో భాగంగానే సెక్స్ ఎడ్యుకేషన్స్ కార్యక్రమం నిర్వహించటం, అది అభాసుపాలవటం అందరికీ తెలిసిన సంగతే! అదసలు ఎడ్యుకేషన్ కాదు- పరమ బూతు ప్రోగ్రాం అని కాలనీ వాళ్ళందరూ మమ్మల్ని ఆ తరువాత కొద్ది రోజులపాటు చీల్చి చెండాడేశారు.

అంచేత ఈ సారి అలా అభాసుపాలయ్యే కార్యక్రమాల జోలికిపోకుండా కొంచెం డిగ్నిఫైడ్ గా ఉండే ప్రోగ్రాం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. కానీ అదేమిటో ఓపట్టాన తెమలలేదు.

"క్విజ్ ప్రోగ్రాం పెడదాం- కావాలంటే ఫైనల్ రౌండ్ కి టీవీ కవరేజ్ కూడా ఇప్పించవచ్చు" అన్నాడు చంద్రకాంత్.

అందరూ అతని వేపు చిరాగ్గా చూశారు.

"టీవీలో క్విజ్ ప్రోగ్రామ్స్ తోనే తలనొప్పిగా ఉంటే మళ్ళీ ఇక్కడ కూడానా?" విసుక్కున్నాడు రంగారెడ్డి.

"పోనీ నేను స్టూడెంట్స్ అందరికీ యాక్టింగ్ కోర్స్ లు కండక్ట్ చేస్తాను. యాక్టింగ్ లో నేను సుప్రీమ్ కదా! ఈ మధ్య నేను "రెండో మొగుడు-మూడో ప్రియుడు" సినిమాలో సబిన్ స్పెక్టర్ వేషం వేసినప్పుడు నా డైలాగ్ డెలివరీకి సెట్లో వున్న వాళ్ళంతా ఆపకుండా రెండు నిమిషాలు క్లాప్స్ కొట్టిన విషయం మీకూ తెలుసు!" అన్నాడు జనార్ధన్.

"మాకా విషయం తెలీదే" అన్నాడు శాయిరామ్.

"తెలీదా? అన్ని పేపర్లోనూ సినిమా కాలమ్ లో వేశారు మరి- మీరు ఆరోజు పేపర్స్ చూళ్ళేదేమో-"

అందరూ అనుమానంగా మొఖాలు చూసుకున్నారు.

వాళ్ళకు టైమిస్తే పరిస్థితి రివర్స్ అవుతుందేమోనని డౌటొచ్చి మళ్ళీ అందుకున్నాడతను.

"కేవలం నా పాత్ర వల్లే సినిమా యాభై రోజులు ఆడుతుందని బయ్యర్స్ అందరూ ముక్తకంఠంతో ప్రొడ్యూసర్ తో చెప్పారట-" గర్వంగా అందరి వేపూ చూశాడతను.

"నిజమే అయుంటుందిలే- మేము నమ్ముతున్నాం! ఎందుకంటే- యాక్చువల్ గా ఆ సినిమా రెండొందల్రోజులు ఆడాల్సింది గానీ ఆ పాత్ర నువ్ వేయటం వల్ల యాభై రోజులే ఆడుతుందని వాళ్ళు అనుకుని ఉంటారు" అన్నాడు రంగారెడ్డి.

అందరూ కేకలూ ఈలలూ వేయడంతో అతను అర్జంటుగా వెళ్ళిపోయారక్కడి నుంచి.

"పోనీ రికార్డ్ డాన్స్ ప్రోగ్రామ్స్ పెడదాం" అన్నాడు శాయిరామ్. "అవయితే అందరూ తెగ ఎంజాయ్ చేస్తారు-"

ఆ మాటకు స్టూడెంట్స్ అంతా ఉత్సాహంగా తప్పట్లు కొట్టి శాయిరామ్ ని సపోర్ట్ చేశారు గానీ మిగతా వాళ్ళంతా ససేమిరా వీల్లేదని పట్టుపట్టారు.

"ఇలాంటివి చూళ్ళేక ఛస్తున్నాం! అయినా దానివల్ల పిల్లలకేమయినా విజ్ఞానమా, వంకాయలా? అలాంటి చెత్తవద్దు" అంటూ అరచారు పెద్దాళ్ళు.

చాలాసేపు తర్జనభర్జనలు తర్వాత చివరకు ఒక ఫ్రీడమ్ ఫైటర్ గారు లేచి మైక్ ముందుకొచ్చిసలహా ఇచ్చాడు.

"నన్నడిగితే- అడగరని తెలుసనుకోండి- ఒకవేళ అడిగితే- అయినా ఇంతవరకూ ఎప్పుడయినా నాలాంటి ఓల్డ్ పీపుల్ సలహా అడిగారు కనుకనా, ఇప్పుడడగడానికి - అయినా గానీ- ఒకవేళ ఇప్పుడు అడిగితే..."

అలా సైలెంట్ గా ఊరుకుంటే అతను తన చాదస్తంతో మమ్మల్ని చీల్చి చెండాడతాడని మాకు అనుభవ పూర్వకంగా తెలుసు కాబట్టి ఒక్కసారిగా ఆయన స్పీచ్ కి అడ్డుపడ్డాం-

"స్పీచ్ వద్దు! మీ సజెషన్ ఏమిటో ఒక్క ముక్కలో చెప్పి దిగిపోండి" కొంచెం కటువుగానే అన్నాడు గోపాల్రావ్.

"ఇంతకాలం మీరు నిర్వహిస్తోన్న చెత్త ప్రోగ్రామ్స్ అన్నీ చూశాక ఇవాళ ఈ సలహా ఇవ్వాలనిపించింది-"

"ఒక్క ముక్కలో చెప్పమన్నాం కదండీ- మళ్ళీ సాగదీస్తారెందుకు?" అరచాడు చంద్రకాంత్.

"మీరు ఫ్రీడమ్ ఫైటర్ నని ఎన్నిసార్లు చెప్పినా, ఇక్కడ నమ్మేవారెవరూ లేరు- ఎందుకంటే మీ ఆవిడే చెప్పింది- మీరు తెల్లోడింట్లో తోటపని చేస్తూండేవారని..."

అతనికి కోపం వచ్చింది.

"మీరు వట్టి తెలివి తక్కువ వెధవలు! నా మాట నమ్ముతారా, మా ఆవిడ మాట నమ్ముతారా?"

"మీ ఆవిడ మాటలే నమ్ముతాం" ఖరాఖండీగా చెప్పాడు రంగారెడ్డి. "ముందు మీ సజెషన్ ఏమిటో చెప్పండి-"

"నా సలహా ఏమిటంటే- మనం ఎంతో కష్టపడి స్వాతంత్ర్యం సంపాదించుకున్నాం! ఎన్నికలు నిర్వహించుకున్నాం! పార్లమెంటు ఏర్పరచుకున్నాం- పార్లమెంట్ లో వేసే ప్రశ్నలు, సమాధానాలు, చర్చలు, ఓటింగ్ పద్ధతులు- ఇవన్నీ భావిభారత పౌరులకు తెలియాలంటే మాక్ పార్లమెంట్ ప్రోగ్రాం చేయించండి! దానివల్ల కాలనీలో అందరికీ కూడా మన పార్లమెంట్ గురించీ, పార్లమెంట్ మెంబర్స్, మంత్రులు, స్పీకర్ గురించీ, వాళ్ళు తీసుకొచ్చే చట్టాల గురించీ మన డెమోక్రసీ గురించీ అన్నీ వివరంగా తెలుస్తాయ్."

అందరూ తప్పట్లు కొట్టారు.

"మంచి సలహా! అదే ప్రోగ్రాం కావాలి!" అరచారు కొందరు.

"నిజంగానే మంచి అయిడియా!" అంటూ మైక్ అందుకున్నాడు శాయిరామ్.

"ఈ రోజుల్లో వస్తోన్న చెత్త సినిమాలు, టీవీ ప్రోగ్రామ్స్ వల్ల ఈ జనరేషన్ నాశనమయి పోతోంది కాబట్టి- పిల్లలను కరెక్ట్ పాత్ లో పెట్టాలంటే మాక్ పార్లమెంట్ లాంటి ప్రోగ్రామ్స్ ఎంతో అవసరం!"

అందరూ ఆనందంగా వప్పుకోవడంతో మాక్ పార్లమెంట్ నిర్వహించడానికి నిర్ణయం జరిగిపోయింది.

రంగారెడ్డి మైక్ ముందుకొచ్చాడు.

పార్లమెంట్ గానీ, రాష్ట్ర అసెంబ్లీగానీ ఎలా నిర్వహింపబడతాయో, మన కాలనీ జర్నలిస్ట్ గోపాల్రావ్ గారు విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తారు" అన్నాడతను.

అతని మాట పూర్తి కాకుండానే విద్యార్థులంతా నినాదాలు చేశారు.

"మాకేం ట్రైనింగ్ అక్కర్లేదు- మేము పార్లమెంట్ సమావేశాలు టి.విలో చూస్తూనే వున్నాం! న్యూస్ పేపర్లలో చదువుతూనే వున్నాం! కనుక ఈజీగా చేసేయగలం" అంటూ అరచారు ఆవేశంగా.

అయితే వాళ్ళలా వయొలెంట్ గా రియాక్ట్ అవడానికి ఒక కారణం వుంది.

అంతకు ముందోసారి కాలనీ స్టూడెంట్స్ కి "జర్నలిజం" క్లాసులు కండక్ట్ చేశాడు గోపాల్రావ్- అతని వాగ్ధాటికి - మొదటి క్లాస్ మొదటి అరగంటలోనే విద్యార్థులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పారిపోయారు.

అది గుర్తుంచుకునే ఇప్పుడిలా గోపాల్రావ్ క్లాసులకు వ్యతిరేకంగా అరచి ఉంటారని మాకు అర్థమయింది. అయితే ఆ మాట బయటకు చెప్పలేదు.

చెప్తే గోపాల్రావ్ ఫీలవుతాడు.

"అయితే మాక్ పార్లమెంట్ కండక్ట్ చేయడానికి నెలరోజులు టైమివ్వ మంటారా?" అడిగాడు రంగారెడ్డి.

విద్యార్థులంతా నవ్వారు.

"నెలా? 48 గంటలు చాలంకుల్- ఎల్లుండి ఆదివారం కదా! ఆరోజు చేసేద్దాం-"

ఆదివారం ఉదయం పదిగంటల కల్లా కాలనీలో ఆడామగా అంతా వేదిక దగ్గర కిటకిట లాడిపోయారు. చాలామందికి పార్లమెంట్ లోనూ, అసెంబ్లీలోనూ ఏం జరుగుతుందో సరిగ్గా తెలీక పోవటమే అందుక్కారణం. సమావేశం పదిన్నరకల్లా ప్రారంభమై ఒకటిన్నరకు ముసిగిపోవాలని స్పీకర్ పాత్రలో ఉన్న స్టూడెంట్ ఎనౌన్స్

చేశాడు.

"ప్రతి సెషన్ లోనూ మొదటి గంట ప్రశ్నోత్తరాల కోసం కేటాయింపబడుతుంది. గనుక ఇప్పుడు ప్రశ్నలు సమాధానాలు ప్రారంభించవచ్చు-"

ముందుగా ఒక స్త్రీ మెంబర్ లేచి నిలబడింది.

"అధ్యక్షా ! మొన్న జరిగిన ఎలక్షన్లో రూలింగ్ పార్టీ పెద్ద ఎత్తున రిగ్గింగ్ చేసినట్లు మాకు రుజువులు దొరికాయ్- అంతేకాదు. రూలింగ్ పార్టీ ఎమ్మెల్యేలు డబ్బు పంచుతూండగా తీసిన వీడియో కాసెట్లు కూడా మా దగ్గరున్నాయ్-"

ఆమె మాటలు పూర్తి కాకుండానే రూలింగ్ పార్టీ వాళ్ళందరూ విరుచుకుపడ్డారు.

"ఏమ్- ఏంటే ఆ కూతలు? నువ్వూ నీ పార్టీ చేసిందేమిటి? ఎలక్షన్ ముందురోజు ఓటర్లందరికీ మందు బాటిల్స్ పంచిపెట్టలేదంటే నువ్వు? ఆ ఫోటోలు కూడా మా దగ్గరున్నాయే-"

దాంతో ఆ స్త్రీ ఉగ్రురాలయింది.

"అరే నంగా బాడుకవ్! నువ్ తీసిన ఫోటోలన్నీ బోగస్ ఫోటోల్రా! నీ మనుషుల్నే పెట్టి తీయించిన ఫోటోల్రా అవి!"

దాంతో రూలింగ్ పార్టీ వాళ్ళందరూ ఆమె వేపు దూసుకొచ్చారు.

"జుట్టు ఊడదీసి తంతా లం.."

స్పీకర్ హడావుడిగా లేచాడు.

"దయచేసి కూర్చోండి! ప్లీజ్ కోర్చొన్డిగ్ ప్లీజ్- ఆ మాటలన్నీ రికార్డుల నుంచి తొలగించబడతాయ్-" అంటూ అరుస్తున్నాడు. అతని అరుపులు పట్టించుకోకుండా అందరూ మొండా మార్కెట్లో లాగా పెద్దగా అరవటం మొదలుపెట్టారు. స్పీకర్ మాటలెవరూ వినిపించుకోవటం లేదు.

మూడు పార్టీల వాళ్ళూ పోడియం దగ్గరకు దూసుకొచ్చారు. ఒకరినొకరు తోసుకుంటూ బూతులు తిట్టుకుంటుంటే మార్షల్స్ వచ్చి అందరినీ విడదీశారు.

గొడవ సర్దు మణగ్గానే ఒక విద్యార్థి అపోజిషన్ బెంచీల్లో నుంచి లేచి నిలబడ్డాడు.

"అద్దెక్షా! మా జిల్లాకలెక్టరు, ఎస్పీ, మాజీ ఎమ్మెల్యే కొడుకూ కలసి సిండికేటయి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి పనులు చేయకుండానే చేసినట్లు చూపించి నిధులన్నీ తినేశారు. అంతేకాదు, హైవే మీద వెళ్ళే వాహనాలన్నిటి దగ్గర టోల్ టాక్స్ అక్రమంగా వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగినోడిని మర్డర్ చేయిస్తున్నారు. కిందటి నెల మా ఊళ్ళో సోంరెడ్డిని మర్డర్ చేసింది ఈ సిండికేటే అద్దెక్షా!..."

అంతవరకూ మాట్లాడగానే రూలింగ్ పార్టీ వోళ్ళు పదిమంది లేచి నిలబడ్డారు.

"ఒరే సూదిరెడ్డీ! నోటికొచ్చినట్లు కూశావంటే మక్కెలిరగదంతా! నీయవ్వ- కంట్రాక్టర్ల దగ్గర నువ్వూ తిన్నావ్ కదురా- పతివ్రతలా మాట్లాడుతున్నావేంది?"

"ఏంట్రా? నేను తిన్నాననా? ఇప్పుడే ఋజువు చెయ్యరా దమ్ముంటే- చెయ్యలేకపోతే ఇక్కడే అద్దెక్ష సాక్షిగా చెప్పు తీసుక్కొడతా-"

"ఏంది? సెప్పుచ్చుకొడతావా? నువ్ కొడతావుంటే ఈడేం గాజులు తొడుక్కున్నారనుకొన్నావా? నిన్నీ అద్దెక్ష కుర్చీ కిందే ప్రాణంతో పాతిపెడతారా-"

"రారా ఎవడెవడిని పాతిపెడతాడో సూద్దాం! రారా నా కొడకా- దమ్ముంటే రా-"

ఇద్దరూ చొక్కా చేతులు పైకి మడుస్తూ దగ్గరవుతూంటే మిగతా సభ్యులు వాళ్ళని సమాధాన పర్చడానికి ప్రయత్నించసాగారు.

"నువ్వూరుకో సూదిరెడ్డీ- ఆడి సంగతి బయట తేల్చుకుందాం-"

"నువ్ వెనక్కురా ఎంకటయ్య నాయుడూ! ఆడి కెట్టాగూ మన చేతిలోనే చావు రాసిపెట్టుందిలే! లిస్ట్ లో సోంరెడ్డి తర్వాతి పేరు ఈడిదే వుండి- టోల్ టాక్స్ ఆడి ముఠావోళ్ళు మాత్రం అయిదేళ్ళు తినలేదూ! నువ్వూరుకో-"

స్పీకర్ అరుస్తూనే ఉన్నాడు- గొంతు పగిలేట్లు-

"ఇదిగో ప్లీజ్- మీకేరా చెప్పేది. చిల్లర సాలేగాళ్ళలారా! ప్లీజ్- ఇదిగో- లంజాకొడకా- నువ్ మనిషివా- పసువ్వా?

ఇద్దరూ వెనక్కు తగ్గి మళ్ళీ తమ సీట్ల దగ్గర నిలబడ్డారు.

"అద్దెక్షా! నీకు తెల్సో తెలీదో- మా మాజీ ఎమ్మెల్యే గాడికి ఆ జిల్లా కలెక్టర్ స్వయానా బామ్మర్ది- అలాగే ఆ ఎస్పీ దూరబ్బంధువు- ఆది కంట్రాక్టర్లు లోకల్ గూండాలు- ఆళ్ళే టోల్ టాక్స్ బెదిరించి వసూలు చేస్తున్నారు. అందుకే ఆ కలెక్టర్నీ, ఆ ఎస్పీని బదిలీ చేయమని ఎప్పట్నుంచో కోరతన్నా! అయినా ఆ రెవిన్యూ మంతిరి ఆళ్ళకే కొమ్ము కాస్తున్నాడు, ఎందుకంటే ఆ మినిస్టర్ కీ ఆరు లక్షల్రూపాయలు నెలనెలా లంచాలిస్తున్నారు-"

దాంతో మినిష్టర్ కోపంగా లేచి నిలబడ్డాడు.

"ఇదిగో- మధ్యలో నా పెరేత్తావంటే పళ్ళు రాలగొడతా! నువ్ ఆ ఊళ్ళో పదేళ్ళ నుంచీ చేస్తున్న అక్రమాల లిస్ట్ నా దగ్గరుంది. అది బయట పెట్టానంటే పెజలే ఎంటపడి నడిరోడ్డున నరుకుతారు నిన్ను- నువ్ అరిచి తన్నుకు చచ్చినా సరే- ఆళ్ళను ట్రాన్స్ ఫర్ చేసే ప్రసక్తే లేదు- ఏం పీక్కుంటావో పీక్కో-"

స్పీకర్ లేచి నిలబడ్డారు.

"ఇలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సభా మర్యాదకు భంగకరం! ప్లీజ్ సిడౌన్! కూర్చోండి-"

"అది కాదు అద్దెక్షా- ఆ లంజాకొడుక్కేమయినా బుద్ధీ జ్ఞానెం ఉందా అసలు?"

"దయచేసి కూర్చోండి - ప్లీజ్ - కూర్చోండి ప్లీజ్- దయచేసి కూర్చోండి- ప్లీజ్ సిడౌన్- ప్లీజ్-"

"వాళ్ళు లోఫర్స్ లాగా మాట్లాడబట్టే నేనూ అలా మాట్లాడాల్సి వస్తోంది అద్దెక్షా-"

"దయచేసి కూర్చోండి ముందు-"

"నువ్ తొక్కలో మినిస్టరయినంత మాత్రాన కొమ్ములొచ్చినయ్యనుకోకు! నీ అంతు చూస్తా! నీ జాతకం బయట పెడతా-"

"ఏంట్రా నా జాతకం నువ్ బయట పెట్టేది- నేనేం చేసినా అన్నీ ఓపెన్ గానే చేస్తాన్రా! తప్పు చేసినా సరే- నా పెజలకు చెప్పి, ఆళ్ళ ఆశీర్వాదం తీసుకు చేస్తాన్రా- నీలాగా నిన్ను నమ్ముకున్నోడినే నడిరోడ్డు మీద మర్డర్లు చేసే వంశం కాదు మాది-"

"దయచేసి శాంతించండి! ఇద్దరూ కూర్చోండి ప్లీజ్ సిడౌన్-"

"ఏందిరా? నేను శాంతించాలా? ఆడూ నువ్వూ ఒకటే పార్టీ గదాని ఆడినే సపోర్ట్ చేస్తావా? ఈ కొశ్చెనేయడానికి నాకు అధికారం లేదా? ఇదిగో అద్దెక్షా! మూడు రోజుల కిందటే నేనీ కొశ్చెన్ రాసిచ్చా-"

"పోనీ ఈ కొశ్చెన్ ని మోషన్ గా ప్రవేశపెట్టండి! ప్లీజ్- నేను చెప్పేది వినిపించుకోండి- ఈ ప్రశ్ననే మోషన్ గా ప్రవేశపెట్టండి-"

"ఏంది? మోషన్ గా ప్రవేశ పెట్టాలా? ఏం? ఎందుకు మోషన్ తేవాలి! సప్లిమెంట్ కొశ్చెన్ ఏయడానికి నాకు అధికారం లేదా? అహ అధికారం లేదా అనడుగుతున్నా-" రాజ్జెంగం వప్పుకోదా? అహఁ నాకు తెల్వకడుగుతా?"

"నీయవ్వ- ఇదుగో అద్దెక్షా! నువ్వద్దెక్షయితే అవ్వచ్చు గానీ ఇలాంటి దగుల్బాజీ కూతలు కూయకు! ఆ నర్సిరెడ్డికి, సోదరికీ ఒక రూలూ నాక్కొక్కడికి ఒక రూలునా? ఆళ్ళనేమో ఇట్టమొచ్చిన కొచ్చెన్లేయనిస్తావ్, నేనేయబోతే మోషన్లూ, సప్పీల్ మెంట్లూ అంటూ అగ్గి పెడతావా? సెయిర్ మెన్లుగా ఆళ్ళనేసినందుకు ఆళ్ళు నీకు మామూళ్ళు కలెక్షన్లు సేసి ఇస్తున్నారనా ఈ వెధవ నాటకం? సర్లే! నీ సమాధానమూ వద్దు. ఆ మంతిరి సమాధానమూ వద్దు గానీ బయట సూసుకుంటానులే! నా కొచ్చెన్లకు సమాధానం ఎట్రాదో నేను చూసుకుంటాలే" అంటూ కూర్చున్నాడతను.

స్పీకర్ రెండోపేరు పిలిచాడు. వెంటనే అపోజిషన్ లో నుంచి మరో వ్యక్తి లేచి నుంచున్నాడు.

"అధ్యక్షా! ఈ మధ్య అదేదో న్యూసెన్స్ పేపర్లో లోఫర్స్ తుపాకుల కొనుగోలు విషయంలో వందకోట్లు కమీషన్, ప్రభుత్వంలో కొందరు మింగేసినట్లు రాశారని అదివరకే చెప్పా! ఎన్నిసార్లు కొచ్చెన్లేసినా ఆటిని ఎలవ్ చెయ్యట్లేదు. కారణం ఏంటి? మంత్రులందరికీ ఆ కమిషనులో వాటాలున్నాయి కాబట్టే ప్రభుత్వం అట్లా చేస్తోందని నేనంటున్నా!"

అతని మాట పూర్తి కాకుండానే ఒకేసారి అధికార పార్టీ సభ్యులు నలుగురు లేచారు.

"ఏరా బాడుకవ్! మేము మీ అపోజిషనోళ్ళ లెక్క నంగానాళ్ళ మనుకున్నావ్ బే! మీరు స్టేట్ ని రూలింగ్ గిట్ట జేసినప్పుడు మీరెన్ని దందాలు జేయలే! ప్రైవేట్ బస్సులను ఆర్టీసీకి కాంట్రాక్ట్ తీసుకున్నప్పుడు ఎన్ని పైసల్దిన్నరో మాతాన ఎకౌంట్ లేదనుకుంటిరా? హెల్ మెట్ కంపెనీ వాళ్ళ దగ్గర ఎన్ని పైసల్దిన్నారో మాకు ఎరుకలేదా? మన్మానే లాండ్ సీలింగ్ ల మినహాయింపులు, బదలాయింపులు దునియా దునియా జేసిన్రు! మీర్జేసినవన్నీ మాకెరుక! అయినగానీ మేము ఎప్పుడయిన కొశ్చెన్జేసినామా?"

అతను మాట్లాడటం పూర్తి అవుతూనే అపోజిషన్ లో మరికొంత మంది లేచి నిలబడ్డారు.

"అరేయ్ లక్ష్మణ్! జబాన్ సంబాల్ కే బాత్ కరో! ఎవన్నుంటున్నావ్ రా బాడుకవ్ అని! సాలే! ఇధరీ ఖతమ్ కర్ దేతూ-" అంటూ మినిష్టర్ వేపు చూసి అరిచాడొకతను.

మినిష్టర్ కి కోపం ఆగలేదు.

"నీ యవ్వ సదర్ బాడుకవ్! దమ్ హైతో మైదాన్ మే ఉతర్నారే! అక్కడకెళ్ళి లావార్స్ మాటలు మాటాడతావేం బే"

ఆ మాట వింటూనే అపొజిషన్ వాడు ఒక్క జంప్ లో డెస్క్ దూకి వెళ్ళి మినిష్టర్ గల్లా పట్టుకున్నాడు. మినిష్టర్ అతనిని ఎత్తి కింద పడేయటానికి ప్రయత్నించాడు గానీ అతనితో పాటు తను బోర్లాపడి పోయాడు. అది చూసి మిగతా వాళ్ళందరూ కలబడి కొట్టుకోసాగారు. కుర్చీలు ఎగిరి పడుతున్నాయి.

మరోపక్క స్పీకర్ కుర్చీల కిందనుంచి "మార్షల్! వీళ్ళను బయటకు గెంటండి!" అంటూ అరచాడు. అరచిన వెంటనే నలుగురు రక్షకభటులు వచ్చి స్పీకర్ మీద కూర్చున్న అపోజిషన్ మెంబర్లు ఇద్దరిని బలవంతంగా పక్కకు లాగారు.

వాళ్ళ దాంతో రెచ్చిపోయి ఆ మార్షల్ మీదకు దూకి పీక పిసకబోయారు. మార్షల్ పాపం ఆఖరి శ్వాస వదలబోతుండగా మిగతావాళ్ళు వచ్చి అతనిని వాళ్ళ బారినుంచి రక్షించారు.

మార్షల్స్ కి వళ్ళుమండి ఆ మెంబర్లు ఇద్దరినీ కాళ్ళూ చేతులూ కట్టి, కిందపడేసి బయటకు ఈడ్చుకెళ్ళసాగారు.

వాళ్ళిద్దరూ భయంకరంగా అరుస్తూ స్పీకర్ నీ, మార్షల్స్ నీ అసహ్యకరమయిన పదజాలంతో తిడుతున్నారు.

అందరూ నినాదాలు, తిట్లు కేకలతో వేదికంతా తిరుగుతూ డాన్స్ చేయసాగారు.

ఆ డాన్స్ ని మిగతావాళ్ళు సపోర్టుచేస్తూ ఈలలు వేస్తూ తప్పట్లు కొట్టసాగారు.

"వాళ్ళంతా పక్కా గూండాల్లాగున్నారు" అన్నాడు శాయిరామ్ నెమ్మదిగా.

ఈలోగా ప్రధానమంత్రిగానో, ముఖ్యమంత్రిగానో నటించిన వ్యక్తిని ఛాలెంజ్ చేస్తూ, తిడుతూ అతని దగ్గరకెళ్ళి నిలబడింది ఓ స్త్రీ మెంబర్.

అతని మొఖం కందగడ్డలా ఎర్రబడిపోయింది.

"నీయవ్వ! నిన్నుంచుకున్నోడిని రమ్మనే! ఆడికి సమాధానం చెప్తాం" అని అరుస్తున్నాడతను.

ఆమె ఆ మాటలకు మరీ రెచ్చిపోతోంది. ఈలోగా పోలీసులు వచ్చి వారందరినీ అరెస్ట్ చేసి బయటకు లాక్కుపోయారు ఈలోగా ఇంకెవరో వచ్చి బూతులు తిడుతూంటే స్పీకర్ అడ్డువెళ్ళాడు. స్పీకర్ జుట్టు పట్టుకున్నాడా మెంబర్. స్పీకర్ కేంచేయాలో తెలీలేదు. మార్షల్ ని పిలిచాడు మళ్ళీ. కాని మార్షల్ ఈసారి స్పీకర్ మాట వినిపించుకోనట్లు బయటకు వెళ్ళిపోసాగాడు.

స్పీకర్ గట్టిగా అరుస్తుంటే ఒకడు స్పీకర్ ముందున్న మైక్ తీసుకుని విరచి అందులో ఓ ముక్కతో స్పీకర్ తలమీద కొట్టాడు.

అంతవరకూ నిశ్శబ్దంగా కూర్చున్న ఆ స్త్రీ మెంబర్ వేపు నలుగురు ఎమ్మెల్యేలు పరుగెత్తి ఆమెను స్టేజీ మధ్యకు ఈడ్చుకొచ్చారు. ఒకడు ఆమె జుట్టు ఊడదీస్తుంటే మరొకడు చీర లాగేశాడు.

"ఏవే! మేము రిగ్గింగ్ చేసి గెల్చినామా? నీయవ్వ, నువ్ నీతిగా, నిజాయితీగా గెల్చినావా? ఎలక్షన్లే కాదే! నిన్ను కూడా రిగ్గింగ్ చేస్తామే! ఇప్పుడు నీ మొగుడెవడ్డొస్తాడో చూస్తాం! నిన్ను ఆ పాన్ డబ్బా నర్సింహగాడు ఉంచుకున్నాడన్న విషయం ఎవడికి తెలీదే! ఆడ్ని రమ్మను నిన్నిడిపించటానికి. సమజయిందా?"

"ఏంట్రా రాజిగా! ఏమంటాందిది? మహాచాలూ కేస్ రే! దీన్నొదలకు." ఆమె కెవ్వుకెవ్వున కేకలేస్తూ హాలంతా తిరుగుతూ సగం ఊడిన చీర పట్టుకుని పరుగెడుతోంది. రూలింగ్ పార్టీ వాళ్ళందరూ ఆమె వెనుకబడ్డారు.

యథేచ్ఛగా అతి భయంకరమయిన బూతులు మాట్లాడుతూ ఆమె వెనుక పరుగెడుతున్నారందరూ. అది కేవలం మాక్ పార్లమెంటనీ, వాళ్ళు చేసేదంతా సరదాకోసం చేస్తున్నారని మాకు గుర్తులేకుండా పోయిందా క్షణంలో.

హఠాత్తుగా ఆ స్త్రీ మెంబర్ ఇంక పరుగెత్తలేక ఆగిపోయింది. అమాంతం నలుగురు ఆమెను పట్టుకుని రేప్ చేయడానికి ప్రయత్నించసాగారు.

ఇంక మేము ఉండబట్టలేకపోయాము.

ఆ స్త్రీ మెంబర్ గా నటించిన డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి తల్లిదండ్రులు బిగ్గరగా అరుపులు, కేకలు పెట్టసాగారు.

"ఓర్నాయనో! మా బిడ్డను ఖరాబ్ చేస్తున్రు! రుకాయించండి! రుకాయించండి!" అంటూ వేదిక మీదకు పరుగెత్తారు.

కొంతమంది ఆడాళ్ళు ఆ దృశ్యాలకు భయపడి పిల్లలను ఎత్తుకుని ఇళ్ళకు పారిపోసాగారు.

ఇంకొంతమంది ఆ స్టూడెంట్స్ మాట్లాడే బూతులు విని కోపంతో అరుస్తూ, మా కమిటివాళ్ళను, మాక్ పార్లమెంట్ లో పాల్గొన్న కాలనీ స్టూడెంట్స్ ని తిడుతూ ఆపమని గొడవ చేయసాగారు.

మేమంతా ఇక నిశ్శబ్దంగా వుండలేక పార్లమెంట్ ఆట ఆపేయించాము.

స్పీకర్ నెత్తి నిజంగానే పగిలినట్లుంది. రక్తం వస్తోంది.

"ఏమిటిది? మీకేమయినా బుద్ధుందా? ఈసారి డిగ్నిఫైడ్ గా ఏదన్నా కార్యక్రమం ఏర్పాటు చేయించమని చెప్తే ఇంత అసహ్యకరమయిన బూతులు, రేప్ ఉ ప్రదర్శిస్తారా? ఇదేం ఫామిలీస్ వుండే కాలనీ అనుకున్నారా సినిమా హాల్ అనుకున్నారా?" అంటూ పార్వతీదేవి, సావిత్రీదేవి, చంద్రమతి అంతా మా మీద విరుచుకుపడ్డారు.

"మాకేం తెలుసు? భలేవారే మేరుగ మాక్ పార్లమెంట్ అయితే పిల్లా, పెద్దా, ఆడా, మగా అంతా కలిసి చూస్తూ ఎంజాయ్ చేస్తారనుకున్నాం. ఆ దొంగవెధవలు ఇలాంటి పిచ్చి పనులు చేస్తారని మాకేం తెలుసు?" ఎదురుతిరిగాడు శాయిరామ్.

"ఏమోయ్! ఏమిటా కొట్లాటలు, బూతులు, రేప్ లు? మీకేమయినా బుద్ధుందా?" అంటూ స్టూడెంట్స్ మీద విరుచుకుపడ్డాడు రంగారెడ్డి.

"అదేంటంకుల్! మాక్ పార్లమెంట్ ప్రదర్శించమని మీరేగా చెప్పింది?"

"అవునోయ్! అది సరిగ్గా చేయకుండా మధ్యలో ఈ తిట్లు, శాపనార్థాలు, రేప్ లు, ఏమిటి?"

"పార్లమెంట్ లోనూ, అసెంబ్లీలోనూ జరిగే సీన్లే చూపించాం అంకుల్! కొత్తవేమీ యాడ్ చేయనేలేదు. రేప్ సీన్ తమిళనాడు అసెంబ్లీలో జయలలితకు జరిగిందే కదా!"

"అంటే పార్లమెంట్ లోనూ, అసెంబ్లీలో ఇలాంటివి జరుగుతుంటాయా" అనబోయి నాలుక్కరుచుకున్నాన్నేను. ఎందుకంటే వాళ్ళు చేసినవన్నీ దేశంలో ఎక్కడో ఓ లెజిస్లేచర్ లో జరిగినట్లు నేనూ చదివాను. యాదగిరి మాత్రం కోపం అణచుకోలేకపోయాడు.

"ఏయ్! నీ యవ్వ- మంచిగ సదువుకొని, మంచి 'ఆదత్' ఉ చేస్కోమని చెప్తే ఇసంటి ఫాల్తూ కతలన్నీ చూసి ప్రాక్టీస్ జేస్తున్రా? పార్లమెంట్లు, అసెంబ్లీలు సూడమని ఎవళ్రా చెప్పిండు మీకు? మీకేం దమాక్ ఖరాబున్నదా? గావాల్నంటే డబల్ మీనింగ్ తెలుగు సినిమాలు జూడండ్రి! తెలుగు సినిమాల్ల బూతుపాటలు ఇనండ్రి! మేము కాదనమ్! కానీ ఇదేం శౌక్ రా పార్లమెంట్లు, అసెంబ్లీలూ చూసెడిది? పోండ్రి ఈడకెళ్ళి"

వాళ్ళంతా ఎవర్దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము కూడా మౌనంగా అక్కడినుంచి కదిలాం.

* * * * *

## సన్మాన సంఘం వస్తోంది

ఎన్జీఓల సమ్మె పుణ్యమా అని పొద్దున్న ఎనిమిదయినా ఇంకా ముసుగు తన్ని పడుకునే ఉన్నాను. హఠాత్తుగా తలుపు దడదడ కొట్టిన చప్పుడు వినిపించేసరికి నాకు వళ్ళు మండిపోయింది. చేయక చేయక సమ్మె చేస్తున్నప్పుడు కూడా మమ్మల్ని ప్రశాంతంగా ఇంటి దగ్గర గడపనీకుండా ఏమిటి గొడవ అని విసుక్కుంటూ వెళ్ళి తలుపు తెరచాను. ఎదురుగ్గా మామూలుగానే శాయిరామ్, రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి, చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్, రాజేశ్వరీ, పార్వతీదేవి, జనార్ధన్- అంతా నిలబడి ఉన్నారు.

"ఏమిటి?" అడిగాను కోపం అణచుకుంటూ.

"పదగురూ- ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టాం-" అన్నాడు యాదగిరి.

"ఎందుకు?"

"జనార్ధనన్నకు సన్మానం చేస్తున్రు మన కాలనీ వాళ్లు-"

నేను ఉలిక్కిపడ్డాను- "జనార్ధన్ కి సన్మానమా?"

"అవును" అన్నాడు రంగారెడ్డి చిరునవ్వుతో "పాపం- ఎంత కాలమని వాడినలా వదిలేస్తాం? అడ్డమైనాడూ సన్మానాలు చేయించుకుంటూంటే - పదహారు సినిమాల్లో హీరోగా నటించిన మనాడికి ఎందుకు చేయకూడదు? మన కాలనీలో ఉంటున్నాడనెగా మనకింత లోకువ?"

ఆ మాటకు జనార్ధన్ కొంచెం సిగ్గుపడ్డట్టు నటించాడు.

"పదహారు సినిమాలెక్కడున్నాయ్?" మరింత ఆశ్చర్యంగా అడిగాను.

"అదే అన్నా- పదిహేను సినిమాలు మధ్యలో ఆగిపోయాయ్- ఎప్పటికయినా గాని రిలీజవుతాయ్ లే-" అన్నాడు యాదగిరి.

"ఆ రిలీజయిన ఒక్క సినిమా కూడా ఒకే ఒక్కరోజు మాణింగ్ షో ఆడింది" కసిగా అన్నాడతను. జనార్ధన్ కి కోపం ముంచుకొచ్చింది.

"ఎవరన్నారా మాటా? రెండోరోజు కూడా ఆడింది- ఒంగోలులో" ఛప్పున శాయిరామ్ కల్పించుకున్నాడు.

"ఇప్పుడా స్టాటిస్టిక్స్ ఎందుకులే గురూ! ముందు ఎమర్జెన్సీ మీటింగ్ కి పద-" అన్నాడు నాతో. ఇంక గత్యంతరం లేక వాళ్ళ వెంబడి బయలుదేరాను.

కాసేపు తర్జన భర్జనలు తర్వాత జనార్ధన్ కి సన్మానం చేయటానికీ, ఆ సన్మాన సభలో అతగాడికి ఓ బిరుదు తగిలించటానికి నిర్ణయం జరిగిపోయింది.

"ఏం బిరుదు ఇద్దాం?" అడిగాడు రంగారెడ్డి.

"నట సామ్రాట్ జనార్ధన్-" అన్నాడు శాయిరామ్.

"ఛట్- అది అక్కినేని కిచ్చేశారయ్యా- అన్నాడు గోపాల్రావ్.

"పోనీ నటశేఖర- ఉత్సాహంగా అన్నాడు చంద్రకాంత్.

"అది కృష్ణకిచ్చేశారు-"

"నట సార్వభౌమ-"

"అది ఎన్టీ ఆర్ ది-"

"డాషింగ్ హీరో పడదాం-" అంది రాజేశ్వరి.

అందరూ నవ్వారు. అదీ కృష్ణదే!" అన్నాడు యాదగిరి.

"ఆ డేరింగ్ హీరో- డేరింగ్ హీరో" అంది పార్వతీదేవి.

"అది చిరంజీవిది."

"మరింకేం మిగిలేడ్చాయని మనాడికి? అన్నీ వాళ్ళే తీసేసుకున్నారు-" చికాకుగా అన్నాడు రంగారెడ్డి.

"బిరుదు సంగతి సరేగానీ అసలు మనకు ఈ సన్మానాలెలా చేయాలో అనుభవం లేదు కదా- ఎలా" తన అనుమానం వెలిబుచ్చాడు శాయిరామ్.

అవునవును! మన కాలనీలో ఎప్పుడూ ఎవరికీ మనం సన్మానం చేయలేదు- జరుగగా చూళ్ళేదు- అన్నాన్నేను.

అందరం ఆలోచనలో పడ్డాం కొద్ది క్షణాలు.

"పోనీ ఓ పని చేద్దాం-" అన్నాడు శ్యామల్రావ్ మెల్లగా మా గుంపులో జొరబడుతూ.

"ఏమిటది?" చిరాగ్గానే అడిగాను.

"చిక్కడపల్లిలో ఓ కల్చురల్ ఆర్గనైజేషన్ ఉంది. వాళ్ళు మధ్య మా ఫ్రెండ్ ఒకతనికి- వదలకుండా 48 గంటలు మందుకొట్టినందుకు సన్మానం చేశారు. అది ప్రపంచ రికార్డ్ ఆట. వాళ్ళ నడిగితే వాళ్ళే ఆ ఏర్పాట్లన్నీ చేసేస్తారేమో-

మాకూ ఆ అయిడియా బాగానే ఉందనిపించింది. అయితే శ్యామల్రావ్ లాంటి వాడి మాటలు నమ్మవచ్చా అని లోలోపల అనుమానంగా ఉన్నా - అప్పటికప్పుడే అందరం కలసి మూడు ఆటోల్లో చిక్కడపల్లి చేరుకున్నాం.

మురళీకృష్ణా కల్చురల్ అసోసియేషన్ అన్న బోర్డు వేలాడుతోంది బయట! మమ్మల్నందరినీ సాదరంగా లోపలకు ఆహ్వానించాడు దాని ఓనరు కుటుంబరావ్.

"మీ కాలనీ గురించీ, మీ గురించీ న్యూస్ పేపర్స్ లో చూస్తూనే ఉంటానండీ! ఎన్నోసార్లనుకున్నాను- మీ కమిటీ మెంబర్లందరికీ సామూహిక సన్మానం చేయాలని- ఆ విషయం గురించి మాట్లాడ్డానికి నేనే మీ కాలనీకి రావాలనుకుంటున్నాను" అన్నాడు ఆనందంగా. ఆ మాట వింటూనే శాయిరామ్ సంతోషంతో పొంగిపోయాడు.

"మీ ఇష్టం మీరంతగా కాదూ కూడదంటే- సరే- అలాగే కానీండి" అన్నాడు కొంచెంగా మెలికలు తిరుగుతూ. ఇదేదో కొంపల మీదకు రాబోతూందని పసిగట్టి వెంటనే సంభాషణను డైవర్ట్ చేసేశాను.

"ఆ సంగతి సరే గానండీ- ప్రస్తుతం మేమో ముఖ్యమయిన పనిమీద వచ్చాం!" అన్నానతన్తో.

"ఏమిటండీ అది?" కుతూహలంగా అడిగాడతను.

"మా జనార్ధన్ మీకు తెలుసు కదా- చాలా పెద్ద సినీహీరో-" అడిగాను.

"అయ్యో - తెలీక పోవటమేమిటండీ! మా వాళ్ళందరికీ అభిమానం అతనంటే. అతని సినిమా మేమంతా రెండుసార్లు చూశాం-" అతనిమాట అబద్ధం అని మాకు ఠక్కున తెలిసిపోయింది. అది ఒక్క షోయే కదా ఆడింది.

"అందులో నేను వేశాను" అన్నాడు యాదగిరి ఉత్సాహంగా.

"అవునవును- మీరు కూడా చాలా అద్భుతంగా నటించారు- మీ ఇద్దరివీ ఆటోగ్రాఫ్ లు తీసుకోవాలని ఎప్పటి నుంచో ప్రయత్నం-" అంటూ జేబులోనుంచి ఆటోగ్రాఫ్ పుస్తకం తీసి అప్పటికప్పుడే వాళ్ళిద్దరి ఆటోగ్రాఫ్ లూ తీసుకున్నాడు.

"సంగతేమిటంటే- మా జనార్ధన్ కి సన్మానం చేయాలని మా కాలనీ వాళ్ళందరికీ కోరిక కలిగింది. అందుకు మీ సహాయం అడుగుదామని-"

కుటుంబరావ్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"అయ్యో! మీరు అడగాలా! అది మా డ్యూటీ బాబూ! ఎక్కడ గొప్పతనం, టాలెంటూ ఉంటాయో అక్కడ సన్మానాలు చేయటం మా బాధ్యత- అర్థేగ మీరెళ్ళి పోండిక! ఎల్లుండి సాయంత్రమే సన్మానం! సరేనా?"

"మరి మేము ఏమేం ఏర్పాట్లు చేయాలో చెప్తే-..." నసిగాడు శాయిరామ్.

"అదంతా నాకొదిలేయండి- మీరు స్టేజీ, షామియానాలు ఏర్పాటు చేసుకుంటే చాలు- మిగతాదంతా మా అసోసియేషన్ చూసుకుంటుంది.

అందరం అతని మంచితనానికి, విశాల హృదయానికి ధన్యవాదాలు చెప్పి తిరిగి వచ్చేశాము. ఆ మర్నాటి నుంచే జనార్ధన్ కి సన్మానసభ ఏర్పాట్లు మొదలయిపోయాయ్.

గోపాల్రావ్ తన "ఈ క్షణం" పేపర్లో ఆ విషయం గురించి పెద్ద న్యూస్ అయిటమ్ వేసేశాడు.

రెండోరోజు సాయంత్రం అయిదయేసరికి కుటుంబరావ్ కార్లో వచ్చేశాడు కాలనీకి. అందరం అతని చుట్టూ మూగేశాము.

"ఇంకో అరగంటలో మావాళ్ళొచ్చేస్తారు" అన్నాడతను. అప్పటికే వేదిక ముందు మా కాలనీ తాలూకూ పిల్లా పెద్దా ఆడా- మగా అంతా కిక్కిరిసిపోయి ఉన్నారు. శాయిరామ్ మైక్ ముందు నిలబడి మామూలుగానే ఆ సన్మానం గురించి సన్మానానికి సంబంధంలేని విషయాలు మాట్లాడుతున్నాడు.

ఈలోగా ఒక వాన్ వచ్చి ఆగింది వేదిక దగ్గర. అందులోనుంచి చాలామంది బిలబిలమంటూ దిగి నిలబడ్డారు. అందులోనుంచి ఓ వ్యక్తి తిన్నగా వేదిక మీదకెళ్ళి శాయిరామ్ ని పక్కకు తప్పించి మైక్ అందుకున్నాడు.

"సోదరీ సోదరీమణులారా! ఈ మహత్తరమయిన సన్మాన సభకు అధ్యక్షత వహించవలసిందిగా శ్రీ కుటుంబరావ్ గారిని కోరుతున్నాను. అలాగే ఈ కాలనీ ప్రముఖులు శ్యామల్రావ్ గారిని వేదిక నలంకరించవలసిందిగా మీ అందరి తరపునా కోరుతున్నాను-"

సభలో కలవరం బయల్దేరింది.

"శ్యామల్రావ్ వేదికెక్కడానికి వీలులేదు-" అని అరచారు కొంతమంది.

ఇదేదో గొడవయేట్లుందని మేము అడ్డుపడి వాళ్ళు గొడవచేయకుండా ఆపాము. కుటుంబరావ్, శ్యామల్రావ్ వేదికెక్కారు. మరుక్షణంలో జనార్ధన్ ని ఓ సన్నాయి, మద్దెల మ్యూజిక్ తో మా రంగారెడ్డి తోడుగా తీసుకుని వేదిక మీదకొచ్చాడు. కుటుంబరావ్ అతనికి ఎదురెళ్ళాడు. ఓ పన్నెండేళ్ళ పాప హారతి పళ్ళెంతో సహా వాన్ దిగి పరుగుతో వేదికెక్కి జనార్ధన్ కి హారతి ఇస్తూ "స్వాగతం" అంటూ పాటపాడింది.

జనార్ధన్ ని ఓ మూల కుర్చీలో కూర్చోబెట్టారు. వాన్ లో నుంచి మరో వ్యక్తి దిగి దగ్గరకొచ్చి నిలబడి ఫోటోలు చడామడా తీసేయసాగాడు. వాళ్ళంతా ఎవరో ఇంత పకడ్బందీగా ఎలా ఏర్పాట్లు చేయగలిగారా అని ఆశ్చర్యపోతూ చూస్తున్నాం మేము. పురోహితుడు వచ్చి మంత్రాలు చదువుతూంటే శ్యామల్రావ్ లేచి జనార్ధన్ మీద శాలువా కప్పాడు.

వాడిమెడలో దండలేశాడు కుటుంబరావ్. అందరూ తప్పట్ల వర్షం కురిపించేశారు.

"ఇప్పుడు నగరంలోని వివిధ అభిమాన సంఘాలు తమ ప్రియతమ చలనచిత్ర హీరోని పూలమాలాంకితుడిని చేస్తారు-" అన్నాడు కుటుంబరావ్.

నేను ఆశ్చర్యంగా రంగారెడ్డి వేపు చూశాను.

"మనాడికి అభిమాన సంఘాలు కూడా ఉన్నాయా?"

"నాకూ అదే అర్థం కావటం లేదు- ఒకే ఒక్క అభిమాన సంఘం మన కాలనీలోనే ఉంది- అదీ జనార్ధనే బ్రతిమాలి ఏర్పాటు చేశాడు-"

"జనార్ధన్ ఫిలిమ్ పాన్స్ అసోసియేషన్ చికడ్ పల్లి" అంటూ మైకులో పిలిచాడతను. మా కాలనీ జనం మధ్యలో కూర్చున్న ఓ వ్యక్తి లేచి జనార్ధన్ మెడలో పూలదండలేశాడు.

"జనార్ధన్ ఫాన్స్ అసోసియేషన్ వైజాగ్."

మేమంతా ఉలిక్కిపడ్డాం- వీడికి దండలేయటానికి వాళ్ళు వైజాగ్ నుంచి వచ్చారా? ఓ వ్యక్తి ఫుల్ సూట్ లో వేదికమీదకొచ్చి జనార్ధన్ మెడలో దండలేసి వెళ్ళిపోయాడు.

ఈసారి "జనార్ధన్ ఫాన్స్ అసోసియేషన్ చికాగో-" అంటూ చదివాడు కుటుంబరావ్. మేము అదిరిపడ్డాం.

"చికాగోలో వీడికి అభిమాన సంఘమా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్రావ్.

మేం చూస్తుండగానే వేదిక పక్కనే నిలబడ్డ నల్లగా తుమ్మ మొద్దులా ఉన్న ఓ గిరిజాలవాడు స్టేజి ఎక్కి జనార్ధన్ మెడలో ఓ పెద్ద దండ వేశాడు. ఆ దండమీద "మేడిన్ చికాగో" అన్న అక్షరాలు కనబడుతున్నాయ్.

"వాడి మొఖం చూస్తుంటే అమెరికాలో ఉంటూన్న కళ ఏ మూలనయినా కనబడుతోందా?" అడిగాడు రంగారెడ్డి. ఈలోగా మరో పేరు వినిపించింది.

"జనార్ధన్ ఫిలిం ఫాన్స్ క్లబ్, హాంకాంగ్-

మరో సూటువాలా వచ్చి జనార్ధన్ మెడలో మరో పూలదండ వేశాడు. మాకు మతిపోతోంది. ఆ తతంగం చూస్తూంటే. అరగంట సేపు దండల కార్యక్రమం జరిగింది.

"ఇప్పుడు ప్రముఖ కవివర్యులు "కాంతిశ్రీ" గారు అభినందన కవితలు వినిపిస్తారు" అన్నాడు కుటుంబరావ్.

ముందు వరుసలో కూర్చున్న ఓ లావుపాటి యువకుడు రెండు కాగితాలు తీసుకుని స్టేజీ మీదకు చేరుకున్నాడు. అతను మైక్ ముందు నిలబడటంతోనే స్టిల్ ఫోటోగ్రాఫర్ ఫోటో తీయబోయాడు.

ఠక్కున తనూ వచ్చి ఫోటోలో పడేట్లు నిలబడ్డాడు శాయిరామ్.

కాంతిశ్రీ తన కవితలు చదవటం ప్రారంభించాడు.

"అన్నా జనార్ధనన్నా!
నువ్ వేశావెన్నో వేషాలు!
నీవు లేనిలోటు తీరదులే!
నువ్ పోయిన 'గాప్ పూడదులే! అంటూ విచారంగా పాడి ఆపాడు. అతనలా గద్గద స్వరంతో పాడుతుంటే మాకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. జనార్ధన్ కంగారుగా అతనివేపు చూచాడు.

"ఏమిటండీ- ఆ కవిత్వం- నేను ఉన్నాగా, ఎక్కడికో పోయానంటాడేవిటి?" అడిగాడు కుటుంబరావ్ ని దీనంగా.

కుటుంబరావ్ కవిని కంగారుగా పక్కకు పిలిచాడు.

"ఏయ్ ఏమిటోయ్ ఆ కవిత్వం- సరిగ్గా చూసి అఘోరించు-"

"సారీ సార్- కాగితానికి మొదటివేపు చదవాల్సింది రెండోవైపు చదివాను-" అన్నాడతను నొచ్చుకుంటూ. పొరబాటు సరిదిద్దుకుంటూ రెండోవేపు చదవసాగాడు.

"అన్నా జనార్ధన్నా!
నీ వేషాలకు మా జోహార్లు
నీ ఫీలింగ్స్ కి మా హేట్సాఫ్!
నటనే నీ ఊపిరిగా
ఊపిరే నీ నటనగా
వర్ధమాన నటీనటులకు నువ్ చుక్కానివి.
తెలుగు కళామతల్లికి రెండో ఎక్కానివి."

అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

కవివర్యుడు అందరికీ నమస్కరించి స్టేజి దిగాడు. వెంటనే మళ్ళీ మైకు దగ్గరకొచ్చాడు కుటుంబరావ్.

"ఇప్పుడు ప్రముఖ నటులు జనార్ధన్ గురించి ఆంధ్రుల అభిమాన నవలా రచయిత్రి శాంతిశ్రీ గారు ప్రసంగిస్తారు."

వెంటనే ఒకావిడ ముందు వరుసలో నుంచి చకచక నడిచి వేదికమీద కొచ్చింది.

మేమంతా మొఖమొఖాలు చూచుకున్నాం.

"ఆవిడ ఆంధ్రుల అభిమాన రచయిత్రా? ఆ పేరుతో ఒక్క రచనకూడా ఏ మాగజైన్ లోనూ చూళ్ళేదే," అంది రాజేశ్వరి హడావుడిగా మా దగ్గరకొస్తూ.

"అవును! నేనూ చూళ్ళేదు" అన్నాడు రంగారెడ్డి.

"సోదర సోదరీమణులారా! నేడు నిజంగా పర్వదినం! ఎందుకంటే నేడు పర్వదినం కాబట్టి! శ్రీ నాగవర్ధన్ గారికీ రోజు సన్మానం జరగటమంటే" జనార్ధన్ అదిరిపడ్డాడు. కుటుంబరావ్ చప్పున లేచి మైక్ దగ్గరకొచ్చాడు.

"నాగవర్ధన్ కాదమ్మా- జనార్ధన్, జనార్ధన్"

"ఓ సారీ! ప్రముఖ చలనచిత్ర నటులు శ్రీ జనార్ధన్ గారికి సన్మానం జరగటమంటే, తెలుగు ప్రజలు తమని తామే సన్మానించుకోవటమని నా అభిప్రాయం. శ్రీ గోవర్ధన్ గారు నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు-"

కుటుంబరావ్ మళ్ళీ మైకు దగ్గరకు పరుగెత్తాడు.

"అయ్యో గోవర్ధన్ కాదు తల్లీ- జనార్ధన్- జనార్ధన్-"

"ఓ- సారీ! సోదర సోదరీమణులారాా శ్రీ జనార్ధన్ గారు నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని నేను నా నవల "గతి తప్పిన మతి" లో 16వ పేజీలో 14వ లైనులో రాశాను- ఖచ్చితంగా అదే జరిగింది. రామవర్ధన్ గారు అయిదోక్లాసు చదువుతున్నప్పుడు!" జనార్ధన్ అదిరిపడి చూస్తున్నాడామె వేపు. "అబ్బా! రామవర్ధన్ కాదు- జనార్ధన్" అన్నాడు కుటుంబరావు.

"ఆ! సారీ జనార్ధన్ గారు స్కూల్లో ఓ నాటిక వేశారు. నాటిక పేరు "అంతా అబద్ధం"- అందులో ఆయన వేసిన పాత్రకు ప్రథమ బహుమతి ఇచ్చారు. ఆ తరువాత ఆయనిక వెనక్కు తిరిగి చూడలేదు. కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కూరగాయల మార్కెట్ శ్రీరామనవమి పందిర్లో ఆయన నటించిన 'విధి వంచితులు' నాటకం- కేవలం ఆయన ప్రతిభవల్లే- పధ్నాలుగు రోజులు వరుసగా ప్రదర్శించాల్సి వచ్చింది."

"అదేమిటి? జనార్ధన్ మన కాలనీ కొచ్చాకేకదా మొదటిసారిగా నాటకం వేస్తున్నానన్నాడు?" అడిగాడు రంగారెడ్డి.

"అదే అర్థం కావటం లేదు" అన్నాడు శాయిరామ్.

"ప్రతిభను ఎవరూ ఎంతో కాలం అణచలేరు. ఇదే విషయాన్ని నేను "అరచేతి నడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు" అని నా నవల "వికసించిన హృదయాలు- ముకుళించిన మనుషులు" లో 596వ పేజీలో 18వ లైనులో రాశాను- జనార్ధన్ గారిక్కూడా అచ్చం నేను రాసినట్లే జరిగింది. ఆయన నటనా ప్రతిభను అణచటం సినిమావాళ్ళ వల్ల కాలేదు. ఓరోజు ఆయన నారాయణ్ గూడాలోని రోడ్డు పక్కన మిరపకాయ బజ్జీలు తింటున్నప్పుడు ఓ ప్రొడ్యూసరు కార్లో వెళ్తూ చూసి వెంటనే తమ సినిమాలో హీరోగా తీసుకున్నారు. అంతే- ఈ రోజు ఆయన నూటపధ్నాలుగు చిత్రాల్లో నటిస్తున్నారంటే- ఆయనలో ఎంతటి ప్రతిభ ఉందో మీకే అర్ధమవుతుంది-"

114 చిత్రాలు అనేసరికి అందరూ ఒక్కసారి ఘొల్లున నవ్వారు కానీ ఆ నవ్వుల్నీ ఓవర్ లుక్ చేస్తూ వెనుకవేపు నిలబడ్డ గుంపు కరతాళ ధ్వనులతో మోతిక్కించేశారు.

"ఆ గుంపులో జనం ఎవరు? మన కాలనీ వాళ్ళల్లాలేరే" అడిగాడు గోపాల్రావ్.

"అవును! వాళ్ళు మనకాలనీ వాళ్ళు కాదు" అన్నాడు యాదగిరి.

"బహుశా మన జనార్ధనంటే మరీ అభిమానం అనుకుంటాను- అయిదు నిమిషాలకోసారి తప్పట్లు కొడుతున్నారు" అన్నాడు రంగారెడ్డి.

"కనుక సోదరీమణులారా! నా ఎనభై తొమ్మిదో నవల "పునరంకితులు" హీరో కూడా అచ్చం మన శ్యామ్ వర్ధన్ గారిలాగానే సినిమా హీరో అవుతాడు. అతని మేనగోడలు ఉమారాణి అతను తనను ప్రేమిస్తున్న విషయం తెలీక మనోహర్ అనే ఫుట్ బాల్ ప్లేయర్ ని ప్రేమిస్తుంది. కానీ మనోహర్ అప్పటికే రజని అనే బాస్కెట్ బాల్ ప్లేయర్ ని ప్రేమిస్తాడు-"

కాలనీవాళ్ళు అలవాటు ప్రకారం ఆ తరువాత ఆమెను మాట్లాడనీకుండా కేకలు వేసి దింపేశారు. వెంటనే ఇద్దరు స్త్రీలు భరతనాట్యం దుస్తుల్లో వేదిక మీద కొచ్చారు.

"ఇప్పుడు బేబీ సురేఖ, బేబీ విరేఖల అభినందన నృత్యం" అన్నాడు కుటుంబరావ్. అనడంతోనే వాళ్ళిద్దరు చెంగున గాలిలో కెగిరి దూకి నృత్యం ప్రారంభించేశారు.

"ఒకోళ్ళకూ కనీసం ముప్పయ్ అయిదేళ్ళుంటాయి- వీళ్ళు బెబీలా?" వికారంగా మొఖం పెట్టి అడిగాడు శాయిరామ్. అందరం ఘొల్లున నవ్వాం.

"ష్ ష్" అన్నాడు శ్యామల్రావ్ మా వేపు చూసి, జనార్ధన్ చుట్టూ తిరిగి డాన్స్ చేసేస్తున్నారు వాళ్ళు.

జనార్ధన్ బెరుగ్గా చూస్తున్నాడు వాళ్ళవేపు.

వాళ్ళ డాన్స్ కార్యక్రమం కూడా జనం గొడవ మొదలుపెట్టాకే ముగిసింది.

"ఇప్పుడు నగరం యువజన నాయకులు రాజేశ్వర్ గారు జనార్ధన్ విశిష్ఠతను గురించి మాట్లాడతారు. వెంటనే ఓ పావుపాటి వ్యక్తి తెల్లని లాల్చీ పైజామాతో స్టేజి ఎక్కాడు.

"సోదర సోదరీమణులారా! జనార్ధన్ గురించి మీకెరుకలేదు. బచ్ పన్ సే మై ఉస్ కా దోస్త్ హు! చాదర్ ఘాట్ బ్రిడ్జి దగ్గర మేము రోజూ కల్సుకుని ఇరాని హోటళ్ళ చాయ్ తాగుతుండె! గప్పుడే నేన్చిప్పినా ఆయనకు! "ఇదిగో- చూడు తంబి- నువ్వీడ ఉండకు, మద్రాస్ గిట్టపోతే మంచిగ సినిమా ఛాన్సులుగిట్ట దొరుకుతయ్-" అని! నా మాట మీద భరోస ఉంచి గట్లనే చేసిండు! గిప్పుడే మయింది మళ్ళా? మంచిగ హీరో అయిపోయిండు. గిట్లనే కొంచెం కోషిష్ జేస్తే సూపర్ హీరో అవుతాడు. సూపర్ హీరో అయితే ఇంకా కాన్దేమున్నది భాయ్! మస్తు పైసలు! అభిమాన సమ్ఘాలుగ చీఫ్ మినిష్టరు గూడా కావచ్చు- ఇయాళ్రేపు ఏమున్నది భాయ్? ఏమీలేదు. మనం ఎట్లనుకుంటే అట్ల జరుగుతది! గుడుంబ అమ్మేలోడు మా నారాయణ్! ఆడిగ్గూడా నిన్ననే మన కుటుంబరావ్ సారే సన్మానం జేసిండు! ఎంత మంచి మడిసతను? ఎవళ్ళడిగినా గాని గుడుంబ ఉదార్ కిస్తడు. గంతెందుకు? పాన్ డబ్బ ఈశ్వర్ ఎరుకనా మీకు? ఎమ్మెల్యే ఎట్లయ్యిండు? ఫిలిం ఫాన్స్ క్లబ్ షురూ చేసిండు మొదలు!..."

అంతా తప్పట్లు కొట్టి దించేశారతనిని.

"ఇప్పుడు జనార్ధన్ గారు తమకు లభించిన అవమానానికి- సారీ అభిమానానికి సమాధానం చెప్తారు-" అన్నాడు కుటుంబరావ్.

జనార్ధన్ లేచి మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! నిజానికి నాకు సన్మానాలంటే ఇష్టంలేదు. కానీ మన శాయిరామ్, రంగారెడ్డి, ఉదయార్కర్, గోపాల్రావ్, యాదగిరి, రాజేశ్వరి, పార్వతీదేవి, శ్యామల్రావ్ ఇంకా బోలెడు మంది మరీ బలవంతం చేయటం వల్ల వప్పుకున్నాను-"

అందరూ నవ్వేశారు. ఎందుకంటే సన్మానం చేయించమని జనార్దనే కాలనీ వాళ్ళందరినీ రెండు నెలలుగా బ్రతిమాలటం అందరికీ అనుభవమే.

"అసలు నేను- ఆ రోజున మద్రాస్ లో షూటింగ్ లో ఉన్నాను. అప్పుడు మన కాలనీ సెక్రటరీ శాయిరామ్ గారు ఫోన్ చేసి ఇలా సన్మానం ఏర్పాటు చేశామనీ, తప్పకుండా రావాలనీ అడిగినప్పుడు- నిజానికి నేను రావటానికి వీలులేని పరిస్థితుల్లో ఉన్నా- వెంటనే అంగీకరించాను. ఎందుకంటే నాకు నా అభిమానుల ప్రేమ ముఖ్యం! అందుకే ఆ షూటింగ్ కాన్సిల్ చేసుకుని వచ్చేశాను..."

"ఇంక చాల్లే దిగు" అరిచారు కుర్రాళ్ళు.

శాయిరామ్ వెళ్ళి ఆ కుర్రాళ్ళ మీద విరుచుకుపడ్డాడు.

ఆ తర్వాత నలుగురు పిల్లలు స్టేజిమీద కొచ్చి జనగణమన పాడారు.

కార్యక్రమం ముగిసింది. జనార్ధన్ పూలదండలన్నీ అతని భార్యా పిల్లలూ ఆనందంగా తీసుకెళ్ళారు.

మేమందరం కలిసి కుటుంబరావుని అభినందించాము.

"ఇంత అద్భుతంగా ఏర్పాట్లు చేస్తారనుకోలేదండీ! నిజంగా చాలా పెద్ద ఎత్తున జరపారు కార్యక్రమం. మీకెంతో ఋణపడి ఉన్నాం మా కాలనీ వాళ్ళం-" అన్నాడు శాయిరామ్.

అతను చిరునవ్వు నవ్వాడు.

"దాన్దేముందిలెండి! అంత టాలెంట్ ఉన్న వాళ్ళకు ఆ మాత్రం 'బూస్టప్' లేకపోతే ఎలా? ఈ దెబ్బతో చూడండి జనార్ధన్ గారికి తెగ ఆఫర్లొస్తాయ్-"

జనార్ధన్ మొఖం ఆనందంతో వెలిగిపోయింది.

"నిజంగా వస్తాయంటారా?" అడిగాడు ఉత్సాహంగా.

"రేపు అన్ని పేపర్లలో న్యూస్ వస్తుంది కదా- అప్పుడు తెలుస్తుంది- మీ తఢాఖా అందరికీ-"

"కానీ ఈ సన్మానం న్యూస్ ఎవరు పబ్లిష్ ఏస్తారు? మా గోపాల్రావ్ ఒక్కడే ఈ క్షణంలో" వేస్తాడు. అతనొక్కడే కదా అసలు సన్మానం చూడ్డానికొచ్చింది?"

అతను మళ్ళీ నవ్వాడు.

"శుద్ధ అమాయకుల్లాగున్నారండీ బాబూ! వాళ్ళు రావాలేమిటి? మనం ఏది రాసిస్తే అదే వేసుకుంటారు. పత్రికల వాళ్ళు చాలామంది మనాళ్ళే ఉన్నారండి బాబూ - అదంతా నేను చూసుకుంటాగా-"

పది నిమిషాల సేపు మాట్లాడాం గానీ వాళ్ళింకా వెళ్ళకుండా అక్కడే నిలబడడం మాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఇంక వెళ్ళిరండి పాపం- చాలా రాత్రయింది" అన్నాడు రంగారెడ్డి.

"మరి ఎకౌంట్స్ పూర్తిచేస్తే..." చిరునవ్వు చెరగకుండానే అన్నాడతను.

"ఎకౌంట్సేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అదే సన్మానం ఛార్జీలు" శాయిరామ్ పగలబడి నవ్వాడు. "భలే జోకేశారు-" కుటుంబరావ్ నవ్వలేదు.

"జోకు కాదు! సన్మానానికి ఛార్జీలు ఇస్తే..." అన్నాడు సీరియస్ గా.

"ఛార్జీలేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"అలా తెలీనట్లు మాట్లాడితే ఎలా సార్? అవతల ఆలస్యమయిపోతోంది..."

"మీరనేది నాకేం అర్థం కావటం లేదు" అన్నాడు గోపాల్రావ్.

"మీరు అలాగంటే ఎలాగండి? ఛార్జీలు లేకుండా సన్మానం ఎలా వుంటుంది. అందరూ ఇస్తున్నదే కదా! మీకు ప్రత్యేకంగా చెప్తున్నామా ఏమిటి?"

"అంటే ఇప్పుడు మా వాడికి మీరు చేసిన సన్మానానికి డబ్బివ్వాలా?" ఆశ్చర్యం అణచుకుంటూ అడిగాడు చంద్రకాంత్.

"లేకపోతే ఎలాగండీ మరి?"

మేమంతా మొఖాలు చూసుకున్నాం.

"మరీ విషయం ముంగటే చెప్పనుండె" అన్నాడు యాదగిరి.

"అందరికీ తెల్సిన విషయమే- మీకూ తెలుగు గానీ మీరు వేళాకోళా లాడుతున్నారు సార్-"

శ్యామల్రావ్ మధ్యలో కొచ్చాడిప్పుడు.

"నేను ఇంతకుముందు చాలామందికి చేయించాను కదా! వాళ్ళంతా డబ్బులిచ్చారు- మీరేం ఆలోచించనఖ్ఖర్లేదు-" అన్నాడు నచ్చజెప్తూ.

"కానీ మరి ముందే ఆ విషయం ఎందుకు చెప్పలేదు?"

"మీరెందుకు అడగలేదు?"

కొద్దిక్షణాలు అందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం.

జనార్ధన్ మొఖం పాలిపోయింది.

"సరే- ఎంతివ్వాలి?" అడిగాడతను.

"మొత్తం ఎనిమిదివేల అయిదొందలు-" అన్నాడతను.

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఏమిటి? అంతడబ్బా?"

"ఏ క్లాస్ సన్మానం రేటంతేమరి! నేనేం ఎక్కువ చెప్పలేదు- కావాలంటే మీరే రేట్ల టారిఫ్ చూడండి-" అంటూ తన బాగ్ లో నుంచి ఓ ఫోల్డర్ తీసి ఇచ్చాడు.

నేను తీసుకుని చూశాను

"ఏ" క్లాస్ సన్మానం- ఎనిమిది వేల అయిదొందలు-(ఫుల్ ట్రూప్)

"బి" క్లాస్ సన్మానం అయిదువేలు- (తక్కువమంది సభ్యులతో)

"సి" క్లాస్ సన్మానం - మూడువేలు- (నలుగురి బృందంతో)

"మాకు "సి" క్లాస్ దే చేయాల్సింది మరి-" అన్నాడు రంగారెడ్డి.

"మాకేం తెలుస్సార్! జనార్ధన్ గారు నిన్న సాయంత్రం మా ఇంటికొచ్చి 'ఏ' క్లాస్ కావాలని చెప్పారు"

అందరం కోపంగా జనార్ధన్ వేపు తిరిగాము.

"అబ్బే- నేనెప్పుడడిగానలా అని!" ఆశ్చర్యపోతూ అడిగాడు జనార్ధన్.

"భలేవారే సార్- నిన్న సాయంత్రం మాటల్లో సన్మానం "ఏ" క్లాస్ గా ఉండాలి అన్నారా- లేదా!"

జనార్ధన్ కి కోపం ముంచుకొచ్చింది.

"ఏ క్లాస్ గా అంటే నా ఉద్దేశం బాగా ఉండాలని! అంతే! మీ రేట్ల గొడవ నాకేం తెలుసు-" ఇదంతా చూస్తున్న యువజన నాయకుడు ముందుకొచ్చి జనార్ధన్ కాలర్ పట్టుకున్నాడు.

"మర్యాదగా మా డబ్బు ఇస్తావా- ఇయ్యవా?"

మేము అదిరిపడ్డాం.

"ఏమిటయ్యా ఇది- చొక్కా వదులు ముందు" అన్నాడు శాయిరామ్.

అతను జనార్ధన్ చొక్కా వదిలేశాడు.

"మర్యాదగా! మా డబ్బు ఇవ్వండి - లేకపోతే మంచిగుండదు-" అన్నాడతను.

జనార్ధన్ మా వేపు చూశాడు.

"గురూ- నేను తరువాత కట్టుకుంటాను ముందు ఎంతోకొంత వీళ్ళకిచ్చి పంపించేయండి-" అన్నాడు గాబరాగా.

నేనూ, రంగారెడ్డీ. శాయిరామ్, గోపాల్రావ్ పక్కకు వెళ్ళి మాలో మేము చర్చించుకున్నాం.

"మన కాలనీ ఫండ్ ఉంది కదా! అందులో నుంచి ఇచ్చేద్దాం! ఎందుకొచ్చిన గొడవ-" అన్నాడు శాయిరామ్.

"మరి మన కాలనీవాళ్ళు ఎందుకిచ్చారని అడిగితే ఏం చెప్తాం?" అడిగాను.

"తర్వాతి సంగతి తర్వాత చూసుకుందాంలే" అన్నాడు రంగారెడ్డి.

గోపాల్రావ్ కుటుంబరావ్ దగ్గరకు నడిచాడు.

"ఇదిగో చూడండి కుటుంబరావ్ గారూ! మరీ ఎనిమిది వేలంటే చాలా ఎక్కువండీ! కొంచెం తగ్గించు-" అన్నాడు దీనంగా.

"అవునండీ- మరీ అంతేసి ధరలు చెప్తే ఎలా? ఇదొక్కటే కాదు గదా ఇంకా ముందు ముందు బోలెడు సన్మానాలకు మీకు ఆర్డరిస్తాము" అంది రాజేశ్వరి.

"చూడమ్మా ఈ ఎనిమిదివేలూ నాకొక్కడికే రాదమ్మా- పాతికమందికి సర్దాలి- ఒక్కొక్కరికీ మూడొందల కంటే ఎక్కువరావు."

"పాతికమందెవరు?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"ఇదిగో సన్నాయి మద్దెల వాళ్ళకు తలో రెండొందలు! పురోహితుడికి రెండొందలు! జనార్ధన్ గారికి హారతి పట్టిన ఈ చిన్నారి పాపలకు తలో వంద! జనార్ధన్ గారి మీద పద్యాలు కట్టి చదివిన కవిగారికి నూటపదహార్లు, ఆయన గురించి వర్ణించి చెప్పిన నవలా రచయిత్రి గారికి రెండొందలు! యువజన నాయకులకు మూడొందలు! భరతనాట్యం చేసిన ఈ బేబీలకు తలో నూటపదహార్లు, తాళం వేసిన వారికి తలో అర్ధ నూటపదహార్లు, జనంలో నుంచి అడపా దడపా తప్పట్లు కొట్టిన యువకులకు తలో యాభై, దీనికి అధ్యక్షత వహించినందుకు నాకు వెయ్యి నూటపదహార్లు, అతిథిగా వేదికనలంకరించినందుకు శ్యామల్రావ్ గారికి నూటపదహార్లు ఇవిగాక మా వాన్ డ్రైవర్ కి వంద, పెట్రోలుకి యాభయ్- స్టిల్ ఫోటోగ్రాఫర్ కి రెండొందలయాభై-"

"ఇదన్యాయమండీ- ఇవన్నీ మేము ఏర్పాటు చేయమని అడగలేదు" అన్నాడు జనార్ధన్.

కుటుంబరావ్ మాకు మరింత సమీపంగా వచ్చి గొంతు తగ్గించాడు.

"ఇదిగో చూడండి సార్- ఏదో తెలిసిన వారన్న అభిమానం కొద్దీ చెప్తున్నాను. వెంటనే మీరు ఎవరిడబ్బు వాళ్ళకివ్వక పోయారంటే ఆ యువజన నాయకుడికి తిక్కరేగుతుంది. తిక్కరేగుతే ఏం జరుగుతుందో మీకు తెలీదు. ఆ తప్పట్లు కొట్టిన తన గాంగ్ నంతా మీమీదకు ఉసిగొల్పి కాలనీ అంతా నానారభసా చేయిస్తాడు. వాడసలే ఈ ఏరియాలో చాలా పెద్ద రౌడీ! శంకర్ దాదా శిష్యుడు."

యువజన నాయకుడు సిగరెట్ వెలిగించుకుని మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"ఏమంటున్నారు గురూ- ఇస్తారా ఇవ్వరా వీళ్ళు?" అడిగాడు నిర్లక్ష్యంగా.

"అంత డబ్బు ఎక్కువంటున్నారు"

"ఎవడా బాడకావ్ అనేది- ఒక్కొక్కడినీ ఖతమ్ చేస్తా- నీ యమ్మ- సన్మానాలు కావాలిగానీ డబ్బులు ఖర్చు చెయ్యరు కొడుకులు! ఏయ్- అందరికీ వార్నింగిస్తున్నా- అయిదు నిమిషాల్లో డబ్బు ఇవ్వకపోయారో- కొడకల్లారా చూస్కోండి మళ్ళా-"

అందరం భయంగా మొఖాలు చూసుకున్నాం-

"ఈ సినిమా హీరోగాడిని కట్టేసి తీస్కపోదాం పదన్నా- ఆళ్ళే డబ్బు తీసుకొచ్చి కట్టి ఇడిపించుకుంటారు-" అన్నాడు తప్పట్లు కొట్టిన వాళ్ళల్లో ఒకడు చాకు తీస్తూ.

"రంగారెడ్డీ! ఇక తప్పదనుకుంటాను- డబ్బు ఇచ్చేద్దాం-" అన్నాన్నేను.

శాయిరామ్ పరుగుతో మా ఆఫీస్ గదికెళ్ళి కాలనీ ఫండ్ తాలూకు చెక్ బుక్ తెచ్చి ఇచ్చాడు. అందరిపేరా చెక్కులు రాసిచ్చేసరికి రాత్రి పన్నెండయింది. అంతా వాన్ ఎక్కేశారు. కుటుంబరావ్ మా దగ్గరకొచ్చాడు మళ్ళీ.

"సారీ గురూజీ! మీ కాలనీ వాళ్ళంటే నాకు మంచి గౌరవం ఉంది. అందుకే మంచిగా నచ్చజెప్పటానికి ట్రై చేశాను. మొన్న వేరేచోట ఇలాగే నకరాలు చేస్తే ఆ సన్మానం చేయించుకున్నోడిని స్టేజీ మీదే తన్నాం- ఆడి మోటార్ సైకిలు, ఇంట్లో టీవీ అన్నీ లాక్కుపోయాం. కనుక- మళ్ళీ ఎప్పుడయినా అవకాశం వస్తే మమ్మల్నే పిలవండి- ముందే మాట్లాడుకునేట్లయితే కొంచెం కన్సెషన్ కూడా ఇస్తాం లెండి! రాఘవా సన్మాన సంఘం అని నారాయణ్ గూడాలో ఇంకోటుంది. అక్కడికి మాత్రం ఎప్పుడూ వెళ్ళకండి - మొన్న సన్మానం చేయించుకున్నాక డబ్బు ఇచ్చేందుకు పేచీ పెట్టుకున్నారని స్టేజీ మీదే ఆరుగురిని పొడిచి పారేశారు-"

అతను వాన్ లో కూర్చోగానే వాన్ వెళ్ళిపోయింది.

అందరం ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరాం.

*** THE END ***